# యుద్ధ కాండ



రచయిత: ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఏ.

# యుద్ధ కాండ



రచయిత: ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఏ.

శ్రీ రామాయనమః

# శ్రీరామాయణానుభవం - యుద్ధకాండ

శ్రీరామాయణానుభవ షష్టమ కుసుమము

(శ్రీశాల)


రచయిత : **ఆచి. శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

వెల : **100 రూ.లు**

ప్రచురణకర్తలు

**వికాస తరంగిణి (శ్రీశాల)**

ప్రచురణ తేది : **శ్రీ సర్వధారి శ్రావణము**

ప్రతులకు:-

1) రచయిత విలాసము

**ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,

సరూర్‌నగర్, హైద్రాబాద్-500 035.

ఫోన్: 24053137

2) వికాసతరంగిణి

"శ్రీశాల"

కరీంనగర్ జిల్లా

ముద్రణ కార్యాలయము:

**ఆర్. వి. ప్రింటర్స్,**

ఆర్.టి.సి. × రోడ్స్,

హైద్రాబాద్.



మా పితృదేవులు

"భగవద్విషయ విద్వాన్"

శ్రీ మదాచి వేంకట నృసింహాచార్య (ఆవునూరు) స్వామి

వారి శ్రీపాదారవింద సన్నిధిలో

"అంకితము"




**రచయిత : ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
రోడ్ నెం.5, సరూర్‌నగర్, హైద్రాబాద్ - 500 035.
ఫోన్: 040-24053137

SRIMANNARAYANA RAMANUJA YATHIBHYO NAMAHA ✆ : 23224426 23229002
జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(S)
JEEYAR EDUCATIONAL TRUST (S)
Founder & Managing Trustee :
H.H. Sri Sri Sri Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swamiji
JAI SRIMANNARAYANA

1.8.2008

శ్రీమతేరామానుజాయ నమః

ప్రియస్వామినః । శ్రీమతేనారాయణాయ నమః

అనేక మంగళాశాసనాలు

దేవరవారు పరిశీలన కోసం పంపిన "శ్రీమద్రామాయణ యుద్ధకాండం" వివరణ పత్రాలు అందాయి. అనుసంధానము చేసి చాల ఆనందించాము.

యుద్ధకాండము కథావస్తువును బట్టి, ప్రపన్నానుష్ఠాన రీతిని బట్టి, పరతత్వ నిరూపణ రీత్యాను, శ్రీమద్రామాయణములో చాల ప్రాధాన్యాన్ని వహిస్తున్నది.

"పౌలస్త్య వధ" అని కదా వాల్మీకి మహర్షి దానిలోని ప్రధాన ప్రతిపాద్యాంశాన్ని కవిగా ఆరంభంలో నిర్దేశించింది.

ఫలప్రాప్తి కూడ ఇక్కడనే అవడం చేత ఇంతటితోనే "శ్రీరామాయణ గాథ" ముగిసిందని కూడ కొందరు భావించడం కద్దు!

"శరణాగతి" ప్రధానంగా సాగిన ఈ కాండలో "విభీషణ శరణాగతి"తో పాటు, "సముద్ర శరణాగతిని" కూడ యుక్తి పురస్సరంగా దేవరవారు నిరూపించడం బాగుంది.

"బాలకాండ" నుండి "సుందరకాండ" వరకు దేవరవారుచేసిన "తత్వవిశ్లేషణకు" ఇక్కడ పూర్తి కలుగుతున్నది.

ఉత్తమమైన సాంప్రదాయిక భూమిక గల వంశంలో జన్మించిన దేవరవారి వంటివారు చేసే "సారస్వత వరివస్య" సర్వోపాదేయం అనడంలో సందేహము ఏముంది?

అనేక మంగళాశాసనాలు చేస్తూ, ఆ వరివస్య ఇలాగే సాగాలని ఆశిస్తున్నాము.

చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్

శ్రీమతే [illegible] నమః శ్రీమతే రామానుజాయ నమః

**సత్సంప్రదాయ పరిరక్షణ సభ**

16-4-523, శివనగర్, వరంగల్ - 506 002

అధ్యక్షులు :
"మహామహోపాధ్యాయ, కవితార్కికకేసరి, శాస్త్రరత్నాకర"
**ఉ.వే. శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామివారు**
ఫోన్ : 0870-2435999

కార్యదర్శి :
**శ్రీమాన్ న.చ. పట్టాభిరామాచార్యులు**
ఫోన్ : (0870) 2459172
సెల్ : 9440575881

# సాధువాదము

శ్లో॥ "సర్వదైవ శిరోరత్న! మంజీర రంజితాంఘ్రయే।

జానకీ ప్రాణనాథాయ। మమనాథాయ మంగళమ్"।

భారతీయ సంస్కృత వాఙ్మయములో "శ్రీరామాయణమును" మించిన మరొక మహా ప్రబంధము లేదు. అది సదా అనుసంధించుకొను వారికి కూడ "నిత్య నూతనము", "అపూర్వవత్ విస్మయప్రదము".

వాల్మీకి రామాయణమును ఆధారముగా చేసికొని శ్రీరామకథను ఎందరెందరో మహాకవులు దేశవిదేశాలలో ఎన్నెన్నో భాషలలో ప్రౌఢకావ్య రూపంలోను, సులభ వచన రచనలలోను ఆవిష్కరిస్తూనే ఉన్నారు. పవిత్రమైన శ్రీరాముని చరిత్రమును సంస్కృత వాఙ్మయంలో నిబద్ధించిన "శ్రీరామాయణ మహాకావ్యము" భారత దేశమునందావిర్భ వించుట అస్మదాదుల భాగ్యపరిపాకము.

ఆ మహాకావ్యము "భగవన్నారాయణ తత్త్వమును; తచ్చరణారవింద శరణాగతియే ముక్తి సాధనమనియు" విశదీకరించు శ్రీ వైష్ణవ సిద్ధాంతమునకు మూల ప్రమాణము. శ్రీభాష్యకారులకు శ్రీశైలపూర్ణులు పరమ కృపతో ప్రసాదించిన "మహానిధి" అది. శ్రీరామాయణమే లేనిచో శ్రీవైష్ణవ సంప్రదాయమే లేదు. శ్రీవైష్ణవ సంప్రదాయమే లేనిచో చేతనోజ్జీవనమే లేదు.

తెలంగాణా ప్రాంతమున 20వ శతాబ్దిలో ఆవిర్భవించిన ఉత్తమాచార్యులలో శ్రీ ఉ.వే.ప్ర ఆచి. నరసింహాచార్య (అవునూరు) స్వామి వారు అగ్రగణ్యులు. ఒక్కసారి దబ్బపండు వంటి వారి దివ్యమంగళ విగ్రహమును, ఊర్ధ్వ పుండ్రాంచిత ముఖశోభను, అనర్గళ మహోపన్యాస వైభవమును దర్శించి, ఆస్వాదించిన వారి యొక్క స్మృతిపథమున మరువరాని ముద్రను ఆపాదించు వ్యక్తిత్వము ఆ స్వామివారిది.

ఒకనాడు "దైవ విగ్రహారాధన ప్రక్రియ వైదికము కాదని" భారత దేశమున వ్యాప్తమైన దుష్ప్రచారమును తమ సునిశిత వాగ్ధాటితో త్రిప్పి కొట్టిన మహా మేధావి, మహావక్తయు ఆ స్వామివారు.

పలు స్థలములలో సాగిన వారి "శ్రీరామాయణోపన్యాసామృత ఝరిని" ఆస్వాదించి, ఉజ్జీవించిన వారు తెలంగాణమున ఎందరో ఉన్నారు. సంస్కృతాంధ్రములలో అవధాన ప్రక్రియను అఖండముగా సాగించిన కవి పండితులు వారు.

"దీపాదుత్పన్న ప్రదీపము"వలె, వారి సుపుత్రులై ఆ వైష్ణవ తేజమును పుణికి పుచ్చుకొన్నవారు మా అంతరంగ మిత్రులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారు.

వారు "శ్రీ రామాయణ సుధాసింధువు"ను తమ మేథా మందరముతో మధించి, ఈ గ్రంథ రూపమున "శరణాగతి తత్వనవనీత సారము"ను పాఠకలోకమునకు అందించు చున్నారు. "ఆనుకూల్యాది" షడంగ సంపన్నమై, అమోఘమగు మహోపాయము న్యాసవిద్యయే" నని శరణ్య శ్రీరామ హృదయానుసారముగా శ్రీరామానుజాది మహాచార్య రుచి పరిగ్రహీతమైన పరమార్ధమును ఆవిష్కరించునది శ్రీరామాయణములోని యుద్ధకాండారంభమునగల "విభీషణ శరణాగతి ఘట్టము".

బహుముఖముగా, సప్రమాణముగా, సంప్రదాయావిరుద్ధముగా ఆ సందర్భమును లలితవచోవిన్యాసముతో సమగ్రముగా వ్యాఖ్యానించి పాఠకలోకమునకు అందిస్తున్నారు శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారు.

తక్కిన కాండములు ఒక ఎత్తు. ఈ యుద్ధకాండము ఒక ఎత్తు. నిర్దుష్టత చేతను, అర్థగౌరము చేతను పండిత పామరులను సమానముగా ఆకర్షించు వీరి రచన సునిశిత విమర్శధోరణి కలిగి సర్వసంశయ విచ్ఛేదకమైనది.

జిజ్ఞాసువుల ఆదరాభిమానాలను చూరగొనగల ఉత్తమగ్రంథ మిదియని నిర్మత్సరమైన మనస్సుతో నా సాధువాదమును మిత్రులు శ్రీ ఉ.వే. శ్రీనివాసాచార్యుల వారికి అందిస్తు న్నాను.

"స్వస్తి"

**మహా మహోపాధ్యాయ శ్రీ న.చ. రఘునాధాచార్య**

శ్రీ రామాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ సీతారామచంద్రపరమాత్మనే నమః

అస్మద్గురుభ్యో నమః

**"అభినవ వ్యాస"**

**డా॥ కందాడై రామానుజాచార్య స్వామి వారు**

రిటైర్డ్ ప్రిన్సిపల్
శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ కళాశాల,
సీతారాంబాగ్

# "మధురం మధురాక్షరమ్"

"యావత్ స్థాస్యంతి గిరియః, సరితశ్చ మహీతలే! తావత్ రామకథాలోకే" అని వాల్మీకి మహర్షికి బ్రహ్మ వరమిచ్చినాడు.

"ఈ భూమి మీద పర్వతములు, నదులు, వృక్షములున్నంత వరకు నీ రామాయణము ఉంటుందని" ఆ మాటకు అర్థము. మనము వాల్మీకిని "కూజంతం" రామరామేతి మధురం మధురాక్షరమారుహ్య కవితా శాఖాం। వందే వాల్మీకి కోకిలం" అని కవితా శాఖను అధివసించి "రామరామ" అని మధురంగా మధురాక్షరంగా కూచుచున్న కోకిల" అని స్తుతించి యున్నాము. స్వయముగా వాల్మీకి కూడ "సమ మధురోపనతార్థ వాక్య బద్ధమ్ రఘువరచరితం... నిశామయధ్వమ్" అని చెప్పియున్నాడు.

మధురము శబ్దమే కాదు. అర్థము కూడ. "ఉపనతార్థ" అంటే "కొని రాబడినది. అదేది? మాధుర్యము. శబ్దము అర్థమునకు మాధుర్యమును తెచ్చినది, అర్థము శబ్దమునకు మాధుర్యమును తెచ్చినది. ఇట్లు మధుర మధురాక్షరోపనతార్థ వాక్యములు రామాయణమున నిబంధించబడియున్నవని తాత్పర్యము. అనగా రామాయణంలోని 24 వేల శ్లోకాలలో ఏ శ్లోక పాదమును తీసికొనినను "మధురోపనతార్థ వాక్య బద్ధమే" అని అభిప్రాయము.

ఈ శ్లోకమును చూచిన చాల మందికి, "అన్ని కాండలు, అన్ని ఘట్టములు, అన్ని వర్ణనలు మధురంగా ఎట్లుంటాయి? ముఖ్యంగా "యుద్ధకాండ" అంతా భీభత్సమే కదా.

తెగిన తలలు, పారిన రక్తపుటేరులు, "హాహాకారాలు, ఏనుగుల ఘీంకారాలు ఇవే కదా! ఇవి మధురమా? వాల్మీకి రచన అంతా మధురమెట్లు?" అని సందేహము కలుగుతుంది. ఆ సందేహము మా ఆచి శ్రీనివాసాచార్య స్వామి వారి యుద్ధకాండ వివరణను, లేదా వ్యాఖ్యానమును చదివితే తొలిగిపోతుంది.

యుద్ధమును, యుద్ధములోని ఘట్టములను అతి సామాన్యుని నుండి అసామాన్యుని వరకు అందరికి ఆనందము కలిగించే రీతిలో వారి వివరణ సాగినది. సామాన్యముగా గ్రంథములను రచించి పరిశీలించుటకు "అభిప్రాయములను "లేదా" "మంగళా శాసనములను కృప జేయుమని" ఎవరిని అడిగినా "స్థాలీపులాక న్యాయంగా" ఆయా కొన్ని ఘట్టములను చదివి, అభిప్రాయములను వ్రాయుట అలవాటు లేక పరిపాటి. కాని స్వామి వారి యుద్ధకాండను మొదలు పెడితే చివరి వరకు ఏ ఒక్క అక్షరము వదల కుండా చదివించినది. అర్థము గంభీరము. అగాధము. శబ్దములు సలలితములు, మధురములు. ఒక ఇతిహాసమో, శరణాగతి శాస్త్రమో చదువుతున్నట్లు అనిపించదు. ఒక చేయి తిరిగిన రచయిత అందించిన చక్కని "నవల" వలె ఉన్నది మా స్వామి వారి రచన. మరల అందులో ఏ శాస్త్రార్థమును చర్చించకుండా, నిష్కర్షించకుండా వారు విడిచి పెట్టలేదు. తమదైన ప్రత్యేక శైలిలో అందించినారు. ఎన్నో విశేషములను అందించినారు.

ముఖ్యముగా "విభీషణ" శబ్దమునకు "విశేషేణ భీషయతి" "విగతం భీషణం" అని స్వామివారి వివరణ. చాల మందికి "అంతమంచి వానికి ఇంత భీషణ నామమెందుకు?" అని అనుమానము కలుగుతుంది. శత్రువులకు భయము కలిగించువాడు. ఆ శత్రువులు అంతశ్శత్రువులు. అంతశ్శత్రువులు ఇతనిని చూచి భీతి చెందుచున్నవి. "లంకలో అంతమంది కామక్రోధలోభ, మోహ తత్పరుల మధ్య ఉండి కూడ, ఆ కామ క్రోధములకు లోనుగాక ఉండువాడు విభీషణుడు" అనుట స్వామి వారి చక్కని వివరణకు తార్కాణము. యుద్ధరంగమున శత్రువులకు భీషణుడు (భయంకరుడు) అని చదివిన వారికి తెలియుచున్నది.

స్వామివారు "విభీషణ శరణాగతి" ఘట్టమును వివరించిన తీరు అద్భుతము. ఇచట శరణాగతి శాస్త్రార్థ విచారమునంతయు చేసియున్నారు. అంతేకాదు "శరణాగతి చేయు అవకాశమును ప్రసాదించిన దేశము దివ్యదేశము" అను మాటను బట్టి సముద్రమెందుకు పుణ్యతీర్థమైనదో వివరించినారు.

ఈ ఘట్టములోనే శరణాగతికి "ఒక్క విషయ నియమము" తప్ప ఇతర నియమములు లేవు అని సాదించుచు సముద్రుని విషయమున రాముని శరణాగతి విఫలమగుటకు "అవిషయ శరణాగతి" అని ఒక కారణము తెలిపి, రెండవ కారణమును చక్కగా వివరించి యున్నారు. రాముడంత వాడు శరణు వేడితే, సముద్రుడు అంత ఆలస్యము చేసిన దెందుకు? రాముని కోరిక తీర్చగల శక్తి సముద్రుని కెలాగూ లేదు. రాముడు తనకు సాయము చేయుమని శరణు వేడితే, "తనకే రాముడు సాయము చేయవలెనని, తాను రామునికి సాయము చేయు వాడను కానని" తెలుపుటకే సముద్రుడు ఆలస్యము చేసినాడు.

చాలమంది భక్తులు భగవంతుని అనుగ్రహమును కోరుదురు. కాని రాముని ఆగ్రహమును కోరినవాడు సముద్రుడు. రాముడు ఆగ్రహిస్తేనే తన సమస్య పరిష్కారము అవుతుంది. అందుకే రామునికి కోపము తెప్పించుటకే ఆయన ఆలసించెను. కోపము తెప్పించి తన కార్యమును సాధించుకొనినాడు". ఇది స్వామివారి వివరణ. ఇదెంతో యుక్తి యుక్తము.

"ఇంద్రుడు తన పుత్రుని వాలి రూపముతో పంపినది రామునికి కోపము తెప్పించుటకే. కోపము తెప్పించినపుడే రావణ సంహారము జరుగుతుంది" ఇది ఇంద్రుని ఆలోచన. కాని అది తప్పు. "రామునికి కోపము తెప్పించుటకు అమ్మకు అపకారము చేయవలసిన పని లేదు. రాముని ఆజ్ఞను లేదా మాటను కాదనకుండానే, కొంత ఆలస్యము చేసినా చాలు" అని ఒక చక్కని సందేశము కూడ ఇందులో కనబడుతుంది. వ్యాసభగవానుని వివరణకు ఇది చిన్న సవరణగా భావింప వచ్చును.

ఇట్లే "మిత్ర" శబ్ద వ్యుత్పత్తిని చెప్పుచు విభీషణునికి రాజ్యకాంక్ష లేదని చక్కగా నిరూపించినారు. "భవద్గతం మే రాజ్యం" అన్న దానికి అర్థము. "నాకు రాజ్యము నిప్పించుమని కాదని". అయినప్పుడు పట్టాభిషేకమును ఎందుకు చేసికొన్నాడు? అని శంకించి, రామాజ్ఞను ధిక్కరించరాదనియే తప్ప రాజ్యకాంక్షతో కాదు" అని స్వామివారి వ్యాఖ్య.

ఇట్లే "భరతుడు మొదట రాజ్యాన్ని కాదన్నవాడు యౌవరాజ్యాన్ని ఎలా ఆమోదించాడు? అని శంకించి "రాజ్యము స్వాతంత్ర్యము, యౌవరాజ్యము పరతంత్రము" అని సమాధానమునొసగినారు.

"త్వయికించిత్ సమాపన్నే కిం కార్యం సీతయా మమ" అని రాముని మిత్ర ధర్మాన్ని కృతజ్ఞతా భావాన్ని చక్కగా వివరించినారు.

ఇట్లు ఎన్నో సూక్ష్మాంశములను చర్చించి, తర్కించి, శాస్త్ర భావమును సజ్జనామోద యోగ్యమైన సమాధానములతో వివరించి కొత్త విశ్లేషణా కోణాన్ని స్వామి వారు అందించారు. ముఖ్యముగా "గోవిందరాజీయాన్ని" చదువలేని వారికి, అర్థం చేసికో లేని వారికి, గోవింద రాజీయంలో చర్చించని వాటికి, సామాన్యంగా చదువుతున్నప్పుడు కలుగుతున్న సందేహాలకు స్వామివారు చక్కని వివరణను, సమాధానములను కృపా మాత్ర ప్రసన్నులుగా అందజేసినారు.

దీనితో రామాయణంలోని షట్కాండలను వ్రాసినను, నేను మొదటే కోరినట్లు ఇంకా స్వామివారు "శ్రీమద్భారతాన్ని" ప్రసాదించవలయును. మొదట సంప్రదాయ బద్ధముగా "విరాట పర్వమును" వీలయినంత త్వరలో అందించగలరని ఆశించుచున్నాను.

మొదలు పెడితే ఎలాగూ ఆపరు. కనుక ఆ శ్రీనివాసుడు స్వామి వారికి భారత, భాగవత వ్యాఖ్యాన దీక్షను, దానికి కావలసిన ఆరోగ్యమును, ఆయుష్యమును, ఆనందమును, వాత్సల్యమును ప్రసాదించాలని కోరుతున్నాను.

**బుధజన విధేయుడు**

**డా. కందాళై రామానుజాచార్య**

# "కరుణాసింధువు"

శ్రీరామచంద్రస్వామి ఆశ్రితుల పాలిటి పారిజాతము. ఒక బుడుత ఉడుత నుండి బ్రహ్మరుద్రేంద్రాదుల వరకు అందరు ఆ స్వామి ఆశ్రితులే. "కోమజ్జతోరణుకులాచల యోర్విశేషః" అణువైతేనేమి. కులపర్వతమైతేనేమి మహా సముద్రంలో మునిగి పోవడానికి" అంటారు యామున మునీంద్రులు.

ఆ "శరణాగత రక్షకుని" ఆశ్రయించడం కూడ మన గొప్పదనము కాదు. రావణ, హిరణ్యాకశ్యపుల వలె మనము కూడ నిరంతరము భగవంతుని ద్వేషిస్తూ ఆయనకు విముఖులుగా ఉండేవాళ్ళమే. అయినా ఆయనకు అందనంత దూరము పరుగెత్తుతున్నా మనను విడిచిపెట్టక "ఎదిర్ శూజుల్ పుక్కు" అన్నట్లు ఎదుటి వైపు నుండి వచ్చి మనను కన్న తండ్రి వలె పట్టుకొని, తన పట్ల మన మనస్సులో ప్రేమను ("అద్వేషాన్ని") ఆశ్రయించాలనే కోరికను ("అభిముఖ్యాన్ని") కలిగించేది • కరుణా సముద్రుడే కదా!

ఆశ్రితులను ఆ స్వామి తనకు కావలసినట్లు వినియోగించుకొంటాడు. ఆ స్వామి అలా వినియోగించుకోవడానికి కారణము ఆశ్రితుల గొప్పదనము కాదు. కేవలము ఆ స్వామి సంకల్పమే కారణము.

అందమైన మందాకినీ (నదీ) తీర ప్రాంతంలో, సీతారాములిద్దరు మనోహరంగా విహరిస్తున్నారు. వారి ఆనందానికి పానకంలో పుడుకలాగా ఒక పాడు కాకి సీతాదేవిపై తన కన్నువేసింది. ఆమెపై మాటికి మాటికి వాలుతూ అనేక విధాలుగా హింసిస్తున్నది.

అంతలో స్వామికి నిద్రవచ్చి ఆమె తొడపై మేనువాల్చాడు. స్వామికి నిద్రాభంగం కాకూడదని, కాకిని ప్రారద్రోలే ప్రయత్నాన్ని సీతాదేవి మానుకుంది. అయితే ఆ పాపిష్టి కాకి, అదే అదనుగా గ్రహించి, రెచ్చిపోయి ఆ దేవి సుకుమార సుందర వక్షస్థలాన్ని చీల్చ సాగింది. ఆమె ఎదనుండి కారుతుండే రక్తపు బిందువొకటి స్వామి కపోలంపై పడింది. ఆ రక్తపు బిందువు వేడికి స్వామికి నిద్రాభంగమైంది. ఎదుట ఆ పాపపు కాకి కనబడింది. ఆగ్రహంతో స్వామి ఆ "పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని" ప్రయోగించాడు.

అంతవరకు సీతాదేవిని బాధించింది ఒక మామూలు కాకి కాదు. ఆయన స్వయంగా దేవేంద్రుని కన్న కొడుకు జయంతుడు. దేవజాతిలో పుట్టి కూడ రాక్షస బుద్ధితో కాకిగా

మారి జగన్మాత అయిన సీతాదేవిని కామించి, హింసించాడు.

అంతటి శక్తిశాలి అయిన ఇంద్రుని పుత్రునిపై రామచంద్రస్వామి ప్రయోగించింది ఎంత గొప్ప ఆయుధాన్నో తెలుసా? ఒక దర్భఖండాన్ని (ఒక గడ్డి పరకను). దర్భఖండానికి ఏమైనా గట్టిదనము ఉంటుందా? ఉండదు. దానిని సులభంగా ఎన్ని ముక్కలుగానైనా ఎవ్వరైనా విరువ వచ్చు. అల్పమైన ఒక గడ్డిపరకను స్వామి తన చేతిలోకి తీసికొన్నాడు. స్వామి చేయి తాకగానే ఆ పుల్లకు అమోఘమైన శక్తి కలిగింది. అది బ్రహ్మాస్త్రమైంది. కాకాసురుని ముల్లోకాలలో తరిమి తరిమి చివరకు స్వామి పాదాలపై పడవేసింది.

అలాగే "అశరణ్య శరణ్యుడైన" శ్రీ రామచంద్ర ప్రభువు నన్ను ఒక గొప్ప వంశంలో జన్మింప జేశాడు. "జనిత్వాఽహం వంశే మహతి జగతి ఖ్యాత యశసాం" అన్నట్లు విశ్వవిఖ్యాత విద్వాంసులు, ప్రపన్న ప్రవరులకు నిలయమైంది మా "ఆచి" వంశము.

అనవరత రామాయణ పారాయణ, ప్రవచన పారీణులు, మా పితృ పితామహులు, శ్రీ మదాచి నరసింహాచార్య స్వామి, ఆచి రాఘవాచార్య స్వామివారలు. సహజంగానే వారి శుభాశంసనలను అందించాడు ఆ జగత్పిత.

అపర రామానుజులైన శ్రీశ్రీశ్రీ జీయర్ స్వాముల కృపకు నన్ను పాత్రుడిని కావించాడు ఆ కృపాసముద్రుడు. మహనీయులైన భాగవతోత్తముల, విద్వద్వరుల వాత్సల్యాభిమానాలను, మంగళాశాసనాలను అందజేశాడు ఆ పరమ దయాళువు.

"గడ్డిపరక" వంటి వాడనైన నన్ను "శ్రీరామాయణానుభవ" వచన రచనకు నియమించు కొన్నాడు ఆ విశ్వనేత. "ఆపరితోషాద్విదుషాం న సాధుమన్యే ప్రయోగ విజ్ఞానం" అన్నట్లు భయంతో, అవిశ్వాసంతో నేను ఆరంభించిన "శ్రీరామాయణానుభవ" రచనను "బాలకాండ" నుండి "యుద్ధకాండ" చివరి దాకా తానే అండగా నుండి అడుగడుగునా తన చేయూతనిస్తూ నన్ను విజయవంతంగా, పండిత పామర రంజకంగా నడిపించిన దయాశరథి ఆ దాశరథే.

అంతేకాదు ఈ మధ్యలో మరొక మహత్తర సంఘటనకు నన్ను నిమిత్త మాత్రుని చేసికొన్నాడు ఆ సకలజగన్నేత.

ఎంతో కాలం నుండి మా ఆవునూరు (కరీంనగర్ జిల్లా)లోని దివ్యాలయంలో శ్రీ సీతారామ లక్ష్మణులు ఉత్సవ స్వరూపులుగా కొలువై ఉన్నారు. తమకు ధృవస్వరూపాలు, తమ ఆలయానికి ఒక దివ్యగోపురం, వాటి ప్రతిష్ఠ కంటె ముందే తమకు సర్వాభరణాలు కావాలని సంకల్పించి, నన్ను నిమిత్తంగా ముందుంచు కొని శ్రీ సర్వజిత్ మాఘ బహుళ సప్తమి గురువారం నాడు (28-02-08) తాను సంకల్పించుకొన్న వన్ని పూర్తి చేసికొన్నాడు ఆ సర్వశక్తి.

గడ్డిపరకను బ్రహ్మాస్త్రంగా మార్చినట్లే అకించినుడనైన నన్ను ఒక వ్యక్తిగా మలచి, తన కార్యకలాపాలకు వినియోగించుకొన్న ఆ కరుణాసంధువుకివే నా కృతజ్ఞతాంజలులు.

దాదాపు పన్నెండు సంవత్సరాలు నా మనస్సంతా తానే అయి నా నాలుకను తన సింహాసనంగా చేసికొని రామప్రభువు తన 'రామాయణాన్ని' సమగ్రంగా వ్రాయించుకొన్నాడు. దాసుని శేషజీవితాన్ని దాశరథి మరిన్ని తన గ్రంథాల రచనలతో గడిపించాలని ఆదయామయుని వేడుకొంటున్నాను.

ఇతిశం

# పితృదేవులు

**"కౌండిన్యాన్వయ వార్ధి శీతకిరణం, శ్రీరాఘవార్యాత్మజం,**
**వాత్సశ్రీ శఠగోపదేశిక, పదాబ్జద్వంద్వ సేవారతం,**
**శ్రీరామానుజ దేశికేంద్ర కరుణాలబ్ధ ప్రబోధోజ్వలం**
**శ్రీ మద్వేంకట నారసింహ, గురువర్యం నౌమి సర్వార్థదం॥**

శ్రీ సీతారామచంద్ర స్వామి మా కులదైవము

మా పితామహులు శ్రీమదాచి రాఘవాచార్య స్వామివారు, తమ హృదయ క్షేత్రాన్ని "శ్రీమద్రామాయణ ప్రవచనామృతం"తో సఫలం కావించుకొన్న మహాత్ములు. "శ్రీమద్రామయణాన్ని వినాలని ఉంటే శ్రీమదాచి రాఘవాచార్య స్వామి వారి వలననే వినాలి" అనే నానుడి ఆ రోజులలో సుప్రసిద్ధమైనది.

మా తాతగారి చిరకాల తపః ఫలితంగా, వారి "శుక్తి ముక్తా ఫలంగా" వారికి కలిగిన ఏకైక సంతానమే మా నాన్నగారు శ్రీమదాచి వేంకట నరసింహాచార్యస్వామి వారు. స్వస్తిశ్రీ కీలక సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ మహర్నవమి ఉత్తరాషాఢా నక్షత్రము వారి తిరునక్షత్రము. 1908 సం. సెప్టెంబరు 8వ తేది వారి పుట్టినరోజు.

మా నాన్నగారు తమ తండ్రిగారి దగ్గర "రామ శబ్దంతో" విద్యను ప్రారంభం చేశారు. పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చే వరకే వారికి సంస్కృతంలో సంపూర్ణ నాటకాలంకార సాహిత్యము సమకూరింది. "ప్రపేదిరే "ప్రాక్తన జన్మ విద్యాః". తమ పన్నెండవ ఏట "శేషధర్మముల" కాలక్షేపాన్ని ప్రవచించి, "బాల సరస్వతి" "శాస్త్రిగారు" "ఆవునూరు శాస్త్రిగారు" అనే ప్రసిద్ధ నామాలను ఆర్జించారు.

తమ బాల్యమిత్రులు బ్ర.శ్రీ. పదిర కృష్ణమూర్తిగారి సాంగత్యంలో ఆంధ్ర భాషపై అభిమానం ఏర్పడి, అనతికాలంలోనే కవితావ్యాసంగ మేర్పడింది. "తిరుపతి, వెంకట కవులవలె" వారు జంట కవులుగా రూపొందారు.

అయితే నాన్నగారి కవితా వ్యాసంగము ఏవో కొన్ని రచనలకు పరిమితం కాలేదు. అది అవధానాంత కవితగా పరిణమించింది. వారు "అష్టావధానులుగా" అఖండ కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించారు. పన్నెండు సంవత్సరాలు వారి అవధాన కృషి అత్యద్భుతంగా సాగింది. పృచ్ఛకులెంత విద్వాంసులైనా, కవివతంసులైనా "జితోఽస్మి" అనవలసిన వారే.

మహావిద్వాంసులు, వ్యాకరణ శిరోమణులు శ్రీమాన్ ఠంయాల నరసింహాచార్య స్వామి వారి మాటలలో :- "యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో అది కవిత్వానికి సంబంధించిన రెండవ రోజు.

మేము సభా భవనము వైపు వెళ్లితిమి. అప్పటికే సభ రసజ్ఞులతో క్రిక్కిరిసి పోయినది. మైకుల ద్వారా ఒక మధుర గంభీర సాంద్రప్రస్ఫుట శబ్దము యాదవాద్రి నిండా వ్యాపించింది. రాను రాను ఆ ధ్వని రసమయ పద్యరూపు ధరించినది. ఆ కవిత్వ స్రవంతిలో మునుకలు వేయుచు యావత్సభ మంత్రముగ్ధమై చిత్రపటము వలె మారినది. ఆ కవితా ప్రవాహ మాధుర్యము "శ్రీమాన్ ఆచి. వేంకట నృసింహాచార్య స్వామి వారి అష్టావధాన" ఫలితముగా వ్యాపించినదని తెలిసికొంటిమి. వెంటనే ఆ స్వామి వారిని సభలో సందర్శించుకొంటిమి.

నిండు విగ్రహము. పచ్చని మేను ఛాయ. మూర్తీభవించిన బ్రాహ్మీ తేజస్సు. అవధాన ప్రక్రియల నన్నింటిని ఆపోశన పట్టిన కుంభ సంభవులు వారు. వారి ముఖ మండలమున కున్న ఊర్ధ్వ పుండ్రరేఖ ఉభయ భాషా కవులను ఆట పట్టించు మంత్ర దండము వలె వెలుగుచుండెను".

వారి అవధానాలు ఆనాటి రాష్ట్రంలోని అన్ని ప్రముఖ స్థలాలకు వ్యాపించాయి. గద్వాల వంటి సంస్థానాలలో, వరంగల్, హైద్రాబాద్ వంటి మహా నగరాలలో వారి అవధాన ధ్వానాలు మారుమ్రోగాయి.

హైద్రాబాద్‌లో "రెడ్డి హాస్టలు" వంటి ఉన్నత విద్యాసంస్థలలో వారి అవధానాలు అత్యద్భుతంగా నిర్వహింపబడ్డాయి. ఆనాటి కొత్వాలు (సిటీ పోలీస్ కమిషనర్) రావు బహద్దూర్ వేంకట రామారెడ్డిగారి వంటి అత్యున్నతాధికారుల హస్తాల మీదుగా అనేక సువర్ణ పతకాలు లభించాయి.

సుప్రసిద్ధ మహా విద్వాంసులు, మహానాయకులు, విమర్శకాగ్రేసరులయిన బూర్గుల రామకృష్ణారావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు వంటి మహామనీషులు ఆచి. స్వామివారి అష్టావధానాలకు ప్రశంసా నీరాజనాలను అందించారు.

సుప్రసిద్ధ విద్వత్తల్లజులయిన కోవెల రంగాచార్య స్వామి వారి వంటి మహనీయుల ప్రశంసాభిమానాలకు ఆచి. స్వామి వారి అష్టావధానాలు పాత్రములయ్యాయి.

తమ అవధానాల సందర్భంగా సభాసదుల అభిప్రాయాలను పరిశీలిస్తూ

"గెలుపుగొను. శ్రీ నృకేసరి పలుకుసాని" అని అనేక మహాసభలలో తమ కవితా వాణిని ఉత్తేజపరచిన అపరాజిత విద్వత్క విమతేభులు శ్రీమదాచి స్వామివారు.

వేదాంతాధ్యయనము:- పన్నెండు సంవత్సరాల అనిదంపూర్వ అష్టావధాన విజయ పరంపరల తరువాత శ్రీమదాచి స్వామివారి దృష్టి వేదాంత శాస్త్రాధ్యయనము వైపు మరలింది.

షట్శాస్త్ర పారంగతులు, సీతారాంబాగ్ వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాల కులపతులు శ్రీ. ఉ.వే.ప్ర. మహావిద్వాన్ శఠగోప రామానుజాచార్య స్వామివారి ఖ్యాతి శ్రీమదాచి స్వామి వారి దృష్టిని ఆకర్షించింది.

రెండు, మూడు మాసాలు సీతారాంబాగ్‌లో వేదాంత శాస్త్ర గ్రంథాల అధ్యయనము జరిగింది. అయితే ఆగర్భశ్రీమంతులైన, సుకుమార జీవనులైన ఆచి. స్వామి వారు సీతారాంబాగ్‌లో ఎక్కువ కాలము గురుకుల క్లేశాన్ని తట్టుకోలేక స్వగృహానికి తిరిగి వెళ్లారు. అయితే అప్పటికే వేదాంత శాస్త్రంలో వారికి చక్కని ప్రవేశము లభించింది.

శ్రియఃపతి వారి "అపురూప శిష్యాచార్యసంబంధాన్ని" కొనసాగించాలనుకొన్నాడు. కారణాంత రాల వలన శఠగోప రామానుజాచార్య స్వామి వారికి సీతారాంబాగ్‌ను తప్పక విడువ వలసిన అవసరమేర్పడింది. స్వాచార్యుల అవసరాన్ని తమకు వరంగా భావించిన ఆచి స్వామివారు సీతారాంబాగ్ స్వామివారిని తమ శిష్యుల గ్రామమైన పోత్గల్ (కరీంనగర్ జిల్లా)కు హృదయపూర్వకంగా ఆహ్వానించారు. అక్కడ అయిదు మాసాల కాలంలో "భగవద్విషయ" కాలక్షేప ప్రవచనము అత్యద్భుతంగా జరిగింది. వారి శిష్యాచార్య ప్రత్యేక సంబంధము శ్రీమాన్ ఠంయాల లక్ష్మీ నరసింహా చార్యస్వామి వారి పలుకులలో ఈ విధంగా సాగింది:-

"శ్రీ శఠగోప రామానుజాచార్య స్వామివారి - ఆచి. స్వామివారి గురు శిష్య సంబంధము రామకృష్ణ పరమహంస - (వివేకానందుల) నరేంద్రుల సంబంధము వలె అద్భుతమైనది, అపురూపమైనది.

అనతికాలంలోనే ఆచిస్వామివారు ఆచార్య కటాక్షంతో, విశేషాభిమానంతో సబ్రహ్మచారులందరిని మించిన జ్ఞాన తేజస్సులతో విరాజిల్లారు".

ఉభయ వేదాంత సభలు:- శ్రీశ్రీశ్రీ శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య త్రిదండి - శ్రీమన్నారాయణ రామానుజ (పెద్ద) జీయర్ స్వామివారి; కులపతులు తె.కం. గోపాలాచార్య స్వామివారి సంయుక్త సంకల్ప ఫలంగా 1961లో విజయవాడలో ఉభయ వేదాంత విద్వత్సభలు ఆరంభమయ్యాయి. శ్రీ ఆచిస్వామి వారు ఆ ఉభయ వేదాంత సభలకు శాశ్వత సభ్యులుగా వెళ్లేవారు.

కులపతులు శ్రీమాన్ తె.కం. గోపాలాచార్య స్వామి వారి మాటలలో, "ఉభయ వేదాంత ప్రవర్తకులు, రామానుజ దర్శన పంచాస్యులునగు శ్రీ ఆచి. నరసింహాచార్య స్వామివారు మన ప్రచార సంస్థకు వెన్నెముక వంటి మహాశయులు. మన ఉభయ వేదాంత సభలకు వేంచేసి ఒకప్పుడు అధ్యక్షులుగా, వేరొకప్పుడు వక్తలుగా సభలను అలంకరించుచు సింహగర్జనలను కావించి శ్రోతలను తన్మయుల గావించుచుండిరి. వారి అగాధ ద్రావిడ వేదాంత వైదుష్యానికి ఇతర పండితులు ముగ్ధులగు చుండిరి".

కాలక్షేపాలు:- స్వామి వారి కాలక్షేపాలు వేలాది జనులను తన్మయులను కావించాయి.

ఆచార్యత్వము:- శ్రీమదాచి స్వామివారి వాగ్వైభవానికి, వారి జ్ఞానానుష్ఠానాలకు పరవశులైన అనేకులు శ్రీ స్వామివారి పాదపద్మములకు ప్రవణులై వారిని ఆశ్రయించారు. శ్రీ ఆచి స్వామి వారి శిష్యకోటి వందల సంఖ్యలో ఉన్నది. శ్రీ స్వామివారు శిష్య విత్తాపహారకులు కారు. ధనాన్ని వారు తృణప్రాయంగా భావించేవారు. అయినా శ్రియః పతి శ్రీమదాచి స్వామి వారి అన్ని అవసరాలు తీరేలా సంపదలను అనుగ్రహించాడు.

శ్రీ ఆచిస్వామివారు శిష్య హృత్తాపహారులు. ఆనవరతము తమను ఆశ్రయించిన వారి అజ్ఞానాన్ని పోగొట్టి, జ్ఞానానుష్ఠాలను కలిగించే వారు. "స్ఖలిత్యే ప్రశాసితారం" అన్నట్లు తమ ఆశ్రితులలో స్వల్ప దోషం కలిగినా కఠినంగా శాసించేవారు.

శ్రీ ఆచి. స్వామివారు తమ సంసారంలో సంభవించే ఆపదలను అంతగా పట్టించుకొనే వారు కాదు. కాని తమ ఆశ్రితులకు ఏ కొద్ది ఆపద కలిగినా వారికంటే తామే అమితంగా వ్యసనం చెందేవారు (భృశం భవతి దుఃఖితః).

ఈ విధంగా శ్రీమదాచి స్వామివారు తమ శిష్యుల హృదయాలలో "అమృత స్వరూపులు"గా చెరగిపోని ముద్రను వేశారు. ఒక్కసారి వారిని చూచిన వారైనా మరచిపోలేని మనోజ్ఞ మూర్తి వారు.

జన్మనిచ్చిన పితృదేవులు, బ్రహ్మోపదేశం చేసిన ప్రథమాచార్యులు, సాహిత్య వేదాంత గ్రంథాచార్యులు మా నాన్నగారైన

"శ్రీ మదాచి. వేంకటనరసింహాచార్య స్వామివారి
దివ్య శ్రీచరణ సరోజ సన్నిధిలో"

అనేకానేక దాసోహాలతో ఈ యుద్ధకాండ అంకితము చేయబడుతున్నది.

**ఆచి. శ్రీనివాసాచార్య**

# యుద్ధకాండ ద్రవ్యదాతలు

## సిరిసిల్ల వికాస తరంగణి



1. శ్రీమతి కె. వినోద & శ్రీ ప్రకాశరావు గారు



2. శ్రీమతి నార అమృతాబాయి & శ్రీ రాజేశం గారు
3. శ్రీమతి ఎమ్. సరోజాదేవి & శ్రీమాన్ ఎమ్. జగన్నాథాచార్య గారు
4. శ్రీమతి పి. గోదాదేవి, శ్రీమాన్ పీచరి శ్రీనివాసాచార్య గారు
5. శ్రీమతి చిగురాల యశోదమ్మ వైఫ్/ఆఫ్ కీ.శే. వేంకటాద్రి స్వామి గారు
6. అంజనాదేవి గారు
7. శ్రీ ఆర్. ప్రభాకర్ గారు
8. శ్రీ మర్రిపల్లి విఠల్ గారు
9. శ్రీమతి మరియు శ్రీ రవీందర్ రావు గారు
10. శ్రీరాం శ్రీనివాసరావు
11. శ్రీమతి కె. ఉషా, శ్రీ మధుకర్ రావు
12. శ్రీమతి పద్మలత, శ్రీ రాంచందర్ రావు
13. శ్రీమతి పద్మపావని, శ్రీ నాగరాజు
14. శ్రీమతి లవంతిక, శ్రీ రాజేందర్

15. శ్రీమతి రాచకొండ శోభారాణి, శ్రీ సాగర్
16. శ్రీమతి కె. అరుణ, శ్రీ అనిల్
17. శ్రీమతి చిట్నేని శోభ, శ్రీ వేంకటరమణారావు
18. శ్రీమతి లావణ్య, శ్రీ బి. నరహరి
19. శ్రీ సురభి శ్యామల, శ్రీ సత్యనారాయణ రావు
20. శ్రీ భూపతి రెడ్డి
21. శ్రీ ఆర్. వరదయ్య
22. శ్రీమతి లక్ష్మి, ఆర్.ఐ.టి. (టీ)
23. శ్రీ జి. భాస్కర రెడ్డి, అడ్వొకేట్
24. శ్రీ ఎస్. రాజయ్య, ఆర్.ఐ.టి. (టీ)
25. శ్రీమతి వేంకటమ్మ, టీచర్
26. శ్రీమతి నిర్మల, టీచర్
27. శ్రీ పుల్లూరి రాజేశం, సన్/ఆఫ్ కిష్టయ్య
28. శ్రీ పి. కృష్ణమూర్తి, సన్/ఆఫ్ లక్ష్మినారాయణ
29. శ్రీ ఆర్. రత్నాకర్, సన్/ఆఫ్ రంగదాస్
30. శ్రీ వద్దెపల్లి చక్రపాణి
31. శ్రీ అల్లాడి శ్రీనివాసరావు
32. శ్రీ సి.హెచ్. జయ, నాగరాజు

## గోదావరిఖని ద్రవ్యదాతలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి సుభద్రాదేవి, వై.వా. శ్రీ ఎస్. మధుసూదనాచార్యులు | 5,001.00 |
| 2. | శ్రీమతి మణిమాలాదేవి, శ్రీ ఎస్. శ్రీనివాసాచార్యులు | 2,501.00 |
| 3. | శ్రీమతి, శ్రీ విజయభాస్కర్ | 5,001.00 |
| 4. | శ్రీమతి, శ్రీ యోగేందర్, లా అసిస్టెంట్ | 1,116.00 |
| 5. | శ్రీమతి, శ్రీ వి.ఎస్.వి.ఎస్.ఆర్.కె.ఎస్. ప్రసాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఏస్టేట్స్) | 501.00 |
| 6. | డా॥ కె. సత్యనారాయణ | 501.00 |
| 7. | బి. బాలసుబ్రహ్మణ్యము | 116.00 |

# కృతజ్ఞతాంజలులు

"వందే రామాయణార్ణవమ్" అని ఎంతటి విద్వాంసులైనా, శ్రీమద్రామాయణంలోని విషయాలను గురించి ప్రస్తావించేప్పుడు చేతులెత్తి నమస్కరిస్తారు.

"శ్రీమద్రామాయణము" ఒక మహా సముద్రము. ఇరువై నాల్గువేల శ్లోకముల మహాసారమే ఇందులోని అటాగాధ జలము. అనేక సర్గలే అల్లకల్లోలం చేసే మహా తరంగాలు. ఆరు (ఏడు) కాండలే అందరిని మ్రింగగల మొసళ్లు, తిమింగిలాలు. ఆ మహా సముద్రాన్ని దాటుటకు ఎవ్వరికి సాధ్యం కాదు. అందువలననే "రామాయణ మహార్ణవానికి" అందరు చేతులెత్తి నమస్కరిస్తారు.

అయితే అంతటి మహాసముద్రాన్నైనా "శ్రీరామ కృప" అనే పడవ లభిస్తే దాని ద్వారా అందులో సులభంగా ప్రవేశించి, సుఖంగా విహరించవచ్చు. మాపితృ, పితామహులు శ్రీ మదాచి రాఘవాచార్య నృసింహాచార్య స్వామి వారలు, దాశరథి దయను సంపూర్ణంగా లభించి "శ్రీమద్రామాయణ" పారావారంలో ప్రవేశించి, విహరించి తాము ధన్యులగుటే కాక, శ్రోతృ ప్రపంచాన్ని కూడ ధన్యులను కావించారు.

బాల్యం నుండి నాకు కూడ రాముడంటే ప్రాణము. కాని రామాయణమంటే భయం. "అందులో ఒక కాండ, ఒక సర్గ, ఒక శ్లోకాన్నైనా అర్థం చేసికొంటానా?" అని ఆదినుండి సందేహమే.

"భగవద్విషయ" దివ్యప్రబంధంలో ఒక సందేహము, సమాధానము లభిస్తాయి. "కాళ్లు, చేతులు లేనివాడు ఒక మహాగజాన్ని ఎక్కగల్గుతాడా?" అని ప్రశ్న. "ఎక్కలేడనే" కదా సాధారణ సమాధానము. కాని "ఆ ఏనుగే తన తొండంతో ఆ మొండి వానిని పైకి ఎత్తుకొని, తనపై కూచోబెట్టుకుంటే అది సాధ్యమే కదా!" అని మరొక (విజ్ఞ) సమాధానము.

అలాగే అజ్ఞుడను, అశక్తుడనైన నాపట్ల రామభద్ర భద్రగజానికి జాలివేసింది. తన"కరాన్ని" ఆలంబనంగా ఇచ్చింది. ఫలితంగా "శ్రీరామాయణానుభవం"లో "ఆరు కాండలు" పండిత పామరుల ఆదరానికి నోచుకొన్నాయి.

అందుకు దయాశరథి, (సీతాసమేతుడైన) దాశరథి శ్రీ పాదకమల సన్నిధిలో హృదయపూర్వక కృతజ్ఞతాంజలులను సమర్పించుకొంటున్నాను.

"బాలకాండ" నుండి "యుద్ధకాండ" వరకు తమ అవ్యాజ వాత్సల్యంతో పరిపూర్ణ మంగళాశాసనాలను కృప జేస్తున్న పవిత్ర పాదారవిందులు, పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజముని సార్వభౌముల శ్రీచరణ సన్నిధిలో అనేకానేక దాసోహములు.

అలాగే "కవి, శాబ్దిక కేసరి", "మహామహోపాధ్యాయ", "శాస్త్రరత్నాకర" బిరుదాంచితులు, ఉభయవేదాంత మహార్ణవ మందరాయమానులు శ్రీ ఉ.వే.ప్ర. నల్లాన్ చక్రవర్తుల రఘునాథ దేశికులు "సాధువాదము" ద్వారా తమ హార్దిక శుభాశీస్సుల నందించారు. వారి శ్రీచరణ సన్నిధికి సప్రశ్రయ కృతజ్ఞతాంజలులను సమర్పించుకొంటు న్నాను.

సుమారు దశాబ్దం నుండి తమ స్నేహ హస్తాన్ని, ఆలంబనంగా అందిస్తూ "అరణ్య కాండనుండి", యుద్ధకాండ వరకు అభినందన పూర్వక మంగళాశాసనాలను అందిస్తున్న "భాష్యద్వయ శోభితులైన". శ్రీ ఉ.వే.ప్ర. కందాళై రామానుజాచార్య స్వామి వారి సన్నిధిలో అనేకానేక దాసో2హములు.

చాల కాలం నుండి "రామాయణానుభవ" గ్రంథమాలలో ఒక కాండకు కైంకర్యాన్ని సమర్పించుకొంటామని వాగ్దానం చేసి, ఇప్పుడదే విధంగా కైంకర్యాన్ని సమర్పించు కొంటున్న "సిరిసిల్ల-వికాసతరంగణీ" సభ్యులకు;

కొంత కాలము క్రితమే తమ కైంకర్యాన్ని సమర్పించిన గోదావరిఖని మిత్రులకు, శ్రీరామభక్తులకు "ఆశ్రిత వాత్సల్య జలధి" అయిన శ్రీరామచంద్ర ప్రభువు తన అపార కృపను అందజేయుగాక!

- ఇతిశం -

సుధీవిధేయుడు

రచయిత

ఆచి. శ్రీనివాసాచార్య

# విషయసూచిక

1. మంగళాశాసనాలు
i) శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయ్ స్వామి వారు.
ii) శ్రీ ఉ.వే.ప్ర. కవిశాబ్దిక కేసరి, నచ. రఘునాధాచార్య స్వామివారు
iii) "అభినవవ్యాస" శ్రీ ఉ.వే. ప్ర. కందాడైరామానుజాచార్య స్వామి వారు.
2. "కరుణాసింధువు"
3. పితృదేవులు
4. ద్రవ్యదాతలు
5. కృతజ్ఞతాంజలులు
6. కథాభాగము.
7. హనుమకు బహుమానము
8. సుగ్రీవుని ఓదార్పు
9. లంకాపుర వర్ణనము
10. ముహూర్త నిర్ణయము
11. శుభశకునాలు
12. భయంకర సముద్రము
13. రావణుని మంత్రాంగము
14. విభీషణోపదేశము-I
15. లంకలో అపశకునాలు
16. కుంభకర్ణుని బోధ
17. మహాపార్శ్వుని దుర్బోధ
18. తిరిగి విభీషణుని బోధ-II
19. రావణ ధిక్కారము
20. విభీషణుని శరణాగతి
21. సుగ్రీవుని హెచ్చరిక
22. హనుమ అభిప్రాయము
23. శ్రీరాముని నిర్ణయము
24. విభీషణుని హర్షము
25. విభీషణ పట్టాభిషేకము
26. సముద్రునికి (శ్రీరామ) శరణాగతి
27. శార్దూల, శుక శారణులు
28. దర్భ శయనము
29. సముద్రునిపై రామాగ్రహము
30. ద్రుమకుల్యము - వేదాంత విషయాలు
31. సేతు నిర్మాణం
32. సేనా వ్యూహరచన
33. శుకసారణుల ధర్మబోధ
34. వానర వీర పరిచయం
35. రావణుని ఆగ్రహము
36. శార్దూలాది చారులు
37. శ్రీరాముని మాయా శిరస్సు
38. సీతాదేవి పరితాపము
39. సరమ ఓదార్పు
40. రావణుని నిశ్చయం
41. రాముని మంత్రాంగం
42. సువేల పర్వతము-లంకానగరము
43. సుగ్రీవుని సాహసము
44. శ్రీరాముని ఆవేదన
45. అంగదరాయబారము
46. యుద్ధారంభం-నాగపాశము
47. పుష్పకంపై సీతాదేవి-విషాదం
48. త్రిజట ఓదార్పు
49. శ్రీరాముని విలాపము
50. విభీషణ విషాదం

51. గరుత్మంతుని రాక
52. నాగాస్త్రము - విశేషార్థం
53. రావణ విచారము
54. ధూమ్రాక్షుడు
55. వజ్రదంష్ట్రుడు
56. అకంపనుడు
57. ప్రహస్తుడు
58. రావణుని యుద్ధము-I
59. లక్ష్మణుని మూర్ఛ
60. శ్రీరాముని శపథము
61. రావణుని అవమానము
62. కుంభకర్ణుని నిద్ర
63. కుంభకర్ణుని ఉపదేశము
64. మహోదరుని దుర్నీతి
65. కుంభకర్ణుని యుద్ధము: మృతి
66. రావణపుత్రుల సమరము
67. రావణుని దుఃఖము
68. ఇంద్రజిత్తు సమరము
69. సంజీవకరణి
70. లంకాదహనము
71. కుంభనికుంభులు
72. మకరాక్షుడు
73. మళ్లీ ఇంద్రజిత్తు
74. లక్ష్మణుని విషాదం
75. విభీషణుని ఓదార్పు
76. సౌమిత్రితో ఇంద్రజిత్తు సమరము, మృతి
77. రావణ విలాపము
78. మూల బలసంహారం
79. రాక్షస స్త్రీల విలాపము
80. రావణుని యుద్ధ సన్నాహం
81. రామరావణ యుద్ధము
82. లక్ష్మణుని మూర్ఛ
83. రామరావణుల అంతిమ సమరము
84. ఆదిత్య హృదయం
85. రావణ వధ
86. విభీషణుని విషాదం
87. మండోదరి విలాపం
88. రావణునికి అంత్యక్రియలు
89. విభీషణ పట్టాభిషేకం
90. సీతాదేవి దగ్గరకు హనుమ
91. సీతాదేవి రక్షాదీక్ష
92. పురుషకార వైభవము
93. సీతాదేవి విషయంలో రామాజ్ఞ
94. సీతాదేవి సమాధానము
95. అగ్ని ప్రవేశము
96. దేవతల స్తోత్రము
97. అగ్నిదేవుని సాక్షాత్కారము
98. మహేశ్వర స్తోత్రము
99. మహేంద్రుని ప్రార్థన
100. పుష్పక విమానము.
101. స్థల సందర్శనము
102. భరద్వాజాశ్రమము
103. భరతుని ఎదురుచూపు
104. స్వామికి స్వాగతము
105. శ్రీరాముని పట్టాభిషేకము
106. విభీషణునికి కులధనం
107. లక్ష్మణ భరతులు
108. రామరాజ్యము

# యుద్ధకాండ

ఇది రామాయణంలో చివరి కాండ. ముఖ్య కాండ కూడ. శ్రీరాముని అవతార ప్రయోజనమే రావణ వధ. అది జరిగింది ఈ కాండలోనే. ఇంతవరకు శ్రీరాముడు దుష్ట శిక్షణ చేయలేదని కాదు. విరాధ, ఖర, కబంధాదులు దుర్మార్గులే. అంతకు ముందు శ్రీరాముడు సంహరించిన తాటకి, మారీచ సుబాహువులు దుష్టులే.

కాని వారందరి కంటె ముఖ్యమైన వాడు, మూల స్వరూపుడు రావణుడే. అహంకారమే అన్ని దుష్కార్యాలకు మూలము. రావణుడు ఆ అహంకారానికే కోటవంటివాడు. రూపుదాల్చిన అహంకారమే రావణుడు. "తనను రెండుగా చీల్చినా, తానెవ్వరికి తలవంచనంటాడు" ఆ అహంకారి. అదిగో అంతటి అహంకారానికి, దౌర్జన్యానికి మూలరూపము రావణుడు.

శ్రీరాముడు ధర్మానికి పుట్టిల్లు. "రామో విగ్రహవాన్ ధర్మః" ధర్మమే రూపుదాల్చి రాముడయ్యాడు. సవతి తల్లి కైకేయిని సంతోషపెట్టడానికి రాజ్యాన్ని సకల సంపదలను గడ్డిపోచల వలె భావించిన ధర్మాత్ముడు రాముడు. స్వయంగా భరతుడే కైకేయితో సహా వచ్చి ప్రార్థించినా రాజ్యాన్ని స్వీకరించని, తన త్యాగాన్నుండి చలించని ధర్మావతారుడు శ్రీరాముడు.

అటువంటి రామరావణుల మధ్య యుద్ధాన్ని వివరిస్తుంది ఈ కాండ. ధర్మాధర్మాల మధ్య ఘోర సమరాన్ని వర్ణిస్తుంది ఈ కాండ.

మన మనస్సు ఒక రణరంగము. మనలోని మంచికి చెడుకు మధ్య ఘర్షణ కలిగేది మన మనస్సులోనే.

ధర్మస్వరూపుడైన శ్రీరాముని చేతిలో అధర్మానికి ప్రతీక అయిన రావణుడు సపరివారముగా సంహరింపబడ్డాడు.

మన మనస్సులో కూడ ధర్మము గెలువాలి. అధర్మము నిర్మూలింప బడాలి. ఆ రెండింటిని మనంతట మనము సాధించజాలము. ఆ రెండింటిని సాధించగలిగేది మన హృదయంలో అంతర్యామిగా ఉన్న రామ పరమాత్మే.

శ్రీరామాయణంలో ఆరు కాండలు ఉన్నాయి. గాయత్రీ మంత్రంలో ఆరు భాగాలు ఉన్నాయి. "షట్కుక్షిః" అంటారు. రామాయణంలోని ఆరవ కాండ అయిన యుద్ధకాండ

గాయత్రీ మంత్రంలోని "ధీమహి" అనే పదాన్ని వివరిస్తుంది. "గాయత్రీ మంత్రాధిదేవత అయిన రామ సూర్యుని శరణు వేడుతున్నాను" అని అర్థము.

సుందరకాండలో హనుమ శ్రీరాముని సన్నిధి నుండి బయలుదేరి సముద్రము దాటి లంకలో ప్రవేశించాడు. సీతాదేవిని అన్వేషించి, ఆమెకు శ్రీరాముని వేలి ఉంగరాన్నిచ్చి, సీతాదేవి యొక్క సిగపూవును తెచ్చి శ్రీరామునికి ఇచ్చాడు.

శ్రీరాముడు పరమాత్మ. సీతాదేవి జీవాత్మ. హనుమ ఆచార్యుడు. వేరైన జీవపరమాత్మలను కలుపడానికి చేసే ప్రయత్నమే ఆచార్యుని పని. ఆ ఆచార్యుని ప్రయత్నానికే "పురుషకారమని" పేరు.

ఇక ఈ యుద్ధకాండలో శ్రీరాముడు సీతాదేవిని పొందటానికి సేతువును నిర్మించి, లంకలో ప్రవేశించి, రావణుని సంహరించి, ఆమెను తిరిగి స్వీకరిస్తాడు. జీవుని రక్షించడానికి పరమాత్మ చేసే ప్రయత్నమే "ఉపాయ కృత్యము" అనబడుతుంది. ఈ ఉపాయకృత్యమే ఈ యుద్ధకాండలో వివరింపబడుతున్నది.

గాయత్రీ మంత్రములోని పదిహేనవ అక్షరమైన "మ" ఇందులో మొదటి శ్లోకంలో 6వ అక్షరముగా వాడబడింది.

# హనుమకు బహుమానము

1) "శ్రుత్వా హనుమతో వాక్యం। యథావదభిభాషితం।
రామః ప్రీతి సమాయుక్తో। వాక్యముత్తరమబ్రవీత్"

2) కృతం హనుమతాకార్యం। సుమహద్భువి దుర్లభం।
మనసాఽపియదన్యేన। న శక్యం ధరణీ తలే.

హనుమవలన సీతాదేవి మనశ్శాంతిని పొందిందని శ్రీరాముడు విన్నాడు. ఇప్పుడు హనుమ చేసిన మహత్కార్యాన్ని రాముడు ప్రశంసిస్తున్నాడు.

"కర్మాంతేదాసభృత్యాశ్చ (స్తుత్యాః)" అన్నట్లు పని పూర్తి చేసుకొని వచ్చిన హనుమను రాముడు ప్రశంసిస్తున్నాడు.

హనుమ సముద్రాన్ని దాటడం చాల గొప్ప (సుమహత్) కార్యము. లంకలో

రాక్షసులను వధించి నగరాన్ని దహించడం దుష్కరము. మళ్లీ లంకలో నుండి బయలుదేరి క్షేమంగా తిరిగి రావడం మనస్సులో ఊహించడానికి కూడ అసాధ్యమైన పని.

ఇంత అసాధ్యమైన పని చేయాలంటే గరుడుడు, వాయువు కలసి చేస్తే చేయవచ్చు. హనుమ ఒక్కడే చేయగలిగాడు.

లోకంలో భృత్యులు మూడు రకాలు: 1) చెప్పిన పనినే పూర్తిగా చేయలేని వాడు (అధముడు)·

2) చెప్పిన పనిని మాత్రము పూర్తి చేసేవాడు (మధ్యముడు).

3) స్వామిపట్ల అనురాగంతో చెప్పిన పనే కాకుండా యుక్తి యుక్తంగా ఆ పనికి సంబంధించి మరింత అధికంగా యత్నము చేసేవాడు (ఉత్తముడు)

భృత్యుడు చేసి వచ్చిన పనిని బట్టి అతనిని స్వామి సమ్మానించాలి. ఉత్తమోత్తముడైన హనుమ చేసిన ఘనకార్యానికి తగిన పారితోషికం శ్రీరాముడు తన దగ్గర లేనే లేదంటాడు. తన దేహాన్నే బహుమతిగా ఇవ్వాలనుకొని హనుమను గాఢంగా కౌగిలించుకొన్నాడు ఆ భక్త సులభుడు. "పరిష్వంగో హనూమతః"

హనుమకు అంతకంటే కావలసింది మరేది లేదు. శ్రీరాముని శరీరము ఆయన సంకల్పానుసారము గ్రహించినది. హనుమ మొదటినుండి రాముని శరీరాన్నే ప్రేమించాడు.

"స్నేహోమే పరమో రాజన్। త్వయినిత్యం ప్రతిష్ఠితః"

శ్రీరాముడు తన కౌగిలి కాక మరేది ఇచ్చినా అమృతము కావాలనుకొన్న వాడికి గడ్డిపరక దొరికినట్లు ఉండేది.

భగవంతుని దివ్య మంగళవిగ్రహమే అందరికి ఆశ్రయాన్నిస్తుంది.

సీతారాముల రెండు శరీరాలను రక్షించిన మహోదారుడైన హనుమకు శ్రీరాముని కౌగిలి శ్రీరామునికే కాదు హనుమకు కూడ సర్వస్వము అయినది. మహాత్ముడైన హనుమంతుని పట్ల మనస్సులో ప్రీతి కలిగి, తన శరీరము కూడ పులకరిస్తుండగా శ్రీరాముడు హనుమను బిగ్గరగా కౌగిలించాడు.

ఆ తరువాత శ్రీరామునికి విచారమావేశించింది. హనుమంతుడు సీతాదేవిని చూచి వచ్చాడు సరే. కాని ఆమె దగ్గరికి వెళ్లడమెలా? ఆమెను పొందడమెలా?"

# సుగ్రీవుని ఓదార్పు

"తంతు శోక పరిద్యూనం। రామందశరథాత్మజం।

ఉవాచ వచనం శ్రీమాన్। సుగ్రీవశ్శోక నాశనం॥"

మిత్రగుణ సంపన్నుడైన సుగ్రీవుడు శ్రీరామునికి ధైర్యాన్ని కల్పిస్తున్నాడు:

"రామభద్రా। ఇంకా సీతాదేవి విషయంలో విచారమెందుకు? ఆమె క్షేమ వార్త తెలిసింది. ఆమె ఉన్నచోటు తెలిసింది కదా!

మోక్షం కోరేవాడు సంసార వ్యామోహాన్ని వదిలినట్లు నీవు పిరికిదనాన్ని వదలిపెట్టు. సముద్రము దాటి, లంకలో ప్రవేశించి, రావణుని సంహరించడానికి మేము తోడుగాలేమా? మనకు శత్రువుపై దాడి చేయడానికి ఒక్క సముద్రమే అడ్డు. బుద్ధిలో బృహస్పతివైన నీవు దానిని దాటే మార్గము చూడు. ఒక్కసారి లంక కనపడిందో, ఈ వానరులు లంకను పెకిలించి, రావణునితో సహా రాక్షసులందరిని నీ పాదాలపై పడగొడతారు.

కాకపోతే సేతువును నిర్మించకుండా సముద్రాన్ని దాటివెళ్లడం ఇంద్రసమేతులైన దేవతలకు కూడ అసాధ్యమే.

ఇదంతా ఎందుకు? సేతు నిర్మాణం జరిగినా, జరుగకున్నా నీవు రావణుని సంహరించి విజయివి అవుతావు. అటువంటి శుభశకునాలు కనబడుతున్నాయి.

అందువలన దైన్యాన్ని వదలి నీ పరాక్రమాన్ని స్మరించుకో! నీ ముందు నిలిచే వీరుడే ఉండడు."

సుగ్రీవుని సహేతుకమైన సత్యవాక్కులను విని శ్రీరాముడు హనుమతో ధైర్యంగా అన్నాడు.

"హనుమా! నాలో తపోబలాలు పుష్కలంగా ఉన్నాయి. తపశ్శక్తితో సేతుబంధనం చేస్తాను. పరాక్రమంతో సముద్రాన్ని నా బాణాలతో ఎండగొట్టుతాను.

అయితే లంకా పరిస్థితిని వివరించు. అక్కడ దుర్గాల, ప్రాకారాల నిర్మాణం గురించి తెలుపు. సైన్యబలమెంత? ఆయుధ సంపద ఎంత? ఇళ్లెలా ఉన్నాయి? వీటిని గురించి తెలుపుమ"ని అడిగాడు.

# లంకాపుర వర్ణనము - 2

రామచంద్రస్వామి ప్రశ్నలకు సమాధానంగా ఆంజనేయుడు లంకానగరాన్ని వర్ణిస్తున్నాడు:-

"రామచంద్రా! లంకానగరము ఎప్పుడు సంతోషంతో కోలాహలంగా ఉంటుంది. మదగజాలతో, మహారథాలతో నిండి ఉంటుంది. అశ్వబలాలతో, పదాతిదళాలతో దట్టంగా ఉంటుంది.

దుర్గాలు ఇనుపమొలలు కొట్టబడిన దృఢకవాటాలను కల్గి ఉంటాయి. వాటి చుట్టు లోతు నీళ్లు గల కందకాలు ఉంటాయి. ఎత్తైన విశాలములైన ద్వారాలు కోటకు నాల్గు వైపుల ఉంటాయి. వాటిలో బాణాలను, శిలలను వర్షించే యంత్రాలు అమర్చబడి ఉన్నాయి.

అక్కడ ప్రాకారాలు బంగారు రంగుతో ప్రకాశిస్తు ఉంటాయి. ఎక్క రాకుండా ఎత్తుగా ఉంటాయి. వాటిని పగడాలతో, మణులతో, ముత్యాలతో అలంకరించారు.

ఆ ప్రాకారాలకు చుట్టు కూడ మొసళ్లతో కూడిన లోతైన చల్లని నీరుగల అగడ్తలు ఉన్నాయి.

ఆ ప్రాకారాలలోనికి వెళ్లడానికి అగడ్తలపై పలకలను వంతెనలుగా (సంక్రమాలుగా) యంత్రాలు వేసి, తీస్తాయి. ఆ వంతెనలను భయంకరులైన రాక్షస వీరులు రక్షిస్తుంటారు.

శత్రువులు వచ్చినపుడు పలకలు లేపబడుతాయి. అప్పుడు ఆపెద్ద పెద్ద కందకాలను దాటలేక శత్రువులు అందులో పడి మరణిస్తారు.

ద్వారాలను దాటి నగరంలోకి ప్రవేశించాక సైనికుల గృహపంక్తులు నిర్మించబడ్డాయి. అందులో ఉండే సైనికులు ద్వారాలను, వంతెనలను కాపాడుతుంటారు.

ఆ నాలుగు ద్వారాలను రావణుడు చూడాలనుకొన్నప్పుడు సుదృఢమైన కాంచన స్థంభాలపై నిర్మించబడిన వేదికపైకి వస్తాడు.

లంకానగరము త్రికూట పర్వత శిఖరముపై నిర్మించబడింది. దానికి చుట్టు ప్రక్కల అపారమైన సముద్రము కందకమువలె ఉంది. అందువలన ఎంతటి బలవంతులైన శత్రువులైనా సముద్రము దాటనిదే లంకలోకి వెళ్లజాలరు.

ఇక లంకా నగరంలో నాలుగు రకాల దుర్గాలు (కోటలు) ఉన్నాయి.

(1) నాదేయాలు:- చుట్టు నదులు కలవి.

(2) వన్యములు:- చుట్టు అడవులు కలవి.

(3) పార్వతాలు:- చుట్టు గుట్టలు కలవి.

(4) కృత్రిమాలు:- కొత్తగా కట్టబడ్డవి.

లంకా నగరమే త్రికూట శిఖరముపై నిర్మింపబడింది. కనుక అమరావతీ నగరము వలె అది ఒక గిరి దుర్గము.

ఇక నాలుగు ద్వారాల విషయము.

(1) తూర్పుద్వారము:- పదివేల రాక్షసులు శూలాలు, కత్తులు ధరించి కాపలా ఉంటారు.

(2) దక్షిణ ద్వారము:- లక్ష సంఖ్యలో చతురంగ సైన్యాలు రక్షిస్తాయి.

(3) పశ్చిమ ద్వారము:- పది లక్షల సైనికులు చర్మ ఖడ్గధరులై ఉంటారు.

(4) ఉత్తర ద్వారము:- ఒక కోటి సైనికులు కాపలా ఉంటారు.

నగరం మధ్య ద్వారంలో ఒక కోటి సైన్యము ఉంటుంది.

అయితే నేను వంతెనలను (సంక్రమాలను) ధ్వంసం చేసి వచ్చాను. పరిఘలు లేక కందకాలు ఎండిపోయాయి. ప్రాకారాలు పడగొట్టబడ్డాయి. లంక దహనమైంది. సైన్యంలో పావు భాగము (బలైక దేశము) నాచే సంహరింపబడింది.

రామభద్రా! రావణుని మరణం తప్పక జరిగి తీరుతుంది. దాని కొరకు ఇందరు వానర వీరులు, మీరిద్దరు సోదరులు కూడ అవసరము లేదు. అంగద, మైంద, ద్వివిద, జాంబవంత, పనస, నల, నీలులు చాలు.

వీరు అందరు సేతువు అవసరం లేకుండా సముద్రం దాటగల్గుతారు. అందువలన ఆ విచారము కూడ అక్కర లేదు. నీ ఆజ్ఞ అయితే చాలు.

కనుక మహావీరా! నీవు వెంటనే ఆజ్ఞ నివ్వు. దండ యాత్రకు అనువైన ముహూర్తాన్ని చూడు. నీవు చెప్పిన వెంటనే సర్వ వానర బలాలు దండెత్తడానికి సంసిద్ధంగా ఉన్నాయి."

"వేదో పూర్వయుగాల సంస్కృతి భయంబిడైత్యులో గుండెలో పాదుల్ కట్టుక కూరుచున్నయది యీ ప్రాకార రూపంబునన్"

# ముహూర్త నిర్ణయము - 3

హనుమ మాటలు విని శ్రీరాముడు:- "హనుమా! నీవు చెప్పిన విషయాలను బట్టి లంకానగరాన్ని వెంటనే నాశనం చేయగల్గుతాము."

"సుగ్రీవా! ఈ మధ్యాహ్నం సమయమే శుభముహూర్త సమయం. మా వంశ మూల పురుషుడు అయిన సూర్యుడు అత్యున్నత స్థానంలో ఉన్నాడు. సర్వ విఘ్నాలను పోగొట్టే అభిజిన్ముహూర్తమిది. ఈ విజయ ముహూర్తంలో మనము బయలుదేరితే రావణుడు మననుండి తప్పించుకోజాలడు.

ఈ మన విజయ యాత్రా వార్త త్రిజటాదుల వలన సీతాదేవికి తెలిస్తే "విషం త్రాగి చావబోయేవాడు అమృతపానంతో బ్రతికి బయటపడ్డట్లు" ఆశతో ఆమె జీవిస్తుంది.

ఈ రోజు ఉత్తర ఫల్గుణి నక్షత్రము. నాకు సాధనతార. ఈ రోజే సర్వ సైన్యాలతో బయలు దేరుదాము."

అభిజిన్ముహూర్తము దక్షిణ దిశా ప్రయాణానికి మంచిదికాదని జ్యోతిషరత్నాకరం తెలుపుతున్నది. అయితే కిష్కింధకు లంకా నగరం (దక్షిణ పూర్వంలో) ఆగ్నేయంలో ఉంది. కనుక ఆ ముహూర్తము విజయప్రదమే.

"సుగ్రీవా! నాకు ఈ సమయంలో అనేక శుభశకునాలు కనబడుతున్నాయి. నా కన్నుపై భాగము కదులుతున్నది.

"నేత్ర స్స్యోర్ధ్వం హరతి సకలం మానసం దుఃఖజాతం" కన్నుపై భాగము అదరడం విజయాన్ని సూచిస్తుంది.

జానకీ విరహాగ్నికి ఎల్లదనాల సంజకున్.
ఏమి చుట్టరికంబు వెసంగునో?

శ్రీరాముని కన్నామలాక భోగి భోగమా

# సైన్య విభాగము - వ్యూహ రచన

"సుగ్రీవా! వానరసైన్యాధిపతి నీలుడు లక్ష వానర సేనతో ముందు నడవాలి. ఫలమూలములు, మధురఫలాలు ఉండే వన మార్గంగా నడవాలి.

దుర్మార్గులు మార్గంలో జలాలను కలుషితం చేస్తారు. ఆ విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి.

అయితే హనుమ తెలిపినట్లు వన, జల, గిరి, దుర్గాలలో కొన్ని రంధ్ర స్థానాలలో శత్రువులు ఆయుధాలతో ఉంటారు. వాటిని కూడ జాగ్రత్తగా గమనించాలి. నీలుని వెనుక గజ, గవయ, గవాక్షులు నడవాలి.

దక్షిణ దిశలో ఋషభుడు, ఎడమవైపు గంధమాదనుడు ఉండాలి. మధ్యలో మేమిద్దరము సోదరులము అంగద హనుమల నెక్కి "సార్వభౌమము" అనే ఉత్తర దిగ్గజాన్ని అధిరోహించి కుబేరుడు వస్తున్నట్లు" (మేము) వస్తాము.

సేన యొక్క కుక్షి భాగాన్ని జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి రక్షిస్తారు" అని శ్రీరాముడు నిర్దేశించాడు.

శ్రీరాముని నిర్దేశం మేరకు సుగ్రీవుడు వానరసైన్యాన్ని ముందుకు నడవడానికి ఆజ్ఞాపించాడు.

వానర వీరులు ఎగురుతూ, దుముకుతూ, మేఘాల వలె గర్జిస్తూ, సింహనాదాలు చేస్తూ ముందుకు నడుస్తున్నారు.

"రావణుడు, ఆయన రాక్షస సైన్యము చావాలి" అంటున్నారు. ముందు మార్గాన్ని చూపిస్తూ ఋషభ, నీల, కుముదులు వెళ్లుతున్నారు. మధ్యలో సుగ్రీవ లక్ష్మణులతో కలసి శ్రీరాముడు ప్రయాణిస్తున్నాడు.

దారిలో మధుర ఫలాలను తింటూ, తేనెను త్రాగుతూ, చెట్లను పట్టుకొని ఊగుతూ, ఒకరినొకరు సంతోషంతో త్రోసుకొంటూ, పడగొట్టుకొంటూ మహోత్సాహంతో గర్వంతో వానరవీరులు పెళ్లికి వెళ్లుతున్నట్లు వెళ్లుతున్నారు.

సహ్యాపర్వతము వారికి అగుపించింది. నగరాలకు, పల్లెలకు దూరంగా రామాజ్ఞా భయంతో నదీ, తటాక, వనమార్గాల్లో వెళ్లుతున్నారు.

రామలక్ష్మణులు శుభగ్రహ సంయుతులైన రవి, చంద్రులవలె ప్రకాశిస్తున్నారు.

# శుభ శకునాలు - 4

వారికి మార్గమంతా శుభశకునాలే అగుపిస్తున్నాయి. ఆ విషయాన్ని లక్ష్మణుడు శ్రీరామునికి తెలుపుతూ -

"అన్నా! నీవు వదినను తీసికొని అయోధ్యకు వెళ్లడానికి తగిన ఈ శుభశకునాలను గమనించు -

(1) గాలి మెల్లగా, సుఖంగా చల్లగా వీస్తున్నది.

(2) మధుర స్వరాలతో మృగాలు అరుస్తున్నాయి.

(3) దిశలు ప్రసన్నంగా ప్రశాంతంగా ఉన్నాయి. సూర్యుడు విమలంగా వెలుగుతున్నాడు.

(4) (ఉశనుడు) ధృవుడు ప్రకాశిస్తూ నీ జన్మరాశి వెనుక ఉన్నాడు. సప్తర్షులు ఆయన చుట్టు కాంతివంతంగా ఉన్నారు.

(5) ఫాల్గుణ మాసారంభంలో ఉత్తర ఫల్గుణీ నక్షత్రం యుద్ధ యాత్రారంభానికి ప్రశస్తంగా ఉంది.

ఆ నక్షత్రానికి 10వ స్థానంలో శుక్రుడు మేషరాశిలో ఉన్నాడు. బుధ, గురువులు అనుకూలంగా ఉన్నారు. మన ఇక్ష్వాకు వంశతార విశాఖ నిర్మలంగా వెలుగుతున్నది.

గురువు సింహరాశిలో రెండింట ఉన్నాడు. ధనుస్సులో 6వ స్థానంలో శని కేతువులు ఉన్నారు. రోహిణీ నక్షత్రంలో 11వ (వృషభరాశిలో) ఇంట బుధుడు ఉన్నాడు.

చంద్రుడు మూడింట, సూర్యుడు పదవ స్థానంలో శుభంగా ఉన్నారు. ఈ విధంగా శ్రీరామునికి గ్రహాలు శుభంగా ఉన్నాయి.

రాక్షసుల తారమూల - రాశి ధనుస్సు, దానికి అయిదింట శుక్రుడు బాగున్నాడు. జన్మంలో శనికేతులు, పన్నెండవ ఇంట కుజుడు ప్రతికూలంగా ఉన్నారు. గురుడు తొమ్మిదింట శుభుడు. మొత్తం మీద దుష్టగ్రహాలైన శని, కేతువు, కుజుడు రాక్షసులకు ప్రతికూలంగా ఉన్నారు. రాక్షసుల తార అయిన మూల ధూమకేతువు ద్వారా పీడింప బడుతున్నది. అది సర్వరాక్షస సంహారాన్ని సూచిస్తున్నది.

ఇక మనకు విజయసూచకం జలాలు స్వచ్ఛంగా మధురంగా ఉన్నాయి. వృక్షాలు ఋతుకుసుమ గంధాలతో గాలి వీస్తున్నాయి.

తారకాసుర యుద్ధంలో, తార కొరకు జరిగిన యుద్ధంలో దేవతాసైన్యాలు ప్రకాశించినట్లు ఇప్పుడు కపి వీరుల వ్యూహాలు ప్రకాశిస్తున్నాయి" అని వివరించాడు.

లక్ష్మణుని మాటలు శ్రీరాముని మనస్సును రంజింపజేశాయి.

వానర వీరుల కోలాహలము, వారి పాదధూళి ఆకాశాన్నంటుతున్నట్లు ఉంది.

వానర వీరులు ఎగురుతూ, ముందుకు ఉరుకుతూ, కిలకిలధ్వనులు చేస్తూ, భుజాలు చరుచుకొంటూ, తోకలను భూమికి కొడుతూ భుజాలతో చెట్లను, గుట్టలను పడగొడుతూ మహా గర్వంగా ముందుకు సాగుతున్నారు.

వారందరు సహ్యపర్వత ప్రాంతానికి చేరుకొన్నారు. పూలచెట్లు వానరుల తలలపై పూల వర్షాన్ని కురిపించాయి.

అక్కడ అనేక జలాశయాలు ఉన్నాయి. పక్షులు, ఆనందంగా కిలకిలారావాలను చేస్తున్నాయి.

ఆ జలాశయాలలో (చెరువులలో) వానరులు మునుగుతున్నారు. మిత్రులను ముంచెత్తు తున్నారు. స్నానాలు చేస్తున్నారు. తీయని చల్లని నీళ్లను త్రాగుతున్నారు. అక్కడ లభించే అమృత ఫలాలను ఆరగిస్తున్నారు.

రాముడు మనిషేనా? తపోధనుడా?

జయము దైవాధీనము. దైవము ధర్మాధీనము

"హనుమ దేహము వజ్రమా? కత్తికి అతని కుత్తుక తెగదా?"

# భయంకర సముద్రము - 5

రాజీవలోచనుడైన శ్రీరామభద్రుడు మహేంద్రపర్వతము పైకి ఎక్కి అనంతమైన మహా సముద్రాన్ని చూచాడు.

పర్వతము దిగివచ్చి అలలచే కడుగబడిన చెలియలికట్టను (సముద్ర తీరాన్ని) చూచాడు. సుగ్రీవునితో "మనమిక్కడ ఆగాలి. ఈ సముద్రాన్ని ఎలా దాటాలో తరువాత విచారిద్దామ"న్నాడు. సైన్యము రహస్య స్థలంలో విడిది చేసింది.

శత్రువుల కదలికలను గుర్తించడానికి కొంతమంది వానర వీరులు అంతట సంచరిస్తున్నారు.

అక్కడ సముద్రమొకటి కాదు, రెండు ఉన్నాయి. ఒక దానికొకటి ఎదురెదురుగా ఉన్నాయి. (1) బాగా తేనెను త్రాగి మదించిన వానర సేనా సముద్రము (2) అలలతో మదించిన లవణ సముద్రము.

సముద్రము నురుగుతో నవ్వుతున్నట్లు, తరంగాలతో నృత్యము చేస్తున్నట్లు ఉదయించే చంద్రబింబ ప్రతిబింబంతో ప్రకాశించింది.

అక్కడ సముద్రము ఆకాశంతో పోటీ పడింది. రాత్రి పూట సాగర జలము యొక్క తుంపరలు ఆకాశంలోని నక్షత్రాల వలె అగ్ని కణాలుగా ఉన్నాయి. చంద్రకిరణాల వలె తెల్లనైన నీరు ఉంది. మహోరగాలు సంచరించడానికి ఆకాశము సముద్రము రెండు అవకాశమిస్తున్నాయి. సముద్రము పాములకు నిలయమైనట్లు ఆకాశము రాహువుకు నిలయంగా ఉంది. సురారులైన రాక్షసులకు సముద్రాకాశాలు రెండు నివాసాలుగా ఉన్నాయి. పాతాళం వలె రెండు గంభీరంగా ఉన్నాయి. "సాగరమే అంబరమా", "ఆకాశమే సాగరమా" అన్నట్లు సముద్రాకాశాల మధ్య తేడా లేకుండా పోయింది.

అంతేకాదు అంబరము (ఆకాశము) అర్ణవము (సముద్రము) రెండు నీల వర్ణంతో ప్రకాశిస్తున్నాయి. ఆకాశంలోని తారలు సముద్రంలోని రత్నాలను తలపిస్తున్నాయి. ఆకాశంలోని మేఘమాలలు సముద్రంలోని తరంగాల వలె ఉన్నాయి.

నభము సముద్రము రెండు మహాధ్వనులచే కొట్టబడుతున్నాయి. ఆకాశంలోని మేఘగర్జనలు సముద్రంలోని తరంగ శబ్దాలు ఆ రెండు కూడ ఆహవ (యుద్ధ) రంగంలో మహా భేరులను (నగరాలను) తలపిస్తున్నాయి.

ఈ విధంగా అనంతము, అతిగంభీరమైన ఆ మహోబ్ధిని (సముద్రాన్ని) చూచి వానర సేన ఆశ్చర్యానికి లోనైంది.

శ్రీరామచంద్రుడు సీతావిరహ శోకాన్ని నెమరువేసి కొంటున్నాడు. "లోకంలో కాలం గడచినా కొద్దీ దుఃఖము తగ్గిపోతుంది. కాని నాకు రోజురోజు మరింత పెరిగి పోతున్నదే!

ఓ గాలీ! నీవు ముందుగా సీతను తాకి, తరువాత నన్ను తాకు. చంద్రబింబాన్ని చూచి సీతాదేవి ముఖము అనుకొన్నట్లు సీతను తాకి నన్ను తాకితే, నన్ను సీతాదేవే తాకుతున్నట్లు అనుకొంటాను.

లక్ష్మణా! నా వియోగాగ్నిని భరించలేక నిన్ను విడిచి నేను సముద్రంలో ప్రవేశిస్తాను. అయినా నా పిచ్చిగాని, సముద్రము నా విరహాగ్నిని మరింత పెంచదని ఏమి నమ్మకము?

సీతాదేవి, నేను ఇద్దరము ఒకే భూమిపై జీవించి ఉన్నాము కదా! ఈ భూమినే శయ్య అనుకొని ఒకే శయ్యపై మేము ఇద్దరము పడుకొన్నట్లు భావించుకొంటాను.

నీరు ఉన్న పొలము ప్రక్క నీరు లేని పొలము ఉన్నా ప్రక్క పొలములోని నీటి తేమవలన నీరులేని పొలము ఎండిపోదు. అలాగే "సీతాదేవి జీవించి ఉంది" అన్న వార్త నన్ను కూడ జీవింపజేస్తుంది.

నేనెన్నడు సీతాదేవితో కౌగిలి సుఖాన్ని పొందగలుగుతానో? నిజానికి "సీతను రాక్షసుడపహరించాడని" కాని, "ఆమె దూరంగా ఉందని కాని" నాకు దుఃఖము లేదు. ఈ విరహంతో చాల కాలము గడచిపోతున్నదే అని నా విచారము.

శ్రీరామునికి ఇన్ని లక్షల కపిసేనలు చావడము జయపతాకమా? ఆయనకు ప్రపంచంలో మరో భార్య దొరుకదా?

"చెట్లతో, రాళ్ల రప్పలతో ఈ కోతులు మాతో యుద్ధం చేస్తాయా"?

# రావణుని మంత్రాంగము - 7

శ్రీరామచంద్రస్వామి సమస్త వానరసేనా సమేతంగా సముద్ర ప్రాంతానికి చేరినట్లు రావణునికి వార్త అందింది. ఆయన తాము తీసుకోవలసిన చర్యలను గురించి విచారించ డానికి మంత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు.

నిర్ణయాలు తీసికొనేవారు మూడు రకాలుగా ఉంటారని ఆయన తెలిపాడు.

(1) ఉత్తములు:- హితులతో ఆలోచించి పనులు చేసేవారు.

(2) మధ్యములు:- ఎవ్వరిని సంప్రదించకుండా స్వయంగా పనులు చేసేవారు.

(3) అధములు:- మంచి చెడులను స్వయంగా కూడ విచారించక అధర్మ కార్యాలను చేసేవారు.

అలాగే నిర్ణయాలు కూడ మూడు రకాలుగా ఉంటాయి.

(1) శాస్త్ర దృష్టితో ఆలోచించి అందరు ఏకాభిప్రాయంతో తీసికొన్న నిర్ణయాలు - "ఉత్తమాలు".

(2) అభిప్రాయాలు భిన్నంగా ఉన్నా, చివరకు ఐకమత్యంతో తీసికొన్న నిర్ణయాలు - "మధ్యమాలు".

(3) ఐకమత్యానికి రాలేక భిన్న నిర్ణయాలు - "అధమాలు".

రావణుని అనుచరులు శత్రువుల బలాబలాలు తెలియని వారు. తమ బలాబలాలు కూడ తెలియనివారు. నీతి నియమాలు లేనివారు. స్వయంగా ఆలోచించే బుద్ధిలేని వారు. అందరు రావణునితో ముఖప్రీతి కొరకు మాట్లాడేవారు. వారు ఇలా అన్నారు:-

(1) మహారాజా! భోగవతీ నగరానికి వెళ్లి నాగులను జయించావు.

(2) కుబేరుని జయించి పుష్పకవిమానాన్ని తెచ్చుకొన్నావు.

(3) మయుడు నీకు భయపడి ఆయన కూతురు మండోదరిని నీకు భార్యగా సమర్పించాడు.

(4) దానవేంద్రుడైన మధు నీకు లోబడి నీ చెల్లెలు కుంభీనసను పెండ్లాడాడు.

(5) వాసుకి, తక్షకుడు, జట, శంఖాది నాగరాజులు నీకు వశమయ్యారు.

(6) వరబలులైన కాలకేయాదులు ఒక సంవత్సరము నీతో పోరాడి ఓడారు.

(7) ఇంద్రునితో సహా దిక్పాలకులందరు నీతో ఓడిపోయారు.

(8) వరుణ పుత్రులను సేనాబలసమేతులను వశపరచుకొన్నావు.

(9) కాలపాశ, మృత్యుదండాయుధాలు కలిగిన యముని, అయన కింకరులతో సహా వశం చేసికొన్నావు.

నీతో సమానులు, ఈ భూమండలంలోనే కాదు స్వర్గ పాతాళాలలో కూడ లేరు.

నీ దాకా ఎందుకు? ఒక్క ఇంద్రజిత్తే వానర సేనను రామలక్ష్మణులను మట్టి కరపిస్తాడు. యముని నిగ్రహించిన మహాదేవుని పూజించి మహా వరాలను పొందాడు. యుద్ధంలో "దేవతల బలమనే సముద్రాన్ని" ఎండ గొట్టాడు. శంబరాసురుని పుత్రులను చంపిన దేవేంద్రుని బంధించి తెచ్చి, బ్రహ్మ దేవుని మాట వలన అయనను విడిచిపెట్టాడు.

ఆయన ఒక్కడు చాలడా నీ ఆజ్ఞ ప్రకారము సమస్త వానర సేనా సంహారానికి? ఒక సామాన్యుని వలె ఇంత చిన్న విషయానికి విచారం దేనికి?"

అప్పుడు సేనాధిపతి అయిన ప్రహస్తుడు లేచి – "మహారాజా! సమస్త దేవ, దానవ, గంధర్వ విజేతవు. నీకు కోతులు, మనుష్యులు ఒక లెక్కా?

మనం అజాగ్రత్తగా ఉండడము చూచి హనుమ మనను ఆట పట్టించి వెళ్లాడు. నీ ఆజ్ఞతో కోతిజాతినే లేకుండా చేస్తాను."

దుర్ముఖుడు:– హనుమ చేసిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవలసిందే. నేనొక్కడినే వానర జాతిమొత్తాన్ని సంహరిస్తాను.

వజ్రదంష్ట్రుడు:– రక్తమాంసాలు అంటుకొన్న తన పరిఘాయుధాన్ని చూపి దీనితో రామలక్ష్మణులను చంపి వస్తాను. అంతేకాదు మాలో కొందరము మానవ రూపాలతో వెళ్లి, మేము భరతుడు పంపగా వచ్చిన సైనికులమని నమ్మిస్తాము. మిగిలిన వాళ్లము ఆకాశంపై నుండి శిలలను, శరాలను ప్రయోగిస్తాము.

నికుంభుడు:– పెద్దనాన్నా! నేను మా తండ్రి కుంభకర్ణుడి అంత బలం గలవాడినే. నేనొక్కడినే వెళ్లి వానరులందరిని చంపుతాను.

వజ్రహనువు:– తన పర్వతమంతటి శరీరముతో లేచి తన నాలుకను త్రిప్పుతూ, మీ అందరు ఎందుకు? నేనొక్కడినే వెళ్లి సర్వ వానరులను సంహరించి వారి రక్తము త్రాగుతాను.

# విభీషణోపదేశము - 8

రాక్షస మహావీరులు తమ ఆయుధాలనెత్తి, రామలక్ష్మణులపై, వానర సేనపై దండయాత్రకు లేచారు. వారిని వారించి విభీషణుడు రావణునికి హితాన్ని ఉపదేశించాడు. విభీషణుడు అంటే "భయంకర స్వభావము లేనివాడు (విగతభీషణుడు)". "దుర్మార్గుల విషయంలో విశేషంగా భయంకరుడు". ఈషణ త్రయాన్ని భయపెట్టిన వాడు" (వి+భీ+ఈషణ).

"మహారాజా! శత్రువు దగ్గరకు వచ్చాడనగానే యుద్ధానికి పూనుకోవడం మంచిది కాదు. ముందు సామదాన భేదోపాయాలను ప్రయోగించాలి.

బాగా మదించిన వాళ్ల విషయంలో, విరాగుల విషయంలో, దురదృష్టవంతుల విషయంలో బాగా ఆలోచించి దండ ప్రయోగం చేస్తే అది ఫలిస్తుంది.

కాని శత్రువులు అప్రమత్తులు, బలవంతులు, ఆగ్రహంతో ఉన్నవారు. వాళ్ల విషయంలో దండోపాయము పనిచేయదు. ఒక్క హనుమంతుడే ఘోరమైన సముద్రం దాటి, లంకలోకి వచ్చి వేలాది సైన్యాన్ని చంపి, లంకను కాల్చి వెళ్లాడు. ఇప్పుడు శత్రుసైన్యంలో హనుమతో సమానబలులు అనేకులు ఉన్నారు. వాళ్లను తక్కువగా అంచనా వేయవద్దు.

రాక్షసరాజు ఒంటరిగా ఉన్న సీతాదేవిని అపహరించి శ్రీరామునికి గొప్ప అపకారం చేశాడు.

శూర్పణఖ చేసిన తప్పును సమర్థించి, ఖరదూషణాదులు రామునిపైకి దండెత్తి వెళ్లి చచ్చారు. తనపై దండెత్తివచ్చిన వాళ్లను చంపడం రాముని తప్పా?

పరుల భార్యలను అపహరించడం, ఆయుష్యాన్ని, కీర్తిని, అర్థ బలాన్ని నశింపజేస్తుంది. ఇప్పుడు సీతాదేవే మన భయానికి, యుద్ధానికి కారణము. ఆమెను ఇప్పుడు శ్రీరామునికి అప్పగిస్తే యుద్ధంతోనే అవసరము లేదు.

రామభద్రుడు లంకా నగరముపై దాడిని ప్రారంభించకముందే సీతాదేవిని అప్పగిస్తే మంచిది. లేకపోతే సర్వరాక్షస సమేతంగా లంకా వినాశము తప్పదు.

అందువలన మహారాజా! నీ ప్రియ సోదరుని మాటను మన్నించి రామునికి జానకిని అప్పగించు.

అన్నా! సుఖాన్ని, ధర్మాన్ని నశింపజేసే నీ కోపాన్ని వదలి ఆ రెండింటిని పెంచే మార్గాన్ని అవలంబించు. మనము అందరము ఇలాగే ఎప్పటికి పుత్ర, మిత్ర బాంధవ సమేతంగా సుఖించే విధంగా సీతాదేవిని వెంటనే శ్రీరామునికి అప్పగించు”.

విభీషణుని హితవచనాలు రావణునికి రుచించలేదు. ఆయన అమితంగా కోరుకొనే సీతాదేవిని అప్పగించడం ఆయనకు ఏ మాత్రము ఇష్టం కాలేదు. అందువలన మౌనంగా సభను చాలించి వెళ్లాడు.

ఎవ్వడో “నేను భగవంతుడిన”ని చెప్పుకొంటాడు. చెదలు వలె వాని భజనపరులు వేలకు వేలు తయారవుతారు. లోకమెంత చిత్రమైనది?

ఒక్క ఏడాదిపాటు వేరే వాని ఇంట్లో ఉన్న (ఆడ) దానిని తీసిక పోవడానికి ఇంతమంది చావ రావాలా?

అందరికి తల్లిదండ్రులైన సీతారాములను ఎడబాపిన ద్రోహివి.

# లంకలో అపశకునాలు - 9

తెల్లవారి ఒంటరిగా రావణుని కలసి మంచి మాటలు చెప్పాలనుకొని విభీషణుడు రావణ భవనానికి వెళ్లాడు.

రావణ భవనము మహాపర్వతమంత ఎత్తుగా ఉంది. అనేక వీధులు ఉన్నాయి. అనేక వేల రాక్షస సైన్యము కాపలా ఉంది. మతిమంతులైన మహామాత్యులు అనేకులు ఉన్నారు. అయితే వారందరు రావణభయంతో ఆయనకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలుపలేదు.

ఆ భవన వీధులలో రథ, గజ, తురగ పదాతిబలాలు ఉన్నాయి. గుఱ్ఱాల హేషాధ్వనులు, గజఘీంకారాలు, శంఖనాదాలతో, తూర్య ఘోషలతో వీధులన్ని సమ్మర్ధంగా ఉన్నాయి.

అమరావతి, భోగవతి, గంధర్వ, వరుణ నగరాల వలె లంకానగరము మహావైభవంతో నిండుగా ఉంది.

విభీషణుడు అన్నగారి ఇంటికి వెళ్లుతూ వేదవిదుల పుణ్యాహవాచనాలను వింటున్నాడు. పెరుగు, నెయ్యి పాత్రలతో అందమైన అక్షతలను ధరించి, మంత్రవేత్తలైన బ్రాహ్మణోత్తములను దర్శించాడు.

భవనంలోపలికి వెళ్లి, రాక్షస పరివారముతో నమస్కారాలు అందుకొంటూ, తేజస్సుతో వెలిగిపోతూ, సింహాసనాసీనుడైన రావణునికి వందనం చేసి ప్రశాంతచిత్తంతో:-

"అన్నా! సీతాదేవి లంకకు వచ్చినప్పటి నుండి అనేక అపశకునాలు అగుపడుతున్నాయి. పొగతో అగ్ని కప్పబడుతున్నది. ఎంత నేయివేసినా, ఎన్ని మంత్రాలతో ఆహ్వానించినా అగ్నిహోత్రుడు జ్వలించడం లేదు. వంట ఇండ్లలో, అగ్నిశాలలో, దేవాలయాలలో పాములు తిరుగుతున్నాయి. హోమశాలల్లో చీమలు నిండాయి. గోవులు చక్కగా పాలివ్వడం లేదు. మహాగజాలు మదం కలిగి లేవు. గుఱ్ఱాలు గ్రాసాన్ని ముట్టడం లేదు. ఊరికే అరుస్తున్నాయి. గాడిదలు, ఒంటెలు ఏ కారణం లేకుండానే కన్నీరు కారుస్తున్నాయి.

అంతట కాకులు అరుస్తున్నాయి. ఇండ్లపై భాగాలపై కాకులు గద్దలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ప్రొద్దున, సాయం సమయాలలో నక్కలు అశుభంగా కూస్తున్నాయి. కుక్కలు, ఇతర మృగాలు ఇండ్ల ముందు అరుస్తున్నాయి.

ఈ ఘోరాలు తగ్గాలంటే అన్నా! సీతాదేవిని శ్రీరామునికి అప్పగించడమే మంచి మార్గము.

అన్నా! నేనేదో నీపై కోపంతోనో, అసూయతోనో, యుద్ధభయంతోనో అనడం లేదు.

ఈ అపశకునాలు నగరమంతట, అంతఃపురంలో కూడ అగుపడుతున్నాయి. ప్రహస్తాదులందరు వీటిని గమనిస్తునే ఉన్నారు. నీ భయంతో నీకు చెప్పడం లేదు. నీ తమ్ముడిని కనుక చొరవతో నీకు ఈ విషయాలను తెలుపుతున్నాను.

నీవు ఈ అన్ని విషయాలను ఆలోచించి సరియైన నిర్ణయం తీసికో" అని మంత్రులు వింటుండగా విభీషణుడు తన అభిప్రాయాన్ని విజ్ఞాపనము చేశాదు.

అప్పుడు రావణుడు:- "విభీషణా! నీవేవో ఊహించుకొని అనవసరంగా భయపడుతున్నావు. నాకు యుద్ధము వలన ఏ భయము లేదు. రాముడెంత ప్రయత్నించినా సీతను చేరజాలడు. ఆయన వానర సేనతోనే కాదు, ముప్పై మూడు కోట్ల దేవతలతో కూడిన మహేంద్రునితో కలసి వచ్చినా నా ముందు నిలువజాలడు. ఇక నిశ్చింతగా నీవు వెళ్లుమ"ని విభీషణుని పంపించాడు.

అయితే రావణుడు ప్రశాంతంగా లేడు. సీతాదేవి పట్ల కామము ఆయనను పీడిస్తున్నది. ఆప్తులయిన విభీషణాదులు తన పట్ల భయం లేక హితోపదేశం చేస్తున్నారు. "తాను చేసింది పాపమేనేమో" అనే ఆలోచన ఆయనలో కలుగడం మొదలైంది. అయితే ఆయన వీటిని లక్ష్యపెట్టుతాడా?

ఆ రోజు కూడ మహాసభను పిలిచాడు. అందులో అమాత్యులను, మిత్రులను, పుత్రులను, బాంధవులందరిని రమ్మన్నాడు.

మేఘగర్జనతో సమాన ధ్వనిగల మహారథముపై సభకు బయలుదేరాడు.

కత్తులు, కటారులు, డాలులు, మొదలైన సర్వాయుధాలను ధరించి రాక్షస వీరులందరు సర్వాభరణ భూషితులై రావణ రథం వెంట సభకు చేరుకొన్నారు.

ఆయన సభకు చేరుకోగానే సభాసదులందరు ఆయనకు వందనాలను సమర్పించారు. వందిమాగధులు స్తోత్రం చేశారు. బ్రాహ్మణులు ఆశీర్వదించారు.

బంగారు, వెండి స్థంభాలతో, పరిశుద్ధమైన స్ఫటికాలతో నిర్మించబడిన కిటికీలతో, బంగారు వస్త్రాల ఆస్తరణలతో ఆ మహాసభ శోభాయమానంగా ఉంది. ఆరువందల పిశాచగణాలు ఆ సభను కాపలా కాస్తున్నాయి.

రావణుడు వైడూర్యమయమైన బంగారు సింహాసనంలో జింక చర్మముపై కూచొన్నాడు. సభాసదులందరిని రమ్మని దూతలను పంపాడు.

సింహాలు గుహలలోకి చేరుకొన్నట్టు క్షణంలో సభాసదులందరు సభకు వచ్చారు. విభీషణుడు కూడ సభకు స్వర్ణరథంపై వచ్చి, అన్నపాదాలకు అభివందనం చేశాడు. సభ అంతా నిశ్శబ్దంగా, గంభీరంగా ఉంది. అప్పుడు రావణుడు ప్రహస్తుని "సర్వ సైన్యాలను సమాయత్తం చేయుమని" ఆజ్ఞాపించి సభాసదులను ఉద్దేశించి ప్రసంగించ సాగాడు.

"వీరవరులారా! నా ప్రియాప్రియాలను, సుఖదుఃఖాలను, లాభాలను, నష్టాలను, ధర్మార్థ కామాలన్నిటి గురించి మీకు ఈ రోజు సభలో స్పష్టపరుచాలనుకొంటున్నాను.

రాక్షస వీరులారా మీతో సంప్రదించి, నేను చేసిన ప్రతి పని విజయవంతమైంది.

కుంభకర్ణుడు ఇంత వరకు నిద్రలో ఉండి, ఈ రోజే సభకు వచ్చాడు. ఆయనకు, ఆయనతో పాటు మీ అందరికి అన్ని విషయాలు తెలుపాలనుకొంటున్నాను.

రాక్షసులు సంచరించే దండకారణ్యానికి రామలక్ష్మణులు సీతాదేవితో వచ్చారు. వారు ఋషులకు అభయమిచ్చి మన కోపానికి పాత్రులయ్యారు. మా చెల్లెలు శూర్పణఖను అవమానపరిచారు. ఆమెకు సహాయంగా వెళ్లిన ఖరదూషణాదులను పదునాల్గువేల రాక్షస బలాన్ని సంహరించారు.

దానికి ప్రతీకారంగా రాముని భార్య అయిన సీతాదేవిని అపహరించి లంకకు తెచ్చాను.

ఆమెకు రాముని కన్న, నాకున్న వైభవాన్ని ఎంతగా వివరించినా, ఆమె నా ప్రేమను అంగీకరించలేదు.

మూడు లోకాలలో సీత అంతటి సౌందర్యవతి లేదు. ఆమె ముఖము చంద్రబింబము వలె అందంగా ఉంది. ఆమె నడుము పిడికెట్లో అమరుతు, సన్నగా ఉంది. ఆమె రంగు బంగారును మించి ఉంటుంది. మయుడు "ఆమెను తన మాయతో సృష్టించాడేమో?". చిగురులాంటి ఎఱ్ఱని ఆమె మృదుపాదాలు, పగడం లాంటి ఆమె ఎఱ్ఱని గోళ్లు, దొండపండు లాంటి ఆమె పెదవులు, పొడువైన ఆమె కోటేరు ముక్కు నా మనస్సులో మన్మధబాధను కలిగించాయి. ప్రతిక్షణం నా మనోబాధ అధికమవుతున్నది. అయితే సీతాదేవికి నేను ఒక సంవత్సరము గడువిచ్చాను. ఆమె తన భర్త రాక కొరకు ఎదిరి చూస్తున్నది. ఆ సుందరనయన కిచ్చిన గడువును మన్నించి నా మనోబాధను అణచు కొంటున్నాను.

కాని చాల మార్గము పయనించిన గుఱ్ఱము అలసిపోయినట్లు ఇంత కాలము ఎదిరి చూచిన నా మనస్సు కామబాధతో అలసిపోయింది.

నిజానికి అగాధము, జలచరమయము, భయంకరము, అనంతమైన మహాసముద్రాన్ని అల్పులైన మానవులు రామలక్ష్మణులు కాని వానరులు కాని ఎలా దాటగల్గుతారు?

అయితే "పోనీ" అని తేలికగా తీసికొందామంటే ఒక్క కోతి వచ్చి చేసిన అల్లరిని, సృష్టించిన ప్రళయాన్ని మరువడానికి వీలుకావడం లేదు.

ఇప్పుడేమి చేయాలో బాగా ఆలోచించి సలహా చెప్పండి. ఎవ్వరి అభిప్రాయాలు వారు నిర్భయంగా స్పష్టంగా చెప్పండి.

నాకైతే విభీషణుడు చెప్పినట్లుగా అల్పమానవులైన రామలక్ష్మణులతోగాని, కోతిమూకలతో గాని ఏ మాత్రం భయం లేదు. అయినా మీ అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలుపండి. దైవాసుర సమరంలో మీ సహాయంతోనే నాకు విజయాలు కల్గాయి. ఇప్పుడు కూడ మీ సహాయ సహకారాలు అందించండి. ఇప్పుడు సముద్రము యొక్క అవుతలి వైపు సుగ్రీవాది వానర కోటితో రామలక్ష్మణులు వచ్చి ఉన్నారని తెలిసింది.

సీతాదేవిని తిరిగి ఇవ్వకుండా, రామలక్ష్మణులను సంహరించడానికి తగిన సూచనలివ్వండి. ఇంతవరకు నరవానరులెవ్వరు సముద్రము దాటి రాలేదు. వీరు కూడ ఎలా వస్తారు? విజయం మనదే" అని ముగించాడు.

రావణుని ప్రసంగంలో ఎక్కడా రాక్షసుల దోషము లేనే లేదన్నట్లు మాట్లాడాడు. "తనకు రామలక్ష్మణుల వలన భయం లేదంటాడు. శత్రువులెవ్వరు సముద్రం దాటి రాలేరంటాడు. విజయము తమదే అంటాడు. అయినా హనుమంతుని వలన కలిగిన భయము మరువరానిదే అంటాడు. సీతాదేవిని తిరిగి ఇవ్వనంటాడు. విజయంలో అందరి సహాయం కావాలంటాడు." ఆయన ప్రసంగమంతా చాతుర్యంతో కూడుకొన్నది.

అప్పుడే ఆరునెలల నిద్ర ముగించుకొని సభకు క్రొత్తగా వచ్చిన కుంభకర్ణునికి రావణునిపై క్రోధం ముంచుకొచ్చింది.

"అన్నా! ఇంతవరకు అన్ని ఎవ్వరిని విచారించి చేశావు? సీతాదేవిని అపహరించి తెచ్చేప్పుడు ఎవ్వరినైనా అడిగావా? "యమునా నది వరదలతో పొంగి మీద పడకముందే పర్వతాన్ని అడ్డంవేసినట్లు" నీవప్పుడే అందరితో ఆలోచించవలసి ఉండాలి. అప్పుడు మంచైనా చెడైనా అందరికి సమానబాధ్యత ఉండేది.

అప్పుడేమో సీతాదేవి పట్ల కామంతో ఆమెను అపహరిస్తావా? చేతులు కాలాక

ఆకులు పట్టుకొన్నట్లు ఇప్పుడు అందరి సహాయం కావాలంటావా? ఆలోచించకుండా చేసిన పని "చిలుము పట్టిన పాత్రలో నేయి పోసినట్లు" ఉంటుంది.

శత్రువులు బలవంతుడైన శత్రువు బలహీనతలను గమనించి పైబడుతారు. హంసలు ఎత్తైన క్రౌంచ పర్వతముపైకి ఎక్కలేక, కుమారస్వామి బాణాలతో చేసిన రంధ్రాలను వెతుకుకొని వాటి ద్వారా పైకి వెళ్లుతాయి.

విషంతో కూడిన మాంసము ముద్ద తిన్నవాడిని తక్షణమే వధించినట్లు ఇంత దుష్కార్యం చేసినా ఇంతవరకు రాముడు నిన్ను పట్టుకొని వధించలేదు.

అయినా అన్నా! ఆపదలో నిన్ను వదలను. నీవు చేసిన ఈ దుష్కర కర్మను నేను ఫలవంతం చేస్తాను. నీ శత్రువులైన రామలక్ష్మణులు సూర్యేంద్రులైనా, అగ్నివాయువు లైనా, వరుణ కుబేరులైనా వారిని వధించి తీరుతాను.

పర్వతమంత ఎత్తు దేహంతో, పరిఘాయుధాన్ని ధరించి, సింహము వలె గర్జిస్తూ బయలుదేరిన నా భయంకర కోరలను చూచి దేవేంద్రుడైనా కాలికి బుద్ధి చెప్పవలసిందే.

నేను శ్రీరాముని బాణమెంత భయంకరమైనా, మొదటి దానితో చావను. ఆయన రెండవ బాణము వేసేలోగా ఆయనపైపడి ఆయన రక్తాన్ని పీల్చి త్రాగుతాను. నీవు నిశ్చింతగా ఉండు. శ్రీరాముని వధించి నీకు సుఖము కలిగించే విజయాన్ని సంపాదించి పెడతాను. సర్వవానరకోటిని భక్షిస్తాను.

నీవు నిశ్చింతగా ఉండు. కావలసినంత వారుణిని (కల్లును) త్రాగు. ఆనందించు. నీకిష్టమైన పనులన్ని నిర్విచారంగా చేయి.

రాముడు నా చేతిలో చచ్చాక సీత కూడ నీకు వశమవుతుంది." కుంభకర్ణుడు రావణుని దోషాన్ని తీవ్రంగా నిందించాడు. ఆయన దోషానికి తాను బలి అయినా అన్నను రక్షిస్తానని తెలిపాడు. అంటే రావణునికి తానే దిక్కైనట్లు మాట్లాడాడు.

కుంభకర్ణుని మాటలకు రావణుని ముఖం కోపంతో కందగడ్డలా ఎఱ్ఱగా జేవురించింది. ఆయన ఆగ్రహాన్ని చూచి మహా పార్శ్వుడు చేతులు జోడించి, "అయ్యా! పాములు, తేళ్లు, భయంకర మృగాలు ఉంటాయని అడవులకు వెళ్లి కూడ మధువును త్రాగనివాడు మూర్ఖుడే కదా. ఆలాగే ఆపాయమో, ఉపాయమో సీతాదేవిని ఎలాగు తెచ్చావు. తెచ్చిన తరువాత ఆమెను భోగించకుండా ఎందుకు ఉన్నావు?

నీవే ఈశ్వరుడవు. నీ ముందు మరొక ఈశ్వరుడెవ్వడు లేడు. నీవు శత్రువుల తలలపై కాళ్లు పెట్టి సీతాదేవిని అనుభవించు.

కోడిపుంజు కోడిపెట్టని తన కాళ్ల క్రింద బంధించి, దానితో బలవంతంగా రమిస్తుంది. అలాగే నీవు కూడ "కుక్కుట వృత్తితో బలవంతంగా సీతను అనుభవించు".

"కుక్కుటవృత్తేన రమస్వ" ఇందు "నరమస్వ" అనే ధ్వని కూడ వస్తుంది. అందువలన "బలవంతం చేసి ఆమెను రమించవద్దు" అని అంతరార్థము కూడ.

ఆమె అంగీకరించే దాకా ఆమెను రక్షించు (భుంక్ష్వ = రక్ష) "భుజ"ధాతువుకు రక్షణ, తినుట అని రెండు అర్థాలు.

ఆమెను అనుభవించాక పాపము వస్తే రానీ, దానిని ఎలాగో ఓర్చుకోవచ్చు. లేదా దానిని తీర్చుకోవచ్చు.

కుంభకర్ణ, ఇంద్రజిత్తులు తలచుకొంటే వజ్రహస్తుడు (ఇంద్రుడు) కూడ తలవంచు తాడు.

అసమర్థులైన వాళ్లు కార్యసాధనలో సామదాన భేదాలను వాడుతారు. ప్రతాప వంతుడవైన నీకు సర్వదా దండమే సాధనము".

మహాపార్శ్వుని మాటలు రావణుని సంతోషపరిచాయి. ఆయనను చూచి, రాక్షస ప్రభువు "మహాపార్శ్వా! సీతాదేవితో నేను బలవంతంగా సుఖించక పోవడానికి ఒక రహస్య కారణముంది. దానిని జాగ్రత్తగా విను!

"పూర్వము ఒకప్పుడు "పుంజిక" అనే అప్సరస సర్వాలంకారభూషితురాలై బ్రహ్మ సభకు వెళ్లుతున్నది. ఆమెను చూడగానే నా మనస్సు మనస్సులో లేదు. ఆమెను నేను మధ్యలోనే ఆపి బలవంతంగా వివస్త్రను చేసి అనుభవించాను. ఆమెను వివస్త్రగానే బ్రహ్మ సభకు పంపాను. ఆమెను అలా చూచిన బ్రహ్మదేవుడు ఆగ్రహంతో "రావణా! ఈ రోజు నుండి నీవు ఏ స్త్రీ నైనా బలాత్కరిస్తే నీ తల వేయి ముక్కలు అవుతుంది. ఈ శాపము తప్పదు" అని శపించాడు. ఆ శాపభయంతోనే నేను సీతను బలాత్కరించలేదు.

"మరొకప్పుడు నందనవనంలో విహరిస్తున్న రంభను బలాత్కరించి అనుభవించాను. రంభ తాను "నలకూబరునితో ఉంటున్నాను. కనుక కోడలునే" అని చెప్పినా నేను ఆమెను వదల లేదు" రంభ బలాత్కారాన్ని విన్న నలకూబరుడు "ఇక ముందు ఎవ్వరిని బలాత్కరించినా రావణుని తలపగిలి పోతుందని" శపించాడు. నలకూబరుని శాపమెంత? కాని, బ్రహ్మ శాపభయమే నా సహనానికి కారణము" అని మహాపార్శ్వునితో తెలిపాడు.

పర్వత గుహలో పడుకొన్న సింహాన్ని లేపి కవ్వించినట్లు రాముడు నన్ను కవ్విస్తున్నాడు. ఆయనకు నా బాణరుచిని చూపుతాను" అని విరమించాడు.

# తిరిగి విభీషణుని బోధ - 10

"అన్న అయిన రావణుని చర్యను మొదట నిందించినా, తాను ఆయనకు అండగా ఉంటానని కుంభకర్ణుడు పలికాడు. మహాపార్శ్వుడు ఎటువంటి పరిస్థితులలో కూడ తాము రావణుని పక్షములోనే ఉంటామని హామీనిచ్చాడు. "వీరి వ్యర్థపు హామీల వలన రావణుడు మరింత మూర్ఖుడవుతాడేమో?" అని భయపడి, ఆయనను మరొకసారి హెచ్చరిద్దామని విభీషణుడు లేచి నిలబడ్డాడు.

"అన్నా! సీతాదేవి రాముని పట్ల చింతతో నిస్సహాయంగా ఉంది. ఆమె ఎలాగైనా నీకు కామ సుఖాలను అందిస్తుందని అనుకొంటున్నావు. కాని ఆమె నిన్ను కామించక పోవడమే కాక నిన్ను కాటువేయడానికి సిద్ధంగా ఉన్న "కాలనాగు" అని గ్రహించు.

"సీతాదేవి వక్షస్థలమే విశాలమైన పడగచోటు. రామవిరహ చింతే విషము. ఆమె చిరునవ్వే విషపు కోర. ఆమె అయిదు వేళ్లే ఆమె అయిదు తలలు.

ఆ నాగుబాము నీ దగ్గర ఉంటే, ఒక్క నీకే కాదు, రాక్షస జాతికంతటికి వినాశమే."

ఆమె కొరకు కొండంత శరీరాలతో, వజ్రాల వంటి గట్టి కోరలతో, చేతి గోళ్లే ఆయుధాలుగా గల్గిన వేలాది వానరులు ఆమెను రక్షించడానికి లంకను ముంచెత్త బోతున్నారు. అంతకముందే సీతాదేవిని శ్రీరామునికి సమర్పించు. శ్రీరాముని బాణాలు వజ్ర కఠినాలు, వాయువువలె వేగ వంతాలు. అవి రాక్షసుల తలలను ముక్కలు చేయక ముందే సీతాదేవిని శ్రీరామునికి అప్పగించు.

"ప్రహస్తా! శ్రీరాముడు ప్రయోగించిన క్రూర బాణాలు నీ తలను నరకే దాకా నిన్ను నీవు పొగడుకొంటూనే ఉంటావా?

కుంభకర్ణ, ఇంద్రజిత్, మహాపార్శ్వ, మహోదర, కుంభ, నికుంభ, అతికాయ, మహాకాయులే కాదు, వీరందరితో కలసి రావణ ప్రభువైనా రాముని ముందు నిలువ జాలడు.

ప్రహస్తా! సూర్యమండలంలో దాగినా, మరుత్తుల అండ నీకు లభించినా, స్వయంగా ఇంద్రుడే నిన్ను తన తొడపై కూచోబెట్టుకొన్నా, ఆకాశంలో దాగినా, పాతాళంలోనికి దిగినా నీవు రాముని బాణాగ్ని ముందు భస్మము అవుతావు" అని విభీషణుడు సత్యాన్ని తెలిపాడు.

అప్పుడు ప్రహస్తుడు బింకంతో "విభీషణా! దేవ దానవులనుండే కాదు. మరెవ్వరి వలన కూడ మాకు ఎంత మాత్రము భయం లేదు. ఒక సామాన్య రాముని నుండి మాకు భయమా" అని అడిగాడు. ఆయన మాటలను మధ్యలోనే త్రుంచి, "నీవు, మహారాజు, కుంభకర్ణ, మహోదరులు పలికిన పలుకులన్నీ "పుణ్యం చేయని వాడు స్వర్గం వెళ్లజాలనట్లే" వ్యర్థాలు. మహాసముద్రాన్ని నావలేకుండా దాట దలచినట్లు అసంభవాలు.

శ్రీరాముడు ధర్మబలుడు. మహారథుడు, జన్మసిద్ధమైన ఇక్ష్వాకు బలసంపన్నుడు. ఆయన సకల ప్రాణి రంజకుడు.

ఆయన కావించిన వాలి వధ, కబంధాది భయంకర రాక్షస సంహారము దేవతలకే అర్థము కాలేదంటే మనమెంత?

సకల దేవతా సార్వభౌముడైన మహేంద్రుడు, సకల రాక్షస సార్వభౌముడైన రావణుడు ఇద్దరు కలిసి కూడ రాముని ఎదిరింపజాలరు.

ఈ రాజు వ్యసనపరుడు. వాస్తవానికి మిత్రులు కాకున్నా, విధిలేక మిత్రుల వలె నటించే మీ అందరితో కలసి ఉన్నాడు. ఆయన భయంకర స్వభావముతో తనకు తోచినది చెడు అయినా నిరంకుశంగా దానిని ఆచరిస్తాడు.

రామద్వేషమనే విషాన్నుండి, సహస్ర శిరస్సులతో మహాకాయుడైన లక్ష్మణుడనే ఆదిశేషుని పట్టు నుండి మన మహారాజును మీరెలా విడిపించగల్గుతారు?

రాజు ద్వారా అన్ని కోరికలను తీర్చుకొన్న మీరందరు మహాప్రమాదంలో కూరుకొన్న మహారాజును, శత్రువులు తలవెంద్రుకలను పట్టుకొని తమ వైపు లాక్కొనక ముందే (మీరు) పైకి తీయండి. సీతాపహరణమనే మహాసాగరంలో పడి రామబాణమనే పాతాళంలో మహారాజు పడక ముందే కాపాడండి. నా మాట ఒక్కటే. "సీతను రామునికి అప్పగించ వలసిందే."

బుద్ధిలో బృహస్పతి అయిన విభీషణుని హితోక్తులు వయస్సు రక్తంతో ఉన్న ఇంద్రజిత్తుకు రుచించలేదు. ఆయన రావణుని వైపు తిరిగి, "నాన్నా, నీ తమ్ముడి మాటలు చాల తప్పు. అవి పిరికిపందలు అనవలసినవి. మన వంశంలో పుట్టిన వాని నోటినుండి రావలసినవి కావు.

మన కులంలో వీర్య, ధైర్య, పరాక్రమాలు సంపదలు. అవి ఏ మాత్రము లేని మీ తమ్ముడు మన వంశంలో పుట్టవలసినవాడు కాడు" అని ఆయన విభీషణుని వైపు తిరిగి "పిరికిపందా! రామలక్ష్మణులెంతవారు? ఒక సామాన్య రాక్షసుడు చాలు వారిని నమిలి మింగడానికి. అటువంటి అతి సామాన్య మానవులను చూపి మమ్మే భయపెడుతున్నావా?

త్రిలోక సార్వభౌముడైన దేవేంద్రుని నేను భూమిపై పడగొట్టాను. మిగిలిన దేవతలంతా దిక్కు కొకరు పారిపోయారు.

ఐరావతమునే దాని దంతాలను ఊడబెరికి భూతలంపై పడగొట్టాను.

నేను దేవదానవుల దర్పాన్ని అణచిన వాడను. నాకు రామలక్ష్మణులొక లెక్కా? కోతిమూకలు లెక్కా" అని గర్జించాడు.

శత్రు భయంకరుడైన ఇంద్రజిత్తును చూచి వివేక బలసంపన్నుడైన విభీషణుడిలా అన్నాడు:-

"నాయనా! నీవు చిన్న పిల్లవాడివి. బుద్ధి పరిపక్వం కాని వాడివి. మంత్రాంగం తెలియని వాడివి. అందువలన నీవు ప్రగల్భాలు పలుకుతున్నావు. అవి అనర్థాన్ని కలిగిస్తాయి.

ఇంద్రజిత్తూ! నీవు శత్రుభయంకరుడవే! కాదనను. కాని యుద్ధాన్ని నిర్ణయించే వయస్సులో లేవు. యుద్ధము ఇంతవరకు నిర్ణయింపబడలేదు. ఇతరోపాయాల గురించి కూడ చర్చ జరుగుతున్నది.

నీ ప్రగల్భాలు బలవంతంగా యుద్ధానికి దారితీస్తున్నాయి. నీవు కొడుకువే. కాని హితాన్ని చెప్పక శత్రువు అయినావు. యుద్ధాన్ని ఆహ్వానిస్తున్నావు.

మీ తండ్రికి రాముని వలన కలిగే ప్రమాదాన్ని గుర్తించే స్థితిలో లేవు. తండ్రి వధకు కారణమవుతున్న నీవే చంపబడవలసిన వాడవు. నీవు మూర్ఖుడివి.

రాముని బాణాలు బ్రహ్మదండంతో, యమదండంతో సమానంగా అగ్నివలె మండుతు, శత్రువులకు మృత్యువును కలిగిస్తాయి" అని తీవ్రంగా మందలించాడు.

మహారాజువైపు తిరిగి, "ధన, కనక, వస్తు, వాహనాలతో, సువర్ణ మణి భూషణాలతో సీతాదేవిని శ్రీరామునికి ఇప్పుడైనా అప్పగిస్తే మనకే ప్రమాదము లేక ఎల్లప్పుడు ఇలాగే సుఖ, శాంతులతో ఉండవచ్చు. అన్నా! నా మాట మన్నించు" మని కోరాడు.

నీకు మండోదరి ప్రియ భార్య కదా!
ఆమె పాతివ్రత్యము విలువలేనిదా?

అన్నలను వీడిన సుగ్రీవ, విభీషణులది తప్పనిపించవచ్చు కాని
అందరిని వీడి శరణు వేడవలసినది శ్రీరామునే సుమా!

# రావణ ధిక్కారము - 11

రావణుడు విభీషణుని మాటలతో దావానలం వలె మండిపోయాడు. క్రూరంగా ఆయన తన తమ్ముని చూస్తూ :-

'విభీషణా! పాలివాడు, నాగుబాము రెండు ప్రమాదకరాలు. అయితే మిత్రుడుగా నటిస్తూ, శత్రుపక్షము వహించిన నీ వంటి వాడు మరింత ప్రమాదకరుడు.

"పాలివాళ్లు తమ బంధువులు పడిపోతే నవ్వాలని ఎదురుచూస్తుంటారు. ధర్మాత్ముని బలహీనుడని, శూరుని క్రూరుడని నిందిస్తుంటారు. విషసర్పానికి మనము దూరంగా ఉండవచ్చు, కాని పాలివాళ్లు ఎప్పుడు మనతో కలిసే ఉంటారు. మనకు ఆపదలు కలుగాలని ఎదురుచూస్తుంటారు. ఆపదలు వచ్చినప్పుడు శత్రువుతో కలసి ప్రమాదాన్ని కలిగిస్తుంటారు. అందువలన పాముకంటే కూడ పాలివాడే ఎక్కువగా ప్రమాదాన్ని కలిగిస్తాడు.

విభీషణా! పద్మవనంలో తమను తమ జాతి ఏనుగుల సహాయంతో బంధించడానికి వచ్చిన మానవులతో ఆ అడవి ఏనుగులు అన్న మాటలను విన్నావా!

'మానవులారా! నిజానికి మాకు అగ్నివలన, ఆయుధాల వలన, పాశాల వలన దేని వలన కూడ భయం లేదు. మా భయమంతా మా పాలివాళ్ల (మా జాతి ఏనుగుల) వలనే. మమ్మల్ని పట్టుకొనే ఉపాయాన్ని మీకు నేర్పేది మా పాలివాళ్లే".

విభీషణా! గోవులలో సంపద, బ్రాహ్మణులలో ఇంద్రియ నిగ్రహము, స్త్రీలలో చాపల్యము, పాలివాళ్లలో పగ సహజంగా ఉంటాయి.

నేను లోకపూజ్యుడను, ఐశ్వర్యంతో, ఆభిజాత్యంతో అందరిలో అధికుడను. పాలివాడివైన నా ఆధిక్యము నీకు ఇష్టం కాలేదు.

తామర ఆకును నీటిబిందువులు అంటుకోవు. అలాగే దుర్మార్గుడు కూడ కలసి ఉన్నట్లే ఉంటారు. కాని నిజంగా కలువరు.

ఏనుగు, తన శరీరముపై మైలపోయే దాక స్నానం చేస్తుంది. కాని మళ్లీ భూమిపై ఉన్న మట్టినంతా తన శరీరము పై పోసుకొంటుంది. అలాగే దుర్మార్గుల స్నేహము కూడ అపవిత్రతనే కలిగిస్తుంది.

వర్షకాలంలో కొన్ని మేఘాలు గర్జిస్తాయి. కాని వర్షించవు. అలాగే దుర్జనులు ఆపదలలో ఆదుకొన్నట్లు నటిస్తారు. కాని నిజంగా ఆదుకోరు.

నీవు తమ్ముడివనే అభిమానం నాలో పూర్తిగా నశించలేదు. అందువలన నీ విన్ని మాట్లాడినా నేను సహించి ఊరుకుంటున్నాను. నీ స్థానంలో మరెవ్వరు మాట్లాడినా వెంటనే ఆయన తలను తెగనరికేవాడిని.

ఛీ! కులద్రోహీ! నిన్నిప్పుడే బహిష్కరిస్తున్నాను" అని కర్కశంగా విభీషణుని అవమానించి పంపాడు.

విభీషణుడు ఆ అవమానాన్ని, ఆ ధిక్కారాన్ని భరింపలేక వెంటనే రాక్షస సభా భవనాన్ని వీడి, ఆకాశంలో తన నలుగురు మంత్రులతో కలసి అన్నాడు:

"మహారాజా! నీవు నా అన్నవు. తండ్రితో సమానుడవు. నీవు నన్ను శిక్షించే అధికారము కలవాడివి. నీవు నన్ను అవమానించినందుకు నాకు ఏ కోపము లేదు.

కాని అన్నా! నీవు ధర్మాన్ని అతిక్రమించావు. కామ వశుడవయ్యావు. నా గురించి అసత్యము పలికావు. నాకు నీ పట్ల హితబుద్ధే తప్ప ఈర్ష్యాద్వేషాలు లేవు.

నేను నీకు చెప్పింది హితమే. కాని కాలవశుడవై దుర్మార్గంతో నా మాటలను నీవు చక్కగా గ్రహించలేదు.

మహారాజా! ఎప్పుడు మనకు ప్రియాన్ని పలికేవారు కోకొల్లలుగా ఉంటారు. ప్రియమైన దెప్పుడు హితము కాదు. హితమై, అప్రియము అయిన విషయాన్ని తెలుపడానికి ఎవ్వరు ముందుకు రారు. ఒకవేళ అప్రియమైన హితాన్ని చెప్పేవారు ఎవ్వరైనా ఉన్నా, దానిని విని ఆదరించేవారు లోకంలో దుర్లభులే.

సర్వభూతాలకు మరణాన్ని కలిగించే యమపాశంలో చిక్కుకొన్నవాడివి, కాలుతున్న ఇంటివలె ప్రమాదానికి గురి అవుతున్న నిన్ను వదలి వెళ్లుతున్నాను.

ఇక్కడే ఉంటూ, అగ్నిలా మండుతూ, బంగారంతో అలంకరింపబడిన రామబాణాలకు గురి అయి, మృత్యువు నోటిలో పడిన నిన్ను నాకంటితో చూడలేను. లంకలోని శూరులు, బలవంతులు, శస్త్రాస్త్రవిదులైన రాక్షసులందరు మృత్యువు నోటికి చిక్కినవారే.

ఇసుకతో కట్టిన ఆనకట్ట, నదీ ప్రవాహంలో కొట్టుక పోయినట్లే, రాక్షస వీరులందరు రామబాణ ప్రవాహంలో కొట్టుక పోక తప్పదు.

నీవు నా అన్నవు, పూజ్యుడవు. అయినా నా హిత వాక్కులు నీకు నచ్చలేదు. నన్ను పాముచంటి వాడనని, పాలివాడినని నన్ను బహిష్కరిస్తున్నానని అన్నావే? నీ మాట ప్రకారమే నిన్ను వదలి వెళ్లుతున్నాను. నీకు క్షేమము అగుగాక! లంకా నగరాన్ని, నీ వాళ్లందరిని కాపాడుకో! నీకు నచ్చని మాటలు మాట్లాడినందుకు, నిన్ను వదలి వెళ్లుతున్నందుకు క్షమించు.

"ప్రమాదాన్నుండి నిన్ను కాపాడాలనుకొని నేను చెప్పిన హిత వాక్యాలు మరణ మాసన్నమైన వారివలె నీవు పట్టించుకోలేదు. ఇక నేను వెళ్లి పోతున్నాను. నాలా ఎప్పుడు నీకిష్టము కాని మాటలను చెప్పేవాడి బాధ ఇక నీకుండదు. నీవు నిశ్చింతగా ఉండు. నీకు ఇష్టమైన వాళ్లందరితో కలసి హాయిగా ఉండు. ఇక సెలవు" అని అన్నకు నమస్కరించి వెళ్లాడు.

ఈ విధంగా రావణునితో అవమానింపబడి కూడ తన మాటలు ఆయనకు రుచించవని తెలిసి కూడ, విభీషణుడు కఠినమైన మాటలు వినిపించి, తక్షణమే లంకను వదిలి శ్రీరామలక్ష్మణులున్న సముద్రోత్తర తీరానికి చేరుకొన్నాడు.

నీ విజయగాథలేవో నీవు చెప్పుకొంటావు. కాని కవులు నీ కడుపులోని పేగులను మెడలో వేసికొంటారు.

"రిపు శక్తి నెప్పుడును తక్కువ సేయగ రాదెరుంగకన్"

వెనుకన్ వ్రాలుచున్న కపివీరుల ... వ్రేళ్ల యొక్క సందున నలుపంగ - ఇదికన్నది, విన్నది గాక యుండగన్"

మరింత పిచ్చి క్షుధ యిచ్చినందుకే పెద్ద చింత

# విభీషణ శరణాగతి - 12

శరణాగతి ఆరు లక్షణాలతో కూడుకొని ఉంటుంది.

"అనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్!
రక్షిష్యతీతి విశ్వాసో! గోప్తృత్వ వరణంతథా
ఆత్మనిక్షేప కార్పణ్యే షడ్విధాశరణాగతిః"

1. అనుకూలమైన దానిని సంకల్పించు కోవడం (అనుకూల్యస్య సంకల్పః)
2. ప్రతి కూలమైన దానిని వదలడం (ప్రాతికూల్యస్య వర్జనమ్)
3. అనుకూలుడు తనను రక్షిస్తాడనే నమ్మకము (రక్షిష్యతీతి విశ్వాసో)
4. రక్షించుమని కోరడం (గోప్తృత్వ వరణంతథా)
5. ఆత్మను సమర్పించుకోవడం (ఆత్మనిక్షేపః)
6. తన దగ్గర ఏదిలేదని అనుకోవడం (కార్పణ్యము)

**అనుకూలనిస్య సంకల్పః**

1. విభీషణడు తనకు తన వాళ్లందరికి శ్రీరామాశ్రయము అనుకూలమని భావించాడు. తన వాళ్లందరికి రామాశ్రయము అత్యవసరమని నొక్కిచెప్పాడు. అయితే విభీషణుని హిత వాక్యాలు, రావణుని ముందు, ఆయనవారి ముందు "చెవిటి వాని ముందు శంఖును ఊదినట్లు" వ్యర్థమయ్యాయి. అంతే కాదు పాలివాడని, పరవాడని ఆయననందరు ప్రతికూలునిగా భావించాడు.

2. ప్రాతికూల్యస్య వర్జనమ్ : రావణాదులందరు ప్రకృతి వ్యామోహంలో పడి పోయారు. ప్రకృతి వ్యామోహము భగవంతుని పట్ల ద్వేషాన్ని పెంచుతుంది. రావణాదు లందరికి రామద్వేషము ప్రబలింది.

భగవద్వేషము భాగవతోత్తమునికి ప్రతికూలమైనది. శ్రీ రాముని దూషించే రావణాదులందరు ప్రపన్నుడై, పరమ భాగవతోత్తముడైన విభీషణునికి ప్రతికూలు లయ్యారు. ప్రతి కూలురైన వారినందరిని విభీషణుడు వదలుకొన్నాడు.

"వరం హుతవహజ్వాలా । పంజరాంతర్వ్యవస్థితిః ।
నశౌరి చింతా విముఖ । జన సంవాసవైశసం"

శౌరి చింతాలాప విముఖులతో కలిసి ఉండడము కంటే కాలిపోయే పంజరములో ఉన్నా మంచిదే.

ఈ విధంగా రామాశ్రయము తనను ఉద్ధరిస్తుందని సంకల్పించడం, దానికి విముఖులైన రావణాదులందరిని వదిలి వెళ్లడమనే శరణాగతిలోని రెండు లక్షణాలు విభీషణునిలో బలంగా వేళ్లూనాయి.

ఇక మూడవ లక్షణం:- "రక్షిష్యతీతితి విశ్వాసః" తాను ఆశ్రయించబోయే శ్రీ రాముడు తనను తప్పక రక్షిస్తాడని గాఢంగా నమ్మడం.

"సుగ్రీవ, జటాయువుల శరణాగతి విషయాన్ని, వాళ్లను రాముడు రక్షించి వాళ్లు కోరిన ఫలాలను కల్గించడాన్ని" విభీషణుడు విని ఉన్నాడు. అందువలన ఆయన శ్రీరామ రక్షణ పట్ల గట్టి నమ్మకంతోనే ఉన్నాడు. ఆ నమ్మకంతో ఆయన తన వారినందరికి రాముని ఆశ్రయించుమని గట్టిగా చెప్పాడు. వాళ్లు వినలేదు. అయినా తన విశ్వాసం తగ్గలేదు. ఆ విశ్వాసం ఆయనకు గట్టిగా లేకపోతే తన వాళ్లందరిని వదలివెళ్లేవాడా ? "ప్రయోజన మనుద్దిశ్య! నమందోపి ప్రవర్తతే" లాభం లేదనుకొన్న పనిని పిచ్చివాడు కూడ చేయడు కదా !

"వివేకంలో విభీషణుడు బృహస్పతితో సమానుడు" అని వాల్మీకే ప్రసుతించాడు.

"అందువలన రాముడు తనను తప్పక రక్షిస్తాడు" అనే ప్రబల విశ్వాసము (శరణాగతిలో మూడవ లక్షణం) విభీషణనిలో ఉంది.

ఇక నాలుగవ లక్షణము "గోప్తృత్వవరణము":- అనగా రక్షకుడైన రాముని ఆశ్రయించుట. ఈ నాల్గవ లక్షణమైన రాముని ఆశ్రయించడాన్ని, ఆతరువాత కావలసిన ఆత్మనిక్షేపము, కార్పణ్యము అనే లక్షణాలు ఇక ముందు వివరింపబడుతున్నాయి.

రావణుని వదలి తక్షణమే రామలక్ష్మణులు (ఇద్దరు) ఉన్నచోటికి (యత్రరామస్స లక్ష్మణః) విభీషణుడు నలుగురు మంత్రులతో కూడ చేరాడు.

విభీషణునికి కావలసింది రాముని ఆశ్రయించడం (గోప్తృత్వవరణము). అప్పుడు రాముడు ఉన్నచోటికి (యత్రరామః) విభీషణుడు వచ్చాడని తెలుపక లక్ష్మణునితో సహా రాముడున్న చోటికి (యత్ర రామఃసలక్ష్మణః) అని చెప్పడం దేనికి మధ్యలో లక్ష్మణుని ప్రసక్తి ఎందుకు?

లక్ష్మణ ప్రసక్తికి రెండు కారణాలు ఉన్నాయి.

1) లక్ష్మణుని విడిచి రాముడు చిన్నప్పటి నుండి కూడ వేరుగా లేదు (బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధః) భవిష్యత్తులో కూడ దుర్వాసుని శాపం వలన తనకు దూరమైన లక్ష్మణునిని విడిచి ఉండలేక వెంటనే శ్రీరాముడు తన అవతారాన్ని చాలిస్తాడు.

2) శరణాగతి ఎప్పుడైనా పురషకారము ఉంటేనే తప్పక ఫలిస్తుంది. "పురుషకార మంటే" శ్రీరామునితో పని చేయించే శక్తి. సీతాదేవి ఉన్నప్పుడు ఆమే "పురుషకారము"గా ఉండేది. ఇప్పుడు లక్ష్మణుడే పురుషకార స్వరూపము.

"తనను అడవులకు తప్పక తీసికవెళ్ల వలసిందే" అని శ్రీరాముని లక్ష్మణుడు శరణువేడింది కూడ సీతాదేవి శ్రీ రాముని ప్రక్క ఉన్నప్పుడే

"సీతామువాచాతియశాః రాఘవంచదృఢవ్రతం"

ఇప్పుడు విభీషణుడు ఆశ్రియిస్తే కూడ పురుషకారాన్ని కలిగించే లక్ష్మణుడు రాముని ప్రక్కనే ఉన్నాడు.

అమ్మగారి తరువాత "పురుషకారాన్ని" అందించేది ఆచార్యుడైన లక్ష్మణుడు, సుగ్రీవాది భాగవతోత్తములు.

శరణువేడడానికి ఒక మంచి స్థలాన్ని చూచుకోవాలా? అంటే అక్కర లేదు. భగవత్ భాగవతాచారార్యులు ఉన్న చోటే మంచి స్థలము (దివ్యదేశము)

"సుభగశ్చిత్ర కూటోసౌ। గిరి రాజోపమో గిరిః

యస్మిన్ వసతి కాకుత్థ్సః। కుబేర ఇవనందనే"

నందనవనంలో కుబేరుడు ఉన్నట్లు ఎక్కడ రాముడు ఉన్నాడో ఆచిత్రకూట పర్వతము హిమవత్పర్వముతో సమానమైనది "సాకాశీతి నచాకశీతి" కాశీనగరము కూడ భాగవతోత్తములు లేకుంటే వెలవెలబోతుందట.

అలాగే భాగవతోత్తముడు అయిన లక్ష్మణుడు ప్రక్కలో లేకుంటే భగవంతుడైన రాముని ఆశ్రయించడం కూడ తగినది కాదు.

అందుకే "యత్రరామఃసలక్ష్మణః" అన్నట్లు పురుషకార స్వరూపుడైన, భాగవతోత్తము డైన లక్ష్మణునితో పాటు శ్రీరాముడున్న చోటుకు రామాశ్రయాన్ని కోరుకొంటున్న విభీషణుడు వెళ్లాడని తెలుపబడింది.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న కలుగుతుంది. "తనను బాల్యం నుండి ఇంతవరకు పోషించిన తండ్రి వంటి అన్నను ఆపదలో వదలి రావడము న్యాయమా?"

దీనికి రెండు సమాధానాలు ఉన్నాయి. 1) తనకంటె పెద్ద వారైనప్పటికి వారు అహంకారంతో కార్యాకార్యాలు తెలియక ప్రవర్తిస్తే వారిని కూడ ధర్మమార్గంలో రప్పించడానికి వారిని మందలించవచ్చు. శిక్షించడం కూడ చేయవచ్చు.

గురోరప్యవలిప్తస్య । కార్యాకార్య మజానతః।

ఉత్పథం ప్రతిపన్నస్య । కార్యంభవతి శాసనం।

పెద్దవారిని శిక్షించడం మంచిదికాదనుకొంటే వారిని మందలించి వదలి వేయచ్చు "పరిత్యాగో విధీయతే" ఇది లౌకిక సమాధానము

రెండవ సమాధానము వేదాంత పరంగా లభిస్తుంది.

అన్నను, తండ్రిని పెద్దలను అనుసరించడం సామాన్య ధర్మము. సాక్షాత్తుగా లోకపిత అయిన పరమాత్మను ఆశ్రయించడం విశేషధర్మము. ఈ విశేషధర్మాన్ని అనుసరించే లక్ష్మణుడు కన్నతండ్రి అయిన దశరధుని వదలి జగత్పిత అయిన రాముని అనుసరించాడు.

"అహంతావన్మహారాజే । పితృత్వం నోపలక్షయే

భ్రాతా భర్తాచ బంధుశ్చ । పితాచ మమరాఘవః"

"భార్యా వ్యామోహ బద్ధుడైన దశరధ మహారాజును నేను తండ్రిగా అనుకోవడంలేదు. నాకు అన్న ,భర్త, బంధువు, తండ్రి అన్ని మా రామచంద్రుడే."

పరమాత్మతో మనకు నవవిధ సంబంధాలు ఉంటాయి. "అన్న, భర్త, బంధువు, తండ్రి" అని చెప్పడం మిగిలిన సంబంధాలను సూచించడంకొరకే.

అలాగే విభీషణునికి, మండోదరి మొదలైన రాక్షసుల జాతివారికి కొందరికి, శ్రీరామచంద్రుడు ధర్మ సంస్థాపన కొరకు నరుడుగా అవతరించిన పరమాత్మ అని తెలుసు.

అందువలననే "పరమాత్మాశ్రయం" అనే విశేష ధర్మాచరణ కొరకు విభీషణుడు అన్నను అనుసరించడమనే సామాన్య ధర్మాన్ని వదలుకొన్నాడు. అయితే ముందు సామాన్య విశేషధర్మాలను రెండింటిని ఆచరించాలని ప్రయత్నించాడు. అన్నకు ఎన్నో విధాల నచ్చజెప్ప చూచాడు. రావణుడు ఆ సామాన్య ధర్మాచరణ మార్గాన్ని పూర్తిగా

మూసివేశాకే విభీషణుడు విధిలేక అన్నను పూర్తిగా వదిలివెళ్లాడు. దానితో విభీషణుడు అన్నకు ద్రోహం చేశాడనే అపవాదానికి అవకాశములేదు. "విభీషణస్తుధర్మాత్మా" అనే ఖ్యాతి ఏర్పడింది. విభీషణుడు చేసింది ధర్మమే అని స్పష్టమైంది.

2) ఇక్కడ మరొక ప్రశ్న తల ఎత్తుతుంది. "విశేష ధర్మాన్ని ఆచరించే విభీషణుడు శ్రీరాముని రాజ్యాభిలాషతో ఎందుకు ఆశ్రయించాడు?"

శ్రీరామచంద్రుని ఆశ్రయించేప్పుడు విభీషణునికి రాజ్యకాంక్షలేదు. "త్యక్త్వాదారాంశ్చ పుత్రాంశ్చ !రాఘవంశరణంగతః" నాభార్యా పిల్లలందరిని వదలి రాఘవుని శరణు వేడుతున్నానని" విభీషణుడు తన వైరాగ్యాన్ని ప్రదర్శించాడు.

"పరిత్యక్తా మయాలంకా । మిత్రాణి ధనానిచ

భవద్గతంమే రాజ్యంచ । జీవితంచ సుఖానిచ॥"

"నేను లంకానగరాన్ని, మిత్రులను, ధనాలను వదలివచ్చాను. రామచంద్రా ! నా రాజ్యము, జీవితము, సుఖాలన్ని నీ ఆధీనాలే" అని చెప్పుతాడు.

అయితే అన్నిటిని వదలుకొన్నవాడు సముద్ర తీరంలో శ్రీరాముడు తనకు పట్టాభిషేకం చేయాలనుకొన్నప్పుడు ఎందుకు వద్దన లేదు ?

శ్రీరాముడు సర్వతంత్ర స్వతంత్రుడు. విభీషణునికి ఆశ్రయమివ్వడమే కాక, ఆయనకు లంకా నగర సామ్రాజ్యాన్ని కూడ ఇస్తానని తన సంకల్పాన్ని కూడ శ్రీరాముడు తెలిపాడు.

భగవత్సంకల్పాన్నికాదనడానికి ఎవ్వరికి వీలవుతుంది?

అందుకే రాజ్యపాలన తన మనస్సులో లేకున్నా, రాముని ప్రయత్నాన్ని నివారించలేక పోయాడు విభీషణుడు. ఇంకొక ముఖ్య విషయాన్ని కూడ ఇక్కడ మనము గమనించాలి.

యజ్ఞయాగాది సత్కర్మలను ఆచరించేవారికి స్వర్గాది ముఖ్యఫలాలేవో ఉంటాయి. అయితే అవి లభించాలంటే ఆ యజ్ఞాలు నిర్విఘ్నంగా పరిసమాప్తి కావాలి. దాని కొరకు ఆయుష్యము, ఆరోగ్యము, పుష్కలమైన ధనముకావాలి.

"అందువలననే యజ్ఞారంభంలో యజమానికి అవన్ని ఉండాలని వేదవేత్తలు ఆశీర్వదిస్తారు. వీటిని అవాంతర ఫలాలు అంటారు. వీటిని యజమాని కోరుకోలేదు. కోరుకొన్నది స్వర్గము మాత్రమే. అయితే ఆ ప్రధాన ఫలము లభించాలంటే అవాంతర ఫలాలు కూడ తప్పక కలుగాలి."

అలాగే అన్ని అవాంతర ఫలాలైన రాజ్యాదులు, విభీషణుని వంటి ప్రపన్నులకు

భగవత్ప్రాప్తి అనే ప్రధాన ఫలంతో పాటు భగవత్కృ వలన లభిస్తాయి.

"ఆయురారోగ్య మర్ధాంశ్చ। భోగాంశ్చైవానుషంగికాన్।

దదాతి ధ్యాయతాం నిత్యం । అపవర్గ ప్రదోహరిః"

భగవంతుడు ప్రపన్నులకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అంత మాత్రాన మిగిలిన అవాంతర ఫలాలను శ్రీహరి ప్రసాదించడని ఎక్కడలేదు. సర్వఫల ప్రదాత ఆయనే.

అయితే మరి హనుమ "విభీషణుడు రాజ్యాశతో శ్రీరాముని ఆశ్రయింపవచ్చాడని సుగ్రీవాదుల ముందు తెలిపాడు కదా!

"రాజ్యం ప్రార్థయమానస్తు। బుద్ధి పూర్వక మిహాగతః"

అలా ఎందుకు హనుమ అన్నాడు?

హనుమ ఆ మాట అనడానికి ముఖ్య కారణము సుగ్రీవుని శాంతింపజేయడానికి! సుగ్రీవుడు విభీషణుని రాకను సహించలేదు. విభీషణుడు శత్రుపక్షం నుండి వచ్చాడు. ఆయుధాలన్ని వెంట తెచ్చుకొన్నాడు. తనకు సహాయంగా సమర్థులను నలుగురిని తోడు తెచ్చు కొన్నాడు. కనుక ఆయనను అన్ని రకాల అనుమానింపవలసిందే. "అస్మాన్ హంతుం నసంశయ:"మనను చంపడానికే వచ్చాడు. ఇందులో అనుమానమేలేదు. అందువలన ఆయనను రానివ్వవద్దు. వెంటనే విభీషణునిని మంత్రులతో సహా వధించవలసిందే "తస్యాహం నిగ్రహం మన్యే" అని ఆగ్రహంతో అన్నాడు. ఆయన కోపం చల్లార్చడం కొరకే "విభీషణుడు మనను చంపరాలేదు. రాజ్యాశతో శరణవేడవచ్చాడని" హనుమ తెలిపాడు.

శ్రీరాముడు కూడ సుగ్రీవునికి నచ్చ చెప్పుతూ, "రాజ్యకాంక్షీ విభీషణ: " అని పలికాడు.

ఈ ఇద్దరి మాటల వలన సుగ్రీవుడికి విభీషణుడిపై కోపం పోయింది. తనలాగే రాజ్యకాంక్షతో విభీషణుడు శ్రీ రాముని శరణువేడడం తప్పుకాదనుకొన్నాడు. పైపెచ్చు విభీషణుని సహాయంతో రావణవధ సులభమౌతుందని సంతోషించాడు.

3) అది సరే ! రాజ్యకాంక్ష మనస్సులో బొత్తిగా లేని విభీషణుడు రావణవధ తరువాత తనవాళ్లెవరికో పట్టాభిషేకము చేయించి తాను రామపాదసేవతో లక్ష్మణునివలె తరించ వచ్చు కదా! అవును. లక్ష్మణుని వలె విభీషణుడు కూడ శ్రీ రామచంద్రుని శ్రీచరణ సేవనే కొరుకొన్నాడు.

అయితే రావణవధానంతరము విభీషణుడు తప్ప రాజ్యానికి వారసులెవ్వరు మిగుల లేదు. అప్పుడు లంకారాజ్యానికి రాజెవ్వరు కావాలి ?

"అతఏవరాజానంత్వాం । కరిష్యామీతి బ్రువతో

రామస్య ప్రతివచన । మనుక్త్వా పరిచరణ

మాత్రమేవ విభీషణః ప్రార్థయామాసతత్పరః"

శ్రీరాముడు విభీషణుని పిలిచి నిన్ను రాజును చేస్తానని అంటుంటే, శ్రీరాముడికి సమాధానము చెప్పకనే విభీషణుడు శ్రీరామ పాదసేవ కావాలని ప్రార్థించాడు.

అయితే శ్రీరాముడు విభీషణునికి "తనచరణకైంకర్యమే" ప్రధానోద్దేశ్యమని గ్రహించి కూడ విభీషణుని కోరికను పట్టించుకోక విభీషణుని లంకాధిపతిగా నియమించాడు.

భరతునికి అయోధ్యాపాలనము ఇష్టమైందా ? ఆయన ఎంత వద్దని వేడుకొన్నా శ్రీరాముడు ఊరుకున్నాడా ? తాను తిరిగి వచ్చేదాకా పదునాల్గేండ్లు అయోధ్యను పాలించవలసిందే అని శాసించిపంపాడు కదా!

అలాగే విభీషణుని పిలిచి "శాసితస్త్వంసఖిత్వేన ! కార్యంతేమమ శాసనం ! ప్రజా సంరక్షధర్మేణ! నోత్తరం వక్తుమర్హసి" నీవు రాజువై ప్రజాసంరక్షణ చేయాలని నా ఆజ్ఞ. నాశాసనాన్ని మీరవద్దు. ఇంకో మాట మాట్లాడకు" అని రామాజ్ఞఅయింది. ఏమి చేయగల్గుతాడు విభీషణుడు? శ్రీరామచంద్రుని ఆజ్ఞా పాలనమే రామకైంకర్యమని భావించాడు అప్రపన్న శేఖరుడు.

4) అయితే "రాజ్యపాలనమనే" ఆనుషంగిక ఫలంతోనే విభీషణుడు తృప్తి చెందాడా? లేక ఆయన ప్రధానఫలమైన రామ సేవాఫలము ఆయనకు లభించిందా?

ఏ సత్కర్మ అయినా ప్రధాన ఫలాన్ని కల్గించక పూర్తికాదు. విభీషణ శరణాగతి కూడ ఆయనకు రామసేవాఫలాన్ని"అనుగ్రహించింది.

శ్రీరాముడు తన పట్టాభిషేకం తరువాత సుగ్రీవాదులందరికీ వారి కోరికలకు తగినట్లు సన్మానాలను చేసి పంపాడు. విభీషణుని కోరికను అనుసరించి "ఆయనకు కులధనాన్ని" ప్రసాదించాడు. "కులధనమను" మాటకు తిలకమహేశ్వర తీర్థులు "లంకా సామ్రాజ్యమనే" అర్థము చెప్పినా, శ్రీ రాముడు విభీషణునికి తన (ఇక్ష్వాకుల) కులధనాన్ని "శ్రీరంగనాధుని అర్చ్యా మూర్తిని" ప్రసాదించాడని, గోవిందరాజులు, రామానుజీయ వ్యాఖ్యాకారులు తెలిపారు.

తిలక మహేశ్వర తీర్థులు కూడ శ్రీ రాముడు తన అవతార పరిసమాప్తి సమయంలో విభీషణుని పిలిచి "తమకులధనమైన శ్రీరంగనాథ స్వామిని అనుగ్రహించాడని అంగీకరించారు.

శ్రీ రంగనాథుని ఆరాధననే శ్రీరామ చంద్రస్వామి ఆరాధనగా భావించి విభీషణుడు తృప్తి పడ్డాడు. శ్రీరంగనాథ, శ్రీరామచంద్రులిద్దరు శ్రీమన్నారాయణుని అవతారాలే! శ్రీరంగానాథుడు అర్చ్యావతారము కాగా, అప్పుడు శ్రీరాముడు విభవావతారము. ఎవ్వరి ఆరాధన అయినా ఒకటే అని ధర్మజ్ఞుడైన విభీషణుడు భావించి, తృప్తి పడి ఉంటాడు.

"విభీషణుడు ఏ కోరికతో రాముని శరణువేడాడు" అనే విషయాన్ని పూర్తిగా వివరించ డానికి రాబోయే (ముందు)ఘట్టాలను కూడ పరిశీలించాలి.

ఇప్పుడు తిరిగి వర్తమానం లోకి వద్దాము! విభీషణుడు నలుగురు మంత్రులతో కూడ శ్రీ రాముడు ఉన్న సముద్ర (ఉత్తర) తీరంలోకి వచ్చి, ఆకాశంలో నిలబడి ఉండగా వానర వీరులందరు వాళ్లను చూచారు.

"అయిదుగురు వర్షమేఘాలవలె నల్లగా ఎత్తుగా ఉన్నారు. అందరు ఆయుధాలను దివ్యాభరణాలను ధరించారు.

విభీషణుడు మేరు శిఖరంవలె ఎత్తుగా రత్నకాంతులతో మెరుస్తున్నాడు. ఆకాశంలో వారు కదులుతున్న విద్యుత్తువలె ఉన్నారు." మహా పరాక్రమవంతుడైన సుగ్రీవుడు వారిని చూచి, అనుమానించి హనుమదాదులతో ఇలా అన్నాడు.

"ఈ రాక్షసుడెవ్వడో సర్వాయుధాలను ధరించి, నల్గురు రాక్షసులతో మనను చంపడానికి వస్తున్నాడు." ఒక్కొక్కరు అనేకాయుధాలను ధరించి ఉండవచ్చు. లేదా ఒక్కొక్కరు ఒక ఆయుధాన్ని ధరించి ఉండవచ్చు అయినా రాముని పట్ల ప్రేమతో ఒక్కొక్కరు అనేకాయుధాలను ధరించినట్లు సుగ్రీవునికి అగుపడి ఉండవచ్చు.

సుగ్రీవుని మాటలను విని వానరులందరు మహాశిలలు, మద్దిచెట్లు ధరించి ఆయనతో అన్నారు. "మహారాజా! మీ ఆజ్ఞ అయితే ఈ దుర్మార్గులను, అల్ప ప్రాణులను ఇప్పుడే హరిస్తాము."

వానరుల మాటలను విని ఆకాశంలోనే ఆగి పోయారు విభీషణాదులు. "ఎలాగు రాముడున్న చోటికి రానే వచ్చాము కదా! తొందరెందుకు?" అనుకొన్నారు. అంతేకాదు వారిభయము తీరేలా తమ విషయాన్ని తెల్పుదామనుకొన్నారు.

"రావణుడనే దుర్మార్గుడు రాక్షసులకు ప్రభువుగా ఉన్నాడు. ఆయన తమ్ముడిని విభీషణుడను నేను.

రావణుడు జనస్థానంలో జటాయువును సంహరించి సీతను అపహరించాడు. ఆమె దీనంగా విలపిస్తూ లంకలో రాక్షస స్త్రీల మధ్య "పెద్దపులుల మధ్య లేడిపిల్లలా" ఉంది.

రావణుని నేను ఎన్నో మారులు అనునయించి "సీతాదేవిని శ్రీరామునికి అప్పగించుమ"ని తెలిపాను. ఆయన వస్తువును ఆయనకు అప్పగిస్తే రామునితో రణము చేయాల్సిన పనిలేదని చెప్పాను.

మరణమాసన్నమైన వానికి మందులు రుచించనట్లు, మృత్యుచోదితుడైన మా అన్నకు నా మాటలు రుచించలేదు. ఆయన నన్ను నీచంగా నిందించాడు. దాసునివలె అవమానించాడు.

ఆయనతో ఇక కలిసి ఉండడము వినాశానికి దారి తీస్తుందని గ్రహించి నాభార్యా పిల్లలను, బంధుమిత్రులను అందరిని వదులుకొని శ్రీరామచంద్రస్వామిని ఆశ్రయించడానికి వెంటనే వచ్చాను.

సర్వలోకాలకు శరణునిచ్చేవాడు, మహాత్ముడైన శ్రీరామునికి విభీషణుడు శరణుకోరి వచ్చాడని నివేదించండి"

ఇక్కడ విభీషణుడు రాముని ఆశ్రయించిన పద్ధతిని పరిశీలిద్దాము .

1) "పెరుమాళ్ల సన్నిధికిగాని, పెద్దల సన్నిధికిగాని వెళ్లినప్పుడు తమ తక్కువదనాన్ని మనవి చేసికోవాలి. దానినే సంప్రదాయంలో "నైచ్యానుసంధానము " అంటారు .

యామున మునులు తమ "స్తోత్ర రత్నంలో" నైచ్యాను సంధానాన్ని వివరించారు. 1) "అమర్యాద :క్షుద్రః", 2) "నధర్మనిష్ఠోస్మి"అనే శ్లోకాలలో. శరణువేడేవాడు తన గూర్చి "మర్యాదలేనివాడిని, క్షుద్రుడిని చలమతిని, ధర్మము చేయనివాడిని, ఆత్మజ్ఞానం లేనివాడినని" చెప్పుకోవాలి. విభీషణుడు కూడ " రావణోనామదుర్వృత్తః। రాక్షసో రాక్షసేశ్వరః! తస్యాహమవరో భ్రాతా! విభీషణ ఇతిశ్రుతః"

"దుర్మార్గుడైన రావణుడనే రాక్షసేశ్వరుని తమ్ముడిని" అని చెప్పుకొన్నాడు.

2) అలాగే శరణిచ్చేవారి ఘనతను ప్రస్తుతించాలి. విభీషణుడు శ్రీరాముని గూర్చి "సర్వలోకాలకు ఆశ్రయాన్నిచ్చేవాడు, మహాత్ముడని" పేర్కొన్నాడు పరమాత్మ అయిన రాముని ముందు సుగ్రీవాది భాగవతోత్తముల ముందు!

3) ఇక తాను శరణువేడే విధానాన్ని వివరిస్తున్నాడు:- "త్యక్త్వాదారాంశ్చ పుత్రాంశ్చ" తన వారందరిని వదిలిపెట్టి వచ్చానని, తనను రక్షించుకోవడానికి తన దగ్గర ఏమీలేదని (ఆకించిన్యము), తనవారెవ్వరు లేరని (అనన్యగతిత్వము)". ఈ రెండే శరణాగతునికి కావలసిన ముఖ్య లక్షణాలు

4) "శరణాగతిని పాటించడంలో మరొక ముఖ్య విషయాన్ని కూడ విభీషణుడు మరువలేదు. శ్రీ రాముడు వానరుల మధ్య ఉండి దర్శనమిస్తూనే ఉన్నాడు. కాని విభీషణుడు తన అనుచరులతో కలిసి నేరుగా రాముని దగ్గరికి వెళ్లి హఠాత్తుగా ఆయన పాదాలపై పడిపోలేదు.

"నివేదయత మాం క్షిప్రం ! విభీషణముపస్థితం"

"సుగ్రీవాదులారా! విభీషణుడు వచ్చి ఉన్నాడని దయతో శ్రీరామునికి నివేదించండి" అని కోరాడు. అంటే రామ పరమాత్మ దగ్గర ఉన్న సుగ్రీవాది భాగవతోత్తముల సహాయాన్ని (పురషకారాన్ని) అర్థించాడు. అయితే సుగ్రీవాదులు ఇప్పుడే స్థితిలో ఉన్నారు? విభీషణుని చంపేంత కోపంలో ఉన్నారు. అటువంటి వారి సహాయాన్ని అపేక్షిస్తున్నాడు.

సంరక్షించినా, సంహరించినా వారే దిక్కు అంటున్నాడు, వారికి తాను పరతంత్రుడను అని చెప్పుకొంటున్నాడు.

"భాగవతాచార్య విధేయతే జీవుడి ముఖ్యలక్షణము కదా!"

ఈ విధంగా విభీషణుని శరణాగతిలో ఏ కొరతలేదు. అది సంపూర్ణశరణాగతి. శ్రీమద్రామాయణంలో దేవతలు బ్రహ్మదేవునితో సహా పరమాత్మను శరణువేడడంతో ప్రారంభమై విభీషణుని శరణాగతి వరకు ముగుస్తుంది. అందుకే శ్రీమద్రామాయణంలో విభీషణుని శరణాగతే ఉత్తమోత్తమము. అందుకే అది వెంటనే ఫలించింది.

5) తన గురించి "క్షిప్రంనివేదయతమాం" వెంటనే శ్రీరామునికి నివేదించుమని విభీషణుడు కోరాడు. అంటే శరణు కోరేవారికి శరణ్యుడు వెంటనే కావాలని తొందర ఉంటుంది. దీనినే "ప్రాప్యత్వర" అంటారు.

6) గజేంద్రుడు మొదట కొంత కాలము బలగర్వంతో మొసలితో పోరాడి, చేతగాక తనను రక్షించుమని "మూలమూలేతిఖిన్నే" అని మూలస్వరూపుడైన పరమాత్మను శరణు

వేడుతాడు. ఇంతకు శరణాగతికి ఫలంగా గజేంద్రుడు కోరుకొన్నది తన ప్రాణరక్షణ కొరకు కాదట "కరస్థ కమలాన్యేవ పాదయోరర్పితుం తవ" తన కరం (తొండం)లోని కమలాలు వాడిపోక ముందే పరమాత్మ శ్రీపాదాలపై సమర్పించడం కొరకట

శరణాగతి ఫలము భగవత్కైంకర్యమే! అదివెంటనే కావాలి. అది లభించడానికి వెంటనే శరణాగతి చేయాలి. క్షణం ఆలస్యమైతే శరణాగతి చేయాలనే కోరిక మారి పోవచ్చు. అందుకే "యదహరేవ విరజేత-తదహరేవ ప్రవ్రజేత" అంటుంది శాస్త్రము. వైరాగ్యమెప్పుడు కలిగితే అప్పుడే సన్యసించాలట.

దాహం కలిగిన వాడికి త్రాగేనీరు లభించగానే వెంటనే త్రాగాలి కాని తరువాత త్రాగుతాములే అని ఊరకుంటే బాగుంటుందా ? అందుకే క్షిప్రంనివేదయత" వెంటనే తెలుపండి అన్నాడు.

విభీషణుని మాటలు విన్న సుగ్రీవుడు వెంటనే లక్ష్మణ సమేతుడైన రాముని దగ్గరకు వెళ్లి "రావణాసురుని తమ్ముడు విభీషణుడట నలుగురు మంత్రులతో సర్వాయుధాలు ధరించి ఆకాశంలో ఉన్నాడు. ఆయన మిమల్ని శరణువేడడానికి వచ్చాడట".

మీరు ఏదో ఉపాయంతో, ఏదైనా ఆలోచనతో చారులను పంపో, పరీక్షించి విభీషణుని గురించి నిర్ణయము తీసికోవాలి" అని చెప్పి ముందుగా తన ఆలోచన రాముని ముందు ఉంచుతున్నాడు.

"వచ్చినప్పటి నుండి విభీషణాదులు ఆకాశంలోనే నిలిచి ఉన్నారు. వారు కామరూపులు. వారు శత్రువు దగ్గరి నుండి వచ్చారు. వారు కపట వీరులు. మన మధ్యలో చేరి, మనకే ప్రమాదం కల్పిస్తారు.

వారు రావణుని వదలి నిన్ను శరణు కోరి వచ్చామంటున్నారు. కాని వారిని అలా నటించుమని రావణుడే పంపి ఉండవచ్చు. రాక్షసులు పాపబుద్ధులు. వారిని విచారించకుండా మన మధ్యకురానిస్తే "అవకాశం చూచి గుడ్లగూబ, కాకి పిల్లలను పొట్ట పెట్టుకున్నట్లు" మనలో కొందరు అల్పబలులైన వారిని సంహరించవచ్చు. అందువలన ఆయనను తీవ్రంగా దండించి వధించాలి" అని వాక్యజ్ఞుడైన సుగ్రీవుడు వాక్యకుశలుడైన శ్రీరామునితో పలికి మౌనం దాల్చాడు.

మహాకీర్తిమంతుడైన శ్రీరాముడు సుగ్రీవుని పలుకులను శ్రద్ధగా పూర్తిగా విని హనుమదాదులతో అన్నాడు.

"విభీషణుని గురించి వానరరాజు యొక్క యుక్తియుక్తాలైన మాటలను మీరందరు వినే ఉంటారు. ఆయన నా శ్రేయస్సును కోరి ఈ మాటలను పలికాడు.

"అయితే ఇంతమందిలో ఆయన అత్యంత సమర్థుడైనప్పటికీ ఆయన ఒక్కని మాటలను మాత్రమే వినడం కాక మీ అందరి అభిప్రాయాలను వినాలను కొంటున్నాను. మీమీ అభిప్రాయాలను స్పష్టంగా మొగమాటం లేకుండా తెలుపండి".

అప్పుడు వానర ప్రముఖులు తమ అభిప్రాయాలను శ్రీరాముని హితము కోరి జాగ్రత్తగా తెలుపసాగారు.

"రామచంద్రా" "కృత, అకృత, అకృతాకృతా"లనే మూడు లోకాలలో నీకు తెలియనది లేదు. నీకన్ని తెలిసి కూడ మాపై ప్రేమతో మా అభిప్రాయాలను అడుగుతున్నావు.

రామభద్రా! నీవు సత్యవ్రతుడవు, మహాశూరుడవు, ధార్మికుడవు, ధృఢపరాక్రముడవు, చక్కని విమర్శకుడవు అయినా మిత్రుల అభిప్రాయాలకు చాల విలువ ఇచ్చి అడుగు తున్నావు. అందువలన ఈ వానరులలో ఒక్కొక్కరు తమ తమ అభిప్రాయాలను స్పష్టము చేద్దుర్గాక " అని సుగ్రీవుడు పలికాడు.

సుగ్రీవుని ఆజ్ఞతో అంగదుడు ముందుగా లేచి, "విభీషణుని పరీక్షింపవలసిందే! ఎందుకంటే శత్రువుల నుండి వచ్చిన వారిని అనుమానింపక వదలకూడదు. మోసకాళ్లు ఎప్పుడు తమ బుద్ధిని సులభంగా బయట పెట్టరు. ఎదుటివారి బలహీనతలను గ్రహించి పైబడుతారు. అప్పుడు చాల ప్రమాదం కలుగుతుంది.

అందువలన మంచి చెడులను విచారించి పనులను చేయాలి. ఒక వేళ విచారణలో వాళ్లు మంచివారని తేలితే స్వీకరించాలి లేదా వదలివేయాలి" అన్నాడు.

శరభుడు:- "మహాపురుషా! విభీషణుని విషయంలోచారుని నియమించాలి. సూక్ష్మబుద్ధితో ఆచారుడు ఈయనను పరీక్షించాక, ఈయనను రానివ్వడమా? లేదా? అని నిర్ణయించాలి" అని తెలిపాడు.

జాంబవంతుడు శాస్త్రవిదుడు. ఆయన బాగా ఆలోచించి జాగ్రత్తగా నిర్దుష్టంగా తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"రామచంద్రా!మనకు, రాక్షసులకు మధ్య బద్ధవైరము ఉంది. అంతేకాదు వారు పాపబుద్ధులు. విభీషణుడు రాగూడని సమయంలో రాగూడని చోటుకు వచ్చాడు. కాబట్టి ఆయనను అన్ని విధాల అనుమానింపవలసిందే".

న్యాయకోవిదుడైన మైందుడు తన అభిప్రాయాన్ని తెలుపుతున్నాడు. "ముందుగా విభీషణుని నెమ్మదిగా రావణుని గురించి అడిగి చూద్దాము. ఆయన మాటల తీరును బట్టి ఆయన మనస్సును తెలిసికొని ఏదో ఒకటి నిర్ణయిద్దాము".

అందరి తరువాత సంస్కారవంతుడు సచివోత్తముడైన హనుమ అర్థవంతాలైన మాటలతో అందంగా తన అభిప్రాయాన్ని తెలుప మొదలిడాడు.

"రామభద్రా! నీవు సమర్థుడివి, మాటలలో నేర్పరివి. బుద్ధిలో బృహస్పతి కూడ నీతో తులదూగలేదు.

అందువలన నాతర్కకౌశలంతో నిన్ను మెప్పించాలని కాని, ఇది వరకు చెప్పిన వానరోత్తముల మాటలను కాదనడంకొరకని కాని, నేను గొప్పవాడిననే అహంకారంతో కాని, నాకు ఏదితోస్తే అదే చెప్పాలనే చాపల్యంతో కాని నేను మాట్లాడడంలేదు.

నేను నిజంగా నీపట్ల భక్తి ప్రపత్తులతో నా అభిప్రాయాన్ని నివేదిస్తున్నాను.

నీ సచివులంతా "మంచి చెడులు, నిర్ణయించాక, విభీషణుని పరీక్షించాక, ఆయనను రానివ్వాలి లేదా వదలాలి" అని అన్న మాటలు నాకెందుకో సరైనవి కాదని అని పిస్తుంది.

ఎందుకంటే ఎవ్వరి మంచి చెడులనైనా, సామర్థ్యాన్నైనా నిర్ణయించేది వారిని పనులలో నియోగించిన తరువాతే కదా! పోనీ ఆయనకు పనులను అప్పగించి చూద్దామంటే అందుకు తగిన సమయమిదికాదు.

చారులను పంపి పరీక్షించే అవసరము లేదు. ఎందుకంటే దూరంలో ఉన్న వాళ్లను పరీక్షించడానికి చారులు అవసరము. కళ్ల ఎదుటే ఉన్నవాడి విషయంలో చారులతో ఏమి పని? ఇక విభీషణుడు రాగూడని సమయంలో రాగూడని చోటుకు వచ్చాడనే మాట వచ్చింది కదా! ఆ విషయంలో నా ఆలోచనను స్పష్టం చేయాలని అనుకొంటున్నాను.

నిజానికి విభీషణుడు రావలసింది. ఇప్పుడే, ఇక్కడికే

"దౌరాత్మ్యం రావణే దృష్ట్వా । విక్రమంచ తథాత్వయి॥

యుక్త మాగమనం తస్య । సదృశం తస్య బుద్ధితః"

రావణుడా ! దుర్మార్గుడు. ఆయన సీతను అపహరించి తెచ్చాడు. ఆయనకు ఎవ్వరు ఎన్ని విధాల నచ్చజెప్పినా వినక సర్వరాక్షస వినాశకరమైన సమరాన్ని ఆహ్వానిస్తున్నాడు.

ఇక నీవు అవక్రవిక్రముడవు. నీ పరాక్రమంతో నీకు ఎదురు పడ్డ, ఖర దూషణ, విరాధ కబంధాది రాక్షసులను, వాలి అంతటి మహావీరుని ప్రాణాలతో వదలలేదు.

రావణుని దురాచారాన్ని,నీ పరాక్రమాన్ని రెంటిని చూచి విభీషణుడు తనకు ఏదికావాలో నిర్ణయించుకొని నీ దగ్గరికే వచ్చాడు. ఇక ఆయన రావలసిన సమయం కూడ ఇదే! ఎందుకంటే ఒకసారి యుద్ధము ప్రారంభమయితే శరణాగతి సులభసాధ్యం కాక పోవచ్చు.

మారు వేషాలతో వెళ్లి ప్రశ్నిస్తే ఆయన స్వభావం తెలుస్తుందన్న మాట కూడ సరి అయింది కాదు.

కొత్త వాళ్లు వేసే ప్రశ్నలకు ఎవ్వరు కూడ మనస్సువిప్పి సమాధానాలివ్వరు. నమ్మిన వాళ్లతోనే కదా ఎవ్వరైనా మనస్సు విప్పి మాట్లాడేది. మనస్సు విప్పి మాట్లాడనప్పుడు అపార్థాలు తోచవచ్చు. దానివలన మైత్రి కోరివచ్చిన విభీషణుని శత్రువుగా అనుకొనే ప్రమాదం ఉంది కదా !

రామభద్రా! ఇతరుల స్వభావాలను తొందరగా గ్రహింపజాలము. వారి మనస్సుల లోని మర్మాలను తొందరగా గ్రహింపలేము.

మహారాజా! ఈయన మాట్లాడుతున్నప్పుడు "ముఖములో దుష్టత్వము కనబడలేదు. మాటలు దాచుకొన్నట్లు లేవు స్పష్టంగా ఉన్నాయి. ఈయన సజ్జనుడనడంలో సందేహం లేదు.

ఒక మోసకాడు తన ఆకారాన్ని మారు వేషంతో కప్పిపుచ్చుకోవచ్చు. కాని తన స్వభావాన్ని ఎంతో సేపు విజ్ఞుల ముందు దాచుకోలేడు. అనుకోకుండా ఆయన స్వభావము మాటల ద్వారా హావభావాల ద్వారా బయటపడి తీరుతుంది.

ఎంత వెతికి చూచినా విభీషణుని మాటలలో, హావభావాలలో మోసము కనబడడం లేదు.

ఉచితములైన దేశ కాలాలలో, ఉచితపురుషుని గురించి చేసిన పని వెంటనే ఫలిస్తుంది. అందువలన సరైన ఈ సమయంలో, ఈ స్థలంలో సమర్థుడవు, శరణ్యుడవు అయిన నీ విషయంలో శరణాగతి తప్పక ఫలించాలి.

నీ ధర్మ సంస్థాపనోద్దేశ్యాన్ని, రావణుని అధర్మస్వభావాన్ని గమనించి, అధర్మాన్ని రూపుమాపడంలో వాలివధను, సుగ్రీవ పట్టాభిషేకాన్ని నీవు జరిపించడం విని నిన్ను బుద్ధిపూర్వకంగా విభీషణుడాశ్రయించాడు. కనుక ఆయనను చేరదీయడమే ఉత్తమము నాకు తోచింది నేను చెప్పాను. నిర్ణయించవలసింది నీవే ప్రభూ!" అని ముగించాడు.

# శ్రీ రాముని నిర్ణయము - 13

సుగ్రీవాదుల అభిప్రాయాల వలన శ్రీరాముని మనస్సు కొంత కలత చెందింది. అయినా అవి ఆ మహానుభావుడి మనస్సుపై అంతగా ప్రభావం వేయలేదు.

అంతకు పూర్వమే రామచంద్రుడు వశిష్టాది మహర్షుల వద్ద "కపోతోపాఖ్యానము", "కండూపాఖ్యానము" మొదలైనవి విన్నాడు. ఆయన మనస్సులో "శరణాగతుడిని రక్షించడమే పరమ ధర్మమనే" నిర్ణయం చోటు చేసికొంది.

ఇప్పుడు "విభీషణుని పరిశుద్ధి" గురించి హనుమ మాటలు విన్నాక ఆయన మనస్సులో ప్రసన్నత, స్థిర నిశ్చయం ప్రకాశించాయి.

అందువలన ఆయన సుగ్రీవాదుల ముందు తన నిశ్చయాన్ని వెల్లడిస్తున్నాడు.

"నా ప్రియాన్ని, హితాన్ని కోరే వానర మిత్రులారా! మీరందరు మీమీ అభిప్రాయాలను స్పష్టంగా తెలిపారు. ఇప్పుడు నా అభిప్రాయాన్ని కూడ తెలుపుతున్నాను వినండి.

"మిత్రభావేన సంప్రాప్తం। సత్యజేయం కథంచన
దోషోయద్యపి తస్యస్యాత్ । సతామేతదగర్హితం"

"మితాత్ త్రాయత ఇతి మిత్రం"అన్నట్లు ఏకొద్ది సహాయంతోనైనా తృప్తి పడి ప్రత్యుపకారం చేయాలనుకొనేవాడు మిత్రుడు.

"మనమెవ్వరము పరమాత్మ చేసిన మేలును గుర్తించము. ఆయనకు మేలు చేయగలిగిన వాళ్లము కాదు. అందువలన మనమెవ్వరము భగవంతుని మిత్రులము కాదు".

అటువంటిది విభీషణుడు మిత్ర భావంతో వచ్చాడు. అందువలన రాముడు ఆయనను చక్కగా వచ్చిన వాడుగా (సంప్రాప్తుడుగా) భావించాడు. అందువలన శ్రీరాముడు విభీషణుని అంగీకరిస్తున్నాడు.

అంతేకాని సుగ్రీవాదులు వద్దన్నందువలన కాదు. హనుమ అంగీకరించుమని చెప్పినందు వలన కూడ కాదు.

అయితే విభీషణునితో శ్రీరామునికి ఇంత వరకు ముఖపరిచయము కూడ లేదు. అటువంటప్పుడు విభీషణుడు మిత్రభావంతో వచ్చాడని ఎలా అనుకోవడం ?

మిత్ర భావమంటే "తన రక్షిస్తాడనే విశ్వాసము కలిగి ఉండడం". "తన్మిత్రం యత్ర విశ్వాస:" ఎవ్వరి విషయంలో నమ్మకం ఉంటుందో ఆయనే మిత్రుడు.

తనకే శక్తి లేదని, తనకు వేరేగతి కూడ ఏదిలేదని, నిర్ణయించుకొని, శ్రీరామ చంద్రస్వామి శక్తి స్వభావాదులను గుర్తించి, ఆయనను శరణువేడిరావడమే మైత్రీభావము"

సంప్రాప్తం : తనను ఆశ్రయించదలచాడంటేనే, జట్టువీడగా, కట్టుకొన్న బట్ట జారిపోతుండగా ఆయన ఉన్నచోటికి తానే పరుగెత్త వెళ్లవలిసి ఉండగా, విభీషణుడు ఆశ్రయించడమే కాక తాను ఉన్నచోటికే వచ్చాడే అని రాముడు అనుకొన్నాడు. "తాను చేయవలసిన పనిని ఆయనే చేశాడే " అని రాముడు చేతులు పిసుక్కుంటున్నాడు.

నత్యజేయం : "రక్షాపేక్షాంప్రతీక్షతే అన్నట్లు పరమాత్మ తన దగ్గరికి రక్షించుమని ఎవ్వరు వస్తారా ?" అని వేయికళ్లతో ఎదురు చూస్తుంటాడు. అటువంటిది తన దగ్గరికి వచ్చిన వారిని వదలుతాడా?

నిజానికి విభీషణుని విడువడానికి వీలు ఉంటేనే గదా ఆయనను పరీక్షించేది! విభీషణుని విడువడానికి ఎందుకు వీలులేదంటే? ఆయనను వదలివెళ్తే తన దగ్గరికి రక్షించుమని వచ్చేవారే ఉండరు.

పరీక్షించకుండా స్వీకరించేవారు తమ క్షేమాన్ని గూడ చూచుకొండా రక్షిస్తారు కదా!

"ఏమండీ! మీ క్షేమం చూచుకోకుండా మీరు రక్షిస్తామని చూస్తే, మిమ్మల్ని విడిచి ఉండజాలని మా సంగతేమి కావాలి?" అని సుగ్రీవాదులు రాముని ప్రశ్నిస్తే ఆయన అంటాడు మిమ్మల్ని విడిచి పెట్టే మాటేలేదు. కొత్తగా వచ్చినవానిని కూడ వదలిపెట్టను".

కథంచన : ఏ విధంగా కూడ వదలను ఆశ్రయించడానికి వచ్చిన వాడు దుర్మార్గుడైనా వదలను.

విభీషణుడు స్వయంగా రాక్షసుడు. దుర్మార్గుడైన రాక్షసేశ్వరుని తమ్ముడు. ఆయన ఏదైనా అపకారము చేస్తే ఎలాగా ? "దోషోయద్యపితస్యస్యాత్ " ఆయన అపకారము చేసే దుర్మార్గుడైనా పరవాలేదు. దోషాలు ఉన్నా శరణాగతుని వదలను. శరణాగతి చేసే వారిదగ్గర దోషాలు ఉండకూడదనే నియమేమిలేదు కదా! అందువలన నా స్వభావంలో దోషులైన శరణాగతుల పట్ల మార్పు ఏమీలేదు.

మీ దృష్టిలో విభీషణుడు దోషికావచ్చు. అయినా నేను అతనిని విడువను. దోషము

లేనివారినే రక్షించాలంటే, దోషాలు లేకపోవడమే గొప్పకదా ! గొప్పవారిని రక్షిస్తే ఏమి ప్రత్యేకత? దుష్టుని రక్షిస్తేనే కదా మా గొప్పదనము!

సతామేతదగర్హితం :విశ్వామిత్రుడు, కపోతము "తాము ఆపదల పాలయినప్పటికి శరణాగతులను రక్షించాలి" అని కదా తెలిపింది. అదే సజ్జనుల నీతి

I. శ్రీరామచంద్రుడు విభీషణుని విడువడానికి వీలులేని ఆయన శరణాగతి లక్షణాలను వివరిస్తున్నాడు:-

శరణాగతుడు తన దోషాలను గుర్తించాడు:

1. సంబంధ దోషము : దుర్మార్గుడైన రాక్షసేశ్వరుని తమ్ముడను విభీషణుడను.

2. సహజదోషము : తానుకూడ రాక్షసుడినే అని చెప్పుకోవడం

3. తన దగ్గర ఏ శక్తి లేదని, తనను రక్షించేవారు ఎవ్వరు లేరని అంగీకరించుట.

1. తన దగ్గర ఏ శక్తి లేదనుట : ఆకించిన్యము - త్యక్త్వాదారాంశ్చపుత్రాంశ్చ" భార్యా పుత్రులను కూడ వదలు కొన్నవాడి దగ్గర ఇంకేమి మిగిలి ఉంటుంది?

II. తనకు వేరే దిక్కు లేదనుట : అనన్యగతిత్వము

"దాసవచ్చావమానిత:" తోడ బుట్టిన అన్నతోనే అవమానింపబడుట

4. భగవదుపాయైక బుద్ధి - రామచంద్రుడే ఉపాయమని నమ్ముట (విక్రమంచ తథాత్వయి)

4. ప్రార్ధనామతి: -రాఘవంచ శరణం గత:

ఈ లక్షణాలనే సూచించేది

"అహమస్మ్య పరాధానాం
అలయోఽ కించనోఽ గతి:
త్వమేవోపాయభూతోమే
భవేతి ప్రార్ధనామతిః"

విభీషణుడు దుష్టుడా? శిష్టుడా?" అనే ప్రశ్నతో మనకు పనిలేదు. శరణాగతుడైతే చాలు ఆయనను రక్షిస్తాను"అని పలికిన శ్రీరాముని మాటలు సుగ్రీవునికి నచ్చలేదు.

"తండ్రి అంతటి పెద్దన్నను ఆపదలో వదలివచ్చిన వాడు మనతో మాత్రము కలిసి

ఉంటాడని ఏమి నమ్మకము? సమయం చూచి దెబ్బతీసేవాడితో మనకేమి లాభము?" అని సుగ్రీవుడు అడిగాడు.

సుగ్రీవుని మాటలకు లక్ష్మణుని వైపు చూచి శ్రీరాముడు చిరునవ్వు నవ్వాడు ఆ నవ్వుకు వ్యాఖ్యాతలు రెండు కారణాలను చూపారు:-

(1) "సుగ్రీవునివలె లక్ష్మణునికి కూడ విభీషణుని వలన ఏమైనా ప్రమాదం కలుగుతుందేమో అనే భయము ఉంది. అందువలన సుగ్రీవునికి చెప్పే సమాధానము నీకు కూడ వర్తిస్తుంది".

(2) ఇక్ష్వాకు కులసంజాతులమైన మన "శరణాగత రక్షాదీక్ష" సుగ్రీవునికి తెలియదు. నా అభిప్రాయాన్ని కూడ అతడు విశ్వసించడం లేదు చూచావా?" అని లక్ష్మణుని వైపు చూచి నవ్వాడు.

అయితే సుగ్రీవుని ప్రశ్నను శ్రీరాముడు వెంటనే తేలికగా కొట్టి పారవేయలేదు. ఆయన మాటకు కూడ గౌరవమివ్వాలనుకొన్నాడు.

"శాస్త్రాలు, చదువకుండా పెద్దలను సేవించకుండా సుగ్రీవునివలె ఇంత చక్కగా ఎవ్వరు మాట్లాడలేరు. అయినా లోక సిద్ధమైన ఒక విషయము నా మదిలో మెదులుతున్నది.

సాధరణంగా ఒకే కులంలోని వారు, సమీప బంధువులు ఆపదలో ఉన్న తమవారిని వదలివెళ్లరు. అలా వదలి వెళ్తే వారు శత్రువులే. అయితే అలా బంధువులు వదలి వెళ్లవద్దనుకొంటే ఆ బంధువుల మాటలను యజమాని గౌరవించాలి. ఇప్పుడీయన తనవాళ్లను వదలి వచ్చాడంటే, ఈయన తన అన్న అయిన రావణునితో తీవ్రంగా అవమానింపబడి ఇక అక్కడ ఏమాత్రం ఉండలేని స్థితిలో భార్యా పుత్రులను కూడ ఒంటరిగా వదలివచ్చాడని అర్థము.

మనను కూడ అలాగే వదలి వెళ్లడానికి మనము విభీషణునికి పాలివాళ్లమో, బంధువులమో, సామంతులమో కాదు. మనను వదలి వెళ్లితే మళ్లీ రావణుని దగ్గరికే వెళ్లాలి. అంత అవమానం జరిగాక, ప్రాణాలు పోయినా అక్కడికి తిరిగివెళ్లలేడు.

అందువలన మనను కూడ వదలి వెళ్లడానికి ఆయన మన దగ్గరికి రాలేదు. అంటే మన దగ్గరికి రావడానికి ఇంకేదో బలమైన కారణము ఉండి ఉంటుంది.

బహుశ ఆయనకు "రాజ్యకాంక్ష" ఉండి, దానిని సాధించుకోవడానికి మన దగ్గరకు వచ్చి ఉండవచ్చు. తన పనిని మన ద్వారా సాధించుకోవాలని అనుకొన్నప్పుడు ఆయన మనకు ఏ హాని తలపెట్టే అవకాశము లేదు. అందువలన మనము ఆయనను చేర

దీయడంలో తప్పులేదు.

సుగ్రీవా! ఆపదలలో ఉన్నవారిని వదలి వెళ్లక పోవడానికి లోకంలో అందరు భరతుని వంటి సోదరులు, నీవంటి మిత్రులు, నావంటి పుత్రులు ఉండరు కదా !

"తన తల్లి ద్వారా తనకు సంక్రమించిన రాజ్యాన్ని తృణప్రాయంగా భావించి,దానికి అర్హుడైన అన్ననే సింహాసనాసీనుని చేయాలనుకొని, అందుకు ప్రాయోపవేశం చేసి అయినా అన్నను ఒప్పించాలని ప్రయత్నించిన మహాత్ముడైన భరతుడే నిజమైన తమ్ముడు".

"తన శత్రువైన వాలిని సంహరించి, తనకు భార్యారాజ్య లాభాన్ని కలిగించిన శ్రీరామునికి కృతజ్ఞుడై మైత్రీ భావాన్ని నిలుపుకొని తన ప్రాణాలకు తెగించి స్నేహితుడికి సహాయం చేయడానికి సమస్త వానర గణంతో బయలుదేరిన సుగ్రీవుడే నిజమైన మిత్రుడు".

"భార్యకు ఎన్నడో ఒక మాట ఇచ్చి, ఆ మాటకు కట్టుబడవలసి వచ్చిన దశరథుని దయనీయ స్థితిని చూచి, ఆయన అసహాయతను అర్థం చేసికొని స్వయంగా రాజ్యాన్ని పరిత్యజించి కారడవులకు బయలుదేరిన శ్రీరాముడే నిజమైన పుత్రుడు".

శ్రీరాముడు ఇంతచెప్పినా ఆయన మాటలు సుగ్రీవుడికి నచ్చలేదు. ఆయన తన ఆసనం నుండి లేచి, చేతులు జోడించి "ఇక్ష్వాకు వంశప్రభూ ! నీ విన్ని రకాల చెప్పినా ఇంకా నాకీ విభీషణుడు రావణుని గూఢచారే" అనిపిస్తున్నది. ఈయన మనకు ప్రమాదం కలిగించాలనే పాప బుద్ధితోనే ఇక్కడికి వచ్చాడు. మన నమ్మకాన్ని పొందాక నిన్నో, లక్ష్మణునినో, నన్నో, తన చేతికి దొరికిన ఏవానర వీరులనో చాటుమాటుగా సంహరించవచ్చు. ఎంతయినా ఈయన రావణుని తమ్ముడే కదా" అని తన అనుమానాన్ని మళ్లీ వెలిబుచ్చాడు.

సుగ్రీవుని భయాన్ని, ఆయనకు తమపై ఉన్న ప్రేమను శ్రీరాముడు అర్థం చేసికొని "మిత్రమా సుగ్రీవా! విభీషణుడు మేమనుకొన్నట్లు శిష్టుడే కావచ్చు లేదా నీవు అనుమానించినట్లు దుష్టుడేకావచ్చు. ఆయన ఎంత దుష్టుడైనా మనకేమి భయములేదు.

"అంగుళ్యగ్రేణ తాన్‌హన్యాం! ఇచ్ఛన్ హరిగణేశ్వర" సుగ్రీవా! సమస్త యక్ష, రాక్షస, పిశాచ దానవగణాలు కలిసి నన్నెదిరించినా, నాకేమి ప్రమాదంలేదు. నేను తలచుకొంటే వాళ్లందరిని నావేలుకొనతో సంహరింపగల్గుతాను. ఒక్క లంకలోని రాక్షసులు అందులో విభీషణుడొక్కడు నాకు ఒక లెక్కా? అందువలన విభీషణునికి మనమాశ్రయ మిచ్చినా మన కొంపమునిగి పోయేదేది లేదు.

సుగ్రీవా! శరణాగతి విషయంలో "కపోతోపాఖ్యానాన్ని" తెలుపుతాను విను.

"ఒక అడవిలో రెండు పావురాలు ఉండేవి. అందులో భార్యాకపోతాన్ని ఒక వేటగాడు చంపాడు. దానిని తిన్నాడు. ఆ వ్యాధుడు అడవిలో ఉండగానే రాత్రి అయింది. అది చలికాలము ఎముకలను కొరికి తినే ఆచలికి ఆ వేటగాడు తట్టుకోలేక పోయాడు. వన్యప్రాణులన్నిటిని సహాయము అర్థించాడు.

తన భార్యను చంపిన వేటగాని చలిబాధ మగ పావురానికి పాపమనిపించింది. అక్కడ ఉన్న కట్టెలను ప్రోగుజేసి మంటను రగిలించాడు. కట్టెలు అంటుకొని మండాయి. ఆమంటకు వేటగాని చలి ఎక్కడికో ఎగిరిపోయింది.

అయితే అంతవరకు దాగి ఉన్న ఆకలి మంటలు మండసాగాయి. ఆకలి బాధను కూడ వేటగాడు ఓర్చుకోలేక విలవిల కొట్టుకోసాగాడు.

దయామయమైన ఆ మగ పావురము వేటగాని ఆకలి బాధను చూచి సహించలేక పోయింది. ఆయనకు తనే ఆహారము కావాలని, ఆ కట్టెల మంటలో పడికాలిపోయింది.

మిత్రమా! సుగ్రీవా! చూచావా? "శరణువేడిన వారిని కాపాడితీరాలని ఆ పావురాని కెవ్వరైనా చెప్పారా? లేక అది శాస్త్రాలేవైనా చదివిందా?" శాస్త్ర జ్ఞానము కూడలేదే?

ఈ రెండు లేకున్నా వేటగానిని రక్షించదగిన శక్తి ఆపావురానికి ఉందా? లేదే! ఆయనను రక్షించాలంటే తాను చావాలి. తన ప్రాణాలను బలిపెట్టి ఆకపోతము శరణాగతుడైన వ్యాధుని రక్షించిందే! అల్పము అయిన ఒక పక్షి ఆచరించిన "శరణాగత రక్షా" ధర్మాన్ని జ్ఞానశక్తులు గల మనము ఆచరించక పోవడం న్యాయమా ?

ధర్మమూర్తి అయిన దశరథ చక్రవర్తి తనయుడను, వశిష్ట, విశ్వామిత్ర మహర్షుల, శిష్యుడను, శ్రీరామచంద్రుడను నా ధర్మాన్ని నేను కాపాడుకోవద్దా ?

"కణ్వమహర్షి పుత్రుడైన "కందు మహర్షి" ఒక మహా రాజుకు ఉపదేశించిన గీతాలు కల్పితాలేనా? వ్యర్థాలేనా? ఆయన పలుకులు సనాతన ధర్మగీతాలే కదా? చేతులు జోడించిదీనుడై శరణువేడిన శత్రువునైనా చంపగూడదు. దయాధర్మమే పరమధర్మము కదా!

"ఆర్తోవాయదివాదృప్తః । పరేషాంశరణాగతః

అరిః ప్రాణాన్ పరిత్యజ్య । రక్షితవ్య :కృతాత్మనా"

పాప భయంతో పరుగెత్తి వచ్చిన ఆర్తుడు కాని, పాపభయాన్ని వీడి వచ్చిన

దృష్టుడుకాని, ఎవ్వరైనా వచ్చి శరణు వేడితే, తన ప్రాణాలను త్యాగం చేసి అయినా శత్రుప్రాణాలను కాపాడాలి. అలా కాపాడడమే సత్పురుషుల లక్షణము.

"ముముక్షువులలో ఆర్తుడు, భగవత్ శరణాగతి వలన దేహాన్ని వెంటనే చాలించి ముక్త్యనుభవం కావాలని కోరుకొంటాడు. దృప్తుడైనవాడు మోక్షఫలం లభించేదాకా ఓర్చుకొని ఉంటాడు". ప్రమాద భయంతోనో, శరణాగత రక్షణము పరమధర్మమని తెలియకో, తనకేమి లాభమని అనుకొనో, రక్షించేశక్తి కల్గికూడ శరణాగతుని వదిలివేస్తే అటువంటివాడు ధర్మభ్రష్టుడవుతాడు.

అంతేకాదు సమర్థుడైన వానిని శరణు కోరినవాడు శరణ్యుని కళ్లముందే చనిపోతే ఆ శరణునివ్వవలసినవాడు (శరణ్యుడు ) తనపూర్వ జన్మ సుకృతాన్ని అంతా పోగొట్టుకొని, నరకంలో పడిపోతాడు.

అందువలన ప్రపన్నుని రక్షించక వదలి వేయడం వలన, అపకీర్తికి, నరకానికి కారణమవుతుంది".

కందుమహర్షి ఉపదేశాన్ని పాటించడం వలన ధర్మము, యశము(కీర్తి), పుణ్యము లభిస్తాయి.

అంతేకాదు నా స్వభావాన్ని కూడ వివరిస్తాను సుగ్రీవా ! విను

"సకృదేవ ప్రపన్నాయ। తవాస్మీతి చయాచతే ।

అభయం సర్వభూతేభ్యో। దదామ్యేతద్వ్రతం మమ।"

"శాస్త్రాలలో సత్కర్మలను మళ్లీమళ్లీ ఆచరించడం వలన అధిక ఫలం కలుగుతుందని" చెప్పబడింది. కాని ప్రపత్తి అటువంటి ఉపాయము కాదు. ప్రపత్తిని ఒకేసారి ఆచరిస్తే చాలు. మళ్లీ మళ్లీ ఆచరిస్తే ఫలితం అధికం కాదు. మళ్లీ ఆచరించడం వలన "మొదట చేసిన ప్రపత్తి వలన తగినంత ఫలము లభించదని" ప్రపత్తిని అవమానించినట్లు అవుతుంది.

ప్రపత్తి చేశాక, దానిని బలపరుచుకోవాలని ఇతర ఉపాయాన్ని ఆశ్రయిస్తే, ఆ ఇతర ఉపాయం వలన ప్రపత్తి కూడ నిర్వీర్యము అవుతుంది.

ఆంజనేయస్వామిపై ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాక, తృప్తిలేక హనుమను తాళ్లతో గట్టిగా రాక్షసులు కట్టారు. దాని వలన బ్రహ్మాస్త్ర ప్రభావము శూన్యమైంది. అందువలన తనను ఒకసారి ఆశ్రయిస్తేనే చాలు, సర్వప్రాణులకు అభయాన్ని ప్రసాదిస్తానంటున్నాడు రామభద్రుడు.

"సకృదేవ ప్రపన్నాయ । తవాస్మీతిచయాచతే।
అభయం సర్వభూతేభ్యో । దదామ్యేతద్వ్రతంమమ"

సకృదేవ ప్రపన్నాయ : తనకు ఒకసారే ఆశ్రయించిన వాడికి,

తవాస్మీతిచయాచతే: "నేను నీ వాడినని" శరణుకోరిన వానికి ఒక్కనికే కాక

అభయం సర్వభూతేభ్యోదదామి. అలాకోరిన వారందరిని రక్షణనిస్తానని చెప్తున్నాడు.

శరణాగతిలో రెండు లక్షణాలు:

1. శరణువేడి రావడం –(శారీరక కర్మ)

2. నేను నీవాడినని శరణుకోరడం (వాచికకర్మ). అయితే ఈ రెండు కూడ (చ) ఉంటేనే రాముడు రక్షిస్తాడా? అంటే రెండు ఉండవలసిన అవసరంలేదు. ఇందులో "శరణువేడి రావడమో" (చ–వా) లేక "నేను నీవాడినని చెప్పడమో" ఏదో ఒకటి చేసినప్పటికీ నేను ఆయనను రక్షిస్తానని శ్రీరామ చంద్రస్వామి తెలుపుతున్నాడు. ఇది ఆ స్వామి రక్షాదీక్ష!

అభయం:– శరణాగతులు శరణుకోరితే స్వామి ఏమిస్తాడట ? అభయాన్ని ఇస్తానంటాడు. అభయం దేని నుండి ? అన్నిటి నుండి దు:ఖం నుండి, భయం నుండి, బాధ నుండి, వ్యాధి నుండి, దారిద్ర్యం నుండి, నరకం నుండి, కైవల్యం నుండి, పునర్జన్మ నుండి ఒకటేమిటి అన్ని అయిష్టాల నుండి

"అధసోఽ భయంగతో భవతి" అంటుంది వేదము. సర్వభయాలను పోగొట్టే మోక్షాన్ని కూడ ప్రసాదిస్తాడు స్వామి అభయమంటే మోక్షంకూడ (అభయమేవమోక్ష:)

సర్వభూతేభ్యో:– అభయాన్ని ఎవ్వరికిస్తాడు ? అభయాన్ని కోరెవ్వరు కావాలి? వారి అర్హతలేవి ? అభయాన్ని కోరేవారెవ్వరైనా కావచ్చు. వారికి ఏ అర్హతలు అవసరంలేదు. చివరకు అభయాన్ని కోరేవారు మనుష్యులే కావాలనే నియమం కూడ లేదు. ఏ ప్రాణులైనా కావచ్చు. పశువులైనా,పక్షులైనా ఫరవాలేదు. అభయం కోరిన ప్రాణులెవ్వరైనా కావచ్చు. ఎందరైనా కావచ్చు.

"పశుర్మనుష్య: పక్షీవా । యేచవైష్ణవ సంశ్రయాః
తేనైవతేప్రయాస్యంతి । తద్విష్ణో: పరమంపదం"

విభీషణుడు ఇప్పుడాశ్రయించింది శ్రీరామచంద్ర పరమాత్మనే అయినప్పుడు ఇప్పుడాయన అభయాన్ని పొందడంలో ఆశ్చర్యమేమిటి ?

"శ్రీమద్రామాయణమొక స్మృతి వాక్యము కదా ! స్మృతుల వాక్యాలన్ని వేళలలో సత్యాలు కావలసిన నియమేమి లేదుకదా" అంటే శ్రీమద్రామాయణము వేదార్థాన్ని వివరించే సత్యమైన ఇతిహాసము.

పక్షి అయిన జటాయువుకు "గృధ్రరాజమదాజ్ఞప్త: గచ్ఛలోకా ననుత్తమాన్" "అపునరావర్తినాంయాచ" అని ఓ గృధ్రరాజా! నేను ఆజ్ఞాపిస్తున్నాను. నా ఆజ్ఞతో ఉత్తమోత్తమైన లోకాలకు వెళ్లు తిరిగిరాని వారికి లభించేగతిని పొందుమని" ఆజ్ఞాపించి అనుత్తమమైన పరమపదాన్ని కృపజేసిన కరుణా మూర్తి శ్రీరామ చంద్రమూర్తే కదా !

దదామ్యేతద్వ్రతం మమ: అభయము అందరికి ఇస్తాడా ? ఓ తప్పక! "అభయాన్ని ఇవ్వడం నా వ్రతము" అంటున్నాడు. ఆ సత్యవచనుడు. "వ్రతం" అంటే దీక్ష పట్టుదల.

అయితే అలా అభయమివ్వడం శరణాగతులకు ఏదో మేలు చేయాలనా ? కాదు. తన ఆనందం కొరకు. "మమ" అంటే కేవలము "నాయొక్క" అనేకాదు "నాకొరకు"అని చతుర్థీ అర్థము కూడ. "తన కొరకే" అంటే తన ఆనందం కొరకే.తన ఆనందం కొరకే అభయమివ్వడమనే వ్రతాన్ని పెట్టుకొన్నాడట ఆపరంధాముడు

చూచారా ! ఆ స్వామి దయను, ఆయన రక్షాదీక్షను!

ఇక్కడ శ్రీరామ చంద్రస్వామి అభయమివ్వడంలో మరో విశేషము ఉంది. విభీషణునికి తానే స్వయంగా పిలిచి ఇవ్వడం లేదు. ఇంతవరకు ఆయనకు అభయమివ్వవద్దని ఎవ్వరు ఖండింతంగా చెప్పారో, ఆ సుగ్రీవుని ద్వారానే అభయమిస్తున్నాడు. చూచారా! ఆస్వామి దయను, రక్షాదీక్షను! చూచారా! ఆ స్వామి చమత్కారము! ఆ స్వామి అనునయ చాతుర్యము.

"ఆనయైనం హరిశ్రేష్ఠ ! దత్తమస్యాభయం మయా

విభీషణోవా సుగ్రీవ ! యదివా రావణస్స్వయం"

"వానరశ్రేష్ఠా! సుగ్రీవా! నేను అభయాన్ని ఇచ్చాను. అయితేనా అభయాన్ని పొందడానికి విభీషణుని నీవే పిలుచుక రావాలి సుమా" అంటాడు. ఆమాయామానుష స్వరూపుడు.

"అయ్యా! ఇంతచెప్పినా విభీషణునికి అభయమిస్తున్నారా?" అంటే విభీషణునికి ఒక్కనికే కాదు రావణుడు కూడ స్వయంగా వచ్చి శరణు కోరితే ఆయనకు కూడ అభయాన్ని ఇవ్వాలని ఉందయ్యా! అంటున్నాడు ఆ జగత్పతి.

భగవంతుడు స్వయంగా తనంతట తానే ఒక్కడే అభయము ఇవ్వాలనుకొంటే సరిపోదు. ఆ అభయము భాగవతోత్తముల సమక్షంలో, ఆభాగవతోత్తముల పురుషకారంతో లభించాలి.

“ఇవళ్ పురుషకారమానాలల్లదు। అవన్‌కార్యంశెయ్యానెన్లై”

“శ్రీదేవి పురుషకారమే లేకుంటే శ్రియఃపతిపనే చేయదు” అని పిళ్లైలోకాచార్య స్వామివారి శ్రీసూక్తి

“కౌంతేయ ప్రతిజానీహి । నమేభక్తః ప్రణశ్యతి ”

తనభక్తుడు చెడిపోడని స్వయంగా శ్రీ కృష్ణపరమాత్మతాను చెప్పకుండా అర్జునిని ద్వారా ప్రతిజ్ఞ చేయిస్తాడు. అంటే మధ్యవర్తుల పురుషకారము ఉంటే ఆప్రభువు ఇచ్చే అభయం సార్ధకమవుతుందన్న మాట.

ఇప్పుడు విభీషణుని శరణాగతునిగా స్వీకరించడంలో స్వామి “సుగ్రీవుని పురుషకారాన్ని” వినియోగించుకొంటున్నాడు.

ఆనయైనం హరిశ్రేష్ఠ: సుగ్రీవ మహారాజా ! మిత్రభావేన సంప్రాప్తం” అన్నట్లు “మిత్రభావంతో నా దగ్గరికి వచ్చిన వాడిని కూడ నేను అభయ మివ్వకుండా వదలనని” నాస్వభావం పూర్తిగా తెలిసిన వాడివి కదా!

“సకృదేవ” అన్నట్లు అనేక మార్లు నన్ను ఆశ్రయించవలసిన అవసరం లేక ఒకే సారి నన్ను ఆశ్రయించిన వారికి అభయమిస్తానని నా సంకల్పము కూడ తెలిసిన వాడివి కదా!

“అంగుళ్యగ్రేన” అన్నట్లు నేను తలచుకొంటే సర్వదానవ పిశాచ, యక్షరాక్షసాదులను నావేలి కొనతోనే సంహరించగలననే నా సామర్థ్యము కూడ తెలిసినవాడివి,

“ఒక పావురమే తన ప్రాణాలను కూడ పరిత్యజించి ఆశ్రితుని రక్షించిందనే విషయాన్ని బాగా తెలిసికొన్నవాడివి,

“కందు మహర్షి గీతాలను”విని ఉన్నవాడివి నీవేకదా !అటువంటి అన్ని తెలిసిన నీవే

ఆనయైనం : “నివేదయత మాంక్షిప్రం” అని మొదట విభీషణుడు కోరుకొన్నది మీ పురుషకారాన్నేకదా ! అటువంటి ఆయన ఆశఫలించాలన్నా, ఆయనను రక్షించాలనే నా కోరిక తీరాలన్నా, విభీషణుని పిలుచుక రావలసింది నీవే కదా !

హరిశ్రేష్ఠ: నా ఆశ్రితులందరిలో నీవే శ్రేష్ఠుడవు కదా ! నీఅనుమతి లేకుండా నేనెవ్వరికైనా అభయమివ్వగల్గుతానా? "అన్య" ఇప్పటికైనా ఆయనకు తప్పక అభయమివ్వాలా? అంటే అయ్యో తన వాళ్లందరిని వదిలి వచ్చిన దీనుడు కదా ?

దత్తమభయంమయా:- "మిత్ర భావంతో వచ్చినా సరిపోయేది అటువంటిది శరణుకోరి వచ్చాడు. అటువంటి విభీషణునికి అభయమివ్వక పోతే ఎలా?" అని అభయమిచ్చాను ఇప్పుడు మళ్లీ కాదంటే బాగుంటుందా? అందువలన ఆయనకు అభయమివ్వడానికి మీరు అనుమతి ఇవ్వవలసిందే సుమా"

"అలాగే ప్రభూ! మీ మాట ప్రకారమునేనిప్పుడు వెళ్లి విభీషణుని పిలుచుక వస్తానని" ఆయన వెళ్లుతుంటే స్వామి ఆయనను ఆపి "సుగ్రీవా! విభీషణునితో పాటు తానుకూడ వస్తానంటే రావణుని కూడ పిలుచుకరావాలి సుమా" అని ప్రత్యేకంగా చెప్పి పంపుతున్నాడు.

ఒక్క విభీషణునికే అభయమిస్తే అదేమిగొప్ప? విభీషణుడు ధర్మాత్ముడు, శరణాగతుడు. రావణుడు దుర్మార్గుడు. అటువంటి వానికి కూడ అభయమిస్తేనే కదయ్యా మన గొప్పదనము!

అంతేకాదు విభీషణుని చేరదీస్తే సుగ్రీవునికి, ఆయన నల్గురు మంత్రులకు మాత్రమే లాభము. రావణుని చేరదీస్తే సమస్త రాక్షసజాతికే నా రక్షణ లభించి తీరుతుందికదయ్యా!

సుగ్రీవా! "సుఖమైనా, దుఃఖమైనా మన ఇద్దరిదికదయ్యా"! ఇప్పుడు సుగ్రీవుని శరణు నిచ్చిన ఘనత నాతోపాటు నీకు కూడ సమానంగా లభిస్తుంది కదయ్యా" అని పలికాడు శ్రీరాముడు. రామభద్రుని దృఢరక్షాదీక్షకు ఆశ్చర్యపడి, అన్ని అనుమానాలు తొలిగి, "రామచంద్రా ! అన్ని ఆలోచించి చూచాక నాకు కూడ విభీషణుడు అభయమివ్వదగిన వాడే అని అనిపిస్తున్నది. అందువలన మాగోష్ఠిలో విభీషణుడు కూడ సమానంగా వచ్చిచేరుగాక ! తక్షణమే గరుడుడు ఇంద్రునితో స్నేహము చేసినట్లు విభీషణుడు కూడ మాతోవచ్చి స్నేహం చేయుగాక!" అని సుగ్రీవుడు పలికాడు.

సుగ్రీవుని సూచన మేరకు శ్రీరాముని అభయం తనకు లభించిందన్న సంతోషముతో విభీషణుడు తన నలుగురు మంత్రులతో ఆకాశంలో నుండి క్రిందికి దిగి రామపాదాలను ఆశ్రయించాడు. సంతోషంతో తన ధర్మస్వభావానికి అనుకూలంగా ఈ విధంగా పలికాడు.

"రాఘవేంద్రా ! నేను రావణుని తమ్ముడను. నన్ను మా అన్న ఒక దాసుని కంటే హీనంగా అవమానించి వెళ్లగొట్టాడు. సర్వప్రాణులకు ఆశ్రయణీయుడవైన నిన్ను నేడు

ఆశ్రయించాను. నేను లంకను, భార్యను, పుత్రులను, మిత్రులను, సంపందలను అన్నిటిని పూర్తిగా వదలివచ్చాను. ఇప్పుడు నారాజ్యము, జీవితము సుఖము అన్నినీవే"

శ్రీరామచంద్రుడు ఆయన సమయోచిత వాక్కులను విని చాలా సంతోషించాడు. ఆయనపై తన కన్నులనిండా ప్రేమను, ఆప్యాయతను వర్షించాడు. ఆయనను తన కన్నులతోనే త్రాగుతున్నట్లు ఉన్నాడు.

"లోచనాభ్యాం పిబన్నివ"

ఆయనను అత్యంత ప్రేమతో చూచి "విభీషణా! లంకానగరంలోని రాక్షసుల బలాబలాలను వివరించుమని" కోరాడు.

అప్పుడు విభీషణుడు: "రామప్రభూ! రాక్షసులకు రాజైన మా అన్న రావణుడు అమితశక్తి సంపన్నుడు. బ్రహ్మదేవుని వలన అమోఘమైన వరాలను పొందాడు. దేవదానవ గంధర్వాదులెవ్వరు ఆయనను వధింపజాలరు.

ఆయన పెద్ద తమ్ముడు ఇంద్రసమానుడు. కుంభకర్ణుడు సహజంగా అద్భుత దేహబలుడు. ఆయనను చూస్తేనే దేవతలంతా భయంతో వణకిపోతారు. ఆయన కూడ వరబల సంపన్నుడే. ఆయన సేనాని ప్రహస్తుడు అమిత దోర్బలుడు. కైలాసంలో జరిగిన మహాయుద్ధంలో కుబేరుని సేనాపతి అయిన మాణిభద్రుని చిత్తుగా ఓడించిన వాడు. మహోదరుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు పరాక్రమంలో లోకపాలులతో సమానులు.

ఇక రావణుని పుత్రుడు ఇంద్రజిత్తు. ఆయన దేవేంద్రుని ఓడించి, బంధించి లంకలోకి తెచ్చి, బ్రహ్మదేవుని మాట వలన వదలిపెట్టాడు.

ఇంద్రజిత్తు కవచధారి అయి, ధనస్సును ఎత్తితే ఆయన ముందు దేవదానవులెవ్వరు నిలువలేరు. అగ్నిని అర్చించి, రణభూమిలో మాయమై ఉండి సమస్త శత్రువులను సంహరించగలడు.

ఇలాంటి మహావీరులు, పదికోట్ల మంది మాంస భక్షకులు, రక్త పిపాసులైన భయంకర రాక్షసులు లంకలో సమరానికి సిద్ధంగా ఉన్నారు. వారితో కలిసి రావణుడు దిక్పాలకులనందరిని తన గుప్పిట్లో పెట్టుకొన్నాడు" అని ముగించాడు.

విభీషణుని మాటలు విని సత్యపరాక్రమ సంపన్నుడైన శ్రీరామచంద్రుడు : మిత్రమా! ప్రహస్తునితో, సకల బంధువులతో కూడిన రావణాసురుని సంహరించి, నిన్ను లంకాధిపతిని చేస్తాను. ఇది ముమ్మాటికి సత్యము.

రావణుడు నాభయంతో క్రిందిలోకాలైన, రసాతల, పాతాళలోకి పారిపోవచ్చు గాక! భయభీతుడై బ్రహ్మదేవుని వద్దదాగి ఉండుగాక! నా శరాఘాతం నుండి ఏ పరిస్థితులలోను బ్రతికి బయట పడజాలడు"

"విభీషణా! నా ముగ్గురు తమ్ములపై ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. సపుత్ర బాంధవంగా, సకలసేనా సమేతంగా రావణుని సంహరించక నేను అయోధ్యలో అడుగు పెట్టను"

శ్రీరాముని అవక్ర పరాక్రమాన్ని, ఆయన దృఢదీక్షను గమనించిన విభీషణుడు తలవంచి, నమస్కరించి, లంకా విజయంలో తానుకూడ అండగా ఉంటానని మాట ఇచ్చాడు.

"అతడు విభీషణుండు కలనాడెడు. నేరుపు లేనివాడు"

నీకు వానికి నెంత దవ్వు నీది వానిది యూహవేర!

రామపాద నలినంబుల, జేరుట యొక్క యూహయై

ఈ వడిగల వింటికాడొకడు వచ్చిన విష్ణువటంచు నెంచగా

"ఘనుడీతండె, త్రివిక్రముండయినచో గానిమ్ము"

# విభీషణ పట్టాభిషేకము - 14

విభీషణుని సహకార వాక్కులను విని, ప్రేమతో ఆయనను తన కౌగిటచేర్చుకొని శ్రీరామచంద్రస్వామి తక్షణమే విభీషణుని పట్టాభిషేకం కొరకు సముద్ర జలాలను తెప్పించుమని లక్ష్మణునితో చెప్పాడు.

లక్ష్మణుడు శ్రీరాముని సన్నిధిలో సమస్త వానర సమక్షంలో సాగర జలాలతో విభీషణునికి పట్టాభిషేకం కావించాడు.

విభీషణుని శరణాగతి వెంటనే ఫలించింది.

శరణాగతి ఎంతబలీయమైనదో, విభీషణుడు, వానరులు ఆశ్చర్యంతో గమనించారు.

శ్రీరామచంద్రుడు సముద్రతటంలో విభీషణునికి సకల వానర సమక్షంలో అభయ మిచ్చినట్లు, కురుక్షేత్రంలో అర్జునుని రథసారధి అయిన శ్రీ కృష్ణభగవానుడు "మోక్షయిష్యామి" సకల పాపబంధాల నుండి విడుదల చేస్తానని చెప్పినట్లు

"ఉన్ కోయిల్‌నిన్ఱు ఇంగనే పోందరుళి
కోప్పుడైయ శీరియశింగాసనత్తిలిరుందు
యాంవందకారియం ఆరాయ్ందరుళ్"

"నీ గర్భ గుడి నుండి బయటికి వచ్చి మేము వేసిన సింహాసనంలో కూర్చొని మేము వచ్చిన పనిని దయతో విచారించండి" అని గోదాదేవి వటపత్రశాయిని కోరుతుంది.

"పదిమంది ముందు ఇచ్చిన మాట తప్పరాదు కదా !

అయితే ఇక్కడ రెండు ప్రశ్నలు కలుగుతాయి.

1) ఇంకా రావణుని లంకలోకి వెళ్లి స్వామి రాక్షస రాజును సంహరించనే లేదుకదా! ఇప్పుడు సముద్రతటంలో విభీషణునికి జరిగిన పట్టాభిషేకానికి ఏమివిలువ ఉంటుంది?

రామరావణ యుద్ధమే జరిగితే రావణ సంహారము తప్పక జరుగుతుందనడంలో అనుమానమెవ్వరికి లేదు. రావణ సంహారము కొరకే కదా స్వామి అవతరించింది. అందు వలన యుద్ధానంతరము రావణవధ, విభీషణ పట్టాభిషేకం తప్పక జరుగుతాయని అందరికి గట్టినమ్మకమే. అందువలన ఇప్పుడే ఈ పట్టాభిషేకము ఏమిటి? అని

సుగ్రీవాదులెవ్వరు అడుగలేదు.

విభీషణుడు కోరుకొన్నది శ్రీరాముని ఆశ్రయాన్నే! రాజ్యాన్నికాదు . అయినా రాముడు ఆయనకు పట్టాభిషేకం జరిపించాడు. రాముని నిర్ణయాన్ని కాదనే వారెవ్వరు ?

2) ఇంకొక ముఖ్యమైన ప్రశ్న : యుద్ధము జరిగితే రావణ సంహారము, సుగ్రీవ పట్టాభిషేకముల విషయములో ఎవ్వరికి సందేహము లేదు సత్యమే. కాని యుద్ధమే జరుగక పోతే? అప్పుడు విభీషణునికి లంకా సామ్రాజ్య పట్టాభిషేకం ఎలా జరుగుతుంది?

శ్రీ రామచంద్రుడు : విభీషణోవా సుగ్రీవ ।
యదివా రావణ:స్వయం"

"సుగ్రీవా! శరణువేడిన విభీషణుని పిలుచుకరా! అంతే కాదు వస్తానంటే రావణుని కూడ పిలుచుకరా!" అని శ్రీరాముడు చెప్పాడు కదా! అప్పుడే ఆవిషయాన్ని గురించి శ్రీరాముడు నిర్ణయించుకొని ఉంటాడు కదా! యుద్ధము జరుగకూడదంటే" రావణుడు కూడ శ్రీరాముని శరణువేడి సీతాదేవిని ఆయనకు సమర్పించాలి" అది సంభవమేనా?

సంభవం కావచ్చు. విభీషణునికి శ్రీరాముడు పట్టాభిషేకం జరిపించాడన్న వార్త రావణునికి తప్పక తెలుస్తుంది కదా ! అప్పుడు రావణుడు ఆలోచించుకోవచ్చు."తనను వాలంతో బంధించిన వాలినంతటి వానిని ఒకే కోలతో నేల కూల్చిన మహావీరుడు శ్రీరాముడు. ఆయనతో యుద్ధమంటే ప్రమాదంకావచ్చు. ఎందుకింత ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం? సీతాదేవి ఎలాగూ తన వశమయ్యే సూచనలు కనిపించడంలేదు.

కాబట్టి యుద్ధానికి సిద్ధమై, కొరివితో తలగోకొనే బదులు సీతాదేవిని శ్రీరాముడికి అప్పగిస్తే మనము, మన రాజ్యము, మన వాళ్లందరు బాగుంటారు కదా!?" అని ఆలోచించి సీతాదేవిని శ్రీరామునికి అప్పగించవచ్చు కదా ?" అప్పుడు ఆయనే లంకకు రాజుగా ఉంటాడు కదా ! అప్పుడు విభీషణుని మాట ఏమవుతుంది?

శ్రీరాముడు దీనిని గురించి కూడ ఆలోచించాడని వ్యాఖ్యాతల అభిప్రాయము "రావణుడు తనను ఆశ్రయించినా ఆశ్రయించకున్నా విభీషణునికి చేసిన లంకా పట్టాభిషేకము అలాగే ఉంటుంది. అందులో ఏ మార్పు ఉండదు.

ఒక వేళ రావణుడు తనను ఆశ్రయిస్తే ఆయనకు తన కోసల దేశాన్ని పట్టాభిషేకం చేస్తాను" అని రాముడు నిశ్చయించుకొని ఉంటాడని" వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు.

శ్రీరాముడు విభీషణునికి పట్టాభిషేకం జరిపించడాన్ని "బాగు, బాగు" అని సుగ్రీవ సమేతంగా వానరులందరు ప్రశంసించారు.

# సముద్రశరణాగతి - 15

శ్రీరామ విభీషణుల కలయిక ద్వారా ఒక సమస్యకు పరిష్కారం లభించిన ప్రశాంత సమయంలో, హనుమ సుగ్రీవులు అంతకు ముందు తలెత్తిన "సముద్ర తరణము" అనే మహా సమస్యను మళ్లీ శ్రీరాముని ముందు ఉంచారు. అప్పుడు ఆ సమస్యకు పరిష్కారం కొరకు ఆలోచించడానికి విభీషణుడు కూడ వారికి తోడయ్యాడు.

విభీషణునికి తలఎత్తిన సమస్య : "శ్రీరాముని ఆశ్రయించుట" అది శరణాగతి ద్వారా సఫలమైంది. ఏ సమస్య అయినా శరణాగతి ద్వారా ఫలిస్తుందని ఆయనకు అర్ధమైంది. అందువలన సముద్రము దాటాలంటే సముద్రునికి శరణా గతిచేస్తే సరిపోతుందని ఆయనకు తోచింది. విభీషణడు "సముద్రశరణాగతే" మార్గమని సూచించాడు.

శ్రీరాముడు మాయామానుష విగ్రహుడు. ఆయన మనస్సుచాలలోతైంది. అయితే ఎవ్వరేమి చెప్పినా ఆయన కాదనడు. ఎవ్వరిని అనాదరపరచడం ఆయన స్వభావం కాదు. ఆయన పడగను ముడుచుకొన్న నాగబాామువలె తన పరమాత్మతత్వాన్ని మరుగు పరచుకొని ఒక సామాన్య మనుష్యుని లాగా ప్రవర్తిస్తున్నాడు.

సగర కుమారుల చేత రూపుదాల్చింది సముద్రము. అందువలన తన జన్మకు కారణులైన సగర కుమారుల వంశంలో జన్మించిన శ్రీరామచంద్రునికి సముద్రుడు తప్పక సహాయపడుతాడని విభీషణుడు తెలిపాడు. పృధ్వీపతి జలాధిపతిని శరణు వేడితే జలాధిపతి తప్పక కరుణిస్తాడని ఆయన అనుకొన్నాడు.

శ్రీరాముడు తనకైతే విభీషణుని సలహానచ్చిందని, "మీ అభిప్రాయమేమిటని?" సౌమిత్రి సుగ్రీవులను అడిగాడు.

లక్ష్మణుడు ఆలోచించాడు. "రామచంద్రుడు తన పరమాత్మశక్తినిదాచుకొని విభీషణుని సలహాను అంగీకరించాడు. అంటే ఇప్పుడు తాను కూడ రాముని ఆలోచననే బలపరుచాలని" అనుకొన్నాడు. "ఈ శరణాగతి ఎలాగూ ఫలించదని" "రాముడు తన శక్తిని ఎలాగూ ప్రదర్శించక తప్పదని" ఆయనకు పూర్తిగా తెలుసు.

సుగ్రీవుడికైతే "శరణాగతి" ఆలోచన బ్రహ్మాండంగానచ్చింది. ఫలితంగా సౌమిత్రి సుగ్రీవులిద్దరు విభీషణుని సలహాను బలపరిచారు.

వారిద్దరి సలహా ప్రకారము వేదికపై జ్వలించే అగ్ని శిఖవలె మూడు రోజులు శ్రీరాముడు సముద్రము ప్రక్క మరొక సముద్రమనేలా ప్రాయోపవేశం చేశాడు.

# శార్దూల, శుక, శారణులు - 16

రావణుడు సముద్రతీరంలో ఏమి జరుగుతున్నదో చూచి రమ్మని తన చారులైన శార్దూలుని, శుక, శారణులను పంపాడు.

ముందు శార్దూలుడు సముద్ర తీరానికి వచ్చి చూచాడు. ఆయనకు వానర సైన్యము మహా సముద్రమువలె కనబడింది.వానర వీరులందరు మహోత్సాహంతో ఉన్నారు. రామలక్ష్మణులు, వానరవీరులందరు దివ్యాయుధాలను ధరించి జాగ్రత్తగా ఉన్నారు.

శార్దూలునికి శత్రువాహిని చాల భయంకరంగా కనిపించింది. ఆయన వెంటనే రావణుని వద్దకు వెళ్లి "ప్రభూ! లంకానగరానికి దగ్గరలో సముద్రతీరంలో లక్షలాది వానర వీరులు మనపై దాడికి సిద్ధంగా ఉన్నారు. వారిసైన్యము పదియోజనాల దూరము వ్యాపించింది. అందరు ఆయుధాలను ధరించి యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. నీవు సమర్థులైన చారులను పంపి, సామ, దాన భేదోపాయాలను ప్రయోగించి చూడుమని" చెప్పాడు.

శార్దూలుని మాటలు రావణుని మనస్సును కలవరపరిచాయి. ఈ పరిస్థితులలో సామదానోపాయాలు పనిచేయవని, రామసుగ్రీవుల మధ్య అపార్థాలను కల్పించడానికి "భేదోపాయమే ఉత్తమోత్తమమని" భావించాడు.

అందువలన వాక్య విశారదుడైన శుకుని చారునిగా పంపాలనుకొన్నాడు. "శుకా! నీవు నాదూతగా సుగ్రీవుని వద్దకు వెళ్లి నామాటలుగా ఈ విధంగా తెలుపు :

"సుగ్రీవా! మహాబలుడైన ఋక్షరజుని పుత్రుడవు. నామిత్రుడు, మహావీరుడైన వాలి సోదరుడవు నాకు కూడ సోదర సమానుడవు. స్వయంగా వానరమహా సామ్రాజ్యానికి మహారాజువు.

నేను రాముని భార్యను బలవంతంగా తెచ్చినందువలన నీకేమీ నష్టము. అనవసరంగా రాముని వెంట యుద్ధంలో దిగి నీ ప్రాణాలను, మీవాళ్ల ప్రాణాలను ఎందుకు పోగొట్టుకొంటావు?

అందువలన స్నేహితుడైన నామాటవిని, నీవు, నీ సైన్యంతో హాయిగా కిష్కింధకు తిరిగి వెళ్లి మీ వాళ్లందరితో రాజ్యభోగాలను అనుభవించు. సుఖంగా రాజ్యపాలన చేసికో.

సముద్రము దాటి లంకపై దండెత్తడం అంత సులభమనుకుంటున్నావా ? కలలు కంటున్నావా? అది అసాధ్యము.

దేవదానవ గంధర్వులందరు కలిసి కూడ లంకానగరం వైపు కన్నెత్తి చూడజాలరు. నీకెందుకీ అనవసరశ్రమ ? నీవెందుకు అనవసరంగా నీశక్తి యుక్తులను వ్యర్థం చేసికొంటావు? నామాటవిని కిష్కింధకు తిరిగి వెళ్లి క్షేమంగా నీ రాజ్యాన్ని పాలించుకో"

రావణాజ్ఞతో శుకుడు ఆకాశవీధిలో ప్రయాణించి సముద్రతీరంచేరి సుగ్రీవుడున్న చోటుకు వెళ్లి ఆకాశంపై నుండే ఆయనకు రావణుని సందేశాన్ని వినిపించాడు.

శుకుడు సముద్రందాటి సుగ్రీవుని వైపు రావడం వానరవీరులందరు గమనించారు. వారందరు ఆయనను చుట్టుముట్టారు. ఆయన రావణ సందేశాన్ని వినిపించగానే ఆయనను బంధించి ఆయనను పిడికిళ్లతో కొట్టసాగారు. గోళ్లతో గీరసాగారు. బాహువుల మధ్య బంధించారు.

సుగ్రీవుడు శుకుని వైపు చూచి, నీవు రావణునితో నా సందేశాన్నిలా వినిపించుమని తెలిపాడు.

"రావణా! మొదటి నుండి నీకు నాకు మధ్య ఏ స్నేహ బంధములేదు. నీద్వారా నేనెన్నడు ఏ ఉపకారాన్ని పొందలేదు. పైపెచ్చు నీవు మా శ్రీరామచంద్రస్వామికి ప్రత్యక్ష శత్రువు, నాకు కూడ శత్రువే.

శ్రీరామచంద్ర స్వామి నాతో మైత్రీ బంధాన్ని ఏర్పరుచుకొని, "నన్ను అంతవరకే రాజ్య భ్రష్టుని చేసి, నా భార్యను అపహరించి, నన్ను అడవులకు తరుమ గొట్టిన దుష్టుడైన వాలిని చంపి, నాకు రాజ్యాన్ని, నావాళ్లను అందించాడు." అందువలన ఆయన నాకు ప్రాణమిత్రుడు. ఆయన శత్రువు అయిన నీవు నాకు బద్ధ శత్రువు. అందువలన నిన్ను, నీ బంధువులను మిత్రులను ఒక్కరిని కూడ విడువకుండా క్రూరంగా వధిస్తాను. లంకానగరాన్ని భస్మంచేస్తాను.

ముసలివాడైన జటాయువును ఏదో కష్టబడి చంపినంత మాత్రాన నిన్ను నీవు ఒకవీరుడవను కొంటున్నావా? మహాబలులైన రామలక్ష్మణుల ముందు నీవెంత ?

నీవు దేవేంద్రుని చాటుకు దాగి ఉన్నా, సూర్యపథంలో మాయమై ఉన్నా, పాతాళంలో ప్రవేశించినా నా నుండి తప్పించుకో జాలవు. త్రిలోకాలలో రాక్షసపిశాచ వర్గాలను పేరుకు కూడ లేకుండా చేస్తాను.

సీతాదేవి కారణంగా నిన్ను సంహరించే బాణాలు శ్రీరాముని అమ్ములపొదలో బుసలుగొడుతున్నాయి. ఎదిరిచూస్తున్నాయి." అని తీవ్రంగా సుగ్రీవుడు రావణ సందేశానికి బదులిచ్చాడు.

అప్పుడు అంగదుడు శుకుని చూచి "వీడుదూతకాడు. గూఢచారి. వీడిని లంకకు పోనివ్వకుండా ఇక్కడే బంధిస్తాము. వానరులకు బద్ధుడైన శుకుడు వారి పిడికిలి పోటులను భరించలేక దీనంగా, భోరున విలపిస్తూ శ్రీరాముని ఆశ్రయించి" మహాత్మా ! వీళ్లు నా కళ్లను పీకివేస్తున్నారు. నారెక్కలు విరగగొట్టుతున్నారు. నా గుండెను పిసుకుతున్నారు. నా ప్రాణాలు నిలిచేలా లేవు. దయచేసి నాకు ప్రాణదానం చేయుమని" మొరబెట్టుకొన్నాడు. "దూతను హింసించకూడదని" దయా సముద్రుడైన రామచంద్రుడు వారి హింసను మానిపించాడు.

"విభీషణునకు మాట యిచ్చేనట. నన్నియును
తన చేతిలో నున్నయటుల".

వారికి పోయెడిదేమో? పోయెడిది మనకు గాని

దైత్య విద్యలను నేర్వగ లేరు వేల్పుకిరియన

# దర్భశయనము - 17

సాగర తీరంలో శ్రీరామభద్రుడు దర్భలను పరచుకొని తూర్పుముఖంగా మౌనంగా పడుకొన్నాడు.

ఆయన పడుకొన్న తీరుచూస్తే ఒక సముద్రమునకెదురుగా మరొక సముద్రము పోటీ పడుతున్నదా? అన్నట్లు కనబడుతున్నది.

ఆయన తన భుజాన్ని తలగడగా పెట్టుకొని పడుకొన్నాడు. ఆయన భుజము తక్షకమహాసర్పపు పడగవలె ఉంది.

శ్రీరాముడు అయోధ్యలో ఉన్నప్పుడు ఆయన బహువు బంగారు ఆభరణాలతో అలంకరింపబడేది. భుజకీర్తులతో భూషింపబడేది. ముత్యాల నగలతో ముద్దు గొలుపుతుండేది.

సీతాకౌసల్యాది నారీమణుల చేత నలుగు పెట్టబడి ఉండేది. ఉత్తమ పరిచారికల చేత మర్దింపబడేది. (ఆ కాలంలో రాజులకు స్త్రీలే పరిచారికలుగా ఉండేవారు).

పాల సముద్రములో, పరమ పదంలో శ్రీభూ నీళాదేవుల చేత మర్దింపడేది. శ్రీరాముడు తనను మానవునిగా చెప్పుకొన్నా, వాల్మీకి శ్రీరాముని పరమాత్మగానే భావించాడు. అందుకే "విష్ణుర్జజ్ఞేసనాతనః" శ్రీరాముని జనన సమయంలో సనాతనుడైన విష్ణువు అవతరించాడు" అని తెలిపాడు.

కాబట్టి శ్రీరాముడు పరమాత్మ అనే భావంతో "శ్రీభూ, నీళాదేవులు (పరమనారులు) పరిచర్య చేసిన ఆయన భుజము" అని తెలుపబడింది.

ఆ భుజము చందనాగరు ద్రవ్యాలతో పరిమళించేది, ఉదయసూర్యుని వంటి రక్తచందనంతో అలంకరింపబడేది. ఇంతకు ముందు పడకటింటిలో సీతాదేవికి తలగడగా ఉండేది. గంగా స్నానంతో పవిత్రమైంది. తక్షకుని శిరస్సువలె విశాలమైంది. భక్తులకు మిత్రులకు ఆనందదాయకమైంది. వింటినారి రాపిడి వలన తొలగిన చర్మంకలది. మహా పరిఘవలె దీర్ఘమైంది. గుండ్రంగా ఉండేది. వేల ఆవులను దానం చేసేది.

అటువంటి దక్షిణ భుజాన్ని తలగడగా పెట్టుకొని శ్రీరాముడు పడుకొన్నాడు. ప్రాయోపవేశనియమాలను పాటిస్తూ దీక్షతో, మౌనంగా పడుకొన్నాడు.

వాచికంగా మౌనాన్ని, శారీరకంగా దీక్షతో, మానసికంగా పవిత్రంగా పడుకొన్నాడు రామభద్రుడు.

ఆ విధంగా సదాచార ప్రభువైన శ్రీరామచంద్రుడు మూడు రాత్రులు నియమంగా ఉండి సముద్ర దర్శనం కొరకు ఎదిరి చూచాడు. కాని సముద్రుడు కనబడలేదు.

"ఇదం బ్రాహ్మ్యం ఇదం క్షాత్రం। శాపాదపి, శరాదపి " అన్నట్లు ఇంతవరకు బ్రాహ్మ్య ధర్మాన్ని అనుసరించి ప్రాయోపవేశం చేశాడు.

నిజానికి శ్రీరాముని శరణాగతి "శరణాగతి" నియమాలకు అనుకూలంగా లేదు.

శరణాగతి భగవత్ప్రాప్తి ఉపాయాలన్నిటిలో ముఖ్యమైనది. కర్మజ్ఞాన భక్తులనేవి కూడ ఆశ్రయణోపాయాలుగా వేద విహితాలైనవి. ఇందులో మొదటి దానికంటె తరువాతది గొప్పగా చెప్పబడింది. అయితే అన్నిటికంటె చివర ఉపాయము శరణాగతి. ఈ శరణాగతికే "ప్రపత్తి" "న్యాసము" "భరన్యాసము" అని మరి కొన్ని పేర్లుశాస్త్రాలలో వివరింపబడ్డాయి.

"న్యాసమేషాంతపసాం వరిష్ఠమాహుః"

న్యాసము (శరణాగతి) తపస్సులు (ఉపాయములు) అన్నిటిలో శ్రేష్ఠమైనదిగా తెలుపుతారు.

అయితే శరణాగతికి ఏమైనా నియమాలు ఉన్నాయా? ఏ నియమాలు లేక ఎవ్వరైనా, ఎప్పుడైనా, దేనికైనా, ఎవ్వరినైనా శరణు వేడవచ్చా? కొన్ని శరణాగతిని నియమాలను గురించి విచారిద్దాము.

1) అధికారి నియమము : శరణాగతి చేయడానికి అధికారమెవ్వరికి ఉంది? లేదా ఎవ్వరు శరణాగతి చేయగల్గుతారు ? శరణాగతి చేయడానికి అందరికి అధికారము ఉంటుంది.

ఒక కాకి (కాకాసురుడు) ఒక గ్రద్ద (జటాయువు) ఒక ఏనుగు (గజేంద్రుడు) ఒక బోయవాడు (గుహుడు) ఒక స్త్రీ (శబరి) ఒక ముట్టైన ఆడది (ద్రౌపది) ఒక కోతి (సుగ్రీవుడు) ఒక రాక్షసుడు (విభీషణుడు) అందరు శ్రీరాముని శరణువేడినవారే కదా! దీనిని బట్టి శరణాగతి చేయడానికి మానవులే కాదు, సకల ప్రాణులు అధికారులే అని తెలుస్తున్నది.

2) ఫలనియమము : శరణాగతిని ఏ ఫలమాశించి చేయవచ్చు? లేదా శరణాగతి వలన ఏ ఫలము కల్గుతుంది?

శరణాగతి సర్వ ఫలప్రదము. అన్ని ఫలాలను కల్గిస్తుంది. "ఐహలౌకికమైశ్వర్యం! స్వర్గాద్యం పారలౌకికం! కైవల్యం భగవంతంచ"ఈ ప్రపంచంలో మనకు కావలసిన అన్ని సంపదలను, స్వర్గాది పరలోక సంపదలను, జన్మరాహిత్యాన్ని (కైవల్యాన్ని) సాక్షాత్తుగా భగవంతుని కూడ శరణాగతి మనకు ఫలంగా అందిస్తుంది.

3. విషయ నియమము : శరణాగతి ఎవ్వరి విషయంలో చేయాలి? లేదా ఎవ్వరికి చేయాలి? ఇదే ముఖ్య నియమము

సాధారణంగా పెద్దవారికి చిన్నవారు శరణాగతి చేయాలి. శ్రీరాముని శరణువేడిన కాకి, గ్రద్ద, బోయవాడైన గుహుడు, శబరి, సుగ్రీవుడు, విభీషణుడు మొదలైన వారందరు వాళ్లు కోరుకున్న ఫలాలను పొందారు.

శ్రీరాముడు పరమాత్మ. సకలఫల ప్రదుడు. విభీషణుడు ఈ విషయాన్ని అర్థం చేసికోలేదు. తాను శ్రీరాముని ఆశ్రయించే రామరక్షను పొందాడు కదా ! అలాగే సముద్రుని ఆశ్రయిస్తే సముద్రుడు కరుణించి తనను దాటే వరాన్ని అనుగ్రహిస్తాడు అనుకొన్నాడు.

తాను తిన్న మందు తనకు పని చేసింది కనుక అదే మందును రామునికి కూడ చెప్పాడు అమాయకుడైన విభీషణుడు. కాని విభీషణుడు అనుకొన్నట్లు రాముడు నరుడు కాదు. సముద్రుడు దేవుడు కాదు.

రాముడు శరణాగతి వేడవలసిన వాడు (శరణాగతుడు)కాదు. సముద్రుడు శరణు (రక్షణ) ను ఇవ్వదగినవాడు (శరణ్యుడు)కాదు.

శ్రీరాముడు సర్వలోక శరణ్యుడైన పరమాత్మ. సముద్రము పరమాత్మ చేత సృష్టింపబడిన నాలుగవ భూతము .

"తస్మాదాత్మనః (పరమాత్మ వలన )ఆకాశః సంభూతః

ఆకాశాద్వాయు ః వాయోరగ్ని ః అగ్నే రాపః"

పరమాత్మ మొదట ఆకాశాన్ని సృజించి దాని నుండి వాయువును దాని నుండి అగ్నిని, దాని నుండి జలాన్ని సృష్టించాడు. సముద్రుడు ఆ జలానికి అధిదేవత అయిన జీవుడు.

సకల సృష్టికర్త, తన చేత సృష్టింపబడిన ఒక భూతాన్ని ఆశ్రయిస్తే ఆ ఆశ్రయము (శరణాగతి ) ఫలిస్తుందా ? ఫలించదు. అదే జరిగింది. రామశరణాగతిలో రాముడు సముద్రునికి చేసిన శరణాగతి విఫలమైంది.

ఇంతవరకు శ్రీరామచంద్రుడు బ్రాహ్మ్య ధర్మాన్ని అనుసరించి శరణాగతి చేశాడు. అది విఫలమైంది. సముద్రుడు అంతకంతకు పైపైకి పొంగుతున్నాడే తప్ప తగ్గడంలేదు. ఆయన ప్రత్యక్షమై శ్రీరామునికి దారిచూపే మార్గమే కనబడలేదు.

శ్రీరామునిలో క్షాత్ర రోషము పైకి వచ్చింది. ఇంతవరకు ప్రశాంతంగా, పవిత్రంగా ఉన్న కళ్లలలో ఎరుపు రేఖలు కనబడ్డాయి. తన రక్తనేత్రాలతో లక్ష్మణుని చూచాడు.

“చూచావా! లక్ష్మణా! సముద్రుని గర్వాన్ని! ఆయన మనను కళ్లగానేట్లు లేదు.

లోకంలో ప్రశాంతత, సహనము, ముక్కుసూటిగా నడుచుకోవడం, వినయంగా మాట్లాడడం ఇవన్ని బలహీనుని లక్షణాలుగా భావించబడుతాయి.

తనను తాను పొగడుకోవడం, దయలేక పోవడం, వంచన, అహంకారము, బలహీనులను తరిమి వెంటాడడం మొదలైన చెడ్డ లక్షణాలన్ని బలవంతుని లక్షణాలుగా భావింపబతున్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే లోకం సజ్జనుని దుర్బలునిగా భావిస్తుంది. దుర్జనుని బలవంతునిగా గుర్తిస్తుంది.

ఈ రోజు “నేను సజ్జనుడినే కాని దుర్బలుడను కాదు” అని సాగరుని ముందు నిరూపిస్తాను. ఆయనకు నా కోపాన్ని రుచి చూపెడుతాను.

నా క్రూర నారాచాలతో (బాణాలతో) సముద్రజలాలను కదలకుండాచేస్తాను.

సకల జల జంతువులైన పెద్దపెద్ద చేపలను, మొసళ్లను, నాగసర్పాలను నాబాణాలతో ఖండించి వేస్తాను. సముద్ర జలాలను అల్లకల్లోలం చేసిశంఖాలను ముత్తెపుచిప్పలను పైకి తేలేలా చేస్తాను.

కొన్ని జంతువులకు చోటిచ్చే ఒక చిన్న నీటిగుంట నా ఓపికను బలహీనంగా భావించి అవమానించింది. నాకు నిజంగా దాని సహాయమే అవసరములేదు. ఏ వస్తువు యొక్క వ్యక్తి యొక్క సహాయము అక్కర లేకుండానే ఎంత పనినైనా చేసే శక్తి సామర్థ్యాలు నాకు ఉన్నాయి. ఛీ ఛీ! నా సహనమెంత నవ్వులపాలైంది! నా మంచి మాటలను సాగరుడెంత అవమానించాడు?”

నేను, ఈ సముద్రుడు ఇద్దరము సగర వంశీయులమే అయినా నాపై కనీస సోదర మర్యాదను కూడ ప్రదర్శించక, పాలితనాన్ని ప్రకటిస్తున్నాడు. నేను కూడ ఆయన మర్యాదనుమంటగలుపుతాను.

"లక్ష్మణా! నా చాపాన్ని తీసికొనిరా! చూపులతోనే విషాన్ని విరజిమ్మే భయంకర సర్పాల వంటి బాణాలను తీసికొనిరా! నా బాణాలతో ఈ సముద్రాన్ని ఎండగొట్టుతాను. నీరులేని భూమిపై ఈ వానరులంతా నడచిపోదురుగాక!"

లక్ష్మణుని పరిస్థితి అంతా అయోమయంగా ఉంది. తాను ఆదిశేషుడు. తాను శ్రియః పతికి శయ్య, అయితే తనకు (శయ్యగా) నివాస స్థానంగా ఉండేది సముద్రమే కదా !

ఇప్పుడు తనకు, పరమాత్మకు నివాస స్థానంగా ఉన్న సముద్రాన్నే రాముడు నీరు లేకుండా ఎండగొట్టుతాను అంటున్నాడు. ఆయన పూర్వ సంబంధాన్ని పూర్తిగా మరచి పోయాడు. కాని తాను కూడ మరచిపోతే ఎలాగా?

అయితే రాముని మాట తాను వినక తప్పదు. తనతల్లి ముందే హెచ్చరించింది. "రామే ప్రమాదం మాకార్షీః" రాముని విషయంలో ప్రమాదంగా (పరాకుగా) ఉండవద్దు" అని మరి ఇప్పుడేమి చేయాలి? రాముని మాటవినాలి. కాని సముద్రం ఎండిపోవద్దు.

"చాపమానయ సౌమిత్రే" ఆ ఒక్క ముక్కను పట్టుకొన్నాడు. నెమ్మదిగా శ్రీ రామునికి ధనస్సును తెచ్చిఇచ్చాడు.

ఒక్క ధనుస్సును మాత్రమే తెచ్చి ఇచ్చిన లక్ష్మణుని చూచాడు. "ఏమయ్యా! ఒక్కధనుస్సునే తెచ్చావు? బాణాలేవయ్యా ! బాణాలు లేకుండా ధనుస్సునేమి చేసికోవాలయ్యా? ఆడుకోవాలా? అని కొంత కోపంతో "శరాంశ్చ" బాణాలు కూడా తే" అని పలికాడు. అలాగే అని లక్ష్మణుడు బాణాలు తెచ్చాడు. కాని అవి సముద్రాన్ని ఎండింపజేసేంత తీవ్రమైనవికావు.

వాటిని చేతిలోకి తీసికొని రామచంద్రుడు చూచాడు. "ఏమయ్యా ! వీటితో పిట్టలను కొట్టాలా? సముద్రాన్ని శోషింపజేయాలయ్యా ! ఇవి దానికి పనికి వస్తాయా? చూపులతోనే విషాగ్నులను విరజిమ్మే క్రూర సర్పాలవంటి శరాలను తీసి కొనిరా! నాబాణాగ్నితో సముద్రి జలాలను మండింపజేస్తాను" అన్నాడు లక్ష్మణుని కూడ క్రూరంగా చూస్తూ.

లక్ష్మణుడు శ్రీరాముని క్రూర వీక్షణాలను చూచాడు, భయపడ్డాడు. తాను స్వామి ఆగ్రహాన్ని భరింప లేడు. ఇక తప్పదనుకొన్నాడు. స్వామి ఆజ్ఞాపించినట్లు క్రూర బాణాలను తెచ్చి ఇచ్చాడు."సముద్రుని గతి ఏమవుతుందో పాపము" అనుకొన్నాడు.

శ్రీరామ చంద్రస్వామి దిక్కులు పిక్కటిల్లేలా వింటినారినిలాగాడు. ఆ ధ్వనికి సమస్త భూతాలు భయంతో కంపించాయి. తన చేతిలోని క్రూరశరాన్ని సంధించాడు.

నారీధ్వనికే సముద్రమంతా అల్లకల్లోలమైంది. జలచరాలన్ని పైకి తేలుతున్నాయి. పాతాళంలోని మహా వీరులైన దానవులు భయంతో వణికి పోతున్నారు. "కోపంతో రాముడేమి అవుతాడో? ఎంత ప్రళయాన్ని సృష్టిస్తాడో" అని లక్ష్మణుడు రాముని ప్రక్కనే ఆయనకు ఆధారంగా నిలబడ్డాడు. ఇంతవరకు సముద్రుడెందుకు రాలేదు? రామునిపై గౌరము లేదా? ఆయనకు కోపంవస్తే నిజంగానే తానే మాడిపోడా? సముద్రునికి ఇవేవి తెలియవని కాదు.

అప్పుడు సగర వంశీయుడైన శ్రీరాముని పనిని నెరవేర్చడానికి వెళ్లుతున్నాడనే ఆదరాభిమానా లతో హనుమకు ఆతిధ్యమివ్వమని సముద్రుడు మైనాకుని కోరాడు కదా! ఇప్పుడు రామభద్రుడే తన దగ్గరికి వచ్చాడు. మూడు రాత్రులు ప్రాయోపవేశం చేశాడు. ఏమైపోయాయి రాముని కారణంగా (1) హనుమంతునిపై చూపిన ఆదరాభిమానాలు?

ఇప్పుడు శ్రీరాముడు ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. సముద్రుని ఎండగొట్టుతానని శరాన్ని ఎక్కుపెట్టిసిద్ధంగా ఉన్నాడు.

ఇప్పుడు సముద్రుడు కోరుకొన్న పరిస్థితి వచ్చింది.

ఏమిటీ సముద్రుడు రామాగ్రహాన్ని కోరుకొన్నాడా ?

అవును రామాగ్రహంతో సముద్రుడికి పని ఉంది. తనలో కొంత భాగంలో కొంతమంది దస్యులు ఉన్నారు. వారు సముద్ర జలాలన్నిటిని పూర్తిగా త్రాగివేస్తున్నారు. అక్కడ ఇసుక తేలింది. ఎడారి ఏర్పడింది.

ఆ విధంగా దస్యుల (ఆభీరుల) చేత ఏర్పడ్డ ఎడారిని జలమయం చేయడం సముద్రునికి సాధ్యం కాలేదు. "శ్రీరామాగ్రహాన్ని" అందుకు మళ్లిస్తే పని అవుతుందను కొన్నాడు. అందువలన శ్రీరాముని కోపం భయంకరాకారము దాల్చేదాక సముద్రుడు కనబడలేదు.

ఇప్పుడు శ్రీరాముని ఆగ్రహం తారా స్థాయికి చేరింది. " సముద్రుడా ! పాతాళంతో సహా నిన్ను ఈ అస్త్రంతో భస్మం చేస్తాను. నీలోని భస్మధూళి ఆకాశం దాకా పైకి లేస్తుంది.

వానరులందరు కాలినడకతో నీ పై నడచి వెళ్లుతారు. నా పౌరుషాన్ని రుచి చూడు" మని బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. ఆ అస్త్రము భయంకరమైంది. మూడు రంగులలో ఉంది దాని చివర శిఖరము ఉంది.

ఈ సమయం కొరకే ఇంతవరకు ఎదురు చూచిన సముద్రుడు మహా జలరాశి మధ్యనుండి దివ్యస్వరూపంతో పైకి వచ్చాడు. బంగారు భూషణాలతో, వైడూర్యమువలె నల్లని రంగుతో, ఎఱ్ఱని వస్త్రాలతో, తలపై పుష్పహారంతో, రత్న విభూషాలతో సముద్రుడు ఎగిసిపడుతున్న అలల మధ్య భయంకర రాక్షస, సర్పాల మధ్య పైకి వచ్చి శ్రీరామునికి తలవంచి నమస్కరించి శరణువేడాడు.

"శ్రీరామచంద్రుడు చల్లని మనస్సు కలవాడు. ఆయన మనస్సు వెన్న. దాసులమైన మన పట్ల ఆ స్వామి ఎప్పుడు దయామయుడుగానే ఉంటాడు. అయితే చల్లని నీటిని మంటతో వేడి చేసినప్పుడు ఆ నీరే భగభగమనేలా వేడి అయినట్లు మనము చేసే దోషాలు మితిమీరినప్పుడే మనను బాగు చేయాలనే ఉద్దేశ్యముతో తండ్రివలె కోపానికి వస్తాడు. ఆవిషయాన్నే

"పితేవత్వత్ప్రేయాన్ పరిపూర్ణాగసిజనే! హితస్రోతో బుద్ధ్యా భవతిచ కదాచిత్ కలుషధీ ః" అని పరాశర భట్టరు వారు శ్రీగుణ రత్న కోశంలో వివరిస్తారు.

అయితే అంత ఆగ్రహించిన ఆ స్వామి ఒక్కసారి మనము తలవంచి చేతులు జోడించి ఆయన ముందు నిలబడగానే ఆయన అంతటి కోపము నిమిషంలో చల్లబడుతుంది.

అలాగే సముద్రుడు తలవంచి అంజలిబద్ధుడై శ్రీరాముని వైపు ఒక్కొక్క అడుగువేసి వస్తుంటే రాముని అంత కోపము మంచువలె కరిగిపోయింది.

"జలరాజా ! ఇంతజాగేల చేశావయ్యా ! నాకు అనవసరంగా కోపం తెప్పించావు కదయ్యా " అని అర్ణవపతిని అడిగాడు శ్రీరామ ప్రభువు.

సముద్రుడు భయం తొలిగి. "ప్రభూ! నీవు సకలచరాచర సృష్టికర్తవు. అన్ని వస్తువులను, వాటి స్వభావాలను కూడ నీవే సృష్టించావు కదా !

భూమికి కాఠిన్యాన్ని, గాలికి వంకరగా తిరుగడాన్ని, ఆకాశానికి అన్నిటిలో వ్యాపించడాన్ని, అగ్నికి పైపైకి మండటాన్ని నీవే వాటి స్వభావాలుగా కల్పించావు. అలాగే

సముద్రుడనైన నాకు గ్రంభీరంగా లోతుగా ఉండటాన్ని, ఎవ్వరిని దాటి వెళ్ల నీయకుండా నిరోధించడాన్ని, అలలతో ఎగిరిపడడాన్ని నీవే కదా నియమాలుగా ఏర్పాటు చేశావు.

నీనియమాలనే పాటించాను కదా ప్రభూ! నీ నియమాలను పాటించక పోతే దోషము కాని పాటిస్తే దోషమా ? నా నియమాలను పాటించడము వలన నిన్ను ఆదరించలేక పోయాను. అది నా అపరాధమే కాదనను. ఆగ్రహించినా అనుగ్రహించినా నీవే కదా మా దిక్కు! మన్నించు మహాత్మా" అని వేడుకొన్నాడు.

సముద్రుడు చేసిన శరణాగతికి రామయ్య తండ్రి పూర్తిగా శాంతించాడు.

మూడురోజులైనా రాముడు చేసిన శరణాగతి ఫలించలేదు. సముద్రుని శరణాగతి తక్షణమే ఫలించింది. అంటే "శరణాగతిలో "విషయం" అంటే ఎవ్వరిని శరణు వేడాలన్నదే ముఖ్యమని తెలిసింది కదా!

"జలదేవా! నీ నియమాలను సాధారణంగా తప్పక పాటించవలసిందే. కాని నీ నియమాల ఏర్పాటుకు కారణమైన నేనే నీ దగ్గరికి వచ్చినప్పుడు నియమాల పేరుతో నన్నే ధిక్కరించడం పాపమవుతుంది. నా కొరకు నియమాలను వదిలినా అది పుణ్యమే అవుతుంది.

"మదర్థం కృతం పాపం ! పుణ్యాయ పరికల్ప్యతే"

నీవు కనబడక ఆలస్యం చేశావు. కనుక నా కోపము పెరిగిపోయింది. నిన్ను శిక్షించాలని బ్రహ్మాస్త్రానే సంధించాను. నీకు తెలుసు కదా "రాముని అస్త్రం వ్యర్థం కాకూడదు" ఇప్పుడు నేను సంధించిన ఈ అస్త్రాన్ని ఎక్కడ ప్రయోగించాలో తెలుపుమని కోరాడు.

అప్పుడు ఆనందంతో అబ్ధిరాజు "మహాప్రభూ !నీ ఆగ్రహం కూడ నాకు అనుగ్రహమే అయింది. నాలో కొంతభాగాన్ని నా శత్రువులైన కొందరు దస్యులు ఎడారిగా మార్చారు. నా జలాన్ని అంతా పీల్చి వేస్తున్నారు. నీ అమోఘమైన బ్రహ్మాస్త్రాన్ని నాశత్రువులపై ప్రయోగించి, వారి బాధను శాశ్వతంగా తొలగించు"మని రామభద్రుని ప్రార్థించాడు.

రామభద్రుని చేతి నుండి వాయువేగంతో ఆఅస్త్రము విడువబడింది. సముద్ర మధ్య భాగంలో తల్లదాచుకొన్న దస్యులనందరిని తక్షణమే భస్మము చేసింది. మరు భూమి బ్రద్దలైంది. అందులో జలము విరజిమ్మింది. ఆచోట సుగంధద్రవ్యాలు, తీయనితేనె, పచ్చని పశుగ్రాసము, కమ్మని నేయి, అద్భుత ఔషదులు పెరుగాలని రామప్రభువు వరమిచ్చాడు. దానినే "ద్రుమకుల్యము" అంటారు.

సముద్రుడు సంతోషంతో తనపై నుండి రామలక్ష్మణులు వానర సేన ప్రయాణం చేయడానికి ఒక చక్కని ఉపాయం తెలిపాడు.

"స్వామి మీ వానర సేనలో "నలుడని" ఒక వానరోత్తముడు ఉన్నాడు. ఆయన దేవశిల్పి అయిన విశ్వకర్మ కుమారుడు.

విశ్వకర్మలోని సమస్త నిర్మాణ శక్తి నలునికి వారసత్వంగా తండ్రి ప్రసాదంగా లభించింది. అందువలన ఆయన చేతులతో నీళ్లలో, రాళ్లను , ఇటుకలను, చెట్లను వేటిని వేసినా అవి మునుగవు. అందు వలన నలుడు మీరు లంకకు నడిచి వెళ్లడానికి వీలుగా ఒక అద్భుతమైన సేతువును నిర్మింపగల్గుతాడు. మీ కొరకు ఏర్పడిన ఈ సేతువు "రామసేతువు" అనే పేరుతో యుగయుగాలుగా శాశ్వతంగా నిలిచి పోతుందని" వరమిచ్చి అబ్దినాధుడు అదృశ్యమయ్యాడు.

సముద్ర శరణాగతి వేదాంత పరంగా చాల ప్రధానమైనది.

శరణాగతి నియమాలలో "విషయ నియమము" చాల ముఖ్యమైనది. ఎవ్వరిని ఆశ్రయిస్తే మనకు కోరిన రక్షణ లభిస్తుందో చూచుకొని, వారికే శరణాగతి చేయాలనేది విషయ నియమము.

రాముడు సముద్రుని శరణువేడితే ఫలించలేదు. సముద్రుడే రాముని శరణువేడితే తక్షణమే ఫలించింది.

అసమర్థునికి చేసిన శరణాగతి ఫలించదని రాముని ప్రాయోపవేశం తెలిపింది. రాముడు స్వయంగా పరమాత్మ. పరమాత్మ విషయంలో ఇతరులు చేసిన శరణాగతి ఫలిస్తుందని సముద్రుని, కాకాసురుని, సుగ్రీవాదుల శరణాగతి నిరూపించింది.

అయితే ఇంతకంటె మరొక ముఖ్యమైన వేదాంత విషయాన్ని మనము దృష్టిలో పెట్టుకోవాలి.

సముద్రునిపై ఆగ్రహంతో ఎక్కుబెట్టిన బాణాన్ని, ఆయన శరణాగతి చేయగానే ఆయన (సముద్రుని) శత్రువులైన దస్యులపైకి ప్రయోగించాడు రామచంద్ర పరబ్రహ్మ.

ప్రపన్నునికి "అయమేవ చరమోదేహః" అని వరదరాజ స్వామి ప్రసాదించినట్లు ఈ శరీరమే అంతిమ శరీరం అవుతుంది. తరువాత పరమ పదమే లభిస్తుంది. కాని ఎలా? ప్రపన్నుడికి కూడ పుణ్య పాపాలు మిగిలి ఉంటాయే? "పుణ్యపాపే విధూయ,

నిరంజనః పరమం సామ్యముపైతి" పుణ్యపాపాలను పోగొట్టుకొని ఏమరక లేని వాడై పరమాత్మతో సామ్యాన్ని పొందుతాడని కదా శ్రుతి వివరిస్తుంది.

మరి ప్రపన్నుడు చేసిన పుణ్యపాపాలు ఈ దేహంతోనే లేకుండా పోయేదెలా ? ఇక్కడ కర్మల స్వరూపాన్ని పరిశీలిద్దాము

మనము ఇది వరకు అనేక జన్మలలో కర్మలను చేశాము. వాటిని గుట్టలు గుట్టలుగా కూడబెట్టు కొన్నాము. అటువంటి కర్మలను "సంచితములు" అంటారు.

వాటిలో కొన్నిటిని ఈ జన్మలో అనుభవించడం మొదలు పెట్టాము. వాటిని "ప్రారబ్ధాలు" అంటారు.

ఇప్పుడు కూడ కొన్ని పనులు చేస్తున్నాము. రాబోయే జన్మలలో కూడ చేస్తాము. వాటిని "ఆ గామికర్మలు" అంటారు.

ప్రపన్నులైనా, సామాన్యులైనా ప్రారబ్ధఫలాన్ని తప్పక పూర్తిగా అనుభవించవలసిందే! "ప్రారబ్ధం పరిభుజ్య" అంటారు ఆత్తాన్ వరద దేశికులు.

"సంచితాల" విషయంలో, "ఆగామి" కర్మల విషయంలో ప్రపన్నుడి పట్ల పరమాత్మ తన అపార కృపను ప్రదర్శిస్తాడు. దాని ఫలితంగా "సంచితాలు" భస్మమవుతాయి. "ఆగామికర్మల ఫలితము" అంటుకోదు.

"తదధిగమ పూర్వోత్తరాఘయోః అశ్లేషవినాశౌ" అంటుంది వేదము.

ఇక్కడ "సంచితాగామి కర్మలను" "అఘములని" శ్రుతి పేర్కొంటుంది వేదము. కాని అవి నిజానికి కేవలము పాపాలేకాదు. పుణ్య పాప రూపంగా రెండు రకాల ఉంటాయి. అయితే ఈరెండింటిని "పూర్వోత్తరాఘములు" అని పాపాలుగానే ఎందుకు పేర్కొన్నది వేదము?

ఎందుకంటే ప్రపన్నుడికి పాపాలతో పాటు పుణ్యాలు కూడ ఇష్టమైనవి కావు. "పుణ్యమపి పాపత్తోడొక్కుం" అంటారు పెద్దలు.

పాపాలు నరకానికి తీసిక వెళ్లుతాయి కదా! అప్పుడు పుణ్యాలు పాపాలతో సమానమెలా అవుతాయి?

ఎలా అంటే ప్రపన్నుడికి స్వర్గము కూడ అవాంఛనీయమే. నరకమెలా పరమాత్మ నుండి మనను దూరము చేస్తుందో, స్వర్గము కూడ పరమాత్మ నుండి దూరము చేసేదే కదా!

ఇక స్వర్గము సుఖమంటారా? ఎప్పుడు స్వర్గం నుండి పడిపోతామో అనే భయంతో కూడిన అల్ప సుఖము అనంతము శాశ్వతము అయిన బ్రహ్మానందము ముందు కోర దగిందే కాదు కదా!

అందువలన ప్రపన్నుడు పుణ్య పాపాలను రెండింటిని "మరకలు"గానే భావిస్తాడు. కాకపోతే "పుణ్యము తెల్లని సున్నము మరక "అయితే" పాపము నల్లని బొగ్గు మరక". ఈ రెండు కూడ కడుక్కోవలసినవే కదా!

అందువలననే ప్రపన్నుడు తానే చేసే పనులను ఏవైనా తన కొరకని (మమకారంతో) తానుచేస్తున్నానని (అహంకారంతో) అనుకోకుండా "పరమాత్మ తన ఆజ్ఞగా తన ప్రీతి కొరకు నా చేత చేయించుకొంటున్నాడని" భావిస్తాడు. తన కొరకు కాదని (మమకారం లేకుండా) తాను కాదని (అహంకారం లేకుండా) చేసిన పనులేవైనా ప్రపన్నునికి అంటుకోవు (అశ్లేషః). అందువలన ఉత్తరాఘముల స్పర్శే ఉండదు. ఉత్తరాఘముల మాట సరేకాని పూర్వకర్మ మనను విడిచి పెట్టదే?

"అవశ్యమను భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం" అని శాస్త్రము తెలుపుతుంది కదా!

"యధాధేను సహస్రేషు ! వత్సోవిందతిమాతరం !

తధా పూర్వకృతం కర్మ కర్తారమనుగచ్ఛతి" అంటుంది శాస్త్రము.

ఒక దూడ వేల ఆవులలో తన తల్లి ఆవును ఎలావెతికి పట్టుకొంటుందో పూర్వకర్మ కూడ చేసిన వాడిని ఏజన్మలో ఎక్కడ ఉన్నా విడువకుండా తప్పక పట్టుకొంటుంది.

అందువలన "పూర్వకర్మ చేతులు" మనను పట్టుకోవడానికి పొడవుగా, పెద్దగా ఉంటాయి అంటారు. అందువలననే "సంచిత కర్మను దీర్ఘ బాహువు లేక సుబాహువు" అంటారు.

శ్రీరామాయణంలో తాటక పుత్రులు ఇద్దరు ఉన్నారు.

1. సుబాహువు 2. మారీచుడు

సుబాహువు సంచిత కర్మ స్వరూపము

మారీచుడు ఆగామి కర్మ స్వరూపము

శ్రీరాముడు సుబాహువును ఆగ్నేయాస్త్రంతో భస్మంచేస్తాడు. మారీచుని వాయువ్యాస్త్రంతో సముద్రము బయటి తీరంలో పడగొడుతాడు.

దీని వలన పరమాత్మ తన కరుణతో సంచితాన్ని నశింపజేస్తాడు. ఆగామిఫలాన్ని దూరంచేస్తాడని అర్థము.

ఆండాళుతల్లి "మనకు ఆటంకాలు రాకూడదంటే పరమాత్మ నామాన్ని అనుసంధించండి. భగవన్నామాను సంధానం వలన పాపాలు నిప్పులో పడ్డ దూది రాశివలె మాడిపోతాయి" అని తెలుపుతుంది.

"తీయనిల్ తూశాగ్ం - శెప్పు"

ప్రపన్నుడి విషయంలో కర్మలకు మరొక పరిష్కారము సూచింపబడింది. 'సముద్రశరణాగతి' ముందు సముద్రుడు శ్రీరామునికి కనబడకుండా ఆయన నిగ్రహానికి పాలుపడ్డాడు. భగవన్నిగ్రహకారణమే పాపము అనబడుతుంది.

"యత్త్వత్ప్రియం తదిహపుణ్యమ్ అపుణ్యమన్యత్"

అయితే అదే సముద్రుడు కొంత సమయం తరువాత అంజలిఘటించి శ్రీరామునికి ప్రపత్తి చేశాడు.

ముందు సముద్రుడు చేసిన ఆలస్యానికి (పాపానికి) శిక్షగా ఎక్కుబెట్ట బడింది రామబాణము!

ఆ తరువాత ఆయన చేసిన ప్రపత్తికి ఫలముగా ఆ రామబాణము (పాపశిక్ష) సముద్రునిపై కాకుండా ఆయన శత్రువులైన దస్యులపై బడింది.

అందువలన కరుణామయుడైన పరమాత్మ ప్రపన్నుని అనుగ్రహింపదలచి పుణ్యపాప ఫలాల నుండి అతనిని విముక్తిని చేయదలచి ("పుణ్యపాపే విధూయ"గా చేయదలచి) ఆయన కర్మ ఫలాలను ఆయన వారసులకు పంచిపెడుతాడు.

వారసులు అంటే ప్రపన్నుని సంతానం కావచ్చు ఆయన బంధు మిత్రులు కావచ్చు. వారసులు ప్రపన్నునికి ప్రేమ పాత్రులయితే ఆయన పుణ్యాల ఫలితాన్ని అందుకొంటారు.

ఆయనను ద్వేషించే వారయితే, ప్రపన్నుల పాపాల ఫలితము (సముద్రుని శత్రువులయిన దస్యులపై రామబాణం పడ్డట్లు) ఆ ద్వేషులపై తప్పక పడుతుంది.

"అందువలన ప్రపన్నుని ప్రశంసించాలి కానిద్వేషించకూడదు"అని శాస్త్రనీతి.

ఇలా జరుగడానికి శాస్త్రాలు అంగీకరిస్తాయా ? తప్పక అంగీకరిస్తాయి.

"యథాదాయాదయః దాయముపయంతి" అని మరొక ఉదాహరణాన్ని న్యాయ శాస్త్రము తెలుపుతుంది.

ఒక వ్యక్తి తన జీవితంలో కావలసినంత ఆస్తిని (పుణ్యఫలాన్ని) కూడ బెట్టాడు. ఆ ఆస్తి ఆ వ్యక్తి తరువాత చెందేది ఆయన వారసులకే, (దాయాదులకే) కదా!

అలాగే మరొక వ్యక్తి తన జీవితంలో చాల అప్పుచేశాడు. ఆయన తరువాత ఆయన అప్పును (పాపఫలాన్ని) కూడ తీర్చవలసింది ఆయన వారసులే కదా!

మరో ప్రశ్న:- ఒక వ్యక్తికి స్వంత సంతానంలేదు, దాయాదులు కూడలేరను కొందాము. అప్పుడు ఆయన కర్మఫలములు ఆస్తి అప్పులు ఏమవుతాయి ?

అప్పుడు ఆయన ఆస్తిని ప్రభుత్వము స్వంతం చేసి కొంటుతుంది. ఆయన అప్పును రద్దుచేస్తుంది. అలాగే ప్రపన్నుని పుణ్యపాపకర్మలను కూడ వారసులు లేక పోతే భగవంతుడు రద్దుకావిస్తాడు.

ఇదిగో ఇంతటి వేదాంతార్థాన్ని సముద్రశరణాగతి తెల్పింది.

-- ఇతిశం --

నై తానన్ వచ్చిన దోసమంతయు నావంకన్ నిరూపింతు:
నీ వైనన్ దైవమవండ్రు॥ నీకు కృప లేదందున్ మరెట్లైనచో"

"నేను లేడిని కోరినందు వలననే కదా! సుగ్రీవ రక్షణ,
సముద్ర తరణము. రావణ వధాకీర్తులు కలిగినవి. నాది
అపచారమా? నీకు కీడా?

"నివురుల్ గప్పిన నిప్పు: రాఘువునకున్ నీరాజనం బిచ్చెదన్"

# సేతు నిర్మాణము - 18

సముద్రుడు సేతు నిర్మాణం గురించి తెలిపిన తరువాత నలుడు శ్రీరాముని వద్దకు వెళ్లి "ప్రభూ! నేను సాగరుడు తెల్పినట్లు విశ్వకర్మ పుత్రుడను. మాతల్లికి" నీపుత్రుడునా అంతటి వాడవుతాడు" అని మా తండ్రి వరమిచ్చాడు.

మా తండ్రి వర ప్రసాదంగా ఆయన నిర్మాణ కౌశల్యమంతా నాకు వారసత్వంగా లభించింది. అయితే సముద్రుని కంటే ముందే నేను నాగురించి మీముందు చెప్పుకొంటే "ప్రగల్భాలు పలుకుతున్నాడు." అని మీరు అనుకొంటారని నేను మీ ముందుకు రాలేదు.

సముద్రుడు వరమిచ్చినట్లు వానరవీరులు నాకు "శిలలను, వృక్షాలను" అందిస్తే వాటితో సేతువును నిర్మిస్తానని" మనవి చేసుకొన్నాడు.

నలుని మాటలను విని రామకార్యం కొరకు సమస్త వానరులు పెద్దపెద్ద శిలలను, గిరుల శిఖరాలను, మహా వృక్షాలను పెకిలించి తెచ్చారు. వాటిని నలుడు సముద్రంలో వేస్తూ ఇటు అటు అంచులను పగ్గాల సహాయంతో సరిచూస్తూ, తీగల సహాయంతో తరులను, గిరులను బంధిస్తూ సేతువును నిర్మించ సాగాడు.

సముద్రుని వర ప్రభావం వలన నీటిలో వేసిన తరువులు, గిరులు మునిగి పోకుండా తేలి ఉన్నాయి.

రావణుడు ఏకాంతంగా వచ్చి, సేతువును వీక్షించి "అప్సు పాషాణాః ప్లవంతే కాలస్యకుటిలాగతిః"

అరే నీళ్లలో రాళ్లు తేలుతున్నాయే కాలమెంత విచిత్రమైంది? అని ఆశ్చర్యపడ్డాడు.

మొదటి రోజు కావడం వలన కొంతపని ఆలస్యంగా మొదలై పద్నాల్గు యోజనాల దూరము సేతువు కట్టబడింది. రెండవ రోజు ఇరువై యోజనాలు, మూడవ రోజు ఇరువై ఒకటి, నాల్గవ రోజు ఇరువై రెండు, అయిదవ రోజు ఇరువై మూడు యోజనాల దూరముతో పదియోజల వెడల్పుతో సేతు నిర్మాణం పూర్తి అయింది. (14+20+21+22+23=100)

ఆకాశమార్గంలో సూర్యచంద్రులు సంచరించే మార్గము మధ్యలోని "స్వాతి పథము"వలె ఉత్తరము నుండి దక్షిణంగా అద్భుతంగా లవణ మహాసముద్రముపై సేతు నిర్మాణం జరిగింది. కట్టిన ఇంజనీరు నలుడైనా రామకార్యం కొరకు నిర్మించబడింది. సముద్రుని వరము మేరకు అది రామసేతువుగా తరతరాలుగా యుగయుగాలుగా

రామచరిత్రను భారతీయులకే కాక విశ్వమానవులందరికి అందిస్తు వస్తున్నది.

అంతటి సుప్రసిద్ధమైన రామసేతువును "అది నిజంగా రాముని కాలంలో నిర్మింపబడిందా ? ఒక వేళ నిర్మింపబడితే ఇంతకాలము ఎలా ఉండగలగింది ? అనే అల్పప్రశ్నలు అడిగే వాళ్లు మన దేశంలోనే రోజురోజుకు ఎక్కువవుతున్నారు.

వీళ్ల కంటె పండితమ్మన్యులు మరికొంత మంది తమ అతి తెలివిని ప్రదర్శిస్తున్నారు. "రామసేతువు రాముని కాలంలో నిర్మింపబడినట్లు రామాయణశ్లోకాలను చదివి చెప్పుతున్నారు కదా ! అసలు రాముడనే వాడు ఒకడున్నాడా ? అన్ని యుగాల క్రింద అసలు నాగరికత ఉందా? ఇలా అనేక ప్రశ్నలు వేస్తూ తమ అతి తెలివి తేటలను ప్రదర్శిస్తున్నారు.

"సూర్యవంశ రాజుల చరిత్రలను సూచించే రామాయణము (ఇతిహాసము) చరిత్ర కదా" అంటే అది పుక్కిటి పురాణము అని కొట్టిపారేస్తున్నారు. ఒక ప్రమాణం పై విశ్వాసంలేక నోటికి వచ్చినట్లు మాట్లాడే వారితో రామాయణేతిహాసం ప్రమాణాన్ని త్రికరణశుద్ధిగా నమ్మే మనకు వాదం ఎందుకు ? వృధా కాలయాపనమెందుకు ?

మరికొంత మంది నాస్తిక శిఖామణులు "ఈ సేతువు ఎందుకు ? దీనిని కూలగొట్టి తీరవలసిందే" అని తీర్మానిస్తున్నారు. అయితే భగవన్నిర్ణయం ఈ నాస్తికుల వాదనలకు, తీర్మానాలకు అనుకూలంగా కనబడడం లేదు. వారి ఆటలు సాగేలా లేవు.

భూగర్భ శాస్త్రవేత్తలు "ఈ సేతువును కూలగొడితే సాగర గర్భజల వ్యవస్థే తలక్రిందులవుతుంది. అది అత్యంత ప్రమాదకరమని" హెచ్చరిస్తున్నారు.

అసత్యాలు ఏవి చెప్పినా విని తీరవలసిన చెవులే తప్ప నిజాన్ని చూడడానికి కళ్లే లేని మన న్యాయ వ్యవస్థ తీర్పు ఎలా ఉంటుందో? శాస్త్రవేత్తల హెచ్చరికలు ఒక వైపు, కోట్లాది భారతీయల , విశ్వహిందువుల ప్రాణత్యాగ ప్రకటనలు మరొక వైపు "సేతు నిర్మూల ప్రయత్నాన్ని అడ్డుకొంటున్నాయి.

అద్భుతమైన నలసేతు నిర్మాణాన్ని దేవగంధర్వ, సిద్ధచారణాదులు, తపస్సంపన్నులైన మహర్షులు అత్యాశ్చర్యంతో వీక్షించారు. రామ లక్ష్మణులు, సమస్త వానర వీరులు ఆ సేతువుపై కాలినడకతో లంకకు చేరుకొన్నారు. రావణవధకొరకు రామరాజ్యపాలన కొరకు దేవతలు, ఋషులు ఆశీర్వదించారు.

# పదేపదే రావణచారులు - 19

## సేనావ్యూహరచన

సేతు నిర్మాణము తరువాత రాముడు వానర సేనా సమేతంగా లంకలోకి ప్రవేశించాడు. లంకా నగర సౌందర్యమునకు ఆశ్చర్యపడ్డాడు. సీతను తలచుకొని దు:ఖించాడు.

యుద్ధ సమయంలో విచారము తగినదికాదని మనస్సును మరల్చుకొని వానరసేన నంతటిని రాముడు గరుడ వ్యూహముగా తీర్చాడు.

నీలుని పరివారంతో కూడ అంగదుడు హృదయ భాగంలో ఉండాలి. ఋషభుడు, గంధమాదనుడు తమ తమ సేనలతో కుడి ఎడమలలో నిలుచోవాలి.

వేగదర్శి, సుషేణుడు, జాంబవంతుడు ఈ ముగ్గురు తమతమ సేనలతో గర్భభాగాన్ని రక్షించాలి.

రామలక్ష్మణులిద్దరు శిరోభాగంలో రక్షకులుగా ఉండాలి. పశ్చిమ దిశను వరుణుడు కాపాడినట్లు వ్యూహము యొక్క చివర (తోక) భాగంలో సూర్యపుత్రుడైన సుగ్రీవుడు తన సేనతో ఉండాలి.

## శుకచార విమోచనము

"సముద్రాన్ని దాటి, లంకలో సేనా వ్యూహమును ఏర్పరచాక శుకుడు అంతా చూచాడు. తిరిగి వెళ్లాక మన బలాల గురించి రావణునికి భయము కలిగేలా చెప్తుతాడు. కనుక ఆ చారుని విడిచి పెట్టండి" అని రాముడు వానరులకాజ్ఞాపించాడు. వానరులు విడిచిపెట్టారు. చారుడైన శుకుడు రావణుని దగ్గరకు వెళ్లాడు. దెబ్బలు తిని వచ్చిన శుకుని జూచి రావణుడు, "ఓరి శత్రువులకు చిక్కావా ? ఏమైంది ?" అని అడిగాడు.

అప్పుడు శుకుడు "ప్రభూ మీరు చెప్పినట్లే నేను వానర సేన మధ్యలోకి వెళ్లి సుగ్రీవ మహారాజును రామపక్షము వదిలి వెళ్లుమని" మీ సలహాగా చెప్పాను.

"నేను మాట పూర్తి జేసేలోపే వానరులందరు నాపైబడి నన్ను నేలకు బాది, నన్ను బంధించారు." ఈ మధ్యలో శ్రీరాముడు సముద్రుని సలహా ప్రకారం సేతువును నిర్మించి, వానరసేనతో సముద్రము దాటి లంకలోకి వచ్చాడు. వారసేననంతా వ్యూహంగా విభజించాడు.

దయామయుడైన శ్రీరాముని ఆజ్ఞమేరకు వానరులు నన్ను వదిలారు.

మహా రాజా ! ఇప్పుడు మీకు రెండు మార్గాలు ఉన్నాయి. ఏదో ఒకటి తప్పదు.

భయంకరమైన వానర సేనా వాహిని ముట్టడిని తప్పించుకోవాలంటే శ్రీరామ చంద్రునికి సీతాదేవిని సమర్పించాలి.

లేదా శ్రీరామ భద్రుని భయంకర బాణాగ్నిని ఎదుర్కోవడానికి సిద్ధము కావాలి."

శుకుని మాటలు విని రావణుడు కోపంతో "ఏమిరా భయంతో నేను సీతాదేవిని రామునికి అప్పగించాలా?

దేవదానవులందరు కలసినన్నెదిరించినా నేను భయపడను. రామునికి నా పరాక్రమము తెలియక నాపై యుద్ధానికి వచ్చాడు. ఆయన తమ్మునితో సహా, సమస్త వానర సేనతో సహా నా బాణాగ్నికి భస్మము కాకతప్పదు. ఇక నీవు వెళ్ల వచ్చునని ఆయనను బయటకు పంపివేశాడు.

# మళ్లీ చారులు

# శుక సారణులు

ఆ తరువాత శుక సారణులనే మంత్రులను పిలిపించి గర్వంతో "శ్రీ రామలక్ష్మణులు వానర సేనతో సముద్రందాటి లంకలోకి ప్రవేశించారు. మీరు సాగరతీరానికి వెళ్లి వాళ్లు చేసిన పనులను, వాళ్ల స్వరూప స్వభావాలను పరిశీలించి నిజంగా వాళ్లు సేతువును నిర్మించారా? వాళ్ల సైన్యంలో మంత్రులెవ్వరు? సేనాధిపతు లెవ్వరు ? వాళ్ల బలాలెటువంటివి? అన్ని తెలుసుకొనరండి" అని ఆజ్ఞాపించాడు.

శుకసారణులు రావణాజ్ఞ వలన వానరవేషాలు ధరించి సముద్ర తీరంలో ఉన్న వానరసేనలో కలిసి పోయారు. వారు అంతట తిరుగుతూ, అన్ని లోతుగా పరిశీలిస్తుండగా, విభీషణుడు వాళ్లను గుర్తించి రామచంద్రుని ఎదుట ప్రవేశపెట్టాడు.

మృత్యుభయంతో వారు వణకి పోతూ తాము రావణాజ్ఞను బట్టి రహస్యంగా వచ్చామని, తమను చంపవద్దని రామచంద్రుని వేడుకొన్నారు.

వారు తమ ప్రాణరక్షణకై తనను శరణువేడారు. అందు వలన వారిని చంపదలచక "చారులారా మీకే భయంలేదు. మీ రాజాజ్ఞను బట్టి మీరు మాసేననంతా చూడండి. అందరి గురించి తెలిసికొని వెళ్లి మీ రాజుకు తెలుపండి. ఆయుధము పట్టుకొని ఎదుటికి వచ్చి నిలబడ్డ శత్రువును మాత్రమే మేము సంహరిస్తాము" అని రాముడు వారిని స్వేచ్ఛగా వదిలివేశాడు. వాళ్లు వానరసేననంతటిని పరిశీలించి, యోధుల యొక్క పేరులను వారి శక్తులను గురించి తెలిసికొని రావణుని వద్దకు తిరిగి వెళ్లారు.

చూచారా రామచంద్రస్వామి దయా స్వభావము ! ఆయన ధర్మశీలము! ఆయన ఆశ్రితరక్షా దీక్ష! ఆయన అచంచల ధైర్యము!

రావణునికి శుక సారణుల ధర్మ బోధ : శుకసారణులు రావణుని దగ్గరకు వెళ్లి మహారాజా! మీ ఆజ్ఞను అనుసరించి మేము వారికి తెలియకుండా ఉండేందుకు వానర రూపాలతో వానర సైన్యంలో ప్రవేశించాము. కాని విభీషణ ప్రభువు మమ్మల్ని మొట్ట మొదటే గుర్తించి బంధించి రామచంద్రుని ఎదుట నిలబెట్టాడు.

మాపై ప్రాణాలు పైననే పోయాయి. కరుణామయుడైన కోసల ప్రభువు పాదాలపై పడి ప్రాణరక్షను కోరాము. ఆ మహోదారుడు మాకు అభయమిచ్చి "మీ ఇష్టము వచ్చిన విషయాలన్నిటిని తెలిసికొని వెళ్లండి" అని వదలి వేశాడు. మేమక్కడ ఏ ఆటంకం లేకుండా అన్ని విషయాలు తెలిసికొని వచ్చాము.

లంకేశ్వరా! నలుగురు దిక్పాలకుల వంటివారు రామ లక్ష్మణ సుగ్రీవ విభీషణులు. అందులో ఒక్కొక్కరే మన సమస్త సైన్యాన్ని భస్మం చేయగల సమర్థులు. అటువంటిది వారంతా వేరు చేయరాని విధంగా ఏకమయ్యారు. రాముడొక్కడే సమస్త దేవదానవులను సంహరింపగల సమర్థుడు. శ్రీరాముని వానర సేనకు అంతేలేదు. వారందరిని లెక్కించుటకు మాకు వీలుకాలేదు.

అందువలన మహాప్రభూ! శ్రీ రామునికి సీతాదేవిని అప్పగించడమే మంచిది. రాగల మహాఆపద తప్పుతుందని సారణుడు చెప్పాడు లేక పోతే "తెల్లవారి లంకా బలాన్నంతటిని భస్మము చేస్తానని" రాముని మాటలను ఆయన తెలిపాడు.

నిజానికి ఏ రాక్షసునికి కూడ సీతాదేవి వలన తమకు సర్వ నాశనము కలుగాలనే కోరిక లేదు అందువలన "ఆమెను రామునికి అప్పగించడము ఒకటే మార్గము" అని అందరికి తెలుసు. అయితే ఆ మాటను ఆయనకు చెప్పే ధైర్యము ఎందరికి ఉంది?

ఒక వేళ ఎవ్వరైనా చెప్పినా రావణుడు అంగీకరిస్తాడా ?ఇది వరకు ఎంత మంది చెప్పలేదు?

ఇంతకు ముందు విభీషణాదులు, శుకచారుడు, ఇప్పుడు శుకసారణ మంత్రులు అదే మాట చెప్పారు. అయినా రావణుని అంత మొండివాడు మరెవ్వరు ఉంటారు ?

వానర వీరుల పరిచయం : "అది సరే కాని నేను నా శత్రువులందరిని చూడాలని అనుకొంటున్నాను. నా వెంట వచ్చి వాళ్లను నాకు చూపండి" అని శుక సారణులతో కలిసి రావణుడు అనేక తాటి చెట్ల అంత ఎత్తున్న తన మేడపైకి వెళ్లి తనకు ఎదురుగానున్న సువేలా పర్వతముపై విడిది చేసిన వానర సేనావాహినిని చూడసాగాడు.

సారణుడు మొదట అంగదుని చూపి "ఈయన తన సైన్యంతో వానర సేనను హృదయ భాగంలో ఉండి రక్షిస్తాడని, ఆయన తన తండ్రి అయిన వాలి అంతటి పరాక్రమము కలవాడని" తెలిపాడు.

సేనకు ముందుండి నడుపుతున్న వాడు లక్షల వానర సేనాధిపతి అయిన మహా పరాక్రమ శాలి నీలుడు.

అంగదుని వెనుక ఉన్నవాడు నలుడు.ఆయనే సేతునిర్మాత. చందన పర్వతము పైన ఉండే వేయి కోట్ల సైన్యానికి స్వామి. ఆయన మహాక్రోధంతో నీపైకి ఉరికి వస్తున్నాడు.

అలాగే శ్వేతుడు, కుముదుడు రంభుడు, శరభుడు పనసుడు, వినతుడు, క్రోధనుడు మొదలైన వారు మహా పరాక్రమోపేతులు, కోట్లకొలది సైన్యాలకు అధిపతులు.

వీరేకాక మరి కొంతమంది యూథపతులున్నారు. వారందరు శ్రీ రాముని కొరకు ప్రాణములను తెగించి వచ్చారు.

వానరయూథపతి ధూమ్రుడనే ఆయన భల్లూకయూథపతి (గుడ్డేలుగులకు ప్రభువు). ఆయన తమ్ముడు జాంబవంతుడు అతిలోక భయంకరుడు. వామనుని కాలములో ఆయన చుట్టు అనేక పర్యాయాలు మూడు లోకాలు తిరిగాడు. దైవాసుర యుద్ధంలో అనేక సమయాల్లో దేవతలకు సహాయపడినవాడు. ఆయన యముని కూడ యుద్ధంలో ఓడింపగల్గినవీరుడు.

యుద్ధమునందు మహావేగము కలవాడు, తన పరాక్రమంతో ఇంద్రుని సైతము సంతోషపరచువాడు అదిగో దంభుడు.

అడ్డు వచ్చిన దేనినయినా అతిక్రమించగలిగినవాడు, తన పరాక్రమంతో ఇంద్రుని జయించిన వాడు, దానధర్మములలో మిక్కిలి ఆసక్తిగలవాడు, బల దర్పము గలవాడదిగో సన్నాదుడు.

ఇదిగో ఈయన క్రథనుడు ఒక గంధర్వ స్త్రీకి అగ్నిదేవుని వలన జన్మించినవాడు. దేవాసుర యుద్ధంలో దేవతలకు సహాయపడినవాడు. కుబేరుడుండే కైలాస పర్వతమందు ఉంటాడు.

అదిగో ఆకనబడేవాడు ప్రమాధి అనే వానర యూథపతి. యుద్ధంలో కఠిన పరాక్రములైన కోటి వానరులకు ఈయన అధిపతి. ఈయన గవాక్షుడు బలవంతులైన కొండముచ్చులకు అధిపతి. ఇదిగో ఆయన కేసరి అనే మహావీరుడు. ఏనుగు ఆకృతితో దేవతలను బాధించుచున్న శంబసాధనుడనే రాక్షసుని సంహరించి దేవతలకు ప్రియమైన వాడు

తెలుపు, ఎరుపు, నలుపు రంగులలో ఉండి మదించిన సింహమువలె నాలుగు కోరలను కలిగియుండి, పామువంటి రోషముగల్గి, ఏనుగంత ఎత్తు గలిగి, ఎఱ్ఱని కళ్లుగల వానర శ్రేష్ఠుల మధ్య మహావీరుడై ప్రకాశించే ఇతడు శతవలి. ఈయన ప్రతిరోజు సూర్యోపాసన చేస్తాడు. రామసుగ్రీవులకు అత్యంత ప్రియుడు నీతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు.

గవాక్షుడు, నీలుడు, గవయుడు, నలుడు ఒక్కొక్కరు పదికోట్ల వానర వీరులకు నాయకులు."

సారణుడు ముగించిన తరువాత శుకుడు వానర వీరుల వివరాలను మరింత తెలుపసాగాడు. కిష్కింధానగరంలో వేయి శంఖములు, నూరు బృందములు ఇరువై ఒక్కకోట్ల వానరవీరులున్నారు. వీరందరు కామ రూపులు.

వీరిలోమైంద ద్వివిదులు మహాకాంతి సంపన్నులు. బ్రహ్మవర ప్రసాదం చేత అమృతం త్రాగిన వారు. ఎప్పుడు చిన్న వయస్సు వారుగానే ఉంటారు. నీపైకి ఉత్సాహంతో ఉరికివస్తున్నారు. ఇదిగోమైంద ద్వివిదుల ప్రక్క పర్వతాకారాలతో ముందుకొచ్చే అపరిమిత బలసంపన్నులు సుముఖుడు, అసుముఖుడు. వీరిద్దరు యముని కుమారులు తండ్రి అంతవారు.

అందరికంటె ముఖ్యమైన వానిని చూస్తున్నావా ? రుద్రాంశతో అంజనాదేవికి వాయుదేవుని ప్రసాదంగా జన్మించిన మహానుభావుడు. పుట్టగానే ఉదయిస్తున్న అరుణబింబాన్ని చూచి ఎఱ్ఱని పండనుకొని ఆకలితో సూర్యుని మ్రింగాలని పైకి ఎగిరినవాడు, కేసరీ తనయుడు, శ్రీరామచంద్రుని మహా భక్తుడు. నూరుయోజనాల సముద్రాన్ని అవలీలగా దాటి లంకలోనికి ప్రవేశించి సీతాదేవిని చూచి తిరిగి వెళ్లుతూ అసంఖ్యాకులైన రాక్షసవీరులను, లంకానగరాన్ని మొత్తము దహించినవాడు, నీకు సింహస్వప్నమైనవాడు ఇదిగో హనుమంతుడు.

అదిగో ధీమంతుడైన హనుమంతుని చేత సేవింపబడుతున్నవాడు. నల్ల కలువల వంటి మేను ఛాయ గలవాడు, ఎఱ్ఱకమలాల వంటి విశాల నేత్రాలు కలవాడు, ధర్మావతారుడు, సహనంలో భూమితో సమానుడు, ఆగ్రహంతో అమరులను కూడ కంపింపజేయగల మహానుభావుడు శ్రీరామచంద్రుడు.

ఆయన ప్రక్కనే ఉంటూ బంగారు రంగు మేనిఛాయ గలవాడు, అన్నిటిలో రామసమానుడు. ఆకలితో బుసలుగొట్టుతున్న పాముల వంటి అమ్ములుగలవాడు శ్రీరామ సోదరుడైన లక్ష్మణుడు.

ఇక మీ తమ్ముడు విభీషణునిని చూస్తునే ఉన్నావు కదా ! ఆయన ఇప్పుడు రామాశ్రయంతో మహోత్సాహంతో ఉన్నాడు. సముద్ర తీరంలోనే శ్రీరామ చంద్రుని చేత లంకాధిపతిగా పట్టాభిషేకం చేయబడినవాడు. నీతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నవాడు.

ఇక మిగిలినవాడు వానర మహా సామ్రాజ్యాధిపతి అయిన సుగ్రీవుడు. నిన్ను తోకతో చుట్టి నీళ్లు త్రాగించిన వాలితో సమాన బలుడు.

శ్రీరామ చంద్రస్వామి సహాయంతో అన్నను వధింపజేసి నిష్కంటకంగా వానర రాజ్యాన్ని ఏలుతున్న వాడు. వాలి కుమారుడైన అంగదుని యువరాజుగా చేసి ఆయనను తన వశంలో ఉంచుకొన్నవాడు. స్వయంగా సూర్యనందనుడు.

# రావణుని ఆగ్రహము

శుక సారణులు రామలక్ష్మణుల, వానరుల బలాలను ఉన్నవి ఉన్నట్లుగా వర్ణించారు.

అయితే రావణుడు దురభిమాని. తనను ప్రశంసిస్తే ఆనందంగా వింటాడు. ఇతరు ప్రశంసలను విని సహించే స్వభావము కలవాడు కాదు.

అందువలన శుక సారణులను కోపముతో చూచి "మూర్ఖులార! రాజు యొక్క మనస్సును గుర్తించి, ఆయనకు ప్రియవాక్కులను, సంతోషకర వాక్కులను పలుకాలి కాని యుద్ధము చేయవలసిన సమయంలో రాజుకు నిరాశను కల్గించే విధంగా మాట్లాడుతారా? నాముందు శత్రు బలాన్ని ప్రశంసిస్తారా? నాకు మీరు మిత్రులా నిజంగా శత్రువులా?

నేను మిమ్మల్ని అడిగినప్పుడు మనకు ఎంతటి శత్రువుల వలన కూడ భయంలేదని వీరులవలె మాట్లాడి, ఇప్పుడు యుద్ధము మీదపడ్డప్పుడు భీరులవలె మాట్లాడుతారా? అప్పుడే మీరనుకొంటున్న ఈ హితాన్ని ఎందుకు తెలుపలేదు?

మీ చదువులు, మీ అనుభవాలు నిష్ఫలాలు. రాజులనెలా సేవించాలో తెలియని మూర్ఖులు మీరు.

ఇన్ని రోజులు మీ తెలివి తేటల వలన, మీ శక్తి సామర్థ్యాల వలన నేను ఇన్ని విజయాలు సాధించలేదు. నా విజయాలకు కారణము నాతెలివి తేటలు, నా శక్తి సామర్థ్యాలే.

మీరు పలికిన ఈ అప్రియమైన పలుకులకు మీరు చావవలసిన వారే. కాని ఇన్ని రోజులు నన్ను సేవించినందుకు కృతజ్ఞతతో మిమ్ము సంహరించకున్నాన"ని తీక్షణంగా పలికాడు.

రాజ శిక్షకు భయపడ్డ శుక సారణులు తలలు వంచుకొని వెళ్లిపోయారు.

# శార్దూలాదిచారులు

రావణుడు తన దగ్గర ఉన్న మహోదరుని చూచి తక్షణమే సమర్థులైన చారులను రప్పించుమని ఆజ్ఞాపించాడు.

శార్దూలాదిచారులు క్షణంలో రావణుని ముందువాలారు. శత్రువులకు భయపడనివారు తనకు విధేయులు చార విద్యా కుశలురైన శార్దూలాదులను చూచి:

"మీరు తక్షణమే రామలక్ష్మణులున్న చోటికి మారు వేషాలతో వెళ్లండి. వాళ్ల స్వభావాలను, అలవాట్లను, బలహీనతలను గమనించి తిరిగిరండి.

ఎంత గొప్పవాడికైనా ఏవోకొన్ని బలహీనతలు ఉంటాయి. వాటిని మనము కనుక్కొంటే ఎంత గొప్ప శత్రువునైనా వశపరుచుకోవచ్చు.

రామలక్ష్మణులు ఎప్పుడు పడుకుంటారు? ఎప్పుడు మేలుకొంటారు? పడుకొన్నప్పుడు, లేచినప్పుడు ఒంటరిగా ఉంటారా? లేక వాళ్లకు తోడు ఎవ్వరైనా ఉంటారా ? ఈ విషయాలన్ని కనుక్కొనిరండని పంపాడు. వారు "మహారాజుకు జయము జయము" అని పలుకుతూ వెళ్లారు.

వారు మారువేషాలతో వానరవీరుల దగ్గరికి వెళ్లారు. రామలక్ష్మణుల వానరసేనా సముద్రాన్ని చూడగానే వారి గుండెలు అవిసి పోయాయి. భయంతో అక్కడి నుండి పారిపోవాలి అనుకొంటు ఉండగానే విభీషణుడు వారిని గమనించి నాయకుడైన శార్దూలుని బంధించి, మిగిలిన వారిని వదలి పెట్టాడు.

వానరులందరు శార్దూలుని పైబడి అయనను చితుక బాదారు. బాధలను తట్టుకో జాలక బిగ్గరగా ఏడుస్తుండగా దయామయుడైన దాశరథి ఆశార్దూలుని విడిపించి పంపాడు. శార్దూలుడు రావణుని సమీపించి "మహారాజా ! వానర బలము సంఖ్యాతీతము వారిని లెక్కించుట తరముగాదు. వారు వేరు వేరుగా ఉండరు. అందరు కలిసే ఉంటారు.

ఆ విధంగా ఒంటరిగా ఉండని వారి ప్రత్యేక స్వభావాలను, బలహీనతలను గమనించడమెలా?

నన్ను చూడగానే విభీషణుడు గుర్తించాడు. మిగిలిన పనిని వానరులు చేశారు. పిడికిళ్లతో గ్రుద్దారు. పండ్లతో కొరికారు. క్రింద పడవేశారు. ఊపిరాడకుండా త్రొక్కారు.

"వీడు దొంగ !వేగులవాడు" అని అరచారు. అప్పుడు వానరులందరు గుమిగూడి నా ఎముకలను నుగ్గునుగ్గు చేశారు.

నేను నాబాధ తాళలేక శ్రీ రామచంద్రుని పాదాలపై పడ్డాను. "లంకాపురిని ఎట్లా సాధించాలా?" అని తీవ్రంగా ఆలోచిస్తున్న రామభద్రుడు నన్ను ఒక గడ్డి పోచవలె చూచి "వదలి పెట్టుడని" వానరులను ఆజ్ఞాపించాడు.

అదిగో అలా చావుదప్పి కన్నులొట్ట పోయి నీదగ్గరికి వచ్చాను .

ఇక నిర్ణయించు కోవలసింది నీవే. సీతాదేవిని అప్పగించడమా? రణాన్ని ఆహ్వానించడమా?"

రావణుడు వారి మాటలను విని "శార్దూలా! నేను సీతను తిరిగి ఇవ్వడము అనే మాటకల్ల.

అది సరే గాని ఆ వీరులు ఎవ్వరి పుత్రులు ? ఎవ్వరి మనుమలు ? ఎవ్వరికి సంబంధించిన వారో తెలుపు వారి సంబంధుల ద్వారా వారిని వశపరుచుకోవచ్చేమో?"

శార్దూలుడు వానరవీరుల తల్లి దండ్రులను గురించి తెలుపసాగాడు.

హనుమంతుడు అంజనాకేసరుల కుమారుడు. కేసరి దేవగురువైన బృహస్పతి కుమారుడు.

అంగదుడు ఇంద్ర తనయుడైన వాలికి కుమారుడు. మైందద్వివిదులు అశ్వినీదేవతల (దేవవైద్యుల) కుమారులు. శ్వేత, జ్యోతిష్మతులు సూర్యుని పుత్రులు. హేమకూటుడు వరుణుని కొడుకు. నలుడు దేవశిల్పి అయిన విశ్వకర్మ తనయుడు.

దుర్ధరుడు వసువు కుమారుడు.

ఇక రామలక్ష్మణులు పది దిశలలో ఎదురులేని దశరథ సార్వభౌముని తనయులు.

శ్రీరామచంద్రుడు ఖర, దూషణత్రిశిరస్కులనే అత్యంత వీర్యవంతులైన రాక్షసులను పదునాల్గువేల మంది సైనికులతో రెప్పపాటు కాలంలో సంహరించిన మహావీరుడు.

నీతో సమాన బలులని ఖ్యాతిగాంచిన విరాధుని, కబంధుని హతమార్చిన మహా బలశాలి శ్రీరాముడు.

# రాముని మాయా శిరస్సు

దేవతాంశలతో జన్మించి, కామరూపధారులై, మహాబల సంపన్నులైన వేలకోట్ల వానరుల సేనా వాహినితో రామలక్ష్మణులు లంకా పట్టణంలోని "సువేల" పర్వతముపై దిగి ఉన్నారని తెలిసిన రావణుడు మనస్సులో భయపడ్డాడు. అయితే తన మనస్సులోనే భయాన్నిదాచుకొని, ఇక యుద్ధాలోచన చేయడానికి మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయుమని చెప్పి ఆయన తన ఇంటికి వెళ్లాడు.

బలాఢ్యుడు, మహామాయావి అయిన విద్యుజ్జిహ్వుని రప్పించి శ్రీ రామచంద్రుని విల్లమ్ములు ధరించిన ముఖాన్ని తేడా తెలియనట్లుగా సృష్టించి సీతాదేవి ఉంటున్న అశోకవనానికి తీసికరమ్మని చెప్పి తాను సీతాదేవిని చూడడానికి వెళ్లాడు.

సీతాదేవి తోడేళ్ల గుంపు వంటి భయంకర రాక్షసీ జనము మధ్య కూచొని తన భర్త అయిన శ్రీరామ చంద్రమూర్తిని ధ్యానిస్తూ విలపిస్తున్నది.

అప్పుడు మాయావి అయిన రావణాసురుడు ఆమెను చూచి "సీతా నన్నుకాదని ఏ భర్త కొరకై పరితపిస్తున్నావో ఆ నీభర్త యుద్ధంలో సంహరింపబడ్డాడు. చచ్చిన వాడు నీవు ఏడ్చినంత మాత్రాన బ్రతికి వస్తాడా?

ఇప్పటికయినా దేశకాల పాత్రములను గుర్తించి నన్ను వరించు. నిన్ను నా పట్టపురాణిని కావిస్తాను. సీతాదేవి తనను నమ్మడం లేదని గ్రహించిన రావణుడు తన కట్టుకథను మరింత వివరించసాగాడు.

"సీతా !నీ భర్త వానర సేనతో వచ్చి సముద్ర తీరంలో ఉన్నాడని నాకు వేగులవారు వచ్చి చెప్పారు. నిన్న రాత్రి మా ప్రహస్తుడు సేనా సమేతంగా వెళ్లి "గురక పెట్టి నిద్రపోతున్న శ్రీ రాముని" శిరస్సును ఖండించాడు.

రాముని వధను చూచి భయంతో పారిపోతున్న లక్ష్మణ, విభీషణ, సుగ్రీవ, హనుమ

జాంబవదాదులను మా ప్రహస్తుని సేన బంధించింది. కొందరు అధైర్యంతో తమంతటతామే చచ్చారు. కొందరిని ప్రహస్తుడు సంహరించాడు. కొందరు సముద్రములో పడిచచ్చారు. కొందరు ఆకాశంలో ఎగిరిపారిపోయారు.

అప్పటికి సీతాదేవి రావణుని మాటలు పూర్తిగా నమ్మలేదు. ఆమెను పూర్తిగా నమ్మించుటకు "ఎవ్వరక్కడ! ప్రహస్తుని చేతిలో నరకబడ్డ రాముని శిరస్సును తక్షణమే తీసికరమ్మని విద్యుజ్జిహ్వునికి తెలుపండి" అని అజ్ఞాపించాడు. విద్యుజ్జిహ్వుడు శ్రీరాముని మాయాశిరస్సును తెచ్చి రావణుని ముందు ఉంచగా, అతడు దానినెత్తి సీతాదేవికి చూపాడు.

# సీతాదేవి పరితాపము

సీతాదేవి శ్రీ రాముని ముఖాన్ని పరిశీలించింది. అనే కళ్లు, అవేకురులు, అదే ముఖము.

హనుమ సీతాదేవితో, తాను వెళ్లిన వెంటనే సుగ్రీవ, వానరసేనా సమేతంగా శ్రీ రామ లక్ష్మణులను తప్పక తీసిక వస్తానని చెప్పాడు. కనుక "రామలక్ష్మణులు, వానరసేన సముద్ర తీరానికి చేరుకొని ఉంటారు. అలసి పోయిన రామలక్ష్మణులు నిద్రపోతు ఉంటారు. అదే అదనుగా భావించి ప్రహస్తుడు రాముని శిరస్సును ఖండించి ఉంటాడు". ఈ విధంగా సాగుతున్నాయి. ఆమె ఆలోచనా పరంపరలు. అన్నిటికంటె ముఖ్యంగా తాను హనుమతో పంపిన చూడామణి శ్రీరాముని కేశములను అలంకరించి ఉంది. ఇంతకంటె ప్రబల సాక్ష్యము ఇంకేమి కావాలి?

సీతాదేవి ముఖము పాలిపోయింది. దు:ఖము ముంచుకొస్తున్నది. "భార్య పూర్వజన్మలో చేసికొన్న పుణ్యవిశేషముచేత భర్త యొక్క ఆయురైశ్వర్యాలు అధికంగా ఉంటాయి. ఆమె పాపరాశి ఫలితంగా ఆమెకు పతివియోగం కలుగుతుంది" అని ఆమెవిని ఉన్నది.

అందువలన ఆమెభర్త ముఖాన్ని చూస్తూ "నాథా! సకల సద్గుణశాలివైన నీవు అర్ధాయుష్కుడవు అగుట నా పాపరాశి ఫలమే. ఒక్క మాయా లేడి కొరకు నిన్ను పోగొట్టుకొన్నాను. ఇన్ని రోజులు నీకు దూరమై భరింపరాని దుఃఖాన్ని అనుభవిస్తున్నాను.

నాపై దయవలన నీవు దూతగా పంపిన హనుమ రాక వలన నాకు కొంత దు:ఖము తగ్గింది. కాని నా గురించి తెలిసి నన్ను రక్షించడానికి వచ్చిన నిన్ను మృత్యు దేవత మ్రింగి వేసింది.

ఇంతకంటే మించిన పాపము ఇంకేమి ఉంటుంది ? నా పాపము నిన్ను కబళించడమేకాదు. నిన్నుగన్న లోకమాత కౌసల్యాదేవి కడుపులో చిచ్చుపెట్టింది. ఇక ఆ తల్లి ఒకే పుత్రుడవు, దైవ ప్రసాదమైన నిన్ను పోగొట్టుకొని ఎక్కువ కాలము జీవింపజాలదు.

నేనెంతటి పాపాత్మురాలిని? ఎంతటి నష్టజాతకురాలిని ?

అయినా రామభద్రా! వివాహానికి పూర్వము జ్యోతిష్కులు నా జాతకాన్ని చూచి "నాభర్త దీర్ఘాయువుతో వేల సంవత్సరాలు రాజ్యమేలుతాడని నేను నాభర్తతో కలిసి మహారాణినవుతానని, నేను పుత్రసంతానవతినవుతానని చెప్పారే" ? వారంత తెలియని వారా? వారి మాటలు నీటిమూటలేనా?

ప్రాణవల్లభా! నేను నీ పాలిటి కాళరాత్రిని ప్రభూ ! నీవు ఏకపత్నీవ్రతుడవే !నన్ను వదలి భూదేవిని కౌగిలించుకొనుట నీకు తగునా ? ప్రాణముల కంటె ప్రియుడైన మీ తండ్రిని కలువడానికి పితృలోకానికి వెళ్లావా ?

పుణ్యశీలమగు నీ వంశానికి ధృవతారవై ఆకాశంలో వెలుగుతున్నావా?

జీవితేశ్వరా ! నావివాహ కాలములో ధర్మార్థకామములను జీవితాంతము కలిసే అనుభవిస్తానని మాటిచ్చావే ? మధ్యలోనే నన్ను ఈ విధంగా వదిలి వెళ్లడం న్యాయమేనా?

మహాపరాక్రమశాలీ ! ఇది నిజమా?నాపై ప్రేమతో మూడు గడియలలోపు పదునాల్గు వేల సేనతో కూడిన భయంకర పరాక్రములైన ఖరదూషణాదులను ఒంటరిగా సంహరించగలిగిన మహావీరుడవు. నీవు అల్పుడైన ప్రహస్తుని చేతిలో ప్రాణాలను కోల్పోవడమా ? ఇది సంభవమా?

నా వలన తమ వంశము విస్తరించునని అనుకొని మా మామగారు నన్ను తమ ఇంటి కోడలుగా చేసికొన్నారు. కాని ఆ అమాయకులు "తన కొడుకుకే నేను మృత్యువునవుతానని, పూలదండ రూపంలో కనబడిన మహాసర్పాన్ని" అని కలలో కూడ అనుకోలేదు". అని రాముని శిరస్సును చూస్తూ సీతాదేవి అమితంగా దుఃఖించింది.

వెంటనే రావణునివైపు చూచి "రాక్షస రాజా ! నేను రాముని శరీరంలో సగభాగాన్ని. శరీరములో సగము మాత్రమే కాలడం లోక విరుద్ధము కదా ! అందువలన నా నాధుని శిరస్సుతో పాటు నాశరీరానికి కూడ నిప్పు అంటించుమని" దు:ఖాతిరేకముతో మూర్ఛ పోయింది.

అంతలో ద్వారపాలకుడు రావణుని సమీపించి "మహారాజా ! మిమ్మల్ని చూడడానికి ప్రహస్తుడు మొదలైన మంత్రులందరు సభాభవనంలో ఎదురు చూస్తున్నారు. మీకు జయము జయము " అని తెలిపాడు.

"తన భర్త శిరస్సును చూచి, సీతాదేవి నిరాశతో తనను వరిస్తుందేమో ?" అని రావణుడు ఆశపడ్డాడు. కాని ఆయనకు అక్కడ కూడ నిరాశే ఎదురు అయింది. "తాను తన భర్త శరీరంతో పాటు కాలిపోవడానికి సిద్ధమైందేకాని ఆ మహాపతివ్రత రావణుని వరించుటకు అంగీకరించలేదు.

ఇక అశోకవనంలో చేయవలసిన పని ఏమిలేకపోవడం వలన రావణుడు మంత్రులతో యుద్ధాలోచన చేయడానికి సభాభవనానికి వెళ్లి పోయాడు. ఆయన అక్కడి నుండి వెళ్లిపోగానే ఆశ్చర్యంగా శ్రీ రాముని తెగిన శిరము, ధనుర్బాణాలు మాయమయ్యాయి.

# సరమ ఓదార్పు

సరమ విభీషణుని భార్య. చల్లని మాటలతో దు:ఖితులను ఓదార్చగలిగిన చక్కని నేర్పుగలది.

ఆమె వాక్చాతుర్యాన్ని గమనించిన రావణుడు బెదిరింపులకు భయపడని సీత సరమ మంచి ఓదార్పు మాటలకు వశురాలు కావచ్చుననుకొని సరమను సీతాదేవికి కాపలా ఉంచాడు.

సరమ నిజంగా సరమే. "రమయాసా సరమా" అన్నట్లు ఆమె నిజంగా లక్ష్మీదేవితో కలిసి ఉన్నదే. లక్ష్మీదేవే ఇప్పుడు సీతాదేవి కనుక ఆమె సీతాదేవికి సహాయంగాఉంది.

సరమ రావణుని ఆజ్ఞకు భయపడి సీతాదేవి దగ్గర కాపలా కాయడం లేదు.

విభీషణుడు మొదటి నుండి (లంకానగరంలో ఉన్నప్పుడు కూడ)రామభక్తుడే. మారీచ, సుబాహువధ, తండ్రి మాటను గౌరవించి రాముడు అడవులకు రావడము, ఖరదూషణ త్రిశిరస్కులతో కూడ పదునాల్గవేల మంది రాక్షసులను క్షణాలలో ఒంటి చేత్తో సంహరించడం, విరాధ, కబంధవధ, వాలివధ మొదలైన శ్రీరాముని అద్భుత చర్యలను గ్రహించి ఆయనను పురుషోత్తమునిగా భావించాడు.

అందువలన తన అన్న అయిన రావణుడు సీతాదేవిని అపహరించి తేవడం ఆయనకేమాత్రము నచ్చలేదు. సీతాపహరణము మంచిదికాదని, లంకకు కీడును కల్గిస్తుందని, అందువలన ఆమెను రామునికి అప్పగించడమే మంచిదని అనేక సమయాలలో అన్నకు హితబోధ చేశాడు. తన మాటలు మన్నించనందున అన్నను వదిలి శ్రీరాముని ఆశ్రయించిన సత్పురుషుడు విభీషణుడు.

రావణుడు సీతాదేవిని అపహరించి తెచ్చి అశోకవనంలో ఉంచినప్పటి నుండి ఆమెకేదో విధంగా అండగా తన భార్యను ఉంచాలనుకొన్నాడు. ఇంతలో రావణుడే సీతాదేవి ఆత్మహత్య చేసికోకుండా చూడుమని సరమను కోరాడు.

సరమకు కోరుకున్న అవకాశము అనుకోకుండా లభించింది. తాను కూడ సీతాదేవిని సేవించే అదృష్టానికి నోచుకొన్నది. ఆమె సంతోషానికి అవధిలేదు.

సీతాదేవికి విద్యుజ్జిహ్వుడు రాముని మాయా శిరస్సును తెచ్చి చూపడం, రావణుడు సీతాదేవిని నిరాశపరచి తనను వరించుమని యాచించడం, రావణుని మాటలకు లొంగక సీతాదేవి భర్త గురించి అమితంగా బాధపడుతుండడము–వీటన్నిటిని తన యోగవిద్య వలన అదృశ్యంగా ఉండి సరమ చూచింది.

ఇప్పుడు రావణుడు రాజ సభకు వెళ్లి పోయాక సరమ సీతాదేవిని సమీపించి ఆమెను ఓదారుస్తున్నది.

“అమ్మా ! నీ భర్త నిద్రిస్తుండగా అతని శిరస్సును ప్రహస్తుడు ఖండించడం అసాధ్యము. శ్రీరాముని ఒంటరిగా విడిచి వానరులందరు నిర్లక్ష్యంగా ఉండజాలరు. నాభర్త అయిన విభీషణుడు ఇక్కడ అన్నిటిని వదలి రాముని ఆశ్రయించారు. ఆయనను అన్నివేళలా నీడవలె అనుసరించే ఉంటారు.

మీరు అడవులలో తిరుగుతుండగా మీరు పడుకొన్నా, మెలకువతో ఉన్నా అన్ని సమయాలలో కూడ మీ వెంట ఉండి మీకు సకలసేవలు చేస్తూ మిమ్మల్ని కళ్లరెప్పలవలె కాపాడిన సౌమిత్రి, అన్నను విడిచి క్షణమైనా ఉండగల్గుతాడా ? ఆయనకు అన్నను రక్షించడం కంటె కావలసినదేముంటుంది ? నిద్రాహారాలు కూడ లక్ష్మణుని రాముని నుండి దూరము చేయలేవు కదా!

“విశాల వక్షః స్థలము, దీర్ఘ బాహువులు, ధర్మమూర్తిత్వము, శత్రువులలో కూడ ప్రఖ్యాతి గలిగిన పరాక్రమము, నీతిశాస్త్ర విజ్ఞానము, చక్కని అవయవ సన్నివేశము” ఇవన్ని సాముద్రిక శాస్త్రము తెలిపే మహారాజ లక్షణాలు. ఇటువంటి శుభలక్షణ సంపన్నునికి శత్రువు వలన మరణము సంభవింపజాలదు.

నిన్ను దుఃఖము పాలు చేసి, ఎట్లాగైనా నిన్ను తన వశంచేసికోవడానికి దురాత్ముడైన రావణుడు దుర్మార్గంగా పన్నిన పన్నాగమిది

అందువలన దేవీ ! నీవు రావణుని మాటలు నమ్మవద్దు ! దు:ఖవివశవు కావద్దు.

అంతేకాదు రావణుడు నీదగ్గరి నుండి వెళ్లిపోయినప్పటి నుండి లంకలో యుద్ధసన్నాహాలు జరుగుతున్నాయి. యుద్ధభేరీ ధ్వనులు వినవస్తున్నాయి. సైనికుల కోలాహల ధ్వనులను నీవు వినడం లేదా ?

రామలక్ష్మణులే మరణిస్తే ఇక రావణునికి యుద్ధంతో ఏమి అవసరమమ్మా!

వేలకోట్ల వానర సేనలతో శ్రీ రామలక్ష్మణులు సముద్రం దాటి లంకలోనికి ప్రవేశించి సువేల పర్వతముపై నిలిచిఉన్నారు.

ఈ మాటలు కేవలము విని నేను చెప్పడం లేదు. నేను చూచివచ్చి చెప్పుతున్నాను. నన్ను నమ్ము .

ఈ యుద్ధంలో రామభద్రుడు రావణుని సపరివారంగా సంహరించి నిన్ను తప్పక స్వీకరిస్తాడు. నీవు నీ భర్త సన్నిధిలో సకల శుభాలను, సంతోషాలను అనుభవిస్తావు. ఊరడిల్లు తల్లీ!" అని సరమ సీతాదేవి దు:ఖాన్ని తొలగించి ఆమెకు అమితంగా సంతోషాన్ని కల్గించింది.

సీతాదేవికి మరొక సంతోషకరమైన మాట తెలిపింది.

"అమ్మా మాయా శిరస్సును చూపడం ద్వారానిన్ను లొంగ దీసికోవడానికి రావణుడు చేసిన ప్రయత్నాలన్నిటిని ఆయనకు కూడ కనుపడకుండా ఏవిధంగా చూడగలిగానో, అదే విధంగా ఎవ్వరికి  కనుపడకుండా నేను సువేల పర్వతము పైకి వెళ్లి శ్రీరాముని సందర్శించి రాగలుగుతాను.

నేను వెళ్లేప్పుడు నాకు విమానాలతో అవసరంలేదు. ఎగిరే రథాలతో పనిలేదు. నేను వేగంగా ఆకాశంలో అదృశ్యంగా వెళ్లుతుంటే నా వేగాన్ని వాయుదేవుడైనా గరుత్మంతుడైనా అందుకోజాలరు".

సరమ మాటలు సీతాదేవిని మరింత సంతోషపరిచాయి. అయితే సీతాదేవికి శ్రీ రాముని ప్రయత్నాల గురించి తెలిసి కోవడం కంటే రావణుని ప్రయత్నాల గురించి తెలిసి కోవడమే ముఖ్యమనిపించింది.

శ్రీ రాముడెలాగూ తనను రక్షించే ప్రయత్నాలు తప్పక చేస్తాడు. వాటి గురించి ముందుగా తెలిసికొన్నా, తెలిసికోకున్నా తేడాలేదు.

కాని రావణుని ప్రయత్నాలు తెలియాలి. "యుద్ధ భయంకరతను చూచి, తన మనస్సును మార్చుకొని నన్ను రామునికి అప్పగించాలను కొంటున్నాడా ? లేక యుద్ధానికే కట్టుబడి ఉన్నాడా? లేక యుద్ధాని కంటే ముందే నన్ను చంపి, శ్రీ రాముని శోకములో ముంచి, యుద్ధ రంగం నుండే ఆయనను అయోధ్యకు త్రిప్పి పంపాలనుకొంటున్నాడా?" ఈ విషయాలు వెంటవెంటనే నాకు తెలియాలి. అందువలన నీవు రావణుని వద్దకు అదృశ్యంగా వెళ్లి అన్ని తెలిసికొనిరా " అని సరమను సీతాదేవి కోరింది.

# రావణుని నిశ్చయము

సీతాదేవి కోరిక ప్రకారం సరమ రావణునిసభకు వెళ్లి అక్కడ అదృశ్యంగా ఉండి, అన్ని విషయాలను పూర్తిగా తెలిసికొని సీతాదేవి దగ్గరకు తిరిగి వచ్చింది.

("సరమ" రావణుని సభకు వెళ్లినప్పుడు ఒక శునక (కుక్క) రూపంలో వెళ్లేది. రావణుని సభలో ఏ మూలకో వెళ్లి కూచొనేది."అది శునకమే కదా" అని దానిని ఎవ్వరు పట్టించుకొనేవారు కాదు.

ఆ విధంగా శునక రూపంలో అక్కడ కూచొని అన్నిటిని స్వయంగా పరిశీలించి వచ్చి సీతాదేవికి తెలిపేదని" పెద్దలు తెలుపుతారు.)

రావణుని సభ నుండి తిరిగి వచ్చిన సరమను సీతాదేవి ప్రేమతో కౌగిలించుకొని అక్కడి విశేషాల గురించి అడిగింది.

సరమ తన సమాధాన్ని చెప్పసాగింది.

"సీతా! రావణుని తల్లికైకసి, ఆయన వృద్ధ మంత్రి అవిద్ధుడు రావణునికి అనేక విధాల హిత బోధ చేశారు.

"ఖరదూషణాదులను వారి పదునాల్గు వేల సైన్యమును కొన్ని క్షణాలలో ఒంటరిగా సంహరించగలిగిన సర్వసమర్థుడు రాముడు. ఇప్పుడేమో రాముడు ఒంటరివాడు కానేకాడు. లక్ష్మణుడు లక్షలాది వానర సైన్యము రాముని కంటి రెప్పవలె కాపలా కాస్తుంటారు.

"నా సైన్యములో ఖరుని మించిన వారెందరో ఉన్నారు".అంటావా ? ఎందరు ఉండి ఏమి లాభము? హనుమ ఒక్కడే వచ్చి లంకానగరాన్ని అంతటిని అగ్నికి ఆహుతి చేసినప్పుడు ఎందరుండి ఏమి చేశారు?

ఈ విధంగా ఎవరెన్ని విధాల చెప్పినా లోభిధనాన్ని వదలనట్లు పరవధూసంగమును కాంక్షించే రావణుడు నిన్ను వదలడానికి అంగీకరించలేదు.

ప్రాణాల కంటె ఎక్కువగా కాంక్షించే నిన్ను రావణుడు చంపజాలడు. ఆయన వలన నీకు ఏ భయములేదు.

అయితే నిన్ను వశం చేసికోవాలనుకొని అప్పుడప్పుడు నిన్నుబెదిరిస్తాడు."

ఈ మాటలను సరమ సీతాదేవికి చెప్తుతుండగానే వారికి వానర సేనల అరుపులు శంఖ,భేరుల ధ్వనులు దిక్కులు పిక్కటిల్లేలా వినిపించాయి. శ్రీరామచంద్రుడు లంకను ముట్టడించడాన్ని ప్రారంభించాడని వాళ్లకు తెలిసింది.

ఒక వైపు ఆ ధ్వనులు సీతా సరమలకు సంతోషాన్ని కలిగిస్తే మరొక వైపు రావణునికి, రాక్షసులకు పిడుగు పడ్డట్లు అయింది. ముందుగానే తనకు ఎప్పటి వార్తలను అప్పుడు ఎందుకు తెలుపలేదని రావణుడు రాక్షసులపై మండిపడ్డాడు. ఇప్పటికైనా ముందుకొచ్చి తనకు విజయాన్ని చేకూర్చుమని ఆజ్ఞాపించాడు.

అప్పుడు రావణుని తల్లి అయిన కైకసికి పెద్ద తండ్రి అయిన మాల్యవంతుడు ఆయనతో ఈ విధంగా హితము పలికాడు.

"మహారాజా ! రాజయినవాడు సామ, దాన, భేద, దండోపాయాలను గురించి చక్కగా తెలిసికోవాలి.

ఇప్పుడు రామలక్ష్మణులు సామ, భేదాలకు లొంగరు. కనుక దానదండాలను గురించి ఆలోచించాలి.

ప్రస్తుతము దానము అంటే "సీతాదానము" అని అర్థము. సీతరామునిదే కదా ! ఆమెను అపహరించి తెచ్చాక ఆమెను మళ్లీ అప్పగించడము కూడ దానమేనా ? అంటే అవును అది కూడ ఒక రకమైన దానమే. "దీయత ఇతి దానం"

"ప్రదీయతాం దాశరథాయమైథిలీ" అని సీతను రామునికి ఇవ్వమని విభీషణాదులు తెలిపారు కదా !

సీతాదేవిని శ్రీరామునికి ఇవ్వడం ద్వారా నీకు శ్రీరామునికి సంధి కుదురుతుంది. సంధివలన స్నేహము కుదురుతుంది. స్నేహము వలన సీతాదేవిని తీసికొని శ్రీరాముడు లక్ష్మణ, సుగ్రీవ వానరసేనా సమేతంగా తిరిగి వెళ్లి పోతాడు.

శ్రీరామునికి రాజ్యకాంక్షలేదు. ఆయన కిష్కింధానగరానికి వచ్చివాలిని సంహరించి

రాజ్యాన్ని సుగ్రీవునికి అప్పగించాడు. ఆయనకు రాజ్యకాంక్షే ఉంటే కిష్కింధను అయోధ్యా రాజ్యంలో కలుపుకొనే వాడు కదా!

రామునికి లంకా రాజ్యకాంక్ష కూడలేదు. సీతాదేవిని ఆయనకు సమర్పిస్తే నీ రాజ్యము, నీవు క్షేమంగా ఉంటారు.

"అదేమిటి? సీతాదేవిని ఇవ్వకుంటే యుద్ధము వస్తే మాత్రము నాకేమి భయమంటావా"?

నిన్ను మించిన బలవంతుడు వాలి. రాముని ఒకే కోలకు నేల కూల లేదా? రాముని ఎదిరించడానికి బ్రహ్మ రుద్రేంద్రాలకు కూడ సాధ్యము కాదని హనుమ చెప్పలేదా ?

ఒంటరిగా వచ్చిన హనుమను మనము ఏమి చేయగలిగాము ?

నీవు వధించబడడము దేవతలకు కావలసింది. కనుక రామలక్ష్మణులకు వానర బలమే కాదు. దేవతాబలం కూడ ఉంది.

"ధర్మము" –"అధర్మము" అని రెండు పక్షాలను బ్రహ్మకల్పించాడు. దేవతలు ధర్మాన్ని, రాక్షసులు అధర్మాన్ని అవలంభిస్తారు.

నీవు అధర్మమును వరించినా, నీ తపోబలము వలన నీ అధర్మానికే విజయము కలుగుతూ వచ్చింది.

కాని కొంతకాలానికి నీ తపో బలము క్రమంగా తగ్గిపోయి, నీ అధర్మాచరణము నీకు వినాశాన్ని కల్గిస్తుంది.

మహర్షులందరు నీవు పెట్టు చిత్రహింసలు భరిస్తూకూడ నీ వినాశానికై మహత్తరమైన తపస్సును తీవ్రంగా ఆచరిస్తున్నారు.వారి శాపబలము కూడ నీకు హానిని కలిగిస్తుంది.

ఇప్పుడా ఋషుల ఆశ్రమంలో యజ్ఞధూమాలు దట్టంగా వ్యాపిస్తున్నాయి. అవి రాక్షసుల చితా ధూమాలుగా కనబడుతున్నాయి.

"నేను వరబలుడను" అని అహంకరిస్తున్నావేమో ? కాని రావణా నీకు ఎవ్వరి వలన చావు రాకూడదని కోరుకొన్న వారిలో నరులు, వానరులు లేరు. ఇప్పుడు నీ పైకి దండెత్తి వచ్చింది. మహా వీరులైన నరవానరులే.

ప్రస్తుతము కనబడే శకునాలు కూడ నీకు అనుకూలంగా లేవు. మేఘాలు ఉరుముతూ లంకపై నెత్తురును కురిపిస్తున్నాయి. ఏనుగులు, గుఱ్ఱాలు నిష్కారణంగా కళ్లనీళ్ళు కారుస్తున్నాయి.

జండాలు రంగులు పోయి కూలి పోతున్నాయి. నక్కలు, గద్దలు లంకలో గుంపులు గుంపులుగా గుమిగూడి తీవ్రంగా అరుస్తున్నాయి. నీచ, పిశాచాలు రాక్షస స్త్రీల కలలో కనబడి వికృతంగా నవ్వుతున్నాయి.

రాక్షసులు తాము అరాధించే దేవతల కొరకు వేసిన బలులను కుక్కలు పైబడి తింటున్నాయి. ఆవులకు గాడిదలు పుట్టుతున్నాయి. ఎలుకలు, ముంగిసలు స్నేహంగా కలసి తిరుగుతున్నాయి.

పులులు, పిల్లులు, కుక్కలు, పందులు కలిసి తిరుగుతున్నాయి. మృగ పక్షులు సూర్యుని జూచి ఏడుస్తున్నాయి. ఇండ్లలో పెంచుకొంటున్న గోరింకలు వికృతంగా కూస్తున్నాయి.

ఇన్ని ఉత్పాతాలు రాక్షస వినాశాన్ని సూచిస్తున్నాయి. కనుక రావణా ! యుద్ధానికి కాలుదువ్వక సీతాదేవిని రామునికి అప్పగించి సంధికి అంగీకరించు"మని మాల్యవంతుడు రావణునికి ప్రబోధించాడు.

# రావణధిక్కారము

మాల్యవంతుని హితోపదేశము రావణుని చెవులకు ఎక్కలేదు. రాక్షసరాజు ఆగ్రహంతో మాల్యవంతుని ఈ విధంగా నింధించాడు:-

"తాతా !నీవు ముసలివాడవు ఆగుట వలన నీ బుద్ధి మందగించింది. నీవు శత్రువు వలన ఏదో లాభపడి, ఆయన వైపు న్యాయవాదిగా మాట్లాడుతున్నావు.

నిజానికి రాముడు ఎందులో గొప్పవాడు? దేవ, దానవ గంధర్వాదులలో నాకు ఎదురేలేదు కదా!

రాముడు ఒక మానవుడు. తండ్రివలన దేశాన్నుండి బహిష్కరింపబడ్డవాడు. రాజ్యహీనుడు. ఇప్పుడు భార్యాహీనుడు కూడ.

ఇప్పుడు ఆశ్రయించింది కోతులను అంటే తనకంటె తక్కువ వారిని (నీచులను) ఆశ్రయించాడు. ఆయనలో ఏమి గొప్పదనాన్ని చూచి మాట్లాడుతున్నావు?

నేను రాక్షసరాజును. రాజుపట్ల మాట్లాడవలసింది నీవిధంగానేనా?

కావాలని మోహంతో సీతను తెచ్చుకొన్నాను. ఆమెను అనుభవింపకుండా ఉండ గల్గుతానా?

నీవన్నట్లు రాముడు గొప్పవాడు కూడ కావచ్చు, అయితే మాత్రమేమిటి? అంతకంటె అత్యధికుడు నా ముందు వచ్చి నిలిచినా నేను తలవంచుతానా? మరొకరికి నమస్కరిస్తానా? నన్ను రెండుగా చీల్చినా నేనెవ్వరికి నమస్కరిచను. ఇది నా స్వభావము. నా స్వభావము తప్పుకూడ కావచ్చు. అయినా స్వభావము పుట్టుకతో వచ్చి కాటిదాకా వెంట ఉంటుంది. దానిని మార్చడం ఎవ్వరి తరము కాదు.

"ద్విధాభజ్యేయమప్యేవం ననమేయంతు కస్యచిత్
ఏషమే సహజోదోషః స్వభావోదురతిక్రమః"

"రాముడు సముద్రముపై సేతువు కట్టలేదా?" అందువా? కాకి కూచుండగానే తాటిచెట్టుపై పండు క్రింద బడితే కాకే పండును తెంపిపడగొట్టినట్లా ? కాదు కదా ! కాకి కూచున్నప్పుడే పండు పడిపోవడం హఠాత్తుగా అనుకోకుండా జరిగిందే. ఏదైనా అకస్మాత్తుగా జరుగడాన్ని గూర్చే "కాకతాళీయము" అంటారు కదా!

రాముడు సముద్రముపై సేతువు నిర్మించడము కూడ కాకతాళీయమే .

అంతెందుకు? రామలక్ష్మణులు వేలాది వానర సమేతంగా లంకపైకి దండెత్తి వచ్చారు కదా! వారందరు శవాలరాశులవుతారు. అంతేకాని ఎవ్వరు కూడ బ్రతికి తిరిగి పోజాలరు.

తాతా! నీ నోటికి వచ్చింది మాట్లాడావు చాలుగాని ఇక నీవు వెళ్లవచ్చు" అని ఆజ్ఞాపించాడు.

మాల్యవంతుడు రావణుని మాటలు విని మౌనంగా తిరిగి వెళ్లాడు.

"ఇసుకలో నుండి నూనె తీసినా తీయవచ్చు. ఎండమావులలో నీరును త్రాగినా త్రాగవచ్చు. కాని మూర్ఖుని మనస్సును మాత్రము ఎవ్వరు మార్చజాలరు కదా !"

-- ఇతిశం --

అరెరే! ఎన్ని లక్షల కోతులు? వీరి తరువాత మాకు తినడానికి మిగిలేది సముద్రుపునాడే.

"సూర్యుడున్నంత కాలము నా దుర్మార్గము సాగుతుందను కొన్నానే?"

# రావణుని సైన్యరచన

మాల్యవంతుడు వెళ్లిపోయాక, రావణుడు మంత్రులతో లంకానగర రక్షణ సన్నాహాల గురించి చర్చించాడు.

లంకానగరము యొక్క తూర్పుద్వారానికి రక్షకుడుగా ప్రహస్తుని, దక్షిణ ద్వారం దగ్గర మహోదర, మహాపార్శ్వులను, పడమట ఇంద్రజిత్తును, ఉత్తరాన శుకసారణులను పంపి అచటికి తానే స్వయంగా వస్తానని తెలిపాడు. పుర మధ్య భాగంలో విరూపాక్షుని నియమించాడు.

సముద్ర భాగం నుండి లంకలోకి రావడానికి లంకలోని పశ్చిమ భాగాలే ముఖ్యం కనుక ఒక వైపు ఇంద్రజిత్తును నిలిపి, మరొక భాగంలో తానే ఉన్నాడు.

ఈ విధంగా వ్యూహరచన చేసి "ఇక లంకపై శ్రీరాముడు దాడి చేయడం అసాధ్యము" అని నిశ్చయించుకొన్నాడు.

# శ్రీ రాముని మంత్రాంగము

రామ లక్ష్మణులు హనుమ సుగ్రీవ, జాంబవదంగదాదులతో కలిసి యుద్ధాన్ని గురించి ఆలోచించసాగారు.

ఎంతో కాలం నుండి "లంకలోకి చేరుకోవడమెలాగా ? అనుకొన్న మనము లంకలోకి రాగలిగాము.

ఇప్పుడు 'దీనిని జయించడమెలా ?' అని ఆలోచించాలి.

ఈ లంక దేవగంధర్వ, యక్షకిన్నర, కింపురుషాదులకు ఎవ్వరికి కూడా జయించ సాధ్యము కాదు.

దీనిలోకి ఏ వైపు నుండి కూడా ప్రవేశించడానికి వీలులేదు. కనుక దీనిని ముట్టడించడం, శత్రువులను చీల్చుకొని వెళ్లడం తప్ప వేరే మార్గము లేదు" అనివారు అనుకొంటున్నారు.

అంతలో విభీషణుడు "ప్రహస్తుని తమ్ముడైన "ప్రఘసుడు", మాల్యవంతుని తమ్ముడి కొడుకులు 'అనలుడు' 'సంపాతి' అనే వారు నావెంట లంకను, సమస్త బంధు జనాన్ని

పరిత్యజించి వచ్చారు. వారు లంకానగరంలో సైనికుల ఏర్పాట్లను చూచి వచ్చారు. లంకలో తూర్పువైపు ప్రహస్తుడు, దక్షిణంలో మహాపార్శ్వ మహోదరులు, మధ్య భాగంలో విరూపాక్షుడు, పశ్చిమోత్తరాలలో ఇంద్రజిత్తు, రావణుడు ఉన్నారని తెలిసింది'. రావణుడు అప్పుడు తనకు ఉన్న అరవై వేల మంది సైనికులతో వెళ్లి కుబేరున్ని జయించాడు. ఇప్పుడు ఆయన సైన్యము లెక్కకు మించి ఉంది.

రామభద్రా! నీకు భయాన్ని కలిగించడానికి ఈ విషయాలు చెప్పలేదు. ఆ ఏర్పాట్లకు తగిన విధంగా నీవు నడచుకొంటావని మాత్రమే తెలుపుతున్నాను". అని ఊరుకున్నాడు.

# శ్రీ రాముని సేనా రచన

లంకానగరానికి తూర్పు వైపు ఉన్న ప్రహస్తుని నీలుడు ఎదుర్కోవాలి. దక్షిణ దిశలో మహోదర, మహా పార్శ్వలను అంగదుడు జయించాలి.

పశ్చిమము వైపు ఇంద్రజిత్తును మహాబల సంపన్నుడైన హనుమ ఢీకొనాలి.

సేనా మధ్య భాగంలో సుగ్రీవ, విభీషణ, జాంబవంతులు రక్షించాలి.

ఇక యుద్ధానికంతటికి రావణుడే ప్రాణము కనుక అతనిని సంహరించడానికి ఉత్తరంలో నేను, నాతమ్మునితో సిద్ధంగా ఉంటాను.

మరొక ముఖ్య విషయము వానరులందరు వారివారి రూపాలతోనే ఉండి పోరాడాలి. ఎవ్వరు మానవ రూపాలను ధరించరాదు.

మా అన్నదమ్ములతో పాటు విభీషణుడు, ఆయనతో పాటు నలుగురు సహచరులు మానవ రూపాలను ధరించి ఉంటారు.

# సువేల పర్వతము- లంకానగరము

శ్రీ రామ చంద్రుడు తన సేనా నాయకులకు దిశలను నిర్దేశించి సుగ్రీవ విభీషణులను చూచి, తామందరు సువేల పర్వతాన్ని ఎక్కి రాత్రి అక్కడే ఉండాలని తెల్లవారి లంకానగరాన్ని చూడాలని చెప్పాడు.

ఆయన సుగ్రీవ విభీషణాదులతో రావణుని నీచప్రవర్తన గురించి ముచ్చటించాడు.

రావణుడు పుట్టింది స్వయంగా "పులస్త్య బ్రహ్మ" వంశంలో. చదువుకొన్నది

వేదవేదాంగాలను. అయినా "పరదారాపహరణ"మనే ఎంత నీచానికి పాల్పడ్డాడు! ఆయన ఒక్కని మూలంగా ఆయన పరివారమంతా నాశనం అవుతున్నది.

ఒక పాము నీటి మడుగులో చేరితే దాని వలన మడుగులోని చేపలు కూడా చస్తాయి కదా!

"ఏకః పాపాని కురుతే। ఫలం భుంక్తే మహాజనాః"

అని ఆగ్రహంతో శ్రీరాముడు సువేల పర్వతము పైకి ఎక్కాడు. ఆయన వెనువెంటనే లక్ష్మణ, సుగ్రీవ, విభీషణాదులు హనుమదాది వానరులు అందరు పర్వతాన్ని ఎక్కారు.

సుగ్రీవ, విభీషణ, జాంబవవాది సమేతంగా లక్ష్మణుడా రాత్రి నిద్రలేకుండా శ్రీ రాముని, వానర సైన్యాన్ని కాపాడాడు.

తెల్లవారి వారందు శ్రీ రామ సమేతంగా లంకానగరాన్ని పరిశీలించారు.

లంకానగరము వెలుపల ఉన్న పెద్ద పెద్ద తోటలను చూశారు. వాటి లోపల క్రూరమృగాలు లేవు. ఆతోటలలో తాళవృక్షాలు , మద్ది చెట్లు మొదలైన పెద్ద వృక్షాలు ఉన్నాయి. కొత్త కొత్త పూలు ఉన్నాయి. పెద్ద పెద్ద పండ్లు ఉన్నాయి.

ఆ వనము ఇంద్రుని నందన వనంతో, కుబేరుని చైత్ర రథముతో పోటీ పడుతున్నది.

ఆ తోటలలో నెమిళ్ల నృత్యాలు, తుమ్మెదల ఝుంకారాలు, కోకిలల "కుహూ కుహూ" నాదాలు మనస్సులకు హాయినిస్తున్నాయి.

సుగ్రీవుడు సువేల పర్వతముపై ఉన్నవారిని తప్ప మిగిలిన వారందరిని లంకలోకి పంపించాడు.

వారు లంకలోకి ప్రవేశించి, తమ సింహనాదాలతో నగరాన్ని అల్లకల్లోలం చేయసాగారు. ఆ అల్లకల్లోలానికి భూమివణికింది. లంక అంతా దుమ్ముతో నిండిపోయింది. మృగాలు భయంతో కూతలు పెడుతూ పారిపోసాగాయి.

లంకానగరం కూడా పర్వత శిఖరం పైనే ఉంది. ఆ పర్వతానికి మూడు శిఖరాలు ఉన్నాయి. 1. సువేల 2. లంక 3. త్రికూటము.

లంకానగరం నూరామడ పొడవు, ముప్పై ఆమడల వెడల్పుతో విశాలంగా ఉంది. అందులో తెల్లని మబ్బులను మరిపించే గోపురాలు, వెండి బంగారులచే ప్రకాశించే ప్రాకారాలు కాంతి వంతములైన ఏడంతస్థుల మేడలు ఉన్నాయి.

వాటి మధ్యలో కైలాస శిఖరము వంటి అద్భుతమైన వేయి స్థంభాల భవనము ఉంది. అది రావణుని నివాస భవనము. ఎల్లప్పుడు రాక్షస వీరులచే కాపాడబడుతు ఉంటుంది.

ఆ భవనంలో అనేక ఉద్యాన వనాలు, అనేక పక్షులు, పెంపుడు జంతువులు ఉన్నాయి.

శ్రీ రాముడు అద్భుత సౌందర్యముతో అలరారే ఆ లంకా నగరాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

సువేల పర్వత శిఖరముపై వెలిగే దివిటీల కాంతి వలన అక్కడికి శ్రీ రాముడు వేలాది వానర వీరులతో ఆ శిఖరము పై ఉన్నాడని అందరికి తెలిసింది.

# సుగ్రీవుని సాహసము

రావణుడు తెల్లవారగానే సువేల పర్వత శిఖరముపై నిలిచిఉన్న శ్రీ రామ లక్ష్మణులను, వానర వీరులను చూడదలచి తన భవనము పైకి వచ్చి చూస్తున్నాడు.

బంగారు, రత్నాల ఆభరణాలతో అలంకరింపబడి, ఎర్రని గంధము పూసుకొని, నల్లని దేహకాంతి కలిగి ఛత్ర చామరాలతో సేవలు చేయించుకొంటున్న రావణుని శ్రీరామాదులు చూశారు.

రావణాసురుని చూడగానే సుగ్రీవునికి అపరిమితమైన ఆగ్రహము కలిగింది.

"ఓరి దుర్మార్గుడా! రాజాధిరాజు, సకల దేవతల చేత సేవింపబడేవాడు, సమస్త వానర సేనను శాసించేవాడు అయిన రామచంద్రుని సగౌరవంగా సేవించవలసినవాడవు శ్రీరామునికి ఎదురుగా నిలిచి, రాజోపచారాలను చేయించుకొంటున్నావా?" అని ఆగ్రహాన్ని పట్టజాలక శ్రీరామాదులకెవ్వరికి చెప్పకుండా చివాలున రావణ భవనం పైకి ఒక గంతువేశాడు.

నిర్భయంగా రావణుని సుగ్రీవుడు నిందించసాగాడు.

"ఓరీ రావణా ! నన్ను శ్రీ రామభద్రుడు మిత్రుడుగా చూస్తున్నాడు. కాని నేనాయన దాసుడను. శ్రీరామ తేజస్సుతో నిండిన నేను నీ గర్వాన్ని తొలగిస్తాను. శ్రీ రాముడిని చూస్తూ కూడా నిర్లక్ష్యంగా నీ రాజమర్యాదాలను చేయించుకొంటున్నావా! ఇదిగో చూడు నీ రాజరికము" అని వాడి మీదికి దుమికి వాడి రత్న కిరీటాన్ని పీకి నేలపై కొట్టాడు.

ఆగ్రహంతో రావణుడు "సుగ్రీవా ! నా కిరీటాన్ని తీసి నేను చూడకుండా నేలపైకి కొట్టావు కదా ! ఇదిగో నీ అందమైన మెడను (సుగ్రీవాన్ని) లేకుండా చేసి నిన్ను నేలపై కొట్టుతాను చూడు" అని సుగ్రీవుడిని నేలపైకి విసిరి వేశాడు.

అయితే సుగ్రీవుడు క్రిందపడకుండా బంతివలె పైకెగిరి రావణునిపై పడ్డాడు. వాళ్లు ఒకరినొకరు పిడికిలి దెబ్బలతో, అరచేతి దెబ్బలతో తీవ్రంగా కొట్టుకున్నారు. ఒకరినొకరు క్రిందపడేసుకున్నారు. ఒకరినొకరు దమ్ముురానట్లు బిగ్గరగా అదిమిపట్టారు.

ఇద్దరు సమాన బలంతో ద్వంద్వ యుద్ధము చేశారు. సుగ్రీవునితో న్యాయంగా ద్వంద్వ యుద్ధంలో గెలువరాదని మాయతో అతనిని వశం చేసుకోవాలని రావణుడు అనుకొనేంతలో వాడి మనస్సును గ్రహించిన సుగ్రీవుడు చిటికలో పైకి ఎగిరి సువేల పర్వతము పైకి వచ్చివాలాడు. ఆ సంఘటనను ఆశ్చర్యంతో చూస్తున్న వానరగణము సంతోషముతో సుగ్రీవుని జయ జయ నాదాలతో ప్రశంసించింది.

# శ్రీ రాముని ఆవేదన

శ్రీరాముడు రావణుని వైపు చూస్తుండగానే చిటికెలో సుగ్రీవుడు మాయమయ్యాడు. శ్రీరామునికి అయోమయం కలిగింది.

ఇంతలో సుగ్రీవ రావణ ద్వంద్వ యుద్ధము, గాయాలతో, నెత్తురు ధారలతో సుగ్రీవుడు తిరిగి రావడం జరిగి పోయాయి.

శ్రీరాముని మనస్సు "సుగ్రీవునికి ఏమవుతుందో ఏమో అనే బాధతో నిండి పోయింది."

అందువలన సుగ్రీవుడు తిరిగి రాగానే వానర వీరులందరు ఆయనను ప్రశంసిస్తే శ్రీరాముడు మాత్రము ఆయనను మందలించాడు.

"మిత్రమా! ఎంత పని జరిగింది! ఎంత పని జరిగింది! ఎంత సాహసం చేశావు? నీవు వెళ్లేప్పుడు నాకు చెప్పి వెళ్లాలనిపించలేదా? ఒంటరిగా నీకు నీవు ఇంత సాహసం చేయడం తగునా ?

రాజు ఎప్పుడు స్వతంత్రించి సమరంలో ముందు దిగకూడదు. ఆయన పరివారాన్ని ముందు దింపి, సమయాన్ని చూచి తాను సమరంలో కాలు పెట్టాలి.

(సముద్రము దాటవలసిన సమయంలో అంగదుడు "తానే ముందుకు వచ్చి సాగరాన్ని

దాటే ప్రయత్నం చేస్తానంటే" జాంబవంతుడు అతనిని వారించి హనుమను ప్రోత్సహించాడు.

అదే విధంగా రావణుని పక్షాన యుద్ధంలో మొదలుదిగింది ఇంద్రజిత్తే !)

అందువలన ఒక రాజువై ఉండి నీవు ఈ విధంగా సాహసించడం మంచి పద్ధతి కాదు.

అంతేకాదు మేమందరము ఎవ్వరి బలాన్ని చూసుకొని ఇంతదాకా వచ్చాము ? నీ బలాన్ని చూసుకొనే కదా? ఆ విధంగా అందరికి రక్షణనిచ్చే నీవే అరక్షణలోపడితే మాగతేమికాను?

"త్వయికించిత్ సమాపన్నే కింకార్యం సీతయా మమ?" నీకేదైనా అయితే నేను జీవింపజాలను. అప్పుడు సీత మాత్రము నాకెందుకు?

అంతే కాదు నన్ను ఆశ్రయించిన వాడివి. నీకేదైన ప్రమాదం కలిగితే నా "ఆశ్రిత రక్షా దీక్ష" ఏమయిపోతుంది?

"తనను ఆశ్రయించిన సుగ్రీవుడి కొరకు వాలిని వధించి, ఆయన రాజ్యాన్ని, భార్యను(తనకు అక్కర లేదు కనుక) ఆయనకు రాముడు ఇప్పించాడు."

కాని తన ఆశ్రితులు ఆపదల పాలు కానీయకుండా రక్షించవలసిన తానే సుగ్రీవునికి కలిగే ప్రమాదాన్ని కూడా చూడకుండా ఆయనను రావణుని పైకి దాడి చేయడానికి రాముడు అనుమతించాడు." అని నాగురించి ఎంత నీచంగా జనం చెప్పుకుంటారు ?

అంతే కాదు నీవు నాకు ముఖ్య మిత్రుడివి. నీతో సమానం నాకెవ్వరు కాదు. సుగ్రీవా! నీకేదైనా ప్రమాదము జరిగితే దానికి కారణమైన రావణాసురుని సపరివారంగా చంపి, విభీషణునికి నేనిచ్చిన మాట ప్రకారం లంకా పట్టాభిషేకము చేసి, అయోధ్యకు వెళ్లి భరతునినే శాశ్వతంగా పాలించుమని నిర్బంధించి, నాప్రాణాలను విడువాలనుకొన్నాను" అని రాముడు వివరించాడు.

"అదేమిటయ్యా ! మిత్రునితో సమానము తమ్ముడు కాదా ? భార్య కూడ కాదా?" అంటే ఎవ్వరు కాదు.

లోకంలో తమ్ములందరు ఒకే రకంగా ఉంటారా? అందరు ఆపదలలో అన్నను వదలకుండా ఉంటారా? అన్నను అవకాశము చూచి పడగొట్టి తామే అధికారాన్ని వశంచేసుకోవాలని, సుఖంగా ఉండాలని చూసే తమ్ములు ఎందరు ఉండరు?

(సుగ్రీవ విభీషణులు అటువంటి వారే కదా)

ఇక భార్య అంటావా ? సుఖాలలో భర్తను దేవుడిలాగా చూసుకొని, కష్టాలు రాగానే చీపురు పుల్లకంటే తక్కువగా చూసే భార్యలు ఎందరు లేరు?

అంతేకాదు ఒక భార్య చనిపోతే ఆ భర్త మరొక భార్యను పెళ్లి చేసుకోవచ్చు కదా! అందువలన మిత్రునితో సమానము సోదరుడు కాదు. భార్య కూడా కాదు.

మిత్రుడంటే తనను నీడవలె అనుసరించేవాడు. తన కష్టసుఖాలలో పాలు పంచుకొనేవాడు. తను ఆపదలో చిక్కుకున్నప్పుడు ఆయన రాజ్యాన్ని, ప్రజలను, భార్యను సంతానాన్ని (నీవలె) అందరిని వదలి వచ్చి తనను ఆదుకొనేవాడు. అందువలన మిత్రునితో సమానం ఈ లోకంలో ఎవ్వరు కాదు. కాబట్టి నీకేదైనా (ప్రమాదము అని నోటితో అనకూడదు "నాశ్లీలం కీర్తయేత్"కనుక) జరిగితే నాకు సీతతో ఏమి పని ? అన్నాడు రాముడు. సాధారణంగా వ్యక్తులు తమ దగ్గర మొదటి నుండి ఉన్న వారికి ప్రాధాన్యము ఇస్తారు. కొత్తగా చేరిన వారిని పట్టించుకోరు. కనుక కొత్తగా చేరినవారు తమపట్ల నిర్లక్ష్యం జరిగిందని బాధపడుతారు. కానీ పరమాత్మ అటువంటి వాడుకాదు. తనను ముందుగా ఆశ్రయించిన వారు తన రక్షణను చాలా కాలం నుండి పొందుతూ అన్ని విధాలా సుఖాలను పొందుతారు.

కానీ కొత్తగా చేరిన వారు అటువంటివారు కాదు. వారికి తన రక్షణ ఎక్కువగా అవసరము ఉంటుంది. వారికే సమయంలోనైనా ఏ ప్రమాదమైనా జరుగవచ్చు. అందువలన వారి విషయంలో పరమాత్మ మరింత జాగ్రత్తగా ఉంటాడు.

ఆశ్రితులను రక్షించే గుణాన్ని, ప్రేమించే గుణాన్ని "వాత్సల్యము" అంటారు. "వాత్సల్యము" అనే గుణము పశువులలో ముఖ్యంగా గోవులేక గేదెలో ఎక్కువగా ఉంటుంది.

గేదెను "వత్సలా" అంటారు. "వత్స" అంటే దూడ. "ఆ దూడను "లాతి" అంటే రక్షించేది. దూడను రక్షించేది కనుక దానిని "వత్సల" అంటారు. దాని ప్రేమ స్వభావాన్ని "వాత్సల్యము" అంటారు. "వత్సలాయాః భావః వాత్సల్యమ్".

గేదె ఎన్నో దూడలను కంటుంది. కానీ అన్నిటికంటే కొత్తగా ఈనిన దూడపై ఎక్కువ ప్రేమను కలిగి ఉంటుంది. అప్పుడు పుట్టిన దూడ చిన్నది. కనుక తనను తాను కాపాడుకోజాలదు. అందువలన అప్పుడు పుట్టిన దూడపైననే గేదెకు ఎక్కువ ప్రేమ. దానికి ఏ ప్రమాదం కలిగినా సహించజాలదు. చివరకు తాను మొదట కన్న దూడల

వలన ఏమైనా ప్రమాదం కలిగినా కూడ భరింప జాలదు. వాటిని తన కొమ్ములతో పొడిచి కాళ్లతో తన్ని, కొత్తగా పుట్టిన దూడను కాపాడుతుంది.

పరమాత్మ కూడ అప్పుడే తనను ఆశ్రయించిన వ్యక్తిని అమితంగా ప్రేమిస్తాడు. అట్లా కొత్తగా ఆశ్రయించిన వ్యక్తి అప్పుడే పుట్టిన దూడ("అన్నీన్టకన్ఱు)" వంటివాడు.

సుగ్రీవుడు కూడా శ్రీ రాముని కొత్తగా ఆశ్రియించినవాడు. తనకేవిధంగా ప్రమాదం కలిగినా, తన ప్రాణమైన సీతకు ఏ ప్రమాదం కల్గినా ? చివరకు ప్రాణానికి ప్రాణమైన లక్ష్మణునికి ఏమైన ప్రమాదం కలిగినా రాముడు భరిస్తాడు. ఎందుకంటే సీత అయినా, లక్ష్మణుడైనా తనతో చాల కాలం నుండి కలిసి ఉంటున్నారు.

వారి కంటే తరువాత తనను ఆశ్రయించినవాడు సుగ్రీవుడు. అందుకే ఆయన సీతాలక్ష్మణుల కంటే అధికంగా కావలసినవాడు.

ఎంత కరుణామయుడు స్వామి ! ఎంత వాతల్యపూర్ణుడు పరమాత్మ!

ఆ వాత్సల్యమూర్తికి, ఆ శ్రీరామచంద్రునికి అశ్రునయనాలతో అంజలిని ఘటిస్తామా!

సుగ్రీవుడు శ్రీరాముని మైత్రీ భావానికి ఆశ్చర్యపడి "ప్రభూ ! నీ మైత్రీ మహిమ నాకు తెలుసు.

కానీ నాకు రావణుని నిర్లక్ష్య భావాన్ని చూసి కోపమాగలేదు. అతనికి నాశక్తిని కొంత రుచి చూపి, అతని పరివారాన్ని కొంత మట్టుపెట్టి రావాలనే ఉద్దేశ్యంతో నేను అతనిపైకి దుమికాను." అన్నాడు.

# అంగద రాయబారము

శ్రీరామ చంద్రస్వామి సువేల పర్వతము దిగి లంకను పూర్వము అనుకున్నట్లుగా ముట్టడించదలిచాడు.

నీలుడు తూర్పు దిక్కు, అంగదుడు దక్షిణంవైపు, హనుమంతుడు పశ్చిమం వైపు సైన్య మధ్యలో సుగ్రీవుడు ముప్పై ఆరు కోట్ల వీరులతో, ఉత్తరము (రావణుడున్న) వైపు స్వయంగా రామ లక్ష్మణులు యుద్ధ సన్నద్ధులైనిలిచారు.

ప్రతి ద్వారము ముందు కోటి వానర సైన్యాన్ని సుగ్రీవుడు నిలిపాడు.

సుగ్రీవుడు మధ్యలో నుండి ఉత్తర ద్వారము దగ్గర నిలిచిన రామలక్ష్మణులను, దక్షిణ ద్వారము దగ్గర ఉన్న అంగదుని ఆదుకొనుటకు సిద్ధంగా ఉన్నాడు.

క్షణాలలో లంకా నగరం యొక్క అన్ని ద్వారాల వద్ద వానరులు నిండిపోయారు. లోపలి వారిని బయటకు రానీయకుండా బయటి వారిని లోనికి పోనీయకుండా కట్టడి చేశారు.

శ్రీ రామచంద్ర ప్రభువు రావణాసురునికి మరొక అవకాశమివ్వదలచి రాయబారాన్ని పంపాలనుకొన్నాడు.

హనుమ, సుగ్రీవుల బలాన్ని రాక్షసులు ఇది వరకే రుచి చూశారు. కనుక అంతవాడైన అంగదుని దూతగా ఈ సారి పంపాలనుకొన్నాడు.

“అంగదా ! నీవు ఈ ప్రాకారముపైకి ఎగిరి లంకానగరంలోపల దూకు. అక్కడ రావణుడు సపరివారంగా ఉంటాడు. వాని ముందుకు వెళ్లి నిర్భయంగా నేను చెప్పిన మాటలను తెలుపు “రావణా! నీవు ఋషి కన్యలను అప్సరసలను, దేవగంధర్వ కన్యలను అపహరించి, వారికి మన్నించరాని మహాపరాధం చేశావు. దాని వలన నీ తపోబలము క్షీణించింది.

నా భార్యను అపహరించి నిన్ను శిక్షించే అవకాశము నాకు ఇచ్చావు.

ఏ బలగర్వంతో సీతను అపహరించావో, ఆ బలాన్ని మగవాడివి అయితే నా ముందు చూపు. నిన్ను ఒక్కడిని సంహరించడమే కాదు, నిన్ను బలపరిచే రాక్షసులనెవ్వరిని మిగిల్చను. నాకంటబడితే నిన్ను భస్మము చేయకుండా వదలను.

ధర్మాత్ముడైన విభీషణుడు లంకానగరాన్ని పరిపాలించుటకు సమర్థుడు. ఆయనకు ఇదివరకే సముద్ర తీరంలో పట్టాభిషేకం జరిపించాను. ఇక లంకా సింహాసనము ఆయనదే. అందువలన నిన్నువధించుట తప్పదు.

భయంకరమైన నా బాణాగ్నికి భస్మం కాకుండా మిగులాలంటే, సీతాదేవిని నాకు సమర్పించి, నన్ను శరణువేడు(అప్పుడు శరణాగతుడవైన నీకు అయోధ్యా సామ్రాజ్యాన్ని అప్పగిస్తాను.)

ఇక నీవధ తప్పదు. నీవు సపరివారంగా సంహరింపబడుతావు. కనుక నీ మరణం తరువాత నీకు తద్దినము పెట్టే వారు మిగలరు. కనుక యుద్ధానికి వచ్చే ముందే “జీవశ్రాద్ధము” పెట్టుకొనిరా.”

అంగదుడు ప్రాకారముపై నుండి రావణుని ముందు దుమికాడు. తన పేరును తెలిపి శ్రీరామచంద్రుని సందేశాన్ని ఉన్నదున్నట్లు వినిపించాడు.

తన ముందుకు ఒకరి తరువాత ఒకరు వానర వీరులు వచ్చితమ పరాక్రమాన్ని ప్రదర్శించి వెళ్లడం రావణునికి నచ్చలేదు.

అందువలన ఆయన సైనికులతో "ఈ దుష్టుణ్ని పట్టుకొండి, కొట్టండి , చంపండి" అని ఆగ్రహంతో ఆజ్ఞాపించాడు.

రాక్షస వీరులు చుట్టుముట్టి అంగదుని పట్టుకున్నారు. కావాలనే వారికి అంగదుడు పట్టుబడ్డాడు. వారిని తన చేతులలో బిగించి, పామును బంధించిన గరుడుని వలె ప్రాకారము చివరి దాకా తీసుకెళ్లి క్రింద పడవేశాడు. రాక్షసరాజు కళ్లముందే ఆయన భటులు క్రిందపడి, కీళ్లు విరిగి, హతులయ్యారు.

అంతే కాదు ఆ భవన శిఖరాన్ని అంగదుడు పిండిపిండి చేశాడు. ఆశిఖరము రావణుని పాదాల ముందే ముక్కలైపడిపోయింది.

తన బలాన్ని మచ్చుకు రుచి చూపించి అంగదుడు రావణుడు చూస్తుండగానే పైకి ఎగిరి శ్రీ రాముని సన్నిధిలోవాలాడు. ఈ అంగదుని అద్భుత కార్యము రాక్షసులలో మహాభయాన్ని వానరులలో మహోత్సాహాన్ని నింపింది.

రావణుడు కోపావిష్టుడై యుద్ధానికి బయలుదేరుమని ఆజ్ఞాపించాడు. అనేక ఆయుధాలను ధరించి సైనికులు యుద్ధానికి బయలుదేరారు.

# యుద్ధారంభము

వానర రాక్షసుల మధ్య సంకుల సమరము మొదలైంది. అంగదుడు ఇంద్రజిత్తుతో, సంపాతి ప్రజంఘునితో, జంబుమాలి హనుమంతునితో, సుగ్రీవుడు ప్రఘసునితో, లక్ష్మణుడు విరూపాక్షునితో తలపడ్డారు.

యుద్ధ భూమి అంతా రక్తసిక్తమైంది.

అంగదుని వీర విహారాన్ని నిలుపడానికి ఆయనను ఇంద్రజిత్తు గదతో మోదాడు. అంగదుడు ఆగ్రహంతో ఇంద్రజిత్తు రథము పైకి ఉరికి, సారథిని, గుఱ్ఱాలను చంపాడు. అంతేకాక ఇంద్రజిత్తు చేతిలోని విల్లమ్ములను విరిచి పారవేశాడు.

జంబుమాలి ఆంజనేయునిపై శక్తిని ప్రయోగించాడు. దానిని తప్పించుకొని హనుమ జంబుమాలి రథముపైకి ఉరికి ఆయనను హతమార్చాడు.

నలుడు ప్రతపనుని రెండ్లు కండ్ల గుడ్లను పీకి వేశాడు. సుగ్రీవుడు వానర సేనపై విరుచుక పడుతున్న ప్రఘసుని సంహరించాడు.

లక్ష్మణుడు శర వర్షంతో విరూపాక్షుని రూపుమాపాడు.

సుషేణుడు విద్యున్మాలిని ఒక కొండతో కొట్టి చంపాడు. మైందద్వివిదులు వజ్ర ముష్టి, నికుంభులను తుదముట్టించారు.

ఈ విధంగా మొదటి రోజు ద్వంద్వ యుద్ధంలో రాక్షస వీరులు చనిపోయారు. అయితే రాత్రికాగానే రాక్షసులు కోతులను మ్రింగ సాగారు.

# నాగపాశము

రాత్రిపూట కోతులపైబడి రాక్షసులు తినసాగారు. వానరులకు రాత్రి కళ్లు కనబడవు. అందువలన వానరులు హాహాకారాలను చేయసాగారు.

శ్రీరామచంద్రుడు రాక్షసులపై శరవర్షాన్ని కురిపించాడు. ఆ బాణ వర్షానికి రాక్షసులు అనేక సంఖ్యలో హతులయ్యారు.

ఒక వైపు మొదటి రోజు యుద్ధంలో రాక్షస నాయకులు సంహరింపబడడము, మరొకవైపు శ్రీరాముని శరవర్షానికి సామాన్య రాక్షసుల మరణము ఇంద్రజిత్తును కృంగదీశాయి.

ఇంద్రజిత్తు వానరులపై విరుచుకపడ్డాడు. కాని అంగదుడు అతని అశ్వాలను, రథసారధిని అతిలాఘవంగా హతమార్చాడు. అంగదుని దేవగణాలు, ఋషిగణాలు, రామలక్ష్మణులు సుగ్రీవ విభీషణులు అనేక విధాలుగా ప్రశంసించారు.

ప్రత్యక్ష యుద్ధంలో తన పాచికలు పారవని గమనించిన ఇంద్రజిత్తు మాయా యుద్ధానికి పూనుకొని, తిరస్కరణీ విద్య" ద్వారా తాను కనబడకుండా వానరులపై బాణ వర్షాన్ని కురిపించసాగాడు.

అంగదాది మహావీరులు మహా వృక్షాలను, మహాశిలలనుగైకొని ఇంద్రజిత్తును ఎదిరించుటకు నిలువగా, ఆయన వారికి కనబడకుండా ఉండి పెద్ద పెద్ద అస్త్రాలను ప్రయోగించి వారిని కదలకుండా చేశాడు.

రామ లక్ష్మణులపై భయంకరమైన "నాగాస్త్రాన్ని" ప్రయోగించాడు. నాగాస్త్రాన్ని ఇంద్రజిత్తు వర ప్రసాదంగా లభించినవాడు. అందువలన అది అమోఘమైనది.

రామలక్ష్మణులు కూడా ఆ నాగాస్త్రానికి కట్టుబడ్డారు. భయంకరమైన సర్పాలు రామ లక్ష్మణుల శరీరాలకు గట్టిగా చుట్టుకొన్నాయి. వారికి ఊపిరాడడం కూడా కష్టంగా ఉంది. వారి శరీరాల నుండి మేఘనాదుని బాణ వర్షానికి రక్తము ధారగా కారుతున్నది. వారిద్దరు విధిలేక భూమిపై పడిపోయారు.

ఆ అన్నదమ్ములు ఒకరినొకరు చూచి నిరాశతో మూర్ఛచెందారు.

అప్పుడు మైందద్వివిదులు సుగ్రీవాంగద, విభీషణులు నాగాస్త్ర బద్ధులైన రామలక్ష్మణులను చూసి విషాదాన్ని పొందారు.

అయితే మేఘనాదుడు తన మాయా విద్య వలన అంగదాది మహా వానరులందరిని తన బాణ వర్షంచేత బంధించాడు.

రాక్షస వీరులు రాక్షస రాజపుత్రుని పరాక్రమానికి సంతోషించి రామలక్ష్మణులు చనిపోయారని, నిశ్చయించుకొని, ఇంద్రజిత్తుకు జయ జయ ధ్వానాలను చేశారు.

# పుష్పక విమానంపై సీతాదేవి

రామలక్ష్మణుల పరిస్థితిని చూసి, సుగ్రీవుడు విలపించసాగాడు. విభీషణుడు ఆయనకు ధైర్యం చెప్పాడు. "సుగ్రీవా ! నీవే చిన్న పిల్లవాడివలె ఏడ్వ వచ్చునా ? నీ దు:ఖాన్ని చూసి వానరులందరు భరించగలరా ? వారు విచారంతో చెట్టుకొకరు,పుట్టకొకరు పారిపోతే మన ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరే" అవుతుంది కదా !

రామలక్ష్మణులు సత్యానికి ధర్మానికి కట్టుబడ్డ మహాపురుషులు. వారు అకాల మరణానికి గురికారు నన్నునమ్ము.

"నీవు ఏడ్వమాను!"మని విభీషణుడు మంత్రజలంతో సుగ్రీవుడి కళ్లు కడిగాడు.

సుగ్రీవుడు కొంత ధైర్యాన్ని కూడగట్టుకొన్నాడు. వానర వీరులందరు రెప్పపాటులేక రామలక్ష్మణులను గమనించసాగారు. ఆ అన్నదమ్ముల ప్రతి కలయికను ఆతురతతో చూడసాగారు.

ఇంద్రజిత్తు తన తండ్రి అయిన రావణుని వద్దకు వెళ్లి "తండ్రీ! నీకు ముఖ్య శత్రువులైన రామలక్ష్మణులను నాక్రూర బాణాలతో వధించాను. వానరులందరు నిరాశతో చావడానికి సిద్ధంగా ఉన్నారని" తెలిపాడు.

రావణుడు తన కొడుకు వీరత్వానికి సంతోషంతో ఉప్పొంగి పోయాడు. ఆయన మేఘనాదుని నాగాస్త్రము రామలక్ష్మణులను ప్రాణరహితులుగా చేసిందని తెలిసికొని హర్షపరవశుడయ్యాడు.

అప్పుడు సీతాదేవికి కాపలాగా ఉన్న రాక్షసస్త్రీలను పిలిచి “రామలక్ష్మణులు నా కుమారుడైన ఇంద్రజిత్తు చేత యుద్ధ రంగంలో వధింపడ్డారు. మీరు పుష్పక విమానాన్ని తీసుకొని సీతాదేవి దగ్గరకు వెళ్ళి, రామలక్ష్మణుల వధ గురించి తెలుపండి.

ఆమెను పుష్పక విమానముపై కూచోబెట్టి యుద్ధభూమికి తీసుకవెళ్లండి. అంతట ఆమెకు చూపెట్టండి.

సీతాదేవి తన భర్త, మరదిమరణాలను స్వయంగా తన కళ్లతోనే చూడాలి.

అప్పుడు తాను ఇంత వరకు ఎదిరి చూచిన భర్త మరణించాడని, ఇక ఎన్నటికి తిరిగిరాడని తెలుసుకుంటుంది.

ఏ భర్త పరాక్రమాన్ని నమ్ముకొని నన్ను ఆమె ఇంత వరకు తిరస్కరించిందో, ఆభర్త మరణాన్ని తన కళ్లనిండా చూశాక ఆమె మనస్సు మార్చుకోక తప్పదు.

నాకు ఆమె వశంకాక తప్పదు. ఆమెకు రెండో మార్గమే ఉండదు” అని చెప్పి వారిని పంపించి వేశాడు.

# సీతాదేవి విషాదము

నాగపాశముచే రామలక్ష్మణులు హతులయ్యారనే వార్త సీతాదేవికి పిడుగు పాటుగా అనిపించింది.

అమె రాక్షస స్త్రీలు తోడురాగా పుష్పక విమానంపై యుద్ధ భూమికి తరలివెళ్లింది.

రాక్షస సైనికులు మహోత్సాహంతో ఉన్నారు. వానరులువిషాదంతో క్రుంగి ఉన్నారు.

రామలక్ష్మణులు తెలివి దప్పిపడిపోయారు. వారి ధనుర్బాణాలు నేలపై పడ్డాయి. వారి ముఖాలు కాంతి దప్పాయి. కవచాలు పగిలిపోయాయి. అప్పుడప్పుడు చాల మెల్లగా ఉచ్ఛ్వాసనిశ్వాసలు వస్తున్నాయి. ఆమెకు వారిని ఆ విధంగా చూచాక దుఃఖము ఆగలేదు.

ఆమెకు తన బాల్యంలో హస్తసాముద్రిక శాస్త్రజ్ఞులైన బ్రాహ్మణుల వాక్కులు గుర్తు కొచ్చాయి.

"ఈమె ముత్తైదువగానే ఉంటుంది. కొడుకులను కంటుంది". అని వారు చెప్పారు. అంతటి మహనీయుల మాటలు అబద్ధాలయ్యాయే అని ఆమె వ్యథ చెందింది.

"నా భర్త నూరు అశ్వమేధాలు చేస్తాడని, దీర్ఘకాలము సత్రయాగము చేసే ఆయనకు పట్టపురాణినవుతానని వారు తెలిపారు కదా. విప్రోత్తముల మాటలు అసత్యాలయ్యాయే".

"నేను పుణ్యవతినని, చక్రవర్తికి భార్యనవుతానని పలికారే ? వారి పలుకులు అనృతాలయ్యాయే?"

"కమలాల వంటి అరచేతులు, పద్మరేఖలు గల పాదాలు ఉన్న పడతి పట్టపురాణి అవుతుందని" అంటారే ఆలక్షణాలు కలిగిన నాకు ఆ అదృష్టము కలుగలేదే?

"కాలు బొటన వ్రేలు వెడల్పుగా ఉండడము, తొడల యందు వెంట్రుకలు ఉండడము, నూగారు వంకరై, కపిలవర్ణంతో ఉండి, దట్టముగా, నడుమతెగి ఉండడము, అరచేతి యందు గీతలు విస్తరించి ఉండడము, మెడ స్థూలంగా ఉండడము, క్రింది వరుస దంతాలు హెచ్చు తగ్గులుగా విరిగి ఉండడము విధవ లక్షణాలు. అవి ఏవి నాలోలేవు. అయినా ఈ వైధవ్యమేమిటి?"

"స్తనాలు పెద్దగా, గుండ్రగా, సమానంగా బలిసినవిగా దృఢంగా ఉండడము ప్రశస్తమంటారు. నా తల వెంట్రుకలు సమానంగా, సన్నగా, నల్లగా ఉన్నాయి. కనుబొమ్మలు ఒక దానితో ఒకటి కలువకుండా ఉన్నాయి. నా కాలివ్రేళ్ల అడుగు భాగాలు నేను నడుస్తున్నప్పుడు భూమికి నేలకు తాకుతున్నాయి. నా ముఖములో చిరునవ్వు చెరగకుండా ఉంది."

ఈ శుభలక్షణాలన్ని ఉన్నా, పనికి రాని లక్షణాలేవి లేకున్నా, నాభర్త ఈ దుస్థితిలో ఉండడము వలన అవన్నీ, వ్యర్థమై పోయాయి.

నా భర్త జన స్థానంలో వేలాది రాక్షసులను సంహరించడం, నన్ను అన్వేషిస్తూ కిష్కింధకు చేరి అక్కడ వాలిని సంహరించడం, హనుమను పంపడం, సముద్రంపై సేతు నిర్మాణము మొదలైన ఘనకార్యాలన్ని చేసి ఇప్పుడు ఇంద్రజిత్తు చేత మొదటి రోజే పరవశం కావడం నా దురదృష్టంకాక మరేమిటి? సముద్రాన్ని ఈది ఇంటి ముందు కాలువలో పడిపోయినట్లు అయింది.

నా భర్త సమస్త శస్త్రాస్త్ర సంపన్నుడు. ఏ ఒక్క అస్త్రాన్ని ప్రయోగించినా ఎంతటి శత్రువైనా మట్టి కరవ వలసిందే? అయినా ఇంద్రజిత్తుపై నా భర్త ఏ మహాస్త్రాన్నైనా ఎందుకు ప్రయోగించలేదో?

ఇంద్రజిత్తు నా భర్త ఎదుట నిలువ జాలక మాయా యుద్ధంలో పడగొట్టాడు. చాటు నుండి కొట్టిన పిరికి పందపైకి అస్త్రాలను ప్రయోగించడం బాగుండదని మా రామలక్ష్మణులు ఊరుకొన్నారేమో?

రామభద్రుడంతటివాడు మహావీరుడైన తనతమ్మునితో పాటు నేలపై విగత జీవుడై పడి ఉన్నాడే? కాలమెంత విచిత్రమైనది! ఎంతటి పౌరుషమైనా దైవ బలము ముందు వ్యర్థమే! కాలమే దైవ స్వరూపము !

నేను నా తల్లిదండ్రులకు దూరమయ్యానని దుఃఖించలేదు. నాకొరకు నేనెన్నడు ఏడువలేదు. పూర్వకర్మఫలము శుభమైనా అశుభమైనా అనుభవించి తీరవలిసిందే కదా!

కాని నా దుఃఖము ఇంతదాకా "నేను రాముని నుండి దూరమయ్యానే?" అని, ఇప్పుడు "ఇక నాభర్తతో కలిసి ఉండే అవకాశమే రాదని".

నేను రాముని గురించి ఇప్పుడు విలపించడం కూడ, కౌసల్యా దు:ఖము ముందు తక్కువే. ఆ రాజమాతకు ఒకడే కొడుకు ఆయన సర్వ ప్రాణిప్రియుడు. తల్లికి అత్యంత ప్రియుడు. తండ్రి మాటలను పాలించడానికి ఆయన అడవులకు బయలు దేరినప్పుడే ఆమె దు:ఖానికి అంతములేదు.

ఇప్పుడు కట్టుకొన్న భర్తను కూడ కోల్పోయి, కన్న కొడుకు రాకకై కళ్లలో వత్తులు వేసుకొని ఎదిరిచూస్తున్నది. ఆతల్లికి "తన కొడుకు ఇక తన దగ్గరికి రాలేదు" అని తెలిస్తే ఆమె జీవించి ఉంటుందా? ఒక వేళ జీవిస్తే ఆ దు:ఖాన్ని ఎలా భరిస్తుంది. ? నిజానికి ఆ కన్న తల్లి దుఃఖాన్ని తలచుకొని సీతాదేవి కుమిలిపోతుంది.

# త్రిజట ఓదార్పు

భర్త యొక్క దీనస్థితిని చూస్తూ, దుర్భర దు:ఖాన్ని అనుభవిస్తున్న సీతాదేవిని త్రిజట ఓదార్చడానికి ప్రయత్నించింది.

"అమ్మా! నీభర్త మరణించలేదు. దానికి నాకు తెలిసిన గుర్తులను తెలుపుతాను.

ఒకటి ఒక మహారాజు మరణిస్తే సేవకుల ముఖాలలో విషాదము మాత్రమే కనబడుతుంది . కాని ప్రస్తుతము వానరుల ముఖాలలో విషాదము కంటే సంతోషాగ్రహాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

రామలక్ష్మణుల కదలికలు, వారి బలమైన ఉచ్ఛ్వాసనిశ్వాసలను చూచినప్పుడు వారికి సంతోషము కలుగుతున్నది. కదలికలు లేనప్పుడు వారి ఆ స్థితికి కారణమైన రాక్షసుల పట్ల ఆగ్రహము కలుగుతున్నది.

రెండవది అన్నిటికంటే ముఖ్యమైన గుర్తు ఈ పుష్పక దివ్యవిమానమే. ఈ విమానం అశుభాన్ని ఎంత మాత్రము సహించదు. నీభర్త నిజంగా మరణించి ఉంటే, ఇది నీవు ఎక్కిన తరువాత పైకి ఎగిరేది కాదు. కదిలేది కాదు. మనము ఈ పుష్పకముపై యుద్ధ భూమిపైగా ప్రయాణిస్తున్నామంటే నీభర్త ప్రాణాలతో ఉన్నాడనే అర్థము.

మూడవ గుర్తు నిజంగా నీ భర్త మరణించే ఉంటే ఇంకా ఆయనకు కాపలా ఉండడము దేనికి ? వానర వీరులు రామలక్ష్మణులను జాగ్రత్తగా చూచుకొంటున్నారు.

అంతేకాదు రామలక్ష్మణులు లేచిన వెంటనే మళ్లీ రాక్షసులపై పడడానికి యుద్ధానికి వాళ్ళు సన్నద్ధులై ఉన్నారు.

ఈ గుర్తులన్ని నీవు ఇంకా ముత్తైదువవే అని తెలుపడానికే.

అందువలన నీవు దు:ఖాన్నిమాని, ధైర్యంగా ఉండు.

సీతా! నేనెన్నడు ఇంతవరకు అబద్ధమాడలేదు. ఇక ముందు అసత్యము పలుకాలని నాకులేదు.

నీ పాతివ్రత్యానికి, నీ సత్ప్రవర్తనకు నేను సంతోషించి నీపట్ల స్నేహముతో నేను నిజమే తెలుపుతున్నాను.నామాటవిను. నామాట నమ్ము"మని త్రిజట సీతాదేవిని ఓదార్చి, ఆమెతో సహాపుష్పకముపై లంకలోని అశోక వనానికి తిరిగి వెళ్లింది.

"త్రిజట" అంటే మూడు జడలుకలది. తలవెంట్రుకలు విడివిడిగా మూడుపాయలు కలది.

సాధారణంగా స్త్రీలు తమ తలలోని వెంట్రుకలన్నిటిని చక్కగా దువ్వకొని ఒకే జడగా క్రిందికి వదలుతారు. నల్లని నాగసర్పంలా ఆ జడ వీపుభాగంలో కదలుతు ఉంటుంది. అటువంటి జడ ఎంత పెద్దగా ఉంటే ఆ స్త్రీకి అంత అందము.

కొందరు స్త్రీలు వైవిధ్యము కొరకో, లేక తమ వయస్సుకు అనుకూలంగానో వెంట్రుకలను దువ్విపైకి సిగముడుచుకొంటారు. అది కూడ అందంగానే ఉంటుంది.

తల వెంట్రుకలకు తైల సంస్కారము (నూనె పెట్టుకోవడం) లేక వెంట్రుకలను

జడలు కట్టేలా పాయలు పాయలుగా వదలివేయడమంటే అందము పట్ల జాగ్రత్త లేకపోవడమన్నమాట. ఆకర్షణ పట్లవ్యామోహం లేక పోవడం అన్నమాట.

ఆ స్థితి ఎప్పుడు వస్తుంది? వైరాగ్యము కలిగాక వస్తుంది. కనుక త్రిజట అంటే "వైరాగ్యము కలిగిన వనిత" అన్నమాట.

ఇంకొక మాట! తల వెంట్రుకలు తలలో కలిగే తలపులకు (ఆలోచనలకు)సంకేతము.

తల వెంట్రుకలన్నిటిని దువ్వి ఒక్క జడగా వేసుకోవడమంటే మనలోని మూడు గుణాల (సత్వ, రజస్తమో గుణాల) దృఢ బంధానికి లోను కావడమన్నమాట. స్త్రీలు జడ ద్వారా పురుషులను ఆకర్షిస్తారు. అంటే రజోగుణము అధికంగా కలిగి ఉంటారు.

త్రిజటలో ఇతరులను ఆకర్షించే రజోగుణము లేదు. విభీషణుని కుటుంబ స్త్రీ కనుక తమో గుణము మొదటి నుండే లేదు. అంటే ఆమెలో సత్వ గుణము ప్రధానంగా ఉన్నది. "సత్వాత్ సంజాయతే జ్ఞానమ్" అన్నట్లు వివేక జ్ఞానమునిండుగా ఉంది. ఆమెలో మూడు గుణాల కలయిక లేదు. ఏ జడకు ఆజడ వేరుగా ఉంది. అందు వలన ఆమెలోని సత్వగుణము రజస్తమో గుణాలకు దూరంగా ఉంది.

# శ్రీరామ విలాపము

వానర వీరులు వేయి కళ్లతో కాపాడుతుండగా నాగపాశము నుండి మొదట తేరుకొన్న శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణుడు నాగపాశబద్ధుడై స్పృహ లేకుండా పడిపోవుట జూచి అమితంగా దు:ఖించాడు.

"తమ్ముడా లక్ష్మణా! నీవు నాపట్ల అమిత ప్రేమతో భార్యా సంపదలను విడిచి మా వెంట అడవికి వచ్చావే? నీవు ఈ విధంగా నాగపాశమోహితుడవై అచేతన స్థితిలో పడి ఉండడాన్ని నా కళ్లారా చూస్తున్నానే ? నేనెంత కృతజ్ఞత లేనివాడిని? ఎంత పాపాత్ముడిని?

నిజంగా నేను మహావీరుడనై ఉండి కూడా నిన్ను రక్షించలేక పోయానే ?

తోడబుట్టిన వాడివి, తోడ అడవులకు వచ్చినవాడివి, నన్ను ప్రాణాల కంటే అధికంగా ప్రేమించిన వాడివి. నిన్ను ఇంతటి ఆపదలో చూస్తున్నానే నాకు నా ప్రాణాలు నీకంటే ప్రియమైనవి కావు. ప్రాణప్రియ అయన సీతాదేవి కూడా నీకంటే అధికము కాదు.

నాకు ఈ శరీరమే ముఖ్యం కాదు. ఈ శరీరము పోతే ఇంకో శరీరము వస్తుంది. నా భార్య కూడా ముఖ్యంకాదు. ఈ భార్య పోతే మరో భార్య దొరుకుతుంది.

కాని నాకు లక్ష్మణుని వంటి తమ్ముడు ఎన్నడు దొరుకడు. సౌమిత్రీ! నేను విచారంతో ఉన్నప్పుడు నన్ను ఓదార్చేవాడివే! ఇప్పుడింత నీ కొరకు ఏడుస్తున్నా సమాధానము చెప్పకుండడము న్యాయమా ?

నీ పరాక్రమంతో రాక్షసులను పరుగులు తీయించే వాడివే ? ఇప్పుడు ఒక్క రాక్షసుని పరాక్రమానికి నీవే పడిపోయావా?

వేయి చేతులు గల కార్త వీర్యార్జునుడు ఒకే సారి అయిదు వందల బాణాలను ప్రయోగించగలిగితే, నీవు రెండు చేతులతోనే అన్ని బాణాలను వేయగలిగే వాడివే ? పరాక్రమంలో నీకు సాటి ఎవ్వరున్నారు ?

లక్ష్మణా ! నీవు తమ్ముడివి మాత్రమే కాదు ఒక మంచి మిత్రుడివి. ఆలోచనలు చెప్పడంలో సమర్థుడైన మంత్రివి. నీ వంటి వాడు నాకు ఎవ్వరు ఉన్నారు ?

సోదరా ! ఈ నాగపాశం నుండి నీవు ఆరోగ్యంతో బయట పడితివా సరే ! లేకుంటే నేను కూడా నీతో పాటు ప్రాణాలను వదలుతాను.

నేను బ్రతికి ఏమి ప్రయోజనము ? తనను కన్న తల్లికంటే ఎక్కువగా ఆదరించిన నిన్ను ఈ విధంగా దుస్థితిలో వదిలి సీత నా వెంట రావడానికి ఇష్టపడుతుందా ?

ఒకవేళ ఈ యుద్ధంలో గెలిచి నేను సీతతో కూడా అయోధ్యకు వెళ్లితే "అన్ని వదలుకొని, మీ అన్నవదినల వెంట వచ్చిన సౌమిత్రి ఏదయ్యా" అని మాతల్లి కౌసల్య ప్రశ్నకు నేనేమి సమాధానము చెప్పగలను ?

"రామా ! నిన్ను నమ్మి నా కొడుకును నీ వెంట కఠినమైన కారడవులకు పంపానే? మీ భార్యా భర్తలు ఇద్దరు వచ్చారు. తిరిగి వచ్చారు సరే. కాని మీకు సేవలు చేయడానికి మీ వెంట వచ్చిన నా ప్రియపుత్రుడు మీతో తిరిగి రాలేదా ?" అని అడిగే మీ కన్నతల్లి సుమిత్రకు నేను బదులు ఏమి చెప్పాలి? ఆమె నీవు లేకుండా బ్రతుకుతుందా?

భరతుడు:- "అన్నా! సుమిత్రా పుత్రులిద్దరిలో ఒకరు నా వెంట ఉన్నారు సరే! కాని నీ వెంట వచ్చిన సౌమిత్రి ఏడి?" అని ప్రశ్నిస్తే "లంకలోనే వదలిపెట్టి వచ్చిన కృతఘ్నుడిని" అని చెప్పాలా? "వ్యర్థుడిని" అని చెప్పాలా?

శ్రీరాముడు సోదరుని దుస్థితికి పలు విధాలుగా విలపిస్తూ సుగ్రీవుని వైపు తిరిగి, "వానర రాజా ? నీవిప్పుడే నీ వానర వీరులందరితో కలిసి కిష్కింధకు తిరిగి వెళ్లు. రేపటి దాకా ఆగితే రావణుడు విజయోత్సాహంతో మీపై పడి నిర్బంధించవచ్చు.

మిత్రమా ! నీవు నా కొరకు చాల కష్టపడ్డావు. సీతాదేవి కొరకు నలు దిశలలో వెతికించావు. లంకలో ఉన్నదని తెలియగానే భార్యా, రాజ్యాలను వదిలి సమస్త వానరసైన్యంతో నావెంట వచ్చావు. వారధిపై వంతెన నిర్మింపజేశావు.

నిన్నటి యుద్ధంలో ఎదురుపడ్డ రాక్షసుల నల్లా నీవు, నీ వీర సైనికులు హతం చేశారు.

నీ వింత నాకొరకు కష్టపడ్డా, నేను దురదృష్టవంతుడిని. మాయా యుద్ధంతో ఇంద్రజిత్తు వలన ప్రాణసోదరుని పోగొట్టుకొన్న నిర్భాగ్యుడిని.

నా మంద భాగ్యానికి మీరు మాత్రము ఏమి చేస్తారు? వానర వీరులారా! మీరు ప్రాణాలకు తెగించి నా కొరకు పాటుపడ్డారు. మీ సహాయానికి కృతజ్ఞతలు. ఇక మీరు కిష్కింధకు తిరిగి వెళ్లండి. మీ భార్యాపుత్రులతో సుఖంగా ఉండండి సెలవు" అని వారికి వీడ్కోలు పలికాడు.

అప్పుడు వానర వీరులందరికి కళ్లు బాష్పధారలతో నిండిపోయాయి.

అంతలో రామ లక్ష్మణుల దుస్థితిని చూడడానికి విభీషణుడు అక్కడికి వచ్చాడు.

కాటుక కొండవంటి మహాకాయం గల విభీషణుని చూసి భయంతో "ఇంద్రజిత్తు" అని భ్రమించి వానరులందరు పరుగులు తీయసాగారు.

సుగ్రీవునికి మొదట అర్థం కాక అంగదుని అడిగాడు. "రామలక్ష్మణుల ఈ పరిస్థితి ఈ నిమిషంలో కలిగింది కాదు. మరేదో భయంతో వారు పారిపోతు ఉండవచ్చునని" అంగదుడు అన్నాడు.

సుగ్రీవుడికి విభీషణుని చూడగానే పరిస్థితి అర్థమైంది. ఆయనను చూచి ఇంద్రజిత్తు అనుకొని పారిపోతున్నారని తెలిసింది.

అందువలన జాంబవంతుని చూసి, "తాతా ! మన వాళ్లందరికి ధైర్యాన్ని కలిగించి వారందరిని తిరిగి రప్పించు"మని కోరాడు. జాంబవంతుని పిలుపుతో అందరు తిరిగి వచ్చారు.

-- ఇతిశం --

"మునుపటి బంధమ్మనుజుడు. వనితాబంధము నేటి బంధమ్ము"

# విభీషణుని విషాదము

శ్రీ రామలక్ష్మణుల పరిస్థితిని చూసి బాధపడుతున్న సుగ్రీవుని చూసి విభీషణుడు "మిత్రమా ! నీవే ఇంతగా దు:ఖిస్తుంటే నా పరిస్థితి ఏమవుతుందో ఆలోచించావా ?

నేను రఘురాముని ధర్మనిరతిని, ఉదార స్వభావాన్ని, సాటిలేని పరాక్రమాన్ని నమ్మి, నా రాజ్యాన్ని, నా భార్యను, సంతానాన్ని, సర్వాన్ని వదలి శ్రీరామ చంద్రస్వామిని శరణువేడాను కదా !

ఇప్పుడు రామక్ష్మణులకు ఏదైనా ప్రమాదం కలిగితే నా గతి ఏమవుతుంది? నన్ను తన్ని వెళ్లగొట్టిన దుర్మార్గుడైన నా అన్న దగ్గరికి వెళ్లగలుగుతానా? లేదు కదా!

నాకిప్పుడు రాముడే సర్వము. ఆయన విజయమే నా విజయము. ఆయనతోనే నాజీవనము.

రామలక్ష్మణులకేదైనా ప్రమాదం వాటిల్లితే నేను కూడా ప్రాణాలను వదలుతాను.ఒక వేళ ప్రాణాలతో ఉన్నా అడవులలో ఒంటరిగా, మా వాళ్లకు అతి దూరంగా పిచ్చివాడివలె తిరుగుతూ, కందమూలాలను తింటూ జీవిస్తాను. ఇక నేను విజయంతో తిరిగి వస్తానని ఎదురు చూస్తున్న నా భార్యా పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికే వీలులేదు.

శ్రీ రాముడు సత్యపరాక్రముడు, యుద్ధ ప్రియుడు, అరివీర భయంకరుడు.

ఆయన ముందు రాక్షసవీరులెవ్వరు నిలువలేరు. ఇంద్రజిత్తంతటివాడు అంగదుని చేతిలో చావు దెబ్బతిన్నాడు. తన ఓటమి ముఖాన్ని తండ్రికి చూపలేక అధర్మమైన మాయా యుద్ధానికి పూనుకొన్నాడు. తాను రామచంద్రుని ముందు నిలువలేక మోసగించి ఆయన, ఆయన తమ్ముని శరీరాలపై క్రూర బాణాలను నాటాడు.

ధర్మాత్ములైన దశరథ చక్రవర్తి పుత్రులు ఇంతటి ఘోరవిపత్తుకులోనుకాగా, వారిని ధర్మబుద్ధితో ఆశ్రయించిన నేను బ్రతికి ఉండినా శవమువలె అయిపోగా, పాపాత్ముడైన రావణుడు తన పంతం నెగ్గించుకొన్నాడు. అధర్మపరుడైన ఆయన ప్రతిజ్ఞ నెరవేరింది". అని అమితంగా విభీషణుడు విలపించాడు.

సుగ్రీవుడు "మిత్రమా ! రామలక్ష్మణులు మరణించుట అసంభవము. వారి ఈ దుస్థితి తాత్కాలికము. వారు లేవగానే రావణుని, ఆయన పరివారాన్ని ప్రాణాలతో వదలరు. నా మాట నమ్ము. నీవు రాముని ఆశ్రయించినందుకు ఫలంగా రాజ్యపాలనను

నీ భార్యా పుత్రాదులను చేపట్టగలవు" అని ఓదార్చాడు.

సుషేణుని చూసి, "సుషేణా! వీరిద్దరు మూర్ఛ నుండి తేరుకోగానే వీరిని, వానరసేనను తీసికొని కిష్కింధకు తిరిగి వెళ్లు. నేను రావణుని సపుత్రబాంధవంగా సంహరించి, నా మిత్రుడైన విభీషణుని లంకానగర సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసి తిరిగి వస్తానని" తెలిపాడు.

అప్పుడు సుషేణుడు తన వైద్యవిజ్ఞానంతో "నీవు ఎవ్వరి ద్వారానైనా "సంజీవ కరణి" అనే దివ్యౌషధాన్ని తెప్పించు. దానివలన రాజకుమారులిద్దరు పునర్జీవితులై, తాము కోల్పోయిన బలాన్ని, ధైర్యోత్సాహాలను పొందగల్గుతారు.

పూర్వము దేవదానవుల యుద్ధంలో దానవుల బాణాల దెబ్బలు తిని కొంతమంది దేవతలు మరణించారు. కొందరు శక్తి హీనులయ్యారు.

అప్పుడు దేవగురువైన బృహస్పతి కొన్ని మూలికల చేత వారికి పునర్జీవితాలను, శక్తి సంపదలను కలిగించాడు.

ఆ మూలికలు పాల సముద్రం దగ్గర ఉన్నాయి. అవి ఉన్న చోటును కొందరు వానర వీరులు తెలిసి ఉన్నారు. సంపాతి, పనసుడు మొదలైన వానరులు "సంజీవ కరణి" ఔషధాలను తీసుకరాగలరు.

ఆంజనేయుని మాట చెప్పవలెనా ? ఆయనకు అసాధ్యమైన పనేలేదు.

పాల సముద్రం పరిసరాలలో ద్రోణ, చంద్ర పర్వతాలు అని రెండు కొండలు ఉన్నాయి. వాటిలో సంజీవకరణి,విశల్యకరణి అనే రెండు ఓషధులు ఉంటాయి. వాటి ద్వారా పునర్జీవము పునశ్శక్తి కలుగుతాయి" అని సుషేణుడు తెలిపాడు.

సుగ్రీవ సుషేణుల మధ్య సంభాషణ ఈ విధంగా సాగుతుండగానే హఠాత్తుగా ప్రచండ వాయువు వీచింది. దాని వలన పెద్ద పెద్ద చెట్లు "పెళపెళ" ధ్వనులతో విరిగి పోసాగాయి. దట్టమైన మబ్బులన్ని విచ్చుక పోయి చీకటి తొలిగిపోయింది. ఆ గాలికి సముద్రంలో కొండల వంటి పెద్ద పెద్ద అలలు రాసాగాయి.

ఆ గాలిని ఎలా గమనించాయో, ఎలా పసిగట్టాయో తెలియదు. కాని అంత వరకు తమ బలంతో రామలక్ష్మణులకు ఊపిరి ఆడనీయని భయంకర సర్పాలన్ని భయంతో పారిపోయి సముద్రంలో ప్రవేశించాయి.

బంగారు రంగుతో, వేద నాదాన్ని వినిపిస్తున్న రెక్కలతో పక్షిరాజు గరుత్మంతుడు అనుకోకుండా అక్కడికి వచ్చాడు.

ఆయన వచ్చీరాగానే, రామలక్ష్మణులను చూసి తన చేతులతో వారి శరీరాలను స్పృశించగానే, వారి గాయాలన్నిమాని, వారు తిరిగి జవసత్వ సంపన్నులై లేచారు. రామచంద్రుని, లక్ష్మణుని పక్షీంద్రుడు సంతోషంతో కౌగిలించుకొన్నాడు. రామచంద్రుడు లక్ష్మణుడు హర్షపరవశులయ్యారు.

శ్రీరామభద్రుడు విహగేంద్రునితో "పక్షి రాజా ! నీ దయవలన మా సోదరులిద్దరికి భయంకరమైన నాగపాశము నుండి విముక్తి కలిగింది.

నిన్ను చూస్తుంటే మా తండ్రిగారైన దశరథ చక్రవర్తిని, తాతగారైన అజమహారాజును చూసినంత సంతోషంగా ఉంది.

నీవు సామాన్య శరీరుడవు కాదు. నీవు ధరించిన వస్త్ర హార, చందనాదులు దేవతలు ధరించేవి. నీవు అపరిమిత తేజో బల సంపన్నుడవు. "ఇంతకు నీవు ఎవ్వరు? ఎందుకు మాపై ప్రేమతో వచ్చి, మమ్మల్ని ఈ మహాపద నుండి రక్షించావు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు గరుడుడు "మిత్రమా ! నీకు నాగాస్త్రము వలన కలిగిన ఆపదను విని మిమ్మల్ని కాపాడడానికి వచ్చాను. నేను చేసింది స్నేహ కృత్యము.

నిజానికి ఈ నాగాస్త్రాన్ని తప్పించడానికి దేవదానవ గంధర్వాదులకు శక్తిలేదు. స్వయంగా దేవేంద్రుడు కూడా దీని నుండి తప్పించజాలడు.

ఇంద్రజిత్తు తన తపశ్శక్తి వలన సాధించుకొన్న మహాస్త్రము ఇది. ఆయన మంత్రశక్తి వలన సృష్టింపబడిన మహాసర్పాలు మిమ్మల్ని పరవశులను చేశాయి. అందువలన మీపట్ల స్నేహాన్ని పురస్కరించుకొని నేనే స్వయంగా వచ్చాను. మీరిప్పుడు నాగాస్త్ర బంధం నుండి పూర్తిగా విముక్తులయ్యారు. కాని రామచంద్రా! ముందు ముందు మీరు రాక్షసుల మాయలను గుర్తించి వాటికి విరుద్ధ విధంగా యుద్ధము చేయాలి. మాయ, మోసము లేకుంటే రాక్షసులు ఎందుకు పనికి రారు.

"నీవు నిరంతరము జాగ్రత్తగా ఉండి, సమస్త రాక్షసులను సంహరించి, సీతాదేవిని పరిగ్రహించి, అయోధ్యలో పట్టాభిషేకాన్ని స్వీకరించి, ప్రజారంజకముగా రామరాజ్యాన్ని చరిత్రలో సువర్ణాక్షరాలతో వ్రాసే విధంగా పాలించు.

ఇక నేనెవ్వరిని? అని నాగురించి ప్రస్తుతము మీకు తెలియవలిసిన అవసరములేదు. ప్రస్తుతానికి సెలవు" అని వారిని మళ్లీ కౌగిలించి, వారిచుట్టు ప్రదక్షిణాకారములో తిరిగి సుడిగాలివలె ఎగిరిపోయాడు.

# నాగాస్త్రము-విశేషార్థము

"అగము" అంటే పర్వతము. అది కదలికలేనిది. స్థిరమైనది. ఎంతటి మహావాయువైనా పర్వతాన్ని కదలించదు కదా !

నాగము (న+అగము) స్థిరత్వము లేనిది. ఎప్పుడు కదలుతు ఉండేది. "నాగము" అంటే సర్పము, పాము ఎప్పుడు కదలుతూనే ఉంటుంది.

శ్రీ రామచంద్రుడు "సువేల" పర్వతము నుండి క్రిందికి దిగి వానర సేనా నాయకులైన నీల, అంగద, ఆంజనేయులను లంకానగరము యొక్క తూర్పు, దక్షిణము పశ్చిమము ద్వారా ముందు నిలిపి, సుగ్రీవుని సేనా మధ్యలో నిలిపి తాను సోదర సమేతంగా ఉత్తర ద్వారము వద్ద నిలిచి లంకానగరాన్ని ముట్టడించాడు.

రావణునికి, లంకానగర నిర్బంధాన్ని తెలుపడానికి, "సీతాదేవిని అప్పగించిసంధికి అంగీకరించడమో, లేదా సర్వ నాశనానికి సిద్ధము కమ్మనో" తెలుపుతూ అంగదుని రాయబారిగా పంపాడు.

రామాజ్ఞననుసరించి ప్రాకారము దుమికి నిర్భయంగా రావణుని ముందు నిలిచి రాముని సందేశాన్ని అంగదుడు వినిపించాడు. తనను బంధించడానికి వచ్చిన రాక్షసులను తన బాహువుల మధ్య బంధించి ప్రాకారమంత ఎత్తు ఎగిరి వారిని క్రింద పడవేశాడు. వారు ఎముకలు విరిగి చనిపోయారు. అంతే కాదు అంగదుడు ప్రాకారాన్ని తన పాదాలతో బలంగా తన్ని రావణుని ముందు పడిపోయేలా ముక్కలు ముక్కలు చేసి విజయ గర్వంతో రాముని పాదాల సన్నిధిలో వాలాడు.

అంగదుని అద్భుత చర్య రావణుని పరవారంలో భయాందోళనలను కలిగించింది.

వానర పరివారంలో విశ్వాస మహోత్సాహాలను కలిగించింది. మొదటి రోజు యుద్ధంలో కూడా వానర విజయం రాక్షసవధ కలిగాయి.

శ్రీ రామసేనలో ధైర్యము, విశ్వాసము మహా పర్వతములవలె నిశ్చలంగా, స్థిరంగా నిలిచాయి. అదే నిశ్చలస్థితి! "అగ"స్థితి! నిశ్చల విశ్వాసస్థితి!

ఇంద్రజిత్తు స్వయంగా ఈ పరిస్థితిని మార్చడానికి శాయశక్తుల ప్రయత్నించాడు. వానరులపై సర్పాలవలె బుసలు కొట్టే భయంకర బాణాలను వర్షించాడు. రామ సైన్యాన్ని అల్లకల్లోలం చేయడానికి, చీల్చి చెండాడడానికి ప్రయత్నించాడు.

ఆయనను అంగదుడు ఎదుర్కొన్నాడు. దక్షిణ ద్వారము ముందు పర్వతంవలె నిలుచున్నాడు. ఇంద్రజిత్తు ఎంత ప్రయత్నించినా అంగదుని ముందు ఆయన ఆటలు సాగలేదు.

ఒక వైపు అన్ని దిక్కులలో రాక్షససేనా నాయకులు హతమయ్యారు. తానొక్కడు ఎంత శక్తితో ప్రయత్నించినా అంగదుడతని ప్రయత్నాన్ని నిర్వీర్యం చేశాడు.

ఇక ప్రత్యక్ష యుద్ధంలో (తాను) ఇంద్రజిత్తు కూడ ఏమీ చేయజాలని స్థితి కలిగింది.

ఎలాగైనా వానరులలో స్థిరత్వాన్ని (అగత్వాన్ని) నిర్మూలించాలి. వారు భయంతో వణికి పోయే స్థితిని (నాగత్వాన్ని) కలిగించాలి. ఒక మాయను కలిగించాలి.

మాయ ఎప్పుడు వాస్తవానికి విరుద్ధమైనది. ఇంద్రజిత్తు వాస్తవ యుద్ధాన్ని మాని తాను "తిరస్కరిణీ" విద్య ద్వారా ఎవ్వరికి కనబడకుండా ఉండి 'నాగాస్త్రాన్ని' ప్రయోగించాడు.

'నాగాస్త్రం'మంటే వణికించే శక్తి. స్థిరత్వాన్ని పారద్రోలే శక్తి. ఆ శక్తికి ప్రతీకలే నాగాలు లేక సర్పాలు, మాయ తాత్కాలికమైంది. అది వాస్తవాన్ని శాశ్వతంగా కప్పివేయజాలదు. కాని తాత్కాలికంగా మాయశక్తి అనంతమైంది. కొంత సేపు వాస్తవ శక్తిని అది అడ్డుకొంటుంది.

రామలక్ష్మణులు సత్య స్వరూపులు. వారిని ఏ శక్తి శాశ్వతంగా బంధించజాలదు. అంతేకాదు నిజంగా వారికే ప్రమాదాన్ని కలిగించజాలదు. అన్ని భయంకర సర్పాలు వారిని చుట్టు ముట్టినా ఏ ఒక్కటి కరవలేదు. గట్టిగా బంధించాయి అంతే. ఇంద్రజిత్తు 'నాగాస్త్రాన్ని' తపశ్శక్తి ద్వారా సంపాదించుకొన్నాడు. రామలక్ష్మణులు కూడ ఆ శక్తిని తప్పక మన్నించాలి.

అందువలన రామలక్ష్మణులు మాయ ద్వారా ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రానికి ఏ ప్రతిఘటన లేకుండా కట్టు బడ్డారు. కొంతసేపు నాగశక్తికి వివశులయ్యారు.

రామలక్ష్మణుల వివశత వానర సేనలో, విభీషణునిలో కూడా భయాందోళనలను కలిగించింది. వారి మనస్సులు నాగత్వానికి (వణకడానికి)లోనయ్యాయి. ఆ ఆందోళనలోనే వారు "సంజీవకరణి" తెప్పించడానికి ప్రయత్నాలు చేద్దామనుకున్నారు. మాయ జీవులను వివశులను చేస్తుంది. భయభ్రాంతుల చేస్తుంది. కాని అంతలో అనుకోకుండా అక్కడికి గరుత్మంతుడు వచ్చాడు. ఆయన వేద స్వరూపుడు. ఆయన రెక్కల గాలి వేదనాదాన్ని వినిపిస్తుంది. "వేదయతీతి వేదం" అన్నట్లు వేదము అంటే జ్ఞానము ఆ జ్ఞానము సత్యమైనది.

సత్యమైన జ్ఞానము ముందు మాయ నిలువజాలదు. సత్యజ్ఞానము స్థిరమైనది. అది "అగత్వాన్ని" భయాతీత స్థితిని కలిగిస్తుంది. "నాగత్వము" అంటే వణకి పోయేస్థితి దానంతట అదే తొలిగిపోతుంది. అందువలననే వేద శరీరుడైన గరుత్మంతుడు రాగానే నాగాలు (స్వరాలు) ఎక్కడివక్కడ భయంతో పారిపోయాయి. భయాందోళనలే వాస్తవంగా నాగసర్పాలు.

పరమాత్మ వేదవంద్యుడు. వేదాల చేత స్తోత్రం చేయబడేవాడు. అందువలననే వేద శరీరుడైన గరుత్మంతుడు శ్రీ రాముని (పరమాత్మను) స్తోత్రం చేసి రాక్షస మాయల గురించి జాగ్రత్తగా ఉండుమని తెలిపాడు. శ్రీ రామలక్ష్మణులకు ప్రదక్షిణం చేసి వెళ్లిపోయాడు.

రామలక్ష్మణులు మేఘములు తొలగిన సూర్యచంద్రులుగా, గ్రహణ విముక్తులైన దివాకర నిశాకరులుగా పూర్వ తేజస్సులతో ప్రకాశించారు.

అంతేకాదు సుగ్రీవాది వానరులలో, విభీషణాదులలో మళ్లీ రాముని మహిమ పట్ల విశ్వాసము, గౌరవము కలిగాయి. వారిలో నాగత్వము (చాంచల్యము/వణకుట) తొలిగిపోయింది.

మళ్లీ మహోత్సాహంతో వానర వీరులు సింహనాదం చేశారు.

# రావణ విచారము

తెల్లవారగానే రావణాసురుడు నిద్రలేచి, నిన్నటి రాత్రితో రామలక్ష్మణులు మరణించి ఉంటారని, ఒక్కరోజు యుద్ధంతోనే తనకు తిరుగులేని విజయలక్ష్మి లభించిందని, ఇక సీతాదేవిని తిరిగి ఇవ్వాల్సిన అవసరము లేదని అనుకొన్నాడు. ఆయన మనస్సు సంతోషంతో నిండిపోయింది.

నిన్నటి యుద్ధంలో చావగా మిగిలిన రాక్షసవీరులు ఇంద్రజిత్తు వలన విజయ లక్ష్మి తమకు శాశ్వతంగా స్వంతమైందని తృప్తిగా నిద్రపోతున్నారు. లంకానగరం మెల్లమెల్లగా కళ్లు విప్పుతున్నది.

కాని రాక్షస రాజు నిద్ర నుండి లేవగానే ఆయన ఆలోచనలకు విరుద్ధంగా శత్రు శిబిరం నుండి విజయనాదాలు వినిపించ సాగాయి. ఆయన అయోమయంలో పడిపోయాడు. వానరసేన నుండి అనుకోకుండా ఈ హర్ష ధ్వనులెందుకు వస్తున్నాయి?

ఆయనకు అర్థము కాలేదు. మనస్సంతా విచారమయమైంది.

ఆయన రాక్షస వీరులను పిలిపించి వానరుల ఆనందానికి కారణమేమిటో కనుక్కొని రమ్మని ఆజ్ఞాపించాడు.

భటులు భయభ్రాంతులతో శత్రు శిబిరాన్ని సమీపించారు. నక్షత్రాల మధ్య చంద్రునివలె వానర వీరుల మధ్య లక్ష్మణునితో కలిసి రామచంద్రుడు సంతోషంతో వెలిగి పోతున్నాడు. భటుల గుండెలు ఒక్క క్షణము భయంతో ఆగిపోయాయి. మరుక్షణంలో వాళ్ళు రావణ ప్రభువును చేరి రామలక్ష్మణుల పునర్జీవ వార్తను వినిపించారు.

రావణుని మనస్సులో మనస్సు లేదు. ఎందుకిలా జరిగింది ? తన కొడుకు సాటిలేని మహావీరుడు. మంత్ర విద్యాసంపన్నుడు. మాయా యుద్ధవిశారదుడు.

ఆయన గంభీరమైన తపస్సు చేసి 'నాగాస్త్రాన్ని' బ్రహ్మ వరప్రసాదంగా పొందాడు. ఆ అస్త్రానికి తిరుగులేదు. రామలక్ష్మణులను బంధించి వారికి శ్వాస ఆడకుండా చేసింది. రామలక్ష్మణులు మరణించవలసిన వారే.

మరి ఇలా ఎందుకు జరిగింది ? ఇంతటి మహాస్త్రము వ్యర్థమెందుకైంది ? రామలక్ష్మణులు మళ్లీ ఎలా బ్రతికారు ? మళ్లీ కయ్యానికి ఎలా కాలు దువ్వుతున్నారు?

ఇలా అయితే ఇక తన బలము, తన తపశ్శక్తి ఎలా పని చేస్తాయి ? నమ్మకము లేదు. తనకు విజయము కలుగుతుందనే విశ్వాసము లేదు. తన పరిస్థితి ఏమి కానుంది?

కాలమెంత విచిత్రమైంది ? క్షణంలో బండ్లు ఓడలు కావడం, ఓడలు బండ్లు కావడమంటే ఇదేనేమో ? వానర వీరుల మనస్సులలో వ్యాపించిన భయాందోళనలు రావణుని మనస్సులోకి మారిపోయాయి.

పరమాత్ముండటె: కట్టినాడల కడలిన్,
ఇంద్రజిత్సురగ క్రూర శరప్రబంధ కలిత వ్యూహంబు నిర్మింప,
సత్వరుడై దానిని విప్పకోగలిగెనే".

# ధూమ్రాక్షుడు

రావణాసురుడు నివ్వెరపడి లంకా ద్వారాలన్ని మూయించి ఒక్క ద్వారము దగ్గరే యుద్ధము చేస్తే తన బలాన్నంతా ఉపయోగించ వచ్చునని ధూమ్రాక్షుడనే సేనానిని పిలిచి, సైన్యబలంతో పశ్చిమ ద్వారం నుండి యుద్ధము చేయడానికి పంపించాడు.

ధూమ్రాక్షుడు యుద్ధమంటే తొడగొట్టుకొంటాడు. ఆయన వానరసేన పైకి తానొక్కడే వెళ్లడాన్ని గర్వంగా భావించాడు. రాజాజ్ఞ కాగానే రథ, గజ, తురగ, పదాతి దళాలతో రణభూమికి బయలు దేరాడు.

అయితే ఆయనకు శకునాలు అనుకూలంగా కనబడలేదు. కాకులు ఆకాశం నిండా అరుస్తూ చుట్టు ముట్టాయి. ఆయన రథముపై ఒక పెద్ద గ్రద్ద వాలింది. ఆయన ధ్వజాన్ని గ్రద్దల గుంపులు ఆక్రమించాయి.

ధూమ్రాక్షుడు ఈ అపశకునాలను చూసి దుఃఖపడ్డాడు. అయినా ఆగకుండా ఆయన శత్రు శిబిరాన్ని చేరుకొన్నాడు.

అరి బలాన్ని చూడగానే వానర బలం మహోత్సాహంతో ఎదుర్కొన్నది.

రాక్షసులు గదలు, ఖడ్గాలు, ధనుస్సులు బల్లాలతో పోరితే వానరులు వాటిని వృక్షాలతో పర్వత శిఖరాలతో వ్యర్థము చేశారు.

వానర బలం ముందు రాక్షసుల బలం నిలువ లేక పోయింది. రాళ్లతో, చెట్లతో తలలు తెగకుండా మిగిలిన రాక్షసులను తమ చేతి దెబ్బలతో, గోళ్లతో వానరులు సంహరించారు.

ధూమ్రాక్షుడు తన బలమంతా నశించడాన్ని సహించలేక వానర వీరులను తన బాణాలతో చీల్చి చెండాడు. తలలు తెగి కొందరు, రక్తాన్ని కక్కుతూ కొందరు వానరులు చనిపోయారు. భయంతో మిగిలిన వానరులు పారిపోసాగారు.

వానరులు పారిపోవడాన్ని చూసిన హనుమ ఒక మహా పర్వతాన్ని ధూమ్రాక్షునిపై విసిరాడు. దానిని పసిగట్టిన రాక్షస నాయకుడు రథము పై నుండి ఆయుధ సమేతుడై భూమి పైకి దుమికాడు. పర్వతము రాక్షసుని రథాన్ని, అశ్వరథసారధి సమేతంగా పిండి పిండి చేసింది.

ధూమ్రాక్షుడు హనుమంతుని వక్షస్థలాన్ని తన గదాయుధంతో బాధించాడు. హనుమంతుడు మరొక మహాశిలతో ధూమ్రాక్షుని తలను పగలగొట్టాడు.

# వజ్రదంష్ట్రుడు

ధూమ్రాక్షుడు మరణించాడన్న వార్త రావణునికి భయాన్ని, కోపాన్ని కలిగించింది.

ఆయన వజ్రదంష్ట్రుడనే సేనానిని చూసి "నీవు వెళ్లి రామలక్ష్మణులను సంహరించి రమ్మని" సేనా బలాన్ని తోడిచ్చి పంపాడు. వజ్రదంష్ట్రుడు పరాక్రమ వంతుడే. యుద్ధాన్ని ఎప్పుడు ఆహ్వానిస్తుంటాడు.

"వజ్రదంష్ట్రుడంటే" కఠినమైన కోరలు గలవాడని అర్ధము. శత్రువుల పేరు వినవస్తేనే పండ్లు  పటపట కొరుకుతుంటాడు.

పశ్చిమ ద్వారం అచ్చిరాలేదని, ఇప్పుడు దక్షిణ ద్వారం నుండి బయలుదేరాడు.

రథం చుట్టు ప్రదక్షిణం చేసి, సమస్తాయుధ సంపదతో మహోత్సాహంతో రణ రంగానికి వెళ్లాడు.

ఆయన వెనుక రథ, గజ, తురగ, పదాతి దళాలు బయలుదేరాయి. వజ్రదంష్ట్రుని ఎదుర్కోవడానికి దక్షిణ ద్వారము బయట అంగదుడు సిద్ధంగా ఉన్నాడు.

వజ్రదంష్ట్రుడు యుద్ధానికి బయలుదేరగానే మేఘులు లేని ఆకాశం నుండి మంటలు కక్కుతూ తోక చుక్కలు క్రింద పడ్డాయి. నక్కలు వికృతంగా కూయ సాగాయి. కాకులు మొదలైన పక్షులు అశుభంగా అరవసాగాయి. రాక్షసులు ఆ అశుభశకునాలకు ఆందోళన చెందారు. వజ్రదంష్ట్రుడు మాత్రము వాటిని లక్ష్య పెట్టక ముందుకు ఉరికాడు.

రాక్షసులను చూడగానే వానర వీరులు ఉత్సాహంగా వారిపై బడ్డారు.వానర రాక్షసుల మధ్య యుద్ధము సంకులంగా జరిగింది. రాక్షసులు ప్రయోగించిన శస్త్రాలన్నిటిని వానరులు శిలా వృక్షాలతో వ్యర్థము చేశారు.

తమ పిడికిలి దెబ్బల చేత వానర వీరులు రాక్షసుల బలాన్ని పూర్తిగా హరించారు.

తన సేన వానర వీరుల చేతిలో చిక్కి నశించడాన్ని వజ్రదంష్ట్రుడు చూసి సహించలేక తన రథాన్ని వానర వీరులపైకి ఉరికించాడు. తన బాణ వర్షాన్ని ఆపకుండా కురిపించి వానర వీరులను నరికాడు.

అంగదుడు ఆ దృశ్యాన్ని చూస్తూ, మహాగ్రహంతో వజ్రదంష్ట్రుని ఎదుర్కొన్నాడు. రాక్షస సేనను తునాతునుకలు చేశాడు.

అంగదుడు వజ్రదంష్ట్రుని తన భయంకరమైన పిడికిలితో దెబ్బతీశాడు.

వజ్రదంష్ట్రుడు అంగదునిపై అనేక బాణాలను ప్రయోగించి శత్రు దేహాన్ని రక్తసిక్తం చేశాడు.

అంగదుడు మరింత కోపంతో ఒక మహావృక్షాన్ని బలంగా విసిరాడు. రాక్షసుడు మధ్యలోనే దానిని ఖండించాడు.

ఆ మహావీరులిద్దరు భయంకరంగా ద్వంద్వయుద్ధం చేశారు. ఒకరినొకరు క్రిందపడగొట్టుకొన్నారు. అదను చూసి అంగదుడు ఒక ఖడ్గాన్ని తీసికొని వజ్రదంష్ట్రుని శిరస్సును ఖండించాడు.

# అకంపనుడు

అకంపనుడు అనగా కంపము లేనివాడు. సాధారణముగా శత్రువులతో సమరము అంటే భయంతో ఎంతవారికైనా వణుకు పుట్టుతుంది.

అకంపనుడు అటువంటి వణుకు ఏమాత్రము లేనివాడు. అంతేకాదు ముప్పైమూడు కోట్ల దేవతలకు అకంపనుడంటే కంపము కలుగుతుంది.

అంతటి మహావీరుడు అపార సేనతో వానర సైన్యాన్ని ఆక్రమించడానికి బయలుదేరాడు. అయితే అంతటి వీరునికి కూడా ఈ పర్యాయము అపశకునాలు ఎదురయ్యాయి.

మహావేగంతో పరుగెత్తగల్గిన గుఱ్ఱాల ముందు కాళ్లు అనుకోకుండా కూలపడ్డాయి. ఈ అపశకునము అకంపనునిలో కూడ కంపాన్ని కలిగించింది. ఆయన ఎడుమ కన్ను అదిరింది. నోరు తడి ఆరింది. పక్షులు, మృగాలు వికృతంగా అరిచాయి. అయినా అకంపనుడు వాటిని సరకు చేయక ముందుకు ఉరికాడు.

వానరులకు, రాక్షసులకు గెలుపు ఒక్కటే లక్ష్యమైంది. ప్రాణాల మీద ఆశవదలుకొని పోరుకు సిద్ధపడ్డారు.

ఒకరిపైకి మరొకరు ఉరుకుటచేత వారికాళ్ల దుమ్ము, రథ, గజ, తురగాల ధూళి అంతట వ్యాపించింది. ఆ దుమ్ములో వానరులెవ్వరో, రాక్షసులెవ్వరో తెలియక తమ పక్షంవారినే యోధులు చంపుకోసాగారు.

చెట్లతో, రాళ్లతో, గోళ్లతో వానరులు పరాక్రమించగా బాణాలతో, గదలతో, కత్తులతో రాక్షసులు ఎదుర్కొన్నారు. కుముద, మైంద ద్వివిదులు అనే వానర సేనా నాయకులు రాక్షస సైన్యాన్ని చీల్చి చెండాడారు.

అకంపనుడు ఆ దృశ్యాన్ని చూసి ఆగ్రహంతో వానర సైన్యంపై విరుచుక పడ్డాడు. తేనే టీగల వలె అకంపనుని బాణాలు వానర వీరులను చుట్టుముట్టాయి.

అకంపనుని ఎదుర్కోవడానికి తూర్పు ద్వారమువైపు హనుమ వచ్చాడు.

హనుమంతుని పరాక్రమాగ్నికి రాక్షసులు దీపపు పురుగులవలె మాడి పోయారు.

యముని వంటి హనుమపై అకంపనుడు తన విలువిద్యా నైపుణ్యాన్ని చూపెట్టాడు. హనుమ శరీరం నుండి రక్తము కాలువలు కట్టింది. మోదుగు పూవువలె హనుమ ఎఱ్ఱని రక్తంతో ప్రకాశించాడు.

మరింత కోపంతో హనుమ బలిష్ఠమైన ఒక మహావృక్షాన్ని తీసికొని రెండు చేతులలో గట్టిగా పట్టుకొని అకంపనుని శిరస్సుపై బలంగా మోదాడు. ఆ దెబ్బకు అకంపనుని శిరస్సు ముక్క ముక్కలైంది.

తమ నాయకుని తల పగులడాన్ని చూచిన రాక్షస వీరులు భయంతో పారిపోయారు.

హనుమంతుని వానర వీరులందరు ప్రశంసలలో ముంచారు. వారందరి సహాయంతో తాను ఎంత పనినైనా చేయగల్గుతానని హనుమ వినయంగా బదులు పలికాడు.

# ప్రహస్తుడు

"ప్రహస్తుడు" అంటే గొప్ప చేతులు గలవాడు అని అర్థము. చేతులు అంటే బాహువులని లేదా బాహుబలమని అర్థము. ప్రహస్తుడు రావణాసురుని ప్రధాని. ముఖ్యసలహాదారు. గొప్పవీరుడు. రావణుని అనేక విజయాలలో ప్రహస్తుడు పాలుపంచుకొన్నాడు. ఆయన ప్రధాన సేనానికూడ.

అకంపనుని మరణ వార్త నిజంగా రావణునిలో కంపము కలిగించింది. ఆయన దేవేంద్రుని సైతము తన పరాక్రమంతో కంపింపజేశాడు. అంతటివాడు కూడ వానరులతో రణ రంగంలో మరణము పొందాడనుట రావణునికి భయాన్ని కలిగిచింది.

రావణుడు లంకానగరం లోపల వైపు కాపలాను సమీక్షించాడు బాగానే ఉంది.

కాని లంకానగరము వెలుపల వానరులముట్టడి చాలా తీవ్రంగా ఉంది. ఆ ముట్టడి తొలిగితేనే లంకలోని వారికి భయము తొలిగిపోతుంది.

అయితే ఆ ముట్టడిని తొలగించడానికి సమర్థులెవరు? రావణుడు ఆలోచించాడు. ఆయన కళ్లు తన ఎదుటే ఉన్న ప్రహస్తునిపైపడ్డాయి.

"ప్రహస్తా ! ఈ విపత్తులో రాక్షసులనందరని గట్టెక్కించగలవాడివి నీవొక్కడివే. నీవు కాకపోతే నేనో, కుంభకర్ణుడో, మా పుత్రులో పూనుకోవాలి.

నీవు పరాక్రమము, అనుభవము రెండు మెండుగా కలవాడవు. నీపేరు వింటేనే శత్రువులకు హడలు కల్గుతుంది. నీతో వానరులు పోరాడ గల్గడం కల్ల. కనుక నీవు రామ లక్ష్మణులను తప్పక వధించి రాగల్గుతావు.

"యుద్ధంలో విజయము తథ్యమా?" అంటావా ? విజయము కలిగినా, కలుగకున్నా యుద్ధము చేయడం మాత్రము వీర లక్షణము కదా !

మరణానికి భయపడి యుద్ధం చేయకపోవడం పిరికి పందల లక్షణము. యుద్ధము చేయకుంటే మాత్రము మరణము రాకుండా ఆగిపోతుందా?

అందువలన ప్రహస్తా! నీవు తప్పక ఈ ఆపద సమయంలో యుద్ధానికి బయలుదేరు" మని రావణుడు ఆజ్ఞాపించాడు.

అప్పుడు ప్రహస్తుడు "మహారాజా! ఈ ఆపదను గురించి మేము మొదలే మంత్రులందరితో ఆలోచించాము. అయితే ఆ సభలో ఏకాభిప్రాయము కుదురలేదు.

విభీషణుడు తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు, "సీతాదేవిని శ్రీరామునికి అప్పగించడము ఒకటే మార్గము"అని. నాకు కూడ అదే నచ్చింది. కాని విభీషణుడు చెప్పిన మాటే నేనుకూడ చెప్పి ఉంటే నన్ను నీవు కూడ బహిష్కరించేవాడివే కదా.

"కొందరు సీతను రామునికి తిరిగి ఇవ్వమని చెప్పాలని, నీకు అది ఇష్టముకాక పోతే యుద్ధానికి సిద్ధంకావాలని వాదించారు. ఆవేశపరులైన యువకులు మాత్రము 'యుద్ధానికే సిద్ధంకావాలని, సీతను తిరిగి ఇమ్మని నీకు చెప్పడం కూడ అనవసరమని' వాదించారు.

సరే. ఆ విషయ చర్చలు ఇప్పుడు అనవసరము. ఇప్పుడు యుద్ధము రానే వచ్చింది. దానిని ఎలా ఎదుర్కోవడమనేదే ప్రధాన సమస్య.

నేను నా ప్రాణాలకు వెరచో, మావాళ్ల పట్ల ప్రేమతోనో యుద్ధానికి వెళ్లనని నీవు అనుమానించవద్దు. నా ప్రాణాలకు భయపడే పిరికి వాడనుకాను. మీకంటే మావాళ్లు నాకు ముఖ్యము కాదు.

నన్ను ఇంత కాలము నీవు పోషించావు. సిరిసంపదలను కలిగించావు. అధికారాన్ని అప్పగించావు. ప్రేమతో ఆదరించావు.

నీకు అపద సంభవించినప్పుడు నిన్ను విడిచి పోవడం నాధర్మం కాదు. నేను నీ రుణాన్ని తీర్చుకోవాలంటే తప్పక నీ పక్షాన యుద్ధము చేయవలసిందే! ఫలితమంటావా? అది మన చేతిలో లేదు కదా" అని పండిన అనుభవంతో అన్నిటికి సిద్ధమైన యోగిలాగా తన నిశ్చయాన్ని వెల్లడించాడు.

తరువాత తన బలాల అధ్యక్షుని పిలిచి తన బలగాలన్నిటిని యుద్ధానికి ఆయత్తము చేయుమని తెలిపాడు.

వేగవంతములైన గుఱ్ఱాలు కలిగి, సమస్తాయుధ సంపన్నమై, బంగారు రంగుతో ప్రకాశించే దివ్య రధాన్ని అధిరోహించి, సేనా పరివారముతో యుద్ధానికి బయలుదేరాడు. దారిలో ప్రహస్తునికి కూడ అపశకునాలెదురయ్యాయి.

భయంకరమైన గాలి వీచింది. మేఘాలు లేకున్నా పక్షులన్ని రథము చుట్టు తిరుగ సాగాయి. నక్కలు మంటలతో అరవసాగాయి. ఆకాశం నుండి చుక్కలు రాలసాగాయి. ప్రహస్తుని రథముపైనున్న జండాపై ఒక గద్ద దక్షిణ ముఖముగా వాలి ఆజండాను రెండుగా చీల్చివేసింది.

సారధి చేతిలోని కొరడా దానంతట అదే క్రింద పడిపోయింది. గుఱ్ఱాలు ఎత్తుపల్లాలు లేక చదునైన నేలలో కూడ ముందుకు పడిపోయాయి. ప్రహస్తుని ముఖం కాంతి హీనమైంది.

అయినా వెరవకుండా ప్రహస్తుడు యుద్ధరంగములోనికి ఉరికాడు.

మళ్లీ రాక్షస సేనలను చూడగానే వానర సేనలో ఉత్సాహం కలిగింది. రెండు పక్షాల సైనికులు సింహనాదాలనుచేస్తూ ఒకరిపైకి ఒకరు ఉరికారు.

ముంచుకొస్తున్న బలాలతో బలిష్ఠుడైన ప్రహస్తుని చూసి ఆయన గురించి తెలుపుమని చిరునవ్వుతో విభీషణుని శ్రీరాముడు అడిగాడు.

విభీషణుడు అతని గురించి వివరించాడు. "రామభద్రా! వీడు ప్రహస్తుడు. రావణుని సర్వసేనాని. ఈయన ఆధీనంలోనే మొత్తము రాక్షస సైన్యంలో మూడవవంతు ఉంటుంది.

మహాబలశాలి. దేవాసుర సంగ్రామాల్లో కూడ అపజయమెరుగని అపరిమిత పరాక్రమ సంపన్నుడు. రావణునికి చాల ప్రియమైనవాడు ఆయన నమ్మిన బంటు.

ప్రహస్తునికి బాసటగా కుంభహనుడు, నరాంతకుడు, సమున్నతుడు. మహానాదుడు అనే నలుగురు రాక్షస వీర వరులు వచ్చారు.

ప్రహస్తునికి రాక్షస సైన్యము పలుకుతున్న "జయజయ" ధ్వనులను విని వానరులు సహించలేక మహావృక్షాలతో, పర్వత శిఖరాలతో రాక్షస వీరులపై బడ్డారు. వానర రాక్షస వీరుల మధ్య భయంకర యుద్ధం జరిగింది.

కుంభహన, నరాంతక, సమున్నత, మహానాదుల దాటికి వానర సైన్యమాగలేదు. తలలు తెగి, చేతులు విరిగి, కాళ్లు విరిగి వానర సైన్యము చెల్లా చెదురైంది.

ఆ రాక్షస వీరుల హింసను చూడలేక ద్వివిదుడు, దుర్ముఖుడు జాంబవంతుడు, తారుడు అను నలుగురు వానర మహావీరులు రాక్షస నాయకులను పెద్ద పెద్ద చెట్లతో, పర్వతాలతోమోది చంపివేశారు.

తన మంత్రులను చంపుటను చూడజాలని ప్రహస్తుడు మహాగ్రహంతో మహావేగంగా తన రథాన్ని వానర వీరులపైకి ఉరికించాడు.

రెండు వైపుల సైనికుల రక్తంతో యుద్ధభూమి అంతా తడిసి మోదుగు పూవువలె ఎఱ్ఱగా ప్రకాశించింది.

ప్రహస్తుడు వానరులను ఒక్కొక్కరిని తన ఆయుధాలకు ఆహారము చేయసాగాడు. ఆయన భయంకర పరాక్రమాగ్నికి కోతులు మిడుతలయ్యారు. ప్రాణాలు దక్కిన వారు భయంతో కనిపించిన చోటుకల్లా పారిపోసాగారు. ప్రళయకాల రుద్రునివలె వానర సేనపై విరుచుక పడుతున్న ప్రహస్తుని వానరసేనా నాయకుడైన నీలుడు ఎదుర్కొన్నాడు.

ప్రహస్తుడు తన విలువిద్యా బలాన్ని నీలునిపై ప్రయోగించాడు. నీలుని దేహము ప్రహస్తుని బాణ పరంపరలతో రక్తమయమైంది. ఆ బాణాలు నీలుని దేహాన్ని చీల్చి భూమిలోపల పడిపోయాయి.

మహా వీరుడైన నీలుడు బలిష్ఠమైన ఒక వృక్షాన్ని చేతిలో పట్టుకొని ప్రహస్తుని బాణ పరంపరలను లెక్కపెట్టక, రాక్షస వీరుని సమీపించి ఆయనను బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు మరింత కోపగించి ప్రహస్తుడు క్రూర బాణ వర్షంతో నీలుని ముంచి వేశాడు.

కొంత సేపు నీలుడు స్థబ్ధంగా నిలిచాడు. అవకాశమును చూచి తన చేతిలోని మహావృక్షంతో రథాన్ని, ధనుస్సును విరగగొట్టాడు. అశ్వాలను, సారధిని చంపివేశాడు.

ప్రహస్తుడొక రోకలిని తీసికొని రథము పైనుండి దుమికాడు. తనవైపు రోకలిని త్రిప్పుతూ రోషముతో వస్తున్న ప్రహస్తుని తన చేతులతో నీలుడు అడ్డగించాడు.

నీల ప్రహస్తుల మధ్య బాహు యుద్ధము మొదలైంది. ఇద్దరు బాహు పరాక్రములే . ఇద్దరు రణ భయంకరులే. ఇద్దరు సమానవేగులే. ఎవ్వరికెవ్వరు తీసిపోయే వారుకాదు.

ఒకరినొకరు కొట్టుకొంటున్నారు. తప్పించుకొంటున్నారు. వెనుకకు వెళ్లుతున్నారు. ముందుకు ఉరుకుతున్నారు. వారి భయంకర సమరం ఇంద్రవృత్రాసురుల మధ్య యుద్ధాన్ని తలపిస్తున్నది.

సమయాన్ని చూచి తన చేతి ముసలంతో ప్రహస్తుడు నీలుని తలపై బాదాడు. ఆ బాధను భరించినీలుడు తన చేతిలోని చెట్టుతో ప్రహస్తుని శిరస్సుపై కొట్టాడు.

రాక్షస సేనాని మళ్లీ తన చేతిలోని ముద్గరాయుధాన్ని (రోకలిని) రెండు చేతులలో బలంగా పట్టుకొని నీలుని తలను పగుల గొట్టడానికి ప్రయత్నించాడు.

వానర సేనాని లాఘవంతో ప్రక్కకు తప్పుకొని ఒక మహాశిలతో ప్రహస్తుని శిరస్సును పది ముక్కలు చేశాడు.

అంతవరకు అపజయమే ఎరుగని మహాపరాక్రమవంతుడు, దేవేంద్రుని సైతము ధిక్కరించగలిగిన మహావీరుడు, జయాపజయాలను, జీవన్మరణాలను సమానంగా భావించగలిగిన మహాధీరుడు, అసమానశూరుడు ప్రహస్తుడు కాలపురుషుని ప్రభావంతో నేలకొరిగాడు.

వానర, రాక్షస సేనానులిద్దరు సమబలులు. వారిపోరు భయంకరంగా సాగింది. ఇద్దరిని జయాపజయాలు సమానంగా ఊరించాయి. ఇద్దరిలో ఎవ్వరి ప్రాణాలు పోతాయో, ఎవ్వరి ప్రాణాలు ఉంటాయో తెలియని పరిస్థితి.

దైవ బలము నీలుని వరించింది. మృత్యుదేవత ప్రహస్తుని వరించింది. యుద్ధంలో ఇద్దరు శత్రువీరులు సమబలులైనా ఎవ్వరో ఒకరేకదా విజయ లక్ష్మిని చేపట్టేది.

ప్రహస్తుడు మరణించడం రాక్షస వీరులు నమ్మలేక పోయారు. కాని వాళ్ల కళ్ల ఎదుటే ప్రహస్తుడు తలపగిలి ప్రాణాలను కోల్పోయాడు. వానర వీరులు తమ సేనాని మహా విజయానికి జయజయ ధ్వనులు చేస్తున్నారు. అది గమనించిన రాక్షస సైనికులు భయంతో పరుగెత్తి రావణ ప్రభువుకు ఆ వార్తను అందజేశారు.

# లక్ష్మణ మూర్ఛ

మహోహస్త బలుడైన ప్రహస్తుడు మరణించాడన్న వార్తను రావణాసురుడు జీర్ణించుకోలేక పోయాడు. ప్రహస్తుడు రామలక్ష్మణులను, వానర సేనను తప్పక చంపి విజయంతో తిరిగి వస్తాడని విశ్వాసంతో ఉన్నాడు.

ప్రహస్తుడు కూడ మరణించాడంటే సైన్యంలో అధిక భాగము నశించినట్లే. ఇక తాను తన బంధువులు సైనికులు మాత్రమే మిగిలారు.

తన మహాసేనాని మరణము రావణునికి దుఃఖాగ్రహాలను కలిగించింది. ఇక స్వయంగా తానే రణరంగానికి పోక తప్పదు. తన ప్రతాపాగ్నితో వానర సేనా సముద్రాన్ని ఎండింపక తప్పదు.

అందువలన అగ్ని వంటి ప్రకాశము కల్గి, అనేకోత్తమహయాలతో కట్టబడి, రత్న ఖచితమైన దివ్య రథాన్ని ఎక్కాడు. రుద్రుని వెంట ప్రమథ గణాలవలె, రావణుని వెంట భయంకరమైన రాక్షసగణము బయలు దేరింది. వంది మాగధుల జయజయ ధ్వానాల మధ్య రావణరథము యుద్ధ రంగానికి బయలుదేరింది.

శ్రీరామచంద్రుడు "ఇంత ఆర్భాటముతో వస్తున్న సేన ఎవ్వరిదని" విభీషణుని ప్రశ్నించాడు.

విభీషణుడు రావణసేనలోని ముఖ్యుల గురించి తెలుపసాగాడు. "రామభద్రా ! వచ్చేసేనలో ముందు భాగములో చీకటి కొండ వంటి ఏనుగును అధిరోహించి, మహాభుజ బలముతో వస్తున్నవాడు రావణపుత్రుడైన "అకంపనుడు."

(సూచన: ఇది వరకు వచ్చి చచ్చిన అకంపనుడు ఒక సైనికాధికారి. ఈయన స్వయంగా రావణుని కొడుకు)

ఇంద్రధనుస్సు వంటి గొప్ప విల్లును చేబూని సింహ ధ్వజము గల గొప్ప రథముపై వస్తున్నవాడు ఇంద్రుని ఓడించిన "ఇంద్రజిత్తు"

వేయి గుఱ్ఱాలను పూన్చిన మహారథముపై ఎక్కి పర్వతము వంటి పెద్ద శరీరముతో ధనుస్సును చేబూని వచ్చేవాడు "అతికాయుడు".

ఉదయిస్తున్న సూర్యునివలె ఎఱ్ఱని కళ్లు కలిగి, గంటలు కట్టిన మహా గజాన్ని అధిరోహించి, భయంకరమైన స్వరముతో శత్రు భయంకరంగా వస్తున్నవాడు "మహోదరుడు".

పదమటి కొండవంటి దేహకాంతి గల్గి బంగారునగలతో, అలంకరింపబడిన గుఱ్ఱముపై ఎక్కి "కుంతము"అను ఆయుధాన్ని పిడికిలితో పట్టుకొని యుద్ధానికి వస్తున్నవాడు 'పిశాచుడు'

వేగవంతమైన ఎద్దుపై ఎక్కి, మెరుస్తుండే 'శూలాన్ని' ధరించి వేగంగా వస్తున్నవాడు 'త్రిశిరుడు'.

పాము గుర్తు జండాను గలిగి, తాటి చెట్టంత విల్లుతో, విశాల వక్షస్థలముతో, దేవతా గణాలను వధించడలో సమర్ధుడై వస్తున్నవాడు 'కుంభుడు' వీడు కుంభకర్ణుని కొడుకు.

భయంకర శరీరంతో, భయంకరంగా యుద్ధం చేయగలిగిన వాడు బంగారు రంగుతో ప్రకాశించే రోకలిని ఆయుధంగా కలవాడు 'నికుంభుడు' ఈయన కుంభకర్ణుని కొడుకే.

అగ్ని వర్ణం గల జండాతో, సమస్త శస్త్రాస్త్రాలతో, కాంతివంతములైన గుఱ్ఱాలు గల రథముపై వస్తున్న భయంకర శరీరుడు 'నరాంతకుడు'.

గజ, వ్యాఘ్ర, హయముల వంటి, జింక, ఒంటెల వంటి ముఖాలు గల అనేక పిశాచాలు కొలుస్తుండగా అపరరుద్రునివలె, వెన్నెల వంటి తెల్లని గొడుగుతో, కిరీటకుండల ప్రకాశంతో, చీకటి కొండవంటి నల్లని పెద్ద దేహము గలవాడు, దేవతలకు సింహస్వప్నమైనవాడు, సూర్య ప్రతాపుడైన రావణాసురుడు"

విభీషణుని వాక్యాలు విని రఘురాముడు రావణుని పైననే దృష్టి నిలిపాడు.

రావణుని వీర్య తేజస్సులు శ్రీ రామునికి కూడ ఆశ్చర్యం కలిగించాయి.

"రాక్షస రాజు తన తేజస్సు చేత మధ్యాహ్న సూర్యుని వలె చూడరాకున్నాడు. దేవ, దానవాది సకల ప్రాణులలో ఇంతటి ప్రకాశవంతమైన శరీరము ఎవ్వరికి లేదు. ఈయన పరివారంలోని వారందరు. పర్వత దేహులే పర్వత స్థైర్యులే.

ఈ రోజు ఈ దురాత్ముడు అదృష్టవశంగా నా కంటబడ్డాడు. ఇక వీడిని లంకకు తిరిగి మామూలుగా వెళ్లనివ్వను. నా సీతను అపహరించిన నాటి నుండి నేటి వరకు క్షణం క్షణం పెరిగి పోతున్న నా కోపాగ్నిని వీడిపై ప్రయోగిస్తాను" అని లక్ష్మణునితో సహా ధనుర్బాణాలను ధరించి రామ భద్రుడు నిలిచాడు.

రావణుడు తన పరివారాన్ని చూచి "ఇంతమంది నా వెంట వచ్చారే ? మీరందరు నా వెంట ఉంటే ఈ వానరులు వీరులు లేని లంకానగరాన్ని అనాయాసంగా ఆక్రమిస్తారు. కనుక మీరు తిరిగి వెళ్లండి" అని ఆజ్ఞాపించాడు.

తానొక్కడే ధనుర్ధారి అయి వానర సేనా మధ్యభాగాన్ని చీల్చుకొంటూ ముందుకు వెళ్లుతున్నాడు.

అహంకారంతో ముందుకు ఉరుకుతున్న రావణాసురుని చూచి ఆగ్రహావేశాలతో సుగ్రీవుడు ఒక కొండ శిఖరాన్ని పెకిలించి రాక్షస రాజుపై ప్రయోగించాడు.

ధనుర్ధారి అయిన రాక్షస రాజు ఆ పర్వతాన్ని అవలీలగా తునాతునుకలుగా పగులగొట్టాడు. అంతే కాదు వందలాది క్రూర బాణాలతో సుగ్రీవుని వక్షస్థలాన్ని చీల్చివేశాడు. సుగ్రీవుడు బాధతో నేలగూలాడు. ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. **"వాలిమెడలోని ఇంద్రదత్తమైన హారానికి వెరచి రాముడు చెట్టు చాటు నుండి వాలిని చంపాడ"నే ఒక మాట ఉంది. కదా ! అది సత్యము కాదు.**

ఎందుకంటే అదే హారాన్ని వాలి చనిపోతూ తన తమ్ముడైన సుగ్రీవుని మెడలో వేశాడు. ఇప్పుడు రావణుని ఎదిరించడానికి వచ్చిన సుగ్రీవుని మెడలో ఆ హారమే ఉంది. అయినా రావణుడు తన తీవ్ర బాణాలతో సుగ్రీవుని వక్షస్థలాన్ని ఛేదించాడు". అంటే అర్థమేమిటి?

"ఇంద్రప్రదత్తమైన సువర్ణ హారము మల్లయోధులను జయించడానికి తోడ్పడుతుండే తప్ప అసామాన్య తేజోవిరాజితులైన రావణాది ధానుష్కులను ప్రతిఘటించడానికి పని చేయదు.

రావణునినే నిరోధింపజాలని మహేంద్ర హారము వాలిని చంపనీయకుండా మహాబలుడైన రామభద్రుని నిలుపగలిగేదా ?

అందువలన రాముడు హార భయంతో వాలిని చెట్టు చాటు నుండి చంపిన పిరికి పంద" అనే లోకుల నింద ఎంత అసత్యమో విజ్ఞులు గమనించాలి".

సుగ్రీవ పతనానికి వానరులు హాహా కారాలు చేయగా, రాక్షసులు రావణుని ప్రశంసిస్తూ జయజయ ధ్వానాలు చేశాడు.

సుగ్రీవుని పరాభవించిన రావణ ప్రభువును ఎదుర్కోవడానికి జ్యోతిర్ముఖ, గవయ, గవాక్ష, ఋషభులనే వానర వీరులు ఒక్కుమ్మడిగా రావణునిపై పడ్డారు. రావణుడు వారిని లక్ష్యపెట్టక వారి ఆయుధాలను మధ్యలోనే ఖండించి వారిని తన పదునైన బాణాలతో పడగొట్టాడు. కరుణా సముద్రుడైన శ్రీరామచంద్రుడు మధ్యాహ్న మార్తాండునివలె భయంకరుడైన రావణాసురుని ప్రతాపాన్ని అణచివేయడానికే తానే విల్లమ్ములతో బయలుదేరాడు.

రామచంద్ర స్వామి తొందరను చూచి ఆయన అనుజుడు లక్ష్మణుడు “అన్నా! మా వదినను అపహరించిన అతినీచుడైన రావణుని అవమానించే అవకాశము నాకివ్వమని” ప్రార్థించాడు.

శ్రీరాముడు సోదరునికి జాగ్రత్తలన్ని చెప్పి పంపాడు. అయితే లక్ష్మణుడు బయలు దేరడం చూచిన హనుమ ఆ అవకాశాన్ని తానే వాడుకోవాలనుకొని రావణుని తానే ముందుగా ఎదుర్కొన్నాడు.

రావణుని రథము పైకి ఎగిరి ఓరీ రావణా! నీవు దేవదానవ, గంధర్వాదుల నుండి మరణం లేకుండా వరం కోరుకున్నావు.కాని వానరులమైన మా నుండి కాదు ఇదిగో నా పిడికిలి దెబ్బతో నీవు యమలోకానికి వెళ్లుతావు” అని హనుమ హుంకరించాడు.

రావణుడు మహాగ్రహంతో “ఓరీ వానరా! ఏదీ నీ ప్రతాపాన్ని చూపు. ముందు నా చేతి దెబ్బను రుచి చూడ”మని తన బలాన్నంతటిని ఉపయోగించి హనుమను తన పిడికిలితో దెబ్బకొట్టాడు.

హనుమ ఆ దెబ్బతో ఊగి పోయాడు. తన శక్తినంతా కూడదీసికొని పడిపోకుండా ఎలాగో నిలదొక్కుకొన్నాడు. తేరుకొన్న తరువాత హనుమ బలంగా తన పిడికిలితో రావణుని కొట్టాడు.

రావణునికి కళ్లు బైర్లు కమ్మాయి. ఆ దెబ్బను తట్టుకోలేక విలవిలలాడాడు. కొంత సేపు స్పృహను కోల్పోయాడు.

హనుమంతుని దేవతలు, వానరులు ప్రశంసలతో ముంచెత్తారు. కొంతసేపటికి రావణుడు తేరుకొని “హనుమా నేనింత వరకు ఇంత బలమైన పిడికిలి దెబ్బను చూడలేదు”. అని ప్రశంసించాడు.

వాడి ప్రశంసలకు హనుమ సిగ్గుపడి “ఛీ ఛీ నా దెబ్బతిని కూడ నీవు బ్రతికి ఉన్నావంటే ఇంత బలహీనంగా ఉంటుంది నా పిడికిలి పోటు” అని నేను ఎన్నడు అనుకోలేదు. మరొక సారి మన బలాలను చూచుకొందాము”. అని రావణునికి సవాలు విసిరాడు.

రావణుడు ఆ అవమానాన్ని భరింపజాలక మరింత బలంగా పిడికిలితో హనుమ వక్షాన్ని కొట్టాడు. హనుమ ఆ దెబ్బకు తల్లడిల్ల సాగాడు. వానర సేనాని అయిన నీలుడు హనుమ ప్రమాదాన్ని పసిగట్టి తాను ముందుకొచ్చి రావణుని ఎదిరించాడు.

రావణుడు నీలునిపై భయంకరమైన బాణవర్షాన్ని కురిపించాడు. నీలుడు నేర్పుతో తప్పించుకొని రావణుని పై పెద్ద పర్వత శిఖరాన్ని విసిరాడు. అంతలో తెప్పరిల్లిన హనుమ రావణుని పైకి దుముకదలచి ఇంకొకరితో పోరాడుతున్న వానిపై దండెత్తుట మంచిది కాదని ఊరుకొన్నాడు.

రావణాసురుడు నీలుడు ప్రయోగించిన పర్వతాన్ని దారి మధ్యలోనే ఖండించి, ఆయన వరుసగా వేస్తున్న మహా వృక్షాలను నేలకూల్చాడు. నీలునిపై అపార శరవర్షాన్ని కురిపించసాగాడు.

ఆ బాణ వర్షాన్నుండి తప్పించుకోవడం కొరకు నీలుడు తన దేహాన్ని చిన్నగా చేసికొని, రావణుని రథముపై, ధ్వజముపై, ఆయన భుజములపై, కిరీటముపై మహావేగంగా వాలుతూ ఆయనను నొప్పించాడు.

నీలుని వేగానికి, ఆయన నేర్పుకు దేవతలు, నరులు వానరులు ఆయనను ప్రశంసించారు.

రావణుడు కూడ నీలుని, చురుకుదనానికి ఆశ్చర్యపడి, ఆయనను సంహరించడానికి అగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు.

ఆ ఆగ్నేయాస్త్రానికి అగ్ని తనయుడైన నీలుడు అసువులు పోగొట్టుకోలేదు. కాని తెలివి తప్పి నేలపై పడిపోయాడు.

అంతవరకు అవకాశము కొరకు ఎదురుచూస్తున్న లక్ష్మణుడు రావణునెదిరించి "ఓరీ రాక్షసాధమా! వానరులపై నీ పరాక్రమాన్ని చూపి, దానికే గర్విస్తున్నావా ? ఇదే నీ గర్వాన్ని నేల మట్టము చేస్తాను" అని హుంకరించాడు. లక్ష్మణుని మాటలను లక్ష్యపెట్టక రావణుడు "రాజకుమారా! నీకు నరకానికి వెళ్లాలని కోరిక ఉంటే నా ముందు వచ్చి నిలువు. నిన్ను క్షణంలో పంపిస్తాను" అని భయంకరంగా అరిచాడు.

"మాటలను చాలించి సమరానికి సమాయత్తం కమ్మని" లక్ష్మణుడు అధిక్షేపించాడు.

రావణుడు ప్రయోగించిన ఏడు భయంకర బాణాలను లక్ష్మణుడు తన బాణాలతో మధ్యనే ఖండించాడు.

కోపంతో రావణుడు మరింత తీవ్రంగా బాణాలను వేశాడు. లక్ష్మణుడు వాటిని చాల దూరంలోనే వ్యర్థం చేశాడు.

లక్ష్మణుడు రావణుని గర్వమణచదలచి వజ్రాయుధమువలె తీక్ష్ణములై, యమ దండము వలె క్రూరమైన బాణ పరంపరను రావణునిపై ప్రయోగించాడు.

రావణుడు ఆ బాణాలను మధ్యలోనే త్రుంచివేసి, ఇక లక్ష్మణుని బ్రతుకనివ్వ వద్దని తలచి తనకు బ్రహ్మదేవుడు ప్రసాదించిన అమోఘమైన బాణాలను లక్ష్మణుని పై ప్రయోగించాడు. వాటిని కూడ లక్ష్మణుడు మధ్యలోనే ఖండించి, తక్షణమే మూడు పదునైన బాణాలను రావణుని గుండెను పగులగొట్టడానికి ప్రయోగించాడు. రావణుని వక్ష స్థలము రక్తసిక్తమైంది. ఆయన తెలివి తప్పాడు. కొద్ది సమయంలో రావణుడు తేరుకొని బాణ యుద్ధంలో లక్ష్మణుని జయించుట అసాధ్యమని గ్రహించి తనకు బ్రహ్మ వరప్రసాదంగా లభించిన, అగ్నివలె మండుతున్న ఆది ఘంటాశక్తిని లక్ష్మణునిపై ప్రయోగించాడు.

సౌమిత్రి ఆ శక్తిని నిర్వీర్యం చేయడానికి అనేక శరాలను ప్రయోగించాడు. కాని వర ప్రసాద లబ్ధమైన ఆ మహాశక్తి లక్ష్మణుని అశక్తుని చేసింది. లక్ష్మణుడు తెలివి తప్పినేల కూలాడు.

రావణుడు లక్ష్మణుని శరీరాన్ని ఎత్తుకొని పోవదలిచాడు. నేలపై పడిన లక్ష్మణుని దేహాన్ని తన బలాన్నంతటిని ప్రయోగించి ఎత్తదలిచాడు. అయితే అది రావణునికి సాధ్యముకాలేదు. అయన తల వంచుకొని తిరిగి పోయాడు.

రావణాసురుడు సామాన్యుడా? కాదు. హిమవంతుని, మందరాన్ని, మేరువును, దేవతా కోటితో కూడుకున్న మూడు లోకాలను కూడ తన భుజాల చేత ఎత్తగల్గిన మహావీగుడు.

అంతటి మహావీరుడు కూడ అసువులు బాసిన రామానుజుని శరీరాన్ని ఎత్తలేక పోయాడు. "పరమాత్మ లీలలు ఊహించరానివి కదా!"

లక్ష్మణుని నేల పాలుచేసి అతనిని ఎత్తుక పోవాలనుకొన్న రావణుని చూచి, అమిత బలపరాక్రముడైన హనుమ శత్రువును సమీపించి, ఆయన వక్షస్థలంలో వజ్ర సమానమైన తన పిడికిలితో తీవ్రమైన దెబ్బను కొట్టాడు.

ఆ దెబ్బకు తాళలేక రాక్షస రాజు మోకాళ్లపై నేల కూలాడు. రక్తం కక్కుకో సాగాడు. అతి కష్టం మీద రథములో వాలిపోయాడు.

హనుమంతుడు అతి సులభంగా లక్ష్మణుని తన భుజాలపై వేసికొని శ్రీరాముని సన్నిధికి తెచ్చాడు.

ఇదెంత విచిత్రము! మేరు, మందరాలను, మూడు లోకాలను అవలీలగా ఎత్తగల్గిన రావణ సార్వభౌముడు తన బలాన్నంతా ఉపయోగించి ప్రయత్నించినా లక్ష్మణుని ఎత్త

జాలలేదు. కాని హనుమ అవలీలగా లక్ష్మణుని భుజాలపై వేసికొని వెళ్లాడే ? ఇది విడ్డూరంగా లేదా ?

దానికి కారణాన్ని వాల్మీకి మహర్షి మనోజ్ఞంగా తెలుపుతాడు.

"వాయుసూనోస్సుహృత్త్వేన । "భక్త్యా పరమయాచ సః॥

శత్రూణామకంప్యోపి । లఘుత్వమగమత్కపేః"

"మూడు లోకాలను గడగడలాడించిన, కైలాస పర్వతాన్ని కదిలించివేసిన శత్రు భయంకరుడైన రావణాసురుడు తన సైనికులతో సహా ఏ కొంచెము కూడ కదలించజాలని లక్ష్మణునిని ఒక కోతి, దాని స్నేహ భావము వలన, దాని పరమ భక్తి వలన తేలికగా ఎత్తాడు" అంటాడు మహర్షి. దానివలన భగవంతుడు, భాగవతోత్తములు అహంకార పూరితులైన వారికి అసాధ్యులని, ఆశ్రితులకు సుసాధ్యులని (సులభులని) తెలుస్తున్నది.

ఈ విషయాన్ని "తిరువాయి" మొజిలో "పత్తుడైయవర్కు అరియ ఎళియవన్-పిరర్కు అరియ విత్తకన్" అని భగవత్తత్వాన్ని ఆళ్వార్లు వివరిస్తారు.

(భగవంతుడు భక్తులైన వారికి సులభుడు-ఇతరులకు దుర్లభుడు" అని ఆళ్వార్లు సెలవిచ్చారు.)

# శ్రీ రాముని శపథము

హనుమంతుని ముష్టిఘాతము నుండి తేరుకొన్న రావణుడు మళ్లీ ధనస్సునెత్తి వానర సేనపై భయంకర బాణాలను ప్రయోగించసాగాడు. వానర సైన్యమంతా భయంతో చెల్లా చెదురైంది.

అప్పుడు రామభద్రుడు స్వయంగా రణానికి సమాయత్తమయ్యాడు. అంతలో హనుమ ముందుకు వచ్చి తన వీపుపై ఎక్కి రావణునితో యుద్ధం చేయుమని శ్రీ రాముని ప్రార్థించాడు. వైరోచనుని పైకి విష్ణువు వెళ్లినట్లు రావణుని పైకి శ్రీరాముడు వెళ్లి గంభీరంగా ఇలా అన్నాడు.

"రావణా నిలువు! నా నుండి నీవు మోక్షానికి తప్ప మరెక్కడికి వెళ్లజాలవు. నీవు ఇంద్రుడిని, యముడిని, భాస్కరుని, అగ్నిదేవుని, శంకరుని ఆశ్రయించినా నా నుండి తప్పించుకోలేవు.

నేనొక్కడినే సకలాయుధ సంపన్నులైన పద్నాల్గువేల రాక్షస సైనికులను మూడు గడియలలో హతమార్చాను" శ్రీరాముని మాటలకు కోపించిన రావణుడు రామవాహనమైన హనుమను అగ్ని సమాన బాణములతో బాధించాడు. బాణాలను సహిస్తూ హనుమ తన తేజస్సును మరింత పెంచుకొన్నాడు.

అప్పటికే లక్ష్మణుని శక్తితో కొట్టిన రావణునిపై రామునికి ఆగ్రహము జ్వలించింది. ఇప్పుడా ఆగ్రహ జ్వాల హనుమను బాధించుట అనెడి నేయితో మరింత మండింది.

శ్రీరాముడు సహజ శాంత స్వభావుడు. తనకేదైనా ప్రమాదము కలిగితే సహిస్తాడు. 'క్షమయా పృథివీ సమః' అంటాడు మహర్షి. ఓర్పులో భూమి అంతటివాడు.

అయితే తన ఆశ్రితులకు ఎవ్వరైనా బాధకల్గిస్తే సహించడు.

రావణుడు లక్ష్మణుని మూర్ఛాక్రాంతుని చేయగానే రామునికి కోపము కలిగింది. ఇప్పుడు హనుమను రావణుడు గాయపరచగానే రాముడు కోపానికి వశమయ్యాడు.

మొదటి దానితో రాముడు కోపాన్ని తెచ్చుకొన్నాడు. (క్రోధమాహరయద్రామః) రెండవ దానితో కోపానికి వశుడయ్యాడు (కోపస్యవశమేయివాన్)

శ్రీరాముడు క్రూర బాణ పరంపరతో రావణుని రథాన్ని సారథి అశ్వ, సమస్తాయుధ సమేతంగా పగులగొట్టాడు. మరొక వజ్రకఠోర బాణంతో రావణుని హృదయాన్ని ఛేదించాడు. రావణుడు ఆ బాణ తీవ్రతకు తట్టుకోలేక మిక్కిలి ఆర్తి (బాధ) చెంది, ఒక చోట నిలువ లేక, తన చేతిలోని చాపాన్ని కూడ వదలివేశాడు.

ఎవ్వడైతే వజ్రపు దెబ్బలను, పిడుగుపాటులను తిని కూడ ఏమాత్రము బాధపడలేదో, కదలలేదో, అటువంటి రావణుడు రామ బాణంతో అమితంగా బాధచెంది చక్కగా నిలువలేక, చేతిలోని చాపాన్ని కూడ వదలి వేశాడు.

"యోవజ్రపాతాశని సన్నిపాతాత్ !
నచుక్షుభేనాపిచచాల రాజా !

సరామబాణాభిహతో భృశార్త :

చచాల చాపంచ ముమోచ వీర :" అంటాడు మహర్షి

శ్రీరాముడు మరొక అర్ధ చంద్రాకార బాణంతో రావణుని కిరీటాన్ని నేలపాలు చేశాడు.

కాంతిని కోల్పోయిన సూర్యుని వలె, నిప్పు చల్లారిన బొగ్గువలె, తెగిపడిన కిరీటంతో తేజస్సును కోల్పోయిన రావణుని చూచి, శ్రీరాముడు "ఇప్పుడు నీవు చాల అలసి

పోయావు. అందువలన ఇప్పుడు నీతో యుద్ధం చాలిస్తున్నాను.

గచ్ఛ అనుజానామి రణార్దితస్త్వం।
ప్రవిశ్య రాత్రించర! రాజ లంకాం।
ఆశ్వాస్య నిర్యాహిరథీచధన్వీ।
తదాబలం ద్రక్ష్యసిమే రథస్థః॥

“రావణా నీవు రణములో చాల అలసిపోయావు. నిన్నునేను అనుమతిస్తున్నాను. నీవు లంకకు వెళ్లు. వెళ్లి సేదదీరు. బాగా తిను, త్రాగు నీ గాయాలను మాన్చుకో. మళ్లీ నీవు వచ్చేటప్పుడు అనేక రథాలను, అనేక ధనుస్సులను తెచ్చుకో. ఎందుకంటే నేను నీ అన్ని రథాలను నేల కూలుస్తాను . నీధనుస్సులను విరిచి వేస్తాను. అందువలన “అన్నీ తెచ్చుకోలేదే” అనే బాధ లేకుండా, నేను ముందుగానే చెప్పుతున్నాను. కనుక నీ దగ్గర ఉన్నన్ని రథాలను, ధనుస్సులను తెచ్చుకో!

అప్పుడు నా నిజమైన బలాన్ని చూస్తావు “అన్నాడు రాఘవుడు ” అదేమిటి ఇప్పుడు నీ బలాన్ని నేను చూడలేదా”? అంటే ఇప్పుడు నాబలాన్ని కొంత రుచి చూచావు. నీవు మళ్లీ వచ్చినప్పుడు పూర్తి బలాన్ని చూస్తావు”.

ఇప్పుడు పూర్తి బలాన్ని ఎందుకు చూపలేదు ? అంటే రావణునికి ఒక అవకాశము ఇవ్వాలనుకొని కిరీటాన్ని మాత్రమే పడగొట్టాడు. లేక పోతే తలనే పడగొట్టేవాడు కదా! అయినా కిరీటం పోయినా, అభిమాన ధనుడైన రావణునికి ప్రాణం పోయిననట్లే కదా!

# రావణుడు లంకకు అవమానంతో వెళ్లుట

ధనుర్బాణాలు, రథము విరిగి నేలపడగా, సారధిచావగా, వెంద్రుకలను ముడుచు కోవడానికి కూడ చేతగాక, విరియబోసుకొన్న వెంద్రుకలతో కాలినడకతో అవమాన భారంతో లంకకు తిరిగి వెళ్లాడు . ఆయన లంకకు యుద్ధం నుండి ఎప్పుడు వెళ్లినా విజయగర్వంతో తలఎత్తి ప్రజల జయజయ ధ్వానాలతో వెళ్లేవాడు.

వెళ్లి ఇప్పుడు బంగారు పీఠముపై కూచొని తన అవమానాన్ని గురించి ఆలోచించాడు. తన పక్కవారితో “నా అమోఘ తపస్సు ఏమైంది ? నా బాహు పరాక్రమము ఏమైంది.? రాక్షసులకు ఆహారం కావలసిన మనుష్యులు రాక్షస రాజైన నన్ను పరాభవించారు. కదా?

“శ్రీరాముడు మనుష్య రూపంలో అవతరించిన శ్రీ మహా విష్ణువే”, అని “ఆయనను శరణు వేడడం మంచిదని” నాకు కొందరు హితం పలికారు.

కాని మరణానికి భయపడి ఇతరులను శరణు వేడడం నా స్వభావమేకాదు.

పూర్వము "అనరణ్యుడనే" ఇక్ష్వాకు మహారాజును యుద్ధంలో ఘోరంగా పరాభవించాను. ఆయన ఆగ్రహంతో "నిన్ను పుత్ర మిత్ర పరివార సమేతంగా సంహరించగలవాడు మా వంశంలోనే పుట్టుతాడని" శపించాడు.

"వేదవతి" అనే ఋషి కన్యకను నేను బలాత్కరించబోయాను. అప్పుడు ఆమె తనను అగ్నిలో ఆహుతి చేసికొంటూ "ఒక స్త్రీ మూలంగానే నీవు సమూలంగా నశిస్తావు" అని శపించింది.

నేనొకప్పుడు శివపార్వతులు తాండవం చేస్తూ ఏకాంతంగా ఉండగా, నా బాహు బలగర్వంతో కైలాసాన్ని ఎత్తాను. అప్పుడు పార్వతీ దేవి" నా ఆనందాన్ని నీవు భంగం చేశావు. కనుక నీవు ఒక స్త్రీ మూలంగా నశిస్తావు." అని శపించింది.

అలాగే రంభను బలాత్కరించినప్పుడు నలకూబరుడు "నీపైన ఇష్టంలేని స్త్రీని ఇక ముందు నీవు బలాత్కరిస్తే నీ తల వేయి వక్కలు అవుతుంది" అని శపించాడు.

"పుంజికా" అనే అప్సరను బలాత్కరించి వివస్త్రను చేసి పంపినప్పుడు బ్రహ్మదేవుడు అలాగే శపించాడు.

నేను కైలాసానికి వెళ్లినపుడు నందీశ్వరుని కోతి ముఖాన్ని పరాభవించాను. అప్పుడాయన కోపించి "నా వంటి అల్పప్రాణులతో వానరులతో నీకు చావు కలుగుతుంది" అని శపించాడు.

ఈ విధంగా నన్ను అనేకులు శపించారు. వారి శాపాలన్ని నిజమవుతున్నట్లు కనపడుతున్నది.

అయితే ఈ శాపాలన్ని నా వ్యక్తిగతమైనవి. వీటితో మీకు ఏ సంబంధం లేదు. కనుక లంకానగర పరిరక్షణ విషయంలో మీరు జాగ్రత్తగా ఉండండి.

ఇప్పుడు నాకు సహాయము చేయగలవాడు కుంభకర్ణుడొక్కడే. ఆయన నాకు మహాపద సంభవించిన ఈ సమయంలో హాయిగా నిద్ర పోతున్నాడు.

ఆయన ఆరేడు మాసాల దాకా నిద్ర నుండి లెవ్వడు. అంతదాకా యుద్ధ మాగదు.

ఇప్పుడాయన నిద్రపోయి తొమ్మిది రోజులు అవుతున్నది. మొన్న మొన్ననే నిద్ర పోయాడు కనుక ఇంకాగాఢ నిద్ర పట్టకుండ వచ్చు! అందువలన తొందరగానే లేస్తాడు లేపండి" అని రాక్షస భటులకు ఆజ్ఞాపించాడు.

# కుంభకర్ణుడు

కుంభకర్ణుడు సహజంగానే కొండ అంత దేహము గలవాడు. శరీరమెంత పెద్దదో ఆకలి అంత ఎక్కువ. పుట్టుకతోనే మాహాబలుడు. కుండలంత పెద్ద చెవులు కలవాడు.

ఆయన నిద్రా కారణాలు:- పుట్టీ పుట్టగానే ఆయనకు ఆకలివేసింది. వేలకొలది జంతువులు ఆయనకు ఆహారమయ్యాయి. ఈ లెక్కలో వాడుతింటూ ఉంటే ప్రపంచమే ప్రాణులు లేకుండా అవుతుందనిపించింది.

అందరు కలిసి ఇంద్రుని శరణువేడారు. ఇంద్రుడు తన వజ్రాయుధంతో కుంభకర్ణుని చావమోదాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక కుంభకర్ణుడు బిగ్గరగా ఏడ్చాడు. ఆ ఏడుపు ధ్వనికి భూమి అంతా కంపించింది.

కొంత సేపటికి కుంభకర్ణుడు ఏడుపు ఆపాడు. కోపంతో ఇంద్రుని వాహనమైన ఐరావతమనే మహా గజము యొక్క ఒక దంతాన్ని ఊడబెరికి, దానితో ఇంద్రుని పొడిచాడు. ఇంద్రుడు ఆ బాధను తట్టుకోలేక విలవిల లాడాడు.

ఆ తరువాత ఎన్నోమారులు మహేంద్రుని, దేవగంధర్వయక్ష కిన్నర కింపురుషాదులను ఓడించాడు.

కుంభకర్ణుని పేరు చెప్పితేనే అందరు గడగడలాడేవారు.

దేవతలు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లి కుంభకర్ణుని భయంకరమైన ఆకలిని గురించి, దేవతల, ఋషుల, స్త్రీల పట్ల ఆయన దుర్మార్గాన్ని గురించి తెలిపారు. ఆయన దౌర్జన్యాన్ని ఆపుమని ప్రార్థించారు.

బ్రహ్మదేవుడు కుంభకర్ణుని పిలిపించాడు. ఆయన భయంకరమైన రూపము బ్రహ్మదేవునికి కూడ భయాన్ని కల్గించింది. వెంటనే బ్రహ్మదేవుడు కుంభకర్ణుని "చచ్చినట్లు పడి ఉండుమని" శపించాడు. కుంభకర్ణుడు అప్పటి నుండి చచ్చినట్లు గాఢనిద్రలో మునిగి పోయేవాడు.

రావణునికి తన తమ్ముని స్థితిపట్ల జాలి వేసింది. ఆయన బ్రహ్మదేవునితో "తాతా కుంభకర్ణుడు కూడ నీ మనుమడే కదా! ఈ విధంగా శపించడం బాగుంటుందా? దీర్ఘనిద్ర మరణంతో సమానమే కదా!

అందువలన నీ శాపాన్ని సవరించు. "ఎన్నిరోజులు నిద్రపోవాలి ? ఎన్ని రోజులు మేల్కొని ఉండాలి" అనేకాలవిభాగం చేయుమని" కోరాడు.

బ్రహ్మ దేవుడు “6 నెలలు కుంభకర్ణుడు నిద్రిస్తాడని ఒక రోజు తెలివితో ఉండి మళ్లీ ఆరు నెలలు నిద్రిస్తాడని” తన శాపాన్ని సవరించాడు.

“అంతేకాదు ఆ ఒక్క మేల్కొన్న రోజే నిద్రించే ఆరునెలలకు సరిపోయే ఆహారాన్ని తింటాడని తెలిపాడు.”

బ్రహ్మదేవుని శాప కారణాన్ని గురించి అనేక రామాయణాలలో అనేక కథలు ఉన్నాయి.

కుంభకర్ణునికి ఎంత ఆకలో అంత దయ ఉండేది. ఆకలితో ప్రాణులను హింసించి తినాలి అనుకొనేవాడు. కాని వాటిని చేతిలో పట్టుకోగానే, వాటి దీనావస్థను చూచి ఆయనకు దయ కలిగేది. అందువలన వాటిని వదలి వేసేవాడు. ఏవో కొన్ని తిను పదార్థాలతో ఆకలిని కొంతవరకు తీర్చుకొనేవాడు దాని వలన ఆయన ఆకలి సగము మాత్రమే తీరేది.

ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి అన్న అయిన రావణాసురుని సలహా ప్రకారము తపస్సు చేశాడు. ఆయన తపస్సును చూచి దేవతలు వణకి పోయారు. అందువలన వారు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లి సమస్యను వివరించారు. బ్రహ్మదేవుడు వారికి అభయమిచ్చి పంపివేశాడు.

కుంభకర్ణుని తపస్సు ఫలించే రోజు బ్రహ్మదేవుడు సరస్వతీదేవిని కంభకర్ణుని నాలుకపై ఉండి అక్షరాలను మార్చుమని ఆదేశించాడు. అలాగే అంది ఆదేవి.

1) కుంభకర్ణుని తపస్సుకు మెచ్చుకొని బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరము కోరుకొమ్మన్నాడు. కుంభకర్ణుడు తనకు ‘నిర్దయ’ (ప్రాణుల పట్ల దయలేకుండుట) అనే వరము కోరుకోవాలనుకొన్నాడు. సరస్వతీ దేవి ఆయన కోరికలో (నిర్దయలో) ‘య’ అనే అక్షరాన్ని ఉచ్చరికుండా (నాలుక అనకుండా) ఆపింది. కుంభకర్ణుడు ‘నిర్ద’ కావాలన్నాడు? ‘ఏమి కావాలి’ అని బ్రహ్మదేవుడు మళ్లీ మళ్లీ అడిగాడు సరస్వతీ ప్రభావం వలన నిర్దయం అని పూర్తిగా అనకుండా ‘నిర్ద’ ‘నిర్ద’ అనసాగాడు. ‘నిర్ద’ అంటే అర్థము లేదు. కనుక ‘నిద్ర’ కావచ్చునని బ్రహ్మ దేవుడు “నిద్రాప్రాప్తిరస్తు” అన్నాడు అని ఒక కథ. ఈ కథ బ్రహ్మ ఇచ్చిన వరానికి దగ్గర ఉంది.

2) మరొక కథ ప్రకారము రావణుడు తాను తనకు మరణం లేకుండా ఉండాలని కోరుకొన్నాడు. కనుక కుంభకర్ణుని కూడ మరణం లేకుండా నిత్యత్వము కావాలని కోరుకొమ్మని సలహా చెప్పాడు. కుంభకర్ణుడు “నిత్యత్వము” అని పూర్తిగా అనగా లేక

"నిత్య" అని కోరుకొన్నాడు. బ్రహ్మదేవుడు "నిత్య" అంటే "నిద్ర" కావచ్చునను కొని నిద్రను వరంగా ఇచ్చాడు.

సరే, కారణాలేవి అయినా, కథలు ఏ రకంగా ఉన్నా, బ్రహ్మదేవుడు వరంగానో, శాపంగానో కుంభకర్ణునికి ఆరు మాసాల నిద్ర ఒక రోజు మెలుకువ ఇచ్చాడు. ఆరు మాసాల లోపు లేవకూడదు ఆయనను ఎవ్వరు లేపకూడదు. అలా ఆయనే లేచినా ఎవ్వరైనా లేపినా అది ఆయనకు ప్రమాదాన్ని కలిగిస్తుంది.

ప్రస్తుతము సాక్షాత్తుగా కుంభకర్ణుని ప్రభువే లేపుమన్నాడు. లేపడం కష్టమే ప్రమాదమే అయినా లేపక తప్పదు.

కుంభకర్ణ నిద్ర:- కుంభకర్ణుడు నిద్రా సమయంలో కూడ భయంకరంగా ఉంటాడు. కొండ విరిగి నేలపైపడినట్లు పానుపుపై పడుకొంటాడు. పాములవలె బుసలు కొడుతాడు. పెద్దపెద్ద గుహల వంటి ముక్కు రంధ్రాలు ఉంటాయి. పాతాళమువలె పెద్ద నోరు ఉంటుంది. ఎప్పుడు రక్తమాంసాల కంపు కొడుతుంది.

నిద్ర లేవగానే తినడానికి గుట్టలకు గుట్టలు మాంస రాశులు, వందలాది అడవి పందులు, దున్నపోతులు, పెద్ద పెద్ద జంతువులు, అన్న రాశులు, నెత్తురు, కల్లు కడవలు ఎదురుగా ఉండాలి. అలాగే అన్ని ముందు పెట్టి కుంభకుర్ణుని లేపసాగారు.

దిక్కులు పిక్కటిల్లేలా శంఖాలనూదారు. నగరాలను మ్రోగించారు. సింహనాదాలు చేశారు. ఏనుగులతో ఘీంకారాలు చేయించారు.

ఆ ధ్వనికి లంకలోని రాక్షసులందరికి చెవులు చిల్లులుపడ్డాయి. గుండెలు తీవ్రంగా కొట్టుకొన్నాయి. పక్షులు ఆధ్వని వినలేక ఆకాశంలోకి ఎగిరి రెక్కలు కొట్టుకొని నేలపై పడి చనిపోయాయి.

అంత పెద్ద ధ్వని అయినా రాక్షసుని చెవిలో ప్రవేశించ లేదు. రాక్షస భటులు రోకళ్లతో గదలతో, కొండ రాళ్లతో పెద్ద పెద్ద చెట్లతో బలంగా మోదారు.

కుంభకర్ణుడు గుహల వంటి ముక్కు పుటాల ద్వారా గాలిపీల్చునప్పుడు వందలాది భటులు ఆయన ముక్కు రంధ్రాలలోకి వెళ్లిపోయారు. మళ్లీ ఆయన గాలిని వదలినప్పుడు మైళ్లదూరము బయట పడిపోయారు.

కట్టెలచేత, కొరడాల చేత, అంకుశాల చేత, బల్లాల చేత పొడిచారు. ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱాలు, కంచర గాడిదలచేత త్రొక్కించారు. వాటిని అరపించజేసి, వాటితోపాటు తాము బిగ్గరగా అరచారు.

తల వెంట్రుకలు పట్టిపీకారు. పళ్లతో ఆయన శరీరాన్ని కొరికారు. గోళ్లతో గ్రుచ్చారు. రక్తము ధారలుగా రాసాగింది. అయినా కుంభకర్ణునికి మెలుకువ రాలేదు. భటులు తమ ప్రయ్నము మానలేదు.

మళ్లీ పెద్ద పెద్ద రోకళ్లతో ఆయన గుండెలను బలంగా బాదారు. వేల ఏనుగులతో త్రొక్కించారు. ఒక్కసారి వందలాది శతఘ్నులను పేల్చారు.

అప్పుడు కుంభకర్ణునికి తనకేదో అవుతున్నట్లు అనిపించింది. ఏదో కొద్దిగా వినిపించింది. బలవంతంగా కళ్లువిప్పాడు. ఆయన మత్తు వదలడానికి చెట్లతో, శిలలతో, ఆయుధాలతో వందలాది భటులు ఆయనను బలంగా మోదారు.

నిద్రమత్తు వదలింది. కాని ఆకలి అగ్నిలా మండసాగింది. ఆయన తన నోటిని తెరచాడు. అది పాతాళమంత పెద్దగా ఉంది. ఆయన రెండుకళ్లు నిద్రమత్తుతో అగ్ని గోళాల వలెమెరుస్తున్నాయి.

ఆయన నోటికి ఎదురుగానే మాంసరాశులు, అడవి పందులు, దున్నపోతులు, నెత్తురు కడవలు, కల్లు కుండలు, బలాన్ని కలిగించే పానీయాలు, అన్నరాశులు సిద్ధంగా ఉన్నాయి. పెద్ద పెద్ద చేతులతో నిమిషాల్లో గుట్టలు గుట్టలుగా ఉన్న మాంసాన్న రాశులు తిన్నాడు. నెత్తురు, కల్లు కుండలను ఖాళీ చేశాడు. ఆయన ఆకలితీరింది.

అప్పుడు తాను పడుకొన్న రోజును లెక్కపెట్టుకొన్నాడు. తొమ్మిది రోజులు మాత్రమే అయింది తాను పడుకొని. తనను మధ్యలో లేపడానికి బలమైన కారణమేమిటో ఆయనకు తెలియదు. చుట్టు ప్రక్కల కలయచూచాడు.మూలమూలల్లో తన భయం వలన ఒదిగిన వారిని చూచాడు. ముందుకు పిలిచాడు.

ఆయన పిలుపులో కరకు దనము లేదు. కళ్లులేచినప్పుడు ఉన్నట్లుగా ఎఱ్ఱగాలేవు. అందువలన భటులు ఒక్కొక్కరే ఆయన ముందుకు వచ్చారు.

"నన్నెందుకు మధ్యలో నిద్రలేపారు ? ఏదో బలమైన కారణం ఉంటుంది. మా అన్న రావణ ప్రభువు క్షేమంగా ఉన్నాడా ? ఆయన క్షేమంగా ఉంటే నన్ను గడువుకు ముందు లేపడు.

ఆయనకు శత్రువుల వలన ఏదో మహా ప్రమాదము కలిగి ఉంటుంది. ఎవ్వరా శత్రువులు? ఇంద్రుడైనా అగ్ని దేవుడైనా వారిని బంధిస్తాను" అని అడిగాడు.

అప్పుడు భటులు "మహావీరా!" మన రాక్షసులకు ప్రమాదాన్ని కలిగించే ధైర్యము దేవతల కెక్కడది? విచిత్రంగా అల్ప ప్రాణులైన నర, వానరుల వలన మహాప్రమాదం కలిగింది.

పూర్వము హనుమంతుడొక్కడే వచ్చి, అనేక సేనానులను, మంత్రి సుతులను, అక్షకుమారుని, అనేక రాక్షస వీరులను వధించి, లంకను దహించి వెళ్లాడు.

ఇప్పుడు సీతాపతి అయిన రామచంద్రుడొక్కడే తన బాణాలతో మీ అన్నను చావగొట్టి పరాభవించి పంపాడు. "శత్రువు చేతిలో మానం పోయింది. ప్రాణం పోయినా బాగుండేది అని రాక్షస రాజు బాధపడుతున్నాడు" అని విన్నవించారు. మహోదరుడనే రాక్షస వీరుడు కుంభకర్ణునితో తక్షణమే వెళ్లి రావణుని దర్శించుమని తెలిపాడు.

అక్కడ రావణుని వద్దకు కొందరు భటులు వెళ్లి కుంభకర్ణుడు నిద్రలేచినట్లు తెలిపి మహారాజే తమ్ముడి దగ్గరకు వెళ్తాడా ? లేక కుంభకర్ణుడే అన్నగారి దగ్గరకు వెళ్లాలా ? అని అడిగారు.

రావణ ప్రభువు సంతోషంతో తమ్ముడే తన దగ్గరకు రావాలని ఆహ్వానించాడు.

కుంభకర్ణుడు లేచి బయటకు వచ్చి, ముఖము కడుగుకొని, స్నానం చేసి, నూతన వస్త్రాలను , అలంకారాలను ధరించి వీరత్వాన్ని కలిగించే పానీయాలను (వీరప్రాణాలను) త్రాగి అన్నగారి భవనం వైపు అడుగులు వేయసాగాడు.

లంకానగర ప్రాకారాలే చాల ఎత్తుగా ఉంటాయి. అంత ఎత్తు ప్రాకారాలు ఆయనకు నడుము వరకే ఉన్నాయి. ఆయన నడుస్తుంటే మేరు పర్వతమే నడుస్తున్నట్లు ఉంది.

ప్రాకారము బయట శ్రీ రాముడు, వానరులు, ప్రాకారం లోపల నడిచి వెళ్లుతున్న కుంభకర్ణుని చూచారు. అది ఒక కొండాలేక ఒక మహాయంత్రమా వారికి అర్థం కాలేదు. వారు భయంతో తలోవైపు పారిపోసాగారు.

శ్రీ రామచంద్రుడికి కూడ అంత పెద్ద రాక్షసుని చూస్తే ఆశ్చర్యం కలిగింది. విభీషణుడు "కుంభకర్ణుడు రావణుని సోదరుడు, విశ్రవసుని పుత్రుడని ఆయన అంతటి శరీరం కలవాడు రాక్షసులలో మరొకడు లేడని, శూలం ధరించి యుద్ధానికి వెళ్తే యముడు కూడ భయపడుతాడని" ఆయన విషయమంతా వివరించాడు.

కుంభకర్ణుడు రావణ భవనాన్ని చేరాడు. పరాకుతో ఉన్న ప్రభువుకు వందనము చేసి తనను అత్యవసరంగా లేపిన కారణాన్ని తెలుపుమని కోరాడు.

కుంభకర్ణుడు నిద్రించే సమయంలో రాక్షసులకు కలిగిన విపత్తును రావణాసురుడు తమ్ముడికి వివరింపసాగాడు. "సోదరా! నీవు అదృష్టవంతుడవు. కంటినిండా నిద్రించడము, కడుపునిండా తినడం నీకు లభించిన వరాలు. నేను నీపట్ల ప్రేమతో నీ నిద్రాహారాలకు ఎన్నడు భంగము కల్గించలేదు.

అంతమాత్రాన అనేక సమయాలలో శత్రువులతో యుద్ధాలు కలిగినప్పుడు, వాటిలో నేను విజయాలు సంపాదించడంలో నీ సహాయాన్ని నేనెన్నడు మరువజాలను.

ఇప్పుడు కూడ నాకు భయంకరమైన ప్రమాదము సంభవించింది. ఒక మానవ మాత్రుడైన రాముడు ఎవ్వరు ఎన్నడు ఊహించని విధంగా సముద్రముపై సేతువును నిర్మించి, దాని ద్వారా లంకలో ప్రవేశించాడు. ఆయన లంకానగరాన్ని అల్లకల్లోలం చేశాడు.

అకంపనుడు, ప్రహస్తుడు మొదలైన విఖ్యాత వీరులు అనేకులు రాముని చేతిలో చచ్చారు. అంతెందుకు? యుద్ధరంగానికి వెళ్లిన ఏ వీరుడు కూడ సురక్షితంగా తిరిగి రాలేదు.

నీవిప్పుడు యుద్ధం చేసి ఆ రామలక్ష్మణులను, వానర వీరులను చిత్రవధ చేయక పోతే మన లంకలో స్త్రీలు, బాలురు,వృద్ధులు మాత్రమే మిగులుతారు. రాక్షస జనులను రక్షించేవాడివి నీవు ఒక్కడివే". దీనంగా తన పరాక్రమాన్ని ప్రశంసిస్తూ తన సహాయాన్ని అర్థిస్తున్న అన్నను చూచి కుంభకర్ణుడు నవ్వాడు.

హితోపదేశము : "అన్నా ! ఆనాడు మేము చెప్పిన మాటను విన్నావా ? యుద్ధము వలన సర్వ రాక్షస సంహారము జరుగుతుందని మేము చెప్పినప్పుడు" జనన మరణాలు సహజాలే ! యుద్ధంలో వీరులకు మరణము ద్వారా స్వర్గము లభిస్తుంది" అన్నావే ?

ఒక ఆడదానిపై కామం వలన అందరిని వదలు కోవడానికి సిద్ధమయ్యావే ? నీవు "సీతాపహరణమనే" మహా పాపాన్ని చేసినందు వలన ఆ పాప ఫలాన్ని నీవు ఇప్పుడు అనుభవిస్తున్నావు.

"సీతను తీసిక రావడానికి ముందు ఎవ్వరినైనా అడిగావా? రాముడు ఖరదూషణాది, పద్నాల్గు వేల రాక్షసులను నిష్కారణంగా వధించాడు. రామునిపై ప్రతీకారం తీర్చుకోవ డానికి నేను సీతను అపహరించి తెస్తాను. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?" అని మాతో విచారించావా ?

చిన్న వ్యాపారము చేయ దలచినవాడు దాని వలన కలిగే లాభనష్టాలను విచారించి, ఒక నిర్ణయాన్ని తీసికొంటాడే! ఇంత పెద్ద యుద్ధాన్ని నెత్తిపై తెచ్చుకోవడం రాజనీతి లక్షణమా?

యుద్ధనీతి నీకు తెలియదా ? శత్రువు బలహీనుడైనప్పుడు ఆయనపై దండెత్తి వెళ్లాలి. శత్రువు మనతో సమాన బలుడైతే "సంధి" చేసికోవాలి. శత్రువు బలవంతుడైతే, ఆయన కోరినదేదో ఇచ్చి అతని నాశ్రయించాలి.

అదే విధంగా ధర్మార్థ కామాలను సమయాన్ని బట్టి ఆచరించాలి. ప్రొద్దున ధర్మాన్ని, మధ్యాహ్నంలో అర్థాన్ని, రాత్రి కామాన్ని అనుభవించడం సరి అయిన పద్ధతి. అంతేకాని ఉదయాస్తమయాలు ఎప్పుడు కామాన్ని అనుభవించాలనుకోవడం పురుషార్థాలను సాధించే పద్ధతి కాదుగదా!

మంత్రులైన వారు శాస్త్రాలను చక్కగా చదివి, దేశకాల పాత్రాలను చక్కగా పరిశీలించి రాజుకు హితకరమైన సలహా ఇవ్వాలి కాని రాజుకు ముఖ ప్రియమైన మాటలు చెప్పే స్వభావం కలిగి ఉండకూడదు.

నీ మంత్రులు నీకు మిత్రులవలె కనబడు శత్రువులు. వారు నిన్ను నిరంతరము మెచ్చుకొంటూ నీ వలన లాభపడేవారే కాని నీకు హితము చెప్పేవారు కాదు.

మహారాజు తన మంత్రులు చెప్పే సలహాలలో మంచివి స్వీకరించి చెడును వదిలితే, ఆ మంత్రులు కూడ జాగ్రత్తగా ఆలోచించి సలహాలిస్తారు.

చక్కని మంత్రులు లేని రాజు చిల్లులుపడిన ఓడ వంటివాడు. ఆయన పతనం కాక తప్పదు" అని విరమించాడు.

తమ్ముడు తనకు నీతిని ప్రబోధించడం రావణునికి రుచించలేదు. ఆయన కళ్లు ఎఱ్ఱజేసి

"అన్న పెద్దవాడు" అని ఆలోచించక నాకే నీతులు చెప్పుతావా ? చాలించు నీ అధిక ప్రసంగము.

"ప్రస్తుతము ఉన్న సమస్యను పరిష్కరించుకోవాలే కాని ఇది వరకు జరిగిన తప్పులన్నిటిని ఏకరువు పెట్టుతూ కూచుంటే బాగుంటుందా ?

నీకు నామీద ఏ మాత్రము ప్రేమ ఉన్నా, నీ పరాక్రమం పట్ల నీకే మాత్రము విశ్వాసము ఉన్నా, యుద్ధానికి సిద్ధపడు, శత్రువును చంపు. "ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే వాడినే "మిత్రుడు" అంటారు బంధువు" అంటారు.

నీవు నాకు మిత్రుడవా? శత్రువువా? నీవు నాకు బంధువువా? పరవాడివా? నీవు నాకు తమ్ముడివా? పాలివాడివా? ఆలోచించుకొని మాట్లాడుమని" హుంకరించాడు.

అన్నను అనునయించుట : కుంభకర్ణుడు ప్రహస్తుని వంటివాడు. "రాజుకు హితము చెప్పాలి. విన్నా, వినకున్నా ప్రభువు ఇష్టమే. రాజనిర్ణయము మంచిదైనా, చెడ్డదైనా దానిని తప్పక పాటించాలి. రాజుతోనే తమ జీవనము, రాజుతోనే మరణము" అనే అభిప్రాయము కలవాడు.

అందువలన ఆగ్రహించిన అన్నను అనునయింపదలచి "అన్నా ! నీకు నాపై ఆగ్రహము వద్దు. నేను నీ ఆజ్ఞను దాటను. నాకు తోచిన మాటలు చెప్పాను. అంతేకాని ఇంతటి ఆపత్తులో నిన్ను ఒంటరిగా వదిలే వాడిని కాను.

నీకు శత్రువైన రాముని సపరివారముగా సంహరించి నీకు నీరాక్షస జాతికి సంతోషాన్ని కల్గిస్తాను.

రాముడు మొదట నన్ను చంపిన తరువాతే నిన్ను చంపుతాడు. నాకు పరాజయమే లేదు. అందు వలన నీకు భయములేదు.

ఇంద్రుడే కాదు ప్రళయాగ్ని వాయువులు ఒక్కటై వచ్చినా నాకు భయము లేదు. కుబేరుడు, వరుణుడు ఎవ్వరైనా ఫరవాలేదు. త్రిశూలాన్ని చేత ధరించి పర్వత దేహంతో నేను యుద్ధానికి వెళ్లితే నా ముందు ఏ శత్రువైనా నిలిచి ఉండగల్గుతాడా ?

నా పిడికిలి దెబ్బను రాముడు ఓర్చుకోజాలడు. సుగ్రీవ హనుమదాది వానర కోటిని సంహరిస్తాను. నీవు నిశ్చితంగా ఉండు. సర్వ సుఖాలను అనుభవించు. సెలవు. వెళ్లుతానని" కుంభకర్ణుడు యుద్ధానికి సిద్ధమయ్యాడు.

# మహోదరుని దుర్నీతి

రావణాసురునికి కుంభకర్ణుడు హితోపదేశం చేయడం దుర్మార్గుడైన మహోదరునికి నచ్చలేదు. ఆయన కుంభకర్ణుని మాటలను ఖండించాడు.

"కుంభకర్ణా! రావణ ప్రభువుకు నీకు తెలిసినంత రాజనీతి కూడ తెలియదా? మన ప్రభువు సర్వ శాస్త్ర విశారదుడు.

యుద్ధము కలిగినప్పుడు ఆలోచించాలి కాని, ఎప్పుడైనా వస్తుందేమో అని ముందుగానే ఊహించి అనవసరమైన ఆలోచనలు చేయాలా?

ధర్మము సుఖఫలితాలనిస్తుందని చెప్పడము సరి అయిందా? యజ్ఞయాగాది, తపో, దానాది ధర్మకార్యాలు చేస్తున్నప్పుడు కష్టము కలుగదా ? అలాగే అధర్మము వలన సుఖం కలుగదా ? దొంగతనము వ్యభిచారము మొదలైన చెడు పనుల వలన సుఖము కలుగదా?

అందువలన ధర్మా ధర్మాల గురించి ఆలోచించడము అనవసరము. సుఖాన్ని కలిగించే పనులేవైనా చేయవలసిందే.

లోకంలో మంచివారి కంటే చెడ్డవారే ఎక్కువ సుఖంగా ఉంటారు కదా!

రావణ ప్రభువు సీత ద్వారా మరింత కామసుఖాన్ని కోరి ఆమెను అపహరించాడు. అది తప్పెలా అవుతుంది? సీత విషయంలో రావణ మహారాజు చేసిన పని ఆమెను సుఖపెట్టుటకే కదా! అది తప్పెలా అవుతుంది.

ఇక నీ వొక్కడివే యుద్ధానికి వెళ్తానని గర్వంతో అంటున్నావే ? అది కూడ సరైనది కాదు ! రాముడంటే సాధారణ మానవుడా ? వాలిని సంహరించినవాడు. ఇంద్రునితో సమానుడు. బలవంతుడైన శత్రువు పైకి ఒంటరిగా, అసహాయంగా వెళ్లడం తెలివిగలపనా?

# మహోదరుని కపటోపాయం

రావణునికి మహోదరుడు ఒక దుష్టోపాయాన్ని తెలిపాడు. "మహారాజా! కుంభకర్ణునితో పాటు నేను, ద్విజిహ్వుడు, వితర్దనుడు, సంహ్రాది అనే నల్గురము కలసి యుద్ధరంగానికి వెళ్ళుతాము. మా శాయశక్తుల యుద్ధము చేసి రామలక్ష్మణులను సంహరించడానికి ప్రయత్నిస్తాము.

ఒకవేళ మా ప్రయత్నము ఫలిస్తే నీకే బాధ ఉండదు. చనిపోగా మిగిలిన వానర సైన్యము కిష్కంధకు వెళ్ళిపోతుంది.

ఒకవేళ మా ప్రయత్నం ఫలించకున్నా రామబాణాలతో మా శరీరాలు గీరుకొని, రక్తము కారే దేహాలతో లంకకు తిరిగివచ్చి, "మాకు రామలక్ష్మణులకు మధ్య ఘోర యుద్ధము జరిగిందని, ఆ యుద్ధములో రామలక్ష్మణులను చంపివచ్చామని చెపుతాము". ఆ వార్తను లంకానగరమంతట చాటించు, మాకు అందరి సమక్షంలో బహుమానాలు ఇవ్వు.

దీనివలన లంకానగర రాక్షసులే కాక సీత కూడా రామలక్ష్మణుల మరణ వార్తను నమ్మి తీరుతుంది.

తన రామలక్ష్మణులు, మరణించారని, వానరులెవ్వరు తనను రక్షించడానికి సిద్ధంగా లేరని తెలిసికొన్న సీత విధిలేక నీ ఆశ్రయాన్ని అంగీకరిస్తుంది. అప్పుడు నీవు కోరుకొన్న అమర సుఖాలను ఆమె ద్వారా పొందవచ్చు".

ఈ కపటోపాయాన్ని కుంభకర్ణుడు తీవ్రంగా ప్రతిఘటించాడు. "అయితే రామలక్ష్మణులను ఆహవంలో చంపాలి, లేదా తాను చావాలి కాని, పిరికిపందలవలె రక్తము శరీరానికి పూసుకొనివచ్చి, రామలక్ష్మణులను సంహరించి వచ్చామని గొప్పగా చెప్పుకొంటే ఆ నటన ఎంతవరకు నిలుస్తుంది? రామలక్ష్మణుల, వానర వీరుల విజయధ్వనులు విన్న రాక్షస సైనికులు మన గురించి ఏమనుకుంటారు? సీతాదేవి రామలక్ష్మణుల పరాజయ వార్తను ధృవపరచుకోకుండా ఉండగలుగుతుందా? వెంటనే తొందరతో తాను లొంగిపోతుందా? ఇవన్నీ పిరికిపందల ఊహలు, పిరికపందల చర్యలు" అని కుంభకర్ణుడు మహోదరుని నోరు మూయించాడు. తనకు మహోదరుని వంటి పిరికిపందల సహాయమేమి అవసరములేదని, తానొక్కడే పోయి రామలక్ష్మణులను సంహరించి, వానర సైన్నాన్ని చీల్చిచెండాడి వస్తానని తెలిపాడు.

రావణుడు మహోదరుని మందలించి కుంభకర్ణుని ధైర్యాన్ని ప్రశంసించాడు. "అంతటి ఆపద అనే సముద్రం నుండి తమను గట్టెక్కించే గట్టి పడవ ఆయనే" అని కుంభకర్ణుని వెన్నుదట్టి మెచ్చుకున్నాడు.

తమ్ముడా! నీ దేహాన్ని చూడగానే వానరులు ప్రాణాలను భయంతో కోల్పోతారు. రామలక్ష్మణుల గుండెలవిసిపోతాయి.

అయినా నీవు ఒక్కడివి యుద్ధానికి వెళ్ళకూడదు. వానరులు ప్రచండవీరులు. అకంపన ప్రహస్తాదులను యమలోకానికి పంపినవారు.

నీవు మహాసేనను తీసికొని వెళ్ళు. మన శత్రువులందరిని సంహరించి తిరిగిరమ్మని చెప్పి రావణుడు తన బంగారు పీఠాన్ని దిగి, మెరిసే రత్నహారాన్ని, రత్న ఖచితమైన ఉంగరాన్ని, బంగారు నగలను, భుజకీర్తులను, చెవి కుండలాలను తమ్ముడికి తానే అలంకరించాడు.

ఆ సొమ్ములతో ఆ మహావీరుడు హోమాగ్ని జ్వాలలాగా మెరిసిపోయాడు.

నల్లని మొలత్రాడు ధరించి, వాసుకి అని నల్లని పాముచే చుట్టబడిన మందర పర్వతము వలె ప్రకాశించాడు. చందన, పుష్పహారాలను ధరించాడు.

శత్రు రక్తధారలతో ఎఱ్ఱబడి, ఉక్కుతో నిర్మింపబడి, బంగారుచే భూషింపబడిన తన భయంకరమైన శూలాన్ని ధరించి, అన్నకు ప్రదక్షిణము చేసి, ఆయనకు నమస్కరించి, ఆయనచే కౌగిలించబడి యుద్ధరంగానికి భయంకర రూపంతో, మహాబలగర్వంతో బయలుదేరాడు.

# కుంభకర్ణుని యుద్ధము

దారి మధ్యలో ఆయనకు అనేక అపశకునాలు ఎదురయ్యాయి. ఆకాశము పిడుగులను, కొరవి మంటలను కురిపించింది. భూమి వణికింది. పక్షులు అప్రదక్షిణంగా తిరిగాయి. నక్కలు వికృతంగా కూచాయి. గ్రద్దలు పంక్తులు పంక్తులుగా వచ్చి ఆయన మీద వాలాయి. ఎడమకన్ను, ఎడమ భుజం అదిరాయి. వాయువు కఠినంగా వీచింది. సూర్యకాంతి తగ్గిపోయింది.

అయినా ఆయన బెదరిపోలేదు. ఏదో ద్వారము ద్వారా బయటకు వెళ్ళలేదు. ప్రాకారముపైనుండి క్రిందకు కాలబెట్టి దిగాడు (ఆయన దేహము ఎంత పెద్దదో ఊహించవచ్చు).

నిప్పు కణికల వంటి కళ్ళతో, భయంకరమైన కంఠధ్వనితో పిడుగుల వంటి అడుగు దెబ్బలను కల్గిస్తూ దేవతలకు సింహస్వప్నమైన కుంభకర్ణుడు యుద్ధభూమిలో ప్రవేశించాడు. ఘోర స్వరూపుడైన కుంభకర్ణుని చూచి పాదరసమువలె కపిసేన చెల్లాచెదరైంది.

అంగదుడు నీల, కుముద, గవాక్షాదులను చూచి, "మీరందరు మహావీరులే? ప్రాణములొడ్డి పోరాడడానికి వచ్చారే? శత్రువు రూపాన్ని చూడగానే పారిపోతున్నారా? ఎంత అవమానము?" అని వానరవీరులందరినీ సమీకరించాడు.

వారందరూ ధైర్యం తెచ్చుకొని మహావృక్షాలతో, పర్వతాలతో కుంభకర్ణునిపైబడ్డారు. ఆయన శరీరానికి తాకి, ఆయన దేహ బలానికి వృక్షాలు, పర్వతాలు చూర్ణమైపోయాయి.

ఆయన ఆగ్రహంతో పాములను గరుత్మంతుడు భక్షించునట్లు వేలాది కపులను నమిలి మ్రింగసాగాడు.

ద్వివిదుడు ఒక పర్వత శిఖరాన్ని కుంభకర్ణునిపైకి విసిరాడు. అది మధ్యలోనే రాక్షస సైన్యముపైబడి రాక్షస మూకలను, రథ, గజ, అశ్వ, సారథులతో చంపివేసింది.

ద్వివిదుడు మరొక కొండను రెండు చేతులతో బలంగా విసిరాడు. అది కూడా మధ్యలోనే పడి రాక్షస సైన్యాన్ని అధికంగా హతమార్చింది.

రాక్షసులు కూడ తమ బాణాలతో, ఆయుధాలతో వానరులను తెగటార్చారు.

# హనుమ - కుంభకర్ణుల సమరము

కుంభకర్ణుని చూచి, ప్రాణాలను దక్కించుకోదలచి వానరసేనలు చెల్లాచెదరయ్యే సమయంలో మహావీరుడైన ఆంజనేయుడు అనేక వృక్షాలను, పర్వత శిఖరాలను కుంభకర్ణునిపై జడివానవలె ఎడతెరపి లేకుండా ప్రయోగించాడు. కుంభకర్ణుడు వాటిని తన శూలంతో తునాతునకలు చేశాడు.

ఆంజనేయుడు మరొక పెద్ద కొండ శిఖరాన్ని కుంభకర్ణునిపైకి విసిరాడు. అతడు దానితో చాలా బాధపడి రక్తము కక్కాడు. రాక్షసుడు కోపావేశంతో తన శూలాయుధాన్ని హనుమ వక్షస్థలముపై వేశాడు. అది తన వక్షాన్ని చీల్చగా రక్తము క్రక్కుతూ, పెద్దగా హనుమ అరుస్తూ నేలకూలాడు.

ఆంజనేయుడు పడిపోగానే వానర సైన్యము భయంతో పారిపోసాగింది. వారిని నిలిపి నీలుడు మరొక పర్వత శిఖరాన్ని కుంభకర్ణునిపై ప్రయోగించగా, రాక్షసుడు తన పిడికిలి దెబ్బతో ఆ పర్వత శిఖరాన్ని చూర్ణము చేవాడు.

నీలునితో పాటు శరభ, గవాక్ష, గంధమాదన, ఋషభులు చెట్లు, కొండలు, రాళ్ళు, పిడికిలి దెబ్బలతో రాక్షసుని బాధించారు. అవన్నీ రాక్షసునికి ఈగ వాలినట్లు అనిపించాయి.

ఆ వానర వీరులను రాక్షసవీరుడు రెండు చేతుల నడుమ ఒత్తి, ముష్టి దెబ్బలతో పొడిచి, మోకాలుతో అదిమి, చేతితో కొట్టగా వారు నెత్తురు కక్కుతూ నేలబడ్డారు.

మిగిలిన వానరులను రావణ సోదరుడు నమిలి మ్రింగసాగాడు. వానర సైన్యంలో హాహాకారాలు చెలరేగాయి.

తమ గృహములున్ మరియు దగ్ధమగుచుండన్
కుమ తలయిరక్కసులు కొందరు దురాశా
భ్రమలు తగులం బడు పరావధన చౌర్య క్రమము నెరపన్

# అంగదుని పోరు

వానరులందరూ భయభీతులై పుట్టకొకరు, చెట్టుకొకరు పారిపోతుండగా వాలిపుత్రుడైన అంగదుడు రాక్షసుని శిరస్సును ఒక పర్వత శిఖరముతో కొట్టగా, దానితో అధికంగా బాధపడ్డ కుంభకర్ణుడు తన శూలాయుధాన్ని అంగదునిపై ప్రయోగించాడు. దానినుండి తప్పించుకొన్న వానరవీరుడు కుంభకర్ణుని తన వజ్రం వంటి పిడికిలితో పొడిచాడు. దానివలన స్పృహ తప్పిన రాక్షసుడు కొంతసేపటికి తెలివికి వచ్చి అంగదుని తన ఎడమ పిడికిలితో కొట్టాడు. అంగదుడు తెలివితప్పి పడిపోయాడు.

రాక్షసుడు తన మీదకు ఆగ్రహంతో వస్తున్న సుగ్రీవునెదుర్కొన్నాడు. ఇద్దరు ఒకరినొకరు అధిక్షేపించుకొన్నారు.

సుగ్రీవుడొక కొండ శిఖరాన్ని రాక్షసుని రొమ్ముపై వేశాడు. అది రాక్షసుని వక్షాన్ని తాకి ముక్కలైంది.

రాక్షసుడు ఆగ్రహంతో సుగ్రీవుని చంపడానికి శూలాన్ని విసిరాడు. ఆ శూలాన్ని మధ్యలోనే హనుమ అందుకొని మోకాటికి అదిమి రెండు ముక్కలు చేశాడు. అంతటితో అద్భుతమైన కుంభకర్ణుని త్రిశూలము వ్యర్థమైంది.

కుంభకర్ణుడు మలయ పర్వత శిఖరాన్ని ఊదబెరికి సుగ్రీవుని బలంగా కొట్టాడు. సుగ్రీవుడు మూర్ఛపడగా ఆయనను భుజాలపై వేసికొని కుంభకర్ణుడు లంకవైపు వెళ్ళసాగాడు.

హనుమకు ఏమి చేయాలో తోచలేదు. కుంభకర్ణుని ఎదుర్కొని సుగ్రీవుని విడిపించడమా? వద్దా?

ఒకవేళ తాను కల్పించుకొని విడిపించడానికి ప్రయత్నిస్తే సుగ్రీవుడు తెలివికి వచ్చి "నీవెందుకు కల్పించుకొన్నావు? నన్ను నేను కాపాడుకోజాలనా?" అని కోపగించవచ్చు. నిజంగా కూడా సుగ్రీవుడు మహావీరుడు, ఆత్మరక్షణ ఆయనకు అసాధ్యము కాదని హనుమ ఊరకున్నాడు.

లంకలోకి వెళ్ళుతున్న కుంభకర్ణునికి రాక్షసవీరులు జయ జయ ధ్వనులతో స్వాగతం చెప్పారు. పేలాలు చల్లారు. పన్నీరు చిలికారు.

అప్పుడు సుగ్రీవునికి స్మృతి వచ్చింది కుంభకర్ణుని భుజంనుండి జారిపోయాడు. ఒక్కసారి పైకి ఎగిరి తన నోటితో కుంభకర్ణుని ముక్కుగోరికి, గోళ్ళతో రాక్షసుని చెవులు పెరికాడు.

కుంభకర్ణుని ముక్కు చెవులు తెగిపోయాయి. ఆయన కోపంతో సుగ్రీవుని పట్టుకొని నలిపి నేలపై గొట్టాడు. రాక్షసులనేకంగా సుగ్రీవుని బాధించారు.

అయినా సుగ్రీవుడు తప్పించుకొని, శ్రీరాముని సమీపంలోకి వచ్చి వ్రాలాడు.

కుంభకర్ణుడు కోపమత్తుడై తిరిగి యుద్ధభూమివైపు మరలాడు. ఒక్కొక్కసారి వంది మందినుండి వందమంది దాకా దొరికిన వారిని దొరికినట్లు నోట వేసికొని మ్రింగసాగాడు. వారిలో వానరులు ఉన్నారు, రాక్షసులు కూడా ఉన్నారు.

లక్ష్మణుడు రాక్షసుని నిలుపడానికి ఏడు భయంకరమైన బాణాలతో కొట్టాడు. వాటి దెబ్బలను, లక్ష్మణుని లెక్క పెట్టని కుంభకర్ణుడు రామునివైపు ఒక కొండ శిఖరాన్ని విసిరాడు. రాముడు ఆ పర్వత శిఖరాన్ని ఏడు బాణాలచే ఖండించి వాటిని మధ్యలో పొడి చేశాడు.

వానరులు గుంపులుగా రాక్షసుని శరీరంపై ఎక్కారు. వాళ్ళను ఒక్కసారిగా రాక్షసుడు విదిలించివేశాడు.

శ్రీరాముడు బాణహస్తుడై రాక్షస సైనికులను అడ్డగించి, తన వింటి నారిని భయంకరంగా ధ్వనింపజేస్తూ, కుంభకర్ణునికి ఎదురుగా వెళ్ళాడు.

“రాక్షసవీరా! ఇదిగో నేను రాముడిని, ధనుర్బాణహస్తుడినై నీకెదురుగా వచ్చాను. నిన్ను ఇప్పుడే యమనగరానికి పంపడానికి సిద్ధంగా ఉన్నాను” అన్నాడు.

కుంభకర్ణుడు రాముని మాటలు విని పకపక నవ్వి “రామచంద్రా! నేను నీతో సంహరింపబడిన వాలి, ఖరవిరాధ, కబంధాది సామాన్య వీరుల వంటి వాడిని కాను.

దేవదానవ, గంధర్వాదులకు భయంకరుడనైన కంభకర్ణుడిని. నీకు ప్రాణాంతమైన ముద్గరాన్ని చేతబట్టుకొని నిలుచున్నాను. నా ముక్కు చెవులను చూచి నవ్వవలసిన అవసరం లేదు. ముందు నీ పరాక్రమాన్ని కొంత పరీక్షించి తరువాత నిన్ను మింగివేస్తాను” అని గర్జించాడు.

రాముడు వేస్తున్న బాణాలను తన ముద్గరంతో ఎదుర్కొంటూ, వానరులను భయకంపితులుగా చేశాడు.

శ్రీరాముడు "వీడు సామాన్య శస్త్రాలకు లొంగడని గ్రహించి" "వాయువ్యాస్త్రాన్ని" ప్రయోగించి కుంభకర్ణుని చేతిని నరికివేశాడు.

మరొక చేతితో రాక్షసుడు ఒక వృక్షాన్ని ధరించి తనను కొట్టరాగా రాముడు "ఇంద్రాస్త్రాన్ని" ప్రయోగించి, ఆ చేతిని కూడ నరికివేశాడు.

చేతులు నేలరాలినా కుంభకర్ణుడు రాముని పైబడుటకు రాగా రెండు అర్ధచంద్రాకార బాణాలతో అసురుని రెండు కాళ్ళను రాముడు విరుగగొట్టాడు.

కాళ్ళు, చేతులు విరిగినా కుంభకర్ణుడు కొండగుహ వంటి నోరు తెరచిరాగా, శ్రీరాముడు వాడి నోటిలోకి బాణాలను క్రుచ్చాడు. అయినా పెద్దగా గర్జించి, రాక్షసుడు పైపైకి రాగా, ప్రళయకాల మృత్యువు వలె భయంకరమై, వజ్రాయుధము వలె కఠినమై, వాయువు వలె వేగము గలదై, అగ్నిజ్వాలల వలె మండుతున్న ఐంద్రాస్త్రాన్ని శ్రీరాముడు ప్రయోగించగా, అది ఆ రాక్షసుని శిరస్సును నేలరాల్చింది. సురులు, నరులు, ఋషులు, వానరలందరు శ్రీరాముని అసమాన పరాక్రమాన్ని వేనోళ్ళ ప్రశంసించారు. రాక్షసులు ఏడ్చారు. వృత్రాసురుని సంహరించిన ఇంద్రుని వలె రాముడు కూడా సంతోషించాడు.

# రావణునికి సోదర మరణవార్త

కుంభకర్ణుని మరణవార్తను రాక్షస భటులు పరుగు పరుగున వెళ్ళి రావణునికి తెలిపారు.

రావణుడు ఆ వార్తను విని భరించలేక చాలాసేపటి వరకు మూర్ఛపోయాడు. రావణుని పుత్రులైన త్రిశిర, అతికాయ, నరాంతక దేవాంతకులు యముని వంటి భయంకరుడైన తమ పినతండ్రి మరణించాడని ఆయన బలాన్ని, ధైర్యాన్ని పొగడుతూ ఏడ్చారు.

రావణుడు, "తమ్ముడూ! ఇంద్రుని వజ్రాయుధానికి కూడా భయపడని నిన్ను రామ బాణాలు సంహరించాయా?

సోదరా! ఈ విషాద సమయానికెదురు చూచిన వానరులు కోట బురుజులపైకి ఎక్కి లంకలోకి దిగితే నేనేమి చేయాలి?

ఇంద్రుడు ఇప్పుడు దండెత్తి వస్తే నేనేమి చేయాలి? అయ్యో! అప్పుడు విభీషణుని మాటలు వింటే బాగుండేది కదా! ఆయన మాట విననందువలన ఇంత దుస్థితి దాపురించింది కదా? ధర్మాత్ముడైన విభీషణుని వెడలగొట్టిన పాపము నన్నిలా బాధిస్తున్నదే.

ప్రళయ కాలంలోని అగ్నివలె, మహారుద్రునివలె శత్రు భయంకరుడవైన నీవు నీ ప్రియ సోదరుని వదిలి ఎందుకు వెళ్ళావురా? నన్ను విడిచిపోవడం నీకు న్యాయమా? నీవు పోయాక నాకు ఎవ్వరు దిక్కురా? అని బేలతనంతో ఏడ్వసాగాడు.

తండ్రి దుఃఖాన్ని చూచి త్రిశిరుడు "నాన్నా ! నీ విలాధైర్యాన్ని కోల్పోవడం బాగుంటుందా? ఎవ్వరు ఉన్నా లేకున్నా నీవు ఒంటరిగా శత్రుసంహారం చేయజాలవా? నీకు బ్రహ్మ దత్తములైన ధనుర్బాణాలు లేవా? కవచము, శక్తి, రథాలు లేవా? నీదాకా ఎందుకు, నేనొక్కడినే వెళ్ళి శంబరుని ఇంద్రుడు చంపినట్లు, నరకుని విష్ణువు హతమార్చినట్లు రాముని సంహరిస్తానని చెప్పి రావణునికి ధైర్యం కలిగించాడు.

# రావణపుత్రుల సమరము

రావణుని పుత్రులు నరాంతక, దేవాంతక, అతికాయ, త్రిశిరులనే వారు మహావీరులు. ఆకాశంలో సంచరింపగలవారు. శత్రు భయంకరులు, యుద్ధములో అపరాజయమెరుగని వారు.

వాళ్ళు మాత్రమేకాక, మహోదర, మహోపార్శ్వులు కూడా యుద్ధానికి సన్నద్ధులయ్యారు.

రావణుడు వారిని ప్రేమతో కౌగిలించుకొని, వారికి అనేక ఆభరణాలను అలంకరించి, ఆశీస్సులిడి, సమరానికి సాగనంపాడు. సూర్యుడస్తాద్రిని అధిరోహించినట్లు నల్లమబ్బువంటి రంగుగల్గి, ఐరావత వంశంలో జన్మించిన "సుదర్శన"మనే ఏనుగును మహోదరుడు అధిరోహించాడు.

మహాపార్శ్వుడు గదాయుధుడై కుబేరునివలె వెలిగిపోయాడు. త్రిశిరుడు ఉత్తమ జాతి గుఱ్ఱాలచే కట్టబడిన రథముపై భయంకరమైన ధనస్సును, మూడు బంగారు కిరీటాలను ధరించి బయలుదేరాడు.

ధనుర్ధరులందరి చేత ప్రశంసింపబడిన పరాక్రమం గల అతికాయుడు మేరు పర్వతమువలె బంగారు భూషణకాంతులతో ప్రకాశిస్తూ, సర్వాయుధోపేతమైన రథముపై వెళ్ళాడు.

ఉచ్చైశ్రవంతో సమానంగా తెల్లని, స్వర్ణాభరణ భూషితమై, మహావేగంగల గుఱ్ఱముపై వేలాయుధుడై నరాంతకుడు సమరానికి వెళ్ళాడు.

వజ్రాలచే అలంకరింపబడి, అతి భారవంతమైన ఇనుప గుదియను గైకొని దేవాంతకుడు యుద్ధానికి వెళ్ళాడు.

వారివెంట అసంఖ్యాకమైన రాక్షస సైన్యము రణరంగానికి భయంకర ధ్వనులతో వెళ్లింది.

"కుంభకర్ణుడనే మహా సముద్రాన్నే మట్టికరిపించిన మనకు ఈ పిల్లకాలువలు ఒక లెక్కా? అని మహోత్సాహంతో రాక్షస వీరులను ఎదుర్కోవడానికి వానరులు ఉత్సాహంగా ఉన్నారు.

వానరులు భూమిపై నిలిచి, ఆకాశానికి ఎగిరి శిలా వృక్షాలను వర్షించారు.

రాక్షసులు బాణాలతో, ఆయుధాలతో వాటిని ఎదుర్కొన్నారు.

వానరవీరులు రాక్షసుల రథాలపై, గుఱ్ఱాలపై దుమికి ముష్టి దెబ్బలు కొట్టగా రాక్షసులు నేలపైబడి మరణించారు.

రాక్షసవీరులు ఇనుప గుదియలతో, శూలాలతో బాణ వర్షంతో వానరులను నిర్వీర్యం చేశారు.

ఈ విధంగా యుద్ధమతి భయంకరంగా జరిగి సమర భూమి అంతా రక్త ప్రవాహంతో నిండిపోయింది.

వాయుపుత్రుడొకడు బ్రతికి యున్న
బ్రతికి యున్నేము మనమందరము.

# అంగద నరాంతక యుద్ధము

అనేక రాక్షసుల తలలు ఏకకాలంలో నేలపాలు కావడాన్ని నరాంతకుడు చూడలేకపోయాడు.

యమునివలె భయంకరుడై వేగం గల అశ్వరాజాన్ని ఎక్కి, ప్రచండమైన బల్లాన్ని చేబూని నరాంతకుడు వానరులను అంతం చేయసాగాడు. తన ముందుకు వచ్చిన ప్రతి వానరుని తల నరకబడింది. తనవైపు చెట్లు రాళ్లు ప్రయోగించ దలచిన వారి చేతులు విరిగాయి. తనపైకి దుముకబోయినవారి దేహాలు తెగిపోయాయి. తనవైపు తలత్రిప్పి చూచిన వానరుల తలలు త్రుళ్లి క్రిందబడ్డాయి.

క్షణకాలములో నరాంతుకుని చేతిలో వానర సైన్యము అంతము కావడాన్ని చూచిన అంగదుడు సుగ్రీవుని అనుమతితో నరాంతకుని ఎదుర్కొని, "రాక్షసా! నిజంగా నీవు బలవంతుడివైతే నీ ఈటను నాపై ప్రయోగించమ"ని సవాలు విసిరాడు.

నరాంతకుడు బలంగా బల్లాన్ని వేశాడు. అది అంగదుని వక్షాన్ని తాకి తునకలై పడిపోయింది. అంగదుడు నరాంతకుని అశ్వముపైకి దుమికి ఒక పిడికిలి దెబ్బతో దాని తలను ముక్కలు చేశాడు.

కొండవంటి గుఱ్ఱము క్రిందబడగా నరాంతకుడు కోపంతో అంగదుని తలపై తన పిడికిలితో కొట్టాడు. ఆ దెబ్బతో అంగదుని తల నుండి రక్తము కారసాగింది. అంగదుడు నేల నుండి పైకి లేచి వజ్రాయుధము వంటి తన బలమైన పిడికిలితో నరాంతకుని శిరస్సును వేయి ముక్కలు చేశాడు.

నరాంతకుని చంపిన అంగదుని వైపు తీక్షణంగా చూచి దేవాంతక మహోదర, మహాపార్శ్వ, త్రిశిరులు ఒక్కుమ్మడిగా ఆయనపై పడ్డారు.

వారిని లక్ష్యము చేయక అంగదుడు ఒక మహా వృక్షాన్ని దేవాంతకునిపైకి వేశాడు. అయితే త్రిశురుడు దానిని మధ్యలోనే ఖండించాడు. అంతేకాదు అంగదునిపై బాణ వర్షాన్ని కురిపించాడు. మహాపార్శ్వుడు అతనిని ఇనుపగుదియతో కొట్టాడు.

ముగ్గురు ఏకమై తనను బాధించినా అంగదుడు బెదిరిపోలేదు. దేవాంతకుని ఏనుగును దాని తలపై కొట్టి చంపాడు. అంతేకాదు ఆ ఏనుగు కోరనే తీసికొని త్రిశిరుని పొడిచాడు. ఆ దెబ్బకు దేహమంతా రక్తము కారుతూ, భూమిపైబడిన త్రిశిరుడు

కొంతసేపటికి తెప్పరిల్లి గుదియతో మోది అంగదునిపై మూడు బాణాలను వేసి బాధించాడు.

అంగదుని రాక్షసులు ముగ్గురు చుట్టుముట్టారని గ్రహించిన హనుమంతుడు, నీలుడు అతనికి సహాయంగా వచ్చారు.

# దేవాంతక, మహోదరుల వధ

నీలుడొక పర్వత శిఖరాన్ని త్రిశిరుని మీద వేయగా దానిని అతడు తన బాణాల చేత ఖండించాడు. దానిని చూచి సంతోషముతో దేవాంతకుడు ఒక పెద్ద గుదియను హనుపై వేశాడు. దానినుండి తప్పుకొని హనుమ దేవాంతకుని తల మధ్యలో తన బలమైన పిడికిలితో పొడిచాడు. వాడు భయంకరంగా అరుస్తూ నాలుక బయటకు రాగా మరణించాడు.

దేవాంతకుని మరణంతో క్రోధము కల్గిన మహోదరుడు నీలుని వక్షస్థలముపై బాణ వర్షాన్ని కురిపించాడు. దానివలన నీలుడు కొంతసేపు తెలివి తప్పి, మెలుకువ రాగానే ఒక కొండను మహోదరునిపై విసిరాడు. ఆ పర్వతము దెబ్బకు మహోదరుడు నేలగూలాడు.

తమ వాళ్లిద్దరు చావగా మిక్కలి కోపించి త్రిశిరుడు గర్వంతో హనుమపై తీవ్ర బాణాలను ప్రయోగించాడు. వాటిని లక్ష్యము చేయకుండా త్రిశిరునిపై ఒక కొండను హనుమ విసిరాడు. త్రిశురుని బాణ వర్షానికి ఆ కొండ ముక్కలు ముక్కలైంది. హనుమంతుడు త్రిశిరుడు చేసిన సింహనాదాన్ని సహించక, ఏనుగుపై లంఘించు సింహమువలె త్రిశిరుని రథముపై దూకి ఆయన గుఱ్ఱాలను తన గోళ్ళతో చీల్చి చంపాడు.

త్రిశిరుడు ఆగ్రహంతో హనుమపై ఒక శక్తిని ప్రయోగించాడు. హనుమ దానిని పట్టుకొని విరిచివేశాడు. హనుమ శత్రుశక్తిని విరవడాన్ని చూచి వానరులందరు ప్రశంసించారు.

త్రిశిరుడు తక్షణమే తన కత్తిని దూసి హనుమ వక్షముపై విసిరాడు. తోక తొక్కిన నాగుబాముపలె, కొరడా దెబ్బ తాకిన సింహమువలె హనుమ తన అరచేతితో త్రిశిరుని బలంగా కొట్టాడు. త్రిశిరుడు ఆ దెబ్బకు తెలివి తప్పి పడిపోయాడు.

ఆయన నేలమీద పడిపోకముందే హనుమ వాని కత్తిని లాగి సింహగర్జన కావించాడు. రాక్షసుడు తెలివి తెచ్చుకొని హనుమ వక్షస్థలాన్ని తన పిడికిలితో గ్రుద్దాడు.

అప్పుడు హనుమ అతి కోపముతో త్రిశిరుని మెడ పట్టుకొని కత్తితో తెగనరికాడు. త్రిశిరుని మూడు తలలు తెగి క్రింద పడ్డాయి.

# మహాపార్శ్వుని (మత్తుని) వధ

సమరంలో అసాధ్యులైన దేవాంతక, నరాంతక, మహోదర, త్రిశిరులు శత్రువుల చేతిలో సంహరింపబడుట చూచి మహాపార్శ్వుడు తన భయంకరమైన గదతో కోతుల గుంపులను చెల్లాచెదరు చేయసాగాడు. ఆయన గదను చూస్తే దిగ్గజాలే భయపడుతాయి. చెట్టుకొకడు పుట్టకొకడై వానరులు పారిపోతుంటే వారిని నిలిపి ఋషభుడనే వానర సేనాని మహాపార్శ్వుని ముందు నిలిచాడు.

రాక్షసుడు ఆ కపీంద్రుని వక్షాన్ని తన భయంకరమైన గదతో కొట్టాడు. ఋషభుని వక్షం నుండి రక్తము కారగా ఆయన నేలపై తెలివి తప్పి పడిపోయాడు. రాక్షసులు సంతోషంతో సింహనాదాలు చేస్తున్నంతలోనే ఋషభుడు తెలివికి వచ్చి మహాపార్శ్వుని గదను లాగుకొని, దానితోనే ఆ రాక్షసుని శిరస్సును ముక్కలు ముక్కలు చేశాడు.

పాపము తన గద దెబ్బతో తానే చనిపోయే వరాన్ని కోరుకొన్నాడేమో దురదృష్టవంతుడైన ఆ రాక్షసుడు.

# అతికాయుడు

తన తోబుట్టువులు, పిన తండ్రులు తన కళ్లముందే చావడాన్ని చూచి అతికాయుడు సహించలేదు. ఆయన బ్రహ్మవర ప్రసాదుడు, పర్వతమంతటి శరీరము కలవాడు, దేవతలకు భయంకరుడు.

ఆయన ఒక దివ్య రథముపై ఎక్కి ధనుస్సును చేబూని వానరుల మధ్య నిలిచి, తన పేరు చెప్పి గర్జించాడు. కొండవంటి ఆయన శరీరాన్ని చూచి, వానరులందరు కుంభకర్ణుడే తిరిగి బ్రతికి వచ్చాడేమో అని భయంతో స్థబ్ధులయ్యారు. వారందరు శ్రీరామచంద్రుని శరణు వేడారు.

శ్రీరాముడు విభీషణునితో – ఎవ్వరు ఈ మహాదేహుడు? వేయి గుఱ్ఱాల రథముపై అనేక భయంకరాయుధాలను ధరించి, బంగారు పొదిగిన పెద్ద ధనుస్సును తాల్చి, యముని నాలుకవంటి శూలాయుధాన్ని ధరించి వస్తున్నాడు? నల్గురు సారధులు ఉన్నారు. అనేక

స్వర్ణ ధనుస్సులు, అనేకానేక బాణతూణీరాలు, పెద్దపెద్ద కత్తులు ఉన్నవి. రక్తపుష్పమాలను కంఠంలో ధరించాడు. యమునివలె భయంకరంగా ఉన్నాడు? అని అడిగాడు.

విభీషణుడు "రామచంద్రా! ఈయన స్వయంగా ధాన్యమాలికి రావణుని వలన పుట్టినవాడు. తండ్రి అంతటివాడు. ధర్మాలను తెలిసికోవడానికి పెద్దలను సేవించిన వాడు. వేదాధ్యాయి.

గుఱ్ఱము, ఏనుగు, రథము మూడింటిని నడుపడంలో సమర్థుడు. ధనుర్బాణాలతో, ఖడ్గముతో భయంకరంగా యుద్ధము చేయగలవాడు. సామ, దాన, భేదోపాయాలను ప్రయోగించడంలో నేర్పరి.

"తపస్సు ద్వారా బ్రహ్మను మెప్పించి భయంకర శస్త్రాలను, దేవతల వలన చావులేకుండట, అభేద్య కవచాన్ని, అంతటి మహారథాన్ని వరంగా పొందాడు" అని బదులు పలికాడు.

అతికాయుడు తన ధనుస్సును చేతిలో ధరించి, నారిని మ్రోగించాడు. ఆ ధ్వనికి ధరణీతలము వణికింది. వానరులందరు చెల్లా చెదరై పోగా వారిని తరుముతూ చక్కగా రాముని ముందే వచ్చి నిలిచాడు. "రామా! నా ధనుర్బాణాలను ధరించి నీ ముందుకే వచ్చాను. సామాన్య వానరులను చంపను. నీ వీరులలో ఎవ్వరైనా నాతో పోరాడవచ్చు" నని చెప్పాడు.

అతికాయుని మాటలను విని సహింపజాలని లక్ష్మణుడు అయన ముందుకు వచ్చి తన వింటినారిని మ్రోగించాడు. ఆధ్వని విని రాక్షస సైన్యము కలత చెందింది.

అయినా అతికాయుడు "లక్ష్మణా! నీవు పిల్లవాడివి, మనుష్యుడవు, యుద్ధ సమర్థత లేనివాడవు, నా ముందు నుండి వెళ్లిపో. వరుణుని పాశము, ఇంద్రుని వజ్రాయుధము నాముందు పనికి రాకుండా పోయాయి. శివుని త్రిశూలంతో సమానమైంది నా బాణ పరంపర. నీ బలాన్ని, నా బలాన్ని గుర్తించక నన్నెదరించి, చావును తెచ్చుకోకు" మని హెచ్చరించాడు.

అప్పుడు లక్ష్మణుడు "ఒరీ రాక్షసాధమా! గొప్పవారెప్పుడు తమ గొప్పదనాన్ని నోటితో చెప్పుకోరు. నీవు నీ రథం నిండా ఆయుధాలను ధరించి వచ్చావు. నేనొక విల్లును మాత్రమే కలవాడిని. నీవు రథముపై వచ్చావు. నేను నేలపై నిలుచొని ఉన్నాను.

"నీ పరాక్రమాన్ని నాపై చూపు. కొంతవరకు నీ పరాక్రమాన్ని పరీక్షించి తరువాత చెట్టునుండి పండును రాల్చినంత సులభంగా నీ శిరస్సును పడగొట్టుతాను" అని గర్జించాడు.

# లక్ష్మణ - అతికాయుల రణము

వారి మధ్య యుద్ధము క్రమంగా భయంకర రూపాన్ని ధరించింది. ఒకరి బాణాలను మరొకరు మధ్యలోనే త్రుంచసాగారు. వారి సంకుల సమరాన్ని చూడడానికి దేవతలు, మహర్షులు ఆకాశంలో గుమిగూడారు.

అతికాయుడు అతి భయంకర సర్పము వంటి శరాన్ని లక్ష్మణునిపై ప్రయోగించాడు. లక్ష్మణుడు దానిని అర్ధచంద్రాకార బాణాలతో వ్యర్థము చేశాడు. అంతేకాదు రాక్షసుని నొసట అగ్నివంటి బాణాన్ని నాటాడు. ఆ దెబ్బకు అమితంగా బాధపడి లక్ష్మణుని బాణ ప్రయోగ చాతుర్యాన్ని ప్రశంసించాడు.

తిరిగి రథాన్ని చక్రాకారంగా త్రిప్పుతూ లక్ష్మణునిపై బాణ వర్షాన్ని ప్రయోగించాడు. లక్ష్మణుడు రాక్షసుని ప్రతి శరాన్ని ఖండించాడు. అతికాయుడు కూడ ఒక మహా శరాన్ని లక్ష్మణుని రొమ్మున నాటాడు.

ఎంతటి మహా శస్త్రాలయినా ఆ సమబలుల ముందు పనిచేయలేదు. అందువలన వారిద్దరు శస్త్రాలను వదిలి అస్త్రాలను అందుకొన్నారు.

లక్ష్మణుని "ఆగ్నేయాస్త్రము" రాక్షసుని "సౌరాస్త్రము" తో వ్యర్థమైంది. అతికాయుని "ఇషీకాస్త్రము" లక్ష్మణుని "ఐంద్రాస్త్రము" తో ప్రతిహతమైంది.

అతికాయుడు ఆగ్రహంతో "యామ్యాస్త్రాన్ని" ప్రయోగింపగా "వాయువ్యాస్త్రం" తో దానిని లక్ష్మణుడు నేలకూల్చి రాక్షసునిపై ఎడతెరిపి లేకుండా బాణ వర్షాన్ని కురిపించాడు. అయితే అతికాయుని అభేధ్య కవచం ముందు ఆ బాణ వర్షము వ్యర్థమైంది.

అప్పుడు వాయుదేవుడు లక్ష్మణుని సమీపించి, "సుమిత్రానందనా! అతికాయుని కవచము అభేద్యమైనది. బ్రహ్మవర ప్రసాదమైనది. బాణములచే పగులదు. ఇక అస్త్ర బలము అంటావా? అతికాయుడు అన్ని అస్త్రాలు తెలిసిన వాడు. అందువలన బ్రహ్మాస్త్రంతోనే వీడు చస్తాడని" తెలిపాడు.

అందుకు సంతసించిన సౌమిత్రి అస్త్రరాజమైన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దానివలన దిక్కులన్ని వణికి సూర్యచంద్రులు తమ గతిని తప్పారు. ఆ మహాస్త్రము నిప్పులు కక్కుతూ ముందుకు వస్తున్నది.

అతికాయుడు ఆ బ్రహ్మాస్త్రాన్ని, తన శక్తి, గద, శూలము, గొడ్డలి మొదలగు ఆయుధాలతో, అనేక భయంకర శస్త్రాస్త్రాలతో ఎదుర్కొన్నాడు. కాని అవి అన్ని వ్యర్థాలయ్యాయి. ఆ బ్రహ్మాస్త్రము అతని శిరస్సును, అభేద్య కవచాన్ని నేలగూల్చింది. వానరులందరు లక్ష్మణుని అభినందించారు. రాక్షసులందరు లంకకు పరిగెత్తారు.

# రావణుని దుఃఖము

రావణుడు తన పుత్రుడైన అతికాయుని అంతిమ వార్తను విని అత్యంత దుఃఖ భరితుడయ్యాడు. ఆయన మనస్సులో ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన ధూమ్రాక్షుడు, అసమాన బలసంపన్నుడైన ప్రహస్తుడు, భుజ భలముచే దిగ్గజాలను సంహరింపగలిగిన కుంభకర్ణుడు, శత్రు సమూహాన్ని కంపింపజేయగల ఆకంపనుడు, అభేద్యకవచుడైన అతికాయుడు మెదిలారు.

వీరందరు అతిరథ మహారథులే. అమేయ బలసంపన్నులే. దేవతా బలభయంకరులే. ఆహవంలో అపరాజితులే. వీరందరు ఒకరి తరువాత ఒకరు రణాగ్నికి బలయ్యారే! ఇది నిజమా? ఇది సంభవమా? ఎందుకిలా జరిగింది?

నా కుమారుడు. అసమాన మేధావి, అమేయ బలుడు, మాయా యుద్ధవిశారదుడైన ఇంద్రజిత్తు మొదటి రోజే రామలక్ష్మణులను తపోవర ప్రసాదమైన నాగాస్త్రంతో బంధించి, ఇక వారు మరణించినట్లేనని" నాకు తెలిపాడే.

అంతటి మహిమగల నాగాస్త్రము ఎలా అంతమైంది? వాళ్లను ఏ దేవుడు వచ్చి కాపాడాడు? నాగాస్త్రము దేవతలకు కూడా అసాధ్యమే? లేక రామలక్ష్మణులు తాము కట్టుబడ్డట్లు నటించారా?

రామునికి తనంతటి వాడు తన తమ్ముని సహాయము ఉంది? నాకు ఉన్న తమ్ములలో నాతో పాటు ఉండి తన ప్రాణాలను సైతము నాకు అర్పించడానికి సిద్ధమైన అరివీర భయంకరుడైన కుంభకర్ణుడు యుద్ధంలో రామబాణాగ్నికి ఆహుతి అయ్యాడు. మిగిలిన తమ్ముడు శత్రు పక్షంలో చేరాడు.

ప్రత్యక్ష యుద్ధంలో ఇంద్రజిత్తు కంటే బలవత్తరుడైన అతికాయుడు లక్ష్మణుని అస్త్ర సంపద ముందు తలను పోగొట్టుకొన్నాడు. ఇక ఒక్క ఇంద్రజిత్తు మాత్రమేమి చేయగల్గుతాడు? ఇక తనకు దిక్కెవరు?

వర బలగర్వితులైన రాక్షస వీరులందరూ శ్రీరాముని పరాక్రమాగ్నికి దీపపు పురుగులై మాడిపోయారే? ఆ రాముడు ఎవ్వరు? నిజంగా నారాయణుడేనా? కాకుంటే అంతటి అసురమహావీరులు, అరివీర భయంకరులు యుద్ధానికి వెళ్ళినవారు అక్కడే మరణిస్తారా? అందులో ఎవ్వరు లంకకు తిరిగిరారా? అని రావణాసురుడు దుఃఖాన్ని, భయాన్ని పొందాడు.

# ఇంద్రజిత్తు సమరము

తన తండ్రి రాక్షస లోకానికే ప్రభువు. సమస్త దేవతలకు భయంకరుడు. ప్రసిద్ధ పరాక్రముడు. అంతటివాడు దుఃఖించడాన్ని చూస్తూ ఇంద్రజిత్తు సహింపజాలలేదు.

ఆయన రాక్షస ప్రభువును సమీపించి, "తండ్రీ! నీవు విచారపడుతున్నావా? శత్రువుల పాలిటి సింహస్వప్నమైన నేను జీవించి ఉండగా నీకు విచారమెందుకు?

భయంకరములైన నా బాణ పరంపరలతో రామలక్ష్మణుల తలలను ఖండించి, వారి దేహాలను నేలపై దుమ్ములో కలుపుతాను.

అగ్నిని ఆరాధించి సంపాదించిన అస్త్రశస్త్రాలు కలవాడిని. నా పరాక్రమము, దేవతా ప్రసాదము రెండింటితో శత్రువుల శరీరాలను నేలపాలు చేస్తాను. సూర్యచంద్రులు, ఇంద్రాగ్నులు కూడ నా ముందు నిలువజాలరు. నేను వెళ్లి రామలక్ష్మణుల శిరస్సులను నీకు బహుమానంగా సమర్పిస్తానని" తండ్రిని ఓదార్చి ఇంద్రజిత్తు కంచర గాడిదలను కట్టిన రథములో కూచొని, గుఱ్ఱాలను, ఏనుగులను ఎక్కిన రాక్షసవీరులు తనను అనుసరించగా యుద్ధభూమికి బయలుదేరాడు.

బాణాలతో, గదలతో, రోకళ్లతో (పరిఘులతో), అనేక ఇతరాయుధాలతో ఇంద్రజిత్తు వానర సేనను మృత్యుముఖంలోకి పంపాడు.

వానరవీరులు ఇంద్రజిత్తును చుట్టుముట్టి మహా వృక్షాలతో, గిరిశిఖరాలతో ఎదిరించినా వారందరూ జటాయువు వలె వీరోచిత మరణాలను పొందారు.

నీల, మైంద, గజ, ఋషభ, ద్వివిద, జాంబవంత, గంధమాదనాదులనే కాక సుగ్రీవాంగదులను కూడ తీవ్ర బాణ పరంపరలతో పరాజితులను చేశాడు.

ఒక్కొక్కప్పుడు శత్రువుల ముందు ప్రత్యక్షమవుతూ, ఒక్కొక్కప్పుడు మాయమవుతూ వానరవీరులను చీల్చి చెండాడాడు. హనుమ కూడ ఇంద్రజిత్తు మాయావిద్య ముందు నిలువలేక పోయాడు.

బ్రహ్మదేవుడు ప్రసాదించిన అస్త్రమాహాత్మ్యానికి లక్ష్మణుని సహించవలసిందిగా శ్రీరాముడు కోరాడు. కొంతసేపటికి రామలక్ష్మణులు ఏ ప్రతిక్రియ చేయకుండానే మూర్ఛిల్లారు.

విభీషణుడు వానరవీరులను ఓదారుస్తూ, "శ్రీరామలక్ష్మణులు బ్రహ్మ వాక్యాన్ని మన్నింపదలచి వివశులయ్యారే తప్ప వీరత్వము లేక కాదని" వివరించాడు.

హనుమ విభీషణులు జాంబవంతుని సమీపించారు. విభీషణుని చూడలేకున్నా, ఆయన ధ్వనిని బట్టి గుర్తించి, "రాక్షసరాజా! వాయునందనుడు కుశలమేనా? అని అడిగాడు.

విభీషణుడాశ్చర్యంతో "భల్లూకరాజా! రామలక్ష్మణుల కుశలాన్ని గురించి విచారించక, హనుమను గూర్చి ఎందుకు అడిగావు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు జాంబవంతుడు, "విభీషణ మహారాజా! హనుమ వాయువేగుడు, అగ్నివీర్యుడు. అందువలన ఆయన తప్పక జీవించే ఉంటాడనే ఆశతో అడిగాన"ని ప్రత్యుత్తరమిచ్చాడు. హనుమ జాంబవంతునికి నమస్కరించగా, జాంబవంతుడు వాయుపుత్రుని "సంజీవకరణి" పర్వతాన్ని తెమ్మని తెలిపాడు.

ఆ పర్వతము హిమవత్పర్వతము యొక్క ఋషభ, కైలాస పర్వత శిఖరాల మధ్య ఉంటుందని, ఆ పర్వతాన్నంటిని ప్రకాశింపజేసే నాలుగు ఓషధులు దానిపై ఉంటాయని తెలిపాడు.

అందులో (1) మృతులను బ్రతికించేది "సంజీవకరణి", (2) శరీరంలో చిక్కుకొన్న బాణాలను, ఇతర పధ్ధార్థాలను వెలికితీసేది "విశల్యకరణి", (3) విరిగిన ఎముకలను అతికించేది "సంధానకరణి", (4) గాయాలను తక్షణమే మానిపించి పూర్వపు రంగును కలిగించేది "సౌవర్ణకరణి".

వీటిని వెంటనే తెచ్చి, జగత్ప్రాణుడైన వాయుదేవుని కుమారా! హనుమా! ఈ కపిసేను బ్రతికించు. మా ప్రాణాలన్ని నీ చేతిలోనే ఉన్నాయ"ని జాంబవంతుడు హనుమంతుని ప్రేరేపించాడు.

# "సంజీవకరణి"ని హనుమ తెచ్చుట

తక్షణమే పవనసుతుడు మహోత్సాహంతో బయలుదేరి "త్రికూట" పర్వతశిఖరముపైకి ఎగిరాడు.

అయన పాదముల తాకిడికి పర్వత శిఖరాలు కంపించాయి. చెట్లు నేలకూలాయి. లంకానగర ద్వారాలు విరిగిపడ్డాయి. ఇండ్లు నేలమట్టమయ్యాయి. నగరమంతా నృత్యం చేస్తున్నట్లు వణికిపోయింది.

హనుమ మహాబలశాలి. అయినా తన "స్వశక్తి"పై ఆధారపడక, శ్రీరామచంద్రుని శ్రీపాదాలను మనసారా ధ్యానించి, రామనామాన్ని మాటిమాటికి స్మరించి, మహావేగంగా హిమవత్‌పర్వతాన్ని చేరుకున్నాడు. హనుమ వేగాన్ని వర్ణించడానికి ఎంతవారికైనా మాటలు చాలవు. ఊహించడానికి మనస్సులు చాలవు. అది ముక్త పురుషుని "పరమపదయానాన్ని" స్ఫురింపజేస్తుంది.

ఋషభ, కైలాస శిఖరాల మధ్యగల ఓషధీ పర్వతాన్ని, వేయి యోజనాల స్థలము వెతికాడు. అయినా ఓషధులు కనిపించలేదు.

హనుమకు ఆగ్రహము కలిగింది. రామభద్రునిపై దయలేకపోవడాన్ని, తనను నిర్లక్ష్యం చేయడాన్ని సహించని హనుమ ఆ పర్వతాన్ని బ్రద్దలుచేయాలని సంకల్పించాడు. అప్పుడు ఆ మొత్తము పర్వతాన్ని సమూలంగా పెకిలించి, సకల దేవతలు సంతోషింపగా దానిని చేతిలో పట్టుకొని చక్రాయుధునివలె శత్రువులు భయపడుతుండగా ఆకాశంలోకి ఎగిరి, త్రికూట పర్వతముపై వాలాడు. అప్పుడు ఆ ఓషధుల వెలుగుచే ఆ పర్వతమొక సూర్యునివలె, హనుమ మరొక సూర్యుని వలె ప్రకాశించారు.

"సంజీవని" వాసనలు తగులగానే వానరులు పునర్జీవితులయ్యారు. వారు సంతోషోత్సాహాలతో చేసిన మహాగర్జనలకు లంకానగరంలోని రాక్షసులు భయకంపితులయ్యారు.

రామలక్ష్మణులు, సుగ్రీవాంగద, జాంబవదాదులందరు మూర్ఛనుండి తేరుకొన్నారు. వానర సైన్యంలో ఒక క్రొత్తకాంతి కలిగింది.

యుద్ధంలో చనిపోయిన రాక్షస సైనికులందరిని ఎవ్వరైనా గుర్తుపడితే, అది తనకు అవమానమని భావించి, రావణాసురుడు ప్రతిరోజు యుద్ధంలో చనిపోయిన రాక్షసులందరిని సముద్రంలోకి త్రోయించాడు. అందువలన రాక్షసుల శరీరాలు యుద్ధరంగంలో మిగులలేదు. అందువలన మృత రాక్షసులెవ్వరు తిరిగి బ్రతకలేదు.

# లంకాదహనము

ఇంద్రజిత్తువలన కలిగిన ప్రమాదానికి ప్రతీకారంగా "లంకానగరాన్ని దహింపుడ"ని సుగ్రీవుడు వానర వీరులను ఆదేశించాడు.

పాములవలె బుసలు కొడుతూ, వానర వీరులు చేతులలో, మండే కొరవులను తీసికొని, కాపలాదారులను భయపెట్టి, లంకానగరంలో ప్రవేశించి, కనపడ్డ మిద్దెనల్లా కాల్చసాగారు. కొద్దిసేపట్లో లంకానగరము అగ్నిజ్వాలలతో నిండిపోయింది.

లంకానగరంలోని భవంతులలో మేలి వస్త్రాలు, ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు, ధనుర్బాణాలు, సమస్తాయుధాలు, ద్వారగవాక్షాదులు సర్వము భస్మమయ్యాయి. అగ్ని జ్వాలల కాంతులతో సముద్ర జలము రక్త వర్ణాన్ని దాల్చింది. కాలుతున్న లంకానగరము బీషధులతో ప్రకాశించే హిమపర్వతాన్ని స్ఫురింపజేసింది.

మూర్ఛనుండి మేలుకొన్న రామలక్ష్మణులు తమ ధనస్సులతో "టాం" కార ధ్వనులను చేశారు. ఆ భయంకర ధ్వని రాక్షసులకు ప్రాణాంతకమైంది.

శ్రీరాముడు తన మహాధనస్సుతో లంకానగరముపై క్రూర బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలకు భవన గోపురాలు విరిగిపడసాగాయి.

లంకానగరంలో ఉండలేక రాక్షసులు యుద్ధానికి తరలిరాసాగారు. అయితే వారువచ్చే ద్వారాన్ని వానరవీరులు చుట్టుముట్టారు. రాక్షసులను ముందుకు రానీయకుండా ఆపారు.

# కుంభనికుంభులు

కుంభకర్ణుని కుమారులు కుంభనికుంభులు, వారిద్దరు తండ్రి అంతటి పరాక్రమవంతులు. లంకానగర ద్వారాన్ని వానరవీరులు చుట్టుముట్టడాన్ని వాళ్లు సహించలేకపోయారు. అకంపన, శోణితాక్ష, యూపాక్ష, ప్రజంఘులతో కూడి వారు రావణాజ్ఞతో యుద్ధరంగానికి బయలుదేరారు. వారిని ఎదుర్కోవడానికి వానరవీరులు వృక్షాలతో, శిలలతో సిద్ధమయ్యారు. కాని రాక్షసుల కత్తులకు తలలు తెగి నేలకూలారు. అయినప్పటికీ ప్రాణాలకు తెగించి వానరవీరులు రాక్షస సైన్యముపైబడి దంతాలతో, గోళ్ళతో రాక్షసుల శరీరాలను చీల్చివేయసాగారు. వానర రాక్షస యుద్ధము అతిభయంకరంగా జరిగింది.

# అంగద - అకంపనాదులు

వానరవీరుడు వాలి కుమారుడైన అంగదుడు, రాక్షస వీరుడైన అకంపనుని ఎదుర్కొన్నాడు. అంగదుని అకంపనుడు గదతో కొట్టాడు. ఆ గదనే లాగుకొని అంగదుడు రాక్షసుని బలంగా మోదాడు. అకంపనుడు కొంత సమయము మూర్ఛిల్లి తేరుకొన్నాడు.

అంగదుడు ఒక పర్వత శిఖరాన్ని ఊడబెరికి అకంపనునిపై విసిరివేశాడు. అది తీవ్రంగా బాధించి రాక్షసుని వధించింది.

అకంపనుని మరణాన్ని చూచిన శోణితాక్షుడు ఆగ్రహంతో అంగదుని తీవ్రబాణాలతో బాధించాడు. అంగదుడు శోణితాక్షుని రథాన్ని, గుఱ్ఱాలను, విల్లమ్ములను చూర్ణం చేశాడు.

శోణితాక్షుడు ఖడ్గహస్తుడై ఆకాశంలోకి ఎగిరాడు. అంగదుడు వాడి కత్తిని లాక్కొని దానితో వాడి కవచాన్ని తెగగొట్టాడు. రాక్షసవీరుడు ఇనుప గదతో వానరవీరుని కొట్టాడు. అంగదుని పరాక్రమాన్ని తగ్గించడానికి యూపాక్ష, ప్రజంఘులను రాక్షసవీరులు శోణితాక్షునితో కలిశారు. అదిచూచి మైంద ద్వివిదులను వానరవీరులు అంగదునికి అండగా వెళ్లారు.

వానరవీరులు ప్రయోగించిన వృక్షాలను, మహాశిలలను ప్రజంఘుడు తన ఖడ్గంతో ఖండించాడు. అదే బలిష్ఠమైన ఖడ్గాయుధంతో ప్రజంఘుడు అంగదుని ఎదుర్కొన్నాడు.

అంగదుడు మద్ది చెట్టు చేత ప్రజంఘుని కొట్టాడు. దానితో రాక్షసుని చేతి నుండి ఖడ్గము జారిక్రిందబడింది. అయినా ప్రజంఘుడు ధైర్యము కోల్పోక తన ముష్టితో అంగదుని బలంగా కొట్టాడు. క్రిందబడిన కత్తిని చేతిలోకి తీసికొని అంగదుడు ప్రజంఘుని తలనరికాడు.

ప్రజంఘుని అన్నకొడుకు యూపాక్షుడు కత్తితో అంగదుని ఎదుర్కొన్నాడు. ఇంతలో ద్వివిదుడు వచ్చి యూపాక్షుని వక్షస్థలాన్ని పగులగొట్టి వాడిని ఊపిరాడకుండా బంధించాడు.

యూపాక్షుడు బంధితుడు కావడాన్ని చూచిన శోణితాక్షుడు గదచేత ద్వివిదుని వక్షస్థలాన్ని కొట్టాడు. కొద్ది సమయంలోనే తేరుకొన్న ద్వివిదుడు శోణితాక్షుని నేలపైకి విసిరి, ఆయన రొమ్ముపై కాలూని, ముఖాన్ని గోళ్లతో రక్తము కారునట్లు గీరి, గొంతును గట్టిగా నలిపి చంపాడు.

ద్వివిదుడు శోణితాక్షుని చంపేలోపే మైందుడు యూపాక్షుని సంహరించాడు.

# కుంభుని వీరవిహారము

కుంభుని అనుచరులైన, యూపాక్ష, ప్రజంఘ, అకంపన, శోణితాక్షులు వానరవీరుల చేత హతులు కావడాన్ని చూచిన రాక్షస సైన్యము భయంతో కుంభుని శరణు వేడింది.

కుంభుడు తన ధనుస్సుతో "టాంకార" ధ్వనిని చేసి, ఐరావతము వంటి తెల్లని చాపాన్ని ధరించి, భయంకర సర్పాలవంటి బాణాలను ప్రయోగించి, ద్వివిదుని నేలగూల్చాడు.

తన తమ్ముడు పడిపోవడాన్ని చూచిన మైందుడు ఆగ్రహంతో ఒక మహాశిలను కుంభునిపై విసిరాడు. కుంభుడు ఐదు బాణాలతో ఆ శిలను మధ్యలోనే త్రుంచి, ఒక భయంకర బాణంతో మైందుని నేలగూల్చాడు.

తన మామలిద్దరు కుంభుని బాణముల దెబ్బలచే నేలపడడాన్ని చూచిన అంగదుడు అసమాన బలంతో కుంభుని ఎదిర్చాడు.

కుంభుడు మరింత భయంకరాలైన బాణాలతో అంగదుని కొట్టాడు. అంగదుడు వాటికి వెరవక కుంభునిపై రాళ్లవానను కురిపించాడు. కుంభుడు వాటిని తన బాణాలతో చూర్ణంచేసి, అంగదుని కళ్లను లక్ష్యం చేసికొని మూడు వాడి బాణాలను ప్రయోగించాడు. అంగదుని కళ్లు రక్తాన్ని కార్చాయి. అయినా వానరోత్తముడు ఒక చేత్తో తన కళ్లను మూసుకొని మరొక చేత్తో ఒక మహా వృక్షాన్ని పెకిలించి రాక్షసునిపైకి విసిరాడు. కుంభుడా వృక్షాన్ని ముక్కలు ముక్కలు చేసి అంగదుని భయంకర బాణాలతో నేలగూల్చాడు.

కుంభుని ఎదిరించడానికి వేగదర్శి, సుషేణుడు, జాంబవంతుడు ముందుకు ఉరికారు. కుంభుడు వారిని తన బాణ వర్షముతో ముందుకు రానీయలేదు.

"నీ కీయెడ బ్రహ్మ వ్రాసెగద:
మృత్యువు నాదగు చేతిలో పలన్"

# కుంభ - సుగ్రీవుల సమరము

వానరుల అవస్థను చూచిన సుగ్రీవుడు కుంభుని ఎదుర్కొని ఏనుగును సింహము తరిమినట్లు మద్ది, చంద్ర మొదలైన బలిష్ఠాలయిన మహావృక్షాలను కుంభునిపైకి విసిరి రాక్షసుని వేగాన్ని నిరోధించాడు. పళ్ళు విరిగి ముందుకు పోలేని ఏనుగువలె నిలిచిపోయిన కుంభుని సుగ్రీవుడు అధిక్షేపించి, అతనిని పరిహసిస్తూ, ఈ విధంగా అన్నాడు.

"కుంభా! నిజంగా నీవు వీరుడవేనోయి! నీ బాణవిద్య గొప్పది! నీ దేహ బలము నీ తండ్రి శరీర బలానికి సమానము. నీ పరాక్రమము మీ పెద్దనాన్న రావణుని పరాక్రమంతో సమానము! నీవు చాటుగా నుండి బాణాలను ప్రయోగించడంలో ఇంద్రజిత్తుతో సమానుడవు. మన ఇద్దరి మధ్య యుద్ధము మహేంద్ర - శంబరాసురుల మధ్య యుద్ధము వలె భయంకరంగా జరుగవచ్చు.

నీవిప్పుడు బాగా అలసిపోయావు. అందువలన నిన్నిప్పుడు నేను చంపినా, "అలసిన వానిని చంపాడు" అనే అపకీర్తి నాకు వస్తుంది. అందువలన మొదట అలసట తీర్చుకొని, తరువాత యుద్ధానికి సిద్ధంకమ్ము".

సుగ్రీవుని మాటలు కుంభునికి రుచించలేదు. అందువలన కుంభ సుగ్రీవులు ఒకరితో ఒకరు భయంకరంగా ముష్టియుద్ధం చేయసాగారు.

ఒకరినొకరు కొట్టుకొన్నారు, తొక్కుకున్నారు. సుగ్రీవుడు కుంభుని పైకెత్తి సముద్రం లోకి విసిరివేశాడు. వాడు తనలో పడినందువలన సముద్రము ఉప్పొంగింది.

సముద్రజలాల నుండి లేచి కుంభుడు భయంకరంగా సుగ్రీవుని తన బలమైన పిడికిలితో పొడిచాడు. సుగ్రీవుని దేహము నుండి రక్తము కారసాగింది.

అయినా దానిని ఓర్చుకొని సుగ్రీవుడు పిడుగు వంటి పిడికిలి పోటుతో కుంభుని బలంగా మోదాడు. ఆ దెబ్బకు రాక్షసుని ప్రాణాలు గాలిలో కలిసాయి.

ఈ మహాపద తరియింప నీ వొక్కండవే తెప్పవు

# హనుమ-నికుంభుల యుద్ధము

తన అన్న అయిన కుంభుని మరణాన్ని చూచిన నికుంభుడు ఆగ్రహంతో తన భయంకరమైన ఇనుప గుదియను అనేక మారులు త్రిప్పాడు. అప్పుడు దాని వలన మహాగ్ని బయలు దేరింది. గ్రహసంచారము ఆగిపోయింది. దిక్కులు అదిరాయి. ఆ విధంగా బలంగా దానిని అనేక పర్యాయాలు త్రిప్పి, వానర సైన్యం పైకి విసిరాడు. దానిని చూచి వానర సైన్యము "హాహాకారాలు" చేసింది.

అయితే వజ్రాంగబలుడైన హనుమ దానిని ఎదుర్కొన్నాడు. ఆ పరిఘా యుధము హనుమ వక్షస్థలాన్ని తాకి ముక్కలై పడిపోయింది. ఆ దెబ్బతో హనుమ కొంత సేపు కదలిక లేకుండా నిలిచిపోయాడు.

కొన్ని క్షణాలలో వాయుపుత్రుడు తేరుకొన్నాడు. నికుంభుని తన పిడికిలితో కొట్టాడు. దానిని రాక్షసుడు ఓర్చుకొని హనుమను తన బాహువుల మధ్య బంధించాడు. రాక్షసులు సంతోషగర్జనలను, వానరులు హాహాకారాలను చేశారు.

హనుమ తన శ్వాసను బంధించి, బలంగా రాక్షసుని పట్టునుండి నిమిషంలో నేర్పుతో బయటపడ్డాడు. అంతేకాదు పైకెగిరి, నికుంభుని మెడను విరిచి, నికుంభుడు హాహాకారాలను చేస్తున్నా వదలక, వాడి గొంతును నులిమి చంపాడు.

రాక్షస సైన్యం భయంతో దిక్కులకు పారిపోయింది. వానరవీరులు ఉత్సాహంతో సింహగర్జనలు కావించారు.

# మకరాక్షుడు

మకరాక్షుడు ఖరుని కుమారుడు. యుద్ధంలో అసమాన పరాక్రముడు. తన తండ్రి ఖరుని చంపాడని తెలిసినప్పటి నుండి రామునిపై పగబట్టాడు.

కుంభకర్ణుని కుమారులు ఇద్దరు కుంభనికుంభులు యుద్ధరంగంలో మరణించారని తెలిసికొని రావణుడు దుఃఖంతో, కోపంతో మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకొని తన ముందు ఉన్న మహాయోధుడైన మకరాక్షుని చూచి, "కుమారా! నీ తండ్రి అయిన ఖరుని చంపిన క్రూరుడు రాముడు. ఆయనపై పగతీర్చుకోవడానికి ఇదే తగిన సమయము. యుద్ధంలో పరాక్రమించి, రామలక్షణులను సంహరించి, నీకు, నాకు

ఆనందాన్ని కల్గించు"మని ఆదేశించాడు.

మకరాక్షునికి ఇది ఒక మహావకాశమనిపించింది. రావణునికి ప్రదక్షిణం చేసి, మహాసేనతో ఆహవరంగంలో అడుగిడాడు.

అయితే దారి మధ్యలో ఆయనకు అనేక అపశకునాలు ఎదురయ్యాయి. ధ్వజము విరిగింది. సారథి కొరడా చేజారింది. గుఱ్ఱాలు పరుగెత్తజాలక కళ్లనీళ్లు కార్చసాగాయి.

ఆ అపశకునాలను లక్ష్యపెట్టక, మకరాక్షుడు, ఆయన సైన్యము భయంకరంగా సమరము చేయసాగారు. ఇటు వానర వీరులు కూడ ప్రాణాలకు తెగించి పోరాడారు. అయితే మకరాక్షుని సైన్యము వానర వీరులను వివశుల జేసింది.

ఆ పరిస్థితిని గమనించిన శ్రీరామభద్రుడు తన కోదండాన్నుండి బాణవర్షాన్ని కురిపించి, రాక్షసులను ముందుకు రానీయకుండా నిలిపాడు.

మకరాక్షుడు శ్రీరాముని ముందుకు వచ్చి, "రామా! నిలువు. నా ముందు నీవు నిలువడం నా అదృష్టము. నేను లేనప్పుడు నా తండ్రిని నీవు చంపడం విన్నప్పటి నుండి నాకు కోపము పెరిగిపోతున్నది.

ఇవ్వాళ్ల నా తండ్రి మరణానికి ప్రతీకారాన్ని తీర్చుకొనే అవకాశాన్ని కల్గించినందుకు నీకు కృతజ్ఞుడిని. రామా! నీకు అవకాశమిస్తున్నాను. నీవు శస్త్రాస్త్రయుద్ధాన్ని కోరుకొంటావా? మల్లయుద్ధాన్ని వరిస్తావా? నీ ఇష్టము" అని పరుషంగా మాట్లాడాడు.

శ్రీరామచంద్రుడు మకరాక్షుని ప్రగల్భాలకు చిరునవ్వు నవ్వి "ఓరీ! రాక్షసాధమా! నీవు నీ పరాక్రమాన్ని గొప్పగా ఊహించుకొని, నా గురించి తెలియక వదురుతున్నావు.

పదునాల్గువేల రాక్షస వీరులతో, దూషణ, త్రిశిరస్క సేనానులతో నీ తండ్రి ఖరుడు కేవలము మూడు గడియల సమయం కూడ నాతో పోరాడలేక పోయాడు. నీవు అల్పుడవు. చేతనైతే మాటలు మాని, నీ పరాక్రమాన్ని ప్రదర్శించుమ"ని సమాధానమిచ్చాడు.

శ్రీరామ, మకరాక్షుల మధ్య యుద్ధము మొదలైంది. అది క్రమంగా భయంకరం కాసాగింది.

చేతిలో విల్లు ఉన్నంతవరకు మకరాక్షుడు మహా యుద్ధాన్ని చేస్తాడని గ్రహించిన శ్రీరాముడు ఆయన విల్లును, రథాన్ని విరగగొట్టి, అశ్వాలను హతమార్చాడు.

మకరాక్షుడు మరుక్షణంలో శూలాయుధుడై రథము నుండి దుమికాడు. రామచంద్రుడు ఆ శూలాన్ని ముక్కలు చేశాడు. అయినా రాక్షసుడు వెనుకంజ వేయక తన ముష్టిని చూపి ముందుకు రాసాగాడు.

ఇక ఆ దుర్మార్గుని బ్రతుకనీయకూడదని తీర్మానించుకొన్న శ్రీరాముడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ క్షణంలోనే మకరాక్షుడు విగత ప్రాణుడై నేలపై పడ్డాడు.

రాక్షస సైన్యము భయంతో పరుగెత్తింది. వానర సైన్యము శ్రీరాముని జయజయ ధ్వానాలతో ప్రశంసించింది.

# మళ్లీ ఇంద్రజిత్తు

రావణుడు మకరాక్షుని మరణాన్ని విన్న తరువాత ధైర్యాన్ని కోల్పోయాడు. ఆయన తన కుమారుడైన ఇంద్రజిత్తును మళ్లీ పిలిపించి "పుత్రా! నీ వొక్కడివే రామలక్ష్మణులను వధింప సమర్థుడవు. యుద్ధము సాగినా కొద్ది మన వీరులు కుప్పలు కుప్పలుగా చచ్చి పడుతున్నారు. ఇప్పుడీ యుద్ధాన్ని మనకు విజయంగా మార్చగల మహావీరుడవు నీవు ఒక్కడివే.

రామలక్ష్మణులను ధర్మయుద్ధంలో ఓడించడం అసాధ్యమయిన పని. అందువలన నీవు ధర్మంగానో, అధర్మంగానో ఏదో ఒక పద్ధతిలో యుద్ధం చేసి రామలక్ష్మణుల పీడ శాశ్వతంగా తొలిగించిరా" అని ఇంద్రజిత్తును ప్రేరేపించాడు.

ఇంద్రజిత్తు సహజంగా యుద్ధ విశారదుడే. అయినా ఆయన ఎప్పుడు సహజ యుద్ధంతో తృప్తిపడక మాయా యుద్ధాన్ని చేసి విజయాన్ని సంపాదిస్తాడు.

ఇంతవరకు ఆయన రామలక్ష్మణులను, హనుమ అంగదాది వానర వీరులను మాయా యుద్ధాలతోనే పడగొట్టాడు. అందువలన ఆయన శత్రు వినాశకరమైన అభిచార హోమాన్ని ముందుగా చేయదలిచాడు.

అభిచార హోమము:- ఆ హోమాన్ని నిర్వహించే ఋత్విజులు ఎఱ్ఱని వస్త్రాలు ధరిస్తారు. వారు ఎఱ్ఱని తలపాగలను ధరిస్తారు. ఇంద్రజిత్తు కూడ రక్తాంబరాలను ధరించాడు. పేలాలను, గంధాన్ని, మాలలను సమకూర్చాడు. అగ్నిహోత్రుని కొరకు దర్భలను పరిచాడు. తాండ్ర శాఖలతో సమిధలను చేశాడు. ఒక నల్లని మేకను బలి ఇచ్చాడు. అగ్నిదేవుడు స్వయంగా హవిస్సును గ్రహించాడు.

ఆ అగ్ని జ్వాలల నుండి నాలుగు గుఱ్ఱాలను గలిగి బంగారు కప్పు గలిగి, ప్రకాశిస్తున్న రథముపైకి వచ్చింది. దానిలో అనేక అర్థచంద్రాకార బాణాలు ఉన్నాయి. వైడూర్యాలతో రథధ్వజము మెరుస్తున్నది. ఆ రథానికి అదృశ్యము కాగల శక్తి ఉంది.

దానిని ఎక్కి బ్రహ్మాస్త్ర బలంతో ఇంద్రజిత్తు రాక్షస సైన్యానికి ధైర్యాన్ని కలిగిస్తూ "ఇక ఈ రోజుతో రామలక్ష్మణులు, కపివీరులు ప్రాణాలను కోల్పోతారు. రాక్షస రాజుకు వారి తలలను కానుకలుగా సమర్పిస్తాను" అని పలికాడు. లంకానగరాన్ని వదలి సైన్యంతో యుద్ధభూమికి వెళ్లాడు.

రామలక్షణులపై బాణవృష్టిని కురిపించాడు. రామలక్ష్మణులు కూడ ఆ బాణవర్షాన్ని నిరోధించడానికి అనేక బాణాలను ఎడతెరిపిలేకుండా ప్రయోగించారు. అయినా ఒక్క బాణము కూడ ఇంద్రజిత్తును తాకలేదు.

ఇంద్రజిత్తు చిమ్మ చీకటిని వ్యాపింపజేశాడు. రథచక్రాల ధ్వనితప్ప వేరే శబ్దమేది వినిపించడం లేదు. అయినా రామలక్షణులు "శబ్దవేది" బాణాలతో రాక్షసుని నొప్పించారు. రాక్షసుడు కూడ కనబడకుండా ఉండి రామలక్ష్మణుల శరీరాలను శరమయం చేశాడు" అంతే కాదు వేలాది వానరులను నేలకూల్చాడు.

ఇంద్రజిత్తు చేసే యుద్ధాన్ని చూచి లక్ష్మణుడు ఆగ్రహావిష్టుడై బ్రహ్మాస్త్రంతో రాక్షస జాతి మొత్తాన్ని నశింపజేయాలనుకొన్నాడు.

కాని రాముడు ఒక్క ఇంద్రజిత్తు మూలంగా సమస్త రాక్షస జాతిని సంహరించడం మంచిది కాదని, లక్ష్మణుని ప్రయత్నాన్ని మానిపించాడు.

శ్రీరాముని ఆగ్రహాన్ని గమనించిన ఇంద్రజిత్తు ఇకవారితో యుద్ధం చేయడం సాధ్యము కాదని గ్రహించి హనుమ నిలిచిన పశ్చిమ ద్వారాన్ని చేరాడు.

అంతేకాదు వానరుల శక్తి సామర్థ్యాలను రూపుమాపదలచి మాయ ద్వారా సీతాదేవి శరీరాన్ని సృష్టించి ఏడుస్తున్న ఆమె తల వెంద్రులకను పట్టుకొని రథము మీద వానర సేనల మధ్యలో అగుపించాడు. ఆమె తలను నరకటానికి కత్తిని దూశాడు.

హనుమ ఆ దృశ్యాన్ని చూచి, "ఓరీ దుర్మార్గుడా! ఒక మహాపతివ్రత తలవెంద్రుకలను పట్టుకొన్న నీవు నశించిపోతావు.

పులస్త్య బ్రహ్మ వంశంలో జన్మించినవాడవు. ఇంతటి అపవిత్ర కార్యానికి ఎందుకు పూనుకొన్నావురా? సాధారణ స్త్రీని వధించడమే మహాపాపమని'' శాస్త్రాలు తెలుపుతున్నాయి. అయోనిజ, జనక తనయ, శ్రీరామ పత్ని అయిన సీతా మహాసాధ్విని సంహరించడము ఎంత పాపమో నీకు తెలియదా? సీతాదేవికి ఏ కొంచెము అపచారాన్ని కావించినా నీ శిరస్సును పగులగొట్టక మానను" అని ఇంద్రజిత్తును హెచ్చరించాడు.

అయినా ఇంద్రజిత్తు తన మూర్ఖత్వాన్ని వదలక హనుమంతుడు చూస్తుండగా ఆ మాయా సీత శిరస్సును రెండు ముక్కలుగా తన కత్తితో నరికాడు.

వానరులు హాహాకారాలు చేస్తూ, తలో దిక్కుకు పారిపోయారు. వారిని నిలిపి హనుమంతుడు రాక్షస మూకను ఎదుర్కొన్నాడు.

అయినా యుద్ధాన్ని నిలిపి, వానర సేనతో శ్రీరామచంద్రుని దగ్గరకు వెళ్లి ఇంద్రజిత్తు సీతా శిరమును సంహరించిన వార్తను తెలుపాలనుకొన్నాడు. యుద్ధాన్ని ఆపివెళ్లాడు. ఇంద్రజిత్తు కూడ తన పాచిక పారిందని సంతోషించి శత్రు సంహారకమైన నికుంభిలా హోమాన్ని ఏకాంత ప్రదేశంలోకి వెళ్లి చేయసాగాడు.

# లక్ష్మణుని విషాదము

హనుమ వెళ్లి రామలక్ష్మణులకు సీతావధ వార్తను తెలిపాడు. శ్రీరామచంద్రుడు ఆ వార్త వినగానే “మొదలు తెగిన చెట్టు” వలె నేలకూలాడు.

లక్ష్మణుడు తన అన్న శరీరాన్ని కౌగిలించుకొని బిగ్గరగా రోదిస్తూ, “అన్నా! నీవు ధర్మాన్నే ప్రధానవ్రతంగా భావించావు. అర్థకామాలను ముఖ్యంగా భావించలేదు.

అందువలననే కైకేయి దుష్టబుద్ధితో శాస్త్ర విరుద్ధంగా నిన్ను అడవికి పంపదలచినా, మన తండ్రి దశరథుడు ఇచ్చిన మాటను గౌరవించి, ఆమె కోరికను అనుసరించి అడవులకు వచ్చావు.

అడవిలో విరాధ, ఖర, కబంధాదుల వలన అనేక బాధలను అనుభవించావు. నీ ప్రాణప్రియ అయిన సీతాదేవికి దూరమయ్యావు.

మిత్రుడైన సుగ్రీవుని కాపాడదలచి వాలిని వధించావు. ఇన్ని కష్టాలను, నష్టాలను ఓర్చుకొని ధర్మాన్ని కాపాడుకొన్నావు. అయితే అంత పదిలంగా కాపాడుకొన్న ధర్మము నీకేమి ఇచ్చింది? నీ భార్య ప్రాణాలనే బలిగొన్నది. నిజానికి ధర్మమనేది ఒకటి ఉందా? ఉంటే ఎప్పుడైనా కనబడుతుందా?

సుఖదుఃఖాలు కంటికి కనబడుతాయా? అంత మాత్రాన అవి లేనట్టా? ధర్మము కూడ అలాగే అతీంద్రియమైనది అంటావా?

అది ఉండి ఏమి చేసింది? అధర్మమూర్తి అయిన రావణునికి నిరంతర విజయసౌఖ్యాలా? ధర్మమూర్తి అయిన నీకు నిరంతరము కష్టాలేనా?

కంటికి కనబడకపోవడాన్ని బట్టి, అది ఉన్నందు వలన కలుగవలసిన ఫలితము కలుగక పోవడాన్ని బట్టి ప్రత్యక్షంగా, అనుమానాన్ని బట్టి కూడ ధర్మము ఉందని నిరూపించ జాలము.

శాస్త్రము కూడ ధర్మము యొక్క ఉనికిని నిరూపించజాలదు. ఎందుకంటావా? శాస్త్రము ప్రకారము ఏ కర్మ అయినా "త్రిక్షణావర్తే" కదా. ఆ కర్మను చేయుటకు ముందు క్షణము, చేసే క్షణము, తరువాత క్షణము అని మూడు క్షణాల వరకు మాత్రమే కర్మ మిగిలి ఉంటుంది. ఆ తరువాత అది నశించి పోతుంది. మూడు క్షణాలు మాత్రమే మిగిలి ఉండే ధర్మము తరువాత ఎప్పుడో ఫలితాన్ని ఇస్తుందనుకోవడం సరి అయిందా?

అయితే అదే వేదము "అపూర్వము" వలన భావికాలంలో ధర్మము ఫలాన్ని ఇస్తుందని" తెలుపుతుంది అంటావా? "రాళ్లు నీళ్ల కంటె బరువైనవని చెప్పి, ఆ రాళ్లు నీళ్లపై తేలుతాయి" అన్నట్లు పరస్పర వ్యతిరేకముగా ఉంటాయి ఆ రెండు మాటలు.

కాదు ధర్మాధర్మాలు స్వయంగా ఫలాన్నివ్వవు. కాని దైవము ధర్మఫలాన్ని, అధర్మఫలాన్ని ఇస్తుందంటావా? అప్పుడు ఫలాన్ని ఇచ్చేది దైవమే కాని ధర్మాధర్మాలు కావు కదా?

"దైవము ఫలాన్ని ఇస్తుందనేది సత్యమే. కాని ఏ ఫలాన్ని ఇవ్వాలన్నా దాని కారణాన్ని బట్టే ఇస్తుంది. ధర్మాచరణను బట్టి ధర్మఫలాన్ని, అధర్మ కర్మాచరణ వలన అధర్మఫలాన్ని దైవము ఇస్తుంది. అలాకాక కర్మాచరణకు ప్రాధాన్యమే లేకపోతే దైవానికి పక్షపాతము ఉంటుందని చెప్పవలసి వస్తుంది. దైవము కర్మసాక్షి మాత్రమే. కర్మఫలప్రదాత మాత్రమే. కాని పక్షపాతి కాదు" అంటావా? అప్పుడు ఆ దైవమే ధర్మమూర్తి అయిన నీకు దుఃఖాన్ని, అధర్మపరుడైన రావణునికి సుఖాన్ని ఎందుకిచ్చాడు?

అంతేకాదు అర్థకామాలకంటె ధర్మమే బలీయమని నమ్మి పితృవాక్య పాలనము అనే ధర్మము కొరకే రాజ్యాన్ని వదలి వచ్చావు.

కాని వాస్తవంగా ధర్మము కంటె అర్థమే బలమైంది. ధనము గలవాడే గుణవంతుడు, బలవంతుడు. అతడే పండితుడు. ఆయన చెప్పింది వేదవాక్యము కంటే బలవంతమైనది. ధనములేని వాడు వేదవాక్యాన్ని చెప్పినా దానినెవ్వరు ఆదరింపరు. ధనము గలవానిని మిత్రులు, బంధువులు చేరవస్తారు.

అందువలన అన్నా! లే! ధర్మము కంటే పరాక్రమానికి ప్రాధాన్యమివ్వు. నీకు నేను అండగా ఉంటాను. నా బాణాగ్నితో సమస్త రాక్షస సమేతంగా లంకను దగ్ధం చేస్తాను" అని శ్రీరాముని లక్ష్మణుడు ఓదార్చాడు.

దీనిని బట్టి "ఇంద్రజిత్తు" నాగపాశానికి, మాయా యుద్ధానికి శ్రీరాముడు కట్టుబడింది ధర్మబుద్ధితోనే కాని వాటిని ఎదుర్కోజాలక కాదని తెలుస్తున్నది.

# విభీషణుని ఓదార్పు

విభీషణుడు తన వైపు యుద్ధంలో చేయదగిన ఏర్పాట్లను పర్యవేక్షించి రామలక్ష్మణుల దగ్గరికి వచ్చాడు. పశ్చిమ ద్వారము ముందు ఇంద్రజిత్తు మాయా సీత శిరాన్ని ఖండించిన విషయాన్ని, దాని కారణంగానే రామలక్ష్మణులకు కలిగిన దుస్థితిని ఆయన గమనించలేదు.

అందువలన వానరవీరులు, లక్ష్మణుడు దుఃఖించడానికి కారణాన్ని అడిగాడు. లక్ష్మణుడు సీత ఇంద్రజిత్తు వలన వధించబడిందని, అందువలననే తాము ఇంతగా దుఃఖిస్తున్నామని హీన స్వరంతో చెప్పాడు.

విభీషణుడు శ్రీరామునితో:– "మహాత్మా! ఇంద్రజిత్తు సీతను వధించాడనడం అసత్యం. అసాధ్యము కూడ. తరంగాలతో ఆకాశాన్ని అంటుతున్నట్లు ఎగిసిపడే సముద్రము ఎండిపోయిందనడం ఎంత సత్యవిదూరమో ఇది కూడ అంత సత్య విదూరమే.

నాకు మా అన్న రావణాసురుని స్వభావము పూర్తిగా తెలుసు. ఆయనకు సీత తన ప్రాణం కంటె ప్రియమైనది. సీతను లంకలో ఉంచుకోవడం లంకా వినాశకారణమవు తుందని నేను, నాతోపాటు కొందరు చెప్పినా, ఆయన సీతను వదలుకోవడానికి అంగీకరించలేదు. కొంతమంది రాక్షస స్త్రీలకు, స్వయంగా తనకు తప్ప ఇతరులెవ్వరికి సీతాదేవిని చూచే అధికారమే లేదు. రావణాజ్ఞను ధిక్కరించే సాహసము ఇంద్రజిత్తుకు కూడ లేదు.

అందువలన సీతను యుద్ధరంగానికి తీసికవచ్చి, ఆమె తలను ఇంద్రజిత్తు నరకడము ఊహకు కూడ సాధ్యము కాదు. ఇదంతా ఇంద్రజిత్తు మాయ. అందులో అణువంత నిజం కూడ లేదు" అని విభీషణుడు స్పష్టం చేశాడు.

అయితే ఇంద్రజిత్తు ఇంతటి మాయను కల్పించడానికి కారణము తెలుపుతున్నాడు విభీషణుడు. "రామభద్రా! ఒకవైపు రాక్షసవీరులు మనపైకి యుద్ధానికి తరలివస్తుంటే, మరొక వైపు ఇంద్రజిత్తు అభిచార హోమాలు చేస్తు వచ్చాడు. వాటిని నిర్విఘ్నంగా పూర్తి చేసి ఆ శక్తితో ఆయన మనపైకి దండెత్తి వచ్చేవాడు. అందువలననే ఆయన అదృశ్యంగా ఉండి యుద్ధము చేస్తూ అందరిని బాధించి వెళ్లేవాడు.

ఇప్పుడు లంకలో మిమ్మల్ని ఎదిరించగల రాక్షస వీరులెవ్వరు లేరు. కనుక ఆయన నిర్విఘ్నంగా అభిచార హోమం చేయజాలడు.

అందువలన ఆయన సీతను కల్పించి, ఆమె శిరస్సును ఖండించినట్లు మాయచేసి వెళ్లాడు. మనము ఆ దృశ్యాన్ని చూచి దుఃఖిస్తామని, ఆయన ఈ మధ్యలో నికుంభిలా హోమాన్ని, నిర్విఘ్నంగా పూర్తి జేసికోవచ్చునని భావించాడు.

యజ్ఞము పూర్తి అవుతే ఆయనను జయించేవాడు విశ్వంలోనే ఉండడు. యజ్ఞము విఘ్నమవుతే వాడు మరణించక తప్పదు. "అభిచార హోమాన్ని ఆపగలిగిన వానిచేతిలోనే వాడు హతుడవుతాడ"ని బ్రహ్మ తెలిపాడు.

అందువలన నిష్కారణంగా సీతాదేవి కొరకు దుఃఖించడము మాని, వాడి యజ్ఞాన్ని విఘ్నం చేయడం గురించి మనము ఆలోచించాలి. వాడు ఆ యజ్ఞము చేసే చోటు నాకు తెలుసు. కాబట్టి మహావీరుడైన లక్ష్మణుని, మరికొంతమంది వానర వీరులను నాతో పంపు. ఇంద్రజిత్తు వధ తప్పదని ఖచ్చితంగా శ్రీరామునికి వివరించాడు.

శ్రీరాముడు ఇంద్రజిత్తు మాయా యుద్ధం లోనే కాక సహజ సమరంలో కూడ సులభంగా వధింపబడడని నిర్ణయించి లక్ష్మణుని ఆయనతో పాటు సుగ్రీవాంగద, హనుమ, జాంబవదాది వీరులను కూడ పంపాడు.

# సౌమిత్రి సమరోత్సాహము

తమ దుఃఖానికంతటికి కారణమైన ఇంద్రజిత్తును తన చేతిలో చంపబోవడం లక్ష్మణునికి మహానందాన్ని కలిగించింది. కవచము, ఖడ్గము, బాణ, తూణీరాలను ధరించి యుద్ధానికి సిద్ధమయ్యాడు.

తన అన్న పాదాలకు ప్రణమిల్లి, మహోత్సాహంతో తాను ఇంద్రజిత్తు శరీరాన్నే కాక, మొత్తము లంకా నగరాన్ని తన బాణాలతో దహించివేస్తానని తెలిపాడు.

విభీషణుడు ఇంద్రజిత్తు అభిచార హోమం చేసే చోటికి తీసిక వెళ్లాడు. అయితే ఇంద్రజిత్తు కనబడకుండా రాక్షస సైన్యము ఆయన చుట్టు నిలిచి ఉంది. అందువలన ఆ సేనను దూరము చేయుమని విభీషణుడు తెలిపాడు.

రాక్షస సేన వానర సేనల మధ్య సమరము సాగింది. క్రమంగా వానర వీరుల ధాటికి రాక్షస వీరులు నిలువలేక పోయారు. దొరికిన రాక్షసులను దొరికినట్లే యజ్ఞాగ్నిలోకి వానరవీరులు విసిరి వేశారు. రాక్షసులు హాహాకారాలు చేస్తూ ఇంద్రజిత్తును నిందిస్తు అగ్నిలో పడి మాడిపోసాగారు.

తనను ఎదిరించవచ్చిన రాక్షస సైనికులను హనుమ తన శరీరాన్ని పర్వతమంత ఎత్తుగా పెంచి తన కాళ్లతో, చేతులతో, తన పిడికిలి దెబ్బలతో హతమార్చాడు.

ఇక ఏ మాత్రము ఆలస్యం చేసినా రాక్షస సైన్యము సమూలంగా నశించిపోతుందని భయపడి, ఇంద్రజిత్తు తన యజ్ఞాన్ని మధ్యలోనే ఆపి, రథముపై ఎక్కి హనుమ దగ్గరికి చేరవచ్చాడు. హనుమ ఇంద్రజిత్తుల మధ్య యుద్ధమారంభమైంది.

ఇంతలో విభీషణుడా ప్రదేశానికి లక్ష్మణుని తీసిక వెళ్లాడు. అక్కడ నల్లటి మఱ్ఱి చెట్టును చూపాడు. అక్కడ ఇంద్రజిత్తు భూతబలిని పెట్టి హోమాన్ని పూర్తి చేస్తే ఇంద్రజిత్తు అజేయుడవుతాడని అందువలన ఇంద్రజిత్తు రథాశ్వాలను, సారథిని చంపి, ఆయన ఆ మఱ్ఱి చెట్టు దగ్గరకు రానీయకుండా యుద్ధం చేస్తే ఇంద్రజిత్తు వధ తప్పదని తెలిపాడు.

హనుమంతుని పరాక్రమం కారణంగా రాక్షస సైన్యము నశించి పోయినందు వలన ఇంద్రజిత్తు హనుమతో పోరాడుతూ, లక్ష్మణ విభీషణులకు కనబడ్డాడు.

తన యజ్ఞము విఘ్నము కావడానికి ముఖ్య కారణమైనవాడు విభీషణుడని గ్రహించిన ఇంద్రజిత్తు తన పినతండ్రిని "కులద్రోహి" అని నిందించాడు. తన వారిని విడిచిపెట్టి శత్రువులకు దాస్యము చేయడానికి సిగ్గులేదా? అని అడిగాడు. శత్రుపక్షంలో చేరి, తన పక్షాన్ని నశింప జేసికొన్నవాడు చివరకు శత్రుహస్తంలోనే నశించిపోతాడని హెచ్చరించాడు.

విభీషణుడా మాటలు విని "ఇంద్రజిత్తూ! నీవు పాపకార్యాచరణలో నీ తండ్రి అంతటి వాడివి! నన్ను మొదటి నుండి చూస్తున్నావు కదా? నెనెప్పుడైనా ఏ అధర్మకార్యాన్నైనా ఆచరించానా? నాకు ధర్మమే స్వపక్షము. అది ఆచరించిన వారే నా వారు.

అంతేకాని ఎన్నిసార్లు ధర్మప్రబోధం చేసినా మూర్ఖంగా పట్టించుకోని నీవు, నీ తండ్రి నావారు కాదు.

ఈ రోజు నన్ను "పినతండ్రిగా ఉండి కూడ వంశ నాశకుడ"ని నిందిస్తున్నావే? ఆనాడు నీ తండ్రికి ధర్మము ఉపదేశించిన నన్ను పినతండ్రిగా గౌరవించావా?" పిరికి పంద" అని నన్ను చూచి పరిహసించావే?

నన్ను "అన్నను విడనాడిన అధర్మ పరుడవ"ని నిందిస్తున్నావే? నన్ను తమ్ముడని కూడ చూడక ధర్మము చెప్పినందుకు మొత్తము సభలో అవమానించి, బహిష్కరించిన మీ తండ్రి నా అన్నగా వ్యవహరించాడా? నీవు కొడుకుగా వ్యవహరించావా? "నేను

బలవంతుడని, బ్రహ్మావరప్రసాదిని" అని గర్వించావే తప్ప ఎన్నడైనా ధర్మాధర్మాలను పట్టించుకొన్నావా?

ఇప్పుడు నీకు ఆయువు మూడింది. లక్ష్మణుని చేతిలో నీకు మరణము తప్పదని విభీషణుడు తెలిపాడు.

ఇంద్రజిత్తు విభీషణుని మాటలు పట్టించుకోక లక్ష్మణుని వైపు తిరిగి ఆయనను బెదిరించసాగాడు.

"లక్ష్మణా! ఆనాడు నాగపాశబద్ధుడవై నా చేతిలో దాదాపు చనిపోయావు. నేనెప్పుడు యుద్ధానికి వచ్చినా నా చేతిలో వివశుడవయ్యావు. ఇప్పుడు నన్నెదిరించడానికి వచ్చావా? అప్పుడు అదృష్టవశాత్తు మృత్యు ముఖం నుండి బయట పడ్డ నీవు, నా చేతిలో ఇప్పుడు యమపురికి వెళ్లాలని వచ్చావా?" అని ఆయనను భయపెట్టాడు.

అప్పుడు లక్ష్మణుడు "రాక్షసాధమా! దొంగగా దాగి దండి యుద్ధం చేయడం వీర లక్షణమా?" అని ప్రశ్నించాడు.

లక్ష్మణునికి ఇంద్రజిత్తుకు మధ్య యుద్ధము మొదలైంది.

ఇంద్రజిత్తు పదునైన బాణాలను లక్ష్మణునిపై ప్రయోగించాడు. వాటివలన సౌమిత్రి రక్తసిక్తుడయ్యాడు.

ఇంద్రజిత్తు దానివలన ఉత్సాహము చెంది, "లక్ష్మణా! నీ కవచాన్ని త్రుంచి, నీ విల్లును విరచి నీ తలను తెగ నరకగా రాముడు చూచుగాక" అని పలికాడు.

లక్ష్మణుడు ఇంద్రజిత్తు మాటలను లక్ష్యపెట్టక రాక్షసుని వక్షంలో నిశిత బాణాలను నాటాడు. ఇంద్రజిత్తు ఆ బాణాలతో అమితంగా బాధపడ్డాడు.

వారిద్దరి మధ్య యుద్ధము భయంకరంగా సాగింది. వారి యుద్ధము ఇంద్ర వృత్రాసుర మహా సంగ్రామాన్ని మరిపించింది.

క్రమంగా సౌమిత్రి శౌర్యము పెరిగింది. లక్ష్మణ బాణాల దెబ్బను ఓర్చుకోజాలక, ఇంద్రజిత్తులో భయ లక్షణాలు కనపడసాగాయి. విభీషణుడు ఇంద్రజిత్తు ముఖము కళావిహీనము కావడాన్ని గ్రహించాడు. యుద్ధాన్ని తీవ్రతరం చేయుమని లక్ష్మణునికి తెలిపాడు.

లక్ష్మణుడు మరింత పదునైన శరాలను ప్రయోగించాడు. వాటి దెబ్బలను తట్టుకోలేక ఇంద్రజిత్తు మూర్ఛిల్లాడు. కొంతసేపటి రాక్షస వీరుడు తెలివికి వచ్చాడు.

ఇంద్రజిత్తు ప్రయోగించే బాణ పరంపరను సౌమిత్రి సులభంగా ఖండించాడు.

లక్ష్మణుడు ఇంద్రజిత్తు తొడుగుకొన్న బంగారు కవచాన్ని ముక్కలు ముక్కలు చేశాడు.

ఇంద్రజిత్తు కోపంతో లక్ష్మణుని కవచాన్ని ఖండించాడు. ఇద్దరు సమాన పరాక్రమంతో పోరాడుతున్నారు. వారి బాణాలు ఆకాశమంతా నిండిపోయాయి.

వారి అరుపులు మేఘధ్వనులను తలపించాయి. వారి బాణాలు దర్భలయ్యాయి. వారిద్దరు సమరయజ్ఞంలో రెండు అగ్నులవలె వెలిగారు.

విభీషణడొకవైపు లక్ష్మణుని, మరొకవైపు కపివీరులను ప్రోత్సహించసాగాడు. తాను, తన నలుగురు మంత్రులు ఇంద్రజిత్తు సైన్యాన్ని వధించసాగారు.

"ఇంద్రజిత్తు ఒక్కడే రాక్షస సైన్యంలో మిగిలిన వీరుడని, ఆయన చస్తే రావణుని పరివారము మొత్తము నశించినట్లే" అని తెలిపాడు. "కుంభకర్ణుడే బ్రతికి పోలేదు. ఇప్పుడు ఇంద్రజిత్తెంతటి వాడని?" అని వానర వీరులకు ధైర్యాన్ని నూరిపోశాడు.

"తాను స్వయంగా ఇంద్రజిత్తును సంహరించగల వాడినే అని, అలా చంపడం అధర్మము కూడ కాదని, కాని పుత్ర ప్రేమతో తన కళ్లు బాష్ప పూర్ణాలవుతున్నాయని, అందువలన తాను స్వయంగా ఇంద్రజిత్తుతో సమరం చేయలేక పోతున్నాన"ని తెలిపాడు.

"లక్ష్మణుని చేతిలో ఇంద్రజిత్తు వధ తప్పదని, అంత వరకు వానర వీరులు ఊరుకోక రాక్షస సైన్యాన్ని సంహరించాలని" సూచించాడు. విభీషణుని మాటలకు కోపించిన మేఘనాదుడు అతనితో పోరాడదలిచాడు. కాని ఈ మధ్యలో లక్ష్మణుని బాణాగ్ని రాక్షస సైన్యాన్ని దహించి వేయడాన్ని చూచి మళ్లీ లక్ష్మణుని వైపు మరలాడు.

మేఘనాద–సౌమిత్రుల మధ్య సమరము అంతకంతకు ఘోర రూపాన్ని ధరించింది.

వారి బాణ వర్షాల కారణంగా వారిద్దరు వర్షకాల సూర్యచంద్రుల వలె బయటి ప్రపంచానికి కాన రాకుండా పోయారు.

ఎవ్వరెవ్వరిపై ఎప్పుడే విధంగా బాణాలను వేస్తున్నారో ఎవ్వరికి తెలియలేదు. కాని వెలువడే బాణాలు, ఢీకొనే బాణాలు, పడిపోయే బాణాలు సర్వము బాణమయంగా గోచరించింది. బాణాలు నిండిన కారణంగా అన్ని దిక్కులలో అంధకారము ఆవరించింది. అంతలో హఠాత్తుగా లక్ష్మణుడు ఒక క్రూర బాణంతో ఇంద్రజిత్తు సారథి శిరాన్ని తెగగొట్టాడు. అప్పుడొకవైపు రథాన్ని స్వయంగా నడుపుతూ, మరొకవైపు యుద్ధాన్ని ఇంద్రజిత్తు కొనసాగించాడు. లక్ష్మణుడు రావణపుత్రుని విల్లును ఖండించాడు. రాక్షసుడు

మరొక విల్లును ధరించే లోపు రాక్షసుని గుఱ్ఱాలను చంపి, ఆయన రథాన్ని ముక్కలు చేసి కుప్పజేశాడు.

లక్ష్మణుని అసమాన పరాక్రమానికి వానరవీరులందరు సంతోషించి జయజయ ధ్వనులు కావించారు.

ఇంద్రజిత్తు రథ విహీనుడై రాక్షస సైన్యాన్ని భయంకర సమరానికి పురికొల్పి, శత్రువుల కళ్లుగప్పి లంకలోకి వెళ్లి క్రొత్త రథముతో, అనేకాయుధాలతో తిరిగి వచ్చాడు.

విభీషణునిపై, లక్ష్మణునిపై బాణవర్షాన్ని కురిపించాడు. వాడి బాణ ప్రయోగ వేగానికి రాక్షస సైనికులే కాక లక్ష్మణ విభీషణులు కూడ ఆశ్చర్యము చెందారు.

ఇంద్రజిత్తు వానర సైన్యముపై పడి, చెల్లాచెదురు చేయడం చూచి లక్ష్మణుడు ఒక బాణంతో ఇంద్రజిత్తు విల్లును ఖండించాడు. రాక్షసుడు మరొక విల్లు ధరించాడు. కాని మూడు బాణాలతో దానిని కూడ లక్ష్మణుడు త్రుంచాడు. అయిదు బాణాలను ఇంద్రజిత్తు వక్షంలో నాటాడు. రావణ పుత్రుని కవచము పగిలి ఆయన దేహం నుండి రక్తము కాలువలై ప్రవహించింది.

అయినా వెనుదీయక ఇంద్రజిత్తు లక్ష్మణుని బాణవర్షంలో ముంచాడు. ఆ బాణవర్షాన్ని మధ్యలోనే త్రుంచి, మళ్లీ లక్ష్మణుడు ఇంద్రజిత్తు రథసారథిని చంపాడు.

సారథి చచ్చినా గుఱ్ఱాలు ఇంద్రజిత్తు కనుసైగల మేరకు పరుగెత్తాయి. అందరికి ఆశ్చర్యం కలిగింది. వాటిపట్ల జాలి వదలి లక్ష్మణుడు వాటి గుండెలపై బాణాలు వేశాడు.

ఇంద్రజిత్తు వజ్ర సమానములైన బాణాలతో లక్ష్మణుని కవచాన్ని కొట్టాడు. కాని అది దివ్య కవచము. అందువలన ఇప్పుడది పగులలేదు. (ఇదివరకు లక్ష్మణుడు ధరించింది సామాన్య కవచము. అందువలన అది తెగింది).

ఇంద్రజిత్తు లక్ష్మణుని నొసలును గురి చూచి మూడు బాణాలు వేశాడు. లక్ష్మణుడు కూడ ఇంద్రజిత్తు నొసలును బాధించాడు.

ఇంతలో ఇంద్రజిత్తు మూడేసి బాణాలతో విభీషణుని, వానర వీరులను బాధించాడు.

విభీషణుడు ఆగ్రహించి తన గదతో మేఘనాదుని గుఱ్ఱాలను చంపాడు.

రావణపుత్రుడు నేలపైకి దుమికి విభీషణునిపై ఒక శక్తిని ప్రయోగించాడు. లక్ష్మణుడు దానిని మధ్యలోనే ఖండించాడు. విభీషణుడు మరింత కోపంతో మేఘనాదుని వక్షస్సును మూడు బాణాలతో కొట్టాడు.

అప్పుడాగ్రహంతో రావణ సుతుడు తన పినతండ్రిపై యమదత్తమైన మహాస్త్రాన్ని ప్రయోగించగా, లక్ష్మణుడు కుబేర దత్తమైన మహాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ రెండు మహాస్త్రాలు ఒకదానిని ఒకటి తాకి ఆకాశంలో పెనుగులాడి తునాతునుకలయ్యాయి. తమ అస్త్రాలు వ్యర్థమయ్యాయే అని ఇద్దరు బాధను, కోపాన్ని పొందారు.

లక్ష్మణుని వారుణాస్త్రాన్ని ఇంద్రజిత్తు సూర్యాస్త్రముతో ఖండించాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన "ఆసురాస్త్రాన్ని రౌద్రాస్త్రంతో లక్ష్మణుడు వ్యర్థము కావించాడు.

దేవదానవ, గంధర్వ, కిన్నర, కింపురుషాదులందరు వాటి ప్రభావాలకు తొట్రుపడ్డారు.

తన రౌద్రాస్త్రాన్ని కూడ ఆసురాస్త్రము వ్యర్థము చేయడాన్ని గమనించిన లక్ష్మణుడు తాను వేసే ఎంతటి అస్త్రాన్నైనా ఇంద్రజిత్తు నిర్వీర్యము చేస్తాడని, ఆయన బ్రహ్మాస్త్ర సంపన్నుడని గమనించి లక్ష్మణుడు పూర్వము రాక్షస సంహారము కావించిన, సకల దేవతా పూజ్యమైన, ప్రత్యేకంగా ఇంద్రదత్తమైన "ఐంద్రాస్త్రాన్ని" చేతిలోకి ధరించాడు.

ఆ ఇంద్రాస్త్రాన్ని ఇంద్రజిత్తు ఖండించకుండా ఉండడానికి ఒక అమోఘ ప్రమాణంతో దానిని దుర్భేద్యం చేశాడు.

"ధర్మాత్మా, సత్య సంధశ్చ। రామో దాశరథిర్యది।

పౌరుషే చాప్రతిద్వంద్వః। శరైనం జహి రావణిం"

అని లక్ష్మణుడు అమోఘమైన ప్రతిజ్ఞ చేశాడు.

"రాముడు నిజంగా ధర్మాత్ముడైతే, సత్యవాక్యుడైతే పౌరుషంలో అసమానుడైతే, ఓ శరమా! నీవు రావణసుతుడైన ఇంద్రజిత్తును సంహరించుమని శపథం చేసి ఆ బాణాస్త్రాన్ని ప్రయోగించాడు.

లక్ష్మణుడు చేసిన శపథము అమోఘమైనది. "రాముడు ధర్మాత్ముడు కాడని, సత్యవచనుడు కాడని, అసమాన పరాక్రమశాలి కాడని" ఎవ్వరైనా నిరూపించ గలుగుతారా? అది అసాధ్యము కదా!

ఆ ప్రమాణం చేయకుండా లక్ష్మణుడు ఐంద్రాస్త్రాన్నే కాదు, బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినా కూడా సర్వాస్త్ర విదుడైన ఇంద్రజిత్తు వాటికి ప్రత్యస్త్రము వేసి వ్యర్థము చేయగలిగేవాడు.

ఇప్పుడు లక్ష్మణుడు ప్రయోగించిన "ఐంద్రాస్త్రం" లోని "ఇంద్రశక్తికి" లక్ష్మణుడు

చేసిన శపథం కారణంగా అమోఘమైన శ్రీరాముని సత్య, ధర్మ, పౌరుష శక్తులు తోడయ్యాయి.

అందువలననే ఆ మహాస్త్రం తక్షణమే సూర్యుని కాంతిని కల్గి, శిరస్త్రాణంతో, కుండలాలతో కూడిన ఇంద్రజిత్తు శిరస్సును నేలకూల్చింది.

ఇంద్రజిత్తు వధను చూచి, దేవతలు, వానరులు విభీషణుడు మిక్కిలి సంతోషించారు.

తమ యువరాజు మరణాన్ని చూచి, మిక్కిలి భయగ్రస్తులైన రాక్షస సైనికులు అనేక దిశలకు పరుగెత్తారు. కొందరు సముద్రంలోకి దూకారు. కొందరు జుట్టు ముడులు విడిపోగా కొండలనెక్కారు.

ఇంద్రజిత్తు, కిరణాలతో సహా అస్తమించిన సూర్యుని వలె, చల్లారిన నిప్పు (బొగ్గు) కణిక వలె తేజోవిహీనుడై విగతప్రాణుడై నేలపై పడి ఉన్నాడు.

సూర్యుడు నిర్మల కాంతితో ప్రకాశించాడు. అప్సరసలు ఆనందంతో నాట్యమాడారు. గంధర్వులు గానం చేశారు. దేవతలు పుష్ప వర్షాన్ని కురిపించారు. దిక్కులన్ని చీకట్లు తొలగి వెలిగి పోయాయి. లోకాలన్ని సుఖించాయి.

బ్రాహ్మణులు, మహర్షులు తమ తపో యజ్ఞాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయని సంతోషించారు. దేవతలు, బ్రాహ్మణులు, మహర్షులు గుంపులు గుంపులుగా వచ్చి లక్ష్మణుని ప్రశంసించి ఆశీర్వదించి వెళ్లారు.

సుగ్రీవ, విభీషణ, హనుమ, జాంబవంతులు లక్ష్మణుని అసమాన శౌర్యాన్ని వేనోళ్ల పొగిడారు.

శ్రీరాముడు లక్ష్మణుని విజయవార్తను విని అమితంగా సంతోషించాడు. ఆతనిని బిగ్గరగా కౌగిలించుకొని, తలను వాసన జూచి, దేహాన్ని అంతటిని ఆప్యాయంగా తడిమాడు.

"తమ్ముడా! నీవు చేసిన మేలు అసమానమైనది. ఇక మన సీత మనకు లభించడం ముమ్మాటికి నిశ్చయము!" ఇంకా రావణుడు ఉన్నాడు కదా అంటావా? ఆయన జీవచ్ఛవము. బ్రతికి ఉన్నా శవముతో సమానమే" అని తనివి తీర కౌగిలించుకొన్నాడు.

వైద్యవరుడైన సుషేణుని పిలిచి, "వైద్య శిఖామణీ! మా తమ్ముడు అత్యంత సుకుమారుడు. ఆయన శరీరంలో అనేక బాణాగ్రాలు నాటుకొన్నాయి. వాటిని మెల్లగా వెలికి తీసి గాయాలను మానిపించి ఆరోగ్యవంతుని చేయుమని కోరాడు.

# రావణ విలాపము

ఇంద్రజిత్తు మరణము ఒకే కాలంలో హర్ష శోకాలకు కారణమైంది. సమస్త సుర, నర, వానర కోటికి, సమస్త లోకాలకు అది ప్రమోదాన్ని కలిగించింది.

అయితే లంకలోని సమస్త రాక్షస జాతికి ప్రమాదానికి కారణమైంది. రావణుని మంత్రులకు ఈ వార్త నమ్మశక్యం కాలేదు. అయినప్పటికి వారు నమ్మక తప్ప లేదు.

వారు అత్యంత దుఃఖంతో రాక్షస ప్రభువుకు ఆ దుర్వార్తను తెలియజేశారు.

రావణునికి ఇంద్రజిత్తు పెద్ద కొడుకు, ముఖ్య ప్రాణము. ఇంద్రునితో సహా సమస్త దేవతా కోటికి భయంకరుడు. అటువంటి తన ప్రియకుమారుడు ఇంతవరకు ఏ కష్టాన్ని ఏ ప్రమాదాన్ని ఎదుర్కోలేదు. అపజయానికి ఆయన జీవితంలో చోటు లేదు.

ఎంతటి కష్టసమయాల్లోనైనా తనకు అండగా నిలిచి తనను వాటినుండి గట్టెక్కించిన వాడు. తను ఏ పనిచేసినా సమర్థించిన వాడు, తన ఆజ్ఞను దేనిని అయినా సంతోషంగా స్వీకరించినవాడు, తనను "పున్నామ" నరకం నుండి గట్టెక్కించిన వాడు. తనకు ఊర్ధ్వ లోక క్రియలను జరుపవలసినవాడు. తన ప్రాణానికి ప్రాణమైన ఇంద్రజిత్తు వీరమరణం చెందాడని తెలియగానే రావణుడు వేళ్లు తెగిన మహావృక్షం వలె నేలపై పడి స్మృతి తప్పాడు. చాలా కాలానికి తెలివికి వచ్చి, "కుమారా! నన్ను ఒంటరివాడిని చేసి దూరలోకాలకు తరలిపోయావేమిరా! నీవు లేకుండా పోయావని మన శత్రులందరు సంతోషంతో పండుగ జరుపుకొంటున్నారు.

నీ మరణానికి, రాక్షస స్త్రీలు ఆడ ఏనుగుల వలె భరింపరాని శోకానికి పాలయ్యారు. "నా కొడుకేడీ" అని ప్రశ్నించే మీ తల్లికి, "నా ప్రాణవల్లభుడేడీ" అని ప్రశ్నించే నీ భార్యకు ఏమి సమాధానము చెప్పాలి రా నాయనా?" అని గుండెలు అవిసిపోయేలా దుఃఖంతో పొరలిపొరలి ఏడుస్తున్న రావణ ప్రభువును ఆపడం ఎవ్వరి తరము కాలేదు.

నిజానికి రావణునికి అక్షకుమారుడు చనిపోయినప్పుడు ఏమంత దుఃఖము కలుగలేదు. "తనకు ప్రాణప్రియుడైన ఇంద్రజిత్తు కుమారుడు ఉన్నాడు కదా!" అని అప్పుడు పుత్ర మరణ దుఃఖాన్ని ఓర్చుకోగలిగాడు. కాని ఆ ఇంద్రజిత్తే ఇప్పుడు లేడనే కఠిన సత్యాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నాడు.

అయితే కొంతసేపటికి ఆయన లోని కోపాగ్ని కట్టలు తెంచుకొంది. ఆయనలోని

దుఃఖాన్ని కప్పివేసింది. పండ్లు పటపట కొరికాడు. ఆయన కళ్లు నిప్పు కణికలయ్యాయి. ఆయన సింహంలా ఇలా గర్జించాడు.

"రాక్షసవీరులారా! ఇంద్రజిత్తు లేడనే దిగులు మీకు అక్కర లేదు. ఆయన వీరస్వర్గాన్ని అలంకరించాడు. ఆయన లేనంత మాత్రాన లంకా సామ్రాజ్యలక్ష్మి అనాథ కాలేదు. నేను జీవించే ఉన్నాను.

వేలకొలది సంవత్సరాలు నేను కావించిన కఠిన తపస్సు, బ్రహ్మదేవుని వరబలము, ఆయన ప్రసాదించిన అభేద్య కవచము, అమోఘ ధనుర్బాణాలు, కైలాసపర్వతాన్ని కంపింప జేసిన భుజబలము ఇవన్నీ నాకు శాశ్వతాలు, సహజాలు".

ఇటువంటి నన్ను ఎదిరించడానికి ఇంద్రునికే ధైర్యము లేదు. మానవ మాత్రులైన రామలక్ష్మణులు నా ముందు ఒక లెక్కా? నా ధనుర్బాణాలతో వారి శిరస్సులను సులభంగా ఖండిస్తాను".

రావణుని కోపము రామలక్ష్మణులపై నుండి సీతపైకి మరలింది. "ఈ సమస్త రాక్షస వీర వినాశానికి ముఖ్య కారణము మానవకాంత అయిన సీతే. నా కొడుకు మాయా సీతను కల్పించి, దాని శిరస్సును ఖండించి రామలక్ష్మణులను దిక్కులేని వారిగా దుఃఖింపజేశాడే. ఇప్పుడు నేను నిజమైన సీతాదేవి శిరాన్నే ఖండించి, దానిని రామలక్ష్మణులకు చూపెట్టి, దానితో వారి ప్రాణాలను బలిగొంటాను" అని హుంకరించాడు. తక్షణమే తన క్రూర కరవాలాన్ని తీసికొని తన మంత్రులు అంతః పుర స్త్రీలు వెంబడించగా వివేకశూన్యుడై అశోకవనానికి వెళ్లాడు.

రావణుని ప్రయత్నాన్ని నిలుపడానికి మంత్రులు బంధువులు ఎన్నో రకాల ప్రయత్నించినా ఆయన నిలువలేదు.

రావణుని కోపాన్ని చూచి సీతాదేవి భయంతో కంపించి పోయింది. రక్షాదీక్షితుడైన రామచంద్రుని ప్రియపత్నిని నన్ను వీడు చంపాలనుకొంటున్నాడు.

నన్ను తనకు లొంగలేదని చంపాలని వస్తున్నాడా? లేక మా రామలక్ష్మణులను చంపి వచ్చి నన్ను చంపాలనుకొంటున్నాడా? అయ్యో! నా మూలంగా రామలక్ష్మణులు ఎంతటి దుఃఖాల పాలయ్యారు? ఇప్పుడు నా మూలంగా వారు మరణించారా? లేక తన వారందరు రామలక్ష్మణుల మూలంగా చచ్చారనే కోపంతో వాళ్ళిద్దరిని ఏమి చేయలేక నన్ను చంపాలని వస్తున్నాడా?

హనుమంతుడు చెప్పినప్పుడు ఆయన మాట విని ఆయన వీపుపై ఎక్కి వెళ్లితే ఇన్ని బాధలు ఉండేవి కాదు గదా!

కౌసల్యాదేవి తన కొడుకు తనను వదలి అడవులకు పోవడాన్నే సహించలేదు. ఇప్పుడా కొడుకే లేడంటే భరించి ఉండగలుగుతుందా? అగ్నిని పేల్చుకొని అందులో తనను ఆహుతి చేసి కోదా?

ఈ అనర్థాల కన్నిటికి ఆ దుష్టబుద్ధిగల మందరే కారణము కదా?"

అని పలుపలు విధాలుగా సీతాదేవి దుఃఖింపసాగాంది.

# సుపార్శ్వోపదేశము

రావణుడు వివేక శూన్యుడై సీతాదేవిని చంపాలని ప్రయత్నించడాన్ని సుపార్శ్వుడనే మంత్రివర్యుడు సహించలేదు.

"రావణప్రభూ! నీవెంత గొప్పవాడివి? పదితలలు కలవాడివి. బ్రహ్మ వంశ సంజాతుడివి? సమస్త వేదాధ్యేతవు. కుబేర సహోదరుడవు. నీ కోపాన్ని ఒక ఆడదానిపై తీర్చుకొంటావా? పిచ్చుకపైన బ్రహ్మాస్త్రమా?

లోకాతీతాద్భుత సౌందర్యవతిని, ఇష్టపడి ఇంత దూరము తెచ్చుకొన్న దానిని, నీ ప్రాణాలకంటే ప్రియమైన దానిని, ఎవ్వరిపైన కోపంతోనో చంపుకోవాలనుకోవడం అవివేకం కాదా? ఇదేనా ఆమెపైన నీకుండే అనురాగాతిశయము?

ఇంతచేస్తే నీకు వచ్చేదేమిటి? ఒక్క ఆడదానిని, అబలను సంహరించాడనే శాశ్వత అపకీర్తి తప్ప? అందువలన ఈ పిరికి ప్రయత్నాన్ని మాని, ఈ రోజు సన్నాహాలు చేసి, రేపు యుద్ధరంగానికి వెళ్లి శత్రువును చీల్చి చెండాడు!

సుపార్శ్వుని సలహా రావణునికి నచ్చింది. "అయ్యో! అనవసరంగా నా ప్రాణప్రియను చంపాలనుకొన్నానే? ఒక అబలను సంహరించాననే అపకీర్తిని మూటగట్టుకొనేవాడినే" అని పశ్చాత్తాపం చెందాడు.

రావణుడు వివిధ బలాధ్యక్షులను పిలిచి, వారిని గౌరవించి "వీర వరులారా! మీ రీ రోజు యుద్ధరంగానికి వెళ్లి రామలక్ష్మణులను పట్టుకొని నా ముందుకు తీసిక రండి! లేదా వారిని చంపండి".

"ఈ రోజు మీకది సాధ్యం కాకున్నా రేపు వచ్చి నేను మీతో కలసి రామలక్ష్మణులను సంహరిస్తాను" అని తెలిపాడు.

# మూలబల సంహారము

రావణుని మూలబలము మొత్తము కదలి వెళ్లి వానర బలాన్ని ఢీకొంది. రాక్షసులు కత్తులు, గదులు, శూలాలు మొదలైన ఆయుధాలతో ఎదుర్కొన్నారు. వానరులు చెట్లతో పెద్ద పెద్ద శిలలతో సమాధానము చెప్పారు.

యుద్ధము భయంకరమైంది. తెగిన తలలతో రణభూమి నిండి పోయింది. రక్తము ఏరులై ప్రవహించింది.

శ్రీరామచంద్రుడు తన కోదండాన్ని తీసికొని శత్రు మూకలలో చొచ్చి బాణవర్షంతో వారిని చీకాకు పరిచాడు. రామచంద్రమూర్తి ఎక్కడ చూచినా తానే అయి వీర విహారము చేశాడు. అయితే ఆయన ప్రయోగించే శరపరంపరలు ఆయనను మరగు పరిచాయి. బాణాలు వచ్చి రాక్షసుల శిరస్సులను కూల్చుట చేత, ఆ బాణాలను ప్రయోగించడానికి రాముడు తప్పక ఉండి ఉంటాడనే అనే అనుమానమే రాముని ఉనికికి సాక్ష్యమైంది.

అంతేకాని రాముడెక్కడున్నాడో, ఆయన బాణాలను ఎప్పుడు సంధిస్తున్నాడో, ఎప్పుడు విడుస్తున్నాడో, ఎప్పుడు వైరుల తలలు నరకుతున్నాడో ఎవ్వరికి తెలియకుండా అయింది. నిరంతరమైన రామనామాంకితములైన బాణాల వర్షము శత్రుసేనపై కొనసాగుతూనే ఉంది.

"మనము మన సాధారణ నేత్రాలతో జీవాత్మను చూడజాలము. అయితే ఇంద్రియాల ద్వారా అతడు తినుట, నడచుట, మొదలైన పనులను చేయడం ద్వారా అతడు ఉన్నాడని ఊహించడానికి వీలు ఉంది కదా!"

అలాగే తెగిపడే వైరుల తలల ద్వారా, బాణవర్షాన్ని కురిపించే రాముని ఊహించడానికి సాధ్యమైంది.

శ్రీరామచంద్రుడు యుద్ధమును ప్రారంభించక పూర్వమే వానరులు యుద్ధం చేశారు.కాని ఆయన రణరంగంలోకి దిగాక వారికి ఆ అవసరమే లేకుండా పోయింది.

రామభద్రుడు "గాంధర్వాస్త్రాన్ని" ప్రయోగించాడు. అది మహావేగంగా రాక్షసుల తలలను నరకసాగింది. దాని వలన వారిలో ఒక భ్రమ ఏర్పడింది.

ఆ భ్రమలో ప్రతి రాక్షసునికి ఎదుటి రాక్షసునిలో శ్రీరాముడు కనబడ్డాడు. అందువలన రాముని చంపుతున్నానని ప్రతి రాక్షసుడు ఎదుటి రాక్షసుని చంపడం మొదలైంది.

ఒకవైపు రామ బాణాలు రాక్షసుల తలలను వారి మొండాల నుండి వేరుచేస్తుంటే రెండవ వైపు రాక్షసులు కూడ తమలో తాము ఒకరినొకరు నరకు కోవడం జరిగింది.

జనస్థానంలో కూడ శ్రీరామచంద్రుడు ఇటువంటి అస్త్రాన్నే ప్రయోగించి పదునాల్గువేల మహా రాక్షస వీరులను మూడు గడియలలో మట్టి కరపించాడు.

అటువంటి మహా సంహార శక్తి తనలో మాత్రమే ఉందని, ప్రళయకాలంలో రుద్రుని యందు కూడ ఉంటుందని రామభద్రుడు సుగ్రీవ, విభీషణ, హనుమ, జాంబవదాదులను పిలిచి తెలిపాడు.

ఒక గంటన్నర కాలంలో రాక్షస మూల బలమంతా భస్మమై పోయింది.

# రాక్షస స్త్రీ విలాపము

శ్రీరామభద్రుని చేతిలో మూలబలమంతా నశించిపోయింది. ఆ యుద్ధంలో దూరంగా ఉన్న కొద్ది మంది మిగిలారు. వారు లంకకు పరుగెత్తి వెళ్లి ఆ ప్రళయ వార్తను తెలిపారు.

లంకలోని రాక్షస స్త్రీ లోకమంతా భర్తలను కోల్పోయి, తండ్రులను కోల్పోయి, సోదరులను, కొడుకులను కోల్పోయి, బిగ్గరగా రోదించసాగింది.

అందరు జరిగిన చరిత్రనంతా తలుచుకొని రావణ పరివారాన్ని నిందింపసాగారు.

ముసలిది! వికృతమైన ఆకారము కల శూర్పణఖకు తనకంటె చాల చిన్నవాడు, తన కొడుకు వయస్సువాడు, సుందర సుకుమార శరీరుడైన శ్రీరాముని చూచి కామవికారము కలుగాలా? ఎవ్వరైనా వింటే నవ్విపోరా? కామ విహారానికైనా వయస్సు, ఎదుటి వారి ఇష్టాలతో పనిలేదా? ఇటువంటి వికార బుద్ధిని గురించి ఇదివరకెప్పుడైనా విన్నామా?

ఖర దూషణ, త్రిశరస్కులతో కూడిన పద్నాల్గు వేల రాక్షసులు ఆ ముసలిదాని వికార చేష్టలను ఆమోదించాలా? వాళ్ల కెందుకు ఆ దుర్బుద్ధి కలిగింది? కొందరైనా అడ్డగించకూడదా ఆ దుష్కృత్యాన్ని?

పదునాలుగు వేల భయంకర రాక్షసులను మూడు గడియలలో మట్టుబెట్టిన రాముని పరాక్రమము రావణాదులకు ఎందుకు అర్థం కాలేదు?

శూర్పణఖ మాటలు విని దాని దుష్ట బుద్ధికి తగిన శిక్ష లభించిందని ఊరుకోక,

"స్త్రీ బుద్ధిః ప్రళయకరీ" అన్న సూక్తిని గమనించక, సీతాపహరణానికి రావణుడెందుకు పూనుకోవాలి? మారీచోపదేశాన్ని ఎందుకు పెడచెవి పెట్టాలి?

లంకకు వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు సీత రావణుని కన్నెత్తి చూడలేదే? విభీషణుడు మొదలైన పెద్దలు ఆమెను శ్రీరామునికప్పగించుమని వేల విధాల చెప్పారే? అయినా రావణుడు ఎందుకు తన మూర్ఖత్వాన్ని వదులుకోలేదు?

విరాధ, కబంధాది మహాబలవంతులైన రాక్షసులను సంహరించిన శ్రీరామచంద్రుని అసామాన్య బలాన్ని రావణుడెందుకు గ్రహించలేదు?

స్వయంగా తననే బంధించిన మహాబలశాలి అయిన వాలిని ఒకే బాణంతో సంహరించి సుగ్రీవునికి శ్రీరాముడు పట్టాబిషేకం చేసినప్పుడైనా శ్రీరాముని బలాన్ని రావణుడు అర్థం చేసికోకూడదా?

విబీషణునికి సముద్రతీరమందే పట్టాభిషేకం జరిగిందని తెలిసినప్పుడు, సేతువును బంధించి, సముద్రాన్ని అవలీలగా దాటి వచ్చినప్పుడైనా శ్రీరాముని మానవాతీత శక్తి రావణునికి అర్థం కాలేదే?

కుంభకర్ణుడు, అతికాయుడు, చివరకు తన కంటె పరాక్రమవంతుడైన తన ముద్దుల పెద్ద కొడుకు అయిన ఇంద్రజిత్తు మరణం తరువాత కూడ రావణుని దుర్బుద్ధిలో మార్పు రాకూడదా?

లంకానగరమంతా ఏడుపులతో ప్రతిధ్వనిస్తు ఉంటే రావణుడేమో తన వరబలాన్ని చూచుకొని మురిసిపోతున్నాడా? రాక్షసుల మూల బలాన్నంతా మూడు గడియలలో మట్టుబెట్టిన మహాబలవంతుడైన శ్రీరామచంద్రస్వామి ముందు రావణుని వరబలమేపాటిది?

ఇవన్ని చూస్తుంటే శ్రీరాముడు మానవమాత్రుడుగా కనబడుతున్నాడా? సామాన్యుని బుద్ధికి కూడ అతడు భగవంతుడని అర్థం కావడం లేదా?

రావణుడు తనకు చావురాకుండా వరాలు కోరుకొన్నప్పుడు మానవులను ఎందుకు వదలి పెట్టాడు? అప్పుడు వదలిపెట్టిన మానవుడైన రాముని రూపంలోనే మృత్యుదేవత తన ఎదుట నిలిచిందని ఎందుకు గ్రహించలేదు?

హనుమంతుడొక్కడే వచ్చి లంకానగరాన్ని మొత్తము కాల్చి వెళ్లినప్పుడైనా, ఆయన శ్రీరాముని బలాన్ని వివరించినప్పుడైనా రావణునికి వివేకోదయము ఎందుకు కాలేదు?

ఇదంతా మన దురదృష్టము, మన వాళ్ల దురదృష్టము, దుష్ట ప్రభువును సేవించిన దురదృష్టము వాళ్లదైతే, వాళ్లను భర్తలుగా, తండ్రులుగా, కొడుకులుగా కలిగి ఉండడము మన దురదృష్టము.

చేయికాలిన తరువాత ఆకులను పట్టుకొన్నట్లు మనమిప్పుడు ఎంత ఏడిస్తేమి లాభము? అని చేతులతో తలలను, కడుపులను బాదుకొంటూ లంకానగర స్త్రీ లోకము భరింపరాని దుఃఖసముద్రములో మునిగి పోయింది.

# రావణుని యుద్ధ సన్నాహము

లంకానగర స్త్రీల హాహాకారాలు, రోదనధ్వనులు రావణుని చెవులలో నిండి పోయాయి. ఆయనకు ఎటు తోచని పరిస్థితి ఏర్పడింది. ఆయనలో ఒకవైపు భయము, మరొకవైపు కోపము కలిగాయి.

తన ముందు నిలిచిన భటులతో మహోదర, మహాపార్శ్వ, విరూపాక్షులను యుద్ధమునకు సిద్ధం కావాలని చెప్పి పంపాడు.

మరుక్షణంలో ఆ సేనా నాయకులు తమ సైన్య బలాలతో ప్రభువు ముందు నిలిచారు. అప్పుడు రావణుడు వారి ముందు వీరాలాపాలను పలికాడు.

"రాక్షస వీరులారా! నా భయంకర బాణాగ్నితో నా బాహుబలంతో ముందుగా రామలక్ష్మణులను నరకివేస్తాను. దానితో నా కోసము పోరు సల్పిన ఖరదూషణాదుల, ప్రహస్త, కుంభకర్ణ ఇంద్రజిదాదుల రుణం తీర్చుకొంటాను.

ఆ తరువాత హనుమ, సుగ్రీవాంగద, జాంబవదాది వానర వీరులను, సమస్త వానర సైన్యాన్ని సంహరిస్తాను. నా బాణమేఘాలతో సూర్యుని కప్పివేసి గుట్టలు, చెట్లు మొదలగు వాటిని కనిపింపకుండా చేస్తాను.

(సూచన:- ముందుగా సామాన్య వానరులు, ఆ తరువాత వీరులు, చివరకు రామలక్ష్మణులు యుద్ధము చేయవలసినవారు.

అలాకాక క్రమాన్ని తారుమారు చేసి రామలక్ష్మణుల నుండి సామాన్య వానరుల వరకు చెప్పడం చేత రావణుని మనస్సులో మనస్సు లేదని, ఆయనలో భయము అయోమయము నిండాయని తెలుస్తున్నది.)

రావణునికి రణరంగానికి వెళ్లే దారిలో అనేక అపశకునాలు ఎదురయ్యాయి. సూర్యకాంతి మాసిపోయింది. ధరణి అదరింది. రక్త వర్షము కురిసింది. రథ ధ్వజముపై గ్రద్దలు వాలాయి. మృగాలు క్రూరంగా అరిచాయి.

గుఱ్ఱాలు మోకాళ్లపై పడిపోయాయి. రావణుని గొంతు బొంగురు పోయింది, ఆయన ఎడమ కన్ను, ఎడమ భుజము అదిరాయి.

అయినా అభిమానధనుడైన రావణుడు అపశకునాలను అలక్ష్యంచేసి యుద్ధభూమికి ముందుకు వెళ్లాడు.

రావణుడు రణరంగంలోకి ప్రవేశిస్తూనే, వానరసేనను భయంకరంగా చీల్చి చెండాడాడు. ఆయన బాణాగ్నికి వానరవీరులు మిడుతలయ్యారు.

వానరులు తలొక దిక్కుకు పారిపోతుండగా రావణుని రథము రామునికి ఎదురుగా పరుగెత్తింది.

కపిసైన్యము కకావికలు కావడాన్ని, గమనించిన సుగ్రీవుడు రాక్షస సైన్యముపై శిలావర్షాన్ని కురిపించాడు. రాక్షసులు వందల వేల సంఖ్యలో శవాలై కుప్పలు కుప్పలుగా పడిపోయారు.

# రాక్షస నాయకులు

సుగ్రీవునెదుర్కోవడానికి విరూపాక్షుడు రథముపై నుండి దిగి ఒక ఏనుగును ఎక్కాడు. భయంకర నాదాన్ని చేస్తూ వానరులను పారద్రోలాడు. సుగ్రీవునిని కూడ అనేక బాణాలతో నొప్పించాడు.

సుగ్రీవుడు విరూపాక్ష వధకై మనస్సులో నిశ్చయించుకొన్నాడు. అక్కడ ఒక మహావృక్షాన్ని పెకిలించి, విరూపాక్షుని గజముపైకి ఎగిరి ఆ వృక్షంతో దానిని చంపివేశాడు.

ఏనుగు నుండి క్రిందికి దుమికి విరూపాక్షుడు ఖడ్గాన్ని, సుగ్రీవుడిపై విసిరాడు. సుగ్రీవుడు క్రోధంతో ఒక శిలను వాడిపైకి వేశాడు. రాక్షసుడు ఆ మహాశిలను తప్పించుకొని సుగ్రీవునిని ఖడ్గంతో బలంగా కొట్టాడు. దానివలన కొంత సమయం సుగ్రీవుడు తెలివి తప్పి పడిపోయాడు. కొద్ది సమయంలోనే లేచి తన పాదాలతో బలంగా విరూపాక్షుని కవచాన్ని పగులకొట్టాడు. తన పిడికిలితో రాక్షసుని తలపై మోదాడు.

రాక్షసుడు దానిని తప్పించుకొని సుగ్రీవుని వక్షముపై కొట్టాడు. దానిని తప్పుకొని విరూపాక్షుని లలాటముపై వజ్రము వంటి అరచేతితో కొట్టాడు. దానితో విరూపాక్షుడు రక్తము కక్కుకుంటూ, కళ్లు ఊడి, ఘోరంగా అరుస్తూ క్రిందబడి ప్రాణాలు వదిలారు.

విరూపాక్షుని వధను గమనించిన రావణుడు తన దగ్గరలో ఉన్న మహోదరుని వానరసేన వధకు ప్రేరేపించాడు.

విరూపాక్షుని వధతో సంతసించిన వానర వీరులు రాక్షస సైన్యముపై విజృంభించారు. వానర విజృంభణను గమనించిన మహోదరుడు వానరులపై బాణవర్షాన్ని కురిపించాడు. వానర వీరులు సుగ్రీవుని ఆశ్రయించారు.

సుగ్రీవుడు ఒక మహా శిలను మహోదరునిపై వేశాడు. ఆ శిలను మహోదరుడు మధ్యలోనే తన బాణాలతో త్రుంచాడు. సుగ్రీవుడొక సాలవృక్షాన్ని పెకిలించి రాక్షసునిపై ప్రయోగించాడు. దానిని కూడ రాక్షసవీరుడు బాణాలతో ఖండించాడు.

సుగ్రీవుడొక పరిఘను చేత ధరించి, రాక్షసుని గుఱ్ఱాలను పడగొట్టాడు. మహోదరుడు ఆ రథాన్ని వదలి ఒక మహాగజాన్ని అధిరోహించాడు. రాక్షసుడు ఒక గదను చేబూని వానర పతిని ఎదిరించాడు.

రాక్షసుడు ప్రయోగించిన గదను సుగ్రీవుడు తన పరిఘుతో ఎదుర్కొన్నాడు కాని గదా దెబ్బతో పరిఘ ముక్కలైంది.

సుగ్రీవుడు ఒక ఇనుప రోకలిని తీసికొని రాక్షసుని గదపైకి విసిరాడు. గద ముసలము ఒకదానితో ఒకటి ఢీకొని విరిగి క్రిందబడ్డాయి.

అప్పుడు వానర రాక్షస నాయకులిద్దరు బాహుయుద్ధానికి పూనుకొన్నారు. ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకొన్నారు.

మహోదరునికి మధ్యలో ఒక ఖడ్గం దొరికింది. సుగ్రీవుడు కూడ ఒక ఖడ్గాన్ని దొరికించుకొన్నాడు. ఇద్దరి మధ్య ఖడ్గ యుద్ధం తీవ్రమైంది.

సుగ్రీవుడు తన ఖడ్గంతో మహోదరుని శిరస్త్రాణాన్ని, కుండలాలతో కూడిన శిరస్సును ఖండించాడు.

ఈ విధంగా సుగ్రీవుని చేతిలో మహోదరుడు కూడ మరణించాడు.

సుగ్రీవుని చేతిలో మహోదరుని మరణాన్ని గమనించిన మహాబలుడైన మహాపార్శ్వుడు కోపంతో వానర మూకను చీల్చి చెండాడు. వానరుల తలలను, "తొడిమల నుండి ఫలాలను గాలి పడగొట్టినట్లు" పడగొట్టాడు.

పలాయనం పాలవుతున్న వానర సైన్యాన్ని చూచి అంగదుడు ఒక ఇనుప రోకలిని తీసికొని మహాపార్శ్వునిపై విసిరాడు. ఆ దెబ్బతో రాక్షసుడు విరిగిన రథముతో, చనిపోయిన సారథితో మూర్ఛాక్రాంతుడై నేలపై పడ్డాడు.

జాంబవంతుడు ఒక మహాశిలను తీసికొని రాక్షసుని గుఱ్ఱాలను సంహరించాడు.

మరుక్షణంలో మహాపార్శ్వుడు తెలివికి వచ్చి జాంబవంత, గవాక్షులను తన బాణాలతో నొప్పించాడు. అంగదునిపై అనేక బాణాలను వేశాడు.

బాణపీడితులైన గవాక్ష, జాంబవంతులను చూచి ఆగ్రహంతో అంగదుడు దగ్గరలో పడి ఉన్న బలిష్ఠమైన ఒక పరిఘను తీసికొని రాక్షసుని ధనుర్బాణాలను పడగొట్టి ఆయన తలపై కొట్టాడు.

ఆగ్రహావిష్టుడైన మహాపార్శ్వుడు పర్వత కఠినమైన గండ్రగొడ్డలిని తీసికొని అంగదునిపై విసిరాడు. దానిని ఉపాయంతో తప్పుకొని అంగదుడు పిడుగువంటి తన పిడికిలితో రాక్షసుని మర్మస్థానము అయిన హృదయాన్ని కొట్టాడు.

ఆ దెబ్బతో రాక్షసుని గుండెలు పగిలి, ప్రాణాలు పోయి భూమిపై పడిపోయాడు.

ఈ విధంగా అంగదుని చేతిలో మహాపార్శ్వుని మరణము సంభవించింది.

సమరానికి వచ్చిన నలుగురిలో ముగ్గురు రాక్షస నాయకులు మరణించడంతో వానరులు సింహనాదంచేశారు. దేవతలు రావణుడొక్కడే మిగిలడం చూచి హర్షధ్వనులు కావించారు.

# రావణ యుద్ధము

తన వెంట వచ్చిన విరూపాక్ష, మహోదర, మహాపార్శ్వులు చనిపోవడం రావణుని ఆగ్రహ పరవశుని చేసింది.

రావణాసురుడు శ్రీరాముని ఒక్కనినే కాక సమస్త వానర సమేతంగా, లక్ష్మణ సమేతంగా సంహరించాలని నిశ్చయించుకొన్నాడు.

సీత అనే ఫలం గల శ్రీరాముడనే మహావృక్షాన్ని, వానర వీరులనే కొమ్మలతో సహా నేల కూలుస్తానని నిర్ణయానికి వచ్చాడు.

తన సారథిని తొందరపెట్టి రథాన్ని తొందరగా పరుగెత్తించాడు. ఆ రథ చక్రాల ధ్వనికి సముద్ర జలము పొంగి భూమిని ముంచెత్తింది.

రావణుడు సమస్త వానర సేనను ఒకే క్షణంలో భస్మము చేయదలచి, తనకు బ్రహ్మ అనుగ్రహించిన "తామసాస్త్రాన్ని" వానర సైన్యముపై ప్రయోగించాడు.

ఆ మహాస్త్రము భయంకరమైన అగ్నిజ్వాలలను కురిపిస్తూ వానర సైన్యాన్ని దగ్ధం చేయసాగింది. భయంతో మిగిలిన వానరులు అన్ని దిక్కులకు పరుగులు తీశారు.

వానర వీరులను రక్షించడానికి రాముడే విల్లందుకొన్నాడు.

# రామరావణ యుద్ధము

ఇంద్రునితో కూడ శ్రీ మహా విష్ణువువలె లక్ష్మణునితో కూడిన శ్రీరామచంద్రుడు వానరులు పడెడు బాధల చూచి ఉన్నతమైన ధనువునెత్తి, తన భార్యాపహారి రావణుని చూచి ఇన్నాళ్లకు దొరికాడని ఆగ్రహముతో వింటినారిని మ్రోగించాడు.

ఆ ధ్వనిని విని రాక్షసులు, వానరులు భయంతో మూర్ఛిల్లారు.

రామలక్ష్మణుల ఎదుట రావణుడు సూర్యచంద్రుల మధ్య రాహువు వలె ఉన్నాడు.

అన్న కంటె ముందు తాను రావణునెదుర్కోదలచి లక్ష్మణుడు రావణునిపై మండుతున్న బాణాలను ప్రయోగించాడు.

రావణుడు వాటిని సులభంగా ఖండించి, లక్ష్మణుని దాటి ముందుకు వెళ్లి రామునిపై బాణ సమూహాన్ని ప్రయోగించాడు. రాముడు ఒకే ఒక బాణంతో ఆ బాణ సమూహాన్ని ఖండించి రావణునిపై బాణవర్షం కురిపించాడు.

రామరావణు లిద్దరు మహావీరులు. పరస్పరము వారు ప్రయోగించే బాణ పరంపరతో ఆకాశము నిండింది. ఆ బాణాలనే మేఘాలతో సూర్యుడు కప్పబడినందువలన చిమ్మచీకట్లు రణభూమిలో నిండాయి. వారిద్దరు ఇంద్ర వృత్రాసురులవలె ఒకరినొకరు చంపాలని కోపముతో పోరాడారు.

రావణుడు రౌద్రాస్త్రమును ప్రయోగించగా, శ్రీరాముడు దానిని అదే అస్త్రముతో ఖండించాడు.

రావణుడు ప్రయోగించిన అసురాస్త్రమును రాముడు ఆగ్నేయాస్త్రముతో ప్రతిఘటించాడు.

రావణుడు మయనిర్మిత రౌద్రాస్త్రాన్ని ప్రయోగించగా శ్రీరామభద్రుడు దేవతలు సైతము ఆశ్చర్యపడేట్లు గాంధర్వాస్త్రముతో నిర్వీర్యము చేశాడు.

రావణుడు కోపముతో పెదవి గొరకికొని, సూర్యాస్త్రాన్ని ప్రయోగించాడు. దానిని రాముడు మామూలు బాణాలతోనే ఖండించాడు.

రామరావణులు కొన్ని బాణాలతో ఒకరినొకరు నొప్పించుకొన్నారు.

లక్ష్మణుడు రావణుని చూచి, తన అన్నకు లేని రథాన్ని రావణుడెందుకు అధిరోహించాలనే ఆగ్రహంతో, రావణుని రథ ధ్వజాన్ని సారథిని ఒకే బాణంతో ఖండించాడు. మరో అయిదు బాణాలతో రావణుని విల్లు విరిచాడు. అదే సమయంలో విభీషణుడు తన గదాయుధంతో రావణుని హయాలను హతమార్చాడు.

రావణుడు రథంపై నుండి నేలపై దూకి తన తమ్ముని చంపుటకు ఒక శక్తిని ప్రయోగించాడు. దానిని లక్ష్మణుడు తన బాణాలతో తునుకలు చేశాడు.

రావణుడు ఆగ్రహోదగ్రుడై మరొక భయంకర శక్తిని ప్రయోగించాడు. ఆ శక్తి అత్యంత శక్తివంతమైంది. లక్ష్మణుడు ఆ శక్తి వలన విభీషణుని ప్రాణాలు పోవడం తప్పదని గ్రహించి, ఆశ్రితుడైన విభీషణుని తప్పక కాపాడాలనుకొని తాను ఆ మహాశక్తికి ఎదురుగా నిలిచాడు.

రావణుడు లక్ష్మణుని అసమానత్యాగాన్ని మెచ్చుకొన్నాడు. కాని రావణుని శక్తి ఎనిమిది గంటలు కలది. మయునిచే నిర్మింపబడి రావణునికి వివాహకాలంలో కానుకగా ఇవ్వబడింది. అసమానశక్తి గలది.

ఆ ఆది ఘంటా శక్తి లక్ష్మణుని సంహరించుటకు రాగా, శ్రీరాముడు లక్ష్మణునికి "స్వస్తి" పలికాడు. దాని వలన ఘంటాశక్తి శక్తి కొంతవరకు తగ్గింది. కాని లక్ష్మణుడు దానితో మూర్ఛిల్లక తప్పలేదు.

లక్ష్మణుని దురవస్థను చూచి శ్రీరాముడు దుఃఖభరితుడయ్యాడు. ఆయన కళ్లు ధారాపాతంగా బాష్పాలను వర్షించాయి. కాని సమరభూమిలో శత్రు సమక్షములో దుఃఖించడం తగదని భావించి, రామభద్రుడు నిగ్రహించుకొని తన దుఃఖాన్ని రావణునిపై దురాగ్రహంగా మార్చుకొన్నాడు.

అప్పుడు వానరుల సమక్షంలో శ్రీరాముడు తన విల్లెత్తి "వానర వీరులారా! ఏ పని కొరకు వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టాభిషేకం చేయించానో, దేని కొరకు మీ అందరిని సమకూర్చుకొన్నానో, దేని కొరకు సముద్రముపై సేతువును నిర్మించానో, ఆ పని ఇప్పుడు నెరవేరబోతున్నది.

సీతాపహర్త, లోక కంటకుడైన రావణుడు మన కళ్లబడ్డాడు. ఇప్పుడు వీడిని విడువను. అయితే మీరు మా తమ్ముడి శరీరాన్ని కాపాడండి" అని తన తమ్ముని హృదయాన్నుండి శక్తిని లాగి దానిని తునాతునకలు కావించాడు. తన తమ్ముడిని కౌగిలించుకొన్నాడు.

రాముడు లక్ష్మణుని కౌగిలించుకొని ఉన్న సమయంలో కూడ రావణుడు శ్రీరామునిపై బాణాలు వేశాడు. రావణుని ఆ అధర్మ యుద్ధం కూడ రాముని కోపగ్రస్తుని కావించింది.

అయితే ఈ పర్యాయము రాముడు వానరులకు విశ్రాంతినివ్వదలిచాడు. "వానరులారా! మీరందరు కొండపైకి ఎక్కి, చెట్ల పైకి ఎక్కి మా యుద్ధాన్ని చూడండి. ఈ ఆకాశంలో సూర్యచంద్రులు ప్రకాశించినంత కాలము, లోకాలు మా మధ్య యుద్ధాన్ని గురించి చెప్పుకొందురుగాక!

ఈ యుద్ధము అతి తీవ్రమయింది. ఈ రోజు రామునో, రావణునో ఎవ్వరో ఒక్కరినే జగత్తులో మీరు చూడగల్గుతారు.

"అరావణమరామంవా। జగద్రక్ష్యథవానరాః"

ఈ రోజు నాలోని 'రామత్వాన్ని' మీరు చూస్తారు" అని వానరుల ముందు ప్రతిజ్ఞ చేసి, విల్లెక్కు పెట్టి, ఏడు బంగారుతో అలంకరింప బడిన బాణాలను రావణునిపై ప్రయోగించాడు.

రావణుడు వాటిని మండుతున్న బాణాలతో, ముసలాయుధాలతో ఎదుర్కొన్నాడు.

ఆ అతిరధుల బాణప్రయోగధ్వనులు ఆ రణ భూమంతా నిండి పోయాయి. వారి నారీ టంకార ధ్వనులు లోకాలకు భయాన్ని కలిగించాయి.

శ్రీరామచంద్రుడు భయంకరములైన బాణాలను వర్షించాడు. వాటి ధాటిని తట్టుకోలేక, గాలిచే కొట్టబడిన వర్షమేఘం వలె, భయంతో రావణుడు పారిపోయాడు.

# శ్రీరాముని దుఃఖము

శ్రీరాముడు, తనను నీడవలె విడువక అనుసరించిన వాడు, తన కొరకు భార్యను, తల్లిదండ్రులను, రాజ్యసంపదలను గడ్డిపోచవలె వదిలినవాడు, సుగుణ సముద్రుడు, ప్రాణప్రియుడు, తన తమ్ముడైన లక్ష్మణుడు కొన ఊపిరితో ఉన్న పామువలె నేలపై బాధతో పొరలడాన్ని చూచి, భరింపలేక పోయాడు.

ఆయన చేతినుండి విల్లు జారి పోతున్నది. మనస్సు మనస్సులో లేదు. దుఃఖము పొంగుకొస్తున్నది. తనకు ప్రాణముపై ఆశ నశిస్తున్నది. ఆయన లేని సీత ఎందుకు? జీవితమెందుకు? రాజ్య మెందుకు?" అనిపిస్తున్నది.

శ్రీరామచంద్రుడు సోదరుని విలువను సుషేణునికి తెలుపసాగాడు.

ఒక వ్యక్తికి భార్య కావాలంటే ఎక్కడైనా, ఎందరైనా దొరుకుతారు. బంధువులు కావాలంటే దొరుకుతారు. కాని లక్ష్మణుని వంటి భ్రాత దొరుకుతాడా ఎక్కడైనా?

భ్రాత అంటే "తమ్ముడు", "ఆప్త మిత్రుడు", "ఆప్తబంధువు". లక్ష్మణుడు కేవలము తమ్ముడే కాదు ఆప్తమిత్రుడు, ఆప్తబంధువు కూడ.

ఇవన్ని కూడ ముఖ్యము కాదు. తన గురించి సౌమిత్రి హనుమతో చెప్తూ "అహమస్య అవరోభ్రాతా గుణైర్దాస్యముపాగతః" అని తెలిపాడు.

తనను తమ్ముడని రామచంద్రుడు అనుకొంటున్నాడు. కాని తన దృష్టిలో తాను "రామదాసుడే"! అదేమిటి తాను రామభద్రునికి తోబుట్టువు కదా? దాసుడెలా అవుతాడు?

శ్రీరామచంద్రుని కల్యాణ గుణాలు అటువంటివి. తనను దాసునిగా మార్చాయి.

దాసుడు స్వామికి పరతంత్రుడు. స్వతంత్రమైన ఉనికి లేదని భావించే వాడు. లక్ష్మణుడు కూడ తాను రామచంద్ర స్వామికి జీవితము ఉన్నంత వరకు పరతంత్రుడనని చెప్పుకొన్నవాడు.

"పరవానస్మి కాకుత్స। త్వయివర్షం శతేస్థితే।

ఇంతకు రామలక్ష్మణులు ఒకే తల్లికి పుట్టినవారు కాదు. అయితే మాత్రమేమిటి? లక్ష్మణుని సౌజన్యమటువంటిది. ఆయన సోదర "అనురాగము" (సౌభ్రాత్రము) అటువంటిది.

"న చతేన వినా నిద్రాం। లభతేచ పురుషోత్తమః"

లక్ష్మణుడు ప్రక్కలో లేకుంటే రాముడు నిద్రపోయే వాడే కాదు. అందుకే శ్రీరాముడు:

"దేశే దేశే కళత్రాణి। దేశే దేశేచ బాంధవాః।

తంతు దేశం న పశ్యామి। యత్రభ్రాతా సహోదరః।" అన్నాడు.

లక్ష్మణుని వంటి సోదర రత్నాన్ని అందించిన శ్రీరామాయణము నిజంగా రత్నాకరమే కదా!

శ్రీరామచంద్రుని దుర్భర దుఃఖాన్ని చూచిన సుషేణుడు అతనిని ఓదార్చ సాగాడు.

"రామభద్రా! నీవు లక్ష్మణుడు మరణించాడనుకొని ఇంతగా దుఃఖిస్తున్నావు. కాని నిజంగా ఆయన మరణించలేదు. "జీవకాంతి" ఆయనలో తొలిగిపోలేదు. గుండె కొట్టు కొంటున్నది. శ్వాస వస్తున్నది. లక్ష్మణుని ఉన్నత వక్షస్థలము క్రిందికి మీదికి కదులుతున్నది.

ఈ లక్షణాలను బట్టి లక్ష్మణుడు మరణించలేదని తెలియడం లేదా? అందువలన అంత దుఃఖము వద్దు. కొద్దిగా ఓర్చుకొమ్మని" సలహా ఇచ్చాడు.

శ్రీరాముని దుఃఖాన్ని కొంతవరకు తగ్గించి హనుమతో హిమవత్పర్వత ప్రాంతానికి వెళ్లి ఓషధీ పర్వతంలోని "విశల్య కరణి", సంధానకరణి" "సంజీవకరణి", "సౌవర్ణకరణి" అనే ఓషధులు తెమ్మని తెలిపాడు.

తక్షణమే వాయువేగ, మనోవేగాలతో హనుమ బయలుదేరి ఓషధీ పర్వతాన్ని చేరుకొన్నాడు. అయితే ఓషధులను వెతికి గుర్తించడంలో ఆలస్యము జరుగకూడదని అనుకొని, ఆ పర్వతము మొత్తాన్ని పెళ్లగించి, బంతివలె దానిని చేతిలో పట్టుకొని లంకలోకి ప్రవేశించి, "సుషేణ వైద్యరత్నమా! ఈ పర్వతంలో నాకు ఓషధులను వెతికే ఓర్పు, నేర్పు లేవు. అందువలన నీవే గుర్తించి గ్రహించుమని" సుషేణుని కోరాడు.

ఆంజనేయుని ఆ అద్భుత కార్యమునకు వానరులు, రాక్షసులు ఆశ్చర్య చకితులయ్యారు.

ఆ నాలుగు ఓషధుల పరిమళాలను పీల్చగానే లక్ష్మణుని శరీరములోని బాణాల ములుకులు ఊడివచ్చి, గాయాలు తొలగి, మళ్లీ పూర్వకాంతి కలిగి పునర్జీవితుడయ్యాడు సౌమిత్రి.

లక్ష్మణుని ఆరోగ్యోత్సాహాలను గమనించిన శ్రీరాముడు, సమస్త వానరులు సుషేణుని వైద్య మహిమను ప్రస్తుతించి, మహాసంతోషభరితులయ్యారు.

లక్ష్మణునితో శ్రీరాముడు "తమ్ముడా! నేనెంత అదృష్టవంతుడను! నా బహిః ప్రాణమైన నిన్ను మళ్లీ ప్రాణాలతో చూడగల్గుతున్నాను.

కాని సోదరా! నా మనస్సంతా విషాదంతో నిండిపోయింది. నా కిప్పుడు రావణ వధపైన కూడ నా మనస్సు లగ్నం కావడం లేదు. నీవు బ్రతికావు. నాకు అది చాలు" అని నిరుత్సాహంగా అన్నాడు.

అప్పుడు లక్ష్మణుడు శ్రీరామునిలో మళ్లీ ఉత్సాహాన్ని, రావణ వధపై మనస్సును లగ్నం చేయించడానికి ప్రయత్నిస్తూ - "అన్నా! నీ అంతటి వాడు ఈ విధంగా నిరుత్సాహాన్ని పొందడం సరి అయిన దేనా? నీవు "రావణాసురుని తప్పక వధిస్తాను. విభీషణునికి లంకా సామ్రాజ్యాన్ని పట్టాభిషేకం చేస్తాను" అని రెండు ప్రతిజ్ఞలు చేశావే? వాటిని నీవు మధ్యలోనే వదలి వేస్తావా?

నీవు ఈ రెండు ప్రతిజ్ఞలు చేసేప్పుడు "మా లక్ష్మణుడు నాకు తోడుగా (జీవించి) ఉంటేనే నా ప్రతిజ్ఞలు నెరవేరుస్తాన"ని చెప్పావా? నా కొరకు, ఒక్క వ్యక్తి కొరకు నీ ప్రతిజ్ఞలనే మార్చుకొంటావా? నీవు ధీరోదాత్తుడివే?

అయినా ఇప్పుడు నీకు అత్యంత ప్రియుడనైన నేను మళ్లీ జీవించానే? నా ఆరోగ్యం కూడ బాగయిందే?

ఇప్పుడు ఈ దశలో కూడ నీవు నిరుత్సాహంతో బాధపడడము న్యాయము కాదు.

రావణుడు నీకు ఒక లెక్కా? ఎన్ని పర్యాయాలు నీ ముందు నిలువలేక పారిపోలేదు? నీ ముందు ఆయన సింహము కళ్ల బడ్డ గజము వంటి (పిరికి) వాడేకదా!

"నీవు ఈ రోజు సూర్యాస్తమయానికి ముందే రావణుని సంహరించుమ"ని హితము పలికాడు.

# రామ రావణుల అంతిమ సమరము

లక్ష్మణుని మాటలు రాముని మనస్సులో కర్తవ్య దీక్షను పెంచాయి.

ఈ మధ్యలో రావణుడు లంకకు పరుగెత్తి వెళ్లి క్రొత్త రథంతో ఆయుధ సంపదతో యుద్ధానికి పునస్సిద్ధుడై వచ్చాడు.

వస్తూనే రామచంద్రునిపై వజ్రము వంటి బాణాలను ప్రయోగించాడు.

రామచంద్రుడు ఆ బాణాలకు దీటుగా బంగారుతో ప్రకాశించే బాణపరంపరను వేసి రావణుని గాయపరిచాడు.

రావణుడు రథముపై నుండి యుద్ధము చేస్తుండగా శ్రీరాముడు నేలపై నిలబడి యుద్ధం చేయడం తగదని భావించి ఇంద్రుడు నూరుగంటలతో ధ్వనిస్తూ, బంగారు రంగుతో ప్రకాశిస్తూ, ఆకుపచ్చని గుఱ్ఱాలతో కూడిన తన రథాన్ని తన సారథి మాతలితో పంపాడు.

అంతేకాక ఇంద్ర ధనుస్సును, అగ్నివర్ణ కవచాన్ని, సూర్యప్రకాశం గల బాణ సమూహాన్ని, మెరపు వంటి శక్తిని రామచంద్రుని సన్నిధికి పంపాడు.

రథస్థుడైన రామునికి రావణునికి మధ్య పోరు భయంకరమైంది.

రావణుడు గాంధర్వాస్త్రాన్ని వేయగా, గాంధర్వాస్త్రంతోనే రాముడు దానిని ఖండించాడు. దైవాస్త్రాన్ని, దైవాస్త్రంతో ఖండించాడు. అప్పుడు రావణుడు రాక్షసాస్త్రాన్ని ప్రయోగించాడు. దానివలన అనేక భయంకర సర్పాలు రామునిపైకి వెళ్లాయి. గారుడాస్త్రంతో శ్రీరాముడు ఆ అస్త్రాన్ని (పాములను) ఖండించాడు.

రావణుడప్పుడు కొంత సమయం వరకు అస్త్ర ప్రయోగాన్ని ఆపి భయంకర బాణ వర్షాన్ని ప్రయోగించాడు. ఆ బాణాలు రాముని, మాతలి దేహాలను బాధించి, కేతువును పడగొట్టి, గుఱ్ఱాలను బాధించాయి.

అప్పుడు సురులు, మునులు, వానరులు రావణుడే గెలుస్తాడనుకొని ఖిన్నులయ్యారు.

ఆ పరిస్థితిని గమనించి, రాముడు ఆగ్రహపరవశుడయ్యాడు. అతని ఎఱ్ఱని కళ్లను, ముడిచిన కనుబొమ్మలును చూచి ప్రకృతి సమస్తము భయపడింది. రాముని భయంకరాకారాన్ని చూచి రావణుడు కూడ భయంతో చలించిపోయాడు.

అయినా వెంటనే రావణుడు సర్దుకొని, ఒక భయంకరమైన శూలాన్ని రామునిపై వేశాడు. అది అష్టగంటా శక్తి. ఇదివరకు లక్ష్మణుని మూర్ఛపడగొట్టినటు వంటిది. సర్వ శత్రు సంహారకమైంది.

దానిని శ్రీరాముడు పదునైన బాణాలతో ఎదుర్కొని తనకు ఇంద్రదత్తమైన అష్ట గంటా శక్తిని ప్రతిగా ప్రయోగించాడు. అప్పుడు ఆ రెండు శక్తుల మధ్య తీవ్రమైన ఘర్షణ కలిగింది. ఆ ధ్వనికి సకల భూతాలు కంపించాయి. ఆ రెండు శక్తులు ఒక దానితో మరొకటి ప్రతిహతమయ్యాయి.

రాముడు వెంటనే తీవ్ర బాణాలతో రావణుని రథాశ్వాలను కొట్టి, రావణుని వక్షాన్ని భేదించి, ఆయన ఫాలభాగాన్ని కొట్టాడు.

రాముని భయంకర బాణాలకు వక్షము చీల్చబడి, రక్తసిక్తుడై రావణుడు బాధపడ్డాడు.

అయినా అగ్నివంటి బాణాలను రావణుడు రామునిపై కురిపించాడు.

ఈ విధంగా రామ రావణులు ఒకరిపై మరొకరు వేసికొన్న బాణాలు అంతట చీకట్లను ఆవరింపజేసి రామరావణులను ఇతరులకు కనపడకుండా చేశాయి.

అప్పుడు రామచంద్రస్వామి రావణుని, "ఓరీ నేను, మా తమ్ముడైన లక్ష్మణుడు కూడ లేకుండా ఒంటరిగా నున్న సీతను దొంగిలించిన పిరికిపందా! నీవు కూడ ఒక వీరుడవా?

సిగ్గులేక పరుల భార్యలను ఆశించే నీచుడా! ఛీఛీ! ఇదిగో ఇప్పుడు నీ దుష్ట కార్యాల ఫలము అనుభవించు. ఇప్పుడు నా కళ్ల బడ్డావు కదరా! కాకులు, గద్దలు నీ శవాన్ని పీక్కొని తృప్తిగా తింటాయి" అని క్రూరంగా నిందించాడు.

శ్రీరామచంద్రస్వామి ముందు సకలాస్త్ర దేవతలు ప్రత్యక్షమై ఆయన ఆజ్ఞ కొరకు ఎదురు చూచారు.

అప్పుడు సీతా శోక విరహ బాధ వలన కలిగిన కోపాన్నంతా ఉపయోగించి భయంకర బాణవర్షాన్ని కురిపించాడు.

ఆ బాణాల తీవ్రతను రావణుడు తట్టుకోలేక పోయాడు. ఆయన యుద్ధభూమిపై స్థిరంగా నిలువలేక పోయాడు. ధనస్సును గట్టిగా పట్టుకోలేక పోయాడు. అనుకొన్న దిక్కులో బాణాలను ప్రయోగించలేకపోయాడు.

రావణుని దుస్థితిని చూచిన, ఆయన రథసారథి తమ రథాన్ని యుద్ధభూమి నుండి మరలించి వేగంగా ఒక ఏకాంత, సురక్షిత స్థలానికి తీసిక వెళ్లాడు.

కొంత సమయానికి రావణుడు తేరుకొని, తాను ఏకాంత స్థలంలోకి తీసిక రాబడినట్లు గ్రహించి సిగ్గుపడి రథసారథిని నిందించసాగాడు.

"సారథీ! నీవేమి పనిచేశావు? యుద్ధంలో నుండి వెనుకకు తెచ్చావా? ఇది ఎంత అవమానకరము! నన్ను పిరికి వాడనుకొన్నావా? పరాక్రమ హీనుడననుకొన్నావా? శత్రు భయంకరుడనన్న నా కీర్తిని గంగలో కలిపావా?

ఒకసారి పారిపోయి వచ్చిన నేను మహాశూరుడనని చెప్పుకొని మళ్లీ సమరానికి వెళ్ల గలుగుతానా?

నీవు సారథివి! యుద్ధంలో రథాన్ని నేను చెప్పినట్లు తోలడమే నీ పని అంతేకాని నాకిష్టము లేని పనిని చేసే అధికారము నీకెక్కడిది?

నీవు నా శత్రువు సౌమ్ముతిని వాళ్లకు కీర్తిని కలిగించడము కొరకు నన్ను సమర రంగాన్నుండి వెనుకకు తీసికవచ్చావా? నీవు నాకు మిత్రుడివా? శత్రువువా?" అని రక్త నేత్రాలతో రావణుడు సారథిని నిలదీశాడు.

సారథి రావణుని కోపానికి భయపడ్డాడు. కాని వెంటనే తన ప్రభువుకు నచ్చచెప్ప సాగాడు:-

"మహారాజా! నేను మీ సేవకుడను. మీ ఉప్పు తిన్న వాడను. మీకు ద్రోహాన్ని కలలోనైనా తలపెట్ట గల్గుతానా? మీకు అవమానం కలుగాలని మనస్సులో కూడ అనుకోగల్గుతానా?

మీరు శ్రీరాముడు వేసిన బాణాలకు తట్టుకోలేక పోయారు. పూర్తిగా అలసి పోయారు. ఇంకా అక్కడ ఒక నిమిషమున్నా రామబాణాలు మిమ్ము విగతప్రాణుని కావించేవి.

అటువంటి పరిస్థితిలో "ప్రభువు రక్షణే నా విధి" అనుకొన్నాను. మిమ్మల్ని ప్రమాదం నుండి రక్షించాలనుకొన్నాను.

ప్రభూ! సారథి రథస్థుని మాట వినడం తప్పనిసరి. కాని ఆయన పని గుఱ్ఱాలను తోలడంతో మాత్రమే సరిపోదు.

సారథి కూడ యుద్ధభూమి నంతా పరిశీలించాలి. శత్రువు బలహీనుడైనప్పుడు అయనపై రథాన్ని పరుగెత్తించాలి.

శత్రువు బలవంతుడై, తన ప్రభువు బలహీనుడైనప్పుడు, ఆ శత్రువు నుండి తన ప్రభువును కాపాడుకోవాలి.

ఇది నేనెరిగిన "సారథి విద్యాసారము" దీనిని అనుసరించే నేను "మిమ్మల్ని కాపాడుకోవాలి" అనే కోరికతో యుద్ధానికి దూరంగా రథాన్ని తోలుక వచ్చాను.

ప్రభూ! నా మనస్సు మీకు తెలువదా? నేను శత్రువుల సొమ్ము తినేవాడినా? మీకు అపకారాన్ని తలపెట్టేవాడినా? మన్నించండి మహాప్రభూ! దయతో నన్ను అర్థం చేసికొండి మహారాజా!" అని వేడుకొన్నాడు.

రావణునికి కొంత సమయంతరువాత శాంతంగా ఆలోచించాక తన సారథి చర్యలో సమయజ్ఞత కనబడింది. ఆయనకు సంతోషం కలిగింది. సారథికి బహుమానంగా రావణుడు తన చేతి కంకణాన్ని ప్రసాదించాడు.

# ఆదిత్య హృదయము

ఇది శ్రీరామాయణంలో యుద్ధకాండ లోని ఒక ప్రధాన ఘట్టము. సారథి రావణాసురుని రణభూమి నుండి ఏకాంత ప్రదేశానికి తీసికవెళ్లిన తరువాత రావణుడు తేరుకొని యుద్ధభూమికి తిరిగి వచ్చేలోపు జరిగింది.

అగస్త్య మహాముని రాక్షస సంహారం కొరకు శ్రీరామునికి అడవిలో అక్షయ ధనుర్బాణ తూణీరాలను అమోఘమైన ఖడ్గాన్ని ప్రసాదించాడు.

అగస్త్య మహాముని అమోఘతపస్సంపన్నుడు. మహా మహిమ కలవాడు. (1) వింధ్యాచల గర్వాన్ని అణచినవాడు (2) వాతాపి అనే భయంకర రాక్షసుని భక్షించి జీర్ణించుకొన్నవాడు (3) సముద్రాన్ని త్రాగివేసినవాడు అగస్త్య మహాముని.

ఆయన తపో మహిమ చేత శ్రీరాముని కదలికలను నిరంతరము పరిశీలించ గలిగిన వాడు.

"రామరావణ యుద్ధం రామరావణయోరివ" అన్నట్లు "రామ రావణ యుద్ధము" అతి భయంకరంగా సాగిపోతున్నది. ఒక్కొక్కప్పుడు రాముని అద్భుత పరాక్రమము కొట్టవచ్చినట్లు కనబడుతున్నది. వెంటనే రావణుడు తేరుకొని అగ్నివంటి బాణాలను వర్షిస్తున్నాడు.

ఇంతవరకు విజయమెవ్వరిదో అపజయమెవ్వరిదో ఎవ్వరికి తెలియకుండా వుంది.

ఋషులు, సురులు, భూసురులందరు రావణ వధను తీవ్రంగా కోరుకొని "రామాయ స్వస్తి" అని అంటున్నారు. తక్షణమే "విజయము రావణునే వరిస్తే, తమ గతి

ఏమవుతుందో?" అనే భయంతో రాక్షసులతో కలసి "రావణాయ స్వస్తి" అని కూడ అంటున్నారు. అటువంటి "ఊగిసలాడే" స్థితిలో రావణాసురుడు తీవ్రంగా దెబ్బలు తిన్న స్థితిని చూచి ఆయన సారథి తన ప్రభువును ఒక సురక్షిత స్థానానికి తీసిక వెళ్లాడు.

మరోవైపు ఆ యుద్ధ తీవ్రతకు శ్రీరాముడు కూడ బాగా అలసిపోయాడు. "ఏ విధంగా రావణుని హతమార్చాలా" అని ఆలోచనలో పడిపోయాడు. అటువంటి సమయంలో దేవతా సమేతుడై అగస్త్య మహర్షి శ్రీరాముని దగ్గరకు వచ్చి ఆయనలో ధైర్యోత్సాహాలను నింపడానికై "ఆదిత్య హృదయమనే" మహా స్తోత్రాన్ని ఉపదేశించాడు.

ఈ స్తోత్రము మన అందరికి కంటికి కనబడే సూర్యభగవానునికి సంబంధించినది. సమస్త ఆపదలను నివారించేది. సకల శత్రువులను సంహరించి, విజయాన్ని కలిగించేది. లోతుగా చూస్తే సూర్యాంతర్యామి అయిన పరమాత్మకు సంబంధించింది.

శ్రీరామాయణ రచనాకాలం నుండి ఇది ఈనాటి వరకు లక్షలాది పాఠకుల కష్టాలను తొలగించి వారికి మనోరంజకమైనది. ఈ స్తోత్రము అత్యంత ప్రభావ భరితమైంది.

అందువలన ఈ స్తోత్రాన్ని పారాయణానికి అనుకూలంగా మూలాన్ని (సంస్కృత శ్లోక రూపంగానే) పాఠకులకు అందించడంజరుగుతున్నది. మూలము మొత్తము అయిన తరువాత (శ్లోకాలన్నిటి తరువాత) వాటి అభిప్రాయాన్ని తరువాత వివరించడం జరుగుతుంది.

## మూలము: ఆదిత్య హృదయమ్

1. తతోయుద్ధ పరిశ్రాంతం। సమరే చింతయాస్థితం।
రావణం చాగ్రతో దృష్ట్వా। యుద్ధాయ సముపస్థితం॥

2. దైవతైశ్చ సమాగమ్య। ద్రష్టుమ భ్యాగతోరణం।
ఉపాగమ్యాబ్రవీద్రామం। అగస్త్యో భగవానృషిః॥

3. రామ రామ! మహాబాహో। శ్రుణు గుహ్యం సనాతనం।
యేన సర్వానరీవ్ వత్స। సమరే విజయిష్యసి॥

4. ఆదిత్య హృదయం పుణ్యం। సర్వశత్రు వినాశనం।
జయావహం జపేన్నిత్యం। అక్షయ్యం పరమం శివం॥

5. సర్వమంగళమాంగళ్యం। సర్వపాప ప్రణాశనం।
చింతా శోక ప్రశమనం। ఆయుర్వర్ధనముత్తమం ॥

6. పూజయస్వ వివస్వంతం। భాస్కరం భువనేశ్వరం॥
రశ్మిమంతం సముద్యంతం। దేవాసుర నమస్కృతం॥
7. సర్వదేవాత్మకోహ్యేషః తేజస్వీ రశ్మి భావనః
ఏష దేవాసుర గణాన్। లోకాన్ పాతి గభస్తిబిః॥
8. ఏష బ్రహ్మాచ విష్ణుశ్చ। శివః స్కంధః ప్రజాపతిః
మహేంద్రో ధనధః కాలో। యమస్సోమో హ్యపాం పతిః॥
9. పితరో వసవ స్సాధ్యా। హ్యశ్వినౌ మరుతో మనుః
వాయుర్వహ్నిః ప్రజాప్రాణః ఋతుకర్తాప్రభాకరః॥
10. ఆదిత్యస్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్।
సువర్ణ సదృశో భానుః హిరణ్యా రేతా దివాకరః॥
11. హరిదశ్వస్సహస్రార్చిః సప్తసప్తిర్మరీచిమాన్।
తిమిరోన్మథనశ్శంభుః త్వష్టామార్తాండ అంశుమాన్॥
12. హిరణ్యగర్భశ్శిశిరః తపనో భాస్కరోరవిః
అగ్నిగర్భోఽదితేః పుత్రః శంఖశ్శిశిర నాశనః॥
13. వ్యోమనాథస్తమోభేదీ। ఋగ్యజుస్సామ పారగః
ఘనవృష్టిరపాంమిత్రో। వింధ్యవీధీప్లవంగమః॥
14. ఆతపీ మండలీ మృత్యుః పింగళస్సర్వతాపనః
కవిర్విశ్వో మహాతేజా। రక్త స్సర్వ భవోద్భవః॥
15. నక్షత్ర గ్రహతారాణా। మధిపో విశ్వభావనః॥
తేజసామపి తేజస్వీ। ద్వాదశాత్మన్నమోస్తుతే।
16. నమః పూర్వాయగిరయే। పశ్చిమా యాద్రయే నమః
జ్యోతిర్గణానాంపతయే । దినాధిపతయే నమః॥
17. జయాయజయభద్రాయ। హర్యశ్వాయనమోనమః
నమోనమస్సహస్రాంశో।ఆదిత్యాయ నమోనమః॥
18. నమ ఉగ్రాయ వీరాయ। సారంగాయ నమోనమః
నమః పద్మప్రబోధాయ। మార్తాండాయ నమో నమః॥
19. బ్రహ్మేశానాచ్యుతేశాయ। సూర్యాయాదిత్యవర్చసే।
భాస్వతే సర్వ భక్షాయ। రౌద్రాయ వపుషే నమః॥

20. తమోఘ్నాయ హిమఘ్నాయ। శత్రుఘ్నాయామితాత్మనే।
కృతఘ్నఘ్నాయ దేవాయ। జ్యోతిషాం పతయే నమః॥
21. తప్త చామీకరాభాయ। వహ్నయే విశ్వకర్మణే।
నమస్తమోభినిఘ్నాయ। రుచయే లోక సాక్షిణే॥
22. నాశయత్యేషవైభూతం। తదేవ సృజతి ప్రభుః
పాయత్యేష తపత్యేషః వర్షత్యేవ గభస్తిభిః॥
23. ఏషసుప్తేషు జాగర్తి। భూతేషు పరినిష్ఠితః।
ఏష ఏవాగ్నిహోత్రంచ। ఫలంచైవాగ్నిహోత్రిణాం॥
24. వేదాశ్చ క్రతవశ్చైవ। క్రతూనాం ఫలమేవచ।
యాని కృత్యాని లోకేషు। సర్వ ఏషరవిః ప్రభుః॥
25. ఏనమాపత్సు కృచ్ఛేషు। కాంతారేషు భయేషుచ।
కీర్తయన్ పురుషః కశ్చిత్। నావసీదతి రాఘవ॥
26. పూజయస్వైనమేకాగ్రో। దేవదేవం జగత్పతిం।
ఏతత్ త్రిగుణితం జప్త్వా। యుద్ధేషు విజయిష్యసి॥
27. అస్మిన్ క్షణే మహా బాహో। రావణంత్వం వధిష్యసి।
ఏవముక్త్వా తదాగస్త్యో। జగామచ యధాగతం॥
28. ఏతచ్ఛృత్వా మహాతేజాః। నష్టశోకోఽ భవత్తధా।
ధారయామాస సుప్రీతో। రాఘవః ప్రయతాత్మవాన్॥
29. ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వాతు। పరం హర్షమవాప్తవాన్।
త్రిరాచమ్య శుచిర్భూత్వా। ధనురాదాయవీర్యవాన్॥
30. రావణం ప్రేక్ష్య హృష్టాత్మా। యుద్ధాయ సముపాగమత్।
సర్వయత్నేన మహాత్మావధే తస్య ధృతోఽభవత్॥
31. అధ రవిరవదత్ నిరీక్ష్యరామం।
ముదితమనాః పరమం ప్రహృష్యమాణః।
నిశిచరపతి సంక్షయం విదిత్వా।
సురగణమధ్యగతో వచస్త్వరేతి॥

ఇతి శ్రీమద్రామయణే యుద్ధకాండే....
"ఆదిత్య హృదయం నామ" సప్తోత్తర శతతమ స్సర్గః

# ఆదిత్య హృదయ స్తోత్రం భావార్థము

(1) యుద్ధంలో బాగా అలసిపోయి, - శత్రువును గెలిచే చింతతో కూడుకొని, ముందు ఉన్న రావణుని చూచి, యుద్ధానికి సిద్ధమయిన శ్రీరాముని

(2) దేవతలతో సహా యుద్ధాన్ని చూడడానికి వచ్చి పూజ్యుడైన అగస్త్య మహర్షి సమీపించి ఈ విధంగా ఉపదేశించాడు.

(3) "బలశాలీ శ్రీరామా! శత్రువులందరిని గెలిచి యుద్ధంలో విజయాన్ని సాధించుటకు ఉపాయమైన అతిరహస్యమైన, పవిత్రమైన ఆదిత్యహృదయాన్ని" విను.

(4) ఇది పుణ్యమైనది. సకల శత్రువులను నశింపజేసేది. అక్షయమైనది. మహిమకలది. శుభాన్ని కల్గిస్తుంది. జయాన్ని కల్గించే ఈ స్తోత్రాన్ని జపించవలసి ఉంటుంది.

(5) ఇది అన్ని శుభాలకంటే శుభకరమైనది. అన్ని పాపాలను నశింపజేసేది, అన్ని చింతలను, దుఃఖాలను పోగొట్టేది, ఆయుష్యాన్ని పెంచేది. ఉత్తమమైనది.

(6) కిరణములు కలిగి ఉదయిస్తూ, ప్రకాశించే లోకనాథుని, దేవాసురులచే పూజింపబడే సూర్యుని శ్రీరామా! నీవు పూజించు.

(7) ఈ సూర్యుడే సకల దేవతలకు మూలము. తేజస్సుకు, కిరణాలకు నిదానము. ఈయనే దేవాసుర వర్గాలను, లోకాలను తన కిరణాలతో రక్షిస్తాడు.

(8) ఈయనే బ్రహ్మ, విష్ణువు, శివుడు, కుమారస్వామి. ఈయనే ప్రజాపతి, మహేంద్రుడు, కుబేరుడు. ఈయనే కాలస్వరూపుడు. ఈయనే యముడు, సోముడు (చంద్రుడు) వరుణుడు కూడ.

(9) [1]పితరులు, [2]అష్టవసువులు [3]ద్వాదశ సాధ్యులు ఈయనే. (ప్రజలను సృష్టించాలనుకొని బ్రహ్మ తన ముఖం నుండి సాధ్యులను సృష్టించాడు. వీరు మంత్ర శరీరులు. మన్వంతరాలలో కూడ ఉంటారు).

---

1) అగ్నిష్వాత్తాదులు పితరులు 2) ధృవో, ధర, సోమ, ఆపో, వైశ్వానర అనిల, ప్రత్యూష, ప్రభావసులు - 8 వసువులు. 3) మనుః మంత్రః ప్రాణదః చేతయానః వీర్యవాన్, విత్తిః, జయః, నయః, హంసః, నారాయణః, ప్రభవః, విధుః=12 సాధ్యులు.

అశ్వినీ దేవతలు, మరుత్తులు, మనువు కూడ ఈయనే. వాయువు, అగ్ని, ప్రజలు, ప్రాణాలు ఈయనే. ఈయనే ఋతువులను ఏర్పరిచే వాడు. ప్రకాశాన్ని కల్గించేవాడు.

(10) ఆదిత్యుడు, సవితా, సూర్యుడు, ఖగుడు, పూషుడు, కిరణాలు గలవాడు ఈయనే. బంగారు రంగు గలవాడు భానుడు ఈయనే. బంగారు రేతస్సు గలవాడు, పగలును కలిగించేవాడు ఈయనే.

(11) మనస్సును హరించే గుఱ్ఱములు కలవాడు. ("హరతిమనః ఇతి హరిత్" (మందరం) 1049 వేయి వెలుగులు (కిరణాలు) గలవాడు, కాంతిగలవాడు ఈయనే. కలిపురుషుడు ఈయనే. కలి అశ్వవాహనుడు. 'సప్త' పేరుగల సప్తి (గుఱ్ఱము) గలవాడీయనే. (కలి పురుషుని వాహనము సప్త అనే పేరు గల గుఱ్ఱము. ఏకో అశ్వో వహతి సప్త నామా శ్రుతి). ప్రకాశవంతుడీతడే. చీకట్లను పారద్రోలువాడు. సుఖాన్ని కలిగించేవాడు,త్వష్ట (సర్వ ప్రాణులను 'త్వక్షతి' చంపువాడు) మార్తాండుడు అంశుమంతుడీయనే.

(12) హిరణ్యగర్భుడు (సకలజీవ జాతమునకు కారణమైన హిరణ్యమును గర్భంలో కలవాడు). శిశిరుడు (తాపత్రయాలను పోగొట్టేవాడు), వేడిని కల్పించే తపనుడు. భాస్కరుడు, రవి ('రూయతే' సకల దేవతల చేత స్తోత్రము చేయబడువాడు, వేదాలను ఉపదేశము చేయువాడు (రౌతి) ఈయనే.

అగ్నిగర్భుడు (పగలు అనే అగ్నిని, కాలాగ్నిని గర్భంలో గలవాడు) అదితి పుత్రుడు శంఖుడు (ఖం = ఆకాశములో సుఖాన్ని ఇచ్చేవాడు) చలిని పోగొట్టే వాడు ఈయనే.

(13) ఆకాశప్రభువు, చీకటిని భేదించేవాడు. ఋక్, యజుస్సామవేదముల సారము ఈయనే. గొప్ప వర్షాన్ని కలిగించేవాడు. జలములకు మిత్రుడు, దక్షణాయనంలో వింధ్యాపర్వత వీధులలో పడవవలె సంచరించువాడీయనే.

(14) పూర్ణ తపోమయుడు, అలంకార మండితుడు, (అలంకారములచే అలంకరింపబడేవాడు) విరోధినాశకుడు (మృత్యుస్వరూపుడు), పచ్చని కిరణములు (ఉదయ సమయములో) గలవాడు, అందరిని తపింపజేసేవాడు ఈయనే. నక్షత్రములకు గ్రహాలకు, తారకలకు ప్రభువు, విశ్వభావనుడు (జగత్తు గురించి భావన చేయువాడు) ఈయనే.

(15) సర్వశాస్త్ర విద్వాంసుడు. విశ్వనిర్వాహకుడు, తేజస్సులన్నిటికి తేజస్సు, అందరి పట్ల ప్రేమగల వాడు, సర్వప్రాణులకు కారణము ఆయనే. ద్వాదశ సూర్యులకు మూలము ఆయనే. ద్వాదశమాసరూపుడాయనే.

(16) తూర్పుకొండ (ఉదయ సమయంలో) పడమటి కొండ (అస్తమయ వేళలో) కలవాడు. కాంతిగల వస్తువులకు అధిపతి, పగలుకు ప్రభువు ఆయనే.

(17) జయస్వరూపుడు, మంగళస్వరూపుడు, హర్యశ్వుడు (వానర వాహనుడు రామావతార సూచన లేక శ్యామాశ్వుడు) సహస్ర కిరణుడు, ఆదిత్యుడు ఆయనే (స్తోత్ర ములో పునరుక్తి దోషము కాదు).

(18) దుర్మార్గులకు భయంకరుడు, మహావీరుడు, శీఘ్రగామి (సారంగః =శీఘ్రంగచ్ఛతి). పద్మములను మేలుకొల్పువాడు, మార్తాండుడు ఆయనే.

(19) బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపుడు లేదా బ్రహ్మేశానులకు శాశ్వతే (అచ్యుత) శ్వరుడు, సూర్యుడు, ఆదిత్య వర్చసుడు. ఆయనే. ప్రకాశించేవాడు, సర్వ సంహర్త, భయంకర స్వరూపుడాయనే.

(20) చీకటిని పోగొట్టేవాడు, మంచును తొలగించిన వాడు, శత్రువులను సంహరించేవాడు, అపరిమిత మహిమ కలవాడు, కృతఘ్నులను అణిచేవాడు, జ్యోతులకు జ్యోతిస్వరూపుడాయనే.

(21) కాల్చిన బంగారువంటి స్వరూపముగలవాడు. అగ్ని రూపముతో హవ్యమును స్వీకరించేవాడు, సర్వ జగత్కర్త ఆయనే. చీకటిని ఛేదించేవాడు, కాంతిగల వాడు, లోక సాక్షి లేక లోకులు చేయు కర్మలకు సాక్షి అతడే.

(22) సర్వప్రాణులకు ప్రళయకరుడు, అన్ని ప్రాణులకు సృష్టికర్త ఆయనే. తన కిరణాలతో జలాలను పీల్చుకొనేవాడు, అందరిని తపింపజేసేవాడు, వర్షకారకుడాయనే.

(23) అందరు నిద్రిస్తుండగా మేలుకొనేవాడు, అందరిలో అంతర్యామిగా నుండేవాడు. స్వయంప్రకాశ స్వరూపుడు ఆయనే. యజ్ఞ స్వరూపుడు. యజ్ఞ ఫలము కూడ అతడే.

(24) వేదవేద్యుడు. సర్వకర్మల చేత ఆరాధింపబడేవాడు. కర్మఫలప్రదాత ఆయనే. లోకాల్లో ఉన్న కర్మలన్నిటి ప్రభువు ఆయనే.

(25) అన్ని ఆపదలలో, కష్టాలలో, అడవులలో భయంకర పరిస్థితులలో ఈతనిని స్తుతించేవారు ఎప్పుడు చెడిపోరు.

(26) అందువలన రామచంద్రా! దేవదేవుడు జగత్పతి అయిన ఆదిత్యుని ఏకాగ్ర మనస్సుతో పూజించు. దీనిని అనగా ఈ స్తోత్ర రూపమైన మహా మంత్రాన్ని మూడు మారులు జపిస్తే నీవు యుద్ధములో జయిస్తావు.

(27) ఈ క్షణంలోనే మహాబాహూ! రావణుని నీవు వధించగల్గుతావు" అని పలికి అగస్త్యుడు తన చోటుకు వెళ్లిపోయాడు.

(28) మహా తేజస్స్వరూపుడైన శ్రీరామచంద్రుడు ఈ "ఆదిత్య హృదయ" స్తోత్రాన్ని విని నష్ట శోకుడయ్యాడు. ప్రీతితో దీనిని జపించి దృఢ నిశ్చయాన్ని కలిగిన వాడయ్యాడు. మనో నిగ్రహం కలవాడయ్యాడు.

(29) మూడు మారులు ఆచమనము చేసి, పవిత్రుడై ధనుస్సును, వీరత్వంతో గ్రహించాడు. ఆదిత్యుని చూచి, ఆదిత్య హృదయాన్ని జపించి మిక్కిలి హర్షపరవశుడయ్యాడు.

(30) రావణుని చూచి సంతోషంతో అతని ముందుకు వెళ్లాడు. చేయవలసిన మహాప్రయత్నాలను చేసి రావణుని వధ పట్ల నిశ్చయం కలవాడయ్యాడు.

(31) అప్పుడు స్వయంగా సూర్యభగవానుడు సంతోషించి రాముని చూచి, మిక్కిలి సంతోషపరచి, "రాక్షసుని వినాశనాన్ని తప్పక జరుగుతుందని తెలిసికొని, దేవతా గణాల వచనాన్ని, త్వరగా పూర్తి చేయుము"ని తెలిపాడు.

# ఆదిత్య హృదయ ప్రాధాన్యము

"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అనేది ప్రసిద్ధమైన మాట. సూర్యభగవానుడు మనకు ఆరోగ్య ప్రదాత. ఆరోగ్యము వలన ఉత్సాహ బలాలు కలుగుతాయి.

శ్రీరాముడు కూడ రావణునితో పాటు యుద్ధములో బాగా అలసి పోయాడు. రావణుని వధ పట్ల చింతాక్రాంతుడయ్యాడు.

అటువంటి శ్రీరామచంద్రునిలో జవసత్వాలను ధైర్యోత్సాహాలను కలిగించడానికి అగస్త్య మహాముని "ఆదిత్య హృదయాన్ని" ఉపదేశించాడు. అది విని, దానిని పవిత్ర మనస్సుతో జపించి రావణుని వధించడానికి శ్రీరాముడు దృఢచిత్తుడయ్యాడు. అయితే ఆదిత్యుడెవ్వరు(1) ఇంద్రాదుల వలె అదితిపుత్రుడైన ఒక సామాన్య దేవతా? పరమాత్మా? (3) పరమాత్మ కాకుంటే, శ్రీరాముడెందుకంత వినయంతో విన్నాడు?

(1) "సూర్యుడంటే అదితిపుత్రుడు. ఆయన కూడ ఇంద్రాదులవలె దేవతలలో ఒకడు. ఆయన చీకటిని తొలగించేవాడు, తన కిరణాలతో జలాలను పీల్చేవాడు. అందరిని తపింపజేసేవాడు, వర్షాన్ని కలిగించేవాడు" అనుకొంటే నిజంగా ఆదిత్య హృదయము

శ్రీరామునికి అవసరము లేదు. దానివలన శ్రీరామునికి కలిగే లాభమేది లేదు.

ఎందుకంటే దశరథుని పుత్రకామేష్టి యాగసమయంలో దేవతల చేత ప్రార్థించబడి, దశరథ నందనుడుగా అవతరించిన నారాయణుడే శ్రీరాముడు.

"ఏతస్మిన్నంతరే విష్ణురుపయాతో మహాద్యుతిః"
శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః"

అయితే సూర్యార్థంలో ఆదిత్యహృదయం వలన ఉపయోగమేది లేదా రామునికి?

ఉంది శ్రీరాముడు పరమాత్మ అయినా మానవుని గా ప్రకటించుకొని మాధవత్వాన్ని మరుగు పరచుకొన్నవాడు. ఆయన పడగ ముడుచుకొన్న నాగసర్పము.

ఆయన చేసిన పనులు ఒక ఉన్నత మానవుడు చేయదగినవే. అందువలననే సూర్యుని ప్రసాదాన్ని కలిగించే "ఆదిత్య హృదయాన్ని" ఒక మానవుడుగా విని సంతోషించాడు. రావణుని వధ పట్ల దృఢ నిశ్చయానికి వచ్చాడు.

రామునికి "ఆదిత్య హృదయం" పట్ల కలిగిన భక్తిశ్రద్ధలు సకల ప్రాణికోటికి అవసరాలు అనే విషయాన్ని నొక్కి చెప్పుతున్నాయి. తద్వారా "ఆదిత్య హృదయము" సకల మానవాళికి సర్వశుభప్రదమని తెలుస్తున్నది.

(2) పరమాత్మ అంటే సూర్యాంతర్వర్తి అయిన నారాయణుడు. సూర్యనారాయణుడు ఆయనే శ్రీమన్నారాయణుడు.

"య ఏషో2ంతరాదిత్యే హిరణ్మయః పురుషః" అని ఛాందోగ్యోపనిషత్తు అంతరాదిత్య విద్యలో తెలుపుతుంది పరమాత్మ తత్వాన్ని.

ఆ అర్థంలో ఆయన త్రిమూర్తి స్వరూపుడు. బ్రహ్మ శివుల మధ్యలో విష్ణువుగా పరమాత్మ అవతరించాడు. అది ఆయన (పరమాత్మ) యొక్క ప్రథమావతారము. అటువంటి త్రిమూర్తుల స్వరూపాలను తనలో కలిగి ఉన్నాడు సూర్య పరమాత్మ. త్రిమూర్తులలో విష్ణ్వవతారము గురించి "బ్రహ్మేశ మధ్య గణనా త్ప్రథమావతారః" అంటుంది స్మృతి.

"ఏషబ్రహ్మేచ విష్ణుశ్చ శివః" అని సూర్య పరమాత్మ స్వరూపము. అప్పుడు సృష్టి, స్థితి లయాలకు కర్త భానుడు. అలాగే ఆయన సకల జగదంతర్యామి (జీవేషు, పరినిష్ఠితః) అలాగే ఆయన స్వయంజ్యోతి స్వరూపుడు (ఏషసుప్తేషు జాగర్తి)

ఇటువంటి పదాలు ఆదిత్యుని పరమాత్మతత్వాన్ని తెలుపుతాయి.

దీనిని విన్న శ్రీరామచంద్రుడు సూర్యునిలోని పరమపురుష తత్వము తన స్వరూపమే కనుక దానిని వినగానే "పరం హర్ష మవాప్తవాన్" గొప్ప సంతోషాన్ని పొందాడు.

(3) శ్రీరాముడు పరమాత్మ అవతారము అయితే మాత్రమేమిటి? ఆదిత్య హృదయ శ్రవణము వలననే ఆయనకు హర్షము, ధైర్యోత్సాహాలు, దృఢనిశ్చయము జపసత్యాలు, కలిగాయి కదా?

అంటే అవి కలుగడానికి శ్రీరామునికి "ఆదిత్య హృదయము" అవసరం లేదని సంప్రదాయ వేత్తలు తెలుపుతున్నారు.

మన గోదాదేవి – తిరుప్పావై 13వ పాశురంలో "పుళ్లిన్ వాయ్ కొండానై – పొల్లా వరక్కనై కిళ్లి కిళందానై కీర్తిమై పాడిపోయ్" అని శ్రీరామ కృష్ణుల లీలలను వివరిస్తుంది.

"శ్రీకృష్ణుడు బకాసురుని నోటిని చీల్చాడు. శ్రీరాముడు దుష్ట రాక్షసుడైన రావణాసురుని గోటితో చిమ్మి వేశాడు" అంటుంది ఆండాళ్ తల్లి.

అదేమిటండీ? ఆదిత్య హృదయం మహిమ వలన కదా రావణాసురుని శ్రీరాముడు చంపగలిగాడు. ఇంద్రుని రథము, సారథి మాతలి సహకారముతో కదా రాముడు రావణాసురుని చంపగలిగాడు కదండీ" అంటే

శ్రీరాముడికి ఇవేవి అవసరము లేదు. వీటివలన రామునికి లేని శక్తి కల్గలేదు. "కాని రావణాసురుడు మనస్సు మార్చుకొని తనను ఆశ్రయిస్తాడేమో" అనే ఆశతో కొంత కాలము వేచి చూడడానికి ఇవి అవసరమయ్యాయి.

"శ్రీరాముడు మొదలే శత్రువులలో ప్రఖ్యాత వీర్యుడు. ఆయన సహజ వీర్యముతో పాటు, మాతలి, ఇంద్రరథము ఆయనకు లభించాయి. ఆదిత్య హృదయాన్ని విని, జపించడం వలన ఆయనకు మరింత బలము కలిగింది కదా! అందువలన శ్రీరాముని చేతిలో తన వధ తప్పదేమో?" అనుకొని భయపడి రావణుడు తనను (రాముని) ఆశ్రయించు వచ్చునని అనుకొని శ్రీరాముడు వాటిని పొందాడని వ్యాఖ్యాతృ చక్రవర్తులైన "పెరియావాచ్చాన్పిళ్లై" గారు సెలవిచ్చారు.

ఏది ఏమైనా "ఆదిత్య హృదయము" అగస్త్యోపదేశం ద్వారా మానవజాతికి వాల్మీకి అందించిన ఒక మహామంత్ర స్తోత్ర రత్నము.

# రావణవధ

యుద్ధవివశుడైన రావణాసురుడు తన రథసారథి ద్వారా ఒక ఏకాంతపు దేశానికి తీసికపోబడి, కొంత సమయానికి తేరుకొని, మొదట సారథిని యుద్ధం నుండి తనను వెన్నుచూపించి తీసుకువచ్చినందుకు తీవ్రంగా నిందించాడు. కాని తరువాత సారథి భక్తి శ్రద్ధలకు సంతోషించాడు. ఈ మధ్యలో రావణునికి తగినంత విశ్రాంతి లభించింది. తిరిగి సమరరంగానికి రథాన్ని నడుపుమని సారథిని ఆదేశించాడు.

రావణుని రథము మహావేగంగా రామునిపైకి వస్తున్నది. ఆ రథము చాలా ధృఢమైనది. బంగారు రంగుతో ప్రకాశిస్తున్నది. దాని ధ్వజము చాలా ఎత్తుగా ఉంది. దాని నిండా అనేక ఆయుధాలు ఉన్నాయి.

రావణుడు సమరరంగంలో కాలిడుతునే, అనేక బాణాలను వర్షింపసాగాడు.

రామభద్రుడు రావణుని రథాన్ని జాగ్రత్తగా గమనిస్తూ తమ రథాన్ని దానికి ఎదురుగా పరుగెత్తించుమని మాతలిని ఆజ్ఞాపించాడు.

రావణుని రథము అప్రదక్షిణంగా వస్తున్నది. అది రావణునికి అశుభము. అంతేకాదు రావణునికెదురుగా దుమ్ము వ్యాపించింది. అనేక అశుభ లక్షణాలు రావణునికి కనుపించాయి. రావణుని రథముపై రక్త వర్షము కురిసింది. మాటిమాటికి జండాపై గద్దలు వాలాయి. తోకచుక్కలు రాలాయి. పిడుగులు పడ్డాయి. సూర్యకిరణాలు రావణునిపై పడ్డాయి. కాని అవి అనేక రంగులలో విచ్చుకపోయాయి. ఆయన అశ్వాలు బాధతో కన్నీరును కార్చాయి.

అయినా దైత్యాధిపతి ఆ అపశకునాలకు అదిరిపోలేదు. శ్రీరామునిపై బాణావర్షాన్ని కురిపిస్తునే ఉన్నాడు.

శ్రీరామచంద్రుని మనస్సు ఉల్లాసంగా ఉంది. రావణుని తప్పక వధించవలసిందే అనే పట్టుదల పెరిగింది. ఒక తీవ్ర బాణంతో రావణుని రథధ్వజాన్ని రాఘవుడు నేలగూల్చాడు.

రావణుడు కోపించి శ్రీరాముని రథాశ్వాలపై తీవ్ర బాణాలు ప్రయోగించాడు. కాని వాటికి ఆ బాణాలతో ఏ మాత్రము బాధ కల్గలేదు.

రావణుడు బాణాలతోపాటు గదలు, ఇనుప గుదియలు, గొడ్డళ్లు మొదలైన అనేక ఆయుధాలను ప్రయోగించాడు. అవి రామచంద్రుని దివ్య రథాన్ని తప్ప మిగిలిన నేలనంతా ఆవరించాయి.

అంతేకాదు వీలు చిక్కినప్పుడల్లా రావణాసురుడు వానర సేనపై బాణవర్షాన్ని కురిపించాడు.

శ్రీరాముడు కూడ తన కోదండాన్నుండి శరవర్షాన్ని కురిపించాడు. ఆ ఇద్దరు ప్రయోగించిన బాణాలు సహజ ఆకాశాన్ని కప్పివేసి రెండవ ఆకాశము వలె కనిపించాయి.

శ్రీరామచంద్రుడు నాలుగు బాణాలతో రావణుని రథాశ్వాలను బాధించాడు. ఆ బాధతో అతని అశ్వాలు త్రోవదప్పి పరుగెత్తసాగాయి.

రావణడు మిగుల ఆగ్రహంతో శ్రీరాముని బాణాలతో ముంచాడు. మాతలిపై అనేక బాణాలను వేశాడు.

రావణుని బాణాలు రాముని, మాతలిని ఇద్దరిని కూడ ఏ మాత్రము బాధించలేదు.

మాతలిపై బాణాలను ప్రయోగించినందుకు కోపగించి, శ్రీరాముడు కరకు బాణాలతో రావణుని బాధించాడు. అంతేకాదు ఆగకుండా అతనిపై బాణప్రయోగాన్ని కొనసాగిస్తునే ఉన్నాడు.

రావణుడు పరిఘలను, శూలాలను, గదలను గొడ్డళ్లను ప్రయోగించాడు.

రామ రావణుల బాణాలు, ఆయుధాలు భూచక్రాన్ని నింపాయి. "వాటి వలన తమ ప్రాణాలు పోతాయేమో అని సర్వభూతాలు గడగడ వణికాయి."

ఆనాటి నుండి ఈ నాటి వరకు రామ రావణుల యుద్ధముతో సమాన యుద్ధము జరుగనే లేదు.

"గగనం గనాకారం । సాగరం సాగరోపమం। రామ రావణ యుద్ధం । రామ రావణ యోరివ"

"ఆకాశానికి సాటి ఆకాశమే, సముద్రము వంటిది సముద్రమే. రామ రావణుల యుద్ధము రామ రావణుల యుద్ధము వంటిదే" అని సకల దేవతలు, మహర్షులు చెప్పుకొన్నారు.

సమయం గడుస్తున్న కొద్ది శ్రీరామునిలో ఆగ్రహము అధికము కాసాగింది.

ఒక పదునైన బాణంతో రావణాసురుని శిరస్సు ఖండించాడు. మణిమయమైన

మకుటంతో బంగారు చెవి పోగులతో రత్న ప్రచుర కుండలాలతో ప్రకాశించే రావణుని శిరస్సు నేలపై పడింది.

తల తెగగానే బ్రహ్మ వర ప్రసాదంగా మరొక తల మొలిచింది. ఈ విధంగా నూరు తలలు తెగాయి. నూరుతలలు మొలిచాయి.

1) రావణుని పదితలలను పదిమారులు రాముడు నరికాడు. రావణునికి పదిమారులు కొత్త తలలు మొలిచాయని, దీనికి బ్రహ్మవరప్రసాదమనే కారణమని కొందరు వ్యాఖ్యానించారు.

కాదు విశ్రాంతి తీసికొని రావణుడు తిరిగి వచ్చేప్పుడు ఆయన ఒకే తలతో వచ్చాడని మహేశ్వర తీర్థులు వ్యాఖ్యానించారు. ఎందుకంటే మండోదరి భర్త మరణానికి దుఃఖించినప్పుడు రావణునికి అప్పుడు ఒకే శిరస్సు రెండే భుజాలు ఉన్నాయని వాటిని తీసికొనే ఆమె విలపించిందని వారి వ్యాఖ్య.

"ఉధృత్యచబుజౌ కాచిత్

అంకే శిరః కృత్వారురోద"

2) రావణుడు తన తలలను నరుకుకొని బ్రహ్మ దేవుని గురించి తపస్సు చేశాడు. తెగిన తలలు తిరిగి మొలవాలని అప్పుడు బ్రహ్మ అనుగ్రహించాడు. కనుక ఇప్పుడు రావణుని తలలు తిరిగి మొలవడానికే ఆయన అనుగ్రహమే కారణమని కొందరి వాదన.

3) పద్మ పురాణము ప్రకారము దశగ్రీవుని శిరస్సులు తిరిగి మొలకెత్తడానికి శివుని వరము కారణమని తెలుస్తున్నది. "దశగ్రీవస్య చిచ్ఛేద। శిరాంసి రఘునందనః । సముత్థితానిబహుశో। వరదానాత్ కపర్దినః" – (పద్మ పురాణమ్). ఒక్క శిరస్సే నూరు పర్యాయాలు తిరిగి మొలచిందా? లేక పది తలలు పదిమారులు మొలిచాయా? అనే వాదాలలో ఏది సరి అయినదైనా ఇంతవరకు శ్రీరాముని బాణాలు రావణుని తల (ల) ను పూర్తిగా ఖండింపలేదు.

కారణమేమిటో రామునికి అర్థముకాలేదు. తన బాణాలు సామాన్యమైనవి కావు. మారీచుని, ఖరుని, దూషణుని, త్రిశిరస్కుని, విరాధుని, వాలిని, కబంధుని వంటి మహావీరుల శిరస్సులను ఖండించిన తన శరాలు రావణుని శిరస్సు(ల)ను పూర్తిగా ఎందుకు ఖండించలేకపోతున్నాయి.?

మాతలి ఆ కారణాన్ని శ్రీరామునికి వివరించాడు. "మాములు బాణాలు రావణుని ఏమి చేయలేవు. అది వాడి వరబలమే కారణము. అందువలన దానికి దివ్యాస్త్రాలు

కావాలి. అది కూడా సామాన్యాస్త్రముల వలన సాధ్యముకాదు. అస్త్రాలన్నింటికన్న ఎన్నో రెట్లు శక్తివంతమైన బ్రహ్మాస్త్రమే రావణుని హత్యకు సమర్థమైనదని తెలిపాడు.

"రావణుని దగ్గర బ్రహ్మాస్త్రములేదా? దానివలన ఆయన రాముని బ్రహ్మాస్త్రాన్ని నిర్వీర్యము చేయలేడా? అని మరోక ప్రశ్న

రావణుని దగ్గర అది ఉన్నా, లేకున్నా రాముడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము అత్యంత శక్తివంతమైనది. దానిని ఇంద్రుని విజయము కొరకు బ్రహ్మ దేవుడు స్వయంగా నిర్మించి ఇచ్చాడు. ఆ మహేంద్రుడు ఆ బ్రహ్మాస్త్రాన్ని అగస్త్య మహామునికి ఇచ్చాడు. దండ కారణ్యములో అగస్త్య మహర్షి ఆ పరమాస్త్రాన్ని శ్రీరామచంద్రునికి ప్రసాదించాడు.

అందువలన ఆ బ్రహ్మాస్త్రము అసామాన్యమైనది. అత్యంత శక్తివంతమైంది. దానిని అనేక దేవతలు ఆవహించి ఉన్నారు. దాని బరువు మేరు మందర పర్వతముల బరువుతో సమానమైంది. వజ్రమువలె కఠినమైంది. పర్వతాలను కూడ భేదించే శక్తి గలది.

దానిని శ్రీరామచంద్రుడు బ్రహ్మను ధ్యానించి మంత్రపూతంగా ధనుస్సులో సంధించి చెవుల వరకు నారిని లాగి మహాబలంగా ప్రయోగించాడు.

ఆ మహాస్త్రము రావణుని రొమ్మును చీల్చి వాడి ప్రాణాలను సంహరించింది. రావణ సంహారము వలన సమస్తలోకాలు సంతోషించాయి. పతివ్రతలైన పడుచులు, పరువుగల వనితలు తాము అపహరింపబడుతామేమో అనే భయాన్ని, బాధను వీడి తేలికగా ఊపిరి పీల్చుకొన్నారు.

మహర్షులు తమ తపస్సులకు, యజ్ఞయాగాదులకు ఇక విఘ్నాలు తలుగవనే తృప్తిని పొందారు.

దేవతలు తమ పదవులకు, అధికారాలకు ఆటంకాలు ఉండవని, యజ్ఞయాగాదులలో తమకు చెందవలసిన హవిస్సులు తమకే చెందుతాయని నిశ్చింతులయ్యారు.

సమస్త భూతాలు తాము స్వేచ్ఛగా మెదలుకోవచ్చునని స్వేచ్ఛగా గాలిని పీల్చాయి. సురులు మహేంద్రుని చుట్టుముట్టినట్లు హనుమ సుగ్రీవ విభీషణాదులు శ్రీరాముని చుట్టూ చేరి ఆయనను ప్రశంసలలో ముంచారు.

సూచన :– కొన్ని రామాయణాలు "రావణుని కడుపులో అమృత కలశము ఉందని, అందువలన రాముని అస్త్రశస్త్రాలు రావణుని ఏమి చేయలేకపోయాయని, చివరిసారి రాముడు రావణుని శిరస్సును లక్ష్యంగా చేసుకొని ప్రయోగించిన బాణాన్ని, హనుమ ప్రార్థనవలన వాయు దేవుడు వంచి, రావణుని కడుపును చీల్చి వేశాడని అందువలననే రావణుడు మరణించాడని తెలుపుతున్నాయి. కాని వాల్మీకి రామాయణమే సత్యమైనది.

# విభీషణ విషాదము

రావణాసురుని మరణాన్ని చూచి విభీషణుడు దుఃఖావిష్టుడయ్యాడు. నిజానికి విభీషణునికి వ్యక్తిగతంగా ఎన్నడు తన అన్నపై ద్వేషం లేదు. ఆయన ద్వేషించింది రావణుని దుష్కామ ప్రవృత్తిని.

రావణుడు సహజంగా సేచ్ఛా కామ ప్రవృత్తి కలవాడు. ఆయన సీతాదేవితో "పరస్త్రీ గమనము, అపహరణము, బలాత్కారము రాక్షసులకు స్వధర్మమే అంటాడు.

"స్వధర్మో రక్షసాంభీరు। సర్వథైవ నసంశయః

గమనం వా పరస్త్రీణాం। హరణం సంప్రమథ్యవా॥

అయితే రావణుడు ఇదివరకు తెచ్చిన వారిలో చాలా మంది రావణుని ప్రేమించినవారే. అందువలన వారివలన రావణునికి, రాక్షసజాతికి ఏ సమస్యలు కలుగలేదు.

కొందరు రావణుని ఎన్నడు మనసారా ప్రేమించలేదు. అయితే వారు రావణునికి ప్రమాదాన్ని కలిగించేంత శక్తి గలవారు కాదు.

సీతాదేవి బలాత్కరింపబడి, అశక్తులైన ఆ మహిళల పక్షాన ప్రతినిధిగా నిలబడింది. వారిని ఉద్ధరించడానికి నడుము కట్టింది. "బావిలో పడిన తన పిల్లను చూచి ఆగలేక ఈత రాకున్నా తాను కూడ బావిలో దూకుతుంది తల్లి. తమ పరిస్థితిని చూచి ఎవ్వరో కరుణామయులు తమను పైకి తీయకపోతారా అని ఆశతో ఉంటుంది."

సీతాదేవి కూడా అలాగే లంకలోకి ప్రవేశించింది. తనను కాపాడడానికి దయామయుడైన దాశరథి తప్పక వస్తాడని, ఆయన తనకు, తనవలె లంకలో బాధపడే తరుణీ మణులందరికి రావణపీడను తొలిగిస్తాడని నమ్మింది. ఆమె అనుకొన్నట్లే అయింది.

రావణుడు తనను లంకలోకి తెచ్చిననాటి నుండి ఆ తల్లి రాముడినే ధ్యానిస్తూ శోకదేవతగా ఉంది. అయినా రావణుడు తనను ప్రేమించుమని ఆమెను బలవంతం చేస్తూనే ఉన్నాడు. అది విభీషణునికి, చాలమంది బంధు, మిత్రులకు నచ్చలేదు. అయితే వారు విభీషణుని అంతగట్టిగా రావణునికి హితోపదేశం చేయలేదు.

"ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" శ్రీరామునికి సీతాదేవిని అప్పగించుమని ఖచ్చితంగా, మొగమాటం లేకుండా రావణునికి చెప్పాడు విభీషణుడు.

ఫలితంగా లంకనుండి తరిమివేయబడ్డాడు. రాముని (పక్షాన) చేరాడు. దుర్జనులను దునుమాడడంలో రామునికి తోడ్పడ్డాడు. ఇప్పుడు రావణుడు మరణించాడు. ఆయన దుర్మార్గం కూడ మరణించింది. ఇంతవరకు అన్నపై ఉన్న ఆగ్రహం అంతరించిపోయింది. భ్రాతృప్రేమ పొంగెత్తింది. దుఃఖము ఉవ్వెత్తున ఉబికింది.

"అన్నా! అనేక యుద్ధాలతో ఆరితేరిని వాడవు. యుద్ధ విజేతవు. అంతటి మహావీరుడవు ఈ రోజు దిక్కులేని చావు చచ్చావు. మణిమకుటాన్ని ధరించవలసిన శిరస్సు నేలపై తెగి పడింది. దుమ్ముతో నిండిపోయింది. "వేద వేదాంగ విదుడవు, నిన్నెవ్వరు గుర్తుపట్టకుండా తెగిన తలతో నేలకొరిగావు.

"అన్నా! నీ మరణంతో లోకంలో వీరుడనే వాడే లేకుండా పోయాడు" అని వెక్కివెక్కి ఏడ్చాడు.

శ్రీరాముడు విభీషణుని ఓదార్చాడు:- "విభీషణా! వీరమరణం చెందిన నీ అన్నను గురించి నీవు శోకించవలసిన అవసరము లేదు.

యుద్ధమంటేమీ అన్నకు ఒక ఆట. అపజయము పట్ల అనుమానం లేనివాడు. మరణ భయంలేని వాడు. పర్వతమంతటి స్థైర్యము కలవాడు. దేవతలను, ఇతర శత్రువులను గడగడలాడించిన వాడిపుడు వీర స్వర్గమలంకరించాడు." శ్రీరాముని ఓదార్పు మాటలతో కొంత ఊరడిల్లి తన అన్న గొప్పదనాన్ని తెలుపసాగాడు.

"రామ ప్రభూ! మా అన్న రాక్షస జాతికే ఒక అలంకారము.

దేవేంద్రుడు ఎన్ని మారులు ఎన్ని వ్యూహాలు పన్ని దాడి చేసినా ఆయన గర్వాన్ని మహాబలంతో మా అన్న అణచివేశాడు.

రామభద్రా! మా అన్న ఎన్నో ఉత్తమదానాలిచ్చాడు. గురువులను, మహేశ్వరుని నిష్ఠతో కొలిచాడు. తనను ఆశ్రయించిన వారికి కావలసినంత ధనాన్ని ఇచ్చాడు. ప్రతిరోజు అగ్నులను ఆరాధించినవాడు. మహా తపస్వి. వేద వేదాంగవిదుడు.

అయితే కామవ్యవసనపరుడై, హితాహితవిచార శూన్యుడై తనకు రాక్షస జాతికి గొప్పపాపాన్ని మూటగట్టాడు. నీకు అహితము చేసి నీ చేతిలో మరణించాడు. ఇటువంటి వానికి పరలోక క్రియలు చేయాలావద్దా? అని అడిగాడు.

అప్పుడు సర్వభూత హితుడైన సాకేత రాముడు అన్నాడు.

మరణాంతాని వైరాణి। నిర్వృత్తం నః ప్రయోజనం
క్రియతామస్య సంస్కారో। మమాప్యేష యథాతవ॥

## మరణాంతాని వైరాణి

విభీషణా! మనవైరము శత్రువు మరణించే వరకే! నీకు నాకు రావణునితో వైరము ఆయన అధర్మముగా ప్రవర్తించినందుకే.

ఇందులో నన్ను ఆశ్రయించిన మహర్షులను, జనస్థానంలోని తన వారి ద్వారా (ఖరదూషణాదుల ద్వారా) హింసింపచేయుట, సీతాదేవిని అపహరించుట, జటాయువును సంహరించుట, సీతాదేవిని తాను స్వయంగా, తన రాక్షస స్త్రీల ద్వారా తనకు లొంగుమని బాధించుట మొదలైన అధర్మకార్యాలను ఆచరించుట ద్వారా అధర్మంగా ప్రవర్తించి నాకు వైరి అయ్యాడు.

అలాగే నీవు హితం చెప్పినా నీ మాట వినక, నిన్ను దేశబహిష్కృతుని చేసి నీకు శత్రువు అయ్యాడు..

## నిర్వృత్తం నః ప్రయోజనం : -

ఇప్పుడు రావణుడు మరణించాడు. కనుక నీకు నాకు ఇష్టంలేని అధర్మకార్యాలను చేయజాలడు. ఆయన అధర్మ కార్యాచరణ చేయకుండడమే మన ప్రయోజనము. అందువలన ఆయన మరణం ద్వారా మన ప్రయోజనము నెరవేరింది.

## క్రియతామస్య సంస్కారః :-

రావణుడు తన నేరానికి తగిన శిక్షను తన మరణం ద్వారా పూర్తిగా అనుభవించాడు. ఇప్పుడు నేరవిముక్తుడయ్యాడు. అందువలన ఇప్పుడు అంతిమ సంస్కారాలకు అర్హుడే.

## మమాప్యేషయథాతవ :-

ఇప్పుడు నీవు సోదరుడవు. రావణునికి నీవే వారసుడవు. ఆయన పుత్రులందరు మరణించారు. కనుక నీవు తప్పక ఆయనకు పరలోక సుఖానుభవం కొరకు అంతిమ సంస్కారాలను చేయవలసిందే.

ఒకవేళ నీవు నీ పూర్వవైరాన్ని స్మరించుకొని, ఆయనకు ప్రేతకార్యాలు చేయదానికి అంగీకరించకపోతే నీ బదులు నేనే స్వయంగా రావణునికి సంస్కారాలు చేస్తాను.

ఎందుకంటే నీవు నాకు కావలసినవాడివి. అందువలన నీ సోదరుడు నాకు కూడసోదరుడే.

కనుక రావణునికి ప్రేత కార్యాలు తప్పక మనము చేయవలసిందే" అని విభీషణునికి హితోపదేశం చేశాడు.

# రాక్షస స్త్రీ విలాపము

తమ భర్త మరణ వార్తను విన్న ఆయన భార్యలు భరించలేకపోయారు. అంతః పురాన్ని వదలి రణభూమికి పరుగెత్తివచ్చారు.

మరణించిన తమ ప్రియవల్లభుని శరీరంపై పడి ఎలుగెత్తి విలపించసాగారు. వారి జడల నుండి పూలదండలు తెగి నేలపై పడ్డాయి.

వారి కళ్ల నీళ్లు ఎడతెగక కారుతూ కాలువలు కట్టాయి. వారు తమ చేతులతో తలలపై రొమ్ములపై కొట్టుకోసాగారు.

వారి కాళ్లు తడబడుతుండగా, గజరాజు మరణంతో ఆడ ఏనుగలు దఃఖించినట్లు బిగ్గరగా ఏడువసాగారు.

ఒక భార్య తన భర్తను బిగ్గరగా కౌగిలించుకొని తన ప్రేమను ప్రకటిస్తూ ఏడ్చింది.

ఒక పడతి భర్త పాదాలను పట్టుకొని తన భర్త, తనను మక్కువ చేసిన విధానాన్ని జ్ఞాపకం చేసుకొంటూ విలపించింది.

ఒక అతివ తన భర్త కంఠాన్ని కౌగిలించుకొని తన పతి తనను లాలించిన విధానం స్మరించుకొని దుఃఖించింది.

వల్లభా! నీ ఈ మరణానికి నీ కామము కారణము కాదు. దైవమే నిన్ను మానుండి క్రూరంగా దూరము చేసింది.

# మండోదరీ విలాపము

మండోదరి మయుని పుత్రిక. రావణుని పాణిగ్రహణం చేసి కొన్న ధర్మపత్ని.

ఆమె సూక్ష్మ జ్ఞానం గల విదుషీమణి. కార్యాన్ని బట్టి కారణాన్ని గుర్తించగల విశేషజ్ఞురాలు. సమస్యలను లోతుగా అర్థం చేసికోగల విశ్లేషకురాలు.

రామాయణంలో తమ సూక్ష్మజ్ఞానంతో దైవత్వాన్ని దర్శించగల వనితలు కొందరు ఉన్నారు. వారు మానవులలో, వానరులలో, దానవులలో కూడ ఉన్నారు. మానవులలో సుమిత్రాదేవి, వానరులలో తార, రాక్షసులలో మండోదరి ముఖ్యమైనవారు.

అయితే వారు మహిళలు కావడము వలన వారి తెలివితేటలు బాహాటంగా ప్రకాశించలేదు. మండోదరి తెలివిగలదైనా, ఆమె భర్త చండ స్వభావుడు. కనుక ఆమె అభిప్రాయానికి ఆయన విలువ నివ్వలేదు. ముఖ్యంగా సీతాదేవి విషయంలో మండోదరి అభిప్రాయాన్ని రావణుడు మన్నించలేదు.

తన జీవితేశ్వరుడు తనను శాశ్వతంగా వదలి వెళ్లాడని తెలిసికొన్న మండోదరి ఆ విషాదాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఆమె శ్రీరాముని గురించి విన్నది. "తండ్రి మాటను తల దాల్చి, రాజ్యాన్ని, రాజ్య సౌఖ్యాలను త్యాగం చేసిన ధర్మమూర్తి" అని గ్రహించింది.

"జనస్థానంలో ఖరదూషణ త్రిశిరసమేతంగా చతుర్దశ సహస్ర రాక్షసులను ఒంటిచేత్తో సంహరించాడని తెలియగానే, ఆయన ఒక మహా శక్తివంతుడని నిర్ణయించింది.

రాముడు దూతగా పంపిన ఒక వానరుడు దేవతలు కూడ ప్రవేశించడానికి వీలులేని లంకా నగరంలోనికి శతయోజన విస్తీర్ణమైన మహాసముద్రాన్ని దాటి ప్రవేశించి, వేలాది రాక్షసవీరులను సంహరించి, లంకా నగరాన్ని అగ్నికి ఆహుతి చేసినప్పుడు శ్రీరాముడు మానవమాత్రుడు కాదని నిశ్చయించుకొంది.

ఇప్పుడా రాముడు యముని రూపంలో వచ్చి రావణ మృత్యువుకు కారణమయ్యాడు.

దేవేంద్రుడంతటివాడు రావణుని యుద్ధంలో ఎదుర్కోవడానికి సాహసించడు. ఇప్పుడు శ్రీరాముడు సంహరించగలిగాడంటే ఆయన దేవేంద్రుని కంటే అపరమిత శక్తి సంపన్నుడని అర్థమవుతున్నది. ఇప్పుడు క్రమంగా ఆమె రాముడెవ్వరో గుర్తించ గలుగుతున్నది.

1. వ్యక్తమేషమహాయోగీ! పరమాత్మాసనాతనః
   అనాదిమధ్య నిధనో। మహతః పరమోమహాన్॥

2. తమసః పరమోధాతా। శంఖచక్రగదాధరః॥
   శ్రీవత్స వక్షానిత్యశ్రీః॥ అజయ్యః శాశ్వతోధృవః॥

3. మానుషం వపురాస్థాయ। విష్ణుస్సత్య పరాక్రమః॥
   సర్వైః పరీవృతో దేవైః॥ వానరత్వ ముపాగతైః॥

4. సర్వలోకేశ్వర స్సాక్షాత్। లోకానాం హిత కామ్యయా।
సరాక్షస పరీవారం। హతవాన్త్వాం మహాద్యుతిః

ఏష మహా యోగి:- ఈయన మహాయోగి! యోగమంటే అలభ్యలాభకరము. ఇంతవరకు పొందని లాభాన్ని పొందించేది. అలా పొందించే వాడీయనే.

2. "యోగఃతపః" యోగమంటే తపస్సు - "తప ఆలోచనే" అన్నట్లు తపస్సు ఒక నిరంతర ఆలోచన.

(1 & 2) భగవంతుడు మహాయోగి. ప్రళయకాలంలో కరణ కళేబరాలు లేక అచిత్తువలె కేవల పరతంత్రాలైన జీవాత్మల గురించి విచారించి వారికి ఇంద్రియాలను శరీరాలను తన కృప వలన పొందించడం జీవులకు "అలభ్య లాభము". అటువంటి మహాలాభాన్ని లభింపజేసిన పరమాత్మ మహాయోగి.

(3) "యోగఃతపః- తప ఆలోచనే" యోగమంటే తపస్సు- "తప ఆలోచనే॥ అనే ధాతువును బట్టి తపస్సు అంటే ఆలోచన లేక సంకల్పము.

"సోకామయత॥ తదైక్షత ప్రజాస్సృజాయేత" అంటుంది వేదము -

మహాప్రళయం గడిచిన కొంతకాలానికి పరమాత్మకు సంకల్పము కలగుగుతుంది. ప్రజలను సృష్టించాలని.

"సంకల్పముగల పరమాత్మ - [1]తానే నిమిత్త కారణం [2]"ఆయన సంకల్పమే" సహకారి కారణం

"బహుస్యాంప్రజాస్సృజాయేయ" అన్నట్లు ఆ పరమాత్మ తన శరీరాన్ని (స్వరూపాన్ని) పెంచుకొని "అంతర్బహిశ్చవ్యాప్య" అన్నట్లు ప్రతి వస్తువు లోపల, వెలుపల వ్యాపించడం" ద్వారా కారణం ఉపాదాన ఆయనే.

కారణత్రయము ఆయనే. ఈ కారణ త్రయం తానే కావడానికి తన సంకల్పమే ప్రధాన కారణము. సంకల్పమే యోగము కనుక మహాయోగీ అంటే మహా సంకల్పముగల వాడు అని అర్థము.

పరమాత్మా సనాతనః : - సంకల్పాలు జీవాత్మలకన్నిటికి సహజాలే. అయితే బద్ధుల నుండి నిత్యుల వరకు ఎంతటి జీవాత్మలైనా సృష్టి సంకల్పము చేయజాలరు.

చీమ నుండి చతుర్ముఖ బ్రహ్మ వరకు అందరు బద్ధాత్మలే. వారు అందరు ప్రకృతిలో బద్ధులే.

ముక్తులు ప్రకృతి బంధం నుండి పరమాత్మ కృప వలన బయట పడిన వారు. పరమపదాన్ని చేరుకొన్నవారు.

"నిత్యులు" అంటే మొదటి నుండి పాంచభౌతిక ప్రకృతితో సంబందము లేనివారు. నిరంతరము భగవదానందాన్ని అనందిస్తున్నవారు.

నిత్య ముక్తులు సృష్టిని చేయ సమర్థులే. ఆ సామర్థ్యము వారికి భగవత్కృప చేత లభించింది. అయితే వారు సృష్టికార్యక్రమంలో పాల్గొనక భగవదానందానుభవంలోనే తలమునుకలు అవుతుంటారు.

"జగ ద్వ్యాపార వర్జ్యం"

నిత్యముక్తులకు జగత్సృష్టి వ్యాపారము అనగా సృష్టి స్థితి, లయ కార్యము ఉండదు.

అందువలన జగద్వ్యాపారమును సంకల్పమాత్రంగా నిర్వహించగలిగిన మహాయోగి పరమాత్మే.

సనాతనః- ఆ పరమాత్మ సనాతనుడు. ఎప్పుడు ఉండేవాడు. ఆది, మధ్య, అంతములేని వాడు ఎప్పుడు ఉండేవాడు.

"ఏకో హవై నారాయణ ఆసీత్- న బ్రహ్మా, నేశానః"

సృష్టికి పూర్వము ఉన్న వాడు నారాయణుక్కడే. ఆయనకే "సత్" అని మరొకపేరు.

ఆ నారాయణుడున్న ఆదికాలంలో బ్రహ్మ శివ, శతముఖులెవ్వరు లేరు.

"నారాయణాత్ బ్రహ్మాఽజాయత, రుద్రోఽజాయత॥ ---- బ్రహ్మా, శివేంద్రాది సకల జీవులకు పిత, సనాతనుడైన పరమాత్మే.

అనాది మధ్య నిధనః - జన్మ, మృత్యువులు లేనివాడు.

మహతః పరమో మహాన్:- అణోరణీయాన్ మహతో మహీయాన్ అన్నట్లు చిన్నవాటికంటే చిన్నవాడు. గొప్పవాటికంటే (మహతో) గొప్పవాడు (మహీయాన్).

తమసః పరమః - బ్రహ్మాది లోకాలన్ని తమోలోకాలే. చీకటిలోకాలే.

పరమాత్మ ఈ తమోలోకాల కంటే గొప్పగా ఉండే, ఎప్పుడు ప్రకాశిస్తుండే పరమపదంలో ఉండేవాడు. అంతేకాదు ఆ పరమపదాన్ని కూడ తన స్వంత కాంతితో ప్రకాశింపజేసే పరంజ్యోతి స్వరూపుడు.

"తస్య భాసా సర్వమిదం విభాతి" ఇంతవరకు పరమాత్మ సాధారణ లక్షణాలు చెప్పి ఇప్పుడు అసాధారణ లక్షణాలను తెలుపుతున్నది.

పరమోధాతా :- సర్వలోకాలను సృష్టించగలిగిన బ్రహ్మదేవుని కూడ సృష్టించినవాడు.

"యోవై బ్రహ్మాణం విదధాతి పూర్వం"

శంఖ చక్ర గదా ధరః :-

"యశ్చక్ర శంఖం – గద, ఖడ్గ శార్ఙ్గం।
పీతాంబరం కౌస్తుభవత్స లాంఛనం।
శ్రియాసమేతోజ్వల శోభితాంగం
విష్ణుం సదాఽహం శరణం ప్రపద్యే"

అన్నట్లు శ్రీమన్నారాయణునికి శంఖ, చక్ర, గదా ఖడ్గ, శార్ఙ్గములు అనేవి అసాధారణ (ఆయనకు మాత్రమే ఉన్న) ఆయుధాలు.

శ్రీ వత్స వక్షా : – శ్రీవత్సము అనే పుట్టుమచ్చను వక్షంలో కలవాడు.

నిత్యశ్రీః: – లక్ష్మీదేవిని నిత్యంగా తన వక్షస్థలంలో కలవాడు శ్రియః పతి

అజయ్యః :- ఎవ్వరితో కూడా జయింపబడనివాడు. బ్రహ్మేంద్ర రుద్రులను కూడ తన మాయలో ముంచినవాడు.

శాశ్వతః:- దేశకాల వస్తు పరిచ్ఛేద రహితుడు ఈ దేశంలోనే ఉంటాడు. వేరే చోట ఉండడు అనుట దేశ పరిచ్ఛేదము. అదిలేని వాడు అంటే అంతట ఉండేవాడు.

" ఈ సమయంలో ఉన్నాడు. ఇంతకుముందు లేడు ఇక ముందు ఉండడు" అనేవి కాల పరిచ్ఛేదము. అది లేనివాడు అంటే ఎప్పుడు ఉండేవాడు.

ఈ వస్తువులో ఉన్నాడు. మరో వస్తువులో లేని వాడు అంటే వస్తు పరిచ్ఛేదము. అదిలేనివాడు అంటే అన్ని వస్తువులలో ఉండేవాడు. "సర్వాంతర్యామిధ్రువః- ఎవ్వరి చేత కూడ కదలించబడని వాడు స్థానచలనము లేనివాడు.

3. మానుషం రూపమాస్థాయ విష్ణుస్సత్యపరాక్రమః –

అటువంటి సర్వవ్యాపి, సత్యపరాక్రముడు అయిన శ్రీ మహావిష్ణువు, నిన్ను సంహరించడానికి సకల దేవతల చేత ప్రార్థింపబడి, శ్రీరామునిగా మనుష్యరూపంలో అవతరించాడు.

సర్వైఃపరీవృతోదేవైః వానరత్వముపాగతైః

దేవతలందరు అతనికి సహకరించడానికి వానర రూపాలను దాల్చారు. వారందరితో కూడ

4. సర్వలోకేశ్వరః సాక్షాత్ :- సర్వలోకప్రభువు స్వయంగా

లోకానాంహిత కామ్యయా :- లోకాల శ్రేయస్సుకొరకు

సరాక్షస పరీవారం :- రాక్షష పరివారముతో సహా

హతవాన్త్వాంమహాద్యుతి:- పరంజ్యోతి స్వరూపుడైన పరమాత్మ (మానుషం రూపమాస్థాయ) రాముడిగా అవతరించి నిన్ను సంహరించాడు" అని పలికింది.

భగవంతుడు మహాయోగి అని, సనాతనుడని, సకల జీవాత్మలకు ఆధారుడైన పరమాత్మ అని, ఆయన ఆది మధ్యాంతరహితుడని, తమోలోకాలకు అతీతుడని, సకల చరాచర సృష్టికర్త అని భగవంతుని సాధారణ లక్షాలను వివరించి అటువంటి భగవంతుడెవ్వరు? అని ప్రశ్నించుకొని, శంఖ చక్ర గదాధరుడు, శ్రీదేవిని, శ్రీ వత్సాన్ని వక్ష స్థలంలో కలవాడు, అజేయుడు, శాశ్వతుడైన శ్రియః పతే అని నిశ్చయంగా తెలిపి, అట్టి శ్రియః పతే సకల లోక శ్రేయస్సును రక్షింపదలచి దర్మస్థాపనం కొరకు శ్రీరామచంద్రునిగా మనుష్యరూపంతో అవతరించాడని "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి", ఆ ధర్మ సంస్థాపన కార్యక్రమంలో పరమాత్మకు తోడుగా ఉండదలచి దేవతలు వానర రూపాలలో అవతరించారని, వారితో కూడుకొని శ్రీరామ పరమాత్మ నిన్ను సకలరాక్షస పరివారంతో కలిపి సంహరించాడని తెలిపింది.

భగవంతుని సాధారణ, అసాధారణ లక్షణాలను, ఆయన అవతార రహస్యాన్ని, ధర్మ సంస్థాపన కొరకు ఆయన తన భర్త అయిన రావణుని సంహరించడమనే మహాకార్యాన్ని గుర్తించిన విదుషీమణిమండోదరి.

ఇంతటి భగవత్ జ్ఞానాన్ని స్పష్టంగా కలిగి కూడ రావణ పత్నిగా ఉండి, తన తెలివితేటలను బాహాటంగా ప్రకటింపజాలని ఒక మహామహిళ మండోదరి.

ఇంకా మండోదరి ఇలా విలపిస్తున్నది:-

"నీవు ఇంద్రియాలను జయించి ఘోర తపస్సుచేశావు. నీ తపస్సు తర్వాతనీ ఇంద్రియాలు తిరుగబడి నిన్ను దాసునిగా చేసికొన్నాయి.

రోహిణి, అరుంధతి మొదలైన పతివ్రతలందరి కంటే సీతాదేవి పరమపతివ్రత. ఆమె మన మధ్యలో నున్నది కనుక మనకు పూజ్యురాలు.

ఆమెను ఒక గొప్ప సంపదగా కలిగినందువలననే భూదేవికి "వసుంధర" అనే పేరు వచ్చింది. ఆమె శ్రీదేవికే శ్రీ.

ఆమె శరీరమందు ఒక్క చెడు లక్షణము లేదు. పై పెచ్చు అన్ని మంచి లక్షణాలే ఉన్నాయి. అగ్నివంటి అంతటి మహిమాన్వితురాలిని అపహరించితివి. ఆ పాపమే నిన్ను అగ్ని అయి మాడ్చి వేసింది.

అగ్ని ముట్టుకున్నప్పుడే కాలాలి కదా! మరి అప్పుడే నన్నెందుకు దహించలేదంటావా? నీ పాపము పరిపక్వమైంది ఆమెను అనుక్షణము దుఃఖింపజేయడంతో – అందువలన నిన్నిప్పుడు పూర్తిగా భస్మం చేసింది.

"మండోదరీ! నేను సౌందర్యాన్ని ప్రేమించే వాడిని. సీతాదేవి అతిలోకసుందరి అందుకే ఆమెను అపహరించానంటావా?"

నిజంగా నేను సీతాదేవి కంటే సౌందర్యవతిని. నాలాంటి సుందరులు నీ ప్రక్కనే ఉన్నారు. మమ్మల్ని కాదని ఆమెను కోరుకొన్నావంటే, నీవు సౌందర్య పిపాసివి కాదు కేవలము కాముకుడివి.

"తాను వలచింది రంభ" అనుకొనే మొండివాడివి.

పోనీ ఆమెను అపహరించి తెచ్చుకొన్నావు కదా! ఆమె నిన్ను వరించిందా? లేదే! పై పెచ్చు నిన్ను శపించింది. ఏమి సుఖాన్ని పొందావు ఆమెను అపహరించి? ఆమె కఠిన వాక్కులను వినడం తప్ప? నీ మనస్సు విచారాగ్రహాలతో పాడైపోవడం తప్ప?

పోనీ ఆమె పతివ్రత కనుక నిన్ను అంగీకరించలేదు అనుకొందాము. ఆమెను తీసికరావడం వలన నీ పేరు ప్రఖ్యాతులేమైన పెరిగాయా? పిరికివాని వలె ఒక మాయాలేడిని పంపి, ఇంట్లో మగవాళ్లులేకుండా చూచి దొంగవలె ఆమెను అపహరించావనే అపఖ్యాతిని మూటగట్టుకొన్నావే?

కైలాస పర్వతాన్ని కదలించివేసిన మహావీరుడవే? మహేంద్రునితో సహా దిక్పాలకులను సైతము గడగడలాడించావే? అంతటి నీ అసమానపరాక్రమము సీతాపహరణము ద్వారా బూడిదలో పోసిన పన్నీరు కాలేదా?

ప్రాణనాథా! మన భవనంలోనే కాదు. మందరాద్రి గుహలలో, కైలాస భూములలో, మేర శిఖర ప్రాంతాలలో, కుబేరుని చైత్రవనంలో, రత్నగృహాలలో, పేరుమోసిన అందమైన స్థలాలన్నింటిలో అమూల్యములైన వస్త్రాలను ధరించి, అపురూపములైన హారాలను దాల్చి తనివితీరా నీతో రమించాను. నాకా తృప్తిని మాత్రమే జీవితాంతము మిగిల్చి వెళ్లావా?

నేను, నీ పత్నులందరు సూర్యునికి కూడా కనపడని "అసూర్యం పశ్యలమే"? ఇప్పుడు సిగ్గు విడిచి, ముసుగు తీసి ఇంతదూరము కాలి నడకతో అందరు చూస్తుండగా వచ్చామే? మమ్మల్నెందుకు కోపగించడం లేదు?

ప్రియా! నిరంతరము నిన్ను నీడలా అనుసరించానే? ఇప్పుడు నన్ను క్రూరంగా ఒంటరి దాన్ని చేసి వెళ్ళిపోయావే? ఇది నీకు న్యాయమా? ఇంద్రనీలమణి వంటి నీ నల్లని రంగులీనే మనోహర దేహము, నిరంతరము కారుతుండే రక్త ధారలతో తడసి దుమ్ముతో నిండిపోయింది. ఎప్పుడైనా నీ సుందర దేహము ఇలా కళావిహీనమవుతుందని కలలో కూడా అనుకొన్నావా? నిన్ను విడిచి నేనెలా జీవించాలి? జీవించకుండా నీతో పాటే ప్రాణాలు విడిస్తే నాకు కూడ అంత్యక్రియలు జరిగినా బాగుండేదే? కాని నా ప్రాణాలు మొండివి. నీవు నన్ను విడిచి శాశ్వతంగా దూరమైపోయనా, నా ప్రాణాలు నన్ను వదలిపోవడం లేదు.

నిజంగా నేనేమి పతివ్రతను? నీపై నాకు ప్రాణాలకంటే అమితమైన ప్రేమ ఉందనుకొన్నాను. కాని అది పూర్తిగా అసత్యము.

నేను మొండిదానిని ప్రభూ!" అని కొన ఊపిరితో ఉన్న నాగుపాము వలె కొట్టుకొంటూ, మెలికలు తిరుగుతూ రోధిస్తుంటే ఆమె ఏడ్పును చూచి భరింపజాలని రావణపత్నులందరు ఆమెను ఓదార్చారు. "నీవే పెద్ద దిక్కువు కదా? నీవు ఇలా అయితే మాకెవ్వరు దిక్కు?" అని ఊరడించారు.

# రావణునకు అంత్యక్రియలు

శ్రీరామచంద్రుడు విభీషణుని పిలిచి రావణ స్త్రీలను ఇండ్లకు పంపించి, రావణునికి అంత్యక్రియలను చేయాలని చెప్పాడు.

"రావణుడు పరకాంతలను అపహరించడం ద్వారా పతితుడయ్యాడు. అంతేకాక నన్ను దేశ బహిష్కృతుని చేశాడు. నాకు అప్రియుడయ్యాడు.

అటువంటి సమయంలో ఆయనకు నేను అంత్యక్రియలు చేయడము అవసరమా?" అని అడిగాడు.

శ్రీరామచంద్రుడు దానికి సమాధానంగా "రావణుడు పాపి కావచ్చు. ఒకవేళ ఆయన సహజ మరణాన్ని పొందితే, ఆయన పాపాలకు తగిన శిక్షను అనుభవించక పోతే, అంతిమ సంస్కారానికి అర్హుడు కాదు.

కాని యుద్ధము చేసి వీర మరణము పొందాడు. యుద్ధములో వధింపబడడం ద్వారా ఆయన పాపాలకు శిక్షణను అనుభవించడం ద్వారా పాపరహితుడయ్యాడు. అందువలన అందరివలె అంత్య సంస్కారాలకు అర్హుడయ్యాడు.

అంతేకాదు ఆయనకు నీకు మధ్య వైరము, ఆగ్రహము ఆయన మరణంతో అంతమయ్యాయి. నీవు నాకు యుద్ధంలో సోదరుని వలె సహాయపడ్డావు. అందువలన నీకు హితం చెప్పడం నా కర్తవ్యము.

కనుక నీకు ఇష్టము ఉన్నా, లేకున్నా నా మాట ప్రకారము నీవు తప్పక అంత్యక్రియలు చేయవలసిందే.

అంతిమ సంస్కారాలతో స్వర్గాది ఉత్తమలోకాలు చేరవలసిన మహావీరుడైన రాక్షసరాజుకు, అంత్యక్రయిలు చేయకుండా ఉత్తమ లోకాలను నివారంచడం న్యాయము కాదు కద!

నేను నీకు ఏవో అప్పటికప్పుడు తోచిన మాటలు చెప్పడంలేదు. పరమార్థాన్ని చెప్తుతున్నానని" నొక్కి వక్కాణించాడు.

రావణ స్త్రీలను దూరంగా పంపి, విభీషణుడు ఉత్తమ ప్రేత కార్య నిర్వహణకు పూనుకొన్నాడు. చందనపు చెక్కలతో చితి పేర్చి, దానిపై పద్మాకారంగా వట్టివేళ్లను పరచి, శాస్త్రంలో చెప్పబడిన ప్రకారము తెల్ల వెంద్రుకలు గల ఇట్టి (జింక) చర్మమును కప్పి, రావణుని శరీరమును దానిపై ఉంచి అంతిమ సంస్కారాలను కావించాడు. అంతేకాక పితృమేథ కార్యాన్ని నిర్వహించాడు. పవిత్రమైన ఒక మేకను చంపి హోమము చేశాడు. తరువాత తడి బట్టలతో తిలాంజలిని సమర్పించాడు.

స్త్రీల దగ్గరికి వెళ్లి వారిని ఓదార్చిలంకానగరంలోకి పంపివేశాడు. తరవాత తాను శ్రీరాముని సన్నిధిలో నిలిచాడు.

# మాతలి స్వర్గానికి తిరిగి వెళ్ళుట

శ్రీరామచంద్రుడు మాతలిని పిలిచి ఆయన రథ సారథ్య చాతుర్యాన్ని, తన పట్ల అతనికి, దేవేంద్రాలకు గల ప్రేమాతిశయాన్ని ప్రశంసించి, ఇక ఇంద్రుని సన్నిధికి తిరిగి వెళ్లమని కోరాడు. శ్రీరామాజ్ఞతో రాముని నమస్కరించి ఇంద్రుని దగ్గరకు మాతలి రథాన్ని తీసికొని వెళ్లాడు.

సమరాన్ని చివరి దాకా వీక్షించిన దేవ, దానవ గంధర్వాదులందరు రామ లక్ష్మణుల అసమానపరాక్రమాలను, వారి సహోదర ప్రేమను ప్రశంసించారు. విభీషణుని సహాయాన్ని, సుగ్రీవుని మంత్రాంగ కౌశల్యాన్ని, అంగద, హనుమ, నలనీలాదుల యుద్ధ సామర్థ్యాన్ని ప్రశంసించి తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళిపోయారు.

# విభీషణ పట్టాభిషేకము

శ్రీరామచంద్రుడు లక్ష్మణ సుగ్రీవులను పిలిచి, "విభీషణుడు నాకు అత్యంత భక్తుడు. ఆయన నన్ను చేరినది మొదలు యుద్ధము ముగిసేవరకు అత్యంతము ఉపకరించాడు. ఆయన ఋణము తీర్చుకోజాలము.

అటువంటి ప్రియమిత్రుని లంకలో పట్టాభిషిక్తుని చేయడం మన విధి. సముద్ర తీరంలో ఆయనకు మనము పట్టాభిషేకం చేసినప్పుడు రాక్షసులెవ్వరు చూడలేదు.

అందువలన సకల రాక్షస జన సమక్షములో ఆయనకు అత్యంత వైభవంగా పట్టాభిషేకం జరిపించండి. "విభీషణా! నేను 14 సం. ల కాలము పూర్తి అయ్యేవరకు ఏ నగరంలోను అడుగు పెట్టను" ఇది నా నియమము" అని తెలిపాడు.

లక్ష్మణ సుగ్రీవాదులు లంకలోకి వెళ్ళి, నాల్గు బంగారు పాత్రలలో సముద్ర జలాలను తెప్పించి సకల రాక్షసుల ముందు ఘనంగా పట్టాభిషేకం చేశారు. వృద్ధులైన రాక్షసులు విభీషణుని ఆశీర్వదించారు.

విభీషణుడు లడ్డులు మొదలైన మధుర పదార్థాలను, కానుకలను తీసికొని వచ్చి శ్రీరాముని సేవించాడు.

# విభీషణ పట్టాభిషేక విశేషాలు

లంకలో రావణ శకము సమాప్తమై విభీషణ శకము ప్రారంభమైంది.

"రావయతి" ఇతి రావణః" – ఏడిపించేవాడు కనుక రావణుడు. మనను ఏడిపించేవి రజస్తమో గుణాలు. కనుక రావణుడు రజస్తమోగుణాలకు ప్రతీక.

రావణుడు అహంకారానికి పుట్టిల్లు. ఆయన అహంకారానికి చివరి హద్దు. ఆయనకు శివదర్శనానికి అడ్డుగా నిలిచాడని నందీశ్వరునే ధిక్కరించాడు. శివుడు ఆయనకు దర్శనం ఇవ్వడంలో ఆలస్యం చేశాడని కైలాస పర్వతాన్నే పెకిలించి, భుజాలపై

ఎత్తుకొని, కంపింపజేస్తూ ప్రమథగణాలకు, పార్వతీ దేవికి కూడ భయానికి కారణ మయ్యాడు.

ఆయన దుశ్చర్యలకు నందీశ్వరుడు శపించాడు. పరమేశ్వరుడు తన ... బొటనవేలుతో రావణుని అణచివేశాడు. అయినా లక్ష్య పెట్టలేదు. ఆ ..., ఆ రజోగుణోద్రేక

అంతేకాద. ఆయన తమో గుణ నిలయుడు. తపస్వుల తపస్సులకు విఘ్నము కల్గించడం. స్త్రీలను చెరపట్టడం ఆయన తమో గుణానికి నిదర్శనం. ఆ విధంగా అందరిని తన రజస్త మోగుణాలతో ఏడిపించే రావణ శకము అంతమొంది.

"విశేషేణభీషయతి" ఇతి విభీషణః "విగతో భీషణః॥ అని రెండు వ్యుత్పత్తులు. విభీషణుడు అంటే రజస్తమో గుణాలను విశేషంగా భయపెట్టేవాడు, భీషణములైన రజస్తమోగుణాలు (విగతః) లేనివాడు అని అర్థము

రజస్తమోమూర్తి అయిన రావణునికి కూడా వెరువక ఆయనకు "సీతాదేవిని రావణునికి ఈయనవలసిందే" అని అనేక సార్లు నిర్భయంగా హితోపదేశం చేశాడు.

అందుకే విభీషణ శకోదయానికి సుర, నర, ముని గణాలు అన్ని స్వాగతం పలికాయి. అంతవరకు రావణుని కొమ్ముగాచిన రాక్షస వృద్ధులు, ఆయన చర్యలను విధిలేక అంగీకరించిన పెద్దలు, అందరు ధర్మాత్ముడైన విభీషణుని ఆశీర్వదించారు.

ప్రతీకార స్వభావం లేక, స్వయంగా శాంతం గల గో బ్రాహ్మణులకు శుభం కలిగింది. సమస్తలోకాలు సుఖించాయి.

# సీతాదేవి దగ్గరకు హనుమ

"శ్రీరామచంద్రుడు సీతాదేవికి తన విజయ వార్తను తెలుపుమని" హనుమను ఆదేశించాడు. హనుమకు వీధులలో రాక్షస వీరులు స్వాగతం తెలిపారు.

హనుమ అశోకవనంలో ఉన్న అవని జాతను సమీపించాడు. ఆమెకు అణుకువతో దండము సమర్పించాడు. హనుమ రాక సీతాదేవికి సంతోషాధిక్యాన్ని కలిగించింది. అప్పుడు హనుమ అంజలి బద్ధుడై, "అమ్మా! నీ భర్త దుర్జనుడైన రావణాసురుని సంహరించాడు. విభీషణుడు శ్రీరామచంద్రునికి సంపూర్ణంగా సహకరించాడు.

శ్రీరామప్రభువు తన విజయవార్తను నీకు తెల్పుమని నన్ను పంపించాడు. ఆ స్వామి సందేశాన్ని అందుకో తల్లీ! అని శ్రీరాముని సందేశాన్ని వినిపించాడు.

"సీతా! నా ప్రాణప్రియా! నా అదృష్టము కొద్ది నీవు జీవించి ఉన్నావు. ఇక దుఃఖానికి అవకాశము లేదు. నా పరాక్రమంతో రావణాసురుని సంహరించి, నిన్ను విడుదల గావించాను.

ఇంకా లంకలోనే ఉన్నానని బాధపడవద్దు. లంక ఇప్పుడు మన అధీనంలో ఉంది. మనవాడైన విభీషణుడు రాజయ్యాడు. ఆయన త్వరలో వచ్చి నిన్ను కలుస్తాడు."

శ్రీరామచంద్రస్వామి విజయ సందేశాన్ని విన్న వెంటనే సీతాదేవి లేచి నిలబడింది. కాని ఆమె నోట వెంట ఏ మాట రాలేదు.

హనుమకు ఆశ్చర్యం కలిగింది. "అమ్మా! ఇంతటి సంతోష వార్త విని కూడ ఏమి మాట్లాడడం లేదు ఎందుకమ్మా!" అని అడిగాడు.

"హనుమా! నా స్వామి విజయవార్త నాకు అత్యంత సంతోషాన్ని కల్గించింది. నా గొంతు బొంగురు పోయింది. నన్ను నేను కొంతసేపు మరచిపోయాను. అందుకు నేను నీ సందేశానికి వెంటనే ప్రత్యుత్తరమివ్వలేదు.

అంతేకాదు ఇంత సంతోషవార్త చెప్పిన నీకు తగిన బహుమానము ఏమి ఇవ్వాలా? అని ఆలోచించాను. నీకు బంగారు కొండను పూర్తిగా ఇచ్చినా సరిపోదు. నవరత్నాలు సరిపోవు. వెండి కొంత, బంగారం కొంత, రత్న రాశులు కొన్ని కలిపి ఇచ్చినా సరిపోదు.

పోనీ ఈ లోక సంపదలు సరిపోకపోతే, పరలోక సంపదలన్నింటికి అధిపత్యమైన చతుర్ముఖ బ్రహ్మపదవి ఇద్దామనుకొన్నాను కాని నిజానికి అది కూడ సరిపోదు. నేను జీవించి ఉన్నానని, నా వార్తను కిష్కింధలోని నా ప్రభువుకు తెలిపినందుకు నా స్వామి "తననే నీకు అర్పించుకొన్నాడని" విన్నాను.

అయితే నేను స్త్రీని కనుక నేనా పని చేయజాలను. అంతేకాదు. శ్రీరామచంద్రుడు నీ కిచ్చిన "ఆ బహుమానం కూడ సరిపోదని నా భావన" అని సీతాదేవి అతిశయించిన హర్షంతో అంది.

అప్పుడు హనుమ, "తల్లీ' నాకు తగిన కానుకే లేదని నీ వన్న మాటే నాకు గొప్ప బహుమానము. దాని ముందు ఇంద్రపదవి, బ్రహ్మ పదవి కూడ అల్పాలే, వాటి వలన కలిగిన ఆనందాల కంటే మించిన ఆనందము శత్రు సంహారాన్ని సాధించిన రామ ప్రభువును చూడడం వలన కలిగింది. శాశ్వతమైన మీ దయ వలన కలిగింది" అని బదులు పలికాడు.

అప్పుడు సీతాదేవి వాయునందనుని ధర్మనిరతిని, అసమాన శౌర్య పరాక్రమాలను, ధైర్య జ్ఞానాలను ప్రస్తుతించింది.

సీతాదేవికి తన పట్ల ఉన్న అపారకరుణను గుర్తించిన హనుమ ఆమెను తనకు కావలసిన ఒక కోరికను కోరాడు. "తల్లీ! నిన్ను ఈ రాక్షస స్త్రీలు ఇంతకాలము అనేక బాధలను పెట్టారు. ఒకావిడ నిన్ను తీవ్రంగా దూషించింది. ఒకావిడ నీపై పడబోయింది. ఒకావిడ నిన్ను బెదిరించింది. వీళ్లందరు నిన్ను క్రూరంగా హింసించి, నీ తీవ్ర మనోవేదనకు కారణమయ్యారు. నీ ఆత్మహత్య ప్రయత్నానికి కారకులయ్యారు. అందువలన వాళ్లు అంటే నాకు మొదటి నుండి తీవ్రమైన కోపము ఉంది. అమ్మా! నీకు నాపై దయ ఉంటే వాళ్లందరిని నాకు వదలిపెట్టు. నా కోపం తీరేదాకా వాళ్లను హింసించి సంహరిస్తానని" హనుమ అడిగాడు.

# సీతాదేవి రక్షాదీక్ష

తనను ఇంతకాలము బాధించిన రాక్షస స్త్రీలను రక్షించడానికి సీతాదేవి నిశ్చయించుకొంది. "హనుమా వీళ్లందరు దోషులని, పాపులని, వీళ్లను శిక్షించాలను కొంటున్నావా?

నిజంగా వీళ్ల దోషమెక్కడ ఉంది? వీళ్లందరు రావణుని దాసులు. ఆయన ఉద్యోగినులు. తమ ప్రభువు ఏ ఆజ్ఞ ఇచ్చినా దానిని ఆచరించేవారే ఉద్యోగులు. ఆ ఆజ్ఞ మంచిదా, చెడ్డదా అని విచారించే అధికారము వాళ్లకుండదు. వాళ్లు స్వతంత్రులు కారు పరతంత్రులు కదా!

"నన్ను తన వైపు త్రిప్పుకోవడానికి, తన మాటను నేను వినేలా అన్ని విధాల ప్రయత్నించుమని అవసరమైతే అన్ని విధాల బాధించుమని రావణుడు అజ్ఞాపించాడు. వీళ్లు ఆయన ఆదేశాలన్ని పాటించారు.

ఆదేశించిన రావణుడు దుర్మార్గుడు. కాని ఆయన ఆదేశించిన దానిని అనుసరించిన ఈ రాక్షస స్త్రీలు దోషులు కారు.

నా అభిప్రాయంతో నీవు అంగీకరిచక పోవచ్చు. వీళ్లు నీ దృష్టిలో దోషులేకావచ్చు. అయినా నన్ను వీళ్లు హింసించారు కనుక వీళ్లను నీవు హింసించాలనుకోవడం కూడ దోషమే. అప్పుడు మనమందరము దోషులమే కదా! "అలా అయితే దుర్మార్గుడైన రావణుని సంహరించడము కూడ దోషమే కదా" అంటావా? అలా కాదు. రావణుడు సర్వతంత్ర స్వతంత్రుడు. ఆయన తన తప్పును సవరించుకొనే అవకాశము కలవాడు.

ఆయన దోషాన్ని అనేక పర్యాయాలు ఆయన బంధువులు, ఆయన సోదరుడైన విభీషణుడు ఆయనకు నిర్భయంగా తెలిపారు. కొందరు సూటిగా తెలపకున్నా, సూచన ప్రాయంగా తెలిపారు. నేను కూడా "తాను సుఖంగా జీవించాలంటే, తన తప్పును

ఒప్పుకొని, నన్ను రామచంద్ర ప్రభువుకు సమర్పించి. ఆ స్వామితో కనీసం స్నేహమైనా చేయాలని" చెప్పిచూచాను.

రావణాసురుడు అహంకారానికి రూపమే. ఆయన అత్యంత మూర్ఖుడు. తన తప్పును ఒప్పుకోవడం ఆయన అవమానంగా భావించాడు.

తన తప్పును సమర్థించిన వారందరు ఆయనకు "తనవారు", తన తప్పును వేలెత్తి చూపి, దానిని సవరించుకొమ్మని హితం చెప్పిన వారందరు ఆయనకు శత్రువులు. అందుకే విభీషణుని దేశం నుండి బహిష్కరించాడు. నాతలను నరకడానికి ఆవేశంతో కత్తి దూశాడు.

అటువంటి రావణాసురుని, దుర్మార్గుని, లోకకంటకుని సంహరించడం ధర్మ సంస్థాపనకై అవతరించిన శ్రీరామచంద్ర ప్రభువు ప్రథమ కర్తవ్యము. ఆయన కావించింది లోక రక్షణే.

ఈ రాక్షస స్త్రీలు అటువంటి వారు కాదు. వారందరు రావణసేవికలు. ప్రభువు ఆజ్ఞను పాటించడమే వారి కర్తవ్యము. రాజాజ్ఞను ధిక్కరిస్తే వారి ప్రాణాలు గాలిలో కలసిపోయేవి. అంతేకాదు "మాకు అంతటి అపచారాన్ని చేసినరావణుడు కూడ తనను ఆశ్రయిస్తే తాను ఆయనకు కూడ అభయమిస్తానని" రామచంద్రస్వామి తెలిపాడు కదా!

"విభీషణోవా సుగ్రీవ! యదివా రావణ స్స్వయం"

ఇప్పుడు ఈ రాక్షస స్త్రీలందరు దిక్కులేని వారు. దిక్కులేనివారిని రక్షించడమే సజ్జనుల ధర్మము కదా!

అంతేకాదు వీళ్లందరికి నేను స్వయంగా అభయమిచ్చాను "భవేయం శరణం హివః" మీ అందరికి నేనే దిక్కు అవుతానని" తెలిపాను.

ఆశ్రయించిన వారు పాపులైనా పుణ్యులైనా వారిని చంపకూడదు. దండించకూడదు. దయతో కాపాడాలి. ఇదే సజ్జన ధర్మము.

"పాపానాంవా శుభానాంవా। వధార్హాణాం ప్లవంగమ
కార్యం కరుణ మార్యేణ। నకశ్చిత్ నాపరాధ్యతి॥

శరణువేడిన వారిని రక్షించడం దుర్మార్గుల విషయంలో కాదంటావా? సన్మార్గులు శరణెందుకు కోరుతారు? వాళ్లకు కలిగిన ఆపదల నుండి వాళ్లను వాళ్ల ధర్మమే కాపాడుతుంది కదా!

ఇంకొక మాట! మాటి మాటికి వీళ్లను "తప్పు జేశారు, తప్పుజేశారంటూ రెట్టిస్తున్నావు కదా!

"లోకంలో తప్పు చేయని వారు ఎవ్వరైనా ఉన్నారా? ఎప్పటికైనా ఉంటారా?

తప్పులు చేయడానికి కారణాలైన రజస్తమో గుణాలు పూర్తిగా లేని వారు ఎవ్వరైనా ఏ లోకంలోనైనా ఉంటారా? బ్రహ్మేంద్ర రుద్రులు కూడ ఎన్నడు తప్పుచేయని వారేనా?

"అంతెందుకు? మన విషయమే ఆలోచిద్దామా? "యస్త్వయా సహ సస్స్వర్గో। నిరయోయస్త్వయా వినా" అని ఒక్క క్షణం కూడా పెళ్లైంది మొదలు నా స్వామిని విడిచి ఉండని నేను, ఎంత కష్టమైనా ఆయనతో కలసి ఉండడమే స్వర్గమని ఆయనను విడిచి ఉండటమే ఎన్ని సుఖాలు ఉన్నా నరకమని స్థిరంగా ఆ స్వామితో పలికిన నేను ఒక మామూలు జింక కొరకు స్వామినే దూరం చేసికొన్నానే? కన్న కొడుకు వంటి సౌమిత్రిని కఠినంగా దూషించి దూరం చేసికొన్నానే? నేను దోషిని కాదా?

నీ సంగతి ఏమిటి? నన్ను "చూచి రమ్మని" కదా।" స్వామి నిన్ను లంకకు పంపించింది. నీవు చేసిందదేనా? లంకా నగరాన్ని అంతా భస్మం చేసి వెళ్లావే? చూచి రమ్మంటే కాల్చి వెళ్లడం" ధర్మమేనా? ఇప్పుడు మాత్రమేమిటి? నాకు తన విజయ వార్తను తెలిపి రమ్మని స్వామి పంపితే వీళ్లందరిని సంహరించి వెళ్తానంటున్నావే? ఇది ధర్మమేనా? అందువలన తప్పు చేసిన వారైనా వీరిని క్షమించి వదలివేయడమే ధర్మము. దీని వలన వీళ్లలో అధర్మ గుణము తగ్గి, ధర్మము వైపు వీరి మనస్సు మరలే అవకాశము ఉంటుంది." అని సీతమ్మ తల్లి రాక్షస స్త్రీలను శిక్షించకుండా హనుమను ఆపివేసింది. చూచారా అమ్మ రక్షా దీక్ష! సీతాదేవి (అమ్మ) ఆశ్రిత రక్షణలో స్వామిని మించి పోయింది. స్వామితో తనను ఆశ్రయించిన వారికే రక్షణనిచ్చాడు. అమ్మ తనకే అపదల కల్గించిన, తనను ఆశ్రయించని రాక్షసులకు ఆశ్రయమిచ్చింది. కాకాసురుడని కూడా రక్షింప జేసింది అందుకే. "లఘుతరా రామస్య। గోష్టీకృతా" అంటారు భట్టరు వారు.

# పురుషకారవైభవము

సీతాదేవి ఘటకురాలు. తప్పుచేసిన మనను తన ఉపదేశము ద్వారా మార్చి, మన తప్పును అంగీకరించే వారిగా మార్చి, పరమాత్మను ఆశ్రయించేవారిగా మనను తీర్చిదిద్దుతుంది.

"అరుళాలే తిరుత్తుం"

సర్వతంత్ర స్వతంత్రుడై "శాస్త్ర ప్రకారం ధర్మంగా నడుచుకోని వారిని, వారి ఒక్కొక్క తప్పును వదలకుండా లెక్కపెట్టి, వాటికి తగినట్లుగా క్రూరంగా దోషులను శిక్షించకుండా

ఎదలనని పట్టుబట్టిన పరమాత్మను తన సౌందర్యంతో, తన క్రీగంటి చూపుతో వశపరచుకొని,

"అజుకాలే తిరుత్తుం"

ఆయన కోపాన్ని తగ్గించి. ఇంకా ఏమైనా కోపము మిగిలి ఉంటే" స్వామీ "నిర్దోషః కః ఇతి" తప్పును చేయని జీవులు ఉంటారా? మన పిల్లలు కదా! తప్పుచేస్తే మాత్రము మన పిల్లలను మనమే శిక్షిస్తే వాళ్లకు దిక్కెవ్వరు?" అని తీయతీయని మాటలతో స్వామి మనస్సును కరిగించి. ఆశ్రితుల దోషాలను కప్పిపుచ్చుతుంది ఆ జగజ్జనని.

అప్పటికి కూడ ఆ స్వామి పూర్తిగా మారక "శాస్త్రము ప్రకారము పాపులను శిక్షింపక వదలితే శాస్త్ర మర్యాద ఏమవుతుందని" అడిగితే? ఆ స్వామి వాదానికి అమ్మ ఎదురు తిరిగి," "అన్ని వేళలలో శాస్త్ర మర్యాదే నడిస్తే, మీ కృపా గుణము ఎక్కడికి పోవాలో చెప్పండి" అని స్వామిని నిలదీస్తుంది.

వ్యామోమయంలో పడ్డ అఖిలాత్ముడైన స్వామికి తానే చక్కటి పరిష్కారాన్ని కూడ చూపెట్టుతుంది.

"స్వామీ! నేను మీ శాస్త్రానికి, మీ కృపా గుణానికి రెండింటికి కూడా రెండు చక్కనిదారులను చూపెడుతాను చూడండి.

మిమ్మల్ని ఆశ్రయించడానికి ఎంతమాత్రము అంగీకరించని దోషులను శాస్త్రమర్యాద ప్రకారము శిక్షించండి.

మిమ్మల్ని ఆశ్రయించిన దోషులను మీ కరుణా దృష్టితో కటాక్షించి కాపాడండి".

ఆశ్రితుల పట్ల అమ్మ యొక్క ఆర్ద్రహృదయాన్ని, శాస్త్రము పట్ల ఆమె సమన్వయ దృష్టిని గమనించిన స్వామి సంతోషంతో ఆమె మాటను పాటిస్తాడు.

ఈ సందర్భంగా లోకగురువులు సీతాదేవి హనుమను ఒప్పించిన ఈ విషయాన్ని ఇలా ఉదహరిస్తారు.

"తనకు తోచినట్లు మాత్రమే నడచుకొనే ఒక కోతిని కూడ ఒప్పించిన లోకజనని, తన మాట ప్రకారమే నడచుకొనే తన భర్తను ఒప్పించగలుగుందని చెప్పవలసిన వేరే అవసరమే లేదు కాదా".

"తిరువడియై పొరుప్పిక్కుమవళ్

తన్ శొల్ (వజి) వరుమవనై పొరుప్పిక్క శొల్లవేండావిరే".

# సీతాదేవి విషయంలో రామాజ్ఞ

సీతాదేవి రాక్షస స్త్రీలను చంపనీయక తాను వెంటనే శ్రీరాముని చూడగోరుతున్నానని హనుమతో చెప్పింది. "విజయహాసంతో ప్రకాశిస్తున్న శ్రీరాముని చంద్రవదనాన్ని ఆమె తప్పక తర్వరలోనే చూడగలుగుతుందని" హనుమ ఆమెను ఆశ్వాసించాడు.

హనుమ శ్రీరాముని సన్నిధికి వెళ్లి "రావణబాధితురాలైన సీతాదేవి తన ప్రభువును తక్షణమే దర్శించగోరుతున్నట్లు" తెలిపాడు.

శ్రీరాముడు కొంతసేపు మౌనము దాల్చాడు. ఆయన మనస్సు పరి పరి విధాల ఆలోచిస్తున్నది. పదిమాసాల తరువాత తాను తన ప్రేయసిని చూడబోతున్నానే ఆనందం ఒక వైపు, పది మాసాల పాటు ఒక కాముకుని దగ్గర గడపిన తన పత్నిని గురించి లోకులు ఏమనుకొంటారో అనే బాధ మరొక వైపు ఆయనను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఆయన ధర్మాత్ముడైన విభీషణుని పిలిచి, "సీతాదేవికి శిరస్స్నానము చేయించి, నూతన వస్త్రాలను, ఆభరణాలను ధరింపజేసి తన ముందుకు తీసికరమ్మని" ఆజ్ఞాపించాడు.

విభీషణుడు అంతఃపురానికి వెళ్ళి తన వనితల ద్వారా శ్రీరామసందేశాన్ని సీతాదేవికి తెలిపాడు.

సీతాదేవి తాను స్నాన, నూతన వస్త్రాలంకారాలతో శ్రీరాముని సందర్శించాలన్న విషయాన్ని విన్న వెంటనే ఉలికిపడింది.

"అస్నాతా ద్రష్టు మిచ్ఛామి."

ఆమె శ్రీరామచంద్రస్వామిని స్నానం చేయకుండానే చూడాలనుకొన్నట్లు తెలిపింది. అయితే ఆమె నూతన వస్త్రాలంకారాలను ధరించే శ్రీరాముని దర్శించాలన్నది తన అభిప్రాయము కాదని అది "రామాజ్ఞ" అని విభీషణుడు తెలిపాడు.

"ఏమిటిది? ఎందుకిలా తన భర్త ఆజ్ఞాపించాడు? తమ మధ్యలో ఏమి జరగ బోతున్నది? ఏదో ఒక ఘోర విపత్తు మళ్లీ తన జీవితంలో జరగబోతున్నది" అని సీతాదేవి మనస్సు కీడును శంకించింది.

తాను తన ప్రాణేశ్వరుని వదలి వచ్చినప్పటినుండి లంకలో ఎలా జీవించింది? రావణుడు తనను అపహరించిన నాడు కట్టుకొన్న చీరే ఈ నాటికి ఆమె శరీరముపై మారకుండా అలాగే ఉంది. అది మాసిపోయింది. అక్కడక్కడ చిల్లులు పడింది. అయినా

సీతాదేవి దానిని మార్చలేదు. వేరే చీరను ధరించలేదు. తన ఆభరణాలలో సగాన్ని ఋష్యమూక పర్వతము పడేసి వచ్చింది. మిగిలిన సగాన్ని తాను కూర్చున్న చోట చెట్టు కొమ్మకు వేలాడ దీసింది. శ్రీరాముని వెంట ఉన్నప్పుడు చేసిన స్నానము మళ్లీ చేయనేలేదు.

ఈ పది మాసాలు శ్రీరామునినుండి వేరైనందుకు నిరంతర దుఃఖమే. రామ నామస్మరణమే, రామధ్యానమే.

"రామమే వాను ధ్యాయంతీ। నిత్యం శోకపరాయణా".

ఇదిగో ఇంత దుఃఖంతో, మాసిన చీరతో, ఉన్నదున్నట్లుగా తాను తన స్వామిని చూడాలనుకున్నది. తాను భోరున విలపించాలనుకున్నది. తన దు:ఖాన్ని, తన విరహ బాధను, తన కృశించిన, మట్టి పేరిన శరీరాన్ని చూచి తన భర్త కరిగి, నీరు కావాలనుకొంది.

అటువంటిది ఇప్పుడు ఏమి జరిగింది? తాను స్నానం చేసి నూతన వస్త్రాభరణాలను ధరించి స్వామిని సేవించాలట!

అప్పుడు తాను పడ్డ బాధ, అనుభవించిన దుఃఖము రామచంద్రస్వామికి అర్థమవు తుందా? లోకులకు అర్థమవుతుందా?

పరమనీచుడు, కాముకుడైన రావణుని ఇంట్లో ఈ పది మాసాలు తాను ఎంతో సుఖసంతోషాలతో గడిపిందని లోకము తప్పుగా అనుకోదా?

అప్పటికి ఆమె 'నమే స్నానం బహుమతం' అని శ్రీరామచంద్ర స్వామిని సేవించందే, తనకు స్నానము ఇష్టము కాదని తెలిపింది.

అయినా తనను పట్టించుకొనేవారెవ్వరు? తన మాట వినేదెవ్వరు? 'రామాజ్ఞ' అనే ఒకే మాటకు వివశురాలైంది. శిర:స్నానము చేసి, నూతన వస్త్రాభరణాలను ధరించే స్వామి సమక్షానికి పల్లకిపై ప్రయాణించి వెళ్లింది.

"సీతాదేవి శ్రీరాముని ధర్మపత్ని, కాబోయే" పట్టమహిషి" కనుక ఆమెను అందరు పైపైబడి చూడ కూడదనుకొని" విభీషణుని ఉద్యోగులు అక్కడ ఉన్న వారందరిని దూరంగా పంపారు.

దూరంగా పంపుతున్న ఉద్యోగుల ధ్వనులు, దూరంగా వెళ్లుతున్న వానరాదుల ధ్వనులు శ్రీరాముని ఏకాగ్రతను భంగం చేశాయి.

ఆయన విభీషణుని పిలిచి," తక్షణమే వానరులను దూరంగా పంపడాన్ని ఆపుమని" ఆజ్ఞాపించాడు.

"విభీషణా! పరపురుషులు చూచినంత మాత్రాననే పడతులు పతితలు అవుతారా? అతివల పాతివ్రత్యానికి పురుషులు కాపలా కాయాలా? తమ శీలాన్ని రక్షించుకోవడం వనితల ధర్మం కాదా"?

"అంతేకాదు ఏ స్త్రీని అయినా ఆమె వివాహ సమయంలో, యజ్ఞాచరణ కాలంలో, యుద్ధభూమిలో, దేశోపద్రవాల వేళలో, కష్టాలు కలిగినప్పుడు ఎవ్వరైనా చూడవచ్చు కదా" అని కఠినంగా మందలించాడు.

ఆయన మాటలు అక్కడ ఉన్న లక్ష్మణ, హనుమ, సుగ్రీవ విభీషణాదులెవ్వరికి అర్థం కాలేదు.

పదిమాసాలు భర్తకు దూరమై, దుర్భర దుఃఖాన్ని అనుభవించిన ఆ తల్లికి ఆ దుఃఖం తొలిగి, పతిని, సందర్శించే ఈ శుభవేళ కష్టకాలము ఎలా అవుతుంది?

సీతాదేవికి, హనుమ సౌమిత్రులకు మనస్సులు మళ్లీ కీడును శంకించసాగాయి.

సీతాదేవి శ్రీరాముని సమీపించి, సిగ్గుతో శ్రీరామచంద్రుని వదనారవిందాన్ని తనివి తీరాచూచి, ముఖముపై గుడ్డను కప్పుకొని, "ప్రాణేశ్వరా!" అని బిగ్గరగా తన దుఃఖమంతా తగ్గేలా ఏడవసాగింది.

శ్రీరామచంద్రుడు సీతాదేవిని సూటిగా చూడలేదు. ఎవ్వరో పరులతో మాట్లాడు తున్నట్లు పలుకసాగాడు.

"సీతా! నేను లేనప్పుడు ఒంటరిదానవైన నిన్ను రావణుడు అపహరించి తెచ్చాడు. అటువంటి నీచుని సమర భూమిలో నా శౌర్యాన్ని ప్రయోగించి సంహరించాను.

"భార్యను కాపాడుకోవడం భర్త బాధ్యత. సమర్థులైనా కాకున్నా పతులు తమ సతులను కాపాడుకోవడానికి తప్పక ప్రయత్నించాలి.

ఆ విధంగా నేను కూడ నా భార్యను అపహరించిన రావణుని సపరివారంగా ఆయన ఉన్న చోటుకే వచ్చి సంహరించాను.

అందువలన నా భర్త ధర్మం నెరవేరింది. నా పరాక్రమ ప్రఖ్యాతి సమస్తలోకాలలో వ్యాపించింది.

నిన్ను రావణుడు అపహరించడం దైవికము. దానిలో నా నీ భాధ్యతలు లేవు.

అయితే దైవికంగా జరిగిన ప్రమాదాన్ని నా శక్తి సామర్థ్యాలతో తొలిగించాను.

ఇందులో సుగ్రీవుని మంత్రాంగము, హనుమదాదుల త్యాగ శౌర్యాలు, విభీషణుని సహాయ సంపత్తి నాకు ఈ విజయంలో ఎంతో తోడ్పడ్డాయి. వారందరి ప్రయత్నాలు ఫలించాయి.

అయితే! సీతా। ఈ ప్రయత్నమంతా నీపై వ్యామోహంతో చేయలేదు. "ఆశ్రిత రక్షణ మనే" ధర్మాన్ని నిర్వర్తించడానికి చేశాను. ఇప్పుడు నిన్ను రావణుని చెరనుండి విడిపించాను. స్వతంత్రరాలిని చేశాను.

అంతేకాని నిన్ను మళ్లీ నా భార్యగా స్వీకరించడానికి కాదు.

"దీపో నేత్రాతురస్యేవ । ప్రతికూలాసి భామినీ" నేత్ర రోగము వచ్చిన వాడికి దీపమెలా ప్రతికూలమో? అలాగే నా ముందు నీవు ప్రతికూలంగా నిలిచావు.

నీ ప్రాతికూల్యము (విరోధము) ఏమిటంటావా? నీవు పది మాసాలు కాముకుడైన పగవాని ఇంట్లో గడిపావు. ఈ పదిమాసాలు నిన్ను రావణుడు తన వశం చేసికోకుండా ఎలా వదలిపెడతాడు? నిన్ను కన్నతల్లిలా గౌరవంగా ఆ నీచుడు చూచాడంటే లోకమెలా నమ్ముతుంది?

మా రఘువంశ రాజుల చరిత్రలు అతి పవిత్రాలైనవి. ఇప్పుడు నిన్ను భార్యగా స్వీకరించి అకళంకమైన ఆ మహా పురుషుల వంశానికి మచ్చ తీసుకురావాలా?

ఇప్పుడు నీకు స్వేచ్ఛను ప్రసాదించాను. అయితే "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అన్నట్లు "ఆడదాన్ని నేను ఒంటరిగా ఎలా జీవించగల్గుతాను? అంటావా?'

నీవు ఉండడానికి నాలుగు చోట్లు ఉన్నాయి. 1. ఇక్కడే లంకలో విభీషణుని దగ్గర 2. కిష్కింధలో సుగ్రీవుని వద్ద 3. అయోధ్యలో భరతుని వద్ద లేదా 4. లక్ష్మణుని వద్ద వీటిలో నీకెక్కడ ఉండాలనుకొంటే అక్కడ ఉండవచ్చు." అని దయారహితంగా పలికాడు. ("ఒంటరిగా జీవించే స్త్రీలను పదిలంగా కాపాడే బాధ్యత రాజులది" అని అర్థమవుతున్నది.)

ఇక్కడ రాముని చర్యను ఆనాటి నుండి ఈనాటి వరకు అనేకులు విమర్శించడం జరుగుతున్నది.

శ్రీరాముడు "ధర్మ విదూరుడు". "దయావిరహితుడు", "భార్యపై ప్రేమలేని కఠినుడు" అని రకరకాల ఆ ధర్మమూర్తి (విగ్రహవాన్ ధర్మః) విమర్శింపబడుతున్నాడు.

రాముడు ధర్మవిదూరుడా? సీతాదేవి శీలాన్ని శంకించినవాడా? ఆమె పాతివ్రత్య ధర్మాన్ని గుర్తించలేదా?

సీతాదేవిని చూడగానే రాముడు అన్నమాటలు ఏవి? "దీపో నేత్రాతురస్యేవ। ప్రతికూలాసిభామినీ॥ కళ్లకలక అనే వ్యాధి వలన ఎర్రబారిన కళ్లు దీపాన్ని చూస్తే మండుతాయి. ఆ వ్యాధి కలవారికి దీపము ప్రతికూలము. అలాగే నీవు నాకు ప్రతికూలంగా కనబడుతున్నావు"

ఈ మాటలలో ఎక్కడైనా సీతాదేవి శీలము సందేహింపదగినది అనే మాట ఉందా? లేదే?

పై పెచ్చు దీపము ఎంత శుద్ధమైనదో, ఎంత ప్రకాశవంతమైనదో, ఏ మచ్చ కూడలేనిదో అలాగే సీతాదేవి శీలము మచ్చలేనిది అనే విషయము దీపోదాహరణ వలన తెలుస్తుంది.

మరి సీతాదేవి ప్రవర్తనలో దోషము లేకపోతే దోషమెక్కడ ఉంది? శ్రీరాముని కళ్లలో ఉంది. కళ్ల కలక అనే రోగంలో ఉంటుంది దోషము.

ఇప్పుడు శ్రీరాముని కళ్లలో ఉన్న దోషమేది? "లోకనిందా భయమే దోషము" "నేత్రాతురస్యేవ" అని తన కళ్ల రోగమనే దోషాన్ని శ్రీరాముడే స్వయంగా అంగీకరిస్తున్నాడు.

శ్రీరాముడు సీతాదేవి పట్ల ప్రేమలేనివాడా? సీతారాముల మధ్య ఉన్న "అన్యోన్యానురాగము (ఒకరిపై ఒకరికి ఉన్న విడదీయరాని అనురాగము (అనుబంధము) ఏ లోకంలోనైనా, ఏ కాలంలోనైనా ఏ దంపతులకైనా ఉందా? ఉండగల్గుతుందా? లేదు ఏ దంపతుల మధ్య అయినా అసంభవము!

"ప్రేమ" అంటే కలిసి ఉన్నప్పుడు ఆలుమగల మధ్యఉన్న అనురాగమే కాదు. ఒకరితో మరొకరు వేరై, అతి దూరంలో ఉన్నప్పుడు కూడా, ఎంతకాలమైనా చెదరిపోని వారి అనుబంధము. లంకలో ఉన్న సీతాదేవి గురించి శ్రీరాముడు "అనన్యాహిమయా సీతా। భాస్కరేణయథాప్రభా" అంటాడు. సూర్యుని నుండి వెలుగు ఎలా వేరుచేయబడదో, నా నుండి సీతాదేవిని కూడ అలాగే ఎవ్వరు వేరు చేయజాలరు. సీతాదేవి గురించి ఎంత విశ్వాసమో శ్రీరామునికి చూడండి.

అలాగే సీతాదేవి కూడ అంటుంది. "అనన్యా రాఘవేణాహం। భాస్కరేణయథాప్రభా"

భాస్కరుని నుండి ప్రభ ఎలా విడిచి ఉండజాలదో, నేను కూడ రాఘవుని విడిచి ఉండజాలను. అది భార్యాభర్తల మధ్య అనుబంధము. అదివారి మధ్య విడదీయరాని ప్రేమ.

ఎంతదూరంలో ఉన్నా ఇద్దరిది ఒకే మాట. ఒకే బాట. ఇప్పుడే కాదు ముందు శ్రీరాముడు సీతాదేవిని అడవిలో విడిచిపెట్టినప్పుడు కూడ తన మనస్సులో సీతాదేవికి తప్ప వేరే ఏ మహిళకు కూడ చోటులేదు.

పురుషులకే పిచ్చి కలిగించేంత సౌందర్యము శ్రీరామునిది. ఆయన అయోధ్యా సార్వభౌముడుగా ఉన్నాడు. ఆయన తలచు కొంటే భార్యలకు కొదువా? అయినా ఎన్నడైనా మళ్లీ పెళ్లి గురించి ఆలోచించాడా?

అంతటి "ప్రేమ తపస్వి" కంటే మించిన భార్య ప్రేమగల భర్త ఏ లోకంలోనైనా, ఏ కాలంలో నైనా కాగడా పట్టి వెతికినా కనబడుతాడా?

బాగుంది - రామునికి సీతాదేవి శీల విషయంలో సందేహం లేదు. ఆయనకు ఆమె అంటే అపారప్రేమ.

అయితే సీతాదేవిని పరిగ్రహించనని ఎందుకు ఖచ్చితంగా అనడం? ఎందుకంటే ఆయన ఒక సామాన్య భర్త కాదు కనుక "జగద్భర్త" కనుక. అవనిలో "ధర్మ సంస్థాపన కొరకు అవతరించిన మహాపురుషుడు" కనుక.

ఆ శ్రీరాముడు సీతాదేవిని వెంటనే స్వీకరిస్తే ఏయయ్యేది? "రాముని అంతవాడే భార్యను పది మాసాలు పరపురుషుని ఇంట్లో ఉన్నా అనుమానించలేదే? విడిచిపెట్టలేదే? కొద్ది రోజుల పాటు ఎక్కడో తిరిగి వస్తే నన్ను వదలిపెడుతావా?" అని స్త్రీలు కొంతకాలము ఎక్కడో గడిపివచ్చి భర్తలను నిలదీసేవారు. అప్పుడు "ప్రాతివ్రత్యమనే" మాటే అర్థము కలిగి ఉండేది కాదు.

అక్కడికి అయోధ్యలో ఒక చాకలివాడు "పరపురుషుని ఇంట్లో కొంతకాలము ఉండివచ్చిన భార్యను స్వీకరించడానికి నేను రాముని వంటి వాడిని కాను" అని త్రాగిన మత్తులో నోటికి వచ్చిన మాటపేలాడు.

"యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః"

ఒక గొప్పవాడు ఆచరించినదాన్నే ఇతరులు అనుసరిస్తారు. "యధారాజాతథా ప్రజా" రాజు ఎలా ఉంటే ప్రజలు అలా ఉంటారు. అందుకే రాముడు అంత మనస్సును చంపుకొని కఠినంగా వ్యవహరించాడు.

అయితే సీతమ్మ తల్లి పట్ల అనన్యమైన భక్తి ప్రేమలు గల పాఠకులకు మాత్రము శ్రీరాముని కఠినోక్తులు కళ్లనీళ్లు తెప్పించకమానవు.

# సీతాదేవి సమాధానము

శ్రీరామచంద్రస్వామి పరుషవాక్కులు సీతాదేవికి పిడుగు పాటు వలె అనిపించాయి. ఆమె ఏనాడు కూడ భర్త నుండి అటువంటి కఠిన వాక్కులను ఊహించలేదు. ఆమె దుఃఖంతో వివశురాలైంది. ఆమె తన భర్తకు ఈ విధంగా సమాధానమిచ్చింది.

"రామా। నీ వంశము శ్రేష్ఠమైందని అందులో నాకు స్థానము లేదని అన్నావే?

అంత శ్రేష్ఠమైన వంశములో జన్మించిన నీవు శ్రేష్ఠుడవే కదా? పర పురుషుల సమక్షంలో నీ భార్యను ఈ విధంగా నిందించడం న్యాయమా? నీ పలుకులు అతి నీచంగా ఉన్నాయి. కులసతిని గురించి నీవు అన్న మాటలు ఒక సత్పురుషుడు జారిణి గురించి కూడ అనజాలడు.

నిజానికి నీకు నీ భార్యా శీలము తెలియదా? పెద్దదాన్నికాక ముందే నీ భార్యగా మీ ఇంట్లో అడుగుపెట్టానే? అప్పటినుండి అడవిలో నన్ను రావణుడు అపహరించే దాకా సూర్యుని ప్రభ అనుసరించినట్లు నిన్ను విడువక నీడలా అనుసరించానే? "అయోధ్యలో ఉండి సకల సుఖాలు అనుభవించుమని, అత్త మామలకు సేవచేస్తూ ఉండుమని నీవు చెప్పినా వినక కష్టమైనా సుఖమైనా నీతోనే అని" కఠినమైన అడవులలో కాలిడానే? అడవిలో ఉన్ననాళ్ళు, అయోధ్యలో ఉన్నప్పటి కంటే ఒకరి మనస్సు మరొకరము తెలుసుకొని ఆనందాన్ని పంచుకొన్నామే, దేనిని బట్టి నా శీలాన్ని అనుమానిస్తున్నావు?

"నిన్ను రావణుడు అపహరించాక నీ శీలము మారి ఉండవచ్చు కదా" అంటావా? హనుమను నీవు దూతగా పంపించి, నా విషయాన్ని గ్రహించావు కదా। హనుమ మాటలలో నా శీలము మంచిది కాదని అనిపించిందా?

"నిన్ను రావణుడు తాకకుండానే, నిన్నెలా అపహరించాడంటావా?" శీలము అనేది శరీరానికి సంబంధించిందా? మనస్సుకు సంబంధించిందా? రెండింటికి సంబంధించిందా?" నాకు స్పష్టము చేయి.

అనేక జనము ఉన్న చోట్ల స్త్రీ పురుషులు ఒకరినొకరు తాక తప్పదు. అంతమాత్రాన స్త్రీలు అందరు చెడిపోయినట్లేనా? కాదు కదా!

రావణుడు నన్ను బలవంతంగా తాకాడు. నేను కావాలని ఆయనను తాకలేదు. నా మనస్సు ఆయన నుండి ఎలా విడిపించుకోవాలా అనే విషయంలోనే నిమగ్నమైంది. అప్పటికినా ప్రాణాలు పోయినా ఫరువాలేదు. అనీచుడి నుండి తప్పుకొంటే చాలనిపించింది. ఆకాశంలో నుండి, ఆయన రథాన్నుండి క్రిందికి దూకాలని ప్రయత్నించాను. కాని ఆ దుష్టుడు నా ప్రయత్నాన్ని పసిగట్టి దానిని వ్యర్థపరిచాడు.

"నాకెవ్వరైనా సహాయం చేస్తారేమో" అని ఆశపడ్డాను. నాకు చేతనైనంతవరకు ఎలుగెత్తి మిమ్మల్నిద్దరిని పిలుస్తునే ఉన్నాను. నా కేకలు మీరు వినలేదు. నన్ను మీరు కాపాడలేదు.

నా కేకలు విన్న కన్న తండ్రి వలె జటాయువు తన శక్తి కొలది నన్ను కాపాడడానికి ప్రయత్నించి తన ప్రాణాలనే త్యాగం చేశాడు.

ఇందులో నా శీలము తప్పనినీవెలా నిర్ణయించావు?

నీ సూర్యవంశము గొప్పదని, దాని గొప్పదనాన్ని కాపాడుకోవడం కొరకు నన్ను వదలివేస్తున్నానన్నావే? నా వంశము తక్కువదా? నేను ఏ ఆడదాని కడుపులో పుట్టినదానిని కాను. నీవు కౌసల్యాదేవి గర్భంలో జన్మించావు.

మా తండ్రి జనక చక్రవర్తి జ్ఞానవైరాగ్య సంపన్నుడు. మా వంశము చంద్రవంశము. వంశాభిమానం నీకే కాని నాకు లేదా? వంశము యొక్క గొప్పదనాన్ని కాపాడుకొనే బాధ్యత నీకే కాని నాకు లేదా?

"పర పురుషుని చేరిన పడతులు చెడిపోరా?" అని అడుగుతావా? చెడిపోయేవారు చెడిపోవచ్చు అంతమాత్రాన అందరు చెడిపోయినవారేనా?

పురుషులలో మాత్రము చెడిపోయిన వారు లేరా? అంతమాత్రాన పురుషులందరు చెడ్డవారుకారే?

నా శీలము చెడిపోలేదని దేనిమీద ప్రమాణం చేస్తే నీవు నమ్ముతావు? కర్మ సాక్షులైన సూర్యచంద్రుల మీదనా? సృష్టి, స్థితి, లయకర్తలైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులపైననా?

నాకు సకలదేవులకంటే నా ప్రాణేశ్వరుడే గొప్ప. నేను నీ మీద ఒట్టుపెట్టుకొని నా శీల నిరూణ చేసికోవడానికి కూడ సిద్ధమే.

"నేను నీ దగ్గరలో లేనప్పుడు నీవు ఎలా ఉన్నావో నాకేమి తెలుసు" అంటావా? ఆ ప్రశ్న నేను కూడ నిన్ను అడుగవచ్చు. నిన్ను వదలి వచ్చాక నీవు ఎవ్వరితో ఏమి మాట్లాడావో? ఎలా మెదలుకొన్నావో నాకేమి తెలుసు? అయినా పరస్త్రీల పట్ల నీ (మాతృ) భావము నాకు తెలుసు. అందువలన నేను నిన్ను నీచంగా నిందించజాలను. (మందరము) నా శీలాన్ని శంకించి నన్ను వదిలివేస్తున్నానని అన్నావే? "అనుమానము మీదే శిక్షలు విధించాలని శిక్షాస్మృతిలో ఎక్కడ ఉంది? నేరము ఋజువైతే కదా శిక్ష విధించాలి.

"పది మంది నేరస్థులు శిక్ష నుండి తప్పుకొన్నా ఫరవాలేదు. కాని నిర్దోషి ఒక్కడు కూడ శిక్షింపబడకూడదనే శిక్షాస్మృతి నీకు తెలియదా?

ఒకవేళ పర పురుషుని ఇంట్లో ఉండడమే నా నేరమని నీవు నిర్ణయానికి వస్తే ఇంతదూరము ఎందుకు వచ్చావు? సుగ్రీవమైత్రిని ఎందుకు సాధించుకొన్నావు? హనుమను దూతగా ఎందుకు పంపావు? ఇవన్ని వ్యర్థ ప్రయత్నాలే కదా। నీవంటి విజ్ఞుడు వ్యర్థ ప్రయత్నాలు చేస్తాడా? అలాకాదు. నా ప్రయత్నము వ్యర్థము కాదు. నిన్ను రావణుని నుండి రక్షించడము నా బాధ్యత నిన్ను రక్షించాను కాబట్టి నా ప్రయత్నమంతా. సఫలమే అంటావా?

నన్ను రక్షించి ఏమి చేశావు? అశోకవనంలో ఉండేదానిని. ఇప్పుడు రణభూమికి రప్పించి వదలివేస్తున్నావు. ఇదేనా నన్ను రక్షించడము?

"నీవెన్నైనా చెప్పు. నీ మాట వినను. కాముకుడైన రావణుని దగ్గర పది మాసాలు ఉన్నాక నీవు చెడిపోయిన దానివే" అంటావా? నన్ను వదలడానికే నిర్ణయించుకొంటావా? అప్పుడు నీవు చూపిన నాల్గు స్థలాలు, లక్ష్మణ, భరత, సుగ్రీవ, విభీషణులు నాకెందుకు? నీవు కాదన్నాక నాకీ జీవితంలో ఏమి పని? ధర్మమూర్తి శ్రీరామభద్రుని వలన ఆయన ధర్మపత్నే అనుమానింపబడ్డాక, ఇక ఆమె ఒక్క క్షణం కూడ ఈ భూమిపై జీవించి ఉండాలని కోరుకోదు.

"సౌమిత్రీ। నీవు కూడ మీ అన్న లాగే మీ వదినను అనుమానిస్తున్నావా? లేక నీ విశ్వాసము, ఆదరాభిమానాలు చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయా? ఒకవేళ అవి అలాగే ఉంటే మీ వదిన ప్రాణత్యాగం కొరకు చితిని పేర్చు. ఆ అగ్ని దేవుడే నా పవిత్ర శీలాన్ని లోకానికి ఋజువుచేస్తాడు.

"మా అన్న స్పష్టంగా అనుమతించకుండానే నీవు ప్రాణత్యాగము ఎలా చేస్తావు?" అని అడుగుతావా?

నన్ను మీ అన్న రావణుని నుండి చెర విడిపించాడు. కనుక నేను రావణు నుండి విముక్తనై స్వతంత్రురాలనయ్యాను. చెరవిడిపించిన మీ అన్న నన్ను స్వీకరించడం లేదు. అందువలన ఆయన ఆజ్ఞలో కూడ లేను". అని జానకి పలికింది.

లక్ష్మణుడు నిశ్చేష్టుడయ్యాడు. ఆయనకు ఏమి చేయాలో తోచడం లేదు. అన్న వైపు చూచాడు. "సీతాదేవి మాటను పాటించుమన్నట్లు" తల ఊపాడు. కన్నతల్లి కంటే మిన్నగా తాను భావించిన తన వదినకి చితిపేర్చక ఆయనకు తప్పలేదు.

చెడు స్థలములో పడిన వానమేఘాగతమ్మైనా:
గంగా జలము వలె పవిత్రమగునే?

నాకుం బిడ్డలు లేరు. బిడ్డవలె నున్నెము నీవిన్నెళ్లు నా కై
కొంచెమ్మైనట్టి సాయమును జేయంజాడవే? నీవు ల చ్చీ!
కాష్టంబులు దెచ్చి నాకయిచితిం జేర్పించు"

# అగ్నిప్రవేశము

సీతాదేవికి రాముని మనస్సు పూర్తిగా తెలుసు. ఆయనకు తన విషయంలో అణుమాత్రమైనా అనుమానం లేదు. అయితే ఆయన ఆదర్శపురుషుడు. ధర్మసంస్థాపనకై అవతరించిన మహానుభావుడు.

అందువలన లోకం దృష్టిలో నిందిపదగిన తన భార్యను, ఆమె ఎంత "ప్రాణప్రియ" అయినా తాను స్వీకిరంచజాలడు. అయితే నిర్దోషి అయిన తన భార్య, లోకనింద కొరకు, తన కాఠిన్యం వలన అగ్నిపాలు కావడం ఆయనకు తీవ్ర మనో వేదనకు గురిచేసింది. ఆయన కళ్లు దుఃఖాశ్రువులను వర్షిస్తున్నాయి.

భర్త మనస్సు పూర్తిగా తెలిసిన ఆమె అగ్నిప్రవేశం ముందు భర్తనే పరమదైవంగా భావించి చేతులు జోడించి ఆయనకు ప్రదక్షిణం చేసింది.

ఆ మహాసాధ్వి సకల దేవతలకు ప్రణమిల్లి అగ్నిదేవునితో ఇలా అంది.

"అన్ని తెలిసిన అగ్నిభట్టారకా! నా భర్త నా శీలము పట్ల విశ్వాసం కల వాడైతే, సూర్యచంద్రులు, సకలదేవతలు, అహోరాత్రులు నా శీలాన్ని నమ్మినవారైతే, నన్ను కాపాడమని ప్రార్థించి" యజ్ఞంలో పవిత్ర ఆజ్యధారవలె ఆమె అగ్నిలో దుమికింది.

ఆ చర్య వలన దిక్కులు వణికాయి. చీకట్లు చుట్టుముట్టాయి. సకల ప్రాణులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. లోకాలన్ని చలనాన్ని కోల్పోయాయి. ఒక్కసారి ప్రళయమే వచ్చినట్లు అనిపించింది. ఆ విషాద దృశ్యాన్ని చూడలేక రామునితో పాటు లక్ష్మణుడు, సుగ్రీవ, విభీషణ హనుమదాదులు కళ్లు మూసుకొన్నారు.

(ఇక్కడ "అగ్నిలో ప్రవేశించింది నిజ సీత కాదని, నిజసీతను మారీచ మృగం రాక ముందే శ్రీరాముడు అగ్నిహోత్రుని దగ్గర దాచి, హోమం ద్వారా మాయా సీతను తెప్పించుకొన్నాడని, అప్పటినుండి రావణుని ద్వారా అపహరింపబడింది, లంకలో అన్ని బాధలకు గురి అయ్యింది, అన్ని దుఃఖాలను భరించింది, ఇప్పుడు శ్రీరాముని ద్వారా అనుమానింపబడి అగ్నిలో ప్రవేశించింది "మాయ సీతే" అని, తన నిజ సీతను పైకి తెచ్చుకోవడానికి, మాయా సీత అగ్నిప్రవేశానికి అనుమతించాడని" కొన్ని రామాయణాలు తెలుపుతున్నాయి.

అప్పుడు సీతమాయే కనుక ఆమె బాధలు మాయకావా? ఆమె పాతివ్రత్యాన్ని నిరూపించుకోవడం మాయ కాదా? దానివలన సీత ఆదర్శ మహిళ ఎలా కాగలుగుతుంది?

వాల్మీకి భగవానుడు ఈ కట్టు కథలకు అవకాశమివ్వలేదు. బ్రహ్మప్రసాదం వలన ఆయన ప్రతి మాట సత్యమే.

# దేవతల స్తోత్రము

రావణుడు మరణించాడు. కనుక ఇక శ్రీరాముని మనుష్య మాత్రుడుగా లోకం భావించవలసిన పనిలేదు. అందువలన ఆయనను ఇంతవరకు దర్శించని దేవలందరు తమ విమానాలపై రాముని దర్శింపవచ్చి, స్తోత్రాలను చేయసాగారు.

"శ్రీరామచంద్రా। నీవు చరాచర సృష్టికర్తవు. ఈ విశ్వాన్ని సృష్టించి, రక్షించి, ప్రళయం చేసే భగవంతుడివి.

రావణ వధార్థము మనుష్యుడుగా మా ప్రార్థనలపై అవతరించిన పరమాత్మవు. నీ విభూతి సర్వవ్యాప్తమైనది.

(భగవద్గీతలో శ్రీకృష్ణుని విభూతి దశమాధ్యాయంలో వివరింపబడినట్లు ఇక్కడ శ్రీరాముని విభూతి తెలుపబడింది)

"అష్ట వసువులలో ప్రజాపతి అయిన "ఋతుధాముడనేవసువు నీవు. ఏకాదశ రుద్రులలో ఎనమిదవవాడైన మహాదేవుడవు నీవు. సాధ్యులలో అయిదవవాడైన "వీర్యవంతుడివి" నీవు. అశ్వినీదేవతలు నీ రెండు చెవులు. సూర్యచంద్రులు నీ రెండు కళ్లు. నీవు ఆది మధ్యాంత రహితుడవు.

అటువంటి అవతారపురుషుడివి. ఏమి తెలియని ప్రాకృత పురుషుని వలె లోకమాత అయిన సీతాదేవిని అనుమానించి అగ్నిలో పడుటకు అనుమతించుట న్యాయమా?" అని ప్రశ్నించారు.

అప్పుడు శ్రీరామచంద్రుడు ఆ దేవతలతో, నన్ను సకల సృష్టికర్తనని ప్రశంసిస్తున్నారు. నేను దశరథ పుత్రుడను. రామచంద్రుడను. ఒక మానవ మాత్రుడినే అని అనుకొంటున్నాను" అని పలికాడు "ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం".

# బ్రహ్మదేవుని స్తోత్రము

శ్రీ మహావిష్ణువు యొక్క నాభీకమలము నుండి జన్మించి, వేదవిద్యను అభ్యసించి, సృష్టికారకుడైన, నాలుగు ముఖాల బ్రహ్మ శ్రీరాముని స్తుతిస్తున్నాడు.

"రామభద్రా! నీవే శ్రీమన్నారాయణుడివి. శ్రియఃపతివి. శంఖ చక్రగదా ధారివి. నీవే ఆది వరాహస్వామివి. నీవే ఆనందానికి మూల స్వరూపుడివి (కృష్ణుడివి). నీవే బలానికి మూల స్వరూపము.

నీవే దేవతాసేనానివి. నీవే గ్రామాలకు (అజ్ఞానులకు) పాలకుడివి. నిరతిశయ సంపన్నుడైన మహేంద్రుడివి నీవే. కామక్రోధాది అంతశ్శత్రువులను అణిచేవాడివి నీవు. నా జన్మకు కారణమైన పద్మనాభుడివి నీవే. మా అందరికి రక్షణోపాయము నీవే. రక్షించేవాడివి నీవు.

నీవే యజ్ఞము. ఓంకార వషట్కారాలు నీవే. సహస్ర శిరములు సహస్ర చరణములు, సహస్ర భుజములు గల విరాట్పురుషుడివి నీవే.

ప్రళయకాలంలో ప్రకృతి, జీవులను నీ కడుపులో దాచుకొన్న కరుణామయుడివి నీవే.

రామభద్రా! నేను నీకు హృదయాన్ని. సరస్వతి నీ నాలుక. సమస్తదేవతలు నీ వెంద్రుకలు"

ఈ నాస్తోత్రాన్ని విన్నవారు, చదివిన వారు, ఆపదలన్నిటినుండి విముక్తులై సకల సంపదలను పొందుతారు" అని ముగించాడు.

# అగ్నిదేవుని సాక్షాత్కారము

అంతలో సుర, నర వానరులందరు ఆశ్చర్యంతో చూస్తుండగా తళ తళ ప్రకాశిస్తున్న వస్త్రాలతో, ధగధగ మెరుస్తున్న బంగారు ఆభరణాలతో, ఆకాశాన్ని అంటుతున్న జ్వాలల మధ్య నుండి అగ్ని భగవానుడు ప్రత్యక్షమయ్యాడు.

తను (కన్న) చిన్న పిల్లను పొదివి పట్టుకొన్నట్లు, పదిలంగా సీతాదేవిని పట్టుకొని

శ్రీరాముని ముందు నిలిచి "రామభద్రా! నీ దేవి సీతాదేవి మహా పతివ్రత. పవిత్రులందరి కంటే పవిత్రురాలు.

లంకలో అశోకవనంలో పదిమాసాలు నీ రూపాన్నే ధ్యానిస్తూ, నీ నామాన్నే జపిస్తూ, నీ స్మరణతోనే పదిమాసాలు, పవిత్రంగా జీవితం గడిపిన నీ భక్తురాలు.

ఆమె తలచుకొంటే తన పాతివ్రత్య శక్తితో నన్నే కాల్చివేయగలుగుతుంది. ఆమె నన్ను పవిత్రం చేయడానికే నాలో ప్రవేశించింది.

మచ్చలేని మాణిక్యమీ తల్లి! పుటము పెట్టిన బంగారమీ సాధ్వి!

పవిత్రతకే పవిత్రతను కలిగించే ఈ పతివ్రతా శిరోమణిని నీకు కానుకగా సమర్పిస్తున్నాను. అనుమానాలన్ని వీడి ఈమెను ఏలుకో" అని అగ్నిదేవుడు సీతను రాముడికి అప్పగించాడు. అప్పుడు సమస్త ప్రాణులు సంతోషించారు. దిక్కులు వెలిగిపోయాయి. సూర్యచంద్రులు అమితంగా ప్రకాశించారు. సుర, నర వానర, మహర్షులు జయజయ ధ్వనులు కావించారు. శ్రీరాముని పరమాత్మతత్వాన్ని బ్రహ్మదేవుడు స్వయంగా వివరించడం, అగ్ని భగవానుడు ధగధగ మెరుస్తున్న బట్టలతో సీతాదేవిని రామభద్రునికి అప్పగించడం వలన సుగ్రీవ విభీషణాదులకు "సీతారాముల పరత్వము" అర్థమైంది. అప్పుడు శ్రీరామచంద్రుడు "అగ్ని భట్టారకా! నాకు సీతాదేవి పవిత్రత గురించి తెలుసు. సీతాదేవిని ఏ పాపము అంటుకోజాలదు.

అయితే దీర్ఘకాలము ఒక కాముకుని ఇంట్లో ఉన్న సీతను నాకు ఆమె పవిత్ర శీలము తెలిసినా వెంటనే పరిగ్రహిస్తే నన్ను కాముకుడైన రాముడని లోకులు నిందిస్తారు. సీతాదేవి శీలాన్ని సాధారణ లోకము అర్థము చేసికోజాలక, ఆమెను కూడ నిందిస్తారు.

అందువలన ఆమె అగ్నిలో దూకినా, చూస్తూ ఏమి చేయలేని వానివలె ఊరుకున్నాను.

నిజానికి సీతాదేవి తన పాతివ్రత్య తేజస్సుతో తనను తాను కాపాడుకోగలుగుతుంది. "ఆమెను వశపరచుకోవాలని అనుకునే రావణులెందరైనా ఆమె తేజస్సు ముందు అగ్నిలో పడి మాడిపోయే పురుగులే" అవుతారు.

సీతాదేవికి రావణుని అంతఃపురంలోని సకలైశ్వర్యాలు తృణప్రాయాలు.

నిజంగా సూర్యుని నుండి ప్రభను వేరుచేయలేనట్లే నా నుండి సీతాదేవిని ఎవ్వరు వేరుచేయజాలరు.

"అనన్యాహి మయా సీతా। భాస్కరేణ యథాప్రభా।

మీరందరు కూడ నాకు హితాన్ని ప్రబోధించారు. మీ అందరి శుభవాక్కులను కూడ దృష్టిలో పెట్టుకొని నేను ప్రేమతో మనస్ఫూర్తిగా సీతాదేవిని స్వీకరిస్తాను" అని పలికి సీతాదేవిని లోకకల్యాణం కొరకు చేపట్టాడు.

# మహేశ్వర స్తోత్రము

శ్రీ రామచంద్రుని శుభవాక్యాన్ని విని, ఆయన సీతాదేవిని స్వీకరించడాన్ని చూచిన మహేశ్వరుడు "కమలాక్షా! నీవు విశ్వ కల్యాణకరమైన పనిని నెరవేర్చావు. లోకమాత అయిన సీతాదేవిని స్వీకరించావు.

లోకకంటకుడైన రావణాసురుని సంహరించి, మూడు లోకాలకు ఆయన భయాన్ని శాశ్వతంగా నివారించావు.

నీవు దీనుడైన భరతుని, కీర్తి స్వరూపిణి అయిన కౌసల్యాదేవిని ఓదార్చు. కైకేయీ సుమిత్రలను సంతోషపరచు. అయోధ్యా రాజ్యాన్ని స్వీకరించి అందరిని సంతోషపెట్టు. ఇక్ష్వాకు వంశాన్ని వృద్ధి చేసి, అనేక అశ్వమేధ యాగాలను ఆచరించి, ఏకచ్ఛత్రపాలనను నెలకొల్పు. నీ సామ్రాజ్యంలో ధర్మదేవతను నాలుగు పాదాలతో నిలబెట్టు. బ్రాహ్మణులకు అపారంగా ధనాన్ని ఇవ్వు. దీనులను ఆదరించు. "రామ రాజ్యమని" సురులు, నరులు శాశ్వతంగా జ్ఞాపకముంచుకొనేలా ధన ధాన్య సమృద్ధితో రాజ్యపాలన కావించి, నీ పని పూర్తి అయ్యాక పరమపదానికి వెళ్లిపో!

ప్రస్తుతానికి ఇంద్రలోకం నుండి నీ దగ్గరకు నీ విజయాన్ని చూచి ఆనందించడానికి, మనుష్యలోకంలో నీ తండ్రి అయిన దశరథ చక్రవర్తి విమానంలో వచ్చాడు. ఆయనకు నమస్కరించుమని" మహేశ్వరుడు తెలిపాడు.

అప్పుడు అత్యంత సంతోషంతో రామభద్రుడు లక్ష్మణ సమేతుడై విమానస్థుడైన దశరుథుని దర్శించాడు.

దశరథుడు తనకు ప్రాణప్రియుడైన శ్రీరామభద్రుని, తన తొడపై కూచోబెట్టుకొని, తన బాహువులతో ఆయనను కౌగిలించుకొని," తండ్రీ! శ్రీరామచంద్రా! నాకీ స్వర్గలోకము రుచించలేదు. సురుల సమ్మానము ఇష్టముకాలేదు. ఈ రోజు నీవు శత్రువును జయించి, వనవాసాన్ని ముగించుకోవడం నాకు అత్యంత ఆనందాన్నిచ్చింది. ఇంతవరకు నీ

వనవాసానికి కారణాలైన కైకేయివాక్యాలే నా మనస్సుకు ముల్లులా కుచ్చుకొన్నాయి॥ అని పలికి ప్రక్కలో ఉన్న లక్ష్మణుని కూడ కౌగిలించుకొన్నాడు.

"శ్రీరామా! అష్టావక్రుడనే మహాత్ముని వలన ఆయన తండ్రి తరించినట్లుగా నీ వలన నేను తరించాను. ఈ రోజు నాకు అర్థమవుతున్నది రావణవధ కొరకు దేవతల ప్రణాళికలో భాగంగానే నీ వనవాసము ఏర్పడిందని.

కౌసల్యాదేవి నిజంగా సౌభాగ్యవతి. అరణ్యవాసము ముగించుకొని అయోధ్యకు తిరిగి వెళ్లిన నీకు ఘనస్వాగతము పలుకుతుంది.

ఇక నీవు నీ తల్లులతో, నీ సోదరులతో కలసి ఆయురారోగ్యైశ్వర్యాలతో వర్ధిల్లి చిరకాలము రాజ్యపాలన చేయుమని" మహారాజు రామచంద్రుని ఆశీర్వదించాడు.

అప్పుడు శ్రీరాముడు చేతులు జోడించి," మహారాజా! నా పైన ప్రేమతో "భరతునితో సహా కైకేయిని పరిత్యజిస్తున్నానని" ఘోరంగా శపించారే। ఆ శాపాన్ని దయతో ఉపసంహరించుకొండి. వారిని మన స్ఫూర్తిగా క్షమించండి" అని ప్రార్థించాడు. అలాగే అని రామవాక్యాన్ని దశరథుడు మన్నించాడు.

మళ్లీ రాముని ప్రక్కలో చేతులు జోడించి నిలబడ్డ లక్ష్మణుని చేరదీసి కౌగిలించుకొని, "సుమిత్రానందనా! సీతారాములను నీవు సేవించిన విధానము నాకు చాల ఆనందాన్ని కలిగించింది. శ్రీరాముడు పురుషోత్తముడు. ఈ సకల దేవతలు, మహర్షులు ఆయనను నిరంతరము సేవిస్తుంటారు. ఆయనే దేవదేవుడు. నీవు ఆయనను ఇంతకాలము భక్తితో సేవించి విపులమైన కీర్తిని సంపాదించావు. నీవిలాగే సీతారాములను నిత్యము సేవించి ధన్యుడివికా" అని హితాన్ని బోధించాడు.

"అలాగే మహారాజా!" అని లక్ష్మణుడు పలికాడు. అప్పుడు సీతాదేవి వైపు తిరిగి, "ఇక్ష్వాకు కులమణిదీపమా! నీవు శ్రీరాముని ద్వేషించకు. నీ కీర్తి చంద్రికలను, నీ పాతివ్రత్య తేజస్సును సకల లోకాలలో వ్యాపింపజేయడానికే నీకీ పరీక్ష విధింపబడింది.

నీవు పతిని ఇంతకుముందులాగానే మనస్ఫూర్తిగా ప్రేమించు. శ్రద్ధతో ఆదరించు" మని తెలిపాడు.

ఈ విధంగా తన ప్రాణప్రియులైన ఇద్దరు కొడుకులను, తనకు అత్యంత ఇష్టురాలైన కోడలును మనసారా తృప్తితో చూచుకొని మహారాజు స్వర్గానికి తిరిగి వెళ్లాడు.

# మహేంద్రుని ప్రార్థన

దశరథుడు స్వర్గానికి తిరిగి వెళ్లగానే దేవేంద్రుడు అంజలి ముద్రతో “రామభద్రా! నీ దర్శనము అమోఘమైనది. మాకు ఆనందప్రదమైనది.

అయితే ఈ శుభసమయములో నీవేదైనా మనస్సులో అనుకొంటే ఆజ్ఞాపించు. తక్షణమే దానిని సంతోషంగా నెరవేరుస్తానని” తెలిపాడు.

అప్పుడు దేవేంద్రునితో రామనరేంద్రుడు “ఒకవేళ మహేంద్రా! నీకు నాపైన ప్రీతి కలిగితే, నా కొరకు రణరంగంలో పోరాడుతూ, ప్రాణాలను త్యాగం చేసిన వానరులందరు తిరిగి జవసత్వాలతో బ్రతుకాలి. నా కొరకు భర్తలను, పుత్రులను, సోదరులను కోల్పోయిన వనితలందరు మళ్లీ వారిని పొంది సంతోషించాలి” అని కోరాడు.

మహేంద్రుడు మహా సంతోషంగా ప్రాణాలను కోల్పోయిన వానర భల్లూకాలందరిని బ్రతికించి వారికి జవసత్వాలను కల్గించాడు.

వానరులందరు మళ్లీ బ్రతికి మహాశ్చర్యంతో, మహాసంతోషంతో శ్రీరామచంద్రునికి జయజయధ్వానాలతో నమస్కరించారు.

దేవతలందరు సంతుష్టుడైన శ్రీరాముని చూచి మంగళవాక్యాలను పలికారు.

“రామచంద్రా! ఇక అయోధ్యకు బయలుదేరు. కిష్కింధలో వానరులందరును దించి – అయోధ్యకు చేరుకో. మహాపతివ్రత, నీ పట్ల ప్రాణాలకంటె అధికంగా ప్రేమ గల సీతాదేవిని ఓదార్చు.

అలాగే నీ తల్లులను, నీ తమ్ముళ్లను కలిసికొని వారిని సంతోషపరచు. అత్యంత దీనుడైన, మహాత్ముడైన నీ తమ్ముడు నీ రాక కొరకు ప్రతిక్షణము లెక్క పెట్టుకొంటు ఎదిరి చూస్తుంటాడు. ఆయనను కలిసికొని, ఆయన ప్రార్థనను అనుసరించి, సామ్రాజ్యాన్ని స్వీకరించు. ప్రజలను కన్న తండ్రి వలె తృప్తిపరచు”.

ఈ విధంగా శ్రీరామునికి తమ మనోభీష్టాన్ని తెలిపి తమ తమ దివ్య విమానాలలో దేవతలంతా త్రిదివానికి వెళ్లి పోయారు.

దేవతలందరికి వీడ్కోలు పలికి శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణులతో సహా తమ నివాసానికి వెళ్లాడు.

వానర సైన్యమంతా శ్రీరామచంద్ర స్వామిని పరమాత్మగా బ్రహ్మరుద్రేంద్రాది సకల దేవతలు స్తుతించగా విని, మహా సంతోషంతో తమ మనస్సులలో శ్రీరాముని పరదైవంగా ముద్రింపజేసికొని ఆ రాత్రిని, ఆశ్చర్యంతో హర్షంతో గడిపారు.

# పుష్పక విమానము

ఆ శుభరాత్రి తరువాత తెల్లవారి విభీషణుడు శ్రీరాముని సందర్శించి "మంగళస్నానానికి అవసరాలైన కుంకుమ పూవు, దివ్య జలాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలు, చందనాది పరిమళ ద్రవ్యాలు, దివ్యమాలలు సిద్ధంగా ఉన్నాయి. స్నానం చేయించడానికి, అలంకరించడానికి ఉత్తమ స్త్రీలు సంసిద్ధులై ఉన్నారు. అందువలన ప్రభూ! నా పై దయతో మంగళ స్నానానికి అంగీకరించండి" అని వేడుకొన్నాడు.

శ్రీరామచంద్రుడు "తాము అడవులలో పడ్డ కష్టాల కంటె ఎక్కువగా, అయోధ్యలో ఉండి, రాజభోగాలన్ని అనుభవించదగిన యోగ్యుడై కూడ, కష్టాలనుభవిస్తున్న తన తమ్ముడైన భరతుడు మంగళస్నానం చేయకుండా తాను చేయనని" తెలిపాడు.

తాము తిరిగి వెళ్లవలసిన అయోధ్య అత్యంత దూరంలో ఉందని, తాము తక్షణమే ప్రయాణించవలసి ఉందని శ్రీరాముడు తెలిపాడు.

అప్పుడు విభీషణుడు, "రామప్రభూ! మా అన్న అయిన రావణుడు అపహరించి తెచ్చిన వస్తువులన్నిటిని తిరిగి వాటి యజమానులకు నా పట్టాభిషేకం జరిగిన వెంటనే త్రిప్పి పంపాను.

అయితే కుబేరుని నుండి మా అన్న అపహరించి తెచ్చిన విమానం మాత్రము నా దగ్గరే ఉంది. అది చాలా విశాలమైంది. ఎంతమందినైనా తీసికొని ప్రయాణించగల్గుతుంది. అత్యంత వేగవంతంగా వెళ్లగలుగుతుంది.

నీవు నీ వాళ్లందరితో అతి త్వరగా అయోధ్యకు వెళ్లగలుగుతావు. దానికి ముందు నా ప్రార్థనను దయచేసి అంగీకరించు."

"విభీషణా! నీవు నన్ను నమ్మి రావణ విజయములో నీవు చేసిన సహాయము నేనెన్నటికి మరువజాలను. నీ మాటను కాదంటున్నానని అనుకోకు. నా మనస్సంతా నా తమ్ముడైన భరతునిపైననే ఉంది. ఆయన తనప్రాణాలను బిగపట్టుకొని క్షణమొక యుగంగా నా కొరకు ఎదిరిచూస్తున్నాడు. మాట ఇచ్చిన రోజు వరకు నేను చేరుకోలేక

పోతే మా భరతుడు ప్రాణాలతో ఉండడు. అందువలన మా తక్షణ ప్రయాణానికి ఏర్పాట్లు కావించుమని" శ్రీరాముడు పలికాడు.

శ్రీరాముని ఆదేశము మేరకు విభీషణుడు పుష్పకాన్ని సిద్ధ పరిచాడు. "ఆ పుష్పకము వేగంలోనే కాక సౌందర్యంలో కూడ సాటిలేనిది.

దానిపైన పెద్ద పెద్ద హాలులు ఉన్నాయి. అవి వైడూర్య శోభితాలు. పెద్ద పెద్ద బంగారు మిద్దెలు ఉన్నాయి. వాటిలో బంగారు కమలాలు చిత్రించబడ్డాయి. తెల్లని పతాకాలు ముత్యాలతో అలంకరింపబడ్డాయి. విమాన గవాక్షాలు రత్నానిర్మితాలు. దాని చుట్టు బంగారు గంటలు మ్రోగుతున్నాయి. అది మేరు పర్వతము లాగా ఎత్తుగా ఠీవిగా ఉంది. దానిని విశ్వకర్మ నిర్మించాడు."

అటువంటి సాటిలేని విమానాన్ని విభీషణుడు శ్రీరాముని ముందు ఉంచాడు.

శ్రీరాముడు విభీషణునితో "తన కొరకై ప్రాణ త్యాగానికి కూడ సిద్ధపడి భయంకరంగా యుద్ధం చేసిన వానరులందరికి తగిన బహుమానాలిచ్చి పంపితే బాగుంటుంది. దాని వలన నీ దాతృత్వము, నీ కీర్తి ప్రతిష్టలు అందరికి తెలుస్తాయ"ని పలికాడు.

శ్రీరామాజ్ఞ ప్రకారము విభీషణుడు అమూల్యాలైన వజ్ర, వైడూర్య, సువర్ణాలను, రత్నమాణిక్యాలను తెప్పించి, వానరులందరికి పుష్కలంగా బహుమానాలిచ్చాడు. వానరులందరు చాలా సంతోషించారు.

అప్పుడు శ్రీరాముడు వారందరికి తమ తమ స్థలాలకు వెళ్లడానికి అనుమతినిచ్చాడు.

అప్పుడు సమస్త వానర సమేతుడైన సుగ్రీవుడు, రాక్షస రాజైన విభీషణుడు శ్రీరాముని పట్టాభిషేకాన్ని సేవింపదలచి, ఆ విషయాన్ని ఆయనతో మనవి చేశారు.

భక్తవత్సలుడైన రామభద్రుడు వారి కోరికను మన్నించాడు.

వారందరు మహోత్సాహంతో సువిశాలమైన పుష్పక విమానాన్ని అధిరోహించి, సౌకర్యంగా కూచొని, ఆశ్చర్యకరాలైన అనేక విషయాలను ముచ్చటించుకొంటూ అయోధ్యకు ప్రయాణమయ్యారు.

ఆధునికులము తామే అనుకొంటున్న కొందరు వ్యక్తులు "పుష్పక విమానము ఆ కాలంలో లేనేలేదని, నాగరికత ఇంత అభివృద్ధి చెందిన ఈ కాలంలో ఉన్న విమానాలను ఆ కాలంలో ఉన్నట్లు తెలుపడం అభూతకల్పనమే" అని వాదిస్తారు.

అయితే వారు వాదిస్తున్నట్లు నాగరికత అభివృద్ధి చెందడం ఇప్పుడే కాదు, శ్రీరాముని కాలంలో నాగరికత ఇప్పటికంటే అధికంగా ఉంది.

భారద్వాజ మహర్షి "విమాన పురాణమనే" ఒక గ్రంథము వ్రాశాడు. అందులో ఇప్పుడు కూడ లేని అనేక విధాలైన విమానాల గురించి ఆయన వ్రాశాడు.

"అప్పటి విమానాలు సంకోచ వికాసాలు (Elasticity) కలిగి ఉండేవి. మామూలుగా చిన్నవిగా కనపడేవి. కాని ప్రయాణీకుల సంఖ్యను, వారి అవసరాలను బట్టి అవి విచ్చుకొని పెద్దవిగా అయ్యేవి. పుష్పక విమానము అటువంటిదే.

అంతేకాదు ఆనాటి విమానాలు శత్రువులు గుర్తుపట్టకుండా ఉండేందుకు మార్గమధ్య లోనే తమ ఆకారాలను, రంగులను మార్చుకొనేవి."

అటువంటి విమానాలు ఈనాడు మన ప్రపంచంలో ఇంకా అభివృద్ధి కానే లేదు.

అందువలన నాగరికతాభివృద్ధి శ్రీరాముని కాలంలో ఉంది. భారత కాలంలో ఉంది. అయితే "తన దగ్గరే అన్ని ఉండాలి. ఇతరుల వద్ద ఏవి తనతో సమానంగా ఉండకూడదు" అనుకొనే స్వార్థప్రవృత్తి మానవునికి మొదటి నుండి ఉంది. దానివలన మానవుడు తన విధ్వంసక శక్తితో పరుల వస్తువులను, ఆయుధాలను నశింప జేస్తూ వచ్చాడు. ముఖ్యంగా ఈ వినాశము మహా యుద్ధాల కాలంలో అత్యధికంగా జరిగింది.

రామరావణ యుద్ధంతో పాటు, మహాభారతయుద్ధంలో, ఆంగ్లేయులు మన దేశం వచ్చాక మన దేశంలో ఉన్న నాగరికత నశించి పోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీని ఆక్రమించుకొన్న ఐరోపాదేశాలు జర్మనిలోని అనేక ఆయుధాలను నాశనం చేసిన సంగతి మనకు తెలుసు.

ఒక వ్యక్తి మూడవ ప్రపంచ యుద్ధము ఎలా ఉంటుందని ప్రఖ్యాత సైంటిస్టు అయిన ఐన్స్టిన్‌ను అడిగాడట. దానికి బదులుగా ఐన్స్టిన్ "నాకు మూడవ ప్రపంచ యుద్ధమెలా జరుగుతుందో తెలియదు. కాని నాలుగవ ప్రపంచ యుద్ధమనేది ఒకవేళ జరిగితే, అప్పుడు జనులు, రాళ్లతో ఇటుకలతో కొట్టుకొంటారని" తెలిపాడు.

అంటే మూడవ ప్రపంచ యుద్ధమనేది ఒకవేళ జరిగితే దానితో నాగరికత సమూలంగా నశించి పోతుందని అర్థము.

అందువలన "నాగరికతా వికాసానికి గుర్తులైన పుష్పక విమానాదులు శ్రీరాముని కాలంలో కూడ ఉండేవి" అనడంలో అణువంతైనా అనుమానం లేదు.

# స్థల సందర్శనము

శ్రీరాముడు విమానంలో తన ప్రక్కనే కూర్చున్న సీతాదేవికి త్రికూట శిఖరంపై నిర్మితమైన లంకానగర సౌందర్యాన్ని చూపాడు. రావణుని, తదితర ప్రముఖ రాక్షసుల వధ జరిగిన స్థలాలను చూపించాడు.

అన్ని కాలాలలోను అత్యద్భుతమని సురులు, నరులు కీర్తించే విధంగా తాను నలుడను వానరునిచే నిర్మింప జేసిన రామసేతువును సీతాదేవికి చూపెట్టాడు.

తన తరంగాలతో ఆకాశాన్ని అంటుతున్నట్లుగా ఉండి సకల జలచరాలకు నిలయమైన మహా సముద్రాన్ని చూపాడు.

సముద్రానికి ఉత్తర తీరంలో తాము విడిది చేసిన స్థలాన్ని చూపెట్టాడు.

"అత్రపూర్వం మహాదేవః ప్రసాద మకరోన్మమ"

బంగారు రంగు తొడలు గల సీతా! "సముద్రుడు తనపై సేతు నిర్మాణాన్ని సూచించి, తన ప్రసాదాన్ని (దయను) మాకు కలిగించాడు" అని శ్రీరాముడు తెలిపాడు.

అయితే కొందరు ఈ శ్లోకానికి మరొక అర్థాన్ని తెలుపుతారు. "సీతా ఈ సమయంలో నాకు మహాదేవుడైన శంకరుడు తన ప్రసాదాన్ని అనగా అనుగ్రహాన్ని అందించాడు" అని తెలిపారు.

ఇప్పటికి సముద్రతీరంలో ఉన్న "రామలింగేశ్వర క్షేత్రాన్ని" తమ వాదనకు అనుకూలంగా ఉదాహరణగా తెలుపుతారు.

"రామలింగేశ్వర క్షేత్ర" పురాణంలో "రామలక్షణులు సముద్ర తీరంలో ఇసుకతో లింగాన్ని తయారు చేసికొని దానిని పూజించి మహేశ్వరుని ప్రసాదాన్ని పొందారు" అని చెప్పబడుతుంది.

అయితే రామ లింగేశ్వర క్షేత్రము తరువాత ఏర్పడిందా? లేక శ్రీరాముని సముద్ర తరణ కాలంలోనిదా? తెలియదు.

మరొకటి "శ్రీరాముడు సముద్ర తీరంలో మహా దేవుని పూజించినట్లు" వాల్మీకి తెలుపనే లేదు. శ్రీరాముడు సీతాదేవికి చూపించినవాటిలో లంకామార్గంలో జరిగిన

విశేషాలను, అప్పటి స్థలాలను మాత్రమే తెలిపాడు. అందువలన వెళ్లే సమయంలో సముద్ర తీరంలో జరిగినట్లు వాల్మీకి చెప్పని రామలింగేశ్వరార్చన గురించి తిరిగి వచ్చేప్పుడు శ్రీరాముడు సీతాదేవికి ఎలా తెలుపుతాడు.

అప్పుడు "అత్రపూర్వం మహాదేవః" అనే శ్లోక పాదానికి ఏమి అర్థం చెప్పాలి?

మహాదేవుడంటే సముద్రుడే అనే అర్థాన్ని వ్యాఖ్యాతలు తెలిపారు.

1) జలమే భగవంతుడు సృష్టించిన భూతాలలో మొదటిది. అది అనంతమైనది. (మహత్)

"ఆప ఏవ ససర్జాదౌ" అంటుంది వేదము.

ఆ జలరాశికి అధిపతి అయిన దేవుడు మహాదేవుడు. కనుక సముద్రుడే మహాదేవుడు.

2) అష్టమూర్తులలో ఒకడైన మహాదేవుడు జలాధిపతే.

3) మహేశ్వర తీర్థులు:- శ్రీరాముడు చూపించిన దర్భ శయనం (పుల్లాణి) సేతు నిర్మాణము సముద్రానికి సంబంధించినవే కనుక ఇక్కడ మహాదేవుడంటే సముద్రుడే అర్థమని" వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్య చాల సత్యమైనది. అందమైనది కూడ. ఆయన ప్రసాదాన్ని కలిగించాడంటే ప్రత్యక్షమయ్యాడు అని అర్థము.

"దర్శయామాసచాత్మానం। సముద్ర స్సరితాం పతిః' అని రామాయణమే స్పష్టముగా తెలిపింది కదా!

4) మరికొందరు విద్వాంసులు:- "అత్రపూర్వం" అనే పదాలను విరిచి చెప్పారు. "అత్రపూరు+అం"

ఇక్కడ "అత్రపూరు" అనే పదము సీతాదేవికి సంబోధన "త్రపు" అంటే సీసము. 'అత్రపు' అంటే బంగారు అత్రపు+ఊరు = "అత్రపూరు".

అత్రపూరు = అంటే బంగారు రంగుతో ప్రకాశించే ఊరువులు (తొడలు) కలదానా! అనే అర్థము. సౌందర్యవతులైన స్త్రీలను "స్వర్ణోరు" "కనకోరు" అని తెలుపడం సహజమే.

ఇప్పుడు "అత్రపూరు" అయిన సీతాదేవీ! 'అంమహాదేవః' జలాలకు మహాదేవుడైన సముద్రుడు అని అర్థము. ఈ శబ్దార్థము స్పష్టంగా సముద్రునే తెలుపుతుంది.

ఈ విధంగా వ్యాఖ్యాత లందరు "మహాదేవః" అన్నా "అం మహాదేవః" అని విరిచి అన్నా సముద్రుడనే అర్థాన్నే తెలిపారు.

5) మహాంశ్చ అసౌదేవః మహాదేవః గొప్పదేవుడు – సముద్రుడే గొప్ప దేవత.

అయితే కూర్మ, పద్మ పూరాణాల మాటేమిటి?

కూర్మపురాణంలో:–

సేతు మధ్యే మహాదేవం। ఈశానం కృత్తి వాససం

స్థాపయామాస వైలింగం। పూజయామాసరాఘవః”

అని ఉంది.

సేతుమధ్యలో శ్రీరాముడు శివలింగాన్ని స్థాపించి పూజించాడని, ఆ పూజకు సంతోషించిన పార్వతీసమేతుడైన పరమేశ్వరుడు – ఆ లింగము శాశ్వతము గా ఉంటుందని, దానిని దర్శించిన వారి సమస్త పాపాలు నశిస్తాయని శ్రీరామునికి వరమిచ్చాడు. శ్రీరాముని కౌగిలించి పార్వతితో సహా మాయమయ్యాడు” అని ఉంది.

పాద్మ పురాణంలో:–

“రామః పుష్పకాదవరుహ్య। మహాదేవం ప్రతిష్ఠాపితవాన్।

సోऽస్మై ప్రసన్నోऽభూత్” అని ఉంది.

సమాధానము: “కూర్మ” పాద్మ పురాణాలు శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠాపనను శ్రీరాముడు చేసి పూజించాడని తెలుపుతున్నాయి. అయితే కూర్మ పద్మ పురాణాలు చెప్పిన విషయాన్ని వాల్మీకి తెలుపలేదు. కనుక మహేతిహాసమైన వాల్మీకి రామాయణంలో చెప్పబడని విషయాలు ప్రమాణాలు అవుతాయా?

పోనీ ఆ పురాణాలు చెప్పినవి కూడ ప్రమాణాలే కావచ్చునని కూడ అంగీకరిద్దాము. ఆ పురాణాలు కూడ శ్రీరామునికి సేతు నిర్మాణంలో మహా శివుడు అనుగ్రహించాడని స్పష్టపరుచలేదు.

కూర్మపురాణంలో:– రాముడు ప్రతిష్ఠించిన లింగాన్ని సందర్శించిన వారి పాపాలు సమూలంగా నశిస్తాయి అని మహా దేవుడు వరమిచ్చాడు. అయితే సేతువు మధ్యలో శ్రీరాముడు లింగాన్ని ప్రతిష్ఠించి పూజించింది. లంకకు వెళ్లే ముందా? కాదా అని తెలియడం లేదు.

పాద్మ పురాణంలో:– “పుష్పకాదవరుహ్య। మహాదేవం ప్రతిష్ఠాపితవాన్” అని ఉంది. అంటే అయోధ్యకు తిరుగు ప్రయాణంలో శ్రీరాముడు లింగాన్ని ప్రతిష్ఠించాడు. అప్పుడు సీతాదేవి కూడ శ్రీరాముని ప్రక్కనే ఉంది కదా. శ్రీరాముడు పుష్పకాన్ని దిగినప్పుడు

సీతాదేవి విమానంలోనే కూచొని ఉండగల్గుతుందా? ఆమె కూడ దిగివచ్చి లింగ ప్రతిష్ఠలో పాల్గొంటే ఆ విషయాన్ని శ్రీరాముడు ఆమెకే చెప్పడమేమిటి?

ఈ రెండు పురాణ విషయాల మధ్య సామరస్యం కుదరడం లేదు. అనవసరంగా ఆ విషయాలతో తలలు పగుల గొట్టుకోవడం దేనికి?

వాల్మీకి తెలిపిన సముద్ర ప్రత్యక్షము, నలుని ద్వారా సేతు నిర్మాణానికి సలహా ఇవ్వడము మొదలైన విషయాలు అందరు అంగీకరించినవే కదా!

తిలక వ్యాఖ్యలో:- సముద్రుడు సేతు నిర్మాణానికి అనుకూలించిన తరువాత అంతటి మహా కార్యములో విఘ్నాలు కలుగకూడదనే తలంపుతో శ్రీరాముడు లింగాన్ని ప్రతిష్ఠించాడని తెలుపబడింది.

దాని ప్రకారము కూడ సముద్ర ప్రసాదమే ముఖ్యమని శివప్రసాదము దానికి సహాయపడడానికి మాత్రమే ఉపయోగపడిందనేది స్పష్టమైనది.

అందువలన "మహాదేవుడన్నా" "అమ్మహాదేవుడన్నా" సముద్రుడే అని ఆయన "ప్రసాదమంటే సేతునిర్మాణ విషయమే" అని అంగీకరిస్తే పేచే ఉండదుకదా!

పుష్పకము కిష్కింధాకాశములో ప్రవేశించింది. సీతాదేవికి సుగ్రీవుని పత్నులైన తారా, రుమలను కూడ తన వెంట అయోధ్యా నగరానికి తీసిక వెళ్లాలనిపించింది. ఆమె తన కోరికను తన పతికి తెలిపింది. పుష్పకము కిష్కింధలోనిలిచింది. సుగ్రీవుడు విమానం దిగి తారకు సీత కోరికను తెలిపాడు. తార, తన రాజ్యంలోని అంగనలను అందరిని ఆహ్వానించింది. అందరు సర్వాలంకారభూషితలై వచ్చి పుష్పకమెక్కారు.

ఇక్కడ రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. 1) సీతాదేవి వానరాంగనలనెందుకు ఆహ్వానించింది? 2) విభీషణుని స్త్రీలను ఎందుకు పిలువలేదు?

సీతాదేవి ఒంటరిగా దుఃఖాన్ని అనుభవించింది. కాని ఒంటరిగా సుఖాన్ని అనుభవించాలనుకోలేదు. తన ఆనందాన్ని ఇతరులతో కలసి పంచుకోవాలనుకొంది. అది ఉత్తముల స్వభావము. అందువలననే తన అయోధ్యానందాన్ని వానరాంగనలతో కలసి అనుభవించాలనుకొంది. వారిని ఆహ్వానించింది.

అయితే మరొక ప్రశ్న. సీతాదేవి తనకు లంకలో అన్ని విధాల ఉపకరించిన, దుఃఖంలో తనను అన్ని విధాల ఓదార్చిన విభీషణుని స్త్రీలను అనగా ఆయన భార్య సరమను, కూతుళ్లు త్రిజటను, అనలను ఎందుకు తనతో రమ్మని కోరలేదు?

సీతాదేవి వారిని ఆహ్వానించలేదని కాదు. కాని విభీషణ కుటుంబము తప్ప లంకానగరమంతా విషాదమయంగా ఉంది. అటువంటప్పుడు మిగిలిన వాళ్లందరిని పుట్టెడు దుఃఖంలో వదలి తాము మాత్రము అయోధ్యానందాన్ని పొందాలని విభీషణ స్త్రీలు కోరుకొని ఉండరు.

వానరాంగనలు సీతాదేవి అసాధారణ సౌందర్యాన్ని చూచి ఆశ్చర్య చకితలయ్యారు. సీతాదేవి కూడ తారా రుమలను, వానరాంగనలను చూచి చాల సంతోషించింది.

పుష్పకము మళ్లీ పైకి ఎగిరింది.

సీతాదేవికి ఋష్యమూక పర్వతాన్ని, సుగ్రీవునితో స్నేహం చేసిన స్థలాలను చూపాడు. "ఇది హనుమ మమ్ములను మొదట కలసిన స్థలము. ఇది పంపా సరోవరము. ఇది మతంగ మహాముని వనము. ఇక్కడే మహాత్మురాలైన, ఆచార్య నిష్ఠాగరిష్ఠురాలైన శబరి మాకు ఆతిథ్యము నిచ్చి, ఆచార్యానుగ్రహముతో పరమపదం చేరింది.

ఇదిగో ఇక్కడ మేము కబంధుని వధించాము. ఇక్కడే జటాయువు నీ కొరకు రావణునితో పోరాడి తన ప్రాణాలను అర్పించాడు.

ఇక్కడే ఖర దూషణ, త్రిశిరస్కుల పదునాల్గువేల సైన్యాన్ని కొన్ని క్షణాలలో మాడ్చి వేశాను.

ఇదిగో ఇదే మన పర్ణశాల. ఇక్కడే రావణుడు మారీచుని పంపి, మమ్మల్ని దాని వెంట వెళ్లేలా చేసి, నిన్ను అపహరించాడు.

విరాధుడు సంహరింపబడిన స్థలమిదే. ఇవే ఋష్యాశ్రమాలు. పది సంవత్సరాలు మనము ఆనందంగా గడిపిన సుఖాలయాలు. ఇదే అనసూయాదేవి ఆశ్రమము. ఇదిగో ఇక్కడే చిత్రకూటము. ఇక్కడే భరతుడు వచ్చి రాజ్యాన్ని మళ్లీ స్వీకరించుమని నన్ను బ్రతిమాలిన ఆశ్రమ ప్రదేశము.

అప్పుడు నా ప్రాణప్రియుడైన భరతుడు అన్ని విధాల నన్ను శరణు వేడినా ఆయన ప్రార్థనను నేను మన్నించలేదు. అవే యమునా, గంగా, సరయూ నదులు, మా నాన్నగారి రాజధాని అయిన అయోధ్యా నగరము ఇదే. దానికి సీతా చేతులెత్తి నమస్కరించు.

ఇక్కడ శ్రీరాముని మాట గమనించదగినది.

"రాజధానీ పితుర్మమ" ఇది అయోధ్య. మానాన్నగారి రాజధాని నగరము" అంటున్నాడు.

ఇప్పుడు అయోధ్యను దశరథుడు పాలించడము లేదు. చాల ఏళ్ల క్రితమే దశరథుడు మరణించాడు. అప్పటి నుండి అయోధ్య నగరము ఆయనది కానేకాదు. అయితే తన మాట ప్రకారము భరతుడు పాలిస్తున్నాడు. కనుక అయోధ్య భరతునిది. "తనకు రాజ్యము అక్కర లేదు. అన్నదే రాజ్యమని భరతుడు ఖచ్చితంగా తెలిపి, అన్నపాదులకను ప్రతినిధులుగా నిలిపాడు" కనుక అయోధ్య శ్రీరామునిది.

అటువంటప్పుడు "రాజధానీ భరతస్య" అనో "రాజధానీ మమ" అనో అనకుండా "రాజధానీ పితుర్మమ" అని ఎందుకు అంటున్నాడు?

శ్రీరామునికి దశరథునిపై ఎనలేని ప్రేమ. "మద్విధావా పితాపుత్రాః" మావంటి తండ్రి కొడుకులే లేరంటాడు. "దశరథుడు పాలిస్తున్నా, లేకున్నా అయోధ్యా నగరము ఎల్లప్పటికి దశరథుని రాజధానే" అని రాముని విశ్వాసము.

ప్రపన్నులైన వారు తమ గృహాలను ఆచార్యులవిగా భావించి, "ఆచార్య భవనాలని" (ఏలినవారి తిరుమాళిగలని) పిలుచుకోవడం మనకు తెలిసిన విషయమే కదా!

సీతన్ గొంచును బోవ నీతడిట వచ్చెన్నెగ వ్యాజంబు: వి ఖ్యాతిన్
దానవ వంశనాశనము కార్యంబి శివాద్వైతికిన్".

మచ్చ యెరుంగ నట్టిదగు మామక వంశమునందు దైత్యుడీ
మచ్చను తెచ్చె వే తొలగు మార్గము కానగ రాని యట్టిదా"

ఆడుది కైకతో రకముత్రోపభు। నీవని రాక లేదు
ఆడుది సీతగోరకము-రాసుర సంహారణంబు లేదు-యా
యాడుది లేకవే దుజగ మంచు నిదంతయు నేన జేసితిన్.

# భరద్వాజాశ్రమము

అయోధ్యా నగరానికి వెలుపల అతి సమీపంగా "భరద్వాజాశ్రమము" ఉంది. భరద్వాజుడు తన శిష్యులను తండ్రివలె కాపాడేవాడు. తన వీర్యాన్ని స్ఖలనం కాకుండా నిలిపిన జితేంద్రియుడు. "ద్వాజ" మంటే (1) సంతానము (2) వీర్యము.

మూడువందల సంవత్సరాలు వేదాధ్యయనం చేసినా తృప్తి తీరని అసామాన్య అధ్యయన శీలి. తన తపోమహిమ చేత భగవద్భాగవత వైభవాన్ని గ్రహించి, సీతారామ లక్ష్మణులకంటె భరతునికి, ఆయన పరివారానికి అత్యంత ఆదరంతో అపురూపమైన విందును ఒసగిన వివేకశీలి. అదిగో! అటువంటి మహామునిని తిరిగి సేవించి వెళ్లాలని శ్రీరాముడు తన పరివారంతో భరద్వాజ మహాముని ఆశ్రమంలో విడిది చేశాడు.

భరద్వాజాశ్రమంలో ఆగడానికి మరొక ముఖ్య కారణముంది.

"చిత్రకూటానికి భరతుడు వచ్చి ఆయనకు రాజ్యమక్కర లేదని, రాజ్యాన్ని స్వీకరించుమని తనను (రాముని) నిర్బంధించి, తాను రాకుంటే తన పాదుకలపైనా ఇమ్మని, ఆ పాదుకలనే ప్రతినిధులుగా భావించి, తనకు (రామునికి) బదులుగా రాజ్యపాలన చేస్తానని, అది కూడ కైక విధించిన పదునాల్గేండ్లు పూర్తి అయ్యేదాకే అని, ఆ తరువాత ఒక్క రోజు ఆలస్యమైనా ప్రాణాలతో ఉండనని భరతుడు శపథం చేసి వెళ్లాడు. అది అప్పటి ఆయన తీవ్ర మనస్థితి.

ఇప్పటికి చాల కాలం గడిచింది. "కాలః కలయతామహం" అని గీతాచార్యుడు చెప్పినట్లు "కాలము ఊహించని అనేక మార్పులకు కారణమవుతుంది."

"ఇప్పటికి భరతునికి రాజ్యము పట్ల అదే నిరాసక్తి, అదే తృణీకార భావము ఉందా? లేక రాజ్యభోగాలు ఆయనలో ఆశలను లేపాయా?" అని రాముడు పరీక్షించాలను కొన్నాడు. ఒకవేళ భరతుని మనస్సులో రాజ్యకాంక్ష మొలకెత్తి, వేళ్లు బారితే, రాజ్యాన్ని శాశ్వతంగా భరతునికే ధారాదత్తం చేసి, తాను అడవులలోనే శేష జీవితాన్ని గడుపాలనుకొన్నాడు.

అందువలన ఇతరుల మనస్సులలోని భావాలను గ్రహించడంలో నేర్పరి అయిన హనుమను భరతుని వద్దకు పంపాడు. ఒకవేళ భరతునిలో మార్పు ఏ కొద్దిగా కనపడ్డా తక్షణమే తిరిగి వచ్చి తనకు తెలుపాలని ఆజ్ఞాపించాడు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న కలుగుతుంది. నిజంగా రాముడు భరతుని మనస్సును అర్థం చేసి కోజాలని అజ్ఞానా? హనుమ పరీక్షించి వచ్చి తెలిపితే తప్ప, భరతుని శీలము రామునికి తెలియదా? తెలియకుండానే “భరతుని మాటను మన్నించలేదని సీతాదేవి ముందు బాధపడుతాడా?

అడవిలో “అత్యంత సుఖ సంవృద్ధః సుకుమార స్సుఖోచితః కథం న్వపర రాత్రేషు సరయూ మవగాహతే”

“అయ్యో! ఎంతో సుఖంగా పెరిగాడు. సుకుమారుడు. సుఖాలను అనుభవించ వలసిన వాడు. దొంగ రాత్రి లేచి, ఎవ్వరు చూడకుండా సరయూనదికి స్నానానికి వెళ్లి తడి బట్టలతోనే తిరిగి వస్తున్నాడా? మా భరతుడెంత కష్టపడుతున్నాడు” అని రాముడు? తీవ్రంగా బాధపడ్డాడే. అటువంటి భరతుని గురించి రామునికి తెలియదా? తెలిసి కోవడానికి హనుమను పంపాలా?

శ్రీమద్రామాయణము ఒక్కరాముని చరిత్ర కాదు. సమస్త ప్రజల జీవిత చరిత్ర. అన్ని కాలాల అన్ని దేశాల జనుల జీవిత చరిత్ర.

నిజానికి సీతాదేవి శీలాన్ని శంకించి ఆమె అగ్ని ప్రవేశానికి రాముడు అనుమతించాడా? కాదే? లోకంలో స్త్రీలలో పాతివ్రత్య ప్రభావాన్ని కల్గించడానికి ఆయన సీతాదేవిని తిరస్కరించాడు.

అలాగే ఇప్పుడు భరతుని సోదరప్రేమను, త్యాగ శీలతను శంకించి హనుమను పంపలేదు. అధికారము మనస్సులో మత్తును కల్గిస్తుంది. ఒక్కసారి అధికారాన్ని రుచి చూచినవారు, ప్రాణం పోయినా దానిని వదులుకోవడానికి ఇష్టపడరు. ఇది లోక మర్యాద. సామాన్య జనుల మనస్స్థితి. అలాగే భరతుడు కూడ అధికారమదానికి వశమయ్యాడా? లేదా? అని తెలిసికోవడానికి లోకమర్యాద ననుసరించి హనుమను పంపాడు.

రాముడలా పరీక్షార్థము హనుమను పంపినందువలననే భరతుని యొక్క అసాధరణ సోదర ప్రేమ, అనన్య త్యాగశీలము లోకానికి తెలియవచ్చాయి.

శ్రీరాముడు భరద్వాజ మహామునిని సందర్శించి, ఆయనకు నమస్కరించి, భరత శత్రుఘ్నుల యొక్క, తల్లుల యొక్క ప్రజల యొక్క యోగక్షేమాలను విచారించాడు.

మహర్షి “నీ కొరకు పరితపించే వీరందరు నీవు లేకుండా ఎలా సంతోషంగా ఉంటారను కొంటున్నావు?” అన్నట్లుగా చూచి అయోధ్యలో అందరు బాగున్నారని చెప్పాడు.

"సాధుజనులను రక్షించడంలో దీక్ష గలిగిన వాడా! సపరివారంగా క్షేమంగా తిరిగి వచ్చిన నిన్ను చూడగానే నా మనస్సు ఆనంద పరవశమైంది.

నీ అరణ్య వానము, మునులకు అభయప్రదానము, ఖరదూషణవధ, సీతాపహరణము, సుగ్రీవ స్నేహము, సేతు బంధనము, రావణవధ మొదలైన అన్ని విషయాలను నా తపశ్శక్తి చేత గమనిస్తున్నాను. నీ కొరకు ఒక వరాన్ని అనుగ్రహిస్తున్నాను కోరుకొమ్మని" తెలిపాడు.

"మహాత్మా! అయోధ్యకు వెళ్లే మార్గంలో నదులన్ని, కాలువలన్ని, ఎల్లకాలము స్వచ్ఛ జలాలతో ప్రవహించాలి. పుష్ప వృక్షాలు అన్ని కాలాలలో అన్ని రకాల పూలను పూస్తుండాలి. ఫలవృక్షాలు అన్ని కాలాలలో అన్ని రకాల మధుర ఫలాలను పండించాలి" అని రాముడు మునిని వరము కోరాడు.

సూర్యతేజస్కుడైన భరద్వాజ మహాముని అందుకు అంగీకరించాడు.

సూచన: ఇప్పుడు కూడ తన తపశ్శక్తి చేత శ్రీరాముడొనర్చిన పనులను గమనించానని భరద్వాజుడు చెప్పి సముద్రుని పై బాణ ప్రయోగము, సేతు నిర్మాణమును గురించి తెలిపాడే తప్ప "మహాశివుని అనుగ్రహం" గురించి తెలుపలేదు. వీటన్నిటిని బట్టి "మహా దేవుడనే పదానికి సముద్రుడన్న అర్థమే సరి అయినదని స్పష్టమవుతున్నది.

# భరతుని ఎదురు చూపు

శ్రీరాముని నియమనంతో హనుమ అయోధ్యానగరానికి వెళ్లసాగాడు. దారిలో గంగా యమునా నదుల సంగమ స్థలంలో "శృంగిబేరపురం" ఉంది. అక్కడ రాముని మిత్రుడైన గుహుని కలిశాడు. ఇద్దరు రామభక్తుల మధ్య సమావేశము చూడవలసిన విధంగా సాగింది. గుహునికి శ్రీరామ విజయవార్తను హనుమ అత్యంత హర్షంతో తెలిపాడు.

భరతుడు నందిగ్రామంలో రామ పాదుకలను రాజసింహాసనంపై ఉంచి అక్కడి నుండే రాజ కార్యాలను నిర్వహిస్తున్నాడు. ఆయన ఒక ఆశ్రమంలో ఉంటున్నాడు. నార చీరలను కట్టు కొంటున్నాడు. జింక చర్మాన్ని ధరించి జడలు కట్టిన తలవెంట్రుకలతో గడ్డము, మీసాలతో ఆయన ఒక మహర్షిలా ఉన్నాడు. ఆయన ముఖము ప్రశాంతంగా ఉండి దివ్యకాంతులీనుతున్నది. ఆయన ఫలాలను తింటూ రామధ్యానంతో ఉన్నాడు. హనుమను భరతుని, రఘు కులంలో జన్మించిన వారి ధర్మ నిష్ఠ ఆశ్చర్య పరిచింది.

అక్కడ పురోహిత, మంత్రి, పౌర జానపదులు భరతుని సేవిస్తున్నారు. నిన్నటి తోడనే పద్నాల్గుఏండ్ల గడువు పూర్తి అయింది. ఈ రోజు కూడ ఎదురు చూద్దామని వారు నచ్చ చెప్పారు. అంతలో హనుమ అక్కడికి వచ్చి ధర్మ వైరాగ్యమూర్తి అయిన భరతునికి నమస్కరించాడు. "మహాత్మా! నీ వెవ్వరి గురించి తీవ్రంగా ఎదురు చూస్తున్నావో, అట్టి మహా పురుషుడు నీ క్షేమం తెలిసికొని రమ్మని నన్ను పంపాడు.

శ్రీరాముడు రావణుని సపరివారంగా సంహరించి బంధు, మిత్ర పరివార సమేతంగా తిరిగి వస్తున్నారు. నీ వాయనను తప్పక త్వరలోనే సేవిస్తావు" అని తెలిపాడు.

భరతునికి ఆ వార్త అమృతము పోసినట్లు అనిపించింది. అయినా అంతటి సంతోష వార్తను ఆయన ఒక్కసారిగా భరించలేక పోయాడు. కొంతసేపు తెలివి తప్పాడు.

త్వరలోనే లేచి వాయుసుతుని చూచి, ఆ వార్త నిజమే అని నిర్ధారించుకొని, ఆయనను బిగ్గరగా కౌగిలించుకొన్నాడు. ఆయనను కళ్ల నీళ్లతో అభిషేకించి, "ఇంతటి మధుర వార్తను తెలిపిన నీవు ఎవ్వరు? నీవు నరుడవా? సురుడవా?

ఇంతటి తీయని వార్తను తెలిపిన నీకు వంద గ్రామాలను, లక్ష గోవులను, సాలంకృతలైన కన్యలను బహుమానంగా ఇస్తాను.

మహానుభావా! మా రామచంద్రస్వామి దండకలో ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు ఆ స్వామి వార్త తెలియక పిచ్చి లేచినట్లు ఉంది. మా రామలక్ష్మణులకు మీ వానరులతో స్నేహమెలా కలిగింది. తెలుపవా" అని వివరాలను కోరాడు.

"మహాత్మా! నీవు మీ తల్లులతోను, మంత్రి సామంత్ర, పురోహితులతోను, చిత్రకూటానికి వెళ్లి, రామచంద్రుని తిరిగి అయోధ్యకు వచ్చి రాజ్యపాలనను స్వీకరించుమని కోరడం, ఆ మహానుభావుడు అందుకు అంగీకరింపక, నీకు తనపాదుకలనిచ్చి ఇక్కడికి తిరిగి పంపడం జరిగిన విషయమే కదా!" అని హనుమ తాను చెప్పబోయే విషయాల పట్ల భరతునికి నమ్మకం కల్గడం కొరకు భరతునితో ముందుగా ప్రస్తావించాడు.

"మీరు అక్కడికి వచ్చి వెళ్లినందువలన, రాక్షసుల సంచారము కూడ ప్రారంభం కావడం వలన వారు చిత్రకూటాన్ని వదలి దండకారణ్యంలో ప్రవేశించారు.

అక్కడ "విరాధుడనే" వికృత రాక్షసుని ఎదిరించి, ఆయనను ఒక గుంటలో పూడ్చి వేశారు.

శూర్పణఖా వ్యామోహం, ఖరదూషణ వధ, సీతాపహారము, కబంధవధ, శబరి సందర్శనము, సుగ్రీవ స్నేహము, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకం, నలుదిక్కులలో వానరులు సీతను అన్వేషించుట, దక్షిణ దిశకు అంగదాదులు బయలుదేరడం, అందరి ప్రోత్సాహముతో, తాను సముద్రాన్ని దాటి లంకలో సీతను సందర్శించి రావడం, వానర సేనలతో రఘురాముడు బయలుదేరడం, సేతుబంధనము, రావణవధ, విభీషణ పట్టాభిషేకం, పుష్పకముపై రాక్షస, వానర వీరులతో కలసి సీతారామ లక్ష్మణులు తిరుగు ప్రయాణం చేయడం మొదలైన విషయాలను తెలిపి, తాను రాముడు పంపగా వచ్చానని వివరించాడు. రేపు ఉదయం పుష్యమీ తార కనుక రాముడు ఇక్కడికి రాగలడని" పలికాడు.

భరతుడు "అయోధ్యా నగరాన్ని అంతా పెళ్లి పిల్ల వలె అలంకరించాలని, రామచంద్ర స్వామికి స్వాగతం చెప్పడానికి వందిమాగధులు, వేశ్యలు, భటులు అందరు క్రొత్త వస్త్రాలతో అలంకారాలతో ఎదురు వెళ్లాలని" శత్రుఘ్నుడికి సూచించాడు.

# స్వామికి స్వాగతము

రథ, గజ, తురగాలపై రాజపరివారము సీతారామలక్ష్మణులకు స్వాగతం చెప్పడానికి మంగళవాద్యాలతో, భేరీ ధ్వనులతో, జయజయధ్వానాలతో నందిగ్రామం వెలుపలికి బయలు దేరారు.

భరతుడు శ్రీరాముని పాదుకలను శిరస్సుపై ఉంచుకొని బయలుదేరాడు. పూలు, పూజాద్రవ్యాలు, ఫలాలు, లడ్డూలు గైకొని పురజన, మంత్రి, సామంత పురోహితులు బయలు దేరారు.

ఛత్ర, చామరాలతో, వాల వ్యజనాలతో (విసన కఱ్ఱలతో) శత్రుఘ్నుడు సపరివారంగా బయలు దేరారు.

భరతాదులకు శ్రీరాముని రాకకు సంబంధించిన గుర్తులేవి కనబడలేదు. అప్పుడాయన హనుమతో

"కచ్చిన్న ఖలు కాపేయీ। సేవ్యతే చలచిత్తతా।

నహి పశ్యామ కాకుత్స్థం। రామమార్యం పరంతపం"

"కోతులకు చపలచిత్తము సహజమే కదా! నీవు కూడ చపల చిత్తంతో రాముడు వస్తున్నట్లు తెలుపలేదు కదా?" అని అడిగాడు.

అప్పుడు హనుమ భరతుని ఆతురతను గమనించి "మహాత్మా! అదిగో భారద్వాజ మహాముని ప్రసాదంతో దారిలో అన్ని వృక్షాలు ఫలవంతాలయ్యాయి చూడు. మహర్షి శ్రీరామ పరివారానికి పసందైన విందును సమకూర్చాడు. అందువలన కొంత ఆలస్యమై ఉంటుంది.

అదిగో ప్రయాణ ధ్వని! వానర దానవ వీరుల జయజయధ్వానాలు విన వస్తున్నాయి. అదిగో వానర వీరుల పదఘట్టనంతో నేలపై దుమ్ము రేగింది. వారంతా గోమతీనదిని దాటుతున్నట్లున్నారు.

అదిగో మహానుభావా! భరతా! ఆకాశంలో పున్నమ నాటి చంద్రబింబమువలె, తెల్లని, రాజహంస వలె వస్తున్న పుష్పకవిమానాన్ని చూస్తున్నావు కదా! అది మయనిర్మితము. రావణుని చంపి రామచంద్రుడు రావణుని తమ్ముడు విభీషణునితో, సుగ్రీవాదులతో ఆ ఆశ్చర్యకర విమానంపై ప్రయాణించి వస్తున్నాడు.

అదిగో భరతా! పుష్పకంపై ముందుగా కూచొని అందరికి నయనానందకరంగా వేంచేస్తున్న, నీలమేఘశ్యాముడు శ్రీరామచంద్రుడు. ఆయన ఎడమ కుడి ప్రక్కలలో సీతా లక్ష్మణులు! సుగ్రీవ విభీషణులదిగో ఆయన వెనుక కూచున్నవారు" అని పలికాడు.

పుష్పకవిమానం వారికి సమీపంగా ఆకాశంలో నిలిచింది. అందరు తలలుపైకెత్తి చేతులు జోడించి, "రాముడు, రాముడు" "రాముడు అదిగో అదిగో" అని బిగ్గరగా అరువ సాగారు. వారు ఒళ్లు మరచి నాట్యం చేయసాగారు. వారు ఆనందంతో కళ్లనీళ్లను కార్చసాగారు.

ఎన్ని సంవత్సరాల ఎదురు చూపుల ఫలమిది! ఎన్ని సంవత్సరాల తపః ఫలమిది!

హంసలు వహిస్తున్న పుష్పకవిమానం పుడమిపై వాలింది. పరుగు పరుగున భరతుడు గోవు దగ్గరికి వెళ్లే దూడలాగా రామచంద్రస్వామి దగ్గరకు వెళ్లాడు. శ్రీరాముడింకా విమానం దిగనే లేదు. భరతుడు ఒక్కసారి రాముని పాదాలపై వాలాడు. తన పవిత్రమైన కన్నీటితో రాముని శ్రీపాదాలను కడుగుతున్నాడు. ఆ పాదాలను గట్టిగా పట్టుకొన్నాడు.

ఆయనకు ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న పెన్నిధి లభించింది. తాను వదిలితే ఆ పెన్నిధి మళ్లీ ఎక్కడ దూరమవుతుందో? అనే భయం కలిగింది.

ఇంత కాలం నుండి తాను అనుభవిస్తున్న దుఃఖమంతా పొంగి పొంగి పైకి వస్తున్నది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. గొంతు బొంగురు పోయింది. అతికష్టము మీద "అన్నా" అని అనగలిగాడు.

అది భగవంతునికి భక్తునికి మధ్య కలియక! పవిత్రమైన కలయిక! ఇద్దరు ఒకరితో

మరొకరు పెనవేసుకొన్న కలయిక! విడదీయరాని కలయిక!

కొంతసేపటికి శ్రీరామచంద్రుడు భరతుని తన చేతులతో లేవనెత్తాడు. తన తొడపై కూచోబెట్టుకొన్నాడు. ఆయన నెత్తిని వాసన చూచాడు. ఆయన బుగ్గలను నిమిరాడు. ఆయన శరీరాన్నంతా తడిమాడు.

అది పితాపుత్రుల మధ్య కౌగిలి! అన్నిటికంటె అధికంగా ఆప్యాయతను కలిగించే కౌగిలి. బ్రహ్మానందాన్ని అందించే కౌగిలి. అది అపూర్వ సోదరుల మధ్య కౌగిలి.

మహాత్ముడైన భరతుడు తేరుకొని లక్ష్మణుని కౌగిలించి, సీతాదేవికి నమస్కరించి, సుగ్రీవ, జాంబవదంగదులను ఆదరించాడు.

"సుగ్రీవ మహారాజా! నీవు మాకు ప్రియమిత్రుడవు. ఆపదలో ఆదుకొన్నావు. ఆపదల నుండి గట్టెక్కించావు. ఇంతవరకు మేము నలుగరము అన్నదమ్ములము. ఇప్పుడు నీతో కలసి అయిదుగురము."

విభీషణుని చేరదీసి, "మహాత్మా! దురాత్ముడైన స్వంత సోదరుని విడిచి, ధర్మాత్ముడైన మా అన్నకు తోడయ్యావు. నీ అనన్య సహాయంతోనే రఘు కుల సంభవుడు ధర్మ సంస్థాపన చేయగలిగాడు" అని ప్రశంసించాడు.

శత్రుఘ్నుడు కూడ భరతునితో పాటు సీతా రామ లక్ష్మణుల పాదారవిందాలకు ప్రణమిల్లాడు.

అప్పుడు రఘురాముడు విమానం దిగి, తన తల్లి కౌసల్యాదేవి దగ్గరకు వెళ్లి, "తల్లీ! నీ మాట వినక, నిన్నొంటిరిగా వదలి, అడవులకు వెళ్లిన నీ కొడుకును క్షమించుమని" ఆమె పాదాలకు ప్రణమిల్లాడు. మిగిలిన తల్లుల కాళ్లకు నమస్కరించాడు.

కులగురువైన వశిష్ఠ మహర్షి పాదాంబుజాలకు ప్రణమిల్లాడు.

పౌరులందరు "శ్రీరామచంద్రా! మా తండ్రీ!" నీకు స్వాగతము, సుస్వాగతమని" చేతులు జోడించారు.

అప్పుడు భరతుడు అంతవరకు "రాజప్రతినిధులుగా ఉన్న రామ పాదుకలను తెచ్చి, అన్నా! ఇంతవరకు ఇదిగో నీ పాదుకలే సింహాసనాన్ని అలంకరించి, రాజ్యాన్ని పాలించాయి. ఇప్పుడు నీవే స్వయంగా పాలించడానికి వచ్చావు. కనుక వీటిని నీ పాదారవిందాలకు ధరించుమని రాముని కాళ్లకు తొడిగాడు.

శ్రీరామచంద్రుడు పుష్పకవిమానాన్ని కుబేరుని వద్దకు పంపివేశాడు. ఆయన భరతుని నివాసమైన ఆశ్రమానికి వెళ్లాడు.

# శ్రీరామపట్టాభిషేకము

ఆశ్రమంలో శ్రీరాముడు, వశిష్టుడు, మంత్రి, సామంత పురోహితులందరు కూచున్నారు.

"శిరస్యంజలిమాదాయ। కైకేయ్యానందనవర్ధనః।

బభాషేభరతో జ్యేష్ఠం। రామం సత్య పరాక్రమం"

"పూజితా మామికామాతా। దత్తం రాజ్యమిదం మమ

తద్దదామి పునస్తుభ్యం। యథాత్వమదదామమ"

భరతుని నెత్తిపై రెండు భారాలు ఉన్నాయి. ఆ రెండింటిని దించుకోవాలని అనుకొంటున్నాడు.

అందుకొరకు భరతుడు తన తలపై రెండు చేతులు జోడించి శ్రీరామచంద్ర స్వామిని ప్రార్థిస్తున్నాడు.

ఇంతకు భరతునికి భారాలుగా ఉన్న రెండేవి?

1) కైకేయిని పల్లెత్తు మాట అనకపోవుట.

2) కోసల రాజ్యాన్ని పరిపాలించుట.

భరతుడు దశరథుని నిర్యాణం తరువాత అయోధ్యా నగరానికి తిరిగి వచ్చాడు. కైకేయి తాను తన కొడుకుకు రాజ్యాన్ని సంపాదించి పెట్టాననే సంతోషంతో "ఓ మహా రాజా! సామాన్యుడివలె నీవు నీ తండ్రి మరణానికి ఏడుస్తున్నావా?" అని అడిగింది. భరతునికి "మహారాజా! అనే పిలుపుతో పిడుగు పడినట్లు అనిపించింది. ఆమెను "ఛీ పాపాత్మురాలా" అని అసహ్యించుకొని కౌసల్య దగ్గరికి వెళ్లాడు.

అప్పటినుండి తల్లిని చూస్తే ఆయనకు అసహ్యము. దానిని శ్రీరాముడు పసిగట్టాడు. ఆయనతో ఒట్టు పెట్టించుకొని శ్రీరాముడు భరతునితో కఠినంగా అన్నాడు.

1) కామాద్వా తాత లోభాద్వా। మాత్రాతుభ్యమిదం కృతం।
న తన్మనసి కర్తవ్యం। వర్తితవ్యం చ మాతృవత్"

2) "మాతరం రక్ష కైకేయీం। మారోషం కురుతాంప్రతి।
మయాచ సీతాయా చైవ। శప్తోఽసి రఘునందన."

"భరతా! మాత కైకేయి తన కొడుకైన నిన్ను మహారాజుగా చూడాలనే కోరికతోనో, లేక అయోధ్యా సింహాసనం తన వారసునికే దక్కాలనే లోభంతోనో ఈ పని చేసింది. దానిని నీవు మనస్సులో పెట్టుకోకు. ఆమెను అసహ్యంతో చూడక కన్న తల్లి వలె ఆమెను ప్రేమతో చూచుకో!

రాఘవా! నీవు ఆగ్రహంతో, అసహ్యంతో ఆమెను ఇప్పుడు నిందిస్తుంటే ఆమె తట్టుకోజాలదు. ఆమె ఏ అఘాయిత్యానికైనా పాల్పడవచ్చు. అందువలన ఆమె అటువంటి పనికి పూనుకోకుండా కాపాడాల్సిన బాధ్యత నీది. నీవెప్పుడు ఆమె విషయంలో కోపంగా ఉండవద్దు. నా మీద, మీ వదిన మీద ఒట్టు సుమా!" అని తమ్ముని నిర్బంధించాడు శ్రీరామచంద్రుడు.

భరతునికి అది ఒక పెద్ద సమస్య అయి కూచుంది. తల్లిని చూస్తే శ్రీరాముని వన ప్రవేశం గుర్తుకొస్తుంది. "ఆమెను ఏమైనా అందామా?" అంటే రాముని ఒట్టు గుర్తుకొస్తుంది.

ఇంతకాలము తల్లిని పల్లెత్తు మాట అనకుండా కత్తి అంచుపై నడిచినట్లు రామచంద్ర స్వామికి ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నాడు. ఇప్పుడు శ్రీరాముడే తిరిగి వచ్చాడు. కనుక కన్నతల్లిని తాను దూషించవలసిన అవసరమే లేదు. అందువలన ఆ బరువును దించుకొంటూ, "అన్నా! నీకు మాట ఇచ్చిన ప్రకారము మా తల్లిని నిరాదరణ చేయకుండా పూజించాను" అని పలికాడు. ఆ మాట శ్రీరామునికి ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఇక రెండవ భారము – శ్రీరాముడు తనకు అప్పగించిన రాజ్యభారము.

"దత్తం రాజ్యమిదం మమ। తద్దదామి పునస్తుభ్యం"

నాకిచ్చిన రాజ్యాన్ని నీ కొరకు తిరిగి ఇస్తున్నాను.

"రాజ్యము భరతునికి ఇవ్వబడింది. కాని భరతుని కొరకు కాదు.

భగవంతుడు మనకు కూడ శరీరమనే రాజ్యాన్ని ఇచ్చాడు.

"భరతుడు తనకిచ్చిన రాజ్యాన్ని తనదని ఎన్నడు అనుకోలేదు. "రాజ్యంచాహంచ రామస్య" అనుకొన్నాడు. రాజ్యము, ఎట్లా రామునిదో తాను కూడ రాముని వాడనే. పరతంత్రుడనే అనుకొన్నాడు. రాజ్యాన్ని ఇంతకాలము రామునికి ప్రియంగా పాలించాడు".

"మనము కూడ ఈ శరీరమనే రాజ్యము మనది అనుకోవద్దు. మనము, ఈ శరీరము రెండు రామునివే అనుకోవాలి. "యస్యాత్మా శరీరం; యస్య పృథివీ శరీరం" అంటుంది

"శృతి". రామునికి ప్రియంగానే ఈ శరీరాన్ని పాలించాలి. ఆయన ఆజ్ఞా నిర్వహణ కొరకే, ఆయన కైంకర్యం కొరకే ఈ శరీరాన్ని వాడు కోవాలి. అప్పుడు మన కర్మలు ఆయనను సంతోషపెట్టుతాయి.

కులశేఖరులు ముకుందమాలలో దశేంద్రియాలకు భగవంతునికి ప్రియకరాలైన పనులను అప్పగించారు, "జిహ్వే" కీర్తయ కేశం అని".

ఇప్పుడు రాజ్యాన్ని రామునికి ఇచ్చేది భరతుని కొరకు కాదు. "తుభ్యం" "నీ కొరకే" అన్నాడు." రాజ్యము మొదటి నుండి రామునిదే కనుక దానిని రాముడు ఆయన కొరకే వాడుకోవాలి.

ఏ పనినైనా సేవకునితో చేయించుకొన్నా, తాను స్వయంగా చేసికొన్నా, ఆ పని వలన కలిగే ప్రయోజనము యజమానికే కదా!

ఈ రాజ్య పాలనము తన కెంత బరువుగా ఉండిందో, భరతుడు తెలుపుతున్నాడు. "రామచంద్రా! రాజ్యభారాన్ని వహించే సామర్థ్యము నీకు సహజముగా ఉంది.నాకు చాల కష్టంగా ఉంది. నీకు నాకు మధ్య ఎంత తేడా ఉందో చెప్పాలా? "పశు జాతిలో చేరినప్పటికి ఒక ఆబోతు మోసే బరువును, ఒక దూడ మోయగలుగుతుందా? పక్షి జాతిలో చేరినప్పటికి కాకి రాజహంసతో సమానంగా పరుగెత్త గలుగుతుందా? నీవు పురుషోత్తముడివి నేను మామూలు మనిషిని.

"ఒకడు అనేక కష్టాలకోర్చి, అనేక ప్రయత్నాలు చేసి ఒక తీయని మామిడి చెట్టును పెట్టాడు. ఆ చెట్టు పెరిగి, పూలు పూచి, కాయలుకాచి, మంచి మామిడి పండ్ల నిచ్చినప్పుడే కదా ఆ చెట్టును పెట్టిన వాడి కోరిక ఫలించేది" ఈ ఉపమానము యొక్క అర్థము నీకు తెలిసిందే కదా!

దశరథ చక్రవర్తి పుత్రకామేష్టి అనే యజ్ఞాన్ని చేసి నిన్ను కన్నాడు. ఆయన పరిపాలించిన ఈ మహీమండలాన్ని ఆయన తరువాత సర్వ ప్రజారంజకంగా, ఆయన వలె వేలాది సంవత్సరాలు నీవు పరిపాలించాలని కదా ఆయన కోరుకొన్నాడు! ఆయన కోరిక నెరవేరాలి కదా!

అందువలన నీవు పట్టాభిషేకాన్ని స్వీకరించాలి. జగత్తును పాలించాలి. మా వంటి సేవకులను, ప్రభుత్వోద్యోగులను ప్రజాపాలనలో చక్కగా వాడుకోవాలి.

"యావదావర్తతే చక్రం। యావతీచవసుంధరా॥

తావత్త్వమిహ సర్వస్య। స్వామిత్వమనువర్తయ।"

రామభద్రా! ఈ కాల చక్రము తిరుగుతున్నంత వరకు (నిరంతరం), ఈ భూమి ఉన్నంతవరకు (ఎల్లప్పుడు) ఈ జగత్తు సర్వానికి నీవే స్వామిగా ఉండాలి" అని ప్రార్థించాడు.

శ్రీరాముడు మహాత్ముడైన భరతుని ప్రార్థనను అంగీకరించాడు.

ఈ శ్లోకము చాల ముఖ్యమైనది. ప్రతిరోజు ఉదయాస్తమయాలలో స్వామిని ఉద్దేశించి ఈ ప్రార్థనను మనము చేయాలి.

భగవద్రామానుజులు పెరుమాళ్లను ఉద్దేశించి, "అఖిల జగత్స్వామిన్। అస్మత్స్వామిన్" అని సంబోధించారు.

శ్రీరామచంద్రస్వామి కాలచక్రము, నింగి, నేల, సూర్యచంద్రులు ఉన్నంతవరకు సకల జగత్తును పరిపాలించాలి. మనను కూడ స్వామే పరిపాలించాలి. మనము స్వామికి సంబంధించిన వాళ్లము (దాసులము) అయినప్పుడు మనను స్వామి పాలించవలసిందే కదా! అప్పుడు "మనను పాలించుమని" ప్రార్థించడం దేనికి? అంటే మనము చేతనులము కదా! కొంత జ్ఞానము కలవాళ్లము కదా! ఈ జ్ఞానముతో మనకు, స్వామికి మధ్య ఉన్న సంబంధాన్ని చెప్పుకొని, మనను పాలించుమని కోరాలి. అంటే సంబంధ జ్ఞానము వలన ప్రార్థన ఏర్పడుతుందన్న మాట!

శ్రీరామచంద్రుడు భరతుని ప్రార్థనను అంగీకరించి, రాజ్యపాలనకు అంగీకరించాడు. భరతునికి నెత్తిపై నుండి మోయలేని బరువును క్రిందకు దించినట్లయింది.

శత్రుఘ్నుని ఆజ్ఞ ప్రకారము మంగలివారు వచ్చారు. రామలక్ష్మణ, భరతులకు గడ్డాలు తీసి, మీసములు సవరించి క్షౌరము చేశారు.

ముందు భరతుని మంగళ స్నానము చేయుమని రఘురాముడు కోరాడు. ఆయన తరువాత మిగిలిన సోదరులు స్నానం చేశారు. ఆ తరువాత శ్రీరామభద్రుడు మంగళ స్నానం చేశాడు. రాముని తరువాత సుగ్రీవాదులు, విభీషణుడు మంగళ స్నానమాచరించారు.

శత్రుఘ్నుడు శ్రీరామచంద్రస్వామికి, ఆ తరువాత మిగిలిన వారందరికి నూతన వస్త్రాలను సమర్పించాడు. అతిలోక సుందరుడైన స్వామి, మంగళస్నానము, నూతన వస్త్రాలంకారములతో సాటిలేని సహజకాంతితో ప్రకాశించాడు.

సీతాదేవికి, వానరాంగనలకు రాజమాతలు స్నాన, అలంకారాలను సమకూర్చారు.

ఈ మధ్యలో అయోధ్యానగర వీధులను పరిమళ జలాలతో చల్లి, ముత్యాలతో ముగ్గులను పెట్టి ధ్వజతోరణాలతో అత్యంత నూతనంగా అలంకరించారు.

సుమంత్రుడు ఎంతో కాలం నుంచి తాను అనుకొన్న కోరిక తీరిందనే సంతోషంతో రామచంద్రస్వామికి దివ్యరథాన్ని తెచ్చాడు. ఆకుపచ్చని గుఱ్ఱాలను కట్టిన ఆ రథాన్ని శ్రీరామచంద్రుడు మహేంద్రునివలె అధిరోహించాడు.

రాజవీధులందు రథముపై శ్రీరామభద్రుడు ఊరేగింపుగా వెళ్లాడు. భరతుడు రథాశ్వముల పగ్గాలను పట్టుకొని సారథ్యము చేశాడు. ఉత్తమమైన తెల్లని గొడుగును శత్రుఘ్నుడు రామునికి పట్టాడు. కైంకర్యములో తృప్తి పడని లక్ష్మణుడు ఒక చేత్తో విసన కఱ్ఱను పట్టుకొని, మరొక చేత్తో వింజామరను ధరించి వీస్తున్నాడు. విభీషణుడు కూడ తెల్లని వింజామరను చేతిలో ధరించి రామచంద్రస్వామికి వీస్తున్నాడు.

ఆకాశంలో దేవతలు, మహర్షులు నిలబడి స్తోత్రాలను వినిపిస్తున్నారు. సుగ్రీవుడు శత్రుంజయమనే మహా గజాన్ని ఎక్కి రామచంద్రుని రథము ప్రక్కనే వెళ్లుతున్నాడు.

నగరాలు, శంఖాలు, వీణానాదాలు, తూర్యాలు మంగళ ధ్వనులను కావిస్తున్నాయి.

శ్రీరామభద్రునికి ఎదురుగా మంత్రి సామంత పురోహిత పౌరజానపదులు వచ్చి స్వాగతం పలికారు.

పసుపు పచ్చని అక్షతలను తీసికొని కన్యలు, బ్రాహ్మణులు గోవులతో సహా ముందు నడుస్తున్నారు.

రామచంద్రుడు సమీపంలో ఉన్నవారితో సుగ్రీవ స్నేహము, హనుమ కార్యదక్షతల గురించి ప్రశంసిస్తున్నాడు.

ఈ విధంగా ఊరేగింపుగా వెళ్లి దశరథ భవనం చేరుకొన్నాడు.

తండ్రి భవనంలో ప్రవేశించి, తల్లులందరికి నమస్కారం చేశాడు రామభద్రుడు సీతాలక్ష్మణులతో సహా.

అందమైన తన (రాముని) ఇంట్లో సుగ్రీవునికి విడిది ఏర్పాటు చేయుమని భరతునికి తెలిపాడు.

సుగ్రీవుడు వేగవంతులైన నలుగురు వానరోత్తములను పిలిచి నాలుగు సముద్రాల జలాలను తెమ్మని ఆజ్ఞాపించాడు. మరికొందరు దేశంలోని పుణ్యనదీ జలాలను తీసిక రావడానికి బయలు దేరారు.

వారు ఆ పవిత్ర తీర్థాలను తెచ్చాక శత్రుఘ్నుడు శ్రీరామచంద్రస్వామికి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించుమని మునులను మంత్రి, సామంతాదులను కోరాడు.

# పట్టాభిషేక మహోత్సవము

కోసల నరేంద్రుల కులగురువు, వృద్ధుడైన వశిష్టుడు, సీతారాములను రత్నపీఠముపై కూచోబెట్టాడు. అయన, ఆయనతోపాటు కాత్యాయనుడు, జాబాలి, కాశ్యపుడు విజయుడు, గౌతముడు, వామదేవుడు, సుయజ్ఞుడనే మహర్షి పుంగవులు ప్రసన్నములు, పరిమళ భరితములు అయిన సముద్ర, దివ్య నదీజలాలతో సీతారాములకు పట్టాభిషేకం చేశారు. ఆ అభిషేకం అష్టవసువులు మహేంద్రునకు జరిపిన అభిషేకాన్ని తలపించింది. ఆ తరువాత ఋత్విజులు, తదితర విప్రులు, కన్యలు, మంత్రులు, యోధులు, అధికారులు, పౌరజానపదులందరు సీతారాములను పవిత్రజలాలతో అభిషేకించారు.

ఆ తరువాత సీతారాములు నూతన వస్త్రాలను, దివ్యాలంకారాలను ధరించారు. తరతరాలు ఇక్ష్వాకు మహారాజులు ఆసీనులైన దివ్యసింహాసనాన్ని అధిరోహించారు.

శత్రుఘ్నుడు స్వామికి శ్వేతచ్ఛత్రం పట్టాడు. తెల్లని చామరాలను రెండు ప్రక్కలలో సుగ్రీవ విభీషణులు ధరించి గాలి వీచసాగారు.

ఇంద్రుడు వాయుదేవుని ద్వారా నూరు కమలాలతో నిండిన దివ్యకాంచన హారాన్ని, రత్నాలంకార యుక్తమైన తెల్లని ముత్యాలహారాన్ని రామచంద్రస్వామికి సమర్పించాడు.

శ్రీరాముడు తన పట్టాభిషేకానికి వచ్చిన అతిథులకు కానుకలిచ్చి సత్కరించాడు.

సుగ్రీవునికి రత్నాలంకృతమైన బంగారుహారాన్ని బహుమానంగా ఇచ్చాడు. అంగదునికి రెండు బంగారు అంగదాలను (భుజకీర్తులను) ఇచ్చాడు.

శ్రీరాముడు తన మెడలో నుండి పూర్ణచంద్రునితో సమానకాంతిగల రత్న హారాన్ని తీసి సీతాదేవికి ఇచ్చాడు. సీతాదేవి శ్రీరాముని వైపు చూచింది.

"ప్రదేహి సుభగేహారం। యస్య తుష్టాసి భామినీ।

పౌరుషం విక్రమో బుద్ధిః। యస్మిన్నే తాని సర్వశః"

"సౌభాగ్యవతీ! ఎవ్వనిలో పౌరుషము, పరాక్రమము, సద్బుద్ధి మొదలైన సర్వ సుగుణాలు ఉన్నాయో? ఎవ్వరి వలన నీవు సంతోషాన్ని పొందావో, అటువంటి మహా పురుషునికిఈ దివ్యహారాన్ని బహూకరించుమని" శ్రీరామచంద్రస్వామి తెలిపాడు.

శ్రీరాముని చూపుల అర్థాన్ని గ్రహించిన సీతాదేవి ఆ దివ్య మణిహారాన్ని హనుమకు బహూకరించింది.

హనుమకు జరిగిన ఈ సత్కారము అమోఘమైనది. మిగిలిన సన్మానాలన్ని రామచంద్ర స్వామి తన చేతులతో సుగ్రీవాదులకు స్వయంగా జరిపాడు. హనుమకు కూడ ఇంతకు ముందే పట్టు వస్త్రాలను, బంగారు భూషణాలను సీతాదేవి బహూకరించింది.

అంటే మిగిలిన వానరులకు రామచంద్రస్వామి సన్మానము, హనుమకు సీతాదేవి సన్మానము లభించాయి.

స్వామో, అమ్మవారో ఎవ్వరో ఇద్దరిలో ఒకరు మనను అనుగ్రహించడం కాదు మనకు కావలసింది. శ్రీ, శ్రియః పతులిద్దరి అనుగ్రహం కావాలి.

అందుకే శ్రీరామచంద్రస్వామి తన మెడలోని హారము తీసి సీతాదేవికి ఇచ్చాడు. శ్రీరాముని మనస్సును గ్రహించి ఆ తల్లి దానిని హనుమంతునికి ప్రసాదించింది.

మనము కోరుకోవలసింది కూడ స్వామి ప్రసాదము అమ్మవారి చేతుల మీదుగా మనకందాలని. స్వామి సర్వతంత్ర స్వతంత్రుడు. తానేదో ఇవ్వాలనుకొని దాన్ని ఇచ్చాక కూడ మనస్సు మార్చుకొని, ఇంతవరకు ఇచ్చిన దానిని కూడ తాను తిరిగి తీసికోవచ్చు.

అలాకాక స్వామి అమ్మవారి ద్వారా ప్రసాదాన్ని ఇప్పిస్తే ఇక దానిని తిరిగి తీసికోలేడు. అలా తిరిగి తీసుకోవాలంటే అమ్మ అంగీకారం కూడ కావాలి. అమ్మ ఇప్పించేదే కాని తిరిగి తీసికొనేది కాదు.

"పరమపదంలో కూడ స్వామి ముక్త పురుషుని పైకి తీసికొని, తన తొడపై కూచోబెట్టుకొని, లాలించి, పాలించాక, అమ్మవారికి ఇస్తాడు. అమ్మవారు ఆయనను తన ఒడిలోకి తీసికొని, మాతృప్రేమను అనుగ్రహిస్తుంది. ఆ తరువాత ఆయన శిరస్సుపై స్వామి తన దివ్యపాదారవిందాలను అనుగ్రహిస్తాడు. దానితో శాశ్వతమైన బ్రహ్మానందము ముక్తునికి స్వంతమవుతుంది.

అందువలన సంప్రదాయ గ్రంథాలన్నిటిలో అమ్మవారి ద్వారా స్వామి తన దివ్యానుగ్రహాన్ని మనకు అందించాలని కోరుకోవడం జరుగుతుంది".

హనుమ తరువాత విభీషణ జాంబవదాదులందరికి వారికి తగిన విధంగా స్వామి బహుమానాలను ప్రసాదించాడు.

సుగ్రీవాది వానరులందరు సంపూర్ణ సంతోషంతో శ్రీరామాజ్ఞతో కిష్కింధకు వెళ్లి పోయారు.

విభీషణుడు కూడ సంపూర్ణ మనోరథుడై "కుల ధనాన్ని" శ్రీరామభద్రుని నుండి పొంది లంకకు తిరిగి వెళ్లాడు.

"లబ్ధ్వా కులధనం రాజా। లంకాం ప్రాయాద్విభీషణః"

ఇక్కడ విభీషణుడు పొందిన కులధనం అంటే ఏమిటి? శ్రీరాముని కులధనమా? విభీషణుని కులధనమా? శ్రీరాముని కులధనమంటే ఇక్ష్వాకు మహారాజు కాలం నుండి శ్రీరామచంద్ర స్వామి వరకు అర్చింబడుతున్న శ్రీరంగనాథస్వామి అర్చ్యా మూర్తి.

విభీషణుని కులధనం అంటే లంకా సామ్రాజ్యము. గోవిందరాజుల వారు కులధనమంటే "శ్రీరంగ విమానమనే" అర్థం చెప్పారు. రామానుజీయం కూడ ఆ విషయాన్నే బలపరిచింది.

కాని "శ్రీరాముడు తన అవతార పరిసమాప్తి కాలంలో విభీషణుని పిలిచి ఆయనకు తమ ఆరాధ్య దైవమైన శ్రీరంగనాథుని అర్చ్యామూర్తిని ఇచ్చినట్లు ఉత్తరకాండలో ఉంటుంది కనుక ఇప్పుడు దానిని ఇచ్చే అవకాశం లేదు. అందువలన లంకా రాజ్యాన్ని సర్వాధికారాలను విభీషణునికి ఇచ్చి పంపాడని తిలక్, మహేశ్వర తీర్థుల అభిప్రాయము.

విభీషణునికి పట్టాభిషేకం ఇదివరకే జరిగింది కదా! ఇప్పుడు మళ్లీ లంకా రాజ్యాన్ని ఇవ్వడమేమిటి?

అప్పుడు విభీషణుని పట్టాభిషేక సమయంలో శ్రీరామచంద్రుడు లంకా నగరానికి వెళ్లి, ఆ కార్యక్రమంలో పాల్గొలేదు. అందువలన ఇప్పుడు విభీషణుడు శ్రీరామచంద్రస్వామి ప్రసాదంగా సమస్త రాజ్యాధికారాలను పొందాడని కావచ్చు.

సుగ్రీవుని పట్టాభిషేకానికి కూడ శ్రీరాముడు వెళ్లలేదు కదా? అంటే వెళ్లకున్నా, శ్రీరాముని సమక్షంలోనే, ఆయన ఆమోదంతోనే నాల్గు దిక్కులకు సుగ్రీవుడు వానర వీరులను పంపాడు. సేతు నిర్మాణం, రావణునితో యుద్ధంలో వానర సైన్యాలను నడిపించడం వంటి రాజాధికారాలను నిర్వహించాడు. కనుక సుగ్రీవునికి వానర కుల ధనమైన కిష్కింధా సామ్రాజ్యాన్ని మళ్లీ ప్రసాదించవలసిన అవసరము కలుగలేదు.

మొత్తముపై విభీషణుడు లభించిన "కులధన" మంటే రాక్షసుల కులధనమైన "లంకా రాజ్యాధికారమని" లేక "ఇక్ష్వాకుల కులధనమైన శ్రీరంగనాథుని అర్చ్యామూర్తి" అని రెండు అర్థాలు కావచ్చు. గోవిందరాజుల వారి దృష్టిలో ఉత్తర కాండలోని శ్లోకాలు ప్రక్షిప్తాలు. అంతేకాదు తానే లక్ష్మణాదుల ద్వారా పట్టాభిషేకం జరిపించి, ఇప్పుడు దానినే మళ్లీ ఇవ్వడం అసంగతం.

అతిథులందరు వెళ్లిపోయాక రాజ్య విషయాలను చక్కబెట్ట దలచి, రామచంద్ర మహారాజు లక్ష్మణుని పిలిచి ఆయనను ఈ విధంగా కోరాడు.

"ఆతిష్ఠ ధర్మజ్ఞ మయా। సహేమాంగాం పూర్వ
రాజాధ్యుషితాం బలేన। తుల్యం మయాత్వం పితృభి
ర్ధృతాయాంతాం। యౌవరాజ్యేధురముద్వహస్వ"

ధర్మజ్ఞుడవైన లక్ష్మణా! మన్వాది బలిష్టులైన పూర్వరాజులచే పాలింపబడి, మన పితృ పితామహ ప్రపితామహులైన మహారాజులచే అనుభవింపబడిన ఈ మహీమండలాన్ని, నీవు కూడ నాతో సమానంగా యువరాజువై పరిపాలించుము" అని కోరాడు.

లక్ష్మణుని కంటె భరతుడు పెద్దవాడు. ఇంతకాలం తనకు బదులుగా రాజ్యాన్ని పాలించినవాడు. ఆయన ఉండగా రామచంద్రుడు లక్ష్మణునికి యౌవరాజ్యాధికారాన్ని ఇవ్వాలని ఎందుకు అనుకొన్నాడు?

దానికి అనేక కారణాలున్నాయి. (1) మొదట శ్రీరామునికి రాజ్యాధికారమిస్తానని రాజసభలో ప్రకటించాడు దశరథుడు. ఆ విషయం కౌసల్యా భవనంలో కూడ తెలిసింది. దానిని విని కౌసల్యా సుమిత్రలు, సీతాలక్ష్మణులు పరమానంద భరితులయ్యారు. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణునితో "సోదరా! ఈ రాజ్యం నా ఒక్కడి కొరకే కాదు. నీవు కూడ నాతో పాటు రాజ్యపాలనలో పాల్గొని, సమస్తానందాలు అనుభవించుమని" కోరాడు.

"రామోద్విర్నాభిభాషతే" రాముడెప్పుడు రెండు విధాల మాట్లాడడు కదా! అందువలన ఆ మాటలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు రాజ్యాధికారాన్ని తనతో కలసి యువరాజుగా పంచుకొమ్మని కోరాడు.

రెండవది: లక్ష్మణుడు తనకు తోడు నీడలా మెదిలాడు. తనకు సీతాదేవికి సర్వ విధ కైంకర్యాలను సమకూర్చాడు. సీతాపహరణం తరువాత తనతో సమానంగా శోకాన్ని పంచుకొన్నాడు. రావణాసురునితో జరిగిన యుద్ధంలో ప్రాణత్యాగానికి కూడ సిద్ధమయ్యాడు. కష్టాలను తనతో సమానంగా పంచుకొన్న సౌమిత్రే తనతో పాటు రాజ్యాధికారాలను సగము పంచుకోవాలని శ్రీరాముడు అనుకొన్నాడు.

మూడవది: రాజ్యపాలనను భరతుడు మొదటి నుండి ఇష్టపడలేదు. విధిలేక అన్నకు బదులు అన్నపాదుకలను ప్రతినిధులుగా ఉంచి రాజ్యాన్ని పాలించాడు. మళ్లీ ఆయనను అడిగితే అంగీకరిస్తాడో లేదో?

ఈ కారణాలన్నిటిని బట్టి సౌమిత్రికి యౌవరాజ్యాధికారాన్ని ఇవ్వాలని రాముడు అనుకొన్నాడు.

అయితే రాముని ప్రతిపాదన లక్ష్మణునికి నచ్చలేదు. శ్రీరామచంద్రునికి దాసుడుగా ఉండి సమస్త కైంకర్యాలను శాశ్వతంగా సమర్పించాలనుకొన్న లక్ష్మణుడు రామునితో సహా రాజ్యాధికారాలను పంచుకోవాలనుకోలేదు.

'లక్ష్మణో లక్ష్మి సంపన్నః"

సర్వదా లక్ష్మణుడు శేషత్వ, కైంకర్యాలకు సంబంధించిన లక్ష్మీ సంపన్నుడే.

"సర్వాత్మనా పర్యనునీయమానః।
యదా న సౌమిత్రిరుపైతి యోగం।
నియుజ్యమానోపిచ యౌవరాజ్యే।
తతోఽభ్యషించత్ భరతం మహాత్మా॥

అన్ని విధాల శ్రీరామచంద్రుడు లక్ష్మణుని అనునయించాడు. ఎన్నో విధాల చెప్పి చూశాడు. కాని యౌవరాజ్యాధికారాన్ని లక్ష్మణుడు పూర్తిగా నిరాకరించాడు. అప్పుడు మహాత్ముడైన శ్రీరామచంద్రుడు భరతునికి యౌవరాజ్య పట్టాభిషేకాన్ని జరిపించాడు.

లక్ష్మణుడు వద్దన్న యౌవరాజ్యాధికారాన్ని భరతుడెందుకు అంగీకరించాడు? భరతుడు మహాత్ముడు కనుక. ఏమిటాయన మాహాత్మ్యం? భరతుడు పరతంత్రుడు. పారతంత్ర్యమే ఆయన మహత్వము.

పారతంత్ర్యమంటే ఏమిటి?

"అచిద్వస్తువత్ పారతంత్ర్యమ్"

ప్రాణంలేని వస్తువు వలె ఉండడము పారతంత్ర్యము.

చిన్నపిల్లవాడు తల్లిదండ్రులకు పరతంత్రుడు. కాళ్ల దగ్గర ఉంచుకొన్నా కాదనడు. నెత్తిపైకి ఎత్తుకొన్నా నిరాకరించడు.

భరతుడు కూడ పరతంత్రుడే. శ్రీరామచంద్రస్వామి అయోధ్యకు తిరిగి వచ్చేప్పుడు ఆయన రథ సారథ్యాన్ని చేబట్టాడు. ఇప్పుడు శ్రీరామచంద్రుని నియమనం ప్రకారం యౌవరాజ్యాధికారాన్ని చేబట్టాడు. సారథ్యము ఆయనకు తక్కువ కాదు. అర్ధ సింహాసనం అధికం కాదు. రాముని సంకల్పం ప్రకారము నడుచుకోవడమే ఆయన స్వభావము.

ఇదివరకు పద్నాల్గేండ్లు రాజ్యపాలన చేసింది కూడ తన పారతంత్ర్య స్వభావం తోనే.

మరి రాజ్యాధికారం తనకు వద్దని ముందు ఎందుకన్నాడు? రాజ్యాధికారం అప్పుడు స్వతంత్రమైనది. స్వాతంత్ర్యాన్ని ఆయన ఎప్పుడు కోరుకోలేదు.

ఇప్పుడు యౌవరాజ్యాధికారం శ్రీరామునికి పరతంత్రమైనది. అందువలన రాముని నియమనంతో యౌవరాజ్యాన్ని అంగీకరించాడు.

# రామరాజ్యం

శ్రీరామచంద్రుడు తన పాలనలో పౌండరీక, అశ్వమేధ వాజపేయాది అనేక యజ్ఞాలను అనేక పర్యాయాలు ఆచరించాడు. తన పదకొండువేల సంవత్సరాల పాలనలో వంద అశ్వమేధాలను భూరి దక్షిణలతో నిర్వహించాడు.

శ్రీరామచంద్ర స్వామి ధర్మపాలనలో భర్తలు మరణించి బాధపడే విధవలు లేరు. స్త్రీలు ముత్తైదువులుగా మరణించే వారు.

తక్షణమే చక్కని మందులు లభించడం వలన ప్రజలు ప్రబల వ్యాధుల వలన బాధపడేవారు కారు.

అందరు కూడ వృద్ధాప్యం దాకా ఆరోగ్యంగా జీవించేవారు. కనుక పెద్దల ముందు పిల్లలు మరణించే వారు కాదు. ప్రజలలో నిరుపేదలు లేరు. అందువలన దొంగతనాలు పేరుకు కూడ లేవు.

రామరాజ్యంలో ఎక్కడ చూచినా సంతోషము వెల్లివిరిసేది. ఎక్కడ చూచినా ధర్మదేవత నాలుగు పాదాలతో నడిచింది.

ప్రజలందరి మనస్సులో ధర్మాత్ముడైన రాముడే ముద్రవేసికొని ఉండేవాడు. కనుక ఎవ్వరు కూడ వేరే వారితో కలహించేవారు కాదు.

ప్రజలందరు చాల మంది సంతానంతో, వేలాది సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించే వారు. రోగాలు లేవు, శోకాలు లేవు.

ఎక్కడ చూచినా, ఎవ్వరి నోట విన్నా "రామ", "రామ" "రామ" అనే నామము వినవచ్చేది. ఈ జగత్తంతా రామమయమైంది. ఎక్కడ చూచినా చెట్లు పచ్చగా, పూలతో, పండ్లతో కళకళ లాడుతుండేవి.

సకాలంలో తగినన్ని వర్షాలు కురిసేవి. గాలి ఎప్పుడు చల్లగా వీస్తూ ఆప్యాయతను కలిగించేది.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులందరు లోభం లేక వారి వారి దైవాలను ఆరాధించేవారు.

పదివేల సంవత్సరాలు (సీతాదేవితో కూడి) పదివందల సంవత్సరాలు (సీతాదేవి లేక) శ్రీరామచంద్రస్వామి తమ్ముల సహకారంతో రాజ్యపాలన కావించాడు.

శ్రీరామపాలనను, ఆయన దివ్యచరితను వివరించే శ్రీమద్రామయణాన్ని వాల్మీకి మహర్షి రచించాడు. ఇది విశ్వసాహితీ చరిత్రలోనే ఆదికావ్యము.

దీని పారాయణము వలన ధనము, కీర్తి, ఆయుష్యము, ఆరోగ్యము, రాజ్యము (రాజులకు) లభిస్తాయి. నరులు పాపాలనుండి విముక్తులవుతారు.

శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని గురించి విన్నవారు పుత్రులను, ధనాన్ని పొందుతారు. రాజులు తమ శత్రువులను జయిస్తారు.

రామలక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో కౌసల్యా సుమిత్రా కైకేయిలు అనుభవించినట్లు అందరు పుత్రులతో పౌత్రులతో ఆనందాన్ని పొందుతారు.

వాల్మీకి మహర్షి విరచించిన ఈ ఆదికావ్యాన్ని విన్నవారు భక్తి శ్రద్ధలను కలిగి, క్రోధాన్ని జయించి, కష్టాల నుండి విముక్తులవుతారు. దీర్ఘాయువుతో, ఎంతటి కష్టమైన పనినైనా సులభంగా సాధించగలుగుతారు. ప్రజలు అందరు ప్రతిరోజు రామవిజయాన్నే కోరుకుంటారు.

దూరంగా వెళ్లిన బంధువులను తిరిగి కలుసుకొంటారు. శ్రీరామచంద్రస్వామి దయవలన అనేక అపురూప వరాలను పొందుతారు.

ఈ శ్రీమద్రామాయణము విన్నందు వలన దేవతా ప్రీతి కలుగుతుంది. దుష్ట నాయకులు లేకుండా పోతారు. రాజులు విజయాలను సాధిస్తారు. ప్రజలు క్షేమంగా ఉంటారు. స్త్రీలు రజస్వలలయి మంచి పుత్రులను కంటారు.

ఈ ఆదికావ్యాన్ని పూజించి, పఠించినవారు అన్ని పాపాలనుండి విముక్తులవుతారు. బ్రాహ్మణోత్తములను పూజించి వారి ద్వారా ఈ పవిత్ర గ్రంథాన్ని వినాలి. అలా విన్న వారికి ఐశ్వర్యము, పుత్రలాభము కలుగుతాయి.

శ్రీమద్రామాయణాన్ని విన్నవారు, చదివినవారు శ్రీరాముని కృపకు పాత్రులవుతారు. శ్రీరాముడే సనాతనమైన శ్రీమహావిష్ణువు, ఆదిదేవుడు, మహాబాహువైన శ్రీమన్నారాయణుడు. లక్ష్మణుడు స్వయంగా ఆదిశేషుడే.

శ్రీమద్రామాయణ శ్రవణం వలన కుటుంబ వృద్ధి, ధనధాన్యవృద్ధి స్త్రీలకు ఉత్తమ సుఖము. సర్వార్థ సిద్ధి కలుగుతాయి. ఆయుష్యము, ఆరోగ్యము, కీర్తి, సోదరప్రేమ, సద్బుద్ధి, సుఖము కలుగుతాయి.

వృద్ధిని కోరుకొనేవారు, ఉత్తములు. తేజస్కరమైన ఈ కావ్యాన్ని నియమంగా శ్రద్ధా భక్తులతో పఠించాలి.

ఈ విధంగా ఈ సనాతనమైన రామచరితము మీకు భద్రాన్ని కలిగించుగాక! మీరందరు గట్టిగా విష్ణుబలము వర్ధిల్లాలని పెద్ద కంఠంతో అనండి.

"బలం విష్ణోం ప్రవర్థతాం"

దేవతలందరు ఈ రామాయణ పఠనం వలన, శ్రవణం వలన తృప్తి పొందుతారు.

భక్తి,శ్రద్ధలతో ఈ రామాయణమనే (వేదాన్ని) వ్రాసేవారు పరమపదంలో బ్రహ్మానంద సంభరితులై శాశ్వతంగా నివసిస్తారు.

వాల్మీకి ఋషి రచితమైన శ్రీమద్రామాయణమనే ఇరువై నాల్గువేల శ్లోకాలు గల ఆదికావ్య సంహితలో యుద్ధకాండలో శ్రీరామపట్టాభిషేక మహోత్సవమనే పేరుగల నూటముప్పై ఒకటవ సర్గ సమాప్తము.

యదక్షర పదభ్రష్టం। మాత్రాహీనంతు యద్భవేత్

తత్సర్వం క్షమ్యతాందేవ। నారాయణ నమోస్తుతే।


కాయేన, వాచా, మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనావా ప్రకృతేస్స్వభావాత్

కరోమియద్యత్ "సకలం పరస్మై "నారాయణాయేతి" సమర్పయామి"

సర్వం శ్రీరామచంద్ర చరణార్పణమస్తు
సర్వం శ్రీకృష్ణ చరణార్పణమస్తు

రచయిత పరిచయం

**పేరు: ఆచి శ్రీనివాసాచార్య**



జననము: శ్రీశాల (కరీంనగర్ జిల్లా)
విక్రమసం. మాఘశు. భీష్మాష్టమి

**తల్లి దండ్రులు:**
శ్రీమతి ఆచి వేంకట నరసమాంబ
శ్రీ ఉ.వే.ప్ర.ఆచి, వేంకట నృసింహాచార్య
(ఆవునూరు) స్వామివారు

**విద్యార్హతలు:** ఎం ఏ బి.ఎడ్.

**వృత్తి:** విశ్రాంత ప్రభుత్వ పాలనాశాస్త్రోపన్యాసకులు

**ప్రవృత్తి:** రచనలు, కాలక్షేప ప్రవచనాలు

**సంప్రదాయ విద్యార్హతలు:** శ్రీమద్రామాయణ, ఉపనిషత్, గీతాభాష్య, శ్రీ భాష్యాది సంస్కృత గ్రంధాలలో భగవద్విషయాది దివ్య ప్రబంధాలలో ప్రవేశము

**శాశ్వతసభ్యతము:** ఉభయవేదాంతాచార్య పీఠము - సీతానగర్

**ఉపన్యాసాలు:** సంస్కృత, ద్రావిడవేదాంత విషయాలు

**ఉపన్యసించిన స్థలాలు:** ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రముఖ స్థలాలు
యాదగిరి, శ్రీరంగాది దివ్య క్షేత్రాలు

**ముద్రితరచనలు:** శ్రీరామాయణానుభవము: 1.బాల కాండ, 2.అయోధ్యా కాండ,
3.అరణ్య కాండ, 4.కిష్కింధాకాండ, 5.సుందరకాండ,
6.యుద్ధకాండ, 7.ముముక్షుప్పడి, 8.తిరుప్పావై,
9.ఉత్తర దివ్య దేశాలు, 10.దక్షిణ దేశ్య దివ్య దేశాలు
11.అనేక సంప్రదాయ సంచికలలో వ్యాసాలు